# పంచకావ్య పరీమళం


రచన:

**డా॥ రామవరపు శరత్ బాబు**

ఎం.ఏ.పి.హెచ్‌డి. (సంస్కృతం), ఎం.ఏ.(తెలుగు), ఎం.ఏ.(ఫిలాసఫీ) డి.టి.ఏ.



ప్రచురణ:

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2016**

# PANCHAKAVYA PARIMALAM

By
**Dr. Ramavarapu Sarat Babu**

T.T.D. Publications Series No :1204
© All Rights Reserved

First Edition : 2016

Copies :

Price :

**Published by :**
**Dr. D. Sambasiva Rao,** IAS
Executive Officer
Tirumala Tirupati Devastanams
Tirupati - 517501

**D.T.P.**
Chief Editor's office. T.T.D. Tirupati

***Printed at:***
Tirumala Tirupati Devasthanam's Press,
Tirupati - 517501

## ముందుమాట

సంస్కృతం సమస్త భాషలకు జనని అంటారు. వాల్మీకి మొదలు సంస్కృతకవుల్లో కాళిదాసు కనిష్ఠికాధిష్ఠితుడైన మహాకవి. ఆయన శాకుంతలం వంటి దృశ్యకావ్యాలూ, రఘువంశం వంటి శ్రవ్యకావ్యాలూ రచించాడు. సంస్కృతంలో పంచకావ్యాలుగా ప్రసిద్ధిపొందిన అయిదు కావ్యాల్లో మూడు కాళిదాసువే. అవి 1. రఘువంశం 2. కుమార సంభవం 3. మేఘదూతం. సూర్యవంశీయుల్లో రఘువు ప్రసిద్ధుడు. ఆయన పేరుమీద రఘువంశం ఏర్పడింది. ఆ రఘు వంశీయుల చరిత్ర రఘువంశం.

కాళిదాసు మరోరచన కుమార సంభవం, పార్వతీపరమేశ్వరులకు కుమారుడు జన్మిస్తే అతడు తారాకాసురుని సంహరిస్తాడు. కాబట్టి పార్వతీ పరమేశ్వరుల వివాహానికి ప్రయత్నించాలి. కొండలరాయని కూతురు ఉమ. ఆమె పరమేశ్వరుని గూర్చి తపస్సు చేస్తుంది. దేవతల కోరిక ననుసరించి శివుడు ఉమను వివాహమాడదలచాడు. సప్తర్షుల్ని పెండ్లి పెద్దలుగా అభ్యర్థించాడు. భారతీయ వివాహవ్యవస్థ, దాంపత్యధర్మం–ఈ కావ్యంలో ప్రస్ఫుటమవుతాయి. అలా సాగుతుంది కుమార సంభవం,

కాళిదాసు మరోరచన మేఘదూతం. ఇతివృత్తం కాళిదాసు కల్పించుకొన్నది. ఒక యక్షుడు శాపగ్రస్తుడై సుదూరంగా రామగిరి ప్రాంతంలో శిక్ష అనుభవిస్తాడు. ఆషాఢంలో మేఘం కనిపించగానే యక్షుడు విరహం అనుభవిస్తూ అదేబాధను అనుభవిస్తున్న తన ఇల్లాలికి తన క్షేమవార్తను తెలియజేయుమని ఆ మేఘాన్ని కోరుకొంటాడు. మేఘ సందేశ కావ్యవస్తూ విది.

పంచకావ్యాల్లో నాల్గవది కిరాతార్జునీయం. ఈ కావ్య కర్త భారవి మహాకవి. మహాభారతంలోని కథాంశం ఇందలి ఇతివృత్తం. మహాభారత సంగ్రామంలో విజయం సాధించాలంటే పాశుపతాస్త్రం సంపాదించాలని వ్యాసమహర్షి అర్జునునికి ఉపదేశిస్తాడు. పాశుపతాన్ని శివుడు ప్రసాదించాలి. శివుణ్ణి ప్రసన్నం చేసుకునేందుకు అర్జునుడు తపస్సు చేస్తాడు. శివుడు కిరాతరూపంలో అర్జునుణ్ణి పరీక్షిస్తాడు. ఈ కథ కిరాతార్జునీయమయింది.

అయిదవ పంచకావ్యం మాఘమహాకవి రచించిన శిశుపాలవధ, భారతంలోని కథాంశం ఇతివృత్తం. ధర్మరాజు రాజసూయ యాగ సందర్భంగా తనను తూలనాడిన శిశుపాలుణ్ణి శ్రీకృష్ణుడు తన చక్రంతో సంహరించడమే శిశుపాలవధ. భారవి రచనవలెనే ఈ మాఘం కూడా ప్రౌఢరచన. ఈ రెండు రచనల్లోను చిత్రబంధ కవిత్వాలు చోటు చేసుకున్నాయి.

ప్రపంచభాషల్లో సంస్కృతానికున్న గౌరవం వెలకట్టలేనిది. సంస్కృత సాహిత్యంతో పరిచయం లేని తెలుగు వారికి ఆ భాషలోని మాధుర్యాన్ని పరిచయం చేసే దృష్టితో పంచకావ్య పరీమళ కర్త డా॥ రామవరపు శరత్‌బాబు ఆయా కావ్యాలలోని పరిమళానికి అక్షర రూపమిచ్చారు. సంస్కృతసాహిత్యాన్ని చదవలేక పోతున్న తెలుగువారికి సంస్కృతంలోని అయిదు కావ్యాల మాధుర్యాన్ని చవిచూచే అవకాశం కల్పిస్తున్నారు.

'ఈ పంచకావ్య పరీమళం' పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానములు ముద్రించి తెలుగు వారి కందిస్తూ ఉన్నది. తి.తి.దే. ప్రచురణలకు స్వాగతం పలుకుతున్నట్లే పాఠకులు ఈ రచనను ఆస్వాదిస్తారని ఆకాంక్షిస్తున్నాను.

సదా శ్రీవారిసేవలో....



కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# నామాట

భారతీయులకు వేదోపనిషత్తుల తరువాత శ్రీమద్రామాయణ, మహాభారత, భాగవతాలు పరమ పవిత్రమైన ప్రామాణిక గ్రంథాలు. ఆ తరువాత కావ్య వాఙ్మయం పఠనీయమైంది. పై త్రిపుటిని సుబోధకమైన రీతిలో నేను చేసిన సంక్షిప్తానుసరణను శ్రీ వావిళ్ల రామస్వామి అండ్ సన్స్ వారు 2013లో ప్రచురించారు.

వేదవాక్యాలు ప్రభుశాసనాల వంటివైతే పురాణాలు మిత్రుని హితోక్తుల వంటివనీ, కావ్యాలు మనోజ్ఞంగా ఉపదేశించేవనీ విజ్ఞుల నిష్కర్ష. విషయం ఒకటే అయినా చెప్పేతీరునుబట్టి కావ్యాలు పఠితలనాకర్షించి కర్తవ్యోన్ముఖుల్ని చేయటంలో కృతకృత్యతను పొందుతున్నాయి. వీటి ధ్యేయం ఏమిటనే విషయంలో సంస్కృత లాక్షణికులు అనేక రీతులుగా వాక్రుచ్చినా "విశ్వశ్రేయః కావ్యమ్" అని ఆంధ్రుల ఆదికవి నన్నయభట్టారకుని నిర్వచనమే సహృదయ హృదయ రంజకమైంది. నన్నపార్యునికి ఎంతో పూర్వీకులైన కాళిదాసాది సంస్కృత మహా కవులు సైతం ఈ ధ్యేయంతోనే తమ కావ్యాలను రూపొందించారు.

ప్రపంచ భాషలన్నింటిలో సంస్కృత భాషే అతి ప్రాచీనమైంది. సంస్కృత వాఙ్మయం ఈ దేశంలోనే కాక విదేశీయులను సైతం ఎంతో ఆకర్షించింది. జీవిత విలువలు సాహిత్యంలో అనుష్ఠాన పూర్వకమై ఆశ్చర్యప్రదాలైతే వేదోపనిషత్తుల విజ్ఞాన వేదాంతాలు విభ్రాంతి జనకాలైనాయి. అయితే ఎంతో కాలంగా – అంటే ముఖ్యంగా మెకాలే విద్యావిధానం ఈ దేశంలో అమలు జేరిగిన నాటి నుంచి సంస్కృతం నిత్య జీవనంలో నుండి చరిత్రపుటలకు మాత్రమే పరిమితమై పోయింది. అక్కడక్కడ ప్రాచ్యకళాశాలల్లోను, విశ్వ విద్యాలయాల్లోనూ సంస్కృతం ఉన్నా, కొందఱు దాన్ని అభ్యసిస్తున్నా అదేదో తప్పనిసరై జీవికకు మాత్రమే అయి నామకః మిగిలిపోయిందే తప్ప, శ్రద్ధా భక్తులు పూర్తిగా లోపించిపోయాయి.

ప్రాచీన విద్యావిధానంలో క్రమంగా శబ్దాలు, ధాతువులు, అమరం, పంచకావ్యాలు, నైషధం, అధ్యయనం చేయటం జరిగేది. పంచకావ్యాలు పూర్తైతే స్నాతకులు – అంటే నేటి భాషలో చెప్పాలంటే 'గ్రాడ్యుయేషన్' పూర్తైనట్లు ఆ తరువాత నాటకాలు, ఆపైన శాస్త్రాధ్యయనం అంటే నేటి పరిభాషలో 'స్పెషలైజేషన్' అన్నమాట. విద్యార్థి అభినివేశాన్ని బట్టి వ్యాకరణమో, తర్కమో, మీమాంసో, వేదాంతమో, మరేదో. అయితే ఈ పంచకావ్యాల్లో కూడా ఏవో రెండు, మూడు సర్గలు (ఒక్కొక్క కావ్యంలో) చేదవటమే తప్ప ఆ సాంతం అధ్యయనం చేయటం అరుదు. కనుక పండితలోకంలో కూడా పంచకావ్యాల పేర్లు, కవులనామాలు, వారి కవితా ప్రతిభే తప్ప కావ్యాల్లో పూర్తిగా ఏముందో తెలియటం అంతంత మాత్రమే.

నవీనయుగంలో ఆధునిక విజ్ఞాన సాంకేతిక విద్యాభ్యాసం ప్రాధాన్యాన్ని వహించేటంవల్ల మన ప్రాచీన భారతీయ విజ్ఞాన పరిజ్ఞానం పూజ్యమైపోయింది. కనుక ఆ లోపాన్ని పూరించాలనే సంకల్పంతో సామాన్యునికి సైతం సంస్కృత సాహిత్య పరిచయాన్ని కలిగించాలనే లక్ష్యంతో ఈ గ్రంథ రచనకుద్యమించేవలసి వచ్చింది. ఉద్గ్రంథాలను ఆసాంతం వివరంగా తెలియటానికి సమయాన్ని వెచ్చించేగల అవకాశం, ఓపిక ఈ తరానికి అంతగా లేవు కనుక ఒక విహంగ వీక్షణం వంటిదే ఇది.

విశేషంగా భాషాపరిశ్రమ చేయలేని సామాన్యులకే ఈ గ్రంథం ా్దిష్టమైంది. కనుక, అటువంటి సామాన్యుడనయిన నేనే ఈ రచనకు పూనుకోవటం యుక్తమనిపించింది. చేదువరుల సౌలభ్యం కోసం వాడుక భాషనే వాడినా సాధ్యమైనంతవఱకు వ్యాకరణ విరుద్ధం కాని పదజాలాన్నే వినియోగించాను. ఆంగ్ల భాషా మాధ్యమంలో విద్యాభ్యాసం చేస్తూ ఆంధ్రభాషా పదోచ్చారణలో అశ్రద్ధ వహిస్తున్న యువతకు శబ్ద స్వరూపాన్ని తెలుపాలనే వేడుకతో చేకార జేకారాల (దంత్యతాలవ్యాలు)ను, శకటరేఫ (ఱ)ను ప్రాచుర్యంగానే పాటించాను. అనివార్యమైన ప్రదేశాల్లో అర్ధానుస్వారం (ఁ) సైతం క్వాచిత్కంగా కనిపిస్తుంది. ఈ ప్రణాళిక పరమార్థం పదస్వరూప, వాక్య



విన్యాస, సాధువైన ఉచ్చారణారీతిని ఈ తరానికి అవగతం కావాలనే తపనే తప్ప వేఱేమీకాదు. అన్యదేశ్యపదాలను విధిగా విసర్జించాను.

ఈ పంచ కావ్యపరీమళాన్ని ఆఘ్రాణించేటం వల్ల ఈ తరం మన ప్రాచీన సాహిత్య పరిచయాన్ని పొంది దానిపై ప్రత్యయం పెంపొందించు కోగలిగితే నా కృషి సార్థకమైనట్లే.

భవదీయుడు
రామవరపు శరత్‌బాబు

ప్రశాంతిసదన్, జి 1
46-18-8, మండావారి పేట, దొండపర్తి
విశాఖపట్నం – 530 016
ఫోన్ : 0891 – 2758129
సెల్ : 9885961329
**email : saratprabha @rediffmail.com**

# కృతజ్ఞతాంజలి

భువిలో ఉన్నప్పుడు ప్రత్యక్షంగాను, దివికేగిన పిమ్మట పరోక్షంగాను తమ అమేయ ఆశీస్సులనందిస్తున్న మహనీయులు కీ.శే. పూజ్యశ్రీ సద్గురు కందుకూరి శివానందమూర్తి వర్యులకు, ఆధ్యాత్మిక గురుచరణులు స్వర్గీయ స్వప్రకాశానంద తీర్థావధూత మహోదయులకు నా శ్రద్ధాంజలి. ఈ పంచకావ్య పరీమళాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారి ప్రచురణగా వెలుగులోనికి తెచ్చిన కార్యవర్గానికి నా ప్రగాఢ కృతజ్ఞతాంజలి.

గతంలో నేను వ్రాసిన గ్రంథత్రయాన్ని శ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ సంస్థచే ప్రచురింపచేసినది, ఇప్పుడు వ్రాసిన 'పంచకావ్య పరీమళా'న్ని శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారికి పరిచయం చేసి వారు ముద్రణ చేపట్టటానికి, దోహదం చేసిన శ్రీమాన్ డాక్టర్ కె.వి. రమణాచార్యుల వారిపట్ల నా కృతజ్ఞతా నివేదనకు భాష మూగబోతోంది.

1954లోసంస్కృతంలో నాకక్షరాభ్యాసం చేసిన నాటి నుండి నేనందులో పి.హెచ్‌డి. పట్టాను పొందేవఱకు విద్యా వ్యాసంగంలో నన్ను తీర్చిదిద్ది నాకు విద్యాభిక్షనిడిన కీ.శే. ఆచార్య గాలి పార్థసారథిరావుగారికి నా శ్రద్ధాంజలి. 1958లో విజయవాడ ఓరియంటల్ కళాశాలలో నేను భాషా ప్రవీణ విద్యార్థిగా చేరిననాటి నుండి సంస్కృతాంధ్ర వ్యాకరణాలను నాచే అభ్యసింప చేయటంలో అహర్నిశలూ శ్రమించిన దేశికావతంసులు పూజ్యపాదులు శ్రీ మేడిచర్ల గోపాలకృష్ణమూర్తి శాస్త్రి గారికి నా సాష్టాంగ ప్రణామాలు.

మద్గురుపాదులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు, 'పద్మభూషణ్', 'కవిసమ్రాట్' స్వర్గీయ విశ్వనాథ సత్యనారాయణ గారి వద్దనే నంతేవాసిగ నున్నప్పుడు పుత్ర నిర్విశేష వాత్సల్యంతో నన్ను చేరదీసి సంస్కృతంలో



మేఘదూతమ్, ప్రతాపరుద్రీయాది కావ్యాలంకార గ్రంథాలు, తెలుగులో మనుచరిత్రాది ప్రబంధాలనూ బోధించి ఉపాధ్యాయునిగా తీర్చి దిద్దటమే కాక వారి రెండు నవలలకు నేను లేఖకునిగా ఉండే మహాదృష్టాన్ని ప్రసాదించిన ఆ బ్రాహ్మీమయమూర్తికి అనుదినం త్రిసంధ్యల్లో నా వినమ్ర నమోవాకాలు.

ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో నేను విద్యార్థిగా నున్నప్పుడు, ఆ పిమ్మట కూడ నా సారస్వత వ్యాసంగాని కెంతో స్ఫూర్తినిచ్చి ప్రోత్సహించిన గురుమూర్తులు కీ.శే. అప్పల్ల సోమేశ్వరశర్మ మహోదయులకు శ్రద్ధాంజలి. విశ్వకళాపరిషద్విద్యార్థి దశ నుండి నేటి వఱకు నాపట్ల అమేయాదరాభిమానాలను వర్షిస్తూ నాకు దిశానిర్దేశం కావిస్తున్న గురుమూర్తులు, వ్యాకరణశాస్త్ర పారంగతులు ఆచార్య జొన్నలగడ్డ ప్రభాకరశాస్త్రి గారికి నామనః పూర్వక నమస్సుమనస్సులు. అదే విధంగా అవవరతం నా సందేహాలను తీరుస్తూ నన్ను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న గురుకల్పులు శ్రీమాన్ కె.ఎ. కృష్ణమాచార్యవర్యులకు, ఆచార్య గణపతిరాజు వేంకటపతిరాజు, సుహృన్మణులు ఆచార్య నరసింహరాజు, విద్వన్మిత్రులు శ్రీయుత పేరి రవికుమార్, కాకరపర్తి సత్యనారాయణ మూర్తి మహోదయులకు నా కృతజ్ఞతాన్విత సాధువాదాలు.

సాహితీ వ్యవసాయంలో నాకు చేదోడు వాదోడై నిలిచిన విదుషీత్రయం డా॥ శొంఠి శారదాపూర్ణ, డా॥ ప్రభల జానకి, డా॥ గుమ్మలూరి ఇందిరలకు నా కృతజ్ఞతాపూర్వక అభినందనలు.

నా సారస్వతాధ్వరానికి సమిధగా నిలిచిన నా అర్ధాంగి కీ.శే. విజయ లక్ష్మికి నా శ్రద్ధాంజలి. అవసర సహాయాన్నందించిన మా చిరంజీవిని డా॥ మాధురీదేవి, చిరంజీవి డా॥ రవీంద్ర తేజస్వి, కోడలు చి.ల.సౌ. అపరాజిత (ఆశావల్లి) పౌత్రుడు అభినవపూర్ణ యశస్వి - వీరందఱికీ నా ఆశీః పూర్వకాభినందనలు.

ఈ పంచకావ్య పరీమళ డి.టి.పి. భారాన్ని ఆయాచితంగా తమంత తాముగా ముందుకు వచ్చి వహించిన నా అనుంగు సోదరి చి.ల.సౌ. సుధాప్రసన్న, శ్రీ వెంపటి సుబ్రహ్మణ దంపతులకు కృతజ్ఞతాన్విత ధన్యవాదాలు. ఎంతో ఓర్పుతో డి.టి.పి. చేయించిన 'ప్రసన్నభారతి' గ్రాఫిక్స్ అధినేత శ్రీ కొండేపూడి సర్వేశ్వరప్రసాద్ గారికి నా నమస్కృతులు.



'మహామహోపాధ్యాయ'
డా॥ శివానంద మూర్తి
డి.లిట్ (గీతం.వి.వి.) డి.లిట్
(పొ.శ్రీ. తెలుగు వి.వి.)
పీఠాధిపతి, శ్రీ శైవ మహాపీఠమ్,

"ఆనందవనం"
భీమునిపట్నము
విశాఖజిల్లా - 531 163
ఫోన్ : 08933 229505
తేది : 15-04-2015

## 'పంచకావ్య పరీమళం' 'సంస్కృత నాటక పంచరత్నాలు', తెలుగు గ్రంథములపై సమాదర వాక్యములు

డా॥ రామవరపు శరత్‌బాబు మనదేశంలో ఉన్న ఉభయభాషా ప్రవీణులైన కవి పండితులలో అగ్రగణ్యులైన వారిలో ఆయన ఒకరు. డిగ్రీలు సమృద్ధిగా తీసుకుని ఇంకా సమృద్ధిగా పరిశీలన చేసి ఆధ్యాపక వృత్తిలో చిరకాలం గడిపి అత్యుత్తమ సంస్కృత సాహిత్యంలోంచి రామాయణ, భారత, భాగవతములను, పంచకావ్యములను, ఇంకా ఐదు అత్యుత్తమ సంస్కృత నాటకములను అనువదించి తెలుగువారికం దించిన విశిష్ట పండితుడు. లోకోప కారకమైన వీరి కృషి అత్యంత శ్లాఘనీయ మైనది. కుమారసంభవం వంటి కావ్యాలని అనువదించేటప్పుడు ఎన్నో మూల శ్లోకాలను ఎత్తిచూపి, వ్యాఖ్యానించుచూ చదువరులకు గుర్తు చేయవలసిన ఉత్తమ విషయములను తాను చూపుతూ చేసిన వీరి ఉత్తమ రచనలు తెలుగువారికి అపురూపమైన బహుమానములు. ఈ రచనలన్నీ కూడా ఉత్తమ శ్రేణికి చెందినవై సంస్కృత మూలమును యథాతథంగా తెలుగు చదువరులకు స్పష్టతా, స్వచ్ఛతా, సరళతతో కూడిన ప్రసాదములై ఉన్నవి.

అంతేకాక వీరికున్న తెలుగుభాషాభిమానం గొప్పది. మరుగున పడిపోతున్న అక్షర స్వరూపములు ౘే ౙే వంటి సంప్రదాయ తెలుగు అక్షరములను ఎట్లు వాడ వలెనో మనకు చూపించిన తెలుగు అక్షర భాషాసాహిత్యాభిమాని ఈ శరత్ బాబు గారు. వీరి కృషి తెలుగువారికి మహోపకారి, ఇంకా అనేక గ్రంథాలలో గొప్ప భాషా సేవ చేసిన ఈ పండితుని తెలుగు పెద్దలు కృతజ్ఞతతో మన్నించి, గౌరవించ వలెనని నా ఆకాంక్ష. పరమశివుడు వారికి ఆయురారోగ్యములను బహుళముగా ప్రసాదించుగాక.

(శివానందమూర్తి)

వాచస్పతి', 'శాస్త్రవిద్వన్మణి'

'పండితరత్న', 'ఉభయవేదాంతప్రవర్తక'

శ్రీమాన్ కారంచేటి తిరుమల వేంకట రాఘవాచార్యులు

## శ్రీశోఽవ్యాత్

## భూమిక

అన్ని భాషలకు మాతృభూత సంస్కృతమని జగద్విదితం. సంస్కృత సాహిత్యోద్యానవనంలో కవితా సార్వభౌముడైన కాళిదాసు యొక్క సూక్తి సుమాల పరిమళాన్ని ఆస్వాదించిన విద్వద్భృంగరాజులు, కవీభరాట్టులు జగత్ప్రసిద్ధులయి నారు. ఋషికల్పుడైన కాళిదాసమహాకవిని ఆనందవర్ధనుడు "ద్విత్రా పంచషావా మహాకవయ ఇతి గణ్యంతే" అని ప్రశంసించినాడు.

కాళిదాసు రచించిన మూడు శ్రవ్య కావ్యాలకు "లఘుత్రయీ" అనిపేరు. సంస్కృతభాషా పరిచయానికి మొదటిది కావ్య పరిజ్ఞానం, రెండవది శాస్త్రజ్ఞానం. నాడుకానీ, నేడు కానీ సంస్కృత విద్యార్థులకు రఘువంశ మహాకావ్యమే మొదట బోధింపబడుతున్నది. రఘువంశ మహాకావ్య రచనకు మాతృక శ్రీమద్రామాయణమే. "రఘూణా మన్వయం వక్ష్యే" అన్నాడు. "త్యాగేనైకే నా ఽమృతత్వ మానశు:" అని శ్రుతి పల్కినట్లు, గురుదక్షిణార్థార్థియైన విద్వద్వటునికి మృణ్మయ పాత్రలచేతనే అర్ఘ్యపాద్యాదులిచ్చి, దివినుంచి కనకవర్షాన్ని కురిపింపజేసి, ఆ ద్రవ్యాన్ని సమర్పించి "త్యాగాయ సంభృతార్థ" డని వ్యవహరింపబడిన రఘుమహారాజు తర్వాతనున్న ఆ వంశీయులైన రాజులకు 'రాఘవ' నామం వ్యవహృతం. అట్టి త్యాగశీలుని కన్న తండ్రి గోసేవా రూపధర్మ రక్షణార్థం సింహం నోటిలో తన తలను పెట్టి, 'ఆఫలోదయకర్మ' డైన దిలీపమహారాజు చరిత్రతో ఆరంభింపబడిన కావ్యమిది.



'ధర్మాదర్థశ్చకామశ్చ' అన్నట్లు త్రివర్గాన్ని క్రమంగా అనుష్ఠించిన రాజుల వంశంలో తురీయ పురుషార్థ ప్రదాతయైన విష్ణుమూర్తియే శ్రీరామునిగా అవతరించి తన తండ్రియైన దశరథుణ్ని సత్యవాక్పరిపాలకునిగా చేశాడు. ఇట్లు క్రమంగా ఇరువై తొమ్మిది (29) రాజుల చరిత్రతోపాటు మహాకావ్య లక్షణాలన్నీ అనన్య ప్రతిభతో చిత్తరంజకంగా వర్ణింపబడిన రఘువంశ మహాకావ్యాన్ని, మహావిద్వాంసులైన డా॥ రామవరపు శరత్‌బాబుగారు సరళమైన తెలుగు భాషలో 19 సర్గల ఇతివృత్తాన్ని వచన రూపంగా అనువదించారు.

కుమార సంభవ మహాకావ్యం ద్వితీయమైనా, అద్వితీయమైనది. ఇది దివ్యమైన శ్రవ్యకావ్యం. ఇందున్న ఇతివృత్తానికి ఆధారం శివపురాణం. పార్వతీ పరమేశ్వరులకు కుమారుడు జన్మిస్తే అతడు తారకాసురుణ్ని సంహరించగలడు కాబట్టి పార్వతీ పరమేశ్వరుల వివాహానికి యత్నించడం ఆవశ్యకమని చతుర్ముఖ బ్రహ్మ, దేవతలకు నాపదేశించాడు. "కుమారసంభవం" అనే కావ్యనామం అన్వర్థమైనది.

పరమేశ్వరునికి పరిచిచీషతో పార్వతికి కల్గిన పరిచయం ప్రణయంగానూ, అది ఘోర తపస్సుద్వారా పరిణయంగానూ పరిణమించింది.

"అత ఆహర్తుమిచ్ఛామి పార్వతీ మాత్మజన్మనే
ఉత్పత్తయే హవిర్భోక్తుర్యజమాన ఇవారణిమ్"

దేవతలు తమ శత్రుబాధను నివారించడం కోసం పుత్రుని పొందవలెనని ప్రార్థించారుకాబట్టి, పార్వతిని వివాహమాడ దలచినాను. మీరు మాకోసం హిమవంతుణ్ని అర్థించండి-అని, మహాశివుడు సప్తర్షులతో చెప్పినాడు. ఇందున్న ఉపమానంయొక్క సొగసుచే, భారతీయ వివాహ వ్యవస్థను దాంపత్య ధర్మంలోని పవిత్రతను కాళిదాసు ఎంత హృద్యంగా విశదీకరించినాడో !! ఈ

శ్లోకంలోని అర్థపుష్టమైన (సంస్కృత) పదాలను తెలుగులో సమగ్రార్థబోధకంగా అనువక్త వివరించాడు.

పాఠకులకు పఠితలకు, సద్యః పరనిర్వృతి- దేవభూములలో విహరిస్తున్న ఆనందానుభూతి కల్గుతుంది. కుమారసంభవం ఏడు సర్గలకావ్యమా,లేక పదిహేడు (17) సర్గల కావ్యమా! అనే విచికిత్సను అనువక్త తన వాగ్విలాసంతో స్పష్టంగా వివరించాడు. స్వాత్.

మేఘదూతం ఖండకావ్యం. ఇందున్న ఇతివృత్తం కేవలం కాళిదాస కవి కల్పితం. 'హనుమద్దౌత్యం' అనే మాట కావ్య నామానికి మాత్రమే ప్రేరకంగా సంభావితం. విప్రలంభశృంగార రసభరితమై, పదేపదే పుష్కలమైన వ్యంగ్య వైభవంగల కావ్యం. నాయికా నాయకుల పేర్లు లేవు. ఒక యక్షుడు శాపగ్రస్తుడై దక్షిణ భారతంలోని రామగిరి ప్రాంతమందు నివసించి విరహబాధలో కాలయాపన చేస్తూ ఆషాఢమాసారంభమందు మేఘుడు కనబడగానే ఆతని ద్వారా విరహిణియైన తన పత్ని ఉత్తరాన అలకానగర మందున్న చోటుకుపోయి ఆమెకు తన క్షేమవార్తను తెల్పి, ఇక నాల్గుమాసాలు ఓపిక పట్టుమని చెప్పవలసినదిగా మేఘుణ్ని సందేశవాహకునిగా భావించి ప్రార్థిస్తాడు.

"ధూమజ్యోతిః సలిల మరుతాం సన్నిపాతః క్వమేఘః?" అంటూనే "కామార్తా హి ప్రకృతి కృపణాశ్చేతనా చేతనేషు" అని తాను చెప్పిన విషయాన్ని సమర్థించు కొంటాడు ఎన్నో సూక్తి రత్నాలను మనకందించాడు కాళిదాసు. "ప్రావృషా సంభృతశ్రీః" ఇదొక ధ్వన్యాత్మకవాక్యం. వర్షర్తువులో మేఘుని శోభపెరుగుతుంది.

"యాభిరాదిత్యస్త పతితాభిః పర్జన్యో వర్షతి" (తై.నా.ౡపని)

"ఏషహవై సర్వాసామోషధీనాం రసోయత్పయః" (కౌషీ.బ్రా)



సర్వౌషధసారభూత మైన రసంజలమేకదా! కాటుక కొండలాగా కనబడడం, జలాన్ని వర్షించడం మేహతీతిమేఘః మేఘునివిధి - పనిచేయడంలో ఏమరుపాటు తగదు, కర్తవ్యాన్ని దక్షతతో నిర్వహించడంలోనే ఆనందం ఉంటుందని భావం. ప్రపంచమంతట జీవన - జల - ప్రదానం చేస్తూ సంచరించే మేఘుడు "సంతప్తానాం త్వమసి శరణం" అని కీర్తింపబడినాడు. ఉత్తర భారతదేశ తీర్థక్షేత్రాల వర్ణనతో సామాన్యుల హృదయాలను కూడా స్పందింపజేసే కావ్యమిది. జడవస్తువునందు తన ఊహోహలచేత చైతన్యాన్ని ఆరోపించి ఆనంత విశ్వకల్పన చేయగల్గిన మహాకవి కాళిదాసు.

పరిణత ప్రజ్ఞగల అనువక్త తన వచన రచనలో శ్లోక పాదాలలో నున్న వ్యంగ్య భావాలను కూడా పఠితల చిత్తానికి హత్తుకొనునట్లు విశదీకరించాడు. స్త్రీ పురుషుల అనురాగం స్నిగ్ధతను సాంద్రతను పొందినప్పుడే తృతీయ పురుషార్థ మధురిమ మహోత్కృష్టమై తదనంతరవర్తి తురీయ పురుషార్థానికి సోపానమవుతుంది. అన్నమాట హితమిత సత్యంకదా!.

భారవివ్రాసిన 'కిరాతార్జునీయమహాకావ్యం', మాఘకవి రచించిన 'శిశుపాలవధ మహాకావ్యం' శ్రీహర్ష ప్రణీత 'నైషధమహాకావ్యం' - ఈ మూడు కావ్యాలకు 'బృహత్త్రయీ' అని పేరు. మహాకావ్య లక్షణ లక్షితమైన 'కిరాతార్జునీయం' (18 సర్గల)లోని కథా వస్తువు భారతారణ్య పర్వం నుంచి సంగ్రహింపబడినది. వ్యాసమహర్షిచే ఉపదిష్టుడై పాశుపతాస్త్ర సంపాదనార్థం తపస్సు చేస్తున్న అర్జునునికీ కిరాతవేషధారియైన శంకర భగవానునికీ పరస్పరం జరిగిన యుద్ధం వర్ణింపబడినందువల్ల కావ్యనామం అన్వర్థమయినది. భారవి కవిత శ్రమపడితేకాని రుచించదు కాబట్టి, నారికేళపాకమనీ, అల్పాక్షరాలలో అనల్పార్థముండడంవల్ల అర్థగౌరవం కలదని ప్రసిద్ధిని పొందినది.

వీర రసప్రధానమైన ఈ కావ్యమందు భారవి రాజనీతిని ప్రదర్శిస్తూ సామదాన భేద దండోపాయాలను గంభీరంగా వర్ణించాడు. ప్రకృతిని – ఋతువులను, పర్వతాలను, జలాశయాలను రమ్యంగా వర్ణించడమేకాక, అనుప్రాస, యమకం, ఏకాక్షర, అనులోమ, విలోమాది శ్లోకాలను రచించి చిత్ర బంధకవితాభి రుచినీ ప్రదర్శించాడు. చదువరులు కంఠస్థం చేయదగిన సూక్తి రత్నాలెన్నో ఉన్నాయి. మచ్చుకు కొన్ని ...

"హితం మనోహారిచ దుర్లభం వచః", "గుణలుబ్ధాః స్వయం మేవసంపదః",
"వి పదంతాహ్య వినీత సంపదః", "న తితిక్షా సమమస్తి సాధనమ్",
"సమున్నయన్‌భూతిమనార్య సంగమాద్వరం విరోధో ఽపిసమం మహాత్మభిః",
"విశ్వాస యత్యాశు సతాం హి యోగః"

ముఖ్యంగా రచనలో సిద్ధ హస్తులైన శరత్‌బాబుగారు "సహసావిదధీత నక్రియామ్" అనే శ్లోకం ఈ కావ్యానికి మూల సూత్రమై భాసిస్తున్నది. అని ప్రకటించడానికి ముందే భారవిని గూర్చి ప్రచారంలో నున్న కథను గ్రథనం చేయడమూ, అర్థగౌరవం గల ఈ కావ్యంలో పాత్రానుగుణమైన శబ్దార్థ భావరచనా సౌందర్యాన్ని తెలుగుభాషలో యథాయథంగా అక్షరబద్ధం చేయడమూ గ్రంథాన్ని ఆమ్రేడితంగా చదివించే ఆసక్తిని కల్గించే లక్షణ మైనందున అభినందనీయం.

శిశుపాలవధ మహాకావ్యం సంస్కృత సాహిత్య రత్నాకరంలో ఒక అనర్ఘరత్నం. భారవి వలె ఈ కావ్యం కూడా 'మాఘం' అని కవి పేరుతోనే ప్రచారంలోనున్నది.

గుజరాత్ రాష్ట్రంలో నున్న 'శ్రీమాల' నగరం మాఘకవి యొక్క జన్మస్థలమనీ, శ్రీ వర్మలరాజు దగ్గర మహామంత్రిగా నున్న "సుప్రభదేవు"ని



పౌత్రుడు, ఎందఱికో ఆశ్రయమిచ్చి సర్వాశ్రయుడని ప్రఖ్యాతుడైన 'దత్తకు'ని పుత్రుడైన మాఘకవి ఏడవశతాబ్ది చివరి భాగమందు ఉన్నవాడని పరిశోధకులచే తెల్పబడినది.

మాఘ కావ్యంలోని ఇతి వృత్తానికి ఆధారం శ్రీ మద్వ్యాసప్రణీత మహాభారతం. ఈ కథ శ్రీ మద్భాగవతంలోనూ కలదు. భారవిలాగా మాఘ కవికూడా శ్రీ శబ్దంతో కావ్యాన్ని ఆరంభించడమే కాదు, పర్వత, ఋతు, పుష్పాపచయ, జలక్రీడా, సాయంకాల, చంద్రోదయ, మద్యపాన, సురత, ప్రభాత, ప్రయాణ, దౌత్య, చిత్ర యుద్ధ వర్ణనలూ చేశాడు. శ్లోక రచనా ప్రక్రియలో ఛందోవైవిధ్యం 'అక్షరాద్దీప్తి రుచ్యతే" అనే శ్రుతివాక్యాన్ని స్మరింపజేస్తుంది. మచ్చుకు–

" సమయ ఏవ కరోతి బలాబలం ప్రణిగదంత ఇతీవ శరీరిణామ్।
శరది హంసరవాః పరుషీకృత స్వరమయూర మయూ రమణీయతామ్।

(6-44)

యమక, ఏకాక్షరాది చిత్ర బంధకవితలోనూ శ్లోకాలను అధిక సంఖ్యలో రచించి స్పర్ధతో తన కావ్యాన్ని ఇరువై (20) సర్గలతో ముగించి, భారవిని మించడానికి యత్నించి సఫలుడయ్యాడు.

మాఘకవి శీలవంతుడు, ప్రౌఢకవి. ఆయన శైలి జటిలం – ఓజోగుణ భూయిష్ఠం. ఈ కావ్య పఠితకు సాంఘిక, ఆర్థిక, రాజనీతి శాస్త్ర పరిచయమే కాక, ఆయుర్ధనుర్వేదాల, గజాశ్వనీతి సంగీత జ్యోతిర్వాణిజ్యశాస్త్రాలతో పరిచయమూ అవుతుంది. పాణిని వ్యాకరణ సూత్రాలకు ఈ కావ్యం ప్రయోగదీపిక. ఇది ఒక విజ్ఞాన సర్వస్వమే. "కావ్యేషు మాఘః కవి కాళిదాసః" "మాఘే మేఘే గతం వయః" ఒక పండితుణ్ని మీరే యే గ్రంథాలను చదివినా రండి? అని ఒకరడిగితే ఆయన "మేఘ సందేశం, శిశుపాలవధ అనే ఈ రెండు

కావ్యాలను చదివేసరికే నా తలపండింది" అన్నాడట. ఇంక దీని విశ్లేషణను బాబుగారి వచన కావ్యంలో చదివి ఆనందించవచ్చు.

ఈ పంచకావ్యాలకు తెలంగాణ (మెదకు జిల్లా, కొలచలిమగ్రామ) వాస్తవ్యుడైన మహా మహోపాధ్యాయ కోలాచలమల్లినాథ సూరి (వేర్వేఱు పేర్లతో) రచించిన వ్యాఖ్యానం వెలువడిన తర్వాత ప్రాచీన వ్యాఖ్యాతల రచనలు మరుగున పడినవి. నందన వనంలోని దేవతరువుల విరుల సౌరభం స్వర్గసీమకే పరిమితం.

"యధా వృక్షస్య సంపుష్పితస్య దూరాత్ గంధో వాత్యేవం

పుణ్యస్య కర్మణః" అన్నరీతిలో సంస్కృత పంచ కావ్యాలతో పరిచయం లేకపోయినా, భాషాంతరీకృత గ్రంథాలద్వారా వాటి భావ పరిమళం దిగంతాల పర్యంతం గుబాళిస్తూనే ఉంటుంది.

మూల కావ్యాలను చదువలేకపోయిననూ, ఆకృతికర్తల కవితాత్మతో స్నిగ్ధమైన పరిచయం కలిగించే పవిత్రమైన ఉద్దేశంతో బహుముఖ ప్రజ్ఞ కల్గిన, విద్వద్వరులు డా॥ రామవరపు శరత్‌బాబుగారు సరళమైన తెలుగు భాషలో పఠనీయాసక్తి జనకమైన మధుర వచన రూపంగా అనువదించి, అక్కడక్కడ ధ్వన్యాత్మక శ్లోకాలను విశేషంగా వివరించి "పంచకావ్య పరీమళం" అనే పేరుగల గ్రంథాన్ని రచించి ఆంధ్ర జనావళికి అందిస్తున్న మహోపకారులు. "వయంతు కృతినస్తత్సూక్తి సంసేవ నాత్" ఆ గ్రంథాన్ని మనసుపెట్టి చదువడం తెలుగుభాషా భాషీయులమైన మనభాగ్య గరిమయేకదా!

విలక్షణ సంప్రదాయ విహారులైన విపశ్చిద పశ్చిములు డా॥ శరత్‌బాబుగారు అల్పజ్ఞుడనైన నాకు నాల్గు మాటలు వ్రాసే అవకాశం కల్పించి నన్ను కృతార్థుణ్ణి చేసినారు. వారికి ఇతోధిక గ్రంథాలను రచించే శక్తిని



కలిగిస్తూ దీర్ఘాయుః పూర్వక ఆరోగ్య భాగ్యాలను ప్రసాదించవలెనని శ్రియః పతిని ప్రార్థిస్తున్నాను. స్వస్తి.

బుధజన విధేయుడు

17-9-2015, గురువారం

మన్మథ వినాయకచవితి,

హైదరాబాదు, తెలంగాణ

శ్రీ

## పంచకావ్య పరిమళం

సంస్కృత కవుల్లో అగ్రేసరుడు కాళిదాసు. ఆయనపై అనేక కథలు విద్వాంసుల్లోనేకాక పామరజనంలో కూడా ప్రచారంలో ఉన్నాయి. పేరును బట్టి ఆయన కాళికాదేవి భక్తుడనీ, మొదట్లో అక్షరజ్ఞానం సైతం లేని పామరుడనీ, ఒక మంత్రి దుర్మార్గం వలన ఆయనను పండితునిగా భ్రమింపచేసి రాజకుమార్తెతో వివాహం జరిపించారనీ, అయితే ఆమె మొదటిరాత్రే అతని నిజస్వరూపం తెలిసికొని కాళికాదేవి ఆలయానికి పంపి ఆ దేవి ప్రత్యక్షమయ్యేంతవఱకు తిరిగి రావద్దని చెప్పిందనీ, మూర్ఖుడు కనుక పట్టుదలతో దేవి ప్రత్యక్షమయ్యేంతవఱకు ప్రార్థిస్తే దేవి ప్రత్యక్షమై అతని నాలుకపై బీజాక్షరాలు వ్రాయటంతో మహాకవిగా తిరిగివచ్చాడనీ కథ. ఈ ఉదంతంలోని నిజానిజాల మాట ఎలాఉన్నా విని ఆనందిం చే దగింది. తిరిగివచ్చిన భర్తను చూసి రాకుమారి ఆయన ముఖంలోని తేజస్సును చూసి **"అస్తి కశ్చిద్వాగ్వి శేషః"** అని సంస్కృతంలోనే ప్రశ్నించిందట! (ఆనాడు దేశమంతా సంస్కృత, ప్రాకృత భాషల్లోనే మాట్లాడుకొనేవారు) ఆమె ప్రశ్నలోని 'అస్తి', 'కశ్చిత్', 'వాక్' అనే మూడు పదాలతో ప్రారంభమయ్యే మూడు కావ్యాలు వ్రాసేడంటారు. అస్తి (ఉన్నది)తో

***"అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయోనామ నగాధిరాజః।***
***పూర్వాపరౌ తోయనిధీవిగాహ్య స్థితపృథివ్యాం ఇవమానదణ్డః॥"***

ఇది కుమారసంభవంలోని మొదటిశ్లోకం. తూర్పు, పడమటి సముద్రాల మధ్య 'దేవతాత్మ' అయిన హిమాలయ పర్వతం భూమిని కొలిచే కొలతబద్ద (స్కేలు) వలె ఉందని దీని అర్థం. ఈ దేశంలోని నదులను, సముద్రాన్ని, కొండలనీ – సర్వప్రకృతినీ దేవతారూపాలుగా ఆరాధిం చేటం భారతీయుల సంప్రదాయం. హిమవంతుడు మహాశివునికి తనకుమార్తె అయిన



పార్వతినిచ్చి పెండ్లి చేసిన మామగారు! కనుక ఆయన ఉనికితో కావ్యారంభం చేసేడు.

ప్రశ్నల్లో రెండవ పదం 'కశ్చిత్'. సంస్కృతంలో 'కశ్చిత్' అంటే 'ఒకానొక' అని అర్థం. ఆ పదంతో మొదలుపెట్టి

**"కశ్చిత్ కాన్తా విరహగురుణాస్వాధికారాత్ప్రమత్తః**
**శాపేనాస్తఙ్గమిత మహిమా వర్షభోగ్యేణభర్తుః।**
**యక్షశ్చక్రే జనకతనయా స్నాన పుణ్యోదకేషు**
**స్నిగ్ధచ్ఛాయా తరుషువసతిం రామగిర్యాశ్రమేషు॥"**

అనే మొదటి శ్లోకంతో మేఘదూతమనే ఖండకావ్యాన్ని వ్రాసేడు. అంటే 'ఒకానొక' యక్షుడు తన విధి నిర్వహణలో ప్రాలుమాలి ఉండటం వల్ల యజమానిచే సంవత్సరకాలం భార్యావిరహితుడవై ఉందువుగాక ! అని శప్తుడైన కారణంగా తన మహిమలను కోల్పోయి, ఒకనాడు సీతాదేవి స్నానమాడటం వల్ల పవిత్రమైన జలాలు, చిక్కని నీడనిచ్చే చెట్లు కలిగిన 'రామగిరి' ప్రాంతంలో నివాసమున్నాడని అర్థం.

ఇక ప్రశ్నలోని మూడవపదం 'వాక్' అంటే మాట, శబ్దమని అర్థం. ఆ పదంతో ప్రారంభించి

**వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే।**
**జగతః పితరౌ వన్దే పార్వతీపరమేశ్వరౌ॥**

అంటూ రఘువంశాన్ని వ్రాసేడంటారు. ప్రపంచానికి తల్లితండ్రులూ, శబ్దార్థాలవలె ఎప్పుడూ కలిసి ఉండే పార్వతీ పరమేశ్వరులకు శబ్దార్థాల జ్ఞానం కోసం నమస్కరిస్తున్నానని అర్థం.

'కవికులతిలకుడు','కవికులగురువు' ఇత్యాది బిరుదాలెన్నో ఆయనకున్నాయి. ఆయన రచనల విషయానికి వస్తే 'ఋతుసంహారం' అనే లఘుకావ్యాన్నీ, 'మేఘదూతమ'నే ఖండ కావ్యాన్నీ, 'రఘువంశం',

'కుమార సంభవం' అనే రెండు మహాకావ్యాల్నీ, మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వశీయం, అభిజ్ఞానశాకుంతలం అనే మూడు నాటకాల్ని వ్రాసేడు. వీటిలో 'అభిజ్ఞాన శాకుంతలం' దేశ విదేశ భాషల్లో విస్తృతంగా అనువాదితమైన నాటకం.

ఇక పంచకావ్యాల ప్రస్తావన. కాళిదాసు రఘువంశం, కుమార సంభవం, మేఘదూతం, భారవి అనే మహాకవి విరచితమైన 'కిరాతార్జునీయం', మాఘ మహాకవి 'శిశుపాలవధ' – ఈ ఐదింటినీ పంచకావ్యాలంటారు. అయితే మేఘదూతం ఖండకావ్యం కాని మహాకావ్యం కాదు. కనుక దానిని తప్పించి ఐదవదిగా 'విద్వదౌషధం' అని వినుతికెక్కిన శ్రీహర్షకృత నైషధాన్ని చేర్చటం కొందఱి మతం. అలాగే తెలుగులోనూ అల్లసాని పెద్దన స్వారోచిషమనుసంభవం (మనుచరిత్ర) రామరాజ భూషణుని 'వసుచరిత్ర' శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్తమాల్యద', తెనాలి రామకృష్ణుని 'పాండురంగ మాహాత్మ్యం', శ్రీనాథ కవి సార్వభౌముని 'శృంగారనైషధం' అనే ఐదింటికీ పంచకావ్యాలనే ప్రసిద్ధి ఉంది.

కాళిదాసు ప్రశస్తి గుఱించిన నానుడులు కొన్ని జన సామాన్యంలో ఉన్నాయి. అవి ఆసక్తికరమైనవి. వాటిలో ఒకటి "కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసః" అనేది. అంటే మన చేతిలో ఐదువ్రేళ్లనూ చూపుడు వ్రేలినుంచి వరుసగా తర్జని, మధ్యమ, అనామిక, కనిష్ఠిక, అంగుష్ఠం అని సంస్కృతంలో వ్యవహరిస్తారు. చిటికిన వ్రేలు కనిష్ఠిక అన్నమాట. ఏవైనా ఒకటి, రెండు, మూడు ఇత్యాదిగా లెక్కపెట్టినపుడు చిటికెనవ్రేలి నుంచి ఒక్కొక్కటే ముడుస్తూ లెక్కపెడతాం. కనుక అది మొదటిదవుతోంది. కవుల ప్రస్తావన వచ్చినపుడు చిటికిన వ్రేలిని ముడుస్తూ మొదటగా కాళిదాసు పేరు చెప్పేరట. కాళిదాసు



ఈ నాటికి రెండు వేల సంవత్సరాల క్రిందటి వాడు. నేటికీ ఆయనతో సమానుడైన కవి లేకపోవటం వల్ల ఆ తర్వాత చూపుడువ్రేలి నుంచి లెక్కపెడితే మూడవ వ్రేలు– దానికి 'అనామిక' అనే పేరు (అంటే పేరులేనిదని అర్థం) సార్థకమైందట! ఆ శ్లోకం –

**"పురా కవీనాం గణనా ప్రసజ్గే**
**కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసః।**
**అద్యాపి తత్తుల్యకవేరభావాత్**
**అనామికా సార్థవతీబభూవ ॥"**

ఈ శ్లోకం ఎవరు చెప్పేరో తెలియదు. చమత్కారం గ్రహించి సంతోషించేటమే మనవంతు. లోకంలో ప్రసిద్ధమైన ఒక పేరునో, విషయాన్నో తీసికొని కవులు తమ ఊహాశక్తితో చమత్కరిస్తారు. పాఠకులు ఆస్వాదిస్తారు.

ఈ కవిని గూర్చిన కథలు తెలుగులో తెనాలి రామకృష్ణుని కథల వలె కొన్ని ప్రచారంలో ఉన్నాయి. ఈయన విక్రమాదిత్యుని ఆస్థానంలో ఉండేవాడని ప్రసిద్ధి. సంప్రదాయ ప్రవణులు దీన్నే నమ్ముతారు. ఆంగ్లేయ చరిత్రకారులు అడ్డదిడ్డంగా ఉపపత్తులు చూపుతూ క్రీ.పూ ఒకటవ శతాబ్దం నుంచి క్రీ.శ నాల్గవ శతాబ్దంలోపల ఉన్న వాడని ఉటంకించారు. ఒక వ్యక్తి కాలనిర్ణయం చేయవలసిన పద్ధతి ఇదికాదు కదా! ఆంగ్లేయ విద్యావిధానాన్ననుసరించి వాటినే ప్రమాణ గ్రంథాలుగా స్వీకరించి మన దేశ స్వాతంత్ర్యం సిద్ధించి 60 ఏళ్లు దాటినా విశ్వవిద్యాలయాల్లో సైతం నేటికీ వాటినే బోధించేటం, ప్రాచ్యులు కూడా ఆ అప్రాచ్యపు వ్రాతల ధోరణిలోనే గ్రంథరచన చేయటం మన దౌర్భాగ్యం.

సరే – ఇక కాళిదాసు రచనల్లో మొదటిది రఘువంశం అని చాలామంది విశ్వసిస్తే – కాదు, కుమారసంభవం అని మఱికొందఱు పండితులు వాదిస్తారు. ఆ వాదోపవాదాల జోలికి పోవటం ఈ గ్రంథ పరిధి లోనిది కాదు. వాటిలోని అందాల్ని , సందేశాన్నీ అందించేటమే ప్రధానధ్యేయం.

భారతీయ సాహిత్య ప్రక్రియ ఏదైనా మొదట్లో, మధ్యలో. చివర కూడా 'మంగళం' ఆచరించేటం సంప్రదాయం.

*"మఙ్గలాదీని మఙ్గల మధ్యాని మఙ్గలాన్తాని కావ్యాని ప్రథన్తే ।"* అని ఆర్యవచనం. ఏదైనా శుభారంభం, శుభమధ్యం, శుభాంతం కావాలని మనవారి ఆకాంక్ష. దాన్ననుసరించే చాలా సినిమాలు నేటికీ భగవత్ప్రార్థనతో ప్రారంభమై చివర "శుభం" తో ముగుస్తాయి. సరే – ఈ మంగళం ఎలా ఉండాలంటే –

***"ఆశీర్నమస్క్రియా వస్తు నిర్దేశో వాపి తన్ముఖమ్"*** అన్నారు. అంటే – ఆశీస్సురూపంలో కాని, నమస్కార (దేవతా)రూపంలో కాని, ఏదైనా వస్తువుని నిర్దేశిస్తూ (అనగనగా ఒకరాజు అన్నట్లు) కాని ఉండవచ్చునన్నారు. కాళిదాసు నమస్కారరూపంలో రఘువంశానికీ వస్తు నిర్దేశంతో కుమార సంభవానికీ నాటకాలకు ఆశీస్సులరూపంలోనూ మంగళం ఆచరించాడు. ఎవరు వ్రాసిన నాటకాల్లోనైనా ఆశీర్వచనరూపంలోనే ఈ మంగళం ఉంటుంది. కవి తన ఇష్టదేవతను ప్రార్థించి "ఆ దేవత (లేక దేవుడు) మీ కందఱికీ (ప్రేక్షకులకు) శుభాలనిచ్చుగాక!" అన్నట్లుగా ఉంటాయి. నాటకం చూడటానికి వచ్చిన ప్రేక్షకులను ప్రసన్నులను చేసికోవటానికి ఇదొక కిటుకు. మనదేశంలో మంగళానికింత ప్రాధాన్యం ఉండటంవల్ల పాశ్చాత్య దేశాల్లోని



విషాదాంత నాటకాలు (ట్రేజెడీస్) సంస్కృతంలో లేవు. కరుణ, రసాత్మక సన్నివేశాలు సమృద్ధిగా ఉండవచ్చు. విషాదాంతం మాత్రం కారాదు. పంచకావ్య కవుల ప్రసక్తి సంక్షిప్తంగా తత్తత్కావ్యారంభాల్లో సూచితమైంది.

## విషయసూచిక

కృతజ్ఞతాంజలి......
అభిప్రాయాలు......
నామాట.....
పంచకావ్య పరీమళం ......

రఘువంశ మహాకావ్యమ్ - కాళిదాస మహాకవి....

కుమార సంభవమ్ - కాళిదాస మహాకవి....

మేఘదూతమ్ - కాళిదాస మహాకవి....

కిరాతార్జునీయమ్ - భారవి మహాకవి......

శిశుపాల వధమ్ - మాఘ మహాకవి......

# రఘువంశ మహాకావ్యమ్

శ్రీః

సంస్కృతంలో రామాయణం ఆది కావ్యం. అది వ్రాసింది వాల్మీకి మహర్షి కనుక ఆయన ఆదికవి. ఆయన కవితా నిర్మాణ పద్ధతి ననుసరించే తరువాతి కవులంతా తమ కావ్యాల్ని రచించారు. రాముని కథ ప్రధానంగా వర్ణితమైంది కనుక వాల్మీకి తన కావ్యానికి 'రామాయణమ'ని నామకరణం చేసేడు. కాళిదాసు రఘువంశంలో ఆ వంశంలోని 29 మంది రాజుల చరిత్రను ఉటంకించాడు. కనుక దీనికాయన 'రఘువంశమ్' అనే పేరు పెట్టేడు. శ్రీరామచంద్రుడు భారతీయులందఱికీ ఆరాధ్యదైవం. అయినా వారి వంశానికి ఆయన ముత్తాత రఘువు పేరేవచ్చింది. అయితే రామాయణంలోని వంశవృక్షానికీ, కాళిదాసు చెప్పిన తీరుకీ కొంత తేడా కనిపిస్తుంది. ఎందుకలా అంటే చరిత్రలో యథాతథంగా వరుస పాటించ వలసిన అవసరం ఉంటుంది. కాని కావ్యంలో ఆ నిబంధన లేదు. కావ్యం రసాత్మకం కనుక రసానుభూతికనువైన రాజుల్ని, వారి చరిత్రను, తత్సంబంధిత సన్నివేశాల్నీ చిత్రిస్తాడు కవి. ఈ వంశపు రాజులంతా సూర్యవంశపురాజులు ఆ రాజుల్లో దిలీపుని నుండి కావ్యారంభం కావించాడు. దిలీపుడు అతని కుమారుడు రఘువు, అతని కుమారుడు అజుడు, అతని కుమారుడు దశరథుడు, వాని పుత్రుడు రాముడు. ఇలా శ్రీరామునిముందు నలుగురు ప్రభువుల్నే తీసికోవటానికి విజ్ఞులొక కారణం చెబుతారు. అదేమిటంటే - రాజు ధర్మార్థ కామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాల్నీ సమానంగా సేవించాలి కాని వాటిలో ఓ ఒక్కదానికీ అధిక ప్రాధాన్యం ఇవ్వకూడదు. పైన చెప్పిన రాజుల్లో దిలీపుడు ధర్మానికీ, రఘువు అర్థానికీ, అజుడు కామానికీ, దశరథుడు మోక్షానికీ అధిక ప్రాధాన్యమిచ్చి జీవించారు. శ్రీరాముడు మాత్రం పక్షపాతరహితుడై ధర్మార్థ కామమోక్షాల్ని సమానంగా సేవించాడు. రామాయణంలో చెప్పిన వంశవృక్షానికి ఒకింత

భిన్నమైనా ఈ రాజుల్నే తీసికొని వారి జీవితాల్ని వివరించేటంలో ఉన్న రహస్యం ఇదీ.

కావ్యారంభంలో కాళిదాసు చేసిన నమస్కారరూపమైన మంగళం గూర్చి ఇప్పటికే ముచ్చేటించేటమైంది. రఘువంశం 19 సర్గల మహాకావ్యం. మొత్తం 1568 శ్లోకాలతో కూడిఉంది.

ప్రథమసర్గలో శ్లోకాలు 95. ప్రార్థనా శ్లోకం తరువాత నేటి 'పీఠిక' వంటి మూడుశ్లోకాల్లో తాను చేయదలచిన కార్యానికి తానర్హుడను కానని "సూర్యవంశానికి చెందిన ఆ రాజులెక్కడ ? అల్పవిషయాలకే పరిమితమైన నాబుద్ధి ఎక్కడ ? మహా సాగరాన్ని తెప్పకొయ్యతో దాటాలనుకొంటున్నాను. కవి కీర్తినాశించే మందబుద్ధినైన నేను ఎత్తైన చెట్టుకొమ్మపైనున్న పండునుకోయటానికి ఎగిరే మఱుగుజ్జు వానివలె నవ్వులపాలౌతాను. కాకపోతే పూర్వకవులు ఈ వంశచరిత్రను వ్రాసేరు. కనుక రంధ్రాన్విత మణుల్లో దారం గ్రుచ్చినట్లుంటుంది నా ప్రయత్నం" అంటూ ఎంతో వినయంగా విన్నవించుకొంటాడు.

ఆ తరువాత నాలుగు శ్లోకాల్లో రఘువంశరాజుల వ్యక్తిత్వాన్ని వివరిస్తాడు. "ఆ వంశంలోని రాజులంతా పుట్టుక నుండే పరిశుద్ధులు. మొదలుపెట్టిన పనిని ఫలించేంత వఱకు విడువనివారు. సముద్ర పర్యంతం వ్యాప్తమైన భూమికి ప్రభువులు, స్వర్గపర్యంతం రథ మార్గం కలిగిన వారు. శాస్త్రోక్తంగా అగ్నిహోత్ర విధిని అనుష్ఠించేవారు, యాచకులను తృప్తినొందించేవారు, అపరాధానికి తగ్గట్లుగానే శిక్షించేవారు, సమయపాలనలో నిత్యజాగరూకులు. వారి సంపాదన త్యాగం కోసం, సత్యం కోసమే వారి మితభాషిత్వం, వారి జైత్రయాత్రలు కీర్తికోసమే, సంతానార్థమే వారి గృహస్థాశ్రమ స్వీకారం. శైశవంలో విద్యాభ్యాసం, యౌవనంలో



భోగానుభవం, వార్ధక్యంలో మునివృత్తి, అంత్యకాలంలో యోగమార్గంలోనే దేహత్యాగం వారనుసరించే విధులు. నాకంత వాగ్వైభవం లేకపోయినా వారి గుణాలు నన్ను ఉత్తేజపఱచేటం వల్ల చాపల్యంతో వారి వంశ చరిత్రను వచించేటానికి పూనుకొన్నానని" చెబుతూనే గడుసుగా –"

"తం సన్తశ్శ్రోతుమర్హన్తి సదసద్వ్యక్తి హేతవః।
హేమ్న స్సంలక్ష్యతే హ్యగ్నౌ విశుద్ధిశ్శ్యామికాపివా॥" (1–10)

అంటాడు. అంటే తన ఈ రఘువంశ కావ్యాన్ని గుణాగుణ నిర్ణయం చేయగల సత్పురుషులే వినటానికి అర్హులట! ఎందుకంటే, బంగారం శుద్ధమైందో ఇతరలోహాలతో కూడిఉందో అది అగ్నిలో వేసినప్పుడే కదా తెలిసేదంటాడు. అంటే తన ఈ కావ్యం బంగారం వంటిది, గుణాగుణ విచక్షణ కల సత్పురుషులు అగ్నివంటివారనీ ధ్వని.

ఇలా పదిశ్లోకాల్లో పీఠిక వంటిదాన్ని పూర్తిచేసి 11 వ శ్లోకం నుంచి కథా ప్రారంభం చేస్తాడు.

"వైవస్వతో మనుర్నామ మాననీయో మనీషిణాం।
అసీన్మహీక్షితామాద్యః ప్రణవశ్ఛందసామివ॥" (1–11)

అంటే విద్వాంసులకు పూజ్యుడైన వైవస్వతుడనే మనువు వేదాలకు ఓంకారం వలె రాజులలో మొదటివాడని అర్థం. అంతటి మహనీయుని వంశంలో సముద్రంలో చంద్రుడుదయించినట్లు దిలీపుడనే రాజు పుట్టేడని ఆ దిలీపుని దేహదార్ఢ్యాన్ని చెప్పి 'క్షాత్ర'మనే ధర్మమే అతని శరీరాన్ని ధరించిందో అన్నట్లుగా ఆయన ఉండేవాడంటాడు. ఆకారంతో సదృశమైన ప్రజ్ఞ, ఆ ప్రజ్ఞకు సదృశమైన శాస్త్రవిజ్ఞానం, ఆ శాస్త్ర సదృశమైన క్రియారంభం, ఆ క్రియారంభానికి తగిన ఫలం కనిపించేవట! ఆ దిలీప మహారాజును సముద్రునితో పోలుస్తూ సముద్రుడు తిమి తిమింగిలాది భీకరమృగాలవలె

ఆశ్రయింపతగనివాడు, ముక్తామణ్యాదులచే ఆశ్రయింపతగినవాడూ అయినట్లు దిలీపుడు గాంభీర్యాదుల చేత సమీపింప తగనివాడు. ఔదార్యాదులచేత సమీపింపతగినవాడూ అయి ఉన్నాడంటాడు. మనువు ప్రవచించిన రాజధర్మాన్ని అణుమాత్రం తొలగక పరిపాలించేవాడు. సూర్యుడు సముద్రజలాన్ని కొన్నిరెట్లుగా వర్షానిచ్చేందుకే ఎలా గ్రహిస్తున్నాడో అలాగే వెయ్యి రెట్లుగా తిరిగి ప్రజలకు వినియోగించేందుకే పన్నులను స్వీకరించేవాడట ఆ దిలీపుడు!

ప్రజలకు శిక్షణ, పోషణ, రక్షణాదిక్రియల్లో దిలీపుడు తండ్రివలె ప్రవర్తించాడు. ఆ ప్రజల తల్లితండ్రులు కేవలం జన్మకారకులే. ఆయన పాలనలో దొంగలే లేరు. ఇష్టంగా లేకపోయినా ఆరోగ్యానికి ఔషధాన్నెలా స్వీకరిస్తామో అలాగే శత్రువైనా సత్పురుషుడతనికి గ్రహింపతగినవాడు. పాముకఱచిన వ్రేలిని అవసరమైతే ఛేదించటానికైనా ఎలా వెనుదీయమో తనవాడైనా దుష్టుడతనికి విడువదగినవాడు.

ఆ దిలీప మహారాజుకు మగధ వంశజాత అయిన సుదక్షిణాదేవి భార్య. ఎంతకాలమైనా ఆ దంపతులకు సంతానం కలుగలేదు. సంతానం కోసం ఏదైనా వ్రతానుష్ఠానం చేస్తే మంచిదని రాజ్యభారాన్ని మంత్రులపై ఉంచి ఆ దంపతులిద్దఱూ కులగురువు వసిష్ఠాశ్రమానికి బయలుదేరేరు. త్రోవలో మద్ది వృక్షాల పరిమళం, చల్లనైన మందమలయానిలం వారిని సేవించింది. విప్రులు అర్ఘ్యపాద్యాదులతోను, గొల్లలు అప్పుడే కాచిన నేతిని కానుకలుగా సమర్పిస్తూ గౌరవిస్తూ ఉంటే తమకు తెలియని చెట్ల పేర్లను వారి నడుగుతూ ఆ దంపతులు సాగిపోయారు.

ఈ సన్నివేశం రాజు ప్రజలలో ఆనాడెట్టి ఆత్మీయత ను భజించేవాడో తెలియజేస్తుంది. నిజానికి రాజ్యాన్నేలేరాజు వృద్ధులైన



గొల్లవారితో మాట్లాడటానికి మాటలేముంటాయి ? అయినా తనకు తెలియని విషయాన్ని వారి నుండి తెలిసికొంటున్నాడనే సంతోషం ఆ గొల్ల వృద్ధులకు ఎంతగా ఉంటుంది ! రాజు పరంగా ఆలోచిస్తే ఆయనకు అన్ని వృక్షాల పేర్లు తెలియవుకదా ! అంతటి తక్కువ స్థాయిలో ఉన్నవారితో తను మాట్లాడేదేమని సేవకుల ద్వారా అడిగి తెలుసుకోవచ్చు. కానీ తానే స్వయంగా వారి నడగటంలో వారికి ఆనందాన్ని కలుగజేసినవాడయ్యాడు.

ఆ సాయంత్రానికి వారు వసిష్ఠమహర్షి ఆశ్రమానికి చేరేరు. తపోవనరక్షకుడైన దిలీపుని చూచి అచేటి మునిజనం రాజదంపతులను యథావిధిగా సన్మానించారు. స్వాహాదేవీ సహితుడైన అగ్నిహోత్రునివలె అరుంధతీ ద్వితీయుడైన వసిష్ఠమహర్షిని దర్శించి దిలీపదంపతులు వారికి పాదాభివందనం చేస్తే వసిష్ఠుడు తన ఆశీర్వాదంతో వారిని సంతృప్తుల్ని చేసేడు. మునిజనోపచారంతో మార్గాయాసాన్నుంచి తేఱుకొన్న దిలీపుని వసిష్ఠుడు "ప్రభువు, అమాత్యులు, రాజధాని, రాష్ట్రం, కోశాగారం, దండనీతి, స్నేహితులనే సప్తాంగాలూ స్వస్థతతో ఉన్నాయికదా" అని క్షేమమడిగేడు.

దిలీపుడు "మహర్షి వర్యా ! మీ దయవలన సప్తాంగాలూ క్షేమమే దైవ మానుషపరమైన ఆపదలు తమ మంత్రశక్తివలన నివారణ నొందుతున్నాయి. మీరు జేలిపే హవన క్రియవల్ల సకాల వర్షాలతో భూమి సస్యశ్యామలంగా ఉంది. మీ బ్రహ్మవర్చస్సు వల్లే రాష్ట్రప్రజలు దీర్ఘాయుష్మంతులై వ్యాధి, అతివృష్ట్యనావృష్ట్యాది ఈతిబాధలు లేక సంతోషంగా ఉన్నారు. అయినా ఈ తమ కోడలికి నావంటి పుత్ర సంతతి లేకపోవటంవల్ల రత్నగర్భ అయిన భువి నాకు సంతోషాన్ని ప్రసాదించటం లేదు. నా తదనంతరం శ్రాద్ధకర్మలు లభించవని నా పితరులు శ్రాద్ధపిండ ప్రదానాన్ని తృప్తిగా స్వీకరించటం లేదు. వంశం అంతరించిపో తోందన్న

బాధతో వారి దీర్ఘనిశ్వాసాలలో నేనిచ్చే తిలోదకం వెచ్చేగా ఉంటోంది. తపోదాన సముద్భూతమైన పుణ్యం పరలోక సుఖాన్ని ప్రాప్తింప చేసేదయితే పరిశుద్ధ వంశ జాతమైన సంతతి ఇహపరసుఖదమౌతోంది. మహాభాగా! నా పట్ల తమ ప్రేమ అమేయమైంది. సృష్టించేటంలో బ్రహ్మతుల్యులైన తమరు నా విషయం ఎందుకాలోచించేరు? పితృఋణ విముక్తి నొందని నా బాధ భరించే రానిదిగా ఉంది. ఇక్ష్వాకు వంశీయులకసాధ్యమైన కార్యాల్ని సైతం సుసాధ్యం చేయగల మీరే నాకు పితృఋణ విముక్తిని కలిగించేటానికి తగిన ఉపాయాన్ని ఉపదేశించేవలసిందిగా ప్రార్థిస్తున్నాను."

దిలీపుని విజ్ఞాపనను విన్న వసిష్ఠమహర్షి క్షణకాలం ధ్యానస్థిమిత లోచనుడై నిద్రిస్తున్న చేపలు కల సరస్సువలె నిశ్చలుడైనాడు. దివ్యదృష్టితో దిలీపుని సంతతి స్తంభించిన కారణాన్ని గ్రహించి ఇలా అన్నాడు. "పూర్వం నువ్వు ఇంద్రుని సేవించి భువికి తిరిగి వస్తూ ఉంటే త్రోవలో కల్పవృక్ష చ్ఛాయలో కామధేనువు ఉంది. అపుడు ఋతుస్నాతయైన రాణిని సంగమించేకపోతే ధర్మలోపం కలుగుతుందని ఆమెను స్మరిస్తూ ప్రదక్షిణార్హఅయిన కామధేనువుకు ప్రదక్షిణ నమస్కారాదులాచరించేలేదు".

ఇక్కడ దిలీపుడు భార్యా సంగమేచ్ఛతో ఆమెనే స్మరిస్తూ తిరిగి వస్తున్నాడు.

**ధర్మలోపభయాద్రాజ్ఞీమృతుస్నాతామనుస్మరన్ ।**
**ప్రదక్షిణక్రియార్హాయాం తస్యాం త్వం సాధు నాచరః ॥**(1 – 76)

మొదట్లో దిలీపుడు ధర్మానికీ, రఘువు అర్థానికీ, అజుడు కామానికీ, దశరథుడు మోక్షానికీ ఎక్కువ ప్రాధాన్యమిచ్చారని చెప్పిన వాక్యానికిది ఉపోద్బలకం. భార్యా సంగమేచ్ఛ కామంతో కాదు. ధర్మలోపం కలుగుతుందనే భీతితో. ఏమిటా ధర్మలోపం ? భర్త ఆరోగ్యవంతుడై



ఉండి, ఋతుస్నాత అయిన భార్యను సంగమించేకపోతే భ్రూణహత్యాపాతకం,గోహత్యాపాతకం ప్రాప్తిస్తుందన్న పరాశర వచనాన్ని మల్లినాథసూరి ఈ శ్లోక వ్యాఖ్యానంలో పేర్కొన్నాడు.

*"ఋతుస్నాతాంతు యో భార్యాం స్వస్థస్సన్నాధిగచ్ఛతి ।*
*బాలగోఘ్నాపరాధేన యుజ్యతే నా౽త్ర సంశయః ॥"* అని.

ఇలా కాళిదాసు కావ్యంలో మానవులాచరించేవలసిన ధర్మాలు అడుగడుగునా దర్శనమిస్తూ ఉంటాయి.

అపుడా కామధేనువు "ఏ కారణం చేత నన్నవజ్ఞ చేసేవో ఆ కారణంగా నా సంతతిని సేవించేక నీకు సంతానం కలుగకుండుగాక !" అని శపించింది. రాజా! అపుడాకాశగంగా ప్రవాహంలో దిగ్గజం చేసే ధ్వనివల్ల నీకు కాని, నీ రథ సారథికి కాని ఆ శాపం వినిపించేలేదు. ఇలా నువ్వు కామధేనువు నవమానించినందువలన నీ మనోరథానికి ప్రతిబంధకమేర్పడింది. పూజ్యులకు చేసిన అవమానం శ్రేయస్సుల కవరోధం కదా! ఇపుడాకామధేనువు పాములు పరివేష్టించి ఉన్న పాతాళంలో వరుణుడు చేస్తున్న దీర్ఘ సత్రయాగానికి హవిస్సులను సమకూరుస్తూ అక్కడుంది. కనుక ఆ కామధేనువుకు బదులు ఆమె పుత్రిని భార్యాసహితుడవై సేవించు. నీ సేవలకామె ప్రీతినొందితే నీకు ఇష్టార్థాలను వర్షిస్తుంది." వసిష్ఠుడీ మాటలంటూ ఉంటే కామధేనువు వత్స నందినీ ధేనువు వనం నుంచి తిరిగి వచ్చింది. అది శుభ శకునంగా భావించి వసిష్ఠమహర్షి తిరిగి దిలీపునితో – "రాజా ! మనం నందినీ ధేనువు గూర్చి మాట్లాడుకుంటూ ఉంటే మాటల్లోనే ఆ నందినీ ధేనువు రావటం సత్వర కార్యసిద్ధి సూచకం. ఇక నువ్వు కందమూలాదికాన్నే ఆహారంగా స్వీకరించి ఈ ధేనువు ప్రసన్నురాలయ్యే వఱకు అభ్యాసంతో విద్యనువలె సేవించు.

ఈ ధేనువు బయలుదేరినప్పుడే వెంట నడిచి, అది ఆగినప్పుడు నువ్వూ నిలిచి ఉండి, కూర్చున్నప్పుడే కూర్చుంటూ, నీటిని త్రాగినప్పుడే నువ్వూ జలపానం చేస్తూ అనుసరించు. ప్రతి దినం నీ భార్యసైతం ఉదయం ఆమెను పూజించి తపోవనం దాకా అనుసరించి సాయంతనం ధేనువు తిరిగి వచ్చినప్పుడు ఎదురు వెళ్ళాలి. ఈ విధంగా మీరిరువురూ ధేను శుశ్రూషాపరులు కండి. అవిఘ్నంగా నీవిలా ఆచరించి నీ తండ్రికి వలె నీవూ సత్సంతతిని పొందుదువు గాక ! దేశకాలజ్ఞుడైన దిలీపుడట్లేనని, తమ ఆజ్ఞానుసారం నడచుకొంటానని వసిష్ఠునికి విన్నవించాడు. వసిష్ఠుడు దిలీపుని నియమపాలనకై దర్భశయ్యను కల్పించి నిద్రించుమని ఆదేశించాడు. దిలీపుడు భార్యాసహితుడై ఆ దర్భ శయ్యపైనే పఱుండి మఱునాటి వేకువజామున వసిష్ఠమహర్షి శిష్యుల వేదాధ్యయనంతో మేలుకొన్నాడు.

ప్రథమ సర్గ ఇక్కడితో పూర్తి అవుతుంది. రాజులు ప్రజల్ని ఎంత ఆత్మీయంగా చూసుకొనేదీ, వ్యక్తిగత శీలంలో వారెంత పరిశుద్ధులై ఉండే ఇందులో వర్ణితాలైనాయి. ఇక ద్వితీయ సర్గ.

ఆ మఱునాటి ప్రభాత కాలంలో సుదక్షిణాదేవి నందినీ ధేనువును పూజించి, గంధ మాల్యాదులతో అలంకరించి పాలు త్రాగటానికి విడిచి దూడను కట్టివేసింది. దిలీపుడు నందినీ ధేనువును మేపటానికి వనానికి తోడ్కొని వెళ్ళేడు.

**"అథప్రజానామధిపః ప్రభాతే**
**జయా ప్రతిగ్రాహిత గంధమాల్యామ్।**
**వనాయ పీతప్రతిబద్ధవత్సాం**
**యశోధనో ధేనుమృషే ర్ముమోచ ॥"**



ఇది ద్వితీయసర్గలో మొదటి శ్లోకం సంస్కృత ఛందస్సులో దీన్ని 'ఉపజాతి' వృత్తమంటారు. లయబద్ధంగా శ్లోకం సాగి అర్థం తెలియకపోయినా చేదవటానికి ఎంతో మనోజ్ఞంగా ఉంటుంది. కావ్యంలో ఒకొక్కసర్గ ఒక్కొక్క వృత్తంతో సాగి చివర శ్లోకం మాత్రం భిన్నవృత్తంతో ఉంటాయి. పతివ్రతల్లో అగ్రగణ్య అయిన రాజపత్ని ధేనువు నడుస్తూ ఉంటే గిట్టలతో రేగిన ధూళివలన మార్గం పవిత్రీకరణ నొందిందట ! అటువంటి 'పవిత్రమైన ధూళిలో' సుదక్షిణ అడుగులు వేస్తూ వేదాల అర్థాన్ని, ధర్మశాస్త్రాలనుసరించినట్లు ఆమె ధేనువు ననుసరించి ఆశ్రమం బయట వఱకు వెంట నడిచింది.

***తస్యాః ఖురన్యాస పవిత్రపాంసుం అపాంసులానాం ధురి కీర్తనీయా।***
***మార్గం మనుష్యేశ్వర ధర్మపత్నీ శ్రుతేరివార్థం స్మృతిరన్వగచ్ఛత్ ॥ (2 - 2)***

ఈ శ్లోకంలో భారతీయులకు గోవు ఎంతటి పవిత్రమైందో ధ్వనితమైంది. దిలీపుడు చతుస్సముద్రముద్రితమైన ధరాతలాన్నేలిన ప్రభువు. భూమికి గోవును ప్రతీకగా భావించేటం భారతీయ సంప్రదాయం. గోమాతను పూజిస్తే భూమాతను పూజించినట్లే. దిలీపుడు భూమిని రక్షిస్తున్నట్లే ఆ ధేనువును, రక్షిస్తూ వెంట వెళ్ళేడట ! ఆ గోవు నాలుగు పాదుగులూ నాలుగు సముద్రాలని ఉత్ప్రేక్షించేటంలో ఎంతటి అందం !

***"పయోధరీభూత చతుస్సముద్రాం***
***జుగోప గోరూపధరామివోర్వీమ్" (2-3)***

దిలీపుడు పరివారాన్నంతా వదలి ఒంటరిగానే గోవు ననుసరిస్తూ అడవికి వెళ్ళేడు. విడిగా రాజు ఎక్కడికి బయలుదేరినా అంగరక్షకులు, తదితర పరివారం అనుసరించేటం నేటికీ చూస్తూనే ఉన్నాం కదా 'సెక్యూరిటీ' పేరుతో ! మను వంశస్థులైన రాజులను ఇంకొకరు

రక్షించేనవసరం లేదు. మహావీరులు కనుక తమరక్షణను తామే చూసుకొనగలరు. చేక్కని పచ్చికను ముద్దలుగాచేసి ఆ గోవుకు తినిపిస్తూ, శరీరాన్ని గోకుతూ, గోవుపై వ్రాలుతున్న ఈగలు మొదలైన వాటిని త్రోలుతూ, స్వేచ్ఛగా సంచరింపజేస్తూ ఆసక్తితో కంటికి ఱెప్పవలె కాపాడుతున్నాడా దిలీప మహారాజు. నందినీ రక్షణ నెపంతో అడవిలోని క్రూర మృగాలను తునుమటానికి ధనువును ధరించి ధేనువుననుసరించాడు. ముందు బరువైన పొదుగులతో ఉన్న నందినీ ధేనువు, వెనుక బలిష్ఠమైన శరీరంతో దిలీప మహారాజు వెళుతూఉంటే ఆ మార్గం చేలా అందంగా కనిపించింది. ఈ విధంగా దినమంతా అడవిలో నందినీ ధేనువుకు శుశ్రూషచేసి సాయంతన సమయానికి గోవుతో ఆశ్రమానికి తిరిగి వచ్చిన దిలీపుని సుదక్షిణాదేవి ఉపవసించినవాడు అమిత దాహంతో నీటిని త్రాగినట్లే ఱెప్పపాటులేని అందమైన కనుఱెప్పలతో త్రాగినట్లు చూసిందంటాడు కాళిదాసు. ఎంతో అందమైన ఉపమానం ! ఎవరెంతగా అనువదించినా కాళిదాసు ఘనత ఆ శబ్ద సౌకుమార్యం, రసానుభూతి, అనుభూతం కావు.

**"వసిష్ఠధేనోరనుయాయినం తం**
**ఆవర్తమానం వనితా వనాన్తాత్ ।**
**పపౌ నిమేషాలసపక్ష్మపఙ్క్తిః**
**ఉపోషితా భ్యామివ లోచనాభ్యామ్ ॥"** (2 - 19)

తిరిగి వచ్చిన నందినీ ధేనువుకు ముందు సుదక్షిణాదేవి, వెనుక దిలీపుడు ఉండటంతో ఆ గోవు దివారాత్రాల మధ్య సంధ్య వలె ప్రకాశించింది. ఆ నందినీ ధేనువుకు రాణి అక్షత పాత్రతో ఎదురేగి, ప్రదక్షిణచేసి, కామితార్థ సిద్ధికి ద్వారాల వలె ఉన్న రెండు కొమ్ములమధ్య ప్రదేశాన్ని పూజించింది. దిలీపుడు తన కులగురువైన వసిష్ఠుని సపత్నీకుడై పాదసంవాహనమొనర్చి సాయంసంధ్యాద్యనుష్ఠానం ముగించి నందినీ ధేనువును తిరిగి సేవించాడు. అంటే పత్నీసమేతుడై ఆ ధేనువు సమీపంలో ఆహారాన్నీ, దీపాన్ని ఉంచి అది నిద్రించినపుడు నిద్రించి, లేచినపుడే నిదురమేల్కొన్నాడు. ఈ విధంగా అనుక్షణం రక్షిస్తూ 21 రోజులు ఆ గోవ్రతాన్ని ఆచరించాడు.



ఆ మఱునాడు నందినీ ధేనువు దిలీపుని భక్తిశ్రద్ధలను పరీక్షించేలని గంగా ప్రవాహానికి సమీపంలో పచ్చిక ఉన్న హిమపర్వత గుహలో ప్రవేశించింది. నందినీ ధేనువును ఏ క్రూరమృగమూ పట్టుకోలేదనే విశ్వాసంతో పర్వత శోభను తిలకిస్తున్న దిలీపుని దృష్టిని మఱగించి హఠాత్తుగా ఒక సింహం ఆ ధేనువు పై బడి ఈడ్చుకొని పోయింది. ఇంతలో పర్వత గుహలో ప్రతిధ్వనిస్తున్న నందినీ ధేనువు ఆక్రందనను వినటంతో దిలీపుడు తిరిగి చూడటంతో ఎఱ్ఱని నందినీ ధేనువుపై ఉన్న తెల్లని సింహం దృగ్గోచరమైంది. తను ఆరాధిస్తున్న గోవు పైకి సింహం లంఘించేటంతో అవమానం పొందినట్లు భావించి దాన్ని వధించేటానికి ఉద్యుక్తుడై తూణీరంలోని బాణం తీయటానికి కుడిచేతిని అమ్ముల పొదిపైకి ఎత్తగా అది అలాగే ఉండి చలనం లేకుండా బొమ్మగీసిన పటంలో వలె ఉండి పోయాడట ! కాళిదాసు వర్ణించే సన్నివేశాలు ఇలా చిత్రకారుని కుపయోగించే విధంగా ఉండి మనకా చిత్రాలు మనఃఫలకంపై కన్పట్టుతాయి.

**వామేతర స్తస్య కరం ప్రహర్తుః**
**నఖప్రభా భూషిత కఙ్కపత్రే ।**
**సక్తాఙ్గులిః సాయకపుంఖ ఏవ**
**చిత్రార్పితారమ్భ ఇవావతస్థే ॥** (2-31)

బాహుప్రతిష్ఠంభనతో ఎదురుగా ఉన్న శత్రువుపై విజృంభింపలేక మంత్రౌషధులతో తిరుగలేని త్రాచుపాములవలె కోపోద్రిక్తతతో

అంతరంగంలో దహించుకు పోయాడు దిలీపుడు. ఈ స్థితికి ఆశ్చర్యచకితుడైన దిలీపునితో అంతకంటే ఆశ్చర్యంగా ఆ సింహం మనుష్యభాషలో “మహీపాలా! నీ ప్రయత్నం ఇక చాలు. ఒక వేళ నాపై నువ్వు అస్త్రం ప్రయోగించినా అది వ్యర్థమే అవుతుంది. ఎందుకంటే సమూలంగా వృక్షాల్ని పెకిలించే వాయువు సైతం పర్వతాన్నేమీ చేయలేదు కదా! నేను నికుంభుని మిత్రుడైన కుంభోదరుడనే శివ కింకరుణ్ణి. అదిగో! ఎదురుగా దేవదారు వృక్షం ఉంది చూచావా ! అది శివునికి పుత్ర తుల్యమైంది. అందుచేత పార్వతి దానికి హేమకుంభాలతో నీరుపోసి పెంచేది. ఒక సారి ఒక వన గజం ఆ వృక్షాన్నికి రాచుకోవటం వల్ల ఆ వృక్ష భాగం గీఱుకుపోయింది. దాంతో రాక్షసులచేత అస్త్రతాడితుడైన కుమార స్వామిని చూచి దుఃఖించినట్లుగా పార్వతి దుః ఖించింది. అప్పుడు శివుడు వన గజాలను భయపెడుతూ దగ్గఱకు వచ్చిన మృగాలనే ఆహారంగా తీసికొని సింహమై ఈ పర్వత గుహలో ఉండుమని నన్ను నియోగించాడు. ఇపుడు భోజన కాలానికి ఈ ధేనువు రావటం తటస్థించింది కనుక ఇందులో నీవు సిగ్గుపడవలసిందేమీలేదు. కనుక మఱలి పో. నీ గురు భక్తి చూపు. ఆయుధాలకు వశంకాక, రక్షింపదగింది రక్షణ నొందక పోవటం ఆయుధ ధారుల కీర్తి క్షయకరం కాదు.

సింహం పలుకుతున్న ఈ పలుకులను విన్న దిలీపుడు శివుని ప్రభావం వల్ల కలిగిన అస్త్ర వైఫల్యానికి చింతించ లేదు. అపుడాయన సింహంతో “ఓ మృగేంద్రమా ! స్తంభించిన పరాక్రమం కలవాణ్ణి కనుక నేను చెప్పేది హాస్యాస్పదం కావచ్చు. అయినా జీవుల అంతర్గతాన్ని తెలిసికోగలిగే వాడవు కనుక చెబుతున్నా. స్థావర జంగమాత్మకమైన ఈ సర్వ సృష్టిస్థితిలయాలకూ మూలమైన పరమశివుడు నాకెంతపూజ్యుడో



ఆహితాగ్ని వసిష్ఠ గురుపాదుని ఈ నందినీ ధేనువు కూడా అంతే పూజ్యురాలు. అందువల్ల ఈ గోరక్షణ నాకుపేక్షింప తగింది కాదు. కనుక నాశరీరంతో నీ ఆకలిని తీర్చుకొని సాయం సమయంలో తన తల్లి వచ్చి పాలిస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూసే లేత దూడ కల ఈ నందినీ ధేనువును విడిచిపెట్టు.” రాజు మాటలను విని, ఆ సింహం చిఱునవ్వుతో “ఏకచ్ఛత్రాధిపత్యంగా రాజ్యలక్ష్మిని వహిస్తూ నూత్నయౌవన సుందరమైన శరీరంతో శోభిస్తున్న నువ్వు స్వల్ప ఫలితానికి అధికమైన దానిని విడిచిపెట్టటానికి సిద్ధమౌతూ, యుక్తా యుక్త విచక్షణలేని మూఢునివలె కన్పిస్తున్నావు. ఎందుకంటే భూతదయతో నీ ప్రాణాలను వీడితే ఈ ఒక్క ఆవును మాత్రమే రక్షించిన వాడవౌతావు. ప్రభువైన నీవు బ్రతికి ఉంటే ప్రజాకోటిని నిరంతరం తండ్రివలె రక్షిస్తూ ఉంటావు. ఒక వేళ ఈ గోవు పట్ల జేరిగిన అపరాధానికి గురువు వసిష్ఠుడు శపిస్తాడని భయపడినట్లైతే ఇంతకంటే ఎక్కువ పాలనిచ్చే కోటి గోవులను ఆయనకు ఇచ్చి సంతృప్తుణ్ణి చేయవచ్చు. కనుక శుభపరంపరలను అనుభవించే బలిష్ఠమైన నీ దేహాన్ని రక్షించుకో అదే తగిన పని” అని దిలీపునికి చెబుతున్న సింహం మాటలు ఆ గుహలో ప్రతిధ్వనించాయి.

సింహం మాట్లాడటం పూర్తికావటంతో నందిని భయావిష్టురాలై చూచిన చూపులతో దయార్ద్రహృదయుడైన దిలీపుడా సింహంతో “ ‘క్షత్ర’ శబ్దానికి నాశం నుంచి రక్షించేది అని కదా అర్థం ! క్షత్రియుణ్ణైన నేను దానిని నిర్వహించ లేనినాడు రాజ్యంవల్ల కాని, నిందాభాజనమైన ప్రాణాలతో కాని ఏం ప్రయోజనం ? అనేక గోవుల నిచ్చి వసిష్ఠుని క్రోధం ఉపసంహరించ టమనేది అసంబద్ధమైన విషయం. ఎందుకంటే ఈ నందినీ ధేనువు తన తల్లి కామధేనువుతో తుల్యమైంది. ఈశ్వరానుగ్రహంతో నువ్వు

దీనిని పట్టేవేమో కాని లేకపోతే ఈ ధేనువును పట్టటం నీకు సాధ్యమయ్యే పనికాదు. నీ స్వామిదైన ఈ దేవదారువృక్షాన్ని నీవెలా రక్షిస్తున్నావో నా గురుపాదులైన వసిష్ఠుని ఈ కామధేనువును ఆ విధంగానే రక్షించేటం నా విధి. స్నేహం సంభాషణ పూర్వమైందంటారు మన మిద్దఱం ఇంతసేపు సంభాషించుకోవటం వల్ల మంచి మిత్రులమైనాం. కనుక నా శరీరాన్ని నీకాహారంగా స్వీకరించి ఈ ధేనువును విడచి పెట్టు. తద్వారా నా పాంచభౌతిక శరీరం పోయినా యశశ్శరీరం చిరస్థాయిగా ఉంటుంది". అనటంతోటే సింహం నందినీ ధేనువును విడిచింది. ఆ సింహ మహిమచే స్తంభించిన దిలీపుని శరీరావయాలు తిరిగి స్వాధీనంలోకి వచ్చాయి. దిలీపుడు తన శస్త్రాన్ని పక్కనపెట్టి తన శరీరాన్నంతటినీ కుంచించి ముద్దగా చేసి సింహం ఎదురుగా నిలిపేడు. ఇక సింహం విజృంభించి తనమీద పడుతుందనుకొంటూ మౌనంగా తలవంచుకొని ఉన్న దిలీపునిపై విద్యాధరులు పుష్పవృష్టి కురిపించారు. అమృతోపమానాలైన "వత్సా ! లే" అనే మాటలతో లేచిన దిలీపుడు క్షీరాన్ని స్రవించే నందినీ ధేనువునే చూచాడు కాని సింహం కనిపించేలేదు. అపుడా ధేనువు "ఓ సత్పురుషుడా ! నిన్ను పరీక్షించేటానికి నేను కల్పించిన మాయ ఇది. వసిష్ఠుని ప్రభావం వల్ల యమధర్మరాజు సైతం నన్నేమీ చేయలేనప్పుడిక హింస్ర మృగాల మాట చెప్పేదేముంది? నాయనా ! నీ గురుభక్తి, నాపట్ల నీకున్న విశ్వాసం నన్నెంతో అలరించాయి. నీకు వలసిన వరాల్ని కోరుకో. నేను పాలిచ్చే ఆవును మాత్రమే కాదు, కామితార్థాలను ప్రసాదించేదాన్ని." దిలీపుడు భక్తితో చేతులు జోడించి వంశ వివర్ధనుడు, అఖండ యశశ్శాలి అయిన కుమారుని సుదక్షిణయందను గ్రహింపుమని ప్రార్థించాడు. ధేనువు దిలీపుని ఇష్టార్థ సిద్ధికై ఒక దొప్పలో తన పాలను పిండి త్రాగుమని ఆదేశించింది. నందినీ



ధేనువనుగ్రహానికి పాత్రుడైనట్లు అతని ముఖమే చెబుతున్నా వసిష్ఠునికీ, తరువాత సుదక్షిణాదేవికి దిలీపుడు జేరిగిందంతా చెప్పేడు. ఆ మఱునాటి ప్రాతఃకాలంలో గోసేవ, భోజనాదుల్ని ముగించిన తరువాత వసిష్ఠుడు వారినాశీర్వదించి రాజధానికి బయలుదేరటానికి అనుమతించాడు. పిమ్మట దిలీపుడు అగ్నిహోత్రునికి, వసిష్ఠారుంధతీ దంపతులకు, వత్సయుక్తమైన నందినీ ధేనువుకూ ప్రదక్షిణం చేసి విశేష తేజశ్శాలియై ధర్మపత్నితో రాజధానికి చేరేడు.

లబ్ధమనోరథులై రాజధానికి తిరిగి వచ్చిన ఆ రాజదంపతులను పురజనులు ప్రశంసిస్తూ నగరాన్నంతా ధ్వజాలతో అలంకరించారు. పిదప సుదక్షిణాదేవి దిలీపుని కులవిస్తారకుడు, అధిక తేజోనిధి, దిక్పాలకుల తేజస్సుతో కూడిన పుత్రుడుకల గర్భాన్ని ధరించింది. ఇది ద్వితీయ సర్గలోని ఇతివృత్తం.

**"అథేప్సితం భర్తురుపస్థితోదయం**
**సఖీజనోద్వీక్షణ కౌముదీముఖమ్ ।**
**నిదానమిక్ష్వాకు కులస్య సంతతేః**
**సుదక్షిణా దౌహృద లక్షణం దధౌ ॥" (3-1)**

సుదక్షిణాదేవి భర్తకు ఇష్టార్థ సిద్ధిగా సఖీజనులకు కనుల పండువుగ ఇక్ష్వాకు కుల పరంపరను సూచించే గర్భ లక్షణాలను ధరించింద"ంటూ తృతీయసర్గ ప్రారంభమౌతుంది. ఈ సర్గలో శ్లోకాలన్నీ ఇలాగే వంశస్థ వృత్తంలో ఉంటాయి. చేక్కగా ఎక్కడికక్కడ శబ్దాలు విఱుగుతూ లయబద్ధంగా ఉండి చేదువటానికి ఉత్సాహానిస్తుందీ వృత్తం. కాళిదాసు రచన కూడా అర్థమౌతున్నట్లే ఉండటం మఱో విశేషం. సుదక్షిణాదేవికి సకల భూమండలాన్నేలే కొడుకు పుట్టబోతున్నాడనే

సూచనగా మట్టితినాలనే కోర్కె కలిగిందట! ఆమెకు రవంత విచారం కూడా లేకుండా ఉండాలని చెలికత్తెల ద్వారా ఆమె కోరికలను తెలిసికొంటూ అవి తక్షణమే తీరేటట్లు చేసేడు దిలీపుడు. ఎంత దుర్లభమైనది ఆమె కోరినా అది స్వర్గంలో ఉన్నా దాన్ని తీసికొని రావటం ఆయనకు అసాధ్యం కాదు. దినాలు గడుస్తున్న కొద్దీ ఆమె శరీరం అవయవ సౌష్ఠవాన్నొంది కుచాగ్రాలు నలుపెక్కేయి. హర్షాతిశయంతో ఆమెకు దిలీపుడు పుంసవన, సీమంతాది విధులను నిర్వర్తింపచేసేడు. ఇంతలో గ్రీష్మఋతువు వచ్చింది. గ్రీష్మాంతంలో వర్షోన్ముఖమైన మేఘంవలె ప్రసవవేదన నొందుతున్న రాణిని చూచి రాజు సంతోషభరితుడయ్యాడు. ఐదు గ్రహాలు అస్తంగత్వాది దోషరహితాలై పరమోచ్చస్థితిలో ఉండగా ఆ సుదక్షిణ పుత్రుని ప్రసవించింది.

ఆ సమయంలో దిక్కులు నిర్మలాలై సుఖావహమైన వాయువులు వీచేటం, ప్రదక్షిణాకార జ్వాలతో అగ్ని దేవుడు హవిస్సులను స్వీకరించేటం వంటి శుభశకునాలెన్నో పొడచూపేయి. రఘుమహారాజు తేజస్సుకి ఆ పురిటింటిలోని మణిదీపాలు వెలవెలబోయి చిత్రంలో గీసిన బొమ్మలవలె కన్పించాయట! దిలీప మహారాజు కొడుకు పుట్టేడన్న ఆనందంతో రాజచిహ్నాలైన ఛత్రం, రెండు చామరాలు – ఈ మూడు తప్ప మిగతా వన్నీ రాణివాస పరిచారికలకు దానంచేసేడట ! చంద్రోదయానికి సముద్రుడు పొంగినట్లు పొంగి దిలీపుడు పుత్రుని ముఖాన్ని ఱెప్పపాటు లేక చూస్తూ ఆనందాబ్ధిలో ఓలలాడేడు. తపోవనం నుంచి వసిష్ఠుడు వచ్చి జాతకర్మాది సంస్కారం జేరిపించాడు. ఆ మహర్షి మంత్ర ప్రభావంతో శిశువు సానపెట్టిన మణివలె ప్రకాశించాడు. మంగళవాద్యాలు, వారస్త్రీల నృత్యాలు రాజగృహంలోనే కాక ఆకాశపథంలోనూ విస్తరిల్లేయి.



సాధారణంగా ఇటువంటి ఆనంద వేళల్లో కారాగార వాసుల్ని విముక్తుల్ని చేస్తారు. అయితే దిలీపుని రాజ్యంలో కారాగార వాసులు లేకపోవటం వల్ల దిలీపుడే తనను తాను పితౄణ విముక్తిని పొందేడు. శబ్దార్థవేది అయిన దిలీపుడు ఈ అర్భకుడు శాస్త్ర పారంగతుడై, యుద్ధంలో శత్రువుల అంతాన్ని చూడగలడనే అర్థంలో ఆ శిశువుకు రఘువని నామకరణం చేసేడు.

రఘువు తండ్రిపోషణలో దినదిన ప్రవర్ధమానుడౌతున్నాడు. అయినా సుదక్షిణాదిలీపుల పరస్పరానురాగం అతిశయిస్తూనే ఉంది. క్రమంగా మాటలు నేర్వటం, వ్రేలు పట్టుకొని నడవటం, పెద్దలకు ప్రణామం ఆచరించేటం వంటివి నేరుస్తూ ఉంటే దిలీపుడుప్పొంగి పోయేవాడు. పుత్రుని తన అంకంపై కూర్చుండ పెట్టుకొని పుత్రగాత్ర పరిష్వంగ సుఖాన్ని సంపూర్ణంగా అరమోడ్పు కన్నులతో అనుభవించేవాడు. క్రమంగా ఉపనయన సంస్కారాన్నొంది రఘువు విద్యాభ్యాసంలోనూ గురువులకు ప్రియుడై విద్యల్లో మేటి అనిపించుకొన్నాడు. పరిపాలనకు అవసరమైన 'అన్వీక్షకీ', 'త్రయీ', 'వార్తా,' 'దండనీతి' అనే నాల్గు విద్యల్లోనూ ఆఱితేఱేడు. దిలీపుడు గోదాన కర్మను ఆ రఘువుచేత నిర్వర్తింపజేసి వివాహ మంగళాన్ని జేరిపించాడు. రాజకన్యలు రఘువును భర్తగా పొంది రోహిణ్యాది నక్షత్రాలు చంద్రుని పొంది ఆనందించినట్లానందించారు.

యౌవనావిర్భావంతో, శరీరదారుఢ్యంలో తండ్రిని మించిన కొడుకైనా రఘువు వినయంతో ఒదిగి ఉండేవాడు. సుస్వభావం, శాస్త్రాభ్యాసం, పరాక్రమాతిశయం కల రఘువుకు దిలీపుడు యౌవరాజ్య పట్టాభిషేకం చేసేడు. సమర్థుడైన రఘువును యాగాశ్వ రక్షకునిగా నియమించి తొంబది తొమ్మిది అశ్వమేధయాగాలను నిర్వహించాడు.

నూఱవ అశ్వమేధయాగానికి యథావిధిగా విడచిన అశ్వాన్ని రక్షకుల ఎదుటే దేవేంద్రుడదృశ్యుడై అపహరించాడు. ఈ సంఘటనకంతా నిర్విణ్ణులై ఉండగా వసిష్ఠ మహర్షి నందినీ ధేనువాప్రదేశానికి వచ్చింది. రఘు మహారాజు భక్తితో ఆ గోమూత్రంతో తన కళ్లు తుడుచుకొన్నాడు. తత్ప్రభావంతో సాధారణంగా మానవుల కళ్లకు కనబడనివి దృగ్గోచరమౌతాయి. ఇంకేముంది? దేవేంద్రుడు యాగాశ్వాన్ని తన రథానికి కట్టించి తీసుకొనివెళ్ళే దృశ్యం రఘువుకు గోచరమైంది.

రెప్పపాటులేని సహస్రనయనాలు పచ్చని గుఱ్ఱాలను చూచి అతణ్ణి దేవేంద్రునిగా గుర్తించి ఆకాశమంతా ప్రతిధ్వనించే ధీర గంభీర కంఠస్వరంతో రఘువు "ఓ దేవేంద్రా యజ్ఞహవిర్భాగాన్ని స్వీకరించేవారిలో ప్రథముడవని నిన్ను కీర్తిస్తారు కదా! అట్టి నువ్వే నా తండ్రి యాగాశ్వాన్ని హరించి ఆయన యజ్ఞానికి విఘ్నాన్నెందుకు కల్పిస్తున్నావు? నీవీ యాగాశ్వాన్ని విడిచి పెట్టు. సత్పథగాములకిట్టి ప్రవర్తన యోగ్యమైంది కాదు". ఇంత నిర్భయంగా హితవు చెబుతున్న రఘువును చూచి ఆశ్చర్యంతో దేవేంద్రుడు "మీ తండ్రి ఈ యాగంతో నా కీర్తిని హరించేటానికి ప్రయత్నిస్తున్నాడు కనుక అతని యజ్ఞాశ్వాన్ని నేను హరించాను. మునులు శ్రీమహావిష్ణువును పురుషోత్తముడని, తినేత్రుని మహేశ్వరుడని ఎలా కీర్తిస్తారో అలాగే నన్ను శతక్రతునిగా సంభావిస్తారు. కనుక ఈ మూడు నామాలకూ మేము ముగ్గురమే కాక ఇతరులెవ్వరూ అర్హులు కారు. కనుక వృథాప్రయాసను వీడి గృహోన్ముఖుడవుకా. లేదా పూర్వం తండ్రి యాగాశ్వాన్ని తీసికొని రావటానికి కపిల మహర్షి వద్దకు వెళ్ళిన సగర చక్రవర్తి పుత్రులకేగతి పట్టిందో నీకూ అదే ప్రాప్తిస్తుంది." రఘువు పకాలున నవ్వి నిర్భయంగా "దేవేంద్రా! ఈ యాగాశ్వాన్ని తీసుకొని వెళ్ళాలనేదే నీ



నిశ్చయమైతే శస్త్రధారివికా. ఈ రఘువును జయించేనిదే నీ కది సాధ్యం కాదుకదా!"

*"తతఃప్రహస్యాభయః పురందరం*
*పునర్బభాషే తురగస్య రక్షితా।*
*గృహాణ శస్త్రం యది సర్గ ఏషతే*
*న ఖల్వనిర్జిత్య రఘుం కృతీ భవాన్ ॥"* *(3 – 51)*

అంటూ ధనుర్ధారి అయిన దేవేంద్రునికభిముఖుడై నిలిచాడు. కుపితుడైన ఇంద్రుడు తన వింటిలో బాణాన్ని సంధించాడు. పూర్వం రాక్షసుల రక్తాన్నే చవిచూచిన ఇంద్రుడు ప్రయోగించిన బాణం మానవరక్తాన్ని ఆస్వాదించేలనే కుతూహలంతో రఘువు భుజ మధ్యంలో ప్రవేశించి రక్తాన్ని త్రాగజొచ్చింది. రఘువు తిరిగి బాణాన్ని సంధించి ఇంద్రుని భుజంపై నాటి దేవేంద్రుని రథంపై ఉన్న ధ్వజాన్ని ధ్వంసం చేసేడు. దాంతో తన రాజ్యలక్ష్మి కేశాలను ఖండించినట్లు భావించి ఇంద్రుడు ఆగ్ర హోదగ్రుడయ్యాడు. పరస్పర విజిగీషతో వారిద్దఱూ నాగ, గారుడాస్త్రాల్ని ప్రయోగించుకొన్నారు. దేవేంద్రుడు నిర్విరామంగా ప్రయోగించిన బాణాలు మేఘోదకాలు పిడుగును ఏమీ చేయలేని విధంగా నిరర్థకమైనాయి. ఇంద్రుని వింటిత్రాటిని రఘువు ఒక అర్ధచంద్రాకార బాణంతో ఛేదించాడు. దేవేంద్రుడాధనువును విడిచి మితిమీఱిన కోపంతో రఘువును వధించాలని పూర్వం పర్వతాల ఱెక్కలను ఛేదించిన వజ్రాయుధాన్ని రఘువుపై ప్రయోగించాడు. ఆ వజ్రాయుధ ప్రహారానికి భూమిపై పడిన రఘువును చూచి సైనికులు శోకిస్తూ ఉండగా క్షణకాలంలో లబ్ధసంజ్ఞుడై లేచి నిలబడటంతో సైనికులు సింహనాదం కావించారు. ఈ విధంగా తనకజేయుడైన రఘువును చూచి దేవేంద్రుడు "పర్వతాలనే ఛేదించిన

ఈ వజ్రాయుధ ప్రహారాన్ని తట్టుకొన్నవాడవు నీవొక్కడవే. అందుకు నేనెంతో సంతోషిస్తున్నా”నని శ్లాఘించి అశ్వాన్నికాక మఱేదైనా కోరుకో ఇస్తా”నన్నాడు “అయితే నా తండ్రిఅశ్వమేధయాగానికి సంపూర్ణఫలాన్ని ప్రసాదించు” “ఈ విషయాన్ని నీ అనుచరులచేతనే నా తండ్రికి తెలుపు” “అట్లే”. రఘువు అశ్వహీనుడై అసంతృప్తితోనే తండ్రి యజ్ఞశాలకు వెళ్ళేడు. ఇంద్రుని వార్తాహరుల ద్వారా ఈ వార్త విన్న దిలీపుడు ఆనందభరితుడై వజ్రాయుధంచే క్షతగాత్రుడైన కుమారుని దేహాన్ని ఆప్యాయంగా తన చేతులతో నిమిరి రఘువును ఎంతో ప్రశంసించాడు. అనంతరం దిలీపమహారాజు విషయ వ్యావృత్తుడై యౌవన వంతుడైన పుత్రుడు రఘువునకు శాస్త్రోక్తంగా రాజచిహ్నమైన శ్వేతచ్ఛత్రాన్నిచ్చి భార్యాద్వితీయుడై ఇక్ష్వాకురాజుల సంప్రదాయానుసారం వానప్రస్థాశ్రమ నిర్వహణకై తపోవనానికి పయనమైపోయాడు. ఈ విధంగా తృతీయసర్గ సమాప్తమౌతుంది.

*“సరాజ్యం గురుణాదత్తం*
*ప్రతిపద్యాధికం బభౌ।*
*దినాన్తే నిహితం తేజః*
*సవిత్రేవ హుతాశనః ॥”* (4 – 1)

తండ్రి ఇచ్చిన రాజ్యంతో రఘు మహారాజు సాయంకాలంలో సూర్యుడు తన కిరణాలను నిక్షిప్త పఱచిన అగ్నిహోత్రునివలె అధిక తేజస్సుతో ప్రకాశించాడని చతుర్థ సర్గ ప్రారంభమౌతుంది. 88 శ్లోకాలతో ఉన్న ఈ సర్గలో రఘు మహారాజు భూమిపైనున్న రాజుల్ని జయించి జైత్రయాత్రానంతరం విశ్వజిద్యాగం చేసి తన సంపద సర్వస్వాన్ని అర్థుల కర్పించిన విషయం వర్ణితమైంది.



రఘువు పట్టాభిషిక్తుడైనాడన్న వార్త వినటంతో అంతవఱకు అణచుకొన్న శత్రురాజుల కోపం ఒక్కసారిగా భగ్గుమంది. రాష్ట్రప్రజ రఘువు అభ్యుదయాన్ని చూచి ప్రమోదభరితులయ్యారు.

రఘుమహారాజు పాలన ఎంతో ధార్మికంగా ఉండటంవల్ల ప్రకృతి కూడా అనుకూలమై నిత్యనూతనత్వంతో అతిశయించింది. సూర్యచంద్రులేవిధంగా ప్రతాప ప్రహ్లాదనత్వ గుణాలకన్వర్థులైనారో అలాగే రఘువు తన ప్రకృతులను రంజింపచేయటంలో అన్వర్థుడైనాడు. అందుకే పల్లీయులు సైతం బాల్యాదిగా రఘుమహారాజు యశస్సును చెఱకు చెట్ల నీడలో కూర్చుండి వరిపైర్లను రక్షిస్తున్న స్త్రీలు పాటలుగా పాడుకొంటూ ఉండేవారట !

*“ఇక్షుచ్ఛాయానిషాదిన్యః తస్య గోప్తుర్గుణోదయం।*
*ఆకుమారకథోద్ఘాతం శాలిగోప్యో జగుర్యశః ॥”* (4 – 20)

ఇంతలో ఆసన్నమైన శరదృతువు రఘుమహారాజులో యుద్ధోత్సాహాన్ని రగుల్కొలిపి జైత్రయాత్రకు పురికొల్పింది. దుర్గ రక్షణకై తగిన బలాన్ని ఉంచి శాంతి కర్మలు చేయించి, బ్రాహ్మణాశీర్వాదం స్వీకరించి దిగ్విజయానికై రఘువు బయలుదేరేడు. పట్టణంలోని వృద్ధస్త్రీలు ఆయనపై లాజలను చేల్లేరు. రఘుమహారాజు శుభశకునాలతో దిగ్విజయానికై మొదటగా తూర్పుదిక్కుకు వెళ్ళేడు. వివిధ రాజ్యాలను జయిస్తూ ఆ రాజుల నుండి కప్పాలు గ్రహిస్తూ తాటిచెట్లతో ఉన్న తూర్పు సముద్ర తీరాన్ని చేరేడు. తనకు లోబడని రాజులను జయిస్తూ సాగిపోతుంటే సింహదేశపు ప్రభువులతనికి నమ్రులై తమ ప్రాణాల్ని, రాజ్యాల్నీ రక్షించుకొన్నారు. ఆ పిమ్మట ఓడల సహాయంతో గంగానదిని దాటి వచ్చి ఎదిరించిన వంగాధీశుల నోడించి నదీ మధ్యంలో జయస్తంభాలు నాటించాడు. వంగరాజుల

నుండి విశేష ధనరాశులను గ్రహించాడు. ఆ తరువాత కపిశా నదిని దాటి ఉత్కళదేశపురాజు మార్గదర్శి కాగా కళింగ దేశాభిముఖుడై తరలేడు. మహేంద్ర పర్వతాగ్రంపై విజృంభించాడు. అపార గజసేనాయుక్తుడైన కళింగ ప్రభువు రఘువుపై తీవ్రాస్త్రాలు ప్రయోగించాడు. రఘువు వాటిని తుత్తునియలు కావించేటంతో ఆ రాజు శరణునొందటం వల్ల వానిని ఆ రాజ్యంలోనే నిలిపి కళింగరాజు సంపదలను గ్రహించి పురోగమించాడు.

ఈ విధంగా ప్రాచీన దిక్కును జయించి అగస్త్యమహర్షి ఉండే దక్షిణ దిక్కుకు మళలేడు. కావేరీ నదిలో స్నానమాడి చాలా దూరం ప్రయాణించి మలయాచల ప్రాంతం చేరేడు. అచేట హారీత పక్షులున్నాయి. ఆ మహారాజు అశ్వసంఘట్టనలచే పైకి లేచిన మిరియకాయపు వృక్షాలు, ఏలకుల చూర్ణం ఘ్రూణ తర్పణం కావించింది. దక్షిణాయనంలో రవి కాంతులు మందగించినా రఘుమహారాజు ప్రతాపాగ్ని భరించేలేని పాండ్యభూపతులు తామ్రపర్ణీనది సముద్రంలో సంగమించే ప్రదేశంలో సంపాదించిన ముత్యాల్ని రఘువుకు సమర్పించారు. క్రమంగా అనాయాసంగా మురళానదిని దాటిన తరువాత కేరళదేశం కూడా రఘువు పాదాక్రాంతమైంది. నిరాఘాటంగా త్రికూట పర్వతం వఱకు సాగి, సముద్రతీరాన్ననుసరించి పురోగమిస్తుంటే పారశీకపు రాజులతో భయంకరమైన యుద్ధం ప్రవర్తిల్లింది. అశ్వసేనలతో కూడి యవనులతో అతిరభసంగా యుద్ధం చేసి భల్లాలతో యవన వీరుల తలలు తునిమి భూమి కనబడకుండా కప్పివేసేడు. చావగా మిగిలిన వారు తమ ఉష్ణీషాలను తీసి రఘుమహారాజును శరణుజొచ్చారు. వారికి అభయమిచ్చి రఘువు పంపివేసేడు. రఘుమహారాజు సైనికులు ద్రాక్షతోటల్లో పరుపులు పఱచుకొని తనివితీరా ద్రాక్షాసవం ఆస్వాదించి యుద్ధశ్రమను పోగొట్టుకొన్నారు.



రఘువిక ఉత్తర దిశగా తన సేనలను నడిపి సింధునదీ తీరంలో అశ్వాల ఆయాసాన్ని తీర్చి అచటి హూణప్రభువులను జయించాడు. రఘువు పరాక్రమధాటికాగలేక కాంభోజ రాజులు ఆయనకు విధేయులై ఉత్తమాశ్వాలను, ధనరాశులను సమర్పించారు. పిదప అశ్వాలతో హిమవత్పర్వతాన్ని అధిరోహించాడు. మార్గంలో భూర్జ పత్ర వృక్షాలు, మర్మర, వేణుధ్వనులు, గంగానదీ సంబంధమైన శీతల తుంపురులు ఆ రఘువుకు, సేనలకు ఎంతో హాయిని చేకూర్చాయి. కస్తూరిమృగాలు దొర్లిన సురపున్నాగ వృక్షచ్ఛాయలో ఉన్న శిలలపై విశ్రాంతినొందిన సైనికులకా సుగంధాలు ఘ్రాణతర్పణ కావించాయి. ఆ హిమపర్వతంలో పార్వతేయులతో జేరిగిన యుద్ధంలో బాణాలు, భిండివాలాలు, పాషాణాల సంఘర్షణలో నిప్పుకణాలెగసి ఆ దృశ్యం అత్యంత భయానకమైంది. పార్వతేయులపై రఘు మహారాజు సాధించిన విజయాన్ని కిన్నరులు ప్రశంసిస్తూ గానం చేసేరు. పార్వతీయులు సమర్పించిన అమోఘ వస్తువులను రఘు మహారాజు కానుకలుగా స్వీకరించాడు. అచటి అనర్ఘ వస్తువుల ఉనికిని రఘువు, అమోఘమైన అతని పరాక్రమాన్ని హిమవంతుడు పరస్పరం తెలిసికొన్నారు. పిదప కైలాస పర్వతాన్ని పూర్వం రావణాసురుడు కదిలించినందువల్ల దాని జోలికి పోక 'లౌహిత్య'మనే పేరుకల నదిని దాటటంతో ప్రాగ్జ్యోతిష నరపతి భయావిష్టుడైనాడు. ఆ తరువాత రఘువు కామరూపాన్ని సమీపించేటంతో కామరూపాధీశుడు పూర్వం ఏ గజబలంతో శత్రువులను జయించాడో ఆ గజాలన్నింటిని రఘువుకు కానుక పెట్టేడు. అంతే కాక కామరూపాధిపతి రఘువును స్వర్ణసింహాసనంపై ఉపవిష్టుని చేసి రత్నాలతో ఆయున పాదాల్ని పూజించాడు.

ఈ విధంగా సర్వదిగ్విజయాన్నొంది ఏకచ్ఛత్రాధిపతియైన రఘువు, తన రాజధానికి మఱలేడు. అపుడు –

*"స విశ్వజితమాజహ్రే యజ్ఞం సర్వస్వదక్షిణం ।*
*ఆదానం హి విసర్గాయ సతాం వారిముచామివ ॥" (4 – 86)*

విశ్వజిద్యాగం చేసి తాను పొందిన ధనాన్ని సర్వం విప్రులకు దక్షిణగా ఇచ్చాడు. సత్పురుషుల సంపాదన మేఘాలవలె సత్పాత్రదానం కొఱకే కదా అనే అర్థాంతరన్యాసాలంకారంలో సమర్థిస్తున్నాడు కాళిదాసు. ఆ విశ్వజిద్యాగానికి రఘువు జయించిన రాజులంతావచ్చారు. పూర్వం ఆయనచేతిలో ఓడిపోయామన్న చింత తీరేటట్లు వారికి ఘనమైన కానుకలొసగి వారివారి దేశాలకు పంపివేసేడు. ఆ ప్రభువులు రఘువుకు భక్తిపూర్వక పాద ప్రణామాలనా చరించి వారివారి దేశాలకు మఱలి పోయారు. ఇక్కడితో చతుర్థసర్గ పూర్తై పంచమసర్గ ప్రారంభమౌతుంది.

విశ్వజిద్యాగంలో సర్వస్వం నిశ్శేషంగా దానం చేసిన రఘు మహారాజు వద్దకు 'వరతంతు' శిష్యుడైన 'కౌత్స'డనే వటుడు గురుదక్షిణనర్థించేటానికి వచ్చాడు. వచ్చిన విప్రునికి కాంచన ఘటంతో అర్ఘ్యాన్ని సమర్పించే రఘువు ఇప్పుడు సువర్ణమేమీ లేకపోవటంవల్ల నీటితో కూడిన మట్టి పాత్రను చేబూని ఎదురు వెళ్ళేడట ! ఆ సమయంలో రఘుమహారాజు మనోభావాన్ని పాఠకుడూహించుకొని కరుణ రసానుభూతి నొందేటట్లు కాళిదాసు ఎంత చేక్కని శ్లోకం వ్రాసేడో చూడండి !

**"స మృణ్మయే వీత హిరణ్మయత్వాత్ పాత్రే నిధాయార్ఘ్యమనర్ఘశీలః ।**
**శ్రుతప్రకాశం యశసా ప్రకాశః ప్రత్యుజ్జగామాతిథిమాతిథేయః ॥" (5 – 2)**

శ్లోకంలో ప్రతిపదార్థాన్ని భావించి సన్నివేశాన్ని మనః ఫలకంపై చిత్రించుకోగలిగిన గాఢ భావనాశీలురకే రసానుభూతి. అనర్ఘశీలః = అమూల్యమైన స్వభావం కలిగి; యశసా = కీర్తిచేత; ప్రకాశః = శోభిల్లుతున్న; ఆతిథేయః = అతిథి పూజాతత్పరుడైన; సః = ఆ రఘు మహారాజు; వీతహిరణ్మయత్వాత్ = బంగారు పాత్రలు లేనందువల్ల (అన్నీ దానం చేయుటంవల్ల) మృట్+మయే – మృణ్మయే పాత్రే =మట్టిపాత్రలో; అర్ఘ్యం, నిధాయ = జలాది పూజాద్రవ్యాలను; నిధాయ = ఉంచి; శ్రుత ప్రకాశం = శాస్త్రాధ్యయనంతో వెలుగుతున్న; అతిథిమ్ = అతిథిని (కౌత్సుని) ప్రతి+ఉత్+జగామ = ప్రత్యుజ్జగామ = (స్వాగతం పలకటానికి) ఎదురువెళ్ళేడు. విధివిహితంగా కౌత్సుని పూజించి ఆసీనుని చేసి, మానధనుడు, మానవాధీశుడైన రఘువు కృతాంజలియై –

"మీ గురుపాదులు కుశలురే కదా ! వారికి కాయికములైన ఉపవాసాది వ్రతాలు; వాగ్రూపమైన వేదాధ్యయనాదులు; మనస్సంబంధి గాయత్రి జపాదులు – ఈ విధంగా మనసా వాచా కర్మణా చేసే త్రివిధమైన తపస్సు, దేవేంద్రుడు కల్పించే అంతరాయాలే మీ లేక నిరాఘాటంగా ప్రవర్తిల్లుతున్నాయి కదా!" ఆశ్రమ వృక్షాలకు పెనుగాలివంటి ఉపద్రవాలేమీ లేక చేక్కగా వర్ధిల్లుతున్నాయి కదా ! విద్యాభ్యాసం సక్రమంగా పూర్తినొంది మీ గురువుగారిచే గృహస్థాశ్రమ స్వీకారానికై అనుమతి నొందేరా ? ఇంతకీ మీరు వచ్చిన పనేమిటి ? గుర్వాజ్ఞతో ఇటకు వేంచేసారా ? లేక మీ వ్యక్తిగత ప్రయోజనానికై వచ్చారా ? ఏమైనా మీ ఆజ్ఞను పాటించేటంలో ఉత్సుకుణ్ణై ఉన్నాను".

రఘుమహారాజు చేతపట్టిన మృణ్మయపాత్రతోనే ఆ రాజప్పటి స్థితిని గ్రహించి, ఔదార్యంతో కూడిన ఆయన మాటలు విని, తన మనోరథం తీరదని నిరాశ చేసికొని ఇలా అన్నాడు. "మహారాజా ! అంతా కుశలమే. మీరు ప్రభువులై ఉంటూ ఉంటే ప్రజలకు అశుభమనేది ఎలా ఉంటుంది?

అర్థుల పట్ల భక్తిని చూపటం మీ వంశాచారం. ఆ విషయంలో మీరు మీ పూర్వుల కంటె అధికులు. అయితే సమయాతీతమై వచ్చినందుకే నాచింత. సార్వభౌముడవై సర్వస్వం అర్థులకు సమర్పించి నిర్ధనుడవై కన్పిస్తున్నావు. కనుక నేను నా గురువుకు సమర్పిం చేవలసిన గురుదక్షిణకై మఱొక దాతను ఆశ్రయిస్తాను. నీకు శుభమగుగాక !" అని అ చేటినుండి బయలుదేరబోతున్న కౌత్సుని రఘుమహారాజు ఆపి "ఓ విద్వన్మణీ ! ఇంతకీ నీవు సమర్పిం చేవలసిన గురుదక్షిణ ఏమాత్రం ?" "నా విద్యాభ్యాసం పూర్తైన తర్వాత నేను నాగురువును గురుదక్షిణ కోరుకోమని అభ్యర్థించాను. ఆయన అంతవఱకు నే నొనర్చిన శుశ్రూషే చాలునన్నారు. అయినా నే నాయనను నిర్బంధిం చేటంతో ఆయనకు కోపం వచ్చి నేనెంతో దరిద్రుణ్ణని తెలిసీ "అయితే నువ్వు అభ్యసించిన చతుర్దశ విద్యలకు (ఋగ్యజుస్సామాథర్వాలనే నాలుగు వేదాలు; శిక్ష, వ్యాకరణ, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం అనే ఆఱు వేదాంగాలు; మీమాంస, తర్కం, పురాణం, ధర్మశాస్త్రం – ఇవి పదునాలుగు విద్యలుగా ప్రసిద్ధం) ఒకొక్క విద్యకు కోటి చొప్పున పదునాల్గు కోట్ల సువర్ణాలు తీసికొని రమ్మ"న్నారు. సంపదంతా తొలగి నామకః ప్రభుశబ్దాన్ని కలిగి ఉన్న మిమ్ము అధికమైన ధనం యాచిం చేటానికి నామనస్సొప్పటం లేదు." "గురుదక్షిణను యాచిం చేటానికి వచ్చి అలబ్ధకాముడై ఒక విద్వాంసుడు మఱొక దాతను వెతుక్కుంటూ వెళ్ళేడన్న అపకీర్తి నాకు రానీయకు. నా త్రేతాగ్ని శాలలో నాల్గవ అగ్నివంటి నీవు దయతో రెండు మూడు దినాలు వసించు. నీ ఇష్టార్థ సిద్ధికోసం ప్రయత్నిస్తాను." కౌత్సుడంగీకరించాడు. వసిష్ఠుని మంత్రోదక ప్రోక్షణ వలన రఘువు రథం సముద్రాకాశ పర్వతాల్లో మేఘంవలె ప్రయాణించే శక్తి కలది. అందువల్ల ఆ సాయంతన వేళ పరిశు ద్ధుడై కుబేరుని తన సామంత రాజుగా సంభావించి ఆయునను



జయిం చేటానికి తగిన శస్త్రాస్త్రాలను రథంలో ఉంచి అందులో శయనించాడు. ప్రాతః కాలంలో కుబేరునిపై జైత్రయాత్రకు బయలుదేర నిశ్చయించిన రఘుమహారాజు వద్దకు కోశాగార రక్షకులు సమీపించి కోశాగారంలో ఆశ్చర్యంగా ఆకాశంనుంచి కనకవర్షం కురిసిందనే వార్తను నివేదించారు. మేరుపర్వత శృంగం వలె ఉన్న ఆ సమస్త హేమరాశిని రఘువు కౌత్సునికి ఇచ్చాడు. గురుదక్షిణకంటె అధిక ధనాన్ని కోరని యాచకుడైన కౌత్సుని, కోరిన దానికంటె అధిక ద్రవ్యాన్నిచ్చిన రఘుమహారాజు – ఈ ఇద్దఱినీ అయోధ్యావాసులంతా అభినందించారు. ప్రీతుడైన కౌత్సమహర్షి ఆ ద్రవ్యాన్ని వందలకొలది ఒంటెల మీద, ఆడుగుఱ్ఱాలపైన ఉంచి వరతంతు ఆశ్రమానికి పంపుతూ నమ్రుడైన రఘువు శరీరాన్ని మృదువుగా స్పృశిస్తూ "సాధారణంగా ధార్మికుడైన ప్రభువుకు వసుంధర ఇష్టార్థాలను సమకూర్చుతుంది. నీకు ఆకాశం కూడా అర్థాన్ని వర్షించిందంటే నీ మహత్త్వం అద్భుతం. నీ తండ్రికి అనురూపుడవైన నీ వలె నీ కనురూపుడయిన పుత్రుడు నీకు కలుగు గాక !" అని ఆశీర్వదించి కౌత్సుడు తన గురువు వద్దకు వెడలిపోయాడు. ఆ మహర్షి ఆశీః ప్రభావంతో రఘువుకు కుమారోదయమైంది.

ఒకనాటి బ్రాహ్మీముహూర్తంలో రఘుమహారాజు పట్టమహిషి కుమారస్వామితో తుల్యుడైన కుమారుని కన్నది. బ్రాహ్మీముహుర్తంలో జనించాడు కనుక ఆ బాలునికి 'అజు'డని నామకరణం చేసేరు. రూప, శౌర్య స్వభావాల్లో తండ్రి వంటి ఔన్నత్యాన్ని పొందిన అజుడు ఒక దీపంతో వెలిగించిన మఱొక దీపం అధిక ప్రకాశంతో వెలిగినట్లే వెలిగేడు. అజుడు కూడ గురువువల్ల సకల విద్యలనభ్యసించి యౌవన దశను పొందటంతో యౌవరాజ్యాధిపత్యానికి తగినవాడైనాడు. ఆ పిమ్మట విదర్భ ప్రభువు

భోజరాజు తన చెల్లెలు ఇందుమతీ దేవి వివాహార్థం స్వయంవరం చాటించి అజుని ఉద్దేశించి రఘుమహారాజుకు దూతద్వారా ఆహ్వానం పంపేడు. ఆ ఆహ్వానాన్ని పురస్కరించుకొని రఘువు అజుని తగుసైన్యంతో విదర్భకు పంపేడు. భోజమహారాజు మార్గంలో అజునికి రాజోపచారాల్ని కల్పించాడు. నర్మదానదీ తీరంలో అజమహారాజు విశ్రామార్థం తన సేనల్ని నిలిపేడు. ఇంతలో ఒక అడవి ఏనుగు నర్మదా నదిలోనుండి వచ్చి అజుని సేనా నివహాన్ని చిందరవందర చేయదొడగింది. యుద్ధంలో తప్ప వన్యద్విపాన్ని చంపకూడదనే శాస్త్రపరిజ్ఞాత అయిన అజుడు ఆ ఏనుగును వెనుకకు మళ్ళించేటానికి తన ధనువును ఎక్కువగా లాగకుండా దాని కుంభస్థలంపై ఒక బాణాన్ని ప్రయోగించాడు. ఆ అజుని బాణం తగలటంతోటే చూపరులు ఆశ్చర్యచకితులయ్యేట్లు ఆ ఏనుగు తన రూపాన్ని వీడి ఒక దివ్య పురుష రూపాన్ని పొంది అంతరిక్షంలో నిలచింది. ఆ దివ్యపురుషుడు తన ప్రభావంతో కల్పవృక్ష ప్రసూనాల్ని అజునిపై చల్లి "అజ మహారాజా! నేను ప్రియదర్శుడనే గంధర్వ రాకుమారుణ్ణి. అమితమైన గర్వంతో ఉండే నన్ను మతంగముని గజ జన్మమెత్తుమని శపించాడు. నేను దీనుణ్ణై శాపాంతాన్ని అనుగ్రహింపుమని వేడగా ప్రసన్నుడై ఇక్ష్వాకు వంశోద్భవుడైన అజుని బాణం నీ కుంభస్థలానికి ఎపుడు తగులుతుందో అపుడు నీ స్వస్వరూపాన్ని పొందుతావని దయతో పలికేడు. ఎంతో కాలంగా నీ కోసవే నిరీక్షిస్తున్న నాకు నీ దయవలన నేడు శాపవిమోచనమైంది. నువ్వు నాకు చేసిన మేలుకు కృతజ్ఞతగా నీకు సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగోపసంహార మంత్రాత్మకంగా ఉపదేశిస్తాను. కనుక నీ బాణంతో తాడితుడనైన నా నుండి ప్రత్యుపకృతిని ఎలా పొందుతానని సందేహించేక స్వీకరించు" మన్నాడు. వివిధాస్త్రవేత్త అయిన



అజుడు నర్మదానదీ జలాలతో ఆచమించి ఉదఙ్ముఖుడై శాపవిముక్తి నొందిన ప్రియంవదుని నుండి సమ్మోహనాస్త్రాన్ని స్వీకరించాడు. తరువాత గంధర్వుడు కుబేరోద్యానవనానికి, అజుడు స్వయంవరార్థం విదర్భకు తరలి వెళ్ళేరు.

నగర సమీపంలో ఉన్న అజునికి విదర్భాధీశుడు సంతోషంతో స్వాగతం పలికి సత్కారపూర్వకంగా విడిది గృహానికి తోడ్కొని పోయాడు. కన్యారత్నమైన ఇందుమతి తనను వరిస్తుందా లేదా అనే చింతతో చాలా సేపటికి కాని అజునికి నిద్రపట్టలేదు. ఆ రాత్రి గడచిన తరువాత ప్రభాతవేళ వందిపుత్రులు చేసిన స్తుతుల్ని కాళిదాసు తొమ్మిది శ్లోకాల్లో చెప్పటం వల్ల ఆనాటి ఆచారాలు మనకు సాక్షాత్కరిస్తాయి. వందులు చేసిన స్తుతులు –

*"రాత్రిర్గతా మతిమతాంవర ముఞ్చ శయ్యాం*
*ధాత్రాద్విధైవ నను ధూర్జగతో విభక్తా ।*
*తామేకత స్తవ బిభర్తి గురుర్వినిద్రః*
*తస్యా భవా నపర ధుర్య పదావలమ్బీ ॥"* *(5 – 66)*

అనే శ్లోకంతో ఆరంభమౌతాయి. "ఓ ధీమంతుడా ! రాత్రి గడిచింది. కనుక పాన్పుపైనుండి లే. బ్రహ్మ రాజ్యభారాన్ని ద్విధా విభజించి మీ తండ్రి కొడుకులపైనే ఉంచాడు. ఆ జగద్భారాన్ని ఒక ప్రక్క నీ తండ్రి నిర్వహిస్తూనే ఉన్నాడు. మీరూ మీ పానుపును విడవండి." ఇత్యాదిగా సాగుతున్న స్తుతులతో అజుడు నిద్ర మేల్కొన్నాడు. ఇలా పంచమ సర్గ పూర్తౌతుంది.

86 శ్లోకాలతో ఉన్న షష్ఠ సర్గ అంతా ఇందుమతీ స్వయంవరానికే పరిమితమైంది. సమస్తరాజ సమక్షంలో ఇందుమతి అజుని వరించేటం ఇందులోని ఇతి వృత్తం.

స్వయంవర మంటపంలో ఆహూతులైన రాజన్యవరులకు ప్రత్యేక స్థానాలుంటాయి. ఎవరి ఆసనంలో వారు ఆసీనులై ఉండాలి. వివిధ దేశాగత

నృపాలురంతా ప్రత్యేక అలంకారాలతో శోభితులై ఉన్నారు. పూర్వం త్రినేత్రుడు మన్మథుని దహించినప్పుడు రతీదేవి ప్రార్థనతో తిరిగి స్వస్వరూపం పొందిన మన్మథుని వలె ఉన్న అజుని చూచి అచటి రాజులంతా ఇందుమతిపై ఆశ వదులు కొన్నారు. వారిలో అజుడు కల్పవృక్షాల్లో పారిజాతం వలె ప్రకాశిస్తున్నాడు. వంది మాగధులు సూర్యచంద్ర వంశీయులైన ఆ రాజుల వంశావళిని ప్రస్తుతిస్తున్నారు. శంఖధ్వానాలు, మంగళవాద్యాలు దిగంతాలకు వ్యాపించాయి. ఇంతలో వివాహోచిత వేషంతో పల్లకిపై ఇందుమతి అచేటికి చేరింది.

శతాధికనేత్రాలతో చూడదగిన ఆ ఇందుమతి సౌందర్యంపైనే రాజన్యుల దృక్కులు, మనస్సులూ లగ్నమైనాయి. ఆసనాల్లో ఉన్నది కేవలం వారి శరీరాలే. రాజులు ఒకొక్కచేష్టతో ఇందుమతి దృష్టిని ఆకర్షించ చేటానికి యథాశక్తి ప్రయత్నిస్తున్నారు. ఇందుమతి ప్రక్కనుండి రాజులను పరిచేయం చేసే సునంద అనే పరిచారిక ఆమెను మొదట మగధరాజు వద్దకు తీసికొని వెళ్ళింది. "పరంతపుడనే ఈ మగధ మహారాజు అన్వర్థ నామధేయుడు. శరణాగత త్రాణ పరాయణుడు, ప్రజారంజకుడు. నక్షత సమూహంలో ప్రకాశించే చంద్రుని వలె భూపాలుర సమూహంలో ఇతడు ప్రకాశిస్తున్నాడు. నిరంతర యజ్ఞ నిర్వహణతో దేవేంద్రుడితనివద్దే ఉపస్థితుడై ఉండగా శచీదేవి ప్రోషితభర్తృకయై అలంకార విహీనమై ఉంది. నీవీతని వివాహమాడితే పాటలీ పుత్రపు రాజసౌధ గవాక్షాల చెంత కూర్చుండి నీ సౌందర్య వీక్షణంతో తత్పురాంగనల నేత్రాలకు సాఫల్యం చేకూర్చినదానవౌతావు" ఆతనికి ఇందుమతి నమస్కరించి ముందుకు సాగింది. సునంద మఱొక రాజు ముందు నిలిపి – "ఈ వంగదేశాధీశుడు దేవతా స్త్రీలు కోరే యౌవన సంపత్తితో, శిక్షితులైన గజసేనచే క్షితిపై



దేవేంద్రునిగ వర్థిల్లుతున్నాడు. శత్రు సంహరణ దక్షుడు. పైగా లక్ష్మీసరస్వతులు ఈ అంగదేశాధీశునితో నిత్యసాన్నిహిత్యాన్ని భజిస్తున్నారు కనుక నీవు మూడవ దానివిగా ఉండ తగినదానవు." "ముందుకు సాగు" మన్న ఇందుమతి ఆజ్ఞను చేకొని ఆ తరువాత ఉపవిష్టుడైన రాజును ఇందుమతికి చూపి "ఇదుగో ఈయన అవంతి నాథుడు ప్రభు మంత్రోత్సాహ శక్తులనే మూడూ పరిపూర్ణంగా కలవాడు. మంచి రసికుడు. నువ్వీతని వరిస్తే సిప్రానదీ తరంగాలతో కూడిన వాయు సౌఖ్యానుభూతి నొందగలవు." ఇందుమతి ముందుకు కదిలింది. ఆ తరువాత అనూప రాజన్యుని వద్దకు తీసుకొని వెళ్ళి సునంద "కనపడేవి రెండు చేతులే అయినా యుద్ధంలో ఈ రాజు సహస్ర భుజునివలె కన్పట్టుతాడు. ఈయన పేరు ప్రతీపుడు. కార్తవీర్యుని వంశానికి చెందిన వాడు. దుర్వ్యసనాల జోలికి పోని సద్గుణుడు. పైగా అగ్నిహోత్రుని సహాయం ఈయనకు నిత్యం ఉంటుంది. క్షత్రియ హంత అయిన పరశురాముని తీక్ష్ణమైన గొడ్డలినే కలువ పత్రంగా భావించేవాడు. ఇతణ్ణి వరిస్తే మహిష్మతీ పట్టాణానికి ఒడ్డాణంగా ఒప్పే రేవానదీ సొగసుల్ని నిత్యం దర్శించే అవకాశం నీకు లభిస్తుంది."

ఇందుమతి సాగిపోతోంటే సునంద పరిచయం చేస్తూనే ఉంది. తరువాత శూరసేన దేశాధీశుడైన సుషేణుని గూర్చి చెబుతూ నీప వంశస్థుడీ రాజు. శాస్త్రోక్త యజ్ఞాచరణకీ వంశం ప్రసిద్ధినొందింది. సకల సద్గుణోపేతుడీరాజు. తనవారికి చంద్రుడు, శత్రువులకు సూర్యుడీ రాజు. ఈతనిని భర్తగా గ్రహిస్తే కుబేరుని ఉద్యానవనమైన చైత్రరథంతో తులతూగే ఇతని బృందావనంలో నీ యౌవనశ్రీ ననుభవింపగలవు." ఇందుమతి ముందుకు సాగింది. సునంద కళింగపతి హేమాంగదుని మహేంద్ర పర్వత సమాన సారం కలవాడని చెప్పినా ఇందుమతి అతని

దాటి పోయింది. ఆ తరువాత ఆగస్త్యమహర్షికి ప్రేమాస్పదుడైన పాండ్యరాజుతో రావణుడే సంధి చేసికోవటంవల్ల రావణునికే అజేయుడని అతణ్ణి పరిచయం చేసింది. ఆతని వరిస్తే తమలపాకుల వృక్షాలు, ఏలక లతలు, గంధపు చెట్లు అలుముకొన్న ప్రదేశాల్లో మలయపర్వత సానువుల్లో పదే పదే క్రీడించే సౌభాగ్యం నీకు చేకూరుతుంది." సునంద మాటలేవీ ఇందుమతికి రుచింప లేదు.

**"సంచారిణీ దీపశిఖేవ రాత్రౌ**
**యం యం వ్యతీయాయ పతిం వరా సా।**
**నరేంద్ర మార్గాట్ట ఇవ ప్రపేదే**
**వివర్ణభావం స స భూమిపాలః॥" (6 - 67)**

రాత్రివేళ నడుస్తున్న దీపశిఖవలె ఆమె వరుని ఎన్నుకోవటానికి ఒక్కొక్క రాజునే అతిక్రమించి పోతూంటే ఆ ఆ రాజుల ముఖాల్ని చీకటి ఆవరించింది. ఎంత సొగసైన స్వభావోక్తి! ఒక వస్తువు ముందు దీపం ఉంచితే అది అధికమైన కాంతితో ప్రకాశిస్తుంది. దీపం తొలగిస్తే చీకటి వల్ల ఉన్న కాంతి కూడా తఱిగిపోతుంది. ఒక రాజు ఎదుట ఇందుమతి నిలచినప్పుడామె తననే వరిస్తుందనే ఆశతో ఆ రాజు ముఖం మరీ ప్రకాశించేది. ఈమె అతని దాటటంతో నిరాశా నిస్పృహలతో ఆ ఆ రాజుల ముఖాలు వివర్ణమైనాయట!

ఈ ప్రసిద్ధ శ్లోకం వల్లనే కాళిదాసు 'దీపశిఖా కాళిదాసు' అనే ప్రశస్తి నొందేడంటారు!.

అజమహారాజు ముందు ఇందుమతి నిలిచింది. సునందకు ఇందుమతి ఇంగితం అవగతమైంది. "ఇంద్రుని అర్ధాసనాన్నలంకరించిన కకుత్థ్స మహారాజు ఇతని వంశానికి మూలపురుషుడు. ఆ వంశంలో



కులదీపకుడైన దిలీపమహారాజు జనించాడు. ఇంద్రునిపై దయతలచి 99 అశ్వమేధాల్నిచేసిన మహారాజాయన. నాలుగు దిక్కుల్నీ జయించి ఆర్జించిన అశేష ధనరాశుల్ని విశ్వజిద్యాగంలో సంపూర్ణంగా దానం చేసి మృణ్మయపాత్రనే మిగుల్చుకొన్న మహానుభావుడు. ఆయన పుత్రుడు రఘువు. త్రికాలాల్లో త్రిలోకాల్లో వ్యాపించిన ఆ రఘుమహారాజు కీర్తి ఇంతింతని చెప్పనలవికానిది. ఇంద్రుని కుమారుడు జయంతుని వలె చేలాకాలంగా తన తండ్రి రఘువుతో సమానంగా భూభారాన్ని వహిస్తున్నాడీ అజ మహారాజు. ఆభిజాత్యంలో, సౌందర్యంలో నూత్న యౌవనంలో, వినయాది సద్గుణ సంపత్తిలో నీ కన్ని విధాలా అనురూపుడైన ఈ అజుని నువ్వు వరిస్తే సువర్ణంలో పొదిగిన రత్నంవలె మీ దాంపత్యం శోభిస్తుంది. ఇందుమతి అజుని పట్ల అనురాగాన్ని వాచ్యంగా చెప్పకపోయినా ఆమెకు కలిగిన రోమాంచం, మందహాసపూర్వకమైన ఆమె ప్రసన్న దృక్కులు చెబుతూనే ఉన్నాయి. ఇది పసిగట్టిన సునంద పరిహాసార్థం "తరువాత రాజు వద్దకు వెళ్దామా" అని అడగటంతోటే ఇందుమతి సఖిని కోపంతో చూచింది. సునంద ఇందుమతిచేత అజుని మెడలో సరిగా అమిరేటట్లు పుష్పమాలికను వేయించింది. ఇందుమతి తన రెండు చేతుల్తో మాలికను అజుని మెడపై నిక్షిప్త పఱచేటంతో అజుడామె ఆలింగనం చేసికొన్న అనుభూతికి లోనైనాడు.

ఆ ఇందుమతీ అజమహారాజుల జంటను చూచి, సభాసదులైన విదర్భవాసులు ఆమె చంద్రసహితమైన వెన్నెల అనీ, సముద్రుని కూడిన గంగ అనీ వివిధ విధాల ప్రశంసించారు. ఆ మాటలు ఇతర ప్రభువులకు కర్ణకఠోరంగా వినిపించాయి.

స్కందునితో కూడిన దేవసేన వలె శోభిస్తున్న తన సోదరిని తీసికొని విదర్భాధిపతి తన రాజభవనానికి తరలివెళ్ళటంతో సప్తమ సర్గారంభమౌతుంది. ఇందుమతి చేత తిరస్కృతులైన రాజకం దివా సమయంలోని గ్రహాలవలె వెలవెలబోయింది. వారి సౌందర్యాన్నీ, వైభవాన్నీ నిందించుకొంటూ అజ మహారాజుపై ఆగ్రహాన్ని లోలోనే అణచుకొంటూ తమ తమ నెలవులకు బయలుదేరేరు. పట్టణంలో ధ్వజాల ఛాయ ఉష్ణోగ్రతనుపశమింపజేస్తుంటే సర్వాంగసుందరంగా అలంకృతమైన ఘంటాపథంపై ప్రయాణించి నూత్న వధూవరులు రాజ ప్రాసాదాన్ని చేరేరు. సర్వేంద్రియ వ్యాపారాలు కేవలం నేత్రాల్లోనే కేంద్రీకృతమైనట్లు రాచవీధుల్లోని సౌధ గవాక్షాల ద్వారా పురస్త్రీలా జేంటను తనివితీరా చూచి ఆనందించారు. ఆ వధూవరులు లక్ష్మీనారాయణులవలె, రతీ మన్మథులవలె శోభిస్తున్నారనే పురజనుల ప్రశంసలు వింటూ అజ మహారాజు భార్యాయుక్తుడై బావమఱది అద్భుతంగా అలంకరించిన భవనాన్ని చేరుకొన్నాడు. రాజపురోహితుడా దంపతులచే అగ్నిహోత్రంలో విధ్యుక్తంగా ఆహుతుల నర్పింప చేసేడు. ఇందుమతి పాణిని తన పాణితో గ్రహించిన అజ మహారాజు అశోకలత చుట్టుకొన్న మావి వృక్షంలా శోభించాడు. అనంతరం వధూవరులు తలంబ్రాలు పోసికొన్నారు. తరువాత విదర్భరాజు వివాహవేడుకలు చూడవచ్చినవారందఱకు వారి వారి అర్హతానుగుణంగా కానుకలు సమర్పించాడు. మూడు నిద్రల ముచ్చట పూర్తయిన పిదప అజ మహారాజు ఇందుమతిని తీసికొని తన నగరానికి పయనమైనాడు.

అంతవఱకు లోలోపలే కోపాన్నణచుకొన్న రాజులు మార్గ మధ్యంలో అజు నెదుర్కొన్నారు. రఘు మహారాజు పంపిన సేన ఈ రాజుల సేననెదుర్కొంది. రథ గజ తురగ పదాతులు శత్రుసేనల రథ గజ



తురగ పదాతులనెదుర్కోవటంతో భండనం భీకరంగా సాగింది. అజ మహారాజునెదిరించి యుద్ధ భూమిలో నిలవటం అసాధ్యమని తలచిన శత్రురాజులంతా తమ భుజ, మనోబలాలను సమీకరించుకొని ఒక్కుమ్మడిగా అజుని చుట్టుముట్టి భీషణాస్త్రాల నాతనిపై ప్రయోగించే సాగేరు. అపుడజుడు తనకు గంధర్వ మిత్రుడు ప్రియంవదుడిచ్చిన సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించాడు. దాంతో శత్రుసేన సమస్తం నిద్రాముద్రితమైంది. అజుడు శత్రురాజుల ధ్వజాలపై రక్తంతో తడిసిన అమ్ములతో "రఘుపుత్రుడు మీ కీర్తినే హరించి కృపాళుడై మీ ప్రాణాలను హరించేలేదు" అని వ్రాయించాడు.

కాళిదాసు భారతీయ నృపతుల సంస్కారాన్నిక్కడ అభివ్యక్తం చేసేడు. ఉక్రోషం కొద్దీ ఎదుర్కొన్న సమస్తరాజులనందఱినీ పీనుగుపెంట చేయగలిగిన చేవ ఉన్నా అజమహారాజేపని చేయలేదు. గ్రంథాదిలో రఘువంశరాజుల వృత్తాన్ని చెబుతూ "**యశసే విజిగీషూణామ్**" అన్న ప్రశంసకిది నిదర్శనం. ఈ శ్లోకం ఎంతైనా అందమైనది !

**"సశోణితైస్తేన శిలీ ముఖాగ్రై ర్ని క్షేపితాః కేతుషు పార్థివానామ్ ।**
**యశోహృతం సంప్రతి రాఘవేణ న జీవితం వః కృపయేతి వర్ణాః ॥"(7 - 65)**

నూతనంగా తనపైపడిన వర్షబిందువులకు హర్షపులకితయైన భూదేవి తన సంతోషాన్ని నెమలి క్రేంకారాలతో మేఘునికి తెలిపినట్లు అజ విజయానికి కలిగిన ఆనందం ఇందుమతి తన చెలికత్తెల ద్వారా అజునికి తెలిపిందట ! నూతన వధువుకుండే సిగ్గును ఎంతో మనోహరంగా కాళిదాసు చెప్పేడు ! విజయలక్ష్మిలా శోభిస్తున్న ఇందుమతీద్వితీయుడై అజమహారాజు తనింటికి చేరేడు. జరిగిన వృత్తాంతం ఇదివఱకే తెలిసికొన్న రఘుమహారాజు పుత్రుని అభినందించాడు. రాజ్యాన్ని

పుత్రునికప్పగించి తాను ప్రశాంత జీవనాన్ని సాగించటానికుద్యుక్తుడయ్యాడు రఘుమహారాజు. కుమారులు రాజ్య సంరక్షణాదురంధరులైనపుడు సూర్యవంశపు రాజులు స్వగృహంలో నివసించేటానికుద్యుక్తులు కారు !.

అనతి కాలంలోనే రఘుమహారాజు భూభారాన్నజుని కప్పగించేటంతో భూదేవి అజునికి రెండవ ఇందుమతిగా శోభించిందని చెప్పటంతో అష్టమసర్గారంభమౌతుంది. తండ్రి అనుజ్ఞ మేరకు అజుడు శత్రురాజుల దౌష్ట్యాన్నరికట్టి భూమిని నిష్కంటకం కావించాడు. అథర్వ వేదోక్తంగా కులగురువైన వసిష్ఠ మహర్షి అజునికి రాజ్యాభిషేచన కార్యక్రమాన్ని నిర్వహించాడు. అజవసిష్ఠుల సమాగమం బ్రాహ్మక్షాత్రాల సమ్మిళితమై అగ్ని వాయువుల కలయికయై శోభించింది. కేవలం రాజ్యవైభవానికే కాక తండ్రి మహోన్నత గుణరాశికి సైతం వారసుడైన అజుడు సింహాసనస్థుడు కావటంతో రాజ్యంలోని ప్రజలు రఘుమహారాజే తిరిగి యౌవనవంతుడై రాజ్యానికి వచ్చినట్లు భావించారు. ప్రజలంతా రాజ్య ప్రగతికై తమ తమ బాధ్యతలను భక్తి శ్రద్ధలతో నిర్వహించే సాగేరు. అనుకూల పవనం మహావృక్షాల్ని ఉన్మూలించేకుండా అవనతం చేసినట్లు రఘువు వివిధ దేశాధీశులను పెకలించేకుండా కేవలం తనకు విధేయులుగా మాత్రమే చేసికొన్నాడు. తనకు వారసుడై రాజ్యానికి వచ్చిన పుత్రుడు వ్యసనహీనుడై, ఆత్మనిగ్రహంతో ప్రజారంజకుడు కావటం చూసి సంతృప్తుడైన రఘుమహారాజు ఇహలోకసుఖ విముఖుడై సర్వబంధ విముక్తుడైనాడు. దిలీప వంశస్థులైన ప్రభువులందఱూ తమ వార్ధక దశలో రాజ్యంలో వారసుని ప్రతిష్ఠించి వల్కలధారులై మునివృత్తి నవలంబించే వారు. ఆ మార్గంలోనే తపోవన గమనోద్యుక్తుడైన రఘువును చూచి అజుడు పాదాభివందనం చేసి “నన్ను విడచి తపోవనానికి వెళ్ళవద్దు”ని



ప్రార్థించాడు. కన్నీటితో దీనంగా ప్రార్థిస్తున్న ప్రియపుత్రుని చూసి రఘుమహారాజతని కోర్కెను తీర్చి సంతృప్తుని చేయదలచాడు. కాని విడచిన కుబుసాన్ని సర్పం తిరిగి ధరించేనట్లే పుత్రునికిచ్చిన రాజ్యాన్ని మాత్రం తిరిగి స్వీకరించేలేదు. జీవితావధి పూర్తికానున్నదని ఎఱిగిన రఘుమహారాజు రాజధానికావల ఒక ఏకాంత ప్రదేశంలో జితేంద్రియుడై జీవించేసాగేడు. బ్రహ్మజ్ఞాన నిష్ఠులైన మహర్షి పుంగవులతో రఘువు, మేధావులైన అమాత్య సామంతరాజుల సాన్నిహిత్యంతో అజుడు కాలం గడుపసాగేరు. ప్రజానురంజకంగా పాలించేటానికి అజుడు సింహాసనాధిష్ఠితుడైతే, ఆత్మజ్ఞానానుభూతికై రఘువు దర్భాసనాసీనుడైనాడు. అజుడు తన అపారసేనా నివహంతో బాహ్య శత్రువులను, రఘువు తన అమేయ ధ్యానాదులతో అంతః శత్రువులను జయించి జ్ఞానాగ్నిలో కర్మను భస్మీకృతంచేసి, ప్రగతిపథంలో పయనిస్తున్నారు. కేవలం రాజ్యవైభవానికే కాక, తండ్రి మహోన్నత గుణరాశికి సైతం వారసుడైన అజుడు ఫలప్రాప్తి పర్యంతం చేపట్టిన కార్యాన్ని వీడే వాడు కాదు. రఘువు సైతం పరమాత్మ సాక్షాత్కృతి వఱకు యోగాభ్యాసాన్ని విడువ లేదు.

ఆ విధంగా అజుని కోర్కెపై రఘువు కొంతకాలం గడిపి, పిమ్మట యోగసాధనలో సిద్ధినొందేడు. తండ్రి మరణ వార్త విన్న అజుడు సన్యాసులకు యోగ్యమైన రీతిలో రఘువుకు అంత్యక్రియలొనర్చాడు. యోగంలో తనువును త్యజించిన వారు పుత్రుల పిండోదకాలను వాంఛించేకపోయినా అజుడు తన తండ్రిపైకల భక్తి కొద్దీ అంత్యక్రియలొనర్చాడు.

అజుని వంటి సమర్థుడైన రాజు తనను పాలిస్తునందుకు హర్షోత్ఫుల్ల అయిన వసుంధర రత్నాలనే వర్షిస్తే ఇందుమతి కుమారుని

కన్నది. ఆ కొడుకే దశరథుడు. సూర్యుని సహస్రకిరణాలవలె ఆ దశరథుని కీర్తి పదిదిక్కులా ప్రాకిపోయింది. జ్ఞానులు రావణవధార్థం జన్మించబోయే రాముని తండ్రిగా దశరథుని గుర్తించారు. వేదాధ్యయనం, యజ్ఞనిర్వహణ, కుమారప్రాప్తితో అజుడు ఋషి, దేవ, పితౄణాలనుంచి విముక్తుడైనాడని భావించారు. ఆపన్నులనాదు కోవటంలోను, విద్వాంసులను సత్కరించటంలోనూ అజుని సంపద వినియోగ మైంది.

ఒకనాడు దైనందిన విధుల నిర్వహణానంతరం తనకుమారుని తనకు ప్రతినిధిగా నియమించి అజమహారాజు నందనవనంలో దేవేంద్రుడు శచీదేవితో విహరించినట్లు పట్టణానికి అనతి దూరంలో ఉన్న సుందరోద్యానవనానికి ఇందుమతీ ద్వితీయుడై వెడలేడు. ఆ సమయంలో త్రిలోకసంచారి అయిన నారదుడు దక్షిణ సముద్రతీరాన గోకర్ణ క్షేత్రంలో ఉన్న భవానీయుక్తుడైన శంకరుని తన వీణపై స్తుతిస్తూ రోదసిలో సంచరిస్తున్నాడు. ఆయన వీణపై అమర పారిజాత పుష్పమాల శోభిస్తూ ఉంది. వాతోద్ధూతమైన ఆ పుష్పమాల ఇందుమతి స్తనాగ్రాలపై వ్రాలింది. ఆ ప్రసూనమాలికను చూస్తూ క్షణకాలం విహ్వలయై రాహుగ్రస్తమైన చంద్రునివలె ఇందుమతి కనులు మూసింది. అచేతనంగా పడి ఉన్న ఆమెను అజుడు తన ఒడిలోనికి తీసికొని ఉపచారాలు చేసినా ప్రాణవాయువు ఆమె నుండి ఎపుడో వెడలిపోవటంవల్ల ఫలోన్ముఖాలు కాలేకపోయాయి. ఆమె శరీరం చెల్లబడిపోయింది. అశనిపాతం వంటి ఈ సన్నివేశానికి అశ్రుధారలు ధారాపాతంగా వర్షిస్తూ ఉంటే అజుడు దుఃఖించ సాగేడు. “కఠినాతి కఠినమైన ఇనుము సైతం అగ్నిలో దహనమై ద్రవిస్తూ ఉంటే రక్తమాంసాలతో కూడిన మానవుల శరీరం సంగతి చెప్పేదేముంది? అతి సుకుమారమైన ఈ సుమమాలిక స్పర్శ మాత్రంతోనే



ప్రాణాలను తీయగలిగినప్పుడు ఇక మానవుని చంపలేనిదంటూ ఏముంటుంది ? ఈ పూలదండలోని కుసుమస్పర్శే నా ఇందుమతిని చంపగలిగినప్పుడు ఈ పూలమాలను నా హృదయానికెంతో గాఢంగా హత్తుకుంటున్నా నన్నెందుకు చంపటం లేదు ? భగవద్విలాసం వల్ల ఒక్కొక్కప్పుడు విషవే అమృతమై మఱొకప్పుడు అమృతవే విషమౌతుందికదా!” అనే అర్థాన్ని వ్యక్తం చేస్తున్న శ్లోకం ఎంతైనా కరుణరస స్ఫోరకమైంది.

*“స్రగియం యది జీవితాపహా హృదయే కిం నిహితా న హన్తిమామ్।*
*విషమప్యమృతం క్వచిద్భవేదమృతం వా విషమీశ్వరేచ్ఛయా॥” (8-46)*

నా దౌర్భాగ్యవశాన విధి ప్రయోగించిన ఈ వజ్రాయుధం వృక్షాన్ని ఉన్మూలించక దానిపైనున్న లతనే నాశనం చేసింది.” తరువాత ఇందుమతి మృతదేహం పై తనచూపుల్ని నిగుడిస్తూ అజుడు “ప్రియా ! నే నిదివఱలో వందలాది అప్రియాలాచరించినా నన్నేమీ అనలేదే ! కానీ నేడు నేను నీ కేమీ అప్రియం ఆచరించలేదే ! మఱి నన్నెందు కవజ్ఞ చేస్తావు? చెఱగని మందహాసంతో ఉండే నువ్వు నన్ను విశ్వాసరహితునిగా, మోసగానిగా భావించావా ? లేకపోతే నాతో మాటమాత్రమైనా చెప్పకుండా మఱో లోకానికెందుకు వెళ్ళిపోయావు? నీవు వెళ్ళిపోయినా ఇంకానన్నెందుకీ ప్రాణాలంటిపెట్టుకొని ఉన్నాయి? నీ వియోగవ్యథననుభవించటానికా? ప్రియా! రతిశ్రమోద్గతమైన స్వేదబిందువులింకా నీ ముఖారవిందంపై నిలిచే ఉన్నాయి. మఱి నీ ఈ శరీరాన్ని విడిచి నువ్వెక్కడికి వెళ్ళేవు? ఛీ! ఈ శరీరం ఎంత అసారమైంది? ప్రాణాధికా! నన్నిక బాధపెట్టకు. వెంటనే చైతన్యవంతురాలివై నా వేదనను తొలగించు. చిగురుటాకులు, సుకుమార సుమ పాన్పుపై పరున్నా తట్టుకోలేని నీ శరీరం చితిమంటల నెలా

సహించేగలదు ? గతంలో రతి పారవశ్యంతో నీ నోటివెంట పలుకులు వచ్చేవి కావు. ఆ వదనం ఇపుడు శాశ్వతంగా మూగబోయింది. నేను పేరుకే ధరణీశుణ్ణి కాని నాహృదయాధి దేవతవు నీవేనని నీకు తెలియదూ?" ఈ విధంగా అజుడు రాయంచేలతో, నెమిళ్లతో వివిధ వృక్షాలతో, పుష్పాలతో, లతలతో ఇందుమతికి గల అనుబంధాన్ని పదే పదే తలచుకొంటూ హృదయవిదారకంగా విలపించాడు. అనంతరం అనుచరులతి కష్టం మీద అజుని అంకప్రదేశాన్నుంచి ఇందుమతి భౌతికకాయాన్ని తొలగించి చందన కాష్ఠాలతో, అగరు ధూపాలతో చితిపై నుంచారు. దశాహశ్రాద్ధ కర్మలు ముగిసేయి.

ఆశ్రమంలో యజ్ఞాన్ని నిర్వర్తిస్తున్న వసిష్ఠ మహర్షికి అజుని దుఃఖం తెలిసి తన శిష్యునిచే వర్తమానం పంపేడు. "మహారాజా! వసిష్ఠ మహర్షి తన జ్ఞానచక్షువుతో భూతభవిష్యద్వర్తమానాలు దర్శింపగలరు. పూర్వం తృణబిందుడనే మహర్షి తపోనిష్ఠ పూనగా ఇంద్రుడతనికి తపోభంగం కావించేటానికి 'హరిణి' అనే సురాంగనను పంపేడు. హరిణి ఆ మహర్షి ఎదుట మనోహరమైన హావభావాలను ప్రదర్శించింది. క్రుద్ధుడైన ఆ మహర్షి ఆమెను మానవ వనితవై జన్మించు" మని శపించాడు. ఆమె చేతులు జోడించి "నేనితరుల సేవకురాలిని. నన్ను దయతో క్షమించేండ"ని ప్రార్థించింది. ఆమె దీనాలాపాలకు కరిగిన మహర్షి "దేవతా పుష్ప సందర్శనంతో పార్థివ దేహాన్ని విడిచి అమరలోకాన్ని పొందుతావని అనుగ్రహించాడు. రాజా ! ఆ హరిణే ఇందుమతిగా జన్మించి నీకు భార్యయైయింది. అమర ప్రసూనాన్ని దర్శించి శాపావసానమై దివికేగింది. కనుక ఆమెకై దుఃఖించి ప్రయోజనం లేదు. పుట్టిన ప్రతి జీవీ మరణించేక తప్పదు. భౌతిక భోగ వ్యామోహంలో చిక్కక నీ యౌవనంలో ఆధ్యాత్మిక



విద్యావ్యాసంగంతో జ్ఞానాన్ని సముపార్జించావు. ఈ మనోవ్యథా కాలంలో ఆ జ్ఞానాన్ని స్మరించు. నువ్వెంత నిర్విరామంగా విలపించినా నీవామెను పొందలేవు. నువ్వామె ననుసరించినా నీకామె లభించేదు. ఎందుకంటే జీవుడు తన తన కర్మలననుసరించే తగిన లోకాలను పొంది తిరిగి జన్మిస్తుంటాడు. కనుక దుఃఖాన్ని దిగమ్రింగి ఆమెకు పిండోదకాది దానాలాచరించు. తనవారి కన్నీరే మృతులను దహిస్తుందని పెద్దలు చెబుతారు. దేహధారులకు మృతే సహజస్థితి అనీ, జన్మదాని వికారమని జ్ఞానులంటారు. జీవులు జీవించినంతకాలం ఊపిరి పీలుస్తూ, విడుస్తూ దానిననుభవిస్తారు. అజ్ఞానులు తమ ప్రియతముల మృతిని తమకు హృదయశల్యంగా భావిస్తారు. కాని సుజ్ఞానులు మృతిని హృదయస్థమైన శల్యం తొలగినట్లు తలుస్తారు. దేహాత్మలీ సంయోగ వియోగాలను నిరంతరం, నిర్విరామంగా పొందుతూ ఉంటే జ్ఞానులు భార్యాబిడ్డలకై తదితర ప్రాపంచిక విషయాలకై దుఃఖించేటం ఎందుకు ? జితేంద్రియుడవైన నువ్వు సామాన్య మానవుని వలె దుఃఖభాగుడవు కాకూడదు. గాలి చెట్టును, పర్వతాన్ని కూడా పెకలించేగలిగితే ఆ రెంటికీ బేధమేముంది?".

వసిష్ఠుని హితవచనాలు దుఃఖోద్వేగంతో కుమిలిపోతున్న అజుని హృదయంలోకి చొచ్చుకుపోలేక పోయాయి. కనుక వాటిని తిరిగి వసిష్ఠునికే పంపేడు. దశరథుడింకా చిన్నవాడై రాజ్యరక్షణ ధూర్వహుడు కానందువల్ల అజమహారాజు తన భార్య తైలవర్ణ చిత్రాలు చూస్తూ, ఆమె ఉపయోగించిన వస్తువుల్లో ఆమె ప్రతిబింబాన్ని స్మరిస్తూ, స్వప్నంలో ఆమె సాన్నిహిత్యాన్ననుభవిస్తూ ఎనిమిదేళ్ళు వ్యథాభరితంగా గడిపేడు. తరువాత వినయశీలి, సమర్థునిగా ఎదిగిన పుత్రుడు దశరథుని విధ్యుక్తంగా

రాజ్యాభిషిక్తుని చేసి ప్రియా వియోగ దుఖంతో శుష్కించిన శరీరాన్ని భారంగా భావించి ప్రాయోపవేశంతో తనువు చాలించేటానికి నిశ్చయించాడు.

తదుపరి పవిత్ర గంగా సరయూనదీ సంగమంలో దేహాన్ని విడిచి అమరజీవియైన అజమహారాజు నందనవనంలోని మనోహర సౌధంలో అంతకు ముందుకంటె ఎన్నోరెట్లు సౌందర్యంతో భాసిస్తున్న భార్యతో ఇష్టోపభోగాలనుభవించే సాగేడు.

జితేంద్రియుడు, మహా పరాక్రమశాలి అయిన దశరథుడు తండ్రి మరణానంతరం ఉత్తరకోసల దేశాన్ని ప్రజానురంజకంగా పాలించేటంతో నవమ సర్గ ప్రారంభమౌతుంది. సకాల వర్షాలతో వసుంధర సస్యశ్యామలమై అలరారింది. దశరథుడు వేట, జూదం, సురాపానం, స్త్రీ వంటి దుర్వ్యసన దూరుడై ప్రజాభివృద్ధికే ఎప్పుడూ కృషిసల్పుతూ ఉండేవాడు హాస్యానికైనా అసత్యమాడి ఎఱుగడు. శత్రువులతోనైనా పరుషవాక్యాలు పలికేవాడు కాడు. తన ఆజ్ఞానుబద్ధులైన సామంత రాజులను మిత్రులుగానే సంభావించేవాడు. శాసనోల్లంఘన చేసిన వారిని మాత్రం ఇనుము కంటే కర్కశ హృదయంతో శిక్షించేవాడు. శరణుజొచ్చిన శత్రురాజులను సైతం ఎంతో ఆప్యాయంగా దరికి చేర్చుకొనేవాడు. పర్వతాల్లో ప్రభవించిన నదులు సముద్రాన్ని చేరినట్లు కోసల, మగధ, కేకయ రాజపుత్రికలు దశరథుని పతిగా వరించారు. ఆ ముగ్గురు రాణులతో ప్రభు, మంత్రి, క్రియాశక్తులతో భువికి అవతరించిన దేవేంద్రునివలె దశరథుడు శోభించాడు. యుద్ధంలో దేవేంద్రునికి సాయపడి తన అసమాన పరాక్రమంతో శత్రుభయాన్ని తొలగించిన దశరథుని అప్సరసలు తమ ఆట పాటలతో కీర్తించారు. దశదిశలు జయించిన దశరథుడు



సరయూ, తమసానదీ తీరాల్లో అశ్వమేధయాగాన్నా చరించాడు యజ్ఞాంతంలో అవభృథ స్నానపూతుడైన ఆ దశరథుడు అమరుల సరసన అధిష్ఠితుడు కాగల అర్హతను పొందేడు. ఒక్క దేవేంద్రునికే నతశిరస్కుడైనాడు. భోగ భాగ్య పరాక్రమాల్లో యమ, కుబేర, దేవేంద్రులకు సాటియైన వాడుగా ప్రసిద్ధినొందేడు.

ఇంతలో వసంతఋతువు ప్రారంభమైంది. ప్రకృతిలోని మార్పులకు మానవుల జీవితాలెలా స్పందిస్తాయో, ప్రకృతికి, జీవులకు గల సంబంధమెటువంటిదో రమణీయమైన కాళిదాసువర్ణనలో చూడగలం. కోకిలా రావాల్ని ముగ్ధ వధువుల మాటలతో ఉపమానం చెప్పటమే కాక హంసలు స్త్రీలవలె శోభించారని చెప్పటం కాళిదాసు ప్రత్యేకత. వనితలు అలంకరించుకొనే వివిధ పుష్పాలు వారి ప్రియులను చెంతకు చేర్చాయట! తమ పురుషుల పట్ల కినుక వహించిన స్త్రీలకు కోకిలాలాపాలు "భోగయోగ్యమైన యౌవనదశ వీడిపోతే తిరిగిరాదు, కనుక ప్రియుల పట్ల కోపాన్ని వీడి వారితో సుఖించేండ"ని హితోపదేశం చేస్తున్నాయా అన్నట్లున్నాయంటాడు కాళిదాసు. దాంతో వనితలు వాటి మాటను వినకపోతే మన్మథుడుడెక్కడ శిక్షిస్తాడో అని యథేచ్ఛగా పతులతో విహరించారట !

దశరథ మహారాజు విలాసినీ జనంతో వసంతర్తు శోభను ఆస్వాదించిన తదుపరి ఆయనకు వేటపై ఆసక్తి జనించింది. అమాత్యుల అనుమతితో వేటకై దశరథుడరణ్యానికి తరలి వెళ్ళేడు. ఇంతలో ఒక లేళ్ల మంద ఆయనకెదురైంది. ఒక ఆడు లేడి తన ప్రియుని శరీరాన్ని తనలో పొదివికోవటం చూచిన దశరథుడు ఆకర్ణాంతం లాగిన బాణాన్ని సైతం దయతో ఉపసంహరించాడు. భీతలైన హరిణాల చూపుల్లో తన భార్యల విభ్రమాన్ని స్మరించి బాణ ప్రయోగం సలుపలేదు. తరువాత అడవి

పందులు తిరిగిన ప్రాంతాన్ని అనుసరించి ఎంతో నేర్పుతో వానిని పడవేసేడు. ఆ పిమ్మట ఖడ్గమృగాల కొమ్ములను తన బాణాలతో ఛేదించాడు. ఆ తరువాత వ్యాఘ్రాల తెఱచిన నోళ్ళలో అమ్ములను క్రుమ్మి వాటినే తనబాణ తూణీరాలుగా చేసికొన్నాడు. ఈ విధంగా వేట సలిపి ఆ రాత్రి చిగురుటాకుల శయ్యపై నిద్రించాడు.

ప్రాతః కాలంలో నిద్రలేచి ఒక లేడి పరుగెత్తుతున్న మార్గాన్ననుసరించి దశరథుడు అశ్వారూఢుడై వెళ్ళి ముని జన్మ స్థావరమైన తమసానదీ ప్రాంతాన్ని చేరేడు. నదిలో కుండను ముంచినప్పుడు ఏర్పడే శబ్దాన్ని విని దానిని ఏనుగు ఘీంకార ధ్వనిగా భ్రమించి 'శబ్దవేధి' అనే బాణం ప్రయోగించాడు. ఇంతలో "తండ్రీ ! తండ్రీ!" అనే ఆర్తారావం వినిపించి దిగ్భ్రమనొంది ఆ శబ్దం వచ్చిన వైపుగా వెళ్ళి అక్కడ తన బాణం గ్రుచ్చుకొని నీటికుండను పట్టుకొని ఉన్న ముని కుమారుని చూచాడు. తన బాణం ఆ ముని కుమారుని కాక తనకే గ్రుచ్చుకొన్నంత బాధతో గుఱ్ఱం దిగి ఆ ముని కుమారుణ్ణి నీ వెవ్వరవని ప్రశ్నించాడు. దశరథుడు ప్రయోగించిన బాణంతో విహ్వలుడైన ఆ బాలుడు బాధతో అస్పష్టాక్షరాలతో తాను అబ్రాహ్మణుడైన తపస్వి కుమారుణ్ణనీ (వాల్మీకి రామాయణంలో శూద్రస్త్రీకి వైశ్యుని వలన కలిగిన తనయుణ్ణని ఉంది), తనను తన తల్లిదండ్రుల వద్దకు చేర్చుమనీ కోరేడు. దశరథుడు మునిపుత్రుని అంధులైన అతని మాతాపితల వద్దకు తీసికొనివెళ్ళి జరిగిందంతా వారికి నివేదించాడు. ఆ దంపతులు పుత్రుని ఱొమ్ముపై నాటుకున్న బాణాన్ని దశరథునిచేతనే పెకిలింపచేయటంతో బాలుడు మరణించాడు. తరువాత పుత్ర వియోగం ఆ దంపతులను వివశుల్ని చేసింది. ముని "ఓ రాజా నీవు కూడా వృద్ధాప్యంలో పుత్రశోకంతో మరణిస్తావ"ని శపించాడు. అంత వఱకు పుత్రులు లేని తనకీ మునిశాపం



వరంగానే తలచాడు దశరథుడు. తరువాత వారి అభీష్టానుసారం పుత్రుననుగమించేటానికి వారికి చితి పేర్పించాడు. అంతలో దశరథుని సేన అతణ్ణి చేరుకొంది. ఆత్మ వినాశహేతువైన ఆ ముని శాపాన్ని సముద్రుడు బడబాగ్నిని ధరించినట్లు తన మనస్సు లోనే ఉంచుకొని రాజధానికి మఱలేడు దశరథుడు. ఇక్కడితో నవమసర్గ సంపూర్ణమౌతుంది.

ఇంచుమించుగా పది వేల సంవత్సరాలు ఇట్టే గడిచి పోయాయి. దశరథుడప్పటికీ సంతాన ప్రాప్తినొందలేదు. ముని శాపం వల్ల తాను సంతానవంతుడవటం నిశ్చయమే అయినప్పటికీ పురుష ప్రయత్నంగా ఋష్యశృంగాది మహర్షులతనిచే "పుత్రకామేష్టి" యాగాన్నాచరింప చేసేరు. అదే సమయంలో పాలసముద్రంలో యోగనిద్రనుండి మేల్కొన్న శ్రీమహావిష్ణువును దర్శించి పులస్త్య వంశీయుడైన రావణాసురునిచే పీడితులైన దేవతలు తమ ఆపదను విన్నవించుకొన్నారు. విష్ణుమూర్తి తనకా విషయం తెలుసుననీ, తొల్లి శివ ప్రీత్యర్థం తన తొమ్మిది శిరస్సులను తెగనఱికికొన్న ఆ రావణుడు తన కోసమే పదవ తలను త్రెంచుకొనలేదని వారిని ఊఱడించాడు. బ్రహ్మ ప్రసాదించిన వరాలతో పెచ్చుపెరిగిపోతున్న ఆ రావణుడు దేవతలచే తాను చావకుండా వరం పొందేడని, మానవుల పట్ల నిరాదరణతో మానవుల చేతిలో మృత్యువునొందకుండా వరం యాచించలేదని, అందువల్ల దేవతలెవరూ ఆ రాక్షసుని వధించ లేరనీ చెప్పేడు. అయితే అంతవఱకు విధి అనుల్లంఘనీయమని సహించిన తాను దశరథ మహారాజునకు పుత్రునిగా జన్మించి ఆ రాక్షసుని శిరస్సులను అచిర కాలంలోనే యుద్ధ భూదేవతకు బలిగా సమర్పిస్తానని అభయమిచ్చాడు. సంతుష్టులైన దేవతలు విష్ణుమూర్తిననుసరించి దైవకార్య నిర్వహణార్థం తమ తమ అంశలతో భూమిపై అవతరించారు.

ఇక్కడ దశరథుడు నిర్వహించిన "పుత్రకామేష్టి" పూర్తికావటంతో యజ్ఞహోమాగ్నినుండి ఒకానొక దివ్యపురుషుడావిర్భవించి పాయసాన్ని దశరథ మహారాజుకందించాడు. మహారాజు మహానందంతో ఆ పాయసాన్ని గ్రహించి పూజ్యురాలైన కౌసల్యకు, ప్రియపత్ని కైకకు విభజించి ఇచ్చి వారిరువురి భాగాల్లో ఒక్కొక్క వంతును సుమిత్రకు ఇవ్వండని ఆదేశించాడు. తనకు పాయస భాగాలనిచ్చిన సవతులిద్దఱిపై సుమిత్ర ఎంతో ప్రీతినొందింది. దశరథుని ఆ ముగ్గుఱు రాణులు ప్రజాభ్యుదయానికై శ్రీ మహావిష్ణువు అంశలు కల గర్భాన్ని ధరించారు. వారికి శంఖ, చక్ర, గదా, ఖడ్గచక్రాలతో ఉన్న చిన్నవారు తమను రక్షిస్తున్నట్లు, గరుత్మంతుడు తమను ఆకాశ మార్గంలో తీసుకొని పోతున్నట్లు కౌస్తుభమణిహారాన్ని ధరించిన లక్ష్మీదేవి తమను సేవిస్తున్నట్లు స్వప్నాలు వచ్చాయి. తన భార్యల ఈ స్వప్న వృత్తాంతాలను విన్న దశరథుడు తాను సాక్షాత్తు విష్ణుమూర్తికి తండ్రి కాబోతున్నానని ఆనందాబ్ధిలో ఓలలాడేడు. క్రమంగా పది నెలలు పూర్తికావటంతో కౌసల్య పుత్రుని ప్రసవించింది. దశరథుడాబిడ్డనికి 'రాముడ'ని నామకరణం చేసేడు.

ఈ రామావతార సంఘటనను కాళిదాసు వర్ణించిన తీరు స్పృహణీయమైంది.

**"రఘువంశ ప్రదీపేన తేనాప్రతిమతేజసా।**

**రక్షాగృహగతా దీపాః ప్రత్యాదిష్టా ఇవాభవన్ ॥"(10 – 68)**

రఘువంశానికే గొప్ప దీపమైన రాముడు జన్మించిన పురిటింటి దీపాలన్నీ వెలవెల బోయాయట ! ఇందులో రావణాది రాక్షసు లంతా అల్పదీపాలు. శ్రీరాముని మహాదీపం వెలుగు నివ్వటంతో కాంతిరహితాలైనాయని ధ్వని. కైకేయికి మహోన్నత శీలుడైన భరతుడు జన్మించాడు. అలాగే సుమిత్ర



విద్య, వినయమూర్తులైన లక్షణ, శత్రుఘ్నులను కుమారులుగా పొందింది. విష్ణ్వంశ సంభూతులైన ఆ నలుగురి జననంతో భూలోకం నిర్దోషమై, సుగుణ సంపన్నమై నాకమే నేలపైకి దిగివచ్చిందనిపించిందట! దశరథుని పుత్రోత్సవవేళ అయోధ్యలో మంగళవాద్యాలకు ముందే దేవదుందుభులు మ్రోగేయి. జాతక, నామకరణాది సంస్కారాలు పొందిన దశరథపుత్రులు ఆయన ఆనందంతో పాటు వృద్ధినొందసాగేరు. సహజంగానే తేజోవంతుడైన అగ్నిహోత్రుడు హోమద్రవ్యాలతో మఱింత ప్రజ్వరిల్లినట్లు స్వభావతః వినీతులై, వినయరాశులైన ఆ నలువురు కుమారులూ గురుశిక్షణతో మఱింత తేజోరాశులైనారు. పరస్పరప్రేమాస్పదులైన ఆ రాజపుత్రులు రఘువంశాన్ని మఱింతగా ప్రకాశింపచేసేరు. నలుగురిలో సౌభ్రాత్రం సమాన ధర్మమే అయినా రామలక్ష్మణులు, భరతశత్రుఘ్నులు జేంటలుగా రూపొందేరు. వారిలో ఎప్పుడూ పొరపొచ్చేలన్నవి లేవు. ఆ నలుగురూ ధర్మార్థకామమోక్షాలనే పురుషార్థాల అవతారాలై విలసిల్లేరు.

**"సచతుర్ధా బభౌ వ్యస్తః ప్రసవః పృథివీపతేః।**

**ధర్మార్థకామమోక్షాణాం అవతార ఇవాఙ్గభాక్ ॥" (10 – 84)**

అనే ఉత్ప్రేక్ష కాళిదాసు ఊహాశక్తికి నికషోపలం. చతుస్సముద్రాలూ క్షితీశ్వరుడైన దశరథుని సేవించినట్లే ఆ నలువురు పుత్రులూ తమ గుణగణాలతో దశరథుని ప్రీతుని చేసేరు. రాక్షసుల ఖడ్గాన్ని నిర్వీర్యం చేసిన దంతాలుగల ఐరావతంవలె ఆ నలుగురూ రాజనీతిలోని నాలుగు ఉపాయాల్లో (సామదానభేదదండో పాయాలు) నిష్ణాతులై వెలుగొందేరు.

ఏకాదశ సర్గ, విశ్వామిత్రుడు తనయాగరక్షణార్థం శ్రీరాముని తన వెంట పంపవలసిందిగా దశరథుని యాచించ చేటానికి రావటంతో ఆరంభమౌతుంది. బాలుడు, పిల్లజుత్తు కలవాణ్ణి అంతటి మహాకార్యానికి

విశ్వామిత్రుడంతటివాడు ఎలా కోరేడనే అనుమానం మనవంటివారికి కలుగవచ్చునని కాళిదాసు "**తేజసాం హి న వయః సమీక్ష్యతే**" – అంటే పరాక్రమోపేతుల విషయంలో వయస్సు పరిగణనకు రాదు కదా!" అనే అర్థాంతరన్యాసంతో సమర్థిస్తాడు. దశరథుడు లక్ష్మణ సమేతుడైన రాముని మునితో పంపేడు. ధనుర్ధారులైన రామలక్ష్మణులు తల్లి తండ్రులకు పాదప్రణామాలాచరించి, మునిననుగమించారు. త్రోవలో ఆ స్థల విశేషాలను కథలుగా చెబుతూ విశ్వామిత్రుడు వారికాహ్లాదాన్ని కలిగించాడు. విశ్వామిత్రోపదిష్టాలైన క్షుత్పిపాసలను దరికి రానీయని బల,అతిబల అనే విద్యల ప్రభావంతో ఆ సోదరులిద్దఱికీ తల్లిప్రక్కన చరిస్తున్నట్లే అనిపించింది. ఒక ప్రదేశానికి చేరటంతోటే సుకేతువనే యక్షుని కుమార్తె అయిన తాటకి శాపోపహతయైన వైనం తెలియచేసేడు. రామలక్షణులు అది వినటంతోనే ధనుస్సులకు నారిని సంధించి ధనుష్టంకారం కావించారు. ఆ జ్యా నినాదం వినటంతో తాటక వారి ఎదుట ప్రత్యక్షమైంది. తనపైకి వస్తున్న ఆ భయంకారాకారం కల రాక్షసిపై రాముడు బాణాన్ని విడిచాడు. నేలకొరిగిన ఆ రాక్షసి బరువు ఆ అరణ్య ప్రాంతాన్నేకాక త్రిలోక విజేతయైన రావణుని రాజ్యలక్ష్మిని కూడా కంపింప చేసిందట ! తాటక యమసదనాన్ని చేరిన విధానాన్ని –

**"రామ మన్మథ శరేణ తాడితా దుఃసహేన హృదయే నిశాచరీ।**

**గన్ధవద్రుధిర చన్దనోక్షితా జీవితేశ వసతిం జగామసా ॥"** (11 – 20)

రాముడనే మన్మథుని బాణంతో తాడితయైన ఆ రాక్షసి రక్తమనే చందనాన్ని శరీరానికలుముకొని జీవితేశుని (ప్రియుడు; యముడు) నివాసానికి బయలుదేరిందని వర్ణిస్తాడు. దుస్సహమైన మన్మథబాణంతో అభిసారిక తానే ప్రియుని నివాసానికి వెడుతుంది. జీవితానికి ప్రభువు యముడు.



ఇక్కడ పరస్పర విరుద్ధరసాలైన బీభత్స, శృంగారాల కలయిక దోషమని ఆక్షేపించిన ఆలంకారికులూ లేకపోలేదు.

తాటక వధతో సంప్రీతినొందిన విశ్వామిత్రుడు రామునకు దివ్యాస్త్రాలను ప్రసాదించాడు. అటు పిమ్మట వారు విశ్వామిత్రుని యాగప్రదేశమైన వామనాశ్రమాన్ని చేరేరు. మానవునిగా అవతరించిన రామునకు తన పూర్వపు అవతారమైన వామనుని వృత్తాంతం స్మరణకు రాకపోయినా ఏదో ఒక అనిర్వచనీయమైన ఉత్కంఠ కలిగింది. యాగరక్షణలో అప్రమత్తులైన వారికి రక్తంతో మలినమైన యజ్ఞవేదిక కనబడి పైకి చూచే సరికి ఆకాశంలో రాక్షస సైన్యం దృగ్గోచరమైంది. గరుత్మంతుడు మహాసర్పాలపైనే తన ప్రతాపాన్ని చూపి, నీటిపాముల జోలికి వెళ్ళనట్లే రాముడు సామాన్య రాక్షసులను తన బాణాలకెర చేయక వారి నాయకులైన మారీచ సుబాహులనే లక్ష్యాలుగా చేసికొన్నాడు. వాయవ్యాస్త్రంతో తాటక కుమారుడైన మారీచుని పండుటాకులా పడవేసేడు. సుబాహుని వేఱొక అస్త్రంతో ముక్కలు ముక్కలు చేసి ఆశ్రమానికి ఆవలగా పక్షులకు విందుచేసేడు. సలక్షణంగా యజ్ఞం పరిసమాప్తం కావటంతో రామలక్ష్మణుల చేటి మునిజనుల స్తోత్రాలకు పాత్రులైనారు.

ఇంతలో మిథిలాధిపతి జనకుని నుండి తానుచేయ బోయే యజ్ఞానికి రావలసినదిగా విశ్వామిత్రునికి ఆహ్వానం వచ్చింది. ఆయన వద్దనున్న శివధనుస్సును గూర్చి విని దానిని చూడగోరిన రామలక్ష్మణులను తనతో తీసికొనివెళ్ళేడు. త్రోవలో గౌతమాశ్రమ వృక్షచ్ఛాయలో సాయంతన వేళ విశ్రమించారు. భర్తృశాపంతో చిరకాలంగా శిలగా మాఱిఉన్న అహల్య శ్రీరామపాద పరాగంతో తిరిగి స్వస్వరూపాన్ని ధరించింది. అర్థకామాలతో

కూడిన ధర్మంవలె శోభిస్తున్న రామలక్ష్మణయుక్తుడైన విశ్వామిత్రుని జనకుడు విధ్యుక్తంగా పూజించి తన నగరిలోనికి తీసుకొని వెళ్ళేడు. మిథిలా నగరవాసులంతా రామలక్ష్మణుల సౌందర్యాన్ని కనుఱెప్పపాటులేకుండా చూచి ఆనందించారు. యజ్ఞాంతంలో రామలక్ష్మణులు శివధనుస్సును చూడగోరుతున్నారని విశ్వామిత్రుడు జనకునికి తెలియజేసేడు. జనక మహారాజు శివధనుస్సును తీసుకొని రావలసిందిగా పరిజనుల నాజ్ఞాపించాడు. సభాజనులంతా నిర్నిమేషులై విస్మయంతో చూస్తూ ఉండగా శ్రీరాముడు ఆ శివధనుస్సును చూచి, స్పృశించి మహాశైలంవలె ఉన్నదానిని పుష్పచాపం ఎత్తినంత అవలీలగా ఎత్తి నారి సంధించాడు. ధనువు విఱగటంతో జనించిన వజ్రకఠోరరోపమైనధ్వని పరశురామునికి క్షత్రియకులం తిరిగి జాగృతమైందని నివేదించిందో అన్నట్లుందట ! రాముని పరాక్రమానికి పరితుష్టుడైన జనకుడు అయోనిజ, వీర్యశుల్క అయిన సీతను విశ్వామిత్రుని సమక్షంలో శ్రీరామునికిచ్చి వివాహం చేసేడు. వెంటనే ఒక పురోహితునితో దశరథునకు తనకుమార్తె సీతను కోడలిగా స్వీకరింపుమని వర్తమానం పంపేడు. దశరథుడు జనక పురోహితుని సత్కరించి, మిథిలకు శీఘ్రమే పయనమైనాడు. ఇంద్రవరుణ తుల్యులైన ఆ భూపతులుభయులూ వివాహ విధిని తమ ఐశ్వర్యానుకూలంగా ఘనంగా జేరిపించారు. తదుపరి జనకుని కుమార్తె ఊర్మిళను లక్ష్మణుడు, భరత శత్రుఘ్నులు జనకుని తమ్ముడైన కుశధ్వజుని పుత్రికలు మాండవీశ్రుతకీర్తులను పరిణయమాడేరు. వివాహాల అనంతరం జనకుడు దశరథుని అయోధ్యకు సాగనంపుతూ కొంతవఱకు అనుసరించాడు. దశరథుడు జనకుని వెనుకకు పంపి తాను ముందుకు సాగుతూ ఉంటే కొన్ని దుశ్శకునాలు గోచరించాయి. తగిన శాంతులకై వసిష్ఠుని అడిగితే అంతా



సుఖాంతం కాగలదని అతడూఱడించాడు. ఇంతలో ఒక మహాతేజం వారి నేత్రాలను దిగ్భ్రమకు లోను కావించింది. కొంతసేపటికది పురుషాకృతిని ధరించటంతో పరశురామునిగా వారు గుర్తించారు. అప్పటికి ఇరువది యొక్క మారులు క్షత్రియ నిర్మూలనం చేసిన పరశురాముని అవక్రపరాక్రమాన్ని, బాలురైన తనకుమారులను తలచి దశరథుడు ఖిన్నుడైనాడు.

సంభ్రమంతో “అర్ఘ్యం, అర్ఘ్యం” అని దశరథుడు పలుకుతున్నా పరశురాముడు పట్టించుకోక తన రూక్షమైన దృక్కుల్ని రామునివైపే మఱలించాడు. పరశురాముడు రామునితో “శివధనుస్సు విఱిచానని గర్వపడకు. ఆ శివ ధనుస్సు విష్ణుతేజంతో సారహీనమైందని తెలిసికో. కనుక యుద్ధం మాటలా ఉంచి, ముందు నా ఈ ధనుస్సు సంధించి చూపితే నేను నీ చేత విజితుణ్ణైనానని సమ్మతిస్తాను. లేదా శరణాగతుడవై ప్రాణరక్షణకై ప్రార్థించు” అన్నాడు. రఘురాముడు చిఱునవ్వుతో పరశురాముని చేతిలోని ధనువును కైకొని దాన్ని సంధించటమే సమాధానంగా చేసేడు. ఆ దృశ్యాన్ని చూచిన పరశురాముడు ధూమావశేష అగ్నిహోత్రుని వలె తేజోహీనుడైనాడు. శ్రీరాముడపుడు పరశురామునితో “నీపై బాణప్రయోగంచేసి బ్రహ్మహత్యా పాతకానికి ఒడికట్టుకోవటం నాకిష్టంలేదు. సంధించిన బాణం నిష్ప్రయోజనం కాకూడదు. కనుక దీనితో నీ గమనాన్ని నిరోధించేమంటావో ? లేక యజ్ఞయాగాదులతో నీవార్జించుకొన్న పుణ్యలోకాల్ని నిరోధించేమంటావో చెప్పు”మన్నాడు. భార్గవుడు “నువ్వు పురాణపురుషుడవని నాకు తెలుసు. నీలోని వైష్ణవతేజాన్ని ప్రత్యక్షంగా చూడాలనే కోర్కెతోనే ఇలా చేసేను. కనుక పరమేష్ఠివైన నీ చేతిలో పరాభవం కూడ ప్రమోదమే. పుణ్యతీర్థాల్లో తపోనిష్ఠలో ఉండదలచిన నా గమన

వేగాన్ని నిరోధించేకు ఇక స్వర్గ భోగాలపై నాకేమాత్రం ఆస్థలేదు. కనుక ఆ స్వర్గ భోగాల్నే నిరోధించు"మని కోరేడు. శ్రీరాముడు తన చేతిలోని బాణాన్ని భార్గవుని కోరిక కనుగుణంగా తూర్పువైపుకు విడిచాడు. అది భార్గవ స్వర్గమనానికి గడియగా మాఱింది. అపుడు రాముడు భార్గవ రాముని పాదస్పర్శచేసి "క్షంతవ్యుడ"నని ప్రార్థించాడు. భార్గవరాముడు రఘురాముని శతధా శ్లాఘించి "జేరుగబోయేది దేవకార్యం. నీకవిఘ్నమస్తు" అని ఆశీర్వదించి అంతర్ధానమైనాడు. విజయుడైన రాముని పునర్జన్మ పొందిన వానిగా భావించి దశరథుడాలింగనం చేసికొని కొడుకులు, కోడళ్లతో వీరిరాకకై ఎదురుచూస్తున్న అయోధ్యానగరానికి చేరి ప్రజకానందవర్ధనుడైనాడు. ఇక్కడితో ఏకాదశ సర్గ ముగుస్తుంది.

జీవితంలో అంత్యదశకు చేరిన దశరథుని చెవివద్ద కేశాలు తెల్లబడ టంతో కైక ఎక్కడ వింటుదో అన్న శంకతో రాజ్యలక్ష్మి ఆయన చెవిలో "రాజ్యాన్ని రాముని కప్పగింపుమని చెప్పింద"ని ద్వాదశ సర్గారంభం. రామపట్టాభిషేక వార్త పురజనులందఱికీ పరమానందాన్ని కలిగించింది. కాని ఆ వార్త విన్న కైకేయి విలపిస్తూ దశరథుని కన్నీటితో అభిషేక సంభారాల్ని తుడిచి పెట్టింది. దశరథుడెంతగా వేడినా కైక వినక తనకు పూర్వం ఆయనిస్తానన్న రెండు వరాలను గుర్తుచేసి, ఒకదానితో తనవైధవ్యంలో ప్రతిఫలించేబోయే శ్రీరాముని వనవాసాన్నీ, రెండవదానితో భరతునికి రాజ్యాభిషేకాన్నీ కోరింది. తొలుత దశరథుడు "రాజ్యానికి పట్టాభిషిక్తుడవు కమ్మ"ని చెప్పినప్పుడు రాముడు దుఖంతోను, పిదప "వనవాసివికమ్మ"న్నప్పుడు ప్రీతితోను పిత్రాజ్ఞ శిరసావహించాడు. పితృవాక్య పరిపాలకుడైన రాముడు. సీతాలక్ష్మణ సహితుడై దండకారణ్యాన్ని ప్రవేశించేటం సత్పురుష ప్రశంసా భాజనమైంది. తానుచేసిన పనికి



ఫలితంగా కలిగిన మునిశాపాన్ని తలచి రామ వియోగార్తుడై దశరథుడు తనువు విడిచాడు. రాజు మరణం, పుత్రుల అనుపస్థితి వల్ల కలిగిన అరాచక పరిస్థితి, శత్రురాజులను రంధ్రాన్వేషణదక్షులుగా చేసింది. మాతామహుని ఇంటనున్న భరతుని అమాత్యులయోధ్యకు తీసికొనివచ్చారు. విషయాన్నంతా సమగ్రంగా ఎఱిగిన భరతుడు రాజ్యస్వీకారానికే కాక తనతల్లి ముఖం చూడటానికి కూడా విముఖుడైనాడు. భరతుడు రాముడు వసిస్తున్న చిత్రకూటానికి వెళ్ళి అయోధ్యకు రమ్మని ఎంతగా వేడికొన్నా పితృవాక్యపరిపాలనా నిష్ఠుడైన రాముడందుకంగీకరించేలేదు. భ్రాతృభక్తి పరాయణుడైన భరతుడు అన్నగారి ప్రతినిధిగా అతని పాదుకలను యాచించి, తల్లిచేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా అయోధ్యలో ప్రవేశించేక నందిగ్రామంలో ఆ పాదుకలకు పట్టాభిషేకం చేసేడు. జితేంద్రియుడైన శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై వన్యాహారాన్నే సేవిస్తూ వృద్ధులైన ఇక్ష్వాకుల వానప్రస్థ ధర్మాన్ని యౌవనంలోనే స్వీకరించాడు.

ఒకనాడొక వృక్షచ్ఛాయలో రాముడు సీతతొడపై తలపెట్టుకొని నిద్రిస్తుంటే ఇంద్రసుతడొక కాకి రూపాన్ని ధరించి ఆమె స్తనాలను చీఱసాగేడు. సీతచే ప్రబోధితుడైన రాముడా కాకిపై ఱెల్లుగడ్డిని మంత్రించిన అస్త్రాన్ని విడువటంతో ఆ కాకి వచ్చి శ్రీరామునే శరణువేడింది. దయాళు డైన రాముడా అస్త్రంతో దానిని సంహరించేక, అస్త్రం వ్యర్థం కాకూడదు కనుక ఆ కాకి ఒక కంటిని మాత్రం నశింపచేసేట్లు దాన్ని విడిచాడు. తన నివాసం అయోధ్యా సమీపంలోఁ ఉండటంవల్ల భరతుడు తిరిగి రావచ్చుననే శంకతో సీతారామలక్ష్మణులు చిత్రకూటాన్ని వీడి ముందుకు సాగేరు. అత్రిమహర్షి ఆశ్రమాన్ని చేరటంతో ఆ మహర్షిపత్ని అనసూయాదేవి

సీతాదేవిని సుగంధాదులతో సత్కరించింది. వారు వీడ్కోలు నొంది పురోగమిస్తుంటే విరాధుడనే రాక్షసుడు వారి నడ్డగించి సీతనెత్తుకొనిపోయాడు. రామలక్ష్మణులు వానిని పట్టి చంపి వాని శరీరాన్ని భూమిలో పాతిపెట్టేరు. విరాధ సంహారానంతరం రాముడు పంచవటిని చేరి అక్కడే నివసించసాగేడు. వారక్కడ ఉండగా ఒకనాడు రావణుని చెల్లెలు శూర్పణఖ మదనాతురయై వచ్చి తనను వరించుమని రాముని కోరింది. సీతా సమక్షంలో ఆ విధంగా నిర్బంధిస్తున్న ఆమెతో రాముడు "అమ్మాయీ ! నా భార్య నా ప్రక్కనే ఉంది, నా తమ్ముని భార్య మాత్రం అతని వద్ద లేదు. కనుక అతణ్ణి సేవింపు" మన్నాడు. వారిరువురు మధ్య తిరుగుతున్న శూర్పణఖను చూచి సీత నవ్వటంతో ఆగ్రహించిన శూర్పణఖ "నువ్వు నవ్విన నవ్వుకు ప్రతిఫలం అనుభవిస్తావ"ంటూ భయంకరమైన తన నిజరూపాన్ని చూపింది. మొదట్లో మధురకోకిల స్వరం తోను, పిమ్మట కర్కశమైన నక్క కంఠంతోను పలికిన ఆ మాయావి రాక్షసి అని తలచి లక్ష్మణుడు వికృత రూపిణి అయిన ఆమె ముక్కు చెవులను ఖండించి మఱింత వికృతరూపిణిని చేసేడు. ఆమె ఆకాశంలో నిలిచి తన చూపుడు వ్రేలితో వారిని బెదిరిస్తూ 'జన స్థానం'లో ఖర, దూషణాదుల వద్దకు చేరి తనకు కల్గిన అవమానాన్ని వెళ్ళబోసికొంది. విరూపిని ముందుంచుకొని రామునిపై యుద్ధానికి బయలుదేరిన ఖర,దూషణాలకదే అశుభమైంది. సీత రక్షణకు లక్ష్మణుని నియోగించి రాముడొక్కడే ఆ వేలాది రాక్షసుల నెదుర్కొన్నాడు. దూషణ, ఖర,త్రిసురలపై క్రమంగానే రాముడు బాణాలు విడిచినా ఏకకాలంలోనే వాటిని విడిచినట్లనిపించి రక్త సిక్తాలు కాక అవి వారి ప్రాణాలను మాత్రమే హరించాయి. సర్వ రాక్షససేన సంపూర్ణంగా నిహతమైంది. ఆ దుర్వార్తను శూర్పణఖ రావణునికి తెలిపింది. సోదరిని



శిక్షించినందుకు, ఆప్తులను వధించినందుకు రావణుడు తన పదితలలపైన రాముని పాదం ఉంచినట్లు భావించి కృద్ధుడయ్యాడు. రాక్షసుడు (మారీచుడు) లేడి రూపంలో రామలక్ష్మణులను వంచించి, పక్షీంద్రుడు (జటాయువు) క్షణమాత్రం తన మార్గానికవరోధం కల్పించినా రావణుడు సీతాదేవినపహరించాడు. కొన ఊపిరితో ఉన్న పక్షీంద్రుడు (జటాయువు) రాముని కాసమాచారాన్నందించి మరణించాడు. రాముడాతనికి తన తండ్రికివలెనే, ఊర్ధ్వలోక క్రియలొనర్చాడు.

కబంధుడనే రాక్షసుడు శ్రీరాముని శరాఘాతంతో శాప విముక్తుడై దైవత్వాన్నొందేడు. అతడు రామునితో సమాన దైన్యాన్నొందుతున్న కపి (సుగ్రీవుడు)తో మైత్రి వలన కార్యసిద్ధి కాగలదని చెప్పటంతో శ్రీరాముడతనితో సఖ్యం చేకూర్చుకొన్నాడు. అనంతరం రాముడు వాలిని చంపి వాని స్థానంలో సుగ్రీవుని రాజుగా పట్టాభిషిక్తుని చేసేడు. సుగ్రీవాజ్ఞతో కపివరులంతా సీతకై అన్వేషిస్తూ అటవీ ప్రదేశాన్నంతా తిరుగసాగేరు. సంపాతి (జటాయువు సోదరుడు) దర్శనంతో సీత జాడ తెలిసికొన్న మారుతి బంధరహితుడు సంసార సాగరాన్ని తరించినట్లు సముద్రాన్ని దాటేడు. అక్కడతనికి సీత రాక్షస స్త్రీల సమూహంలో గోచరించింది. మారుతి శ్రీరాముని అంగుళీయకాన్ని జానకికి సమర్పించాడు. సీతకు రామ సందేశాన్ని అందించి క్షణకాలం బ్రహ్మాస్త్ర బంధితుడై తన తోకకు రాక్షసులు అంటించిన నిప్పుతోనే హనుమంతుడు లంకాదహనం కావించాడు. అనంతరం సీత ప్రత్యభిజ్ఞానంగా ఇచ్చిన చూడామణిని ఆమె సందేశంతో పాటు శ్రీరాముని కర్పించాడు. శత్రునాశానికై బయలుదేరిన రామునితో కపిసేన భూమ్యాకాశాలు నిండి అనుసరించింది. సముద్రతీరంలో ఉపవిష్టుడైన రామసన్నిధికి

విభీషణుడు శరణాగతుడై వచ్చాడు. శ్రీరాముడు వానరసేనతో లవణాంబుధికి సేతునిర్మాణం చేయించాడు. దానితో సముద్రాన్ని దాటి శ్రీరాముడు లంకను వానరసేనతో ఎదుర్కొన్నాడు. రామరావణుల జయఘోషలతో దిక్కులు పిక్కటిల్లిపోతుంటే ఉభయసేనలకు భీకర యుద్ధం ప్రవర్తిల్లింది. ఛేదిత రామశిరస్సును చూచి మూర్ఛితయైన సీతను త్రిజట “అది మాయ” అని చెప్పి లబ్ధ సంజ్ఞారాలను చేసింది.

మేఘనాదాస్త్ర బంధితులైన రామలక్ష్మణులకు గరుత్మంతుని రాకతో క్షణకాలంలో ఆ అస్త్రబాధతొలగి అది స్వప్న వృత్తాంతమనిపించింది. రావణ ప్రయుక్త “శక్తి” లక్ష్మణుని వక్షః స్థలాన్ని ఛేదించేటంతో రాముడు వివశుడైనాడు. మారుతి తెచ్చిన “సంజీవిని”తో పునరుజ్జీవితుడైన లక్ష్మణుడు తన శరపరంపరలతో ఆ లంకాస్త్రీలకు శోకాన్ని నేర్పటంలో ఆచార్యత్వం వహించాడు. పిదప లక్ష్మణుడింద్రజిత్తును వధించాడు. సుగ్రీవుడు కుంభకర్ణుని ముక్కుచెవులు ఖండించేటంతో అతడు వచ్చి రామునెదుర్కొన్నాడు. రాముడు “అయ్యో! నీ అన్న నిన్ను వృధాగా మేల్కొలిపేడ”నట్లు అతనికి దీర్ఘనిద్రను ప్రసాదించాడు. తమ్ముని మరణవార్తతో క్రోధోద్దీపితుడైన రావణుడు “నేటితో జగత్తు రావణ రహితమో, రామ రహితమో కావాల”నే నిశ్చయంతో తిరిగి యుద్ధభూమిలో ప్రవేశించాడు. రావణుడు రథ సహితుడు, రాముడు రథ రహితుడు కావటం గమనించిన దేవేంద్రుడు తన రథాన్ని సారథి మాతలి సహితంగా రామునికై పంపేడు. లోకపాలురను జయించి, తన శిరస్సులనే నైవేద్యం చేసి, ఈశ్వరు నర్చించి, కైలాసాన్నే కదిపిన తన శత్రువు రావణుని రాముడు గౌరవంతో చూచాడు. రావణుడు రాముని కుడి భుజంపై బాణాన్ని నాటేడు. రామప్రయుక్త శరం రావణుని వక్షస్థలాన్ని చీల్చి ‘ధర’ లోనికి ప్రవేశించింది.



ఈ విధంగా న్యాయస్థానం లోని వాది ప్రతివాదుల వలె రామరావణ ప్రయుక్తాస్త్రాలు పరస్పరం పోరాడేయి. జయలక్ష్మి డోలాయమానయైంది. దేవతా రాక్షస బృందం ఇరువురి యుద్ధ నైపుణికి తత్తత్సమయాల్లో పుష్పవృష్టిని కురిపించింది. రావణుడు యముని నుండి అపహరించుకొని వచ్చిన శతఘ్నిని రామునిపై ప్రయోగించాడు. రాముడు దానిని అరటి చెట్టును నఱికినంత సులభంగా అర్ధచంద్రాకార బాణంతో ఛేదించాడు. వెంటనే బ్రహ్మాస్త్రాన్ని రావణునిపై సంధించాడు. అది దేదీప్యమానంగా వెలిగిపోతూ అరనిముషంలో రావణుని పదితలల్నీ నేలకూల్చటలో అతనికి తలలు తెగిన బాధే తెలియలేదు. దేవతలు పూలవాన కురిపించినపుడుగాని రావణ శిరచ్ఛేదం తెలియరాలేదు. ఇంద్ర సారథి రాముని ఆజ్ఞతో స్వర్లోక ప్రయాణ సన్నద్ధుడైనాడు. అగ్ని ప్రవేశంతో శుద్ధినొందిన సీతను శ్రీరాముడు స్వీకరించి విభీషణుని పట్టాభిషిక్తుని చేసి పుష్పకవిమానాధిరూఢుడై అయోధ్యానగ రోన్ముఖుడైనాడు.

పుష్పకవిమానంలో అయోధ్యానగర ప్రస్థానంలోని విశేషాలను శ్రీరాముడు, సీతకు వివరించే అంశాలు త్రయోదశ సర్గలో చోటుచేసికొంటాయి. శ్రీరాముడు సేతువును చూపి సీతతో “వైదేహీ! అదిగో చూడు! నేను నిర్మించిన సేతువెంత అందగా ఉందో! ఈ సముద్రం ఇంత విశాలంగా ఉండటానికి మా పూర్వులే కారకులు. మా వంశస్థుడైన సగర చక్రవర్తి అశ్వమేధయాగం తలపెట్టి అశ్వాన్ని విడిచినప్పుడు దాన్ని వెదుకుతూ సగరపుత్రులు భూమిపై కనబడనందువల్ల భూమిని త్రవ్వేరు. అందువల్లే ఈ సాగరం ఇంత పెద్దదైంది. సముద్రుని గొప్పతనం ఎటువంటిదో తెలుసా? ఈ సముద్ర జలాలను స్వీకరించి మేఘాలు వర్షించేటంవల్లే జగత్తు సస్యశ్యామలమౌతోంది. ఆయనలో రత్నాలుండటంవల్ల అవి ప్రజలకు

చేరటంతో ప్రజలు ధనవంతులౌతున్నారు. అంతేకాదు. బడబాగ్నిని సైతం తనలో ధరించేటంవల్ల సముద్రుని ఆశ్రిత పక్షపాతిగా భావించేవచ్చు. ప్రాణులకాహ్లాదాన్ని కల్గించే చంద్రుడితనినుండే ఉద్భవించాడు. శ్రీమహావిష్ణువుకీ సముద్రమే శయ్య".

భారతీయులు కొన్ని నిర్దిష్ట దినాల్లోనే - అంటే సంవత్సరానికి నాలుగు దినాలే - ఆ - కా - మా - వై - ఆషాఢ - కార్తిక - మాఘ - వైశాఖ పౌర్ణమి దినాల్లోనే సముద్ర స్నానం ఆచరించి పునీతులౌతారు. తదితర దినాల్లో సముద్రాన్ని స్పృశించేరాదనే నియమం కూడా ఉంది. అట్టి పవిత్రతను సూచించేటానికి కాళిదాసు శ్రీరామ ముఖంగా సీతకు ప్రయాణంలో తటస్థించే దృశ్యాల్ని చెప్పే నెపంతో సముద్ర విశేషాల్ని వర్ణించాడు.

దృశ్యవర్ణనలో యథావకాశంగా సీతాసౌందర్యాన్ని కూడా రాముడు ప్రశంసిస్తాడు, పగడాలు ఆమె అధరం వంటివంటాడు. అలల వేగంతో సముద్రంలోని పగడాలపై శంఖాలు వచ్చి చేరేయి. ఈ సామ్యంతో ఆమె పెదవి పగడం వంటిదైతే దానిపై చేరిన శంఖం ఆమె చిఱునవ్వు అని చెప్పి ఆమెను ప్రీతను చేసేడు. మధ్యాహ్న సమయం ఆసన్నం కావటంతో సీతాదేవి ముఖంలో స్వేదబిందువులుద్భవించి మాయమౌతున్నాయి. దానికి కారణం ఆకాశ వాయువు వాటిని ఆచమిస్తున్నట్లుందంటాడు. సంవత్సర కాలం ఎడబాటు తర్వాత ఏకాంతంగా ఆకాశ మార్గాన పయనిస్తుండటంతో భార్య సౌందర్యాన్ని తనివితీరా ఆస్వాదిస్తూ ఆమెకి సంతోషాన్ని చేకూరుస్తున్నాడు రాముడు. విమానపు గవాక్షంద్వారా చూస్తూ ఆ ఆ సన్నివేశాల్ని హృద్యంగా వర్ణించి చెబుతున్నాడు. జనస్థానం పైనుండి విమానం పయనిస్తునట్లుంది. "పూర్వం



ఋషులు ఖరదూషణాది రాక్షస భయంతో తపస్సుకు, యజ్ఞనిర్వహణకు ఇతర ప్రదేశాలకు వెళ్ళేవారు. ఇప్పుడు వారి బాధ నిర్మూలనమైనందువల్ల తిరిగి ఆ ప్రదేశానికి వచ్చి నిర్భీకులై అనుష్ఠానాది తత్పరులైనారు. నేను నిన్ను వెదకుతున్న సమయంలో నీ పాదనూపురం కనపడిన స్థానం ఇదే సుమా! నీ పాద వియోగంతో నా వలె ఆ మంజీరం కూడా దుః ఖంతో మౌనంగా పడి ఉంది. (సీత నడిచేటపుడు ధ్వనిచేసేది, ఇప్పుడామె పాదం నుండి భ్రష్టమైంది కనుక నిశ్శబ్దంగా ఉంది) ఎంతటి సుతిమెత్తని భావం ! ఇదిగో ! ఇక్కడే లేళ్లు (నీకు కలిగిన ఆపదతో విచారగ్రస్తులై) తింటున్న గడ్డిని వదలి తమ నేత్రాల్ని దక్షిణపు వైపు మఱలిస్తూ నువ్వా దిశకు వెళ్ళేవని నాకు సూచించాయి. ఏ పర్వతాగ్రంపై మేఘాలు వర్షజలాన్ని, నీ వియోగదుఃఖంతో నేను కన్నీటినీ ఏక కాలంలో విడిచి పెట్టేమో, ఆ మాల్యపర్వత శిఖరం అదిగో! విరహోత్కంఠతో దుస్సహ దుఃఖాన్ననుభవిస్తూ ఏ పర్వత గుహల్లో మేఘ గర్జనలు వింటూ నేను కాలంగడిపేనో ఆ పర్వతగుహలివే చూడు. అదిగో పంపాసరోవరం! చక్రవాక మిథునాలు కలువ పుప్పొడిని పరస్పరం అందించుకొంటుంటే నిన్ను తలచుకొని వాటినే కుతూహలంగా చూస్తూ కాలక్షేపం చేసేవాణ్ణి. అదిగో విమానపు సందుల్లోంచి వ్రేలాడుతున్న నీ పైడి మువ్వల ధ్వనిని విని అవి తోటి కొంగలనే భావంతో పైకెగురుతూ ఉన్న గోదావరిపై బెగ్గురు పక్షులు నీకు స్వాగతం పలుకుతున్నట్లు లేవూ? ఇదిగో పంచవటికి వచ్చేసేం. అబ్బ ! ఎన్నాళ్ళకి ! నువ్వు నీరు పోసి పెంచిన మామిడి చెట్లు, ముఖాలెత్తి చూస్తున్న ఆ కృష్ణసార మృగాల్నీ చూస్తుంటే ఎంత సంతోషంగా ఉందో తెలుసా?

ఏ అగస్త్య మహర్షి క్రోధ దృష్టి నహుషుని దేవేంద్ర పదవినుండి భ్రష్టుణ్ణి చేసిందో ఆ మహర్షి ఆశ్రమం అదిగో ! అక్కడ చూసేవా ? మేఘ మధ్యంలో చంద్రబింబంలా కనిపిస్తున్న ఆ కాంతే శాతకర్ణి మహాముని 'పంచాప్సర'మనే క్రీడా సరోవరం. నీకా కథ తెలుసా ? పూర్వం ఆ మహాముని కేవలం దర్భాంకురాల్నే భుజిస్తూ లేళ్లతో కలిసి జీవిస్తూ తీవ్రతపోనిష్ఠుడై ఉంటే ఇంద్రుడు భీతుడై ఐదుగురు అప్సరసలాతని తపోవిఘ్నానికై పంపేడు. ఎవరికీ కనబడకుండా జలాల్లోనే తన తపశ్శక్తిచేత సౌధ నిర్మాణం చేసికొని ఆ అప్సరసలతో గీత వాద్య వినోదాలతో గడుపుతుంటాడా ముని. ఆ సౌధాంతర్గత మృదంగ ధ్వనులే పుష్పకవిమాన చంద్రశాలలో క్షణకాలం వినవస్తూ ఉంటాయి ! అదిగో – ఆ ప్రదేశంలో సుతీక్ష్ణుడనే మఱొక మహాముని అన్వర్థ నామధేయుడు కాక జితేంద్రియుడూ, సౌమ్యుడూ అయి పంచాగ్ని మధ్యంలో తపస్సాచరిస్తున్నాడు. ఇంద్రుడలవాటు చొప్పున అతనికి తపో భంగం కలిగించేటానికి అప్సరలను పంపితే వారి శృంగార భావాచేష్టాదులేమీ అతణ్ణి ఆకర్షించలేకపోయాయి. మౌన వ్రతధారి అయిన ఆ మహర్షి తన చేతితో ఇక్కడ ఆతిథ్యాన్ని స్వీకరింపుమని సైగచేసేడు. మన విమానం దాటి వస్తున్నందువల్ల తిరిగి తన దృష్టిని సూర్యునిపై నిలిపి తపస్సు కొనసాగిస్తున్నాడు. నా నమస్కృతికి తల పంకించి తిరిగి తన తపస్సులో నిమగ్నుడైనాడు. అదిగో అది శరభంగ మహాముని ఆశ్రమం. చిరకాలం సమిధలతో అగ్నిహోత్రుని సంతుష్టుని చేసి చివరకు మంత్రపూతమైన తన శరీరాన్ని అగ్నికి ఆహుతి కావించిన మహనీయుడాయన. అయితే ఇప్పటికీ ఆతిథ్యాన్నిచ్చే బాధ్యతన చేటి వృక్షాలకప్పచెప్పేడు. అప్పుడే చిత్రకూటానికి వచ్చేసేం. ఇక్కడి తమాల వృక్షపు చిగురును నీకు కర్ణావతంసంగా



సమకూర్చాను గుర్తుందా? అత్రిమహర్షి ఈ ఆశ్రమంలోనే సాధన సాగిస్తూ ఉంటాడు. పూర్వం అనసూయాదేవి అచటికి వచ్చే ఋషుల స్నాన సౌకర్యార్థం గంగానదినే ఇక్కడ ప్రవహింపజేసింది ! మన అరణ్యవాసారంభ దినాల్లో ఈ మఱ్ఱిచెట్టువద్దనే మన వనవాస పరిపాలన సక్రమంగా పూర్తికావాలని మ్రొక్కుకొన్నావూ, అదిగో ఆ మఱ్ఱిచెట్టు ! ఇదిగో ఇది గంగా, యమునల సంగమ ప్రదేశం. ఇక్కడ స్నాతులైనంత మాత్రాన ఆత్మజ్ఞాన రహితులు కూడా మోక్షప్రాప్తినొందుతారు. ఇదిగో గుహుని పట్టణానికి చేరుకొన్నాం.

అదిగో మానస సరోవరం ! సరయూ నది ఆవిర్భావానికిది కారణమని చెబుతారు. ఈ నదీ తీరంలోనే మా పూర్వులు అశ్వమేధ యాగాలాచరించినపుడు పాతిన యూప స్తంభాలవిగో ! అవభృథస్నాన మాచరించిన మా పూర్వులచేత ఈ సరయూనదీ తోయాలు ద్విగుణీ కృతంగా పవిత్రాలైనాయి. దీని ఇసుకతిన్నెలపై ఉత్తర కోసల ప్రభువులు తల్లి ఒడిలో సుఖించినట్లు ఆడి పాడేరు. ఆ కారణంగా ఈ నదిపై నాకపార గౌరవం. మా తల్లి కౌసల్య వలనే, మా తండ్రి మరణంతో ఆయన వియోగ దుఃఖిత అయినా, తిరిగివస్తున్న నన్ను తన తరంగహస్తాలతో కౌగిలించు కొంటున్నట్లనిపిస్తోంది.

హనుమంతునిచే మనరాకను విన్న భరతుడు ససైన్యంగా మనలనాహ్వానించేటానికి వస్తూ ఉంటాడనుకొంటాను. "ఖర దూషణాదులతో నేను పోరాడి నప్పుడు నిన్ను కాపాడి నాకు సమర్పించిన లక్ష్మణుని వలె సాధువైన భరతుడు నా అనుపస్థితిలో రాజ్యాన్ని రక్షించి పితృవాక్యానుగుణంగా కృతప్రతిజ్ఞుణ్ణైన నాకు సమర్పించేబోతున్నాడు. అదిగో ! కనిపిస్తున్నాడు. గురువులు వసిష్ఠులను ముందుంచుకొని పూజా ద్రవ్యాలతో వృద్ధామాత్యులతో నారచీరలను ధరించి వస్తున్నాడు చూడు !"

శ్రీరాముని ఈ మాటలను విన్న పుష్పక విమానం భరతుననుసరించి వచ్చిన ప్రజలుత్కంఠతతో ఆశ్చర్యంగా ఆకాశంవైపు చూస్తుండగా నేలపై వ్రాలింది. సుగ్రీవుని హస్తాన్ని ఆసరాగా తీసికొని ముందు నడుస్తూ విభీషణుడు మార్గాన్ని చూపుతూ ఉంటే శ్రీరాముడు పుష్పక విమానం నుండి దిగేడు. ఇక్వాకు కుల గురువైన వసిష్ఠునకు ప్రణమిల్లి భరతుడిచ్చిన అర్ఘ్యాన్ని స్వీకరించి అతణ్ణి గాఢంగా కౌగిలించుకొని మూర్ధాభిఘ్రాణం చేసేడు. అచట చేరిన వారి నందఱినీ సప్రేమ వీక్షణాలతో గౌరవించాడు. శ్రీరాముడు సుగ్రీవ, విభీషణులను పరిచయం చేయటంతో భరతుడు ముందు వారికి నమస్కరించి పిదప తనకు నమస్కరించిన లక్ష్మణుని అక్కున చేర్చుకొన్నాడు.

భ్రాతృభక్తితో రాజ్యాన్ని విసర్జించి జటలను ధరించిన భరతుని శిరస్సు, లంకేశ్వరుని ప్రలోభాలకు, ప్రార్థనకు తల ఒగ్గక తనపాతివ్రత్యాన్ని పరిరక్షించుకొన్న సీతామహాదేవి పాదద్వంద్వం పరస్పరం పవిత్రీకరించు కొన్నాయన్న కాళిదాసుమాటలెంత అర్థవంతాలు ! శత్రుఘ్నుడు కల్పించిన పటకుటీర శోభితమైన అయోధ్యానగరోప వనంలో శ్రీరామాదులంతా విడిసేరు.

అయోధ్యకు చేరిన రామలక్ష్మణులు సీతతో తమ తల్లులకు నమస్కరించేటంతో చతుర్దశ సర్గారంభమౌతుంది. సీత తనవల్లనే భర్త, మఱిది కష్టాలపాలైనారని దుఃఖిస్తుంటే, ఆమె పాతివ్రత్య మహిమతోనే వారు కృతకృత్యులైనారని అత్తలామెనోదార్చారు. బంగారు కలశాలతో తీసుకొని వచ్చిన పుణ్యనదీ తోయాలతో వృద్ధామాత్యులు శ్రీరామ పట్టాభిషేకాన్ని జేరిపించారు. లక్ష్మణ, శత్రుఘ్నులు శ్రీరామునకు వింజా మరలు వీస్తూ ఉంటే భరతుడు ఛత్రాన్ని పట్టేడు. తండ్రి దశరథుని



చిత్రపటం పూజలందుకొంటున్న భవనాన్ని దుఃఖంతో ప్రవేశించిన రాముడు కైకకు నమస్కరించాడు. రాముని ముఖంలోకి చూడటానికి సిగ్గుపడుతున్న ఆమెను "తల్లీ! మా తండ్రి అసత్యభాషి కాకుండా ఉండటానికి నీ సుకృతమే కారణం" అంటూ ఓదార్చాడు. అగస్త్యాది మహర్షులు విచ్చేసి రామునికి మంగళాశాసనాలు పలికేరు. పదునైదు దినాలక్కడ గడిపిన పిదప సుగ్రీవాది కపివరులు, విభీషణాది రాక్షసశ్రేష్ఠులు సీత స్వహస్తాలతో తీసికొనివచ్చిన ఉపాయనాలను స్వీకరించి రామునిచే వీడ్కోలు నొంది తమ తమ స్థానాలకు తరలి వెళ్ళేరు. శ్రీరాముడు పుష్పకవిమానాన్ని కుబేరునికి పంపేడు.

పట్టాభిషిక్తుడైన రాముడు ధర్మార్థకామాలను సమానంగా గౌరవించినట్లు తన ముగ్గురు తమ్ములపట్ల సమాన వాత్సల్యం చూపేడు. లోభ రహితుడైన రాముని పాలనలో ప్రజలు ధనవంతులు, సత్కర్మానుష్ఠాన నిరతులూ అయినారు. శ్రీరాముడు వైదేహితో ఇష్టోపభోగా లనుభవిస్తున్నాడు. వారి వనవాస దృశ్యాలు చిత్రకారులు చిత్రపటాలుగా రూపొందించారు. ఇలా దినాలు దొర్లుతూ ఉంటే సీతాదేవి గర్భాన్ని ధరించింది. శ్రీరాముడామెను తన తొడపై నుంచుకొని గర్భవతుల కోర్కెలు తీర్చటం భర్తల విధి కనుక ఏదైనా కోరుకోమన్నాడు. ఆమె భాగీరథీతీరస్థ తపోవనాలను తిరిగి చూడగోరుతున్నానని చెప్పింది. ఆమె కోర్కె తప్పక తీరుస్తానని చెప్పి అయోధ్య నగరశోభను తిలకించాలని సౌధాగ్రాన్ని చేరేడు. తనను గూర్చి ప్రజల అభిప్రాయాన్ని తెలిసికోవటానికి పంపిన భద్రుడనే గూఢచారిని ప్రశ్నించాడు. సత్యాన్ని తెలుపుమని నిర్బంధించేటంతో భద్రుడు "రావణాసురుని మందిరంలో ఉన్న సీతాదేవిని మీరు తిరిగి గ్రహించేటమనే ఒక్క విషయంలో తప్ప ప్రజలు మిమ్మల్ని శతధా ప్రశంసిస్తున్నార"ని

విన్నవించాడు. కళత్ర నిందను విన్న రాముని హృదయం అగ్నితప్తలోహం సమ్మెటవ్రేటుతో భగ్నమైనట్లు భగ్నమైంది. దానికి సీతాపరిత్యాగం అనివార్యమని భావించి తమ్ములను పిలిచి జేరిగిన విషయాన్నీ, తన నిర్ణయాన్నీ వారికి తెలిపేడు. "సీత అనఘ అని నాకు తెలిసినా, ఆమెపై వచ్చిన అపవాదు అసత్యమని తెలిసినా చంద్రుని లోని ఛాయను కళంకంగా నిర్ణయించినట్లే సీతపై ప్రజలు నిందారోపణ చేస్తున్నారు. జనవాక్యం కర్తవ్యం కనుక అమెను పరిత్యజించేక తప్పదు. నేను రాజధర్మం నిర్వహిస్తూ కొంత కాలం ఉండాలనుకొంటే దయతో నా నిర్ణయాన్ని ఆటంక పఱచేవద్ద"ని వారి నర్థించాడు. రాముడు లక్ష్మణుని ఏకాంతంగా పిలిచి గంగాతీర తపోవనాలను దర్శించాలనే కోర్కె మిషతో ఆమెను వాల్మీకి తపోవనంలో విడిచి రమ్మని ఆదేశించాడు. తండ్రి జమదగ్ని ఆజ్ఞానుసారం తల్లి శిరస్సును పరశురాముడు ఖండించినట్లు లక్ష్మణుడు తన అగ్రజుని ఆజ్ఞను శిరసావహించాడు. పెద్దల శాసనాన్ని పాటించేటమే పిన్నల విధికాని దానిలోని మంచి చెడులను విచారించేటం వారి పనికాదంటాడు కాళిదాసు. సుమంత్రుడు తీసికొని వచ్చిన మేలైన అశ్వాల్ని పూన్చిన రథానిపై సీత నధిరోహింపజేసి ఆమెతో లక్ష్మణుడు బయలు దేరాడు.

త్రోవలో సీతాదేవికి దక్షిణనేత్ర స్పందనమైంది. రామునికి శుభం కలుగాలని ఆమె ఆశంసించింది. గంగాసైకత స్థలంలో రథాన్ని దిగి నావలో ఆవలి తీరం చేరిన తర్వాత లక్ష్మణుడు దుఖాన్ని దిగమ్రింగి దుర్వార్తను వెడలగ్రక్కేడు. లక్ష్మణుడు చెప్పిన రాజాజ్ఞను విన్న సీత దిగ్భ్రాంతురాలై స్పృహతప్పి నేలపై పడిపోయింది. మహాసాధ్వి సీత తన భర్తను పల్లెతు మాట అనకుండా తనదౌర్భాగ్యానికే వగచింది. లక్ష్మణుడు నమ్రుడై తన అశక్తతను నివేదించి క్షమాభిక్షనర్థిస్తూ ఆమెపాదాలపై పడ్డాడు. సీత అతణ్ణి



లేవనెత్తి "పరాధీనుడవైన నువ్వీ విషయంలో ఏం చేయగలవు ? నువ్వు చేసిన పనికి సంతోషం. చిరంజీవ" అంటూ దీవించింది. "అత్తలకు నా ప్రణామాలందించు. నా గర్భంలో ఉన్న వారి సంతానాన్ని ఆశీర్వదించు మన్నానని మీ అన్నగారికి తెలుపు. నీ కళ్ళెదుటే అగ్ని ప్రవేశం చేసిన నన్ను అగ్ని దహించేక నేను పరిశుద్ధను కనుక స్వీకరించుమని ఆదేశించినా కేవలం లోకాపవాదంతో నన్ను పరిత్యజించేటం ఎంతవఱకు శాస్త్రసమ్మతమో ఆలోచించు ఇది మీ వంశ ప్రతిష్ఠానుగుణమా ?" అని అడుగు మని చెప్పి "ధార్మికుడవైన నువ్వు చేసిన ఈ పని శాస్త్రవిరుద్ధం, ధర్మ విరుద్ధం, శాస్త్రాతి క్రమణం, కులాచార వ్యతిరేకం. అయితే నా జన్మాంతర కృత పాపం చేత నామీద ఇది పిడుగుపాటై పడింది. నేనక్కడికి వచ్చిన తొలిరోజుల్లో రాజ్యలక్ష్మి నిన్ను వరించింది. అయితే నువ్వు ఆమెను కాదని నన్ను తీసికొని అరణ్యాలపాలైనావు. అందువల్ల నాపై ఈర్ష్యతో నే నక్కడ నీ వద్ద ఉన్నంత కాలం నీకామెపై ప్రేమ జనించేదనే భావంతో నన్ను నీ నుంచి గెంటిందను కొంటున్నాను. ఈ విధంగా రాజ్యలక్ష్మి నా వల్ల తనకు సవతి పోరు లేకుండా చేసికొన్నట్లుంది. నేను గర్భవతిని కాకపోతే నీ వియోగాన్ని భరించేలేక జీవితాన్ని త్యజించేదాన్నే. నీ వంశాంకురం నా గర్భస్థమై ఉన్నందువల్ల నేను జీవితాన్ని త్యజించే కూడదు. కనుక ప్రసవానంతరం సూర్యునిపై దృష్టి నిలిపి వచ్చే జన్మలో సహితం నీవే నాకు భర్తగా లభించేలని తపోదీక్ష వహిస్తాను." అని చెప్పిన సీత మాటలను రామునికి విన్నవిస్తానని లక్ష్మణుడు వెళ్ళిన తరువాత సీత హృదయ విదారకంగా రోదించేసాగింది. ఆమె శోకంతో ఆ అరణ్య ప్రాంతమంతా సహానుభూతి నొందింది.

తమసా నదీతీరంలో బోయ చేంపిన మగ క్రౌంచ పక్షిని చూడటంతో ఏ కవి శోకం శ్లోకమై నిలచిందో ఆ వాల్మీకి సమిధలను, ధర్భల్నీ సేకరించుకొంటూ ఆమె రోదన ధ్వని విని వెతుక్కొంటూ సీతవద్దకు వచ్చాడు. ఆయనను చూడటంతో సీత తన విలాపాన్ని నిగ్రహించుకొని కళ్ళు తుడిచికొని నమస్కరించింది. గర్భవతిగా ఉండటం గమనించిన వాల్మీకిమహర్షి "సుపుత్రావాప్తిరస్తు" ని ఆశీర్వదించాడు. ఆయన "నీ పై వచ్చిన మిథ్యాపవాదంతో క్షోభించిన నీ పతి నిన్ను పరిత్యజించాడని నాదివ్య దృష్టితో గ్రహించాను. నువ్వు ఈ అరణ్యంలో ఉన్న పితృగృహానికే చేరేవు. దుఃఖించేవద్ద"ని ఆశ్వాసిస్తూ "లోకత్రయ కంటకుని (రావణుని) వధించినా, సత్య ప్రతిజ్ఞుడైనా ఆత్మస్తుతి పరుడు కాకపోయినా నీ పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఆ భరతుని అన్నపై నాకు కోపంగా ఉంది మీ మామగారు నాకు మంచి మిత్రుడు. సత్పురుషుల సంసారతాపత్రయ ఛేద కారకుడైన నీ తండ్రి నాకు మాన్యుడు. నీవు పతివ్రతామ తల్లులలో అగ్రగణ్యవు. కనుక నీపై కరుణ కలుగటానికింతకు మించి ఏంకావాలి ? కనుక నువ్వు నిర్భయంగా నా ఆశ్రమంలో ఉండు. నీ ప్రసవానంతరం నీ సంతానానికి వలసిన జాతకర్మాది సంస్కారాలు కూడా నేనే నిర్వహిస్తాను. ఈ ఆశ్రమ వాసంలో నీ మనస్సు ప్రశాంతతను భజిస్తుంది." అని ఆమె నా మహర్షి తన ఆశ్రమానికి తీసుకొని వెళ్ళేడు. ముని పత్నులామెను సర్వవిధాలా సంభావించారు.

తన భర్త వంశాంకుర రక్షణకై సీతాదేవి వన్యాహారాన్ని స్వీకరిస్తూ శరీరాన్ని నిలుపుకొంది. అక్కడ లక్ష్మణుడు సీతను విడిచి వెళ్ళి అన్నగారికి సీత పలుకులనందించాడు. శ్రీరాముడు సైతం కన్నీటిని విడిచి, తన దుఃఖాన్ని తానే నిగ్రహించుకొంటూ ప్రజాపాలనాపరతంత్రుడైనాడు.



లోకాపవాద భీతితో సీతా పరిత్యాగం చేసేడు కాని మనస్సులో ఆమె శాశ్వతంగానే ఉండిపోయింది. ఏకపత్నీ వ్రతుడైన శ్రీరాముడు భార్యను త్యజించేటంతో రాజ్యరమ సవతి పోరులేక రామునితో ప్రకాశించింది. తనను వీడిన తరువాత రాముడు తిరిగి వివాహమాడక తన ప్రతికృతితో యజ్ఞాదులాచరిస్తున్నాడనే వార్త విన్న సీత దుర్వారమైన పరిత్యాగక్లేశాన్ని ఎలాగో భరించేసాగింది. ఇక్కడితో చతుర్దశ సర్గ పరిపూర్తి నొందుతుంది.

సీతాపరిత్యాగానంతరం ఆసముద్ర క్షితికి మాత్రమే ఈశుడై శ్రీరాముడు పరిపాలన కొనసాగిస్తూ ఉండగా యమునా తీరస్థ మునులు వచ్చి తమ యజ్ఞయాగాది క్రియలను ధ్వంసం కావిస్తున్న లవణాసురుని బారినుండి రక్షణ కల్పించేవలసినదిగా కోరటంతో పంచదశ సర్గ ప్రారంభమౌతుంది. తపశ్శక్తితో తాము స్వయంగా కార్యనిర్వహణా దక్షులైనా తమ తపశ్శక్తిని దానికి వినియోగించేరు. పైగా రాజ్యరక్షణ ప్రభువు విధి కాని మునులది కాదు. శ్రీరాముడు తాను తప్పక మునుల యజ్ఞాలకు కలిగే అవరోధాన్ని తొలగించేగలనని వారికభయమిచ్చాడు. ఆ లవణాసురుని చేతిలో 'శూలం' ఉన్నంత వఱకతడజేయుడనీ, అతని చేతిలో శూలం లేని వేళే సంహరించాలనే 'కిటుకు' కూడా రామునికా మునులు తెలియజేసేరు. శ్రీరాముడాకార్యాన్ని శత్రుఘ్నుని కాదేశించాడు. శత్రుఘ్నుడు శ్రీరామునికి నమస్కరించి సంతోషంతో రథాధిరూఢుడై లవణాసుర సంహారానికై బయలుదేరేడు. త్రోవలో శత్రుఘ్నుడు ఒక రాత్రివేళ వాల్మీకి ముని ఆశ్రమంలో విశ్రాంతికై విడిసేడు. ఆ రాత్రే సీతాదేవి ఇద్దఱు కుమారులను ప్రసవించింది. అన్నగారికి పుత్రలాభం కలిగిన వార్త విన్న శత్రుఘ్నుడు అపరిమితానందంతో ప్రాతఃకాలంలో వాల్మీకి మహర్షికి నమస్కరించి ముందుకు సాగేడు.

రావణుని చెల్లెలైన కుంభీనసి కుమారుడు లవణాసురుని శూలం చేతిలో లేనివేళ శత్రుఘ్నుడెదుర్కొన్నాడు. లవణుడు అక్కడ సమీపంలో ఉన్న మహావృక్షాన్ని చిన్న గడ్డి పరకను తీసినట్లు తీసి శత్రుఘ్నునిపై ప్రయోగించాడు. అది మార్గమధ్యంలో ఉండగానే శత్రుఘ్నుడు దానిని తుత్తునియలు కావించటంతో రాక్షసుడొక పెద్దశిలను సౌమిత్రిపై విడిచాడు. దాశరథి ఐంద్రాస్త్రంతో దానిని ఇసుకరేణువుల ప్రమాణంలో చూర్ణం కావించాడు. మహోదగ్రుడైన లవణుడు శత్రుఘ్నునిపైకుఱికేడు. శత్రుఘ్నుడు ప్రయోగించిన నారాయణాస్త్రంతో నేలకూలిన ఆ లవణాసురుని భారానికి భూమి కంపించింది. దేవతలు శత్రుఘ్నునిపై పుష్పవృష్టి కురిపించారు. ఇంద్రజిద్వధనొనర్చిన తన అన్న లక్ష్మణునకు తగిన తమ్ముణ్ణినానని శత్రుఘ్నుడానందించాడు. అప్పుడు శత్రుఘ్నుడా యమునా తటిపై అందమైన మధురానగరిని నిర్మించాడు.

జనక దశరథులిద్దఱూ తనకు మిత్రులు కావటంతో వాల్మీకి సీత ప్రసవించిన కుమారద్వయానికి కుశలవులని నామకరణం చేసేడు. వారికి కొద్దిగా శైశవం వెనుకబడి బాల్యం సమీపిస్తుంటే వారిచే సాంగోపాంగ వేదాధ్యయనం చేయించి, తాను రచించిన రామాయణాన్ని గానం చేయటంలో శిక్షణనిచ్చాడు. వారు తమ తల్లి ముందు రామాయణాన్ని గానంచేస్తుంటే సీతాదేవి భర్తృవిరహ దుఃఖాన్ని మఱచిపోయి అమందానందాన్ని పొందేది.

త్రేతాగ్ని (గార్హపత్య, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్నులు) స్వరూపులైన భరత లక్ష్మణ శత్రుఘ్నులు సైతం పతివ్రతలైన భార్యలయందు ఇద్దఱేసి పుత్రుల్ని బడసేరు. శత్రుఘ్నుడు మధురానగరాన్ని నిర్మించిన తర్వాత కొంతకాలం అక్కడ ఉండి తన కుమారుల్లో సుబాహువనే వానికి



మధురానగర రాజ్యాన్ని, బహుశ్రుతునికి విదిశా రాజ్యపాలనా భారాన్నీ అప్పజెప్పి శ్రీరాముని చూడటానికి అయోధ్యకు చేరేడు. లవణాసుర సంహారంతో అన్వర్థ నామధేయుడైన శత్రుఘ్నునికి అయోధ్యలో అపూర్వ స్వాగతం లభించింది. కాలనేమి రాక్షసుని వధించి వచ్చిన ఉపేంద్రుని ఇంద్రునివలె శ్రీరాముడు శత్రుఘ్నుని ప్రశంసించాడు. "సకాలంలో పుత్రోత్పత్తి వార్తను నేనే రామునికి తెలియపఱుస్తా"నన్న వాల్మీకి ఆదేశానుసారం శత్రుఘ్నుడు కుశలవుల వృత్తాంతం తప్ప అన్ని విషయాలూ శ్రీరామునికి నివేదించాడు.

ఒకనాడొక విప్రుడు మరణించిన చిన్నవాడైన తన కుమారుని తన ఒడిలో నుంచుకొని రాజద్వారం వద్ద రోదించసాగేడు. "ఓ భూమాతా! దశరథుని తర్వాత రామునిచేతిలో పడ్డ నీవు ఎంతటి కష్ట దశను పొందేవ"ని విలపిస్తూనే పలుకసాగేడు. పెద్దలు సజీవులై ఉండగా పిన్నలు మరణించటమన్నది ఇక్ష్వాకుల పాలనా కాలంలో ఏనాడూ లేనిస్థితి తనపాలనలో ఈ విప్రునికి కలిగిందని తెలిసికొన్న రాముడు సిగ్గును, ఆశ్చర్యాన్నీ పొందేడు. "ముహూర్త కాలం ఊఱడిల్లండ"ని విప్రునికి కలిగిన కష్టాన్ని తీర్చటానికి యమునినైనా జయించవలసిందేనని నిర్ణయించుకొన్న రాముడు కుబేరునికి పంపిన పుష్పక విమానాన్ని స్మరించటంతో క్షణకాలంలో పుష్పకవిమానం వచ్చి రాముని ముందు నిలిచింది. విమానారోహణం చేసి యముని వద్దకు బయలుదేరబోతున్న సమయంలో అశరీరవాణి వినిపించింది : "రాజా ! నీ ప్రజల్లో ఒక విపరీత ప్రవర్తన చోటుచేసికొంది, దానినన్వేషించి రూపుమాపితే నీవు నీ యత్నంలో కృతకృత్యుడవౌతావు." అది విన్న రాముడు ధ్వజ రెపరెపల్ని కూడ కనరానంత వేగంతో నడుస్తున్న పుష్పక విమానంలో దశదిశలూ అన్వేషిస్తూ

ఒక వృక్ష శాఖకు తల క్రిందులుగా వ్రేలాడుతూ తపస్సు చేస్తున్న వ్యక్తిని చూచాడు. వంశనామాదుల నడిగి అతడు తపమాచరిస్తున్న కారణం అడిగితే అతడు “నేను శూద్రుణ్ణి, నా పేరు శంబుకుడు. స్వర్గప్రాప్తికే నా తపస్స”ని సమాధానం ఇచ్చాడు. తపోవృత్తిక నర్హుడై, ప్రజాదుః ఖానికి కారణభూతుడైన అతనికి శిరచ్ఛేదమే తగినశిక్ష అని ధర్మశాస్త్ర నిర్ణయాన్ని స్మరించి రాముడు తన ఖడ్గంతో అతని శిరస్సును ఖండించాడు. రాజశిక్షనొందిన శూద్రుడు శంబుకుడు అసాధ్యమైన సద్గతినొందేడు. తిరిగి వస్తూ శ్రీరాముడు త్రోవలో అగస్త్యమునిని దర్శించాడు. పూర్వం కాలకేయాది రాక్షసులను బయట పెట్టటానికి సముద్రపానం చేసిన సందర్భంలో సముద్రుడు తనకిచ్చిన అమూల్యాభరణాల్ని రామునికా మహర్షి ఉపాయనంగా ఇచ్చాడు. మైథిలి అనుపస్థితిలో రాముడా ఆభరణాల్ని ధరించేకుండా చేత్తోపట్టుకొని తిరిగి వచ్చాడు. రాముడయోధ్యకి చేరేలోగానే విప్రసుతుడు పునర్జీవితుడైనాడు. విప్రుడు శ్రీరాముని అనేక విధాల స్తుతించాడు.

అశ్వమేధయాగాన్ని సంకల్పించి అశ్వాన్ని విడువటంతో దేశంలో నలుమూలలనుంచి రాజన్యులు శ్రీరామునిపై కానుకలను వర్షించారు. ఆహూతులైన మహర్షి బృందం అన్ని దిక్కుల నుండీ విచ్చేసింది. హిరణ్మయమైన సీత ప్రతిమను ప్రక్కనుంచికొని శ్రీరాముడు యాగారంభం కావించాడు. ఆ సమయంలో వాల్మీకిచే ప్రేరితులైన కుశలవులు అయోధ్యానగరంలో అక్కడక్కడ ఆ కవి రచించిన ఆదికావ్యమైన రామాయణాన్ని గానం చేసేరు. కథా వస్తువు శ్రీరాముని చరిత, కర్త వాల్మీకి, పాడినవారు కిన్నర కంఠ మాధుర్యం కల కుశలవులు. ఇక అది ఎవరిని రంజింపచేయకుండా ఉంటుంది? రూపంలో, గానంలో ఆ కుశలవులప్రతిములని చెప్పగా విన్న శ్రీరాముడు సోదరులతో వారిని చూచి వారి గానాన్నాస్వాదించాడు. రామునితో పాటు సభాసదులంతా ఏకాగ్రతతో వారి గానం విని ఆనందబాష్పాల్ని విడిచారు. వయస్సులో, వస్త్రధారణలో మాత్రమే శ్రీరామునికీ, కుశలవులకూ భేదాన్ని గమనించిన సభ దిగ్భ్రమతో నిశ్చేష్టితమైంది. శ్రీరాముడు వారికి అనర్ఘమణి దానం అందించేబోగా వారు దానాన్ని స్వీకరించేటంలో నిస్పృహను చూపేరు. దీనికి సభ మఱింత ఆశ్చర్యాన్నొందింది. “ఇదెవరు వ్రాసేరు ? మీ కెవరు నేర్పేర”ని రాముడు ప్రశ్నిస్తే వారు “వాల్మీకి మహర్షి” అని సమాధానం చెప్పేరు. శ్రీరాముడు తమ్ములతో కలిసి వాల్మీకి ఆశ్రమానికి వెళ్ళి తన దేహాన్ని తప్ప సర్వసామ్రాజ్యాన్నీ ఆ మహర్షికి సమర్పించాడు. “వీరు నీ పుత్రులే. సీతాదేవిని తిరిగి పరిగ్రహింపు”మని దయాళువైన వాల్మీకి శ్రీరాముని కోరేడు. శ్రీరాముడా మహర్షితో “తండ్రీ ! నీ కోడలు మా ఎదుటే అగ్నిప్రవేశం చేసి తన పవిత్రతను నిరూపించుకొంది. అగ్నిహోత్రుడు కూడ ఆ విషయాన్ని ధ్రువీకరించాడు. కాని దుర్మార్గుడైన రావణుని వద్ద ఉండటం వల్ల అయోధ్యావాసులు ఆమె పాతివ్రత్యాన్ని శంకిస్తున్నారు. సీత తాను నిర్దోషినని అయోధ్య ప్రజలకు విశ్వాసం కల్గిస్తే మీ ఆజ్ఞానుసారం పుత్రవతి అయిన ఆమెను స్వీకరిస్తా”నని రాముడు బదులు పలికేడు. తరువాత విషయ నిరూపణకొక దినాన్ని నిశ్చయించి శ్రీరాముడయోధ్య ప్రజలను సమావేశపఱచి వాల్మీకిని పిలిపించాడు. వాల్మీకి కుశలవులతో, సీతతో రాముని దర్శింప వచ్చాడు. కాషాయవర్ణపు ఉత్తరీయంతో శ్రీరామపదలగ్న దృష్టితో వస్తున్న సీతను చూచి ఆమె పరిశుద్ధురాలని అయోధ్య ప్రజలంతా భావించారు. జనులామెపై కలిగిన నిందకు పశ్చాత్తప్తులై ఆమె వైపు చూడటానికి సిగ్గుపడి తలలు వంచి నిలుచున్నారు. పవిత్రాసనంపై ఉన్న

వాల్మీకిమహర్షి "అమ్మా ! నీ భర్త సమక్షంలో నీ నడవడి విషయంలో అయోధ్యావాసుల్ని, నిస్సంశయుల్ని చేయు"మని సీతనాదేశించాడు. వాల్మీకి శిష్యులు తీసుకు వచ్చిన పవిత్రజలాన్ని ఆచమించి జానకి "దేవీ! విశ్వంభరా! నేను వనోవాక్కాయ కర్మలతో పతి విషయంలో వ్యభిచరించేని దాననైతే నన్ను నీలో విలీనం చేసికో" అని పలికింది. తక్షణమే భువిపై ఒక రంధ్రం ఆవిర్భవించి అందులోంచి ఒక అపూర్వమైన కాంతిపుంజం వెలువడింది. అందులోంచి ఆదిశేషుని ఫణాగ్రాలపై నిలిపిన సింహాసనాసీనురాలైన వసుంధర ప్రత్యక్షమైంది. భర్తపైనే దృక్కులు నిలిపిన సీతను ఆమె తనతొడపై కూర్చుండబెట్టుకొని శ్రీరాముడు "వద్దు వద్ద"ని వారిస్తున్నా వినక పాతాళలోకానికి కొని పోయింది. భూదేవిపై క్రుద్ధుడైన శ్రీరాముడు సీతను తన కర్పించుమని బాణాన్ని ఎక్కుపెట్టబోగా వాల్మీకి "విధి అపరిహార్య"మని అతని కోపాగ్నిని శాంతపఱచాడు.

యాగాహూతులైన ఋత్విజుల్నీ, బంధుమిత్రుల్నీ, తదితర పరిజనుల్నీ అర్హ సత్క్రియలతో పంపించి శ్రీరాముడు సీతపై తనకున్న ప్రేమను పుత్రులపై వాత్సల్యంగా రూపొందించుకొన్నాడు.

భరతుని మేనమామ యుధాజిత్తు సందేశాన్ని మన్నించి శ్రీరాముడు భరతుడు ప్రత్యేకంగా పరిపాలించుకోవటానికి సింధు దేశాన్ని వలసిన సంభారాలతో సమకూర్చాడు. భరతుడు సింధుదేశానికి వెళ్ళి ఎదురొన్న గంధర్వ సమూహాన్ని జయించాడు. తిరిగి వారు ఆయుధాలను చేబూనకుండా వారి గాంధర్వకళా ప్రావీణ్యానికవసరమైన వీణాది వాద్యాల్ని చేపట్టేట్లు చేసేడు. భరతుడక్కడ కొంతకాలం నివసించి యుక్తవయస్కులైన తన పుత్రులు తక్ష, పుష్కలులను తక్షశిల, పుష్కరావతీ రాజ్యాధినేతలుగా స్థిరపఱచి అగ్రజుని సేవించేటానికి తిరిగి అయోధ్య చేరేడు.



రామాజ్ఞతో లక్ష్మణుడు సైతం తన కుమారులైన అంగద, చంద్రకేతుల్ని కారాపథేశ్వరులుగా నిలిపేడు. పిదప రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు స్వర్గస్థులైన కౌసల్యా సుమిత్రా కైకలకు పారలౌకిక క్రియలాచరించారు.

ఒకనాడు యముడు మౌనిగా శ్రీరాముని చూడవచ్చి తాను రహస్యంగా సంభాషించాలని, సంభాషణను వినేవారెవరైనా వారిని త్యజించేలనీ అంగీకరింపజేసి రహస్యమందిరంలో తన నిజరూపాన్ని చూపి బ్రహ్మ ఆనతిపై స్వర్గాన్ని చేరుమని కోరేడు. లోనికెవరినీ రానీయవద్దని లక్ష్మణుని ద్వారం వద్ద నిలిపేడు శ్రీరాముడు. యమ, శ్రీరాములు సంభాషిస్తున్న సమయంలో దుర్వాసమహాముని శ్రీరాముని దర్శింప వచ్చాడు. రామునికా విషయం తెలుపకపోతే ముని శపిస్తాడేమోననే భయంతో లక్ష్మణుడు లోపలకు వెళ్ళి యమ శ్రీరాముల సంభాషణ కంతరాయం కలిగించాడు. తత్ఫలితంగా లక్ష్మణుడే స్వయంగా సరయూ తీరంలో యోగంతో శరీరాన్ని త్యజించి శ్రీరామ ప్రతిజ్ఞను వ్యర్థం కాకుండా ఉండేట్లు చేసేడు. నాలుగు అంశలతో భువి కవతరించిన శ్రీ మహావిష్ణువులో భాగమైన లక్ష్మణుడే ముందుగా స్వర్గామి కాగా చతుష్పాదాల్లో ఒకటి పోయిన ధర్మదేవతవలె రాముడు మిగిలేడు.

తదుపరి కుశుని కుశావతీ పట్టణాధిపతిగా అభిషేకించి లవకుమారుని శరావతీ పట్టణాధిపతిని కావించాడు. అయోధ్యాప్రజలు తననను గమిస్తూ ఉంటే సోదరులతో శ్రీరాముడు మహాప్రస్థానానికై ఉత్తరదిశగా బయలుదేరేడు. అతని ఆశయాన్నెఱిగిన కపి, రాక్షస వీరులంతా అతనిని కన్నీటితో అనుసరించారు. తనకై వచ్చిన విమానంలో భక్తవరదుడైన రాముడు తనతో స్వర్గానికి రాదలచిన వారికి స్థానం

కల్పించాడు. శ్రీరాముని అవతార సమయంలో సహాయార్థమై సుగ్రీవాదులై పుట్టిన దేవతలంతా వారి పూర్వరూపాల్ని ధరించి స్వస్థలాలకు వెళ్ళి పోయారు. శ్రీరాముడనుగ్రహ బుద్ధితో దైవత్వాన్నొందిన అయెధ్యావాసులకై నూతన స్వర్గాన్నే ఇచ్ఛామాత్రంగా సృష్టించాడు.

దేవతల ప్రార్థనతో రామావతారాన్ని పొందిన శ్రీ మహావిష్ణువు దేవకార్యమైన రావణ వధసలిపి ఉత్తరంలో హిమవత్పర్వతంపై విభీషణుని, దక్షిణంలో చిత్రకూటంపై హనుమంతుని తన కీర్తి స్తంభాలుగా ఉంచి స్వస్వరూపాన్ని ధరించాడు.

శ్రీరామావతార పరిసమాప్తితో పదునైదవ సర్గ సంపూర్ణమౌతుంది. పదునాఱవ సర్గ నుండి శ్రీరాముని జ్యేష్ఠ పుత్రుడు కుశుడు రాజ్యానికి రావటం రాముని అనుజుల సంతాన వృత్తాంతాలు వర్ణితాలౌతాయి. పదునాఱవ సర్గలో ప్రధానమైనది కుశుడు కుముద్వతిని పరిణయమాడిన ఉదంతం. అంతవఱకు కుశావతి పట్టణాన్ని రాజధానిగా చేసికొని పరిపాలిస్తూ ఉండటంవల్ల అయోధ్యానగరం పాడుపడిపోయింది. నగరాధి దేవత కోరికపై కుశుడు తిరిగి అయోధ్యకు వెడతాడు.

శ్రీరాముని పుత్రుడు కుశుడు "కుశావతి" నగరాన్ని రాజధానిగా చేసికొని పరిపాలిస్తూ ఉంటే అతని అనుజుడు లవుడు, అతని పినతండ్రుల కుమారులాఱుగురూ వారి వంశాచారాన్ననుసరించి విధేయులై సామనస్యంతో సేవిస్తున్నారని చెప్పటంతో పదునాఱవ సర్గ ఆరంభమౌతుంది. ప్రజా క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పాడిపంటల ప్రగతి, జలాశయాల ఏర్పాటు, రథగజతురగ పదాతి సైన్య సంరక్షణాది కార్యక్రమాలన్నిటినీ ప్రణాళికాబద్ధంగానూ, పటిష్ఠంగానూ నిర్వహించాడు కుశుడు. శ్రీరాముని తరువాతి తరంలోని ఎనమండుగురు మహాదాతృత్వ గుణోపేతులై విలసిల్లేరు.



ఒక నాటి అర్ధరాత్రి అంతా నిద్రాపరవశులై ఉన్నారు. ప్రోషిత భర్తృక వేషధారి, అదృష్టపూర్వ అయిన ఒక స్త్రీ కుశుని మందిరంలోకి ప్రవేశించింది. కుశుడు మేల్కొనే ఉన్నాడు. ఆమె చేతులు జోడించి కుశుని జయ శబ్దంతో సంభావించింది. కుశుడు వేసిన తలుపులు వేసినట్లుండగా ఆమెలోనికెలా రాగలిగిందని విస్మయాయత్తచిత్తుడై "శుభాంగీ నువ్వెవరు? ఎవరి భార్యవు? ఇక్కడి కెందుకు వచ్చావు ? తలుపులు మూసి ఉన్నా లోపలికి ఎలా ప్రవేశించావు? నీకు యోగశక్తులున్నట్లు కూడా కనపడటం లేదే! జితేంద్రియులైన రఘువంశపు రాజుల మనస్సు పరస్త్రీ విముఖ మైందనితెలుసుకదా!"అన్న కుశుని పలుకులకామె–

"రాజా! నే నయోధ్యాపురాధి దేవతను మీ తండ్రి శ్రీరాముడు అవతారం చాలించి వైకుంఠానికి వెళ్ళేటప్పుడు ఆ పురప్రజలనందఱను తనతో తీసికొని వెళ్ళటం వలన నగరం నిర్మానుష్యమై, పాడుబడి నే ననాథనైనాను. శ్రీరాముని పాలనలో సకలైశ్వర్యయుక్తనై కుబేరుని అలకా పట్టణాన్ని, 'వస్వౌకసార' మనే ఇంద్ర నగరాన్నే లెక్కచేయని నేను మహాశక్తి సంపన్నుడవైన నువ్వు నన్నాదరించేటం లేదే అని దుః ఖభాగిని నైనాను. అలనాటి అయోధ్య నే డెంత దుః స్థితికి లోనైందో చూచావా ? విఱిగి పోయిన వందలాది గృహాలు కోటవాకిలిపై ఉన్నాయి. ఆ నాడు రాత్రి సమయాల్లో అభిసారికలు తమ ప్రియుల నివాసాలకు వెళ్ళేటప్పుడు రాజ మార్గంలో ప్రవర్తించిన నూపుర ధ్వానాలు వినిపిస్తే నేడు నక్కల కూతలు వినిపిస్తున్నాయి. నాడు పురస్త్రీలు దిగుడుబావుల్లో జలక్రీడలాడినపుడు వినబడిన మృదంగ ధ్వనుల వంటి నీటిపై వారి చేతుల చేప్పుళ్ల స్థానంలో నేడు అడవి దున్నల కర్ణకఠోర శబ్దాలు హోరెత్తిస్తున్నాయి. అయోధ్యలో ఆనాడు పౌరస్త్రీల పారాణి పాద ముద్రలతో చిహ్నితమైన రాజప్రాసాద

సోపానాలీనాడు పెద్దపులులప్పుడే చేంపిన లేళ్ళ రక్తంతో తడిసి ఉన్నాయి. అప్పుడు సౌధకుడ్యాలపై ఆడు ఏనుగులందిస్తున్నవి తింటున్న మగ ఏనుగుల చిత్రాలను చూచి అవి నిజమైన ఏనుగులుగా భ్రమించిన సింహాలు బొమ్మల్లో ఉన్న వాటి కుంభస్థలాలను కోపించి చీల్చటానికి ప్రయత్నిస్తున్నాయి. సౌధస్తంభాలపై చెక్కిన సుందరీ మణుల శిల్పాల రంగులు మాసిన స్తనోత్తరీయాల స్థానంలో నేడు పాములు విడిచిన కుబుసాలే కనిపిస్తున్నాయి. అప్పుడు నిశాసమయాల్లో సౌధాలపై ప్రసరించిన చంద్ర కిరణాలు ఇప్పుడు సున్నాలు వేసే నాథుడు లేకపోవటంతో ఆ ప్రదేశాల్లో గడ్డి మొలిచి శోభాదరిద్రాణమై ఉన్నాయి. నగరం నిర్జనం కావటంతో ఎక్కడా దీపకాంతులు లేక నాటి పరిమళయుక్తాలైన ధూపాలు కరువైనాయి. వాతాయనాలకు అందమైన తెరలు లేక సాలెపురుగుల దారాలే తెరలైనాయి. పవిత్ర సరయూనదిలో స్నాన జపాది కర్మలాచరించేవారెవరూ లేక తత్తీరం పాదలతో ఆవరించి ఉండటం చూస్తున్న నా మనస్సు క్షోభిస్తోంది. నీతండ్రి అయెధ్యను వీడి వైకుంఠానికి వెళ్ళినట్లే దిగ్విజయ చిహ్నంగా నీ వేర్పఱచుకొన్న కుశావతి నగరాన్ని వీడి నువ్వు అయోధ్యకు తిరిగి వచ్చి నాదుఃఖాన్ని నాపశమింపచెయ్యి"

కుశుడామె అభ్యర్థన నామోదించేటంతో ఆమె అంతర్ధానమైంది. మఱునాడు వృద్ధామాత్య విప్రులకు గతరాత్రి జేరిగిన సంఘటన విశదీకరించాడు. నగరాధిదేవతే స్వయంగా వచ్చి ప్రార్థించినందువల్ల కుశుని వారభినందించి అతని నిర్ణయానికి తమ హర్షాన్ని తెలిపేరు. కుశావతీ నగరాన్ని శ్రోత్రియులకు దానం చేసి ఒక శుభదినాన అంతఃపుర స్త్రీజనంతో కుశుడు సైన్యయుతుడై అయోధ్యకు బయలు దేరేడు. త్రోవలో పులిందులు



సమర్పిస్తున్న కానుకలను స్వీకరిస్తూ కుశుడు వింధ్యపర్వత శ్రేణిని దాటేడు. కపిల మహర్షి ఆగ్రహానికి పాత్రులై భస్మీకృతులైన తన పూర్వపు రాజులకు మోక్షప్రదాత అయిన గంగానదికి భక్తితో నమస్కరించి కతిపయ ప్రయాణాల తరువాత సరయూనదీ తటాన్ని చేరి అక్కడ తన వంశీయులొనర్చిన యజ్ఞవాటికల్లో నిలిపిన యూప స్తంభాలను చూచాడు. అయోధ్య పొలిమేరల్లో విడిది చేసి శిల్పాది కర్మకారులతో పాడుబడిన అయోధ్యానగరాన్ని కనుల పండువుగా రూపొందింపచేసేడు. నూతన గృహ, దేవాలయాది నిర్మాణాలతో వినూత్నశోభనొందిన ఆ నగరానికి వాస్తుపూజలు జేరిపించి నగరప్రవేశం చేసేడు. కుశుని చేక్కని పాలనలో ప్రజలంతా సుఖిస్తున్నారు.

ఒకసారి కుశుడు జలక్రీడలకై అంతఃపురస్త్రీలతో కలిసి సరయూనదికి వెళ్ళేడు. గతంలో శ్రీరామునకు అగస్త్యమహర్షి ఒసగిన రత్నాభరణాన్ని తండ్రి కుశునికి ఇచ్చాడు. జలక్రీడాసమయంలో అది కుశుని చేతినుండి జారి సరయూనదిలో పడిపోయింది. భార్యతో అంతఃపుర స్త్రీలతో యథేచ్ఛగా జలక్రీడలను సలిపి తీరానికి వచ్చి దివ్యాభరణ రహితమైన హస్తాన్ని చూచుకొని విచారగ్రస్తుడైనాడు. అది మహర్షి ప్రసాదితం, శత్రు విజయకారకం, తండ్రినుండి సంక్రమించింది కావటమే అతని విచారానికి కారణం కాని వేఱొకటి కాదు. ఆభరణాన్వేషణకై నియమితులైన జాలరులు తమ కృషి విఫలమైనా ఆ మడుగులో ఉన్న కుముదుడనే నాగరాజు లోభంతో గ్రహించి ఉంటాడనే విషయాన్నతనికి నివేదించారు. కుశుడు వెంటనే నదీ తటం చేరి వింటిని ఎక్కుపెట్టి ఆ నాగరాజును పరిమార్చటానికి గారుడాస్త్రాన్ని చేపట్టేడు. శీఘ్రమే భుజగపతి కుముదుడు కుశుడు పోగొట్టుకున్న విభూషణాన్ని కూడ చేత్తో

పట్టుకుని ఒక కన్యకను తీసికొని నది నుండి బయటకు వచ్చి కుశునకు నమస్కరించేటంతో అతడు గారుడాస్త్రాన్ని ఉపసంహరించాడు. కుముదుడు జైత్రాభరణాన్ని సమర్పిస్తూ "ఈ బాలిక నా సోదరి కుముద్వతి నీటిలో ఆడుకుంటూ ఆభరణాన్ని చూచి అందంగా ఉందని స్వీకరించింది కాని మఱేమీకాదు. నీ ఆభరణంతో పాటు ఆభరణాపహరణకు ప్రతిగా జీవితాంతం నీ పాదసేవచేసి తరించేగోరే ఈ నా సోదరిని భార్యగా స్వీకరించుమని ప్రార్థించాడు. కుశుని అంగీకారంతో వారి వివాహం వైభవోపేతంగా జరిగింది. దేవతల మంగళ తూర్యాలుమ్రోగి, పుష్పవృష్టి కురిసింది.

ఇక పదునేడవసర్గ కుశుని వలన కుముద్వతి 'అతిథి' అనే పుత్రుని ప్రసవించేటంతో ఆరంభమౌతుంది. అతిథి తన తల్లితండ్రులు ఉభయ వంశాల కీర్తినీ తన సత్ప్రవర్తనతో విస్తరింపజేసేడు. కుశుడు తన పుత్రుడు అతిథిని ముందుగా కుల క్రమాగత విద్యలన్నిటిలో నిష్ణాతుణ్ణి చేసి వివాహమంగళం జరిపించాడు. దేవేంద్రుని అభ్యర్థనపై దేవదానవ యుద్ధంలో అతనికి సహాయంగా తన పూర్వులు వెళ్ళినట్లే కుశుడు వెళ్ళి అక్కడ మహాపరాక్రమశాలి అయిన 'దుర్జయుడ'నే రాక్షసుణ్ణి సంహరించి అతనిచే తానూ నిహతుడయ్యాడు. అతని భార్య కుముద్వతి సహగమనం చేసింది. మరణానంతరం కుశునికి దేవేంద్రుడు తన అర్ధసింహాసనాన్నిచ్చి కృతజ్ఞత తెలిపికొన్నాడు. కుముద్వతి దేవేంద్రుని భార్య శచీదేవికి ఆప్తమిత్రమైంది.

యుద్ధానికి వెళ్ళబోతూ అచట తనకు జరుగరానిదేదైనా జరిగితే తన కుమారుడు అతిథికి పట్టాభిషేకం చేయండని హెచ్చరించిన కుశుని ఆదేశం మేరకు అతని మరణానంతరం మంత్రి బాంధవ పురోహితులు



అతిథికి పట్టాభిషేకం జరిపి అత్యంత జాగరూకులై రాజ్యరక్షణ చేయదొడగేరు. పట్టాభిషేకానంతరం అతిథి వేదమూర్తులకు, విప్రగృహస్థులకు అధిక దక్షిణలివ్వటవే కాక, వారి యజ్ఞాది నిర్వహణకవసరమైన ధనాన్ని సంపూర్ణంగా ఇచ్చి సంతుష్టుల్ని చేసేడు. తన పట్టాభిషేకాన్ని పురస్కరించుకొని కారాగార బద్ధులనందఱినీ విముక్తుల్ని కావించాడు. మరణదండన నొందిన వారినికూడ విడుదల చేయించాడు. భారవాహులను వారి పనుల నుండి తొలగించి వారికి వేఱొక వృత్తి కల్పించాడు. దూడలు కడుపార పాలుత్రాగేటట్లు చూడాలని శాసించాడు. అతని ఆజ్ఞతో పంజరస్థ పక్షులకు సైతం విముక్తి కలిగింది. ఛత్ర చామర గ్రాహిణులు తమ తమ ధర్మాల్ని నిర్వర్తిస్తూ ఉండగా జయజయ ధ్వానాలతో సభాప్రవేశం చేస్తూ అతిథి భూమిపై దేవేంద్రునిలా శోభించాడు. తన పితామహుడు శ్రీరామునివలె స్మిత పూర్వభాషి, ప్రశాంత వదనుడు అయిన అతిథిని సేవక జనం నిరుపమాన విశ్వాసంతో సేవించింది. అతిథి పరాక్రమం, గురుపాదులైన వసిష్ఠోచ్చరిత వేదమంత్రాలు రాజ్యానికి శ్రీరామరక్షయై నిలిచాయి. న్యాయస్థానాల్లో అర్థిప్రత్యర్థుల వాదాలను స్వయంగా పరిశీలించేవాడు అతిథి. ప్రజాపోషణలో, రక్షణలో, న్యాయ నిర్ణయంలో తండ్రిని మించిన తనయునిగా పేరొందేడు. శత్రువులపై విజయాన్ని సాధించిన తరువాత ఆ శత్రువులు శరణువేడిన సందర్భాల్లో వారి రాజ్యాన్ని వారికే తిరిగి ఇచ్చి "యశసే విజిగీ షూణామ్" అని కాళిదాసు గ్రంథారంభంలో చెప్పిన ఇక్ష్వాకు ప్రభువుల ప్రవృత్తికి ప్రబల నిదర్శనంగా ఖ్యాతి గాంచాడు. అంతశ్శత్రువులను జయించి నిగర్వి అయిన అతిథి తన రాజ్యంలో అందఱికీ ఆనందవర్ధనుడైనాడు. స్వభావతః లక్ష్మి చపల అయినా అతని పట్ల ఒరిపిడి రాయిపై హేమరేఖలా స్థిరమై నిలిచింది.

మదేభాలను మట్టికఱిపించే సింహం గుహలో ఉండటం పిరికితనం వల్ల కానట్లే అతిథి శత్రు నిర్భేద్యాలైన కోటలలోనే నివసించేవాడు. పటిష్ఠమైన రాజనీతి ననుసరించి న్యాయమార్గంలో ధర్మార్థకామాలను సమాన పరిమాణంలో సేవించేవాడు. అతిథి పాలనలో వ్యాపారులు నిర్భీకులై ఉండేవారు. దొంగల భయమన్నది లేకుండా ప్రజలు ప్రశాంతజీవనం గడిపేరు. ఆదాయంలో ధర్మశాస్త్రానుసారం ఆఱవ వంతునే పన్నుగా స్వీకరించేవాడు. అభివృద్ధినొందిన తర్వాత క్షీణించేటం సముద్రునికీ, చంద్రునికే కాని అతనికి లేదు. దేవేంద్రుని ఆజ్ఞకు దేవతలు బద్ధులైనట్లు అప్రతిహతమైన ఆతని ఆజ్ఞలను సామంతులు, సామాన్యప్రజ భక్తిశ్రద్ధలతో శిరసావహించేవారు. సకాల వర్షాలు కలిగి ఈతి బాధలు లేక, పుష్కలమైన ధనధాన్యాలతో అతిథి పాలనా కాలంలో దేశం సుభిక్షమై విలసిల్లింది.

పదునెనిమిదివ సర్గ అతిథి అనంతరం అయోధ్యను పాలించిన రఘువంశపు రాజుల వంశక్రమ వర్ణనతో ఉంటుంది. అతిథి, నిషధదేశాధీశుడైన అర్థపతి పుత్రికను వివాహమాడి 'నిషధుడ'నే పేరుకల కుమారుని పొందేడు. పరాక్రమోపేతుడైన పుత్రుని వల్ల అతని పుత్రోత్సాహం పుష్కళమై ఉండేది. అతిథి అశ్వమేధాది యజ్ఞ కర్మలతో స్వర్గలోకాన్ని చేరేడు. నిషధుడు భూమండలాన్నంతా ఏకచ్ఛత్రంగా పాలించాడు.

నిషధుని తరువాత అతని కుమారుడు నలుడు శత్రుసేనల్ని మదగజం గడ్డిని త్రొక్కినట్లు అణచి రాజ్యాన్ని చేపట్టేడు. అతని కొడుకు నభసుడు ప్రజలకు ప్రీతిపాత్రుడై తండ్రి అనంతరం రాజ్యమేలేడు. నభసుడు రాజ్యానికి వచ్చిన తదుపరి తండ్రి నలుడు మోక్షేచ్ఛతో వాన ప్రస్థానానికి వెళ్ళిపోయాడు. నభసుని కుమారుడు పుండరీకుడు, అతని పుత్రుడు క్షేమధన్వుడు. అతడు యుక్త వయస్కుడై పట్టాభిషిక్తుడైన పిమ్మట పుండరీకుడు సైతం శాంతచిత్తంతో వానప్రస్థ జీవనానికై వనాలకు తరలి వెళ్ళేడు. క్షేమధన్వుని కీర్తి కేవలం భూలోకంలోనే కాక స్వర్గానికి సైతం వ్యాపించింది. దేవానీకుడతని పుత్రుడు. పితృసమారాధన తత్పరుడైన దేవానీకుడు, పుత్రవాత్సల్య పూరితుడైన క్షేమధన్వుడు పరస్పరం సత్పిత్రు, సత్పుత్రవంతులైనందుకు మహానందమనుభవించేవారు. దేవానీకుని కుమారుడు 'అహీనగువు' తన వారికే కాక శత్రువులకు సైతం ప్రియమైనవాడు. ఎంతో సామర్థ్యంతో రాజ్యపాలన కావించాడు. అహీనగువు స్వర్గస్థుడు కావటంతో అతని కొడుకు 'పారియాత్రు'ని రాజ్యలక్ష్మి వరించింది. ఉదారశీలుడైన పారియాత్రునికి శిలాఖ్యుడనే కుమారుడుదయించాడు. సద్గుణోపేతుడైన ఇతణ్ణి ప్రజలు ప్రశంసిస్తే వినయపూరితుడై సిగ్గుపడేవాడు. శిలాఖ్యుని కుమారుడు ఉన్నాభుడు. 'వజ్రనాభు'డతని పుత్రుడు. అతని పుత్రుడు 'శంఖణుడు' శంఖణ మరణానంతరం సూర్యోపమ తేజోవంతుడు, అశ్వినీదేవతల వంటి సౌందర్యవంతుడైన వ్యుషితాశ్వుడు రాజ్యానికి వచ్చాడు. కాశీ విశ్వేశ్వర భక్తుడైన ఇతనికి కలిగిన వాడు భూభారదక్షుడైన విశ్వసహుడు. అతని కుమారుడు హిరణ్యనాభుడు. ఈ తండ్రీ కుమారుల మహోన్నత ప్రతాపాన్ని శత్రువులెవరూ సహించలేకపోయేవారు. ఇతనికి 'కౌసల్యుడ'నే కుమారుడు కలిగేడు. కౌసల్యుని పుత్రుడు బ్రహ్మిష్ఠుడు. బ్రహ్మిష్ఠుని పట్ల అయోధ్యవాసులపరిమిత శ్రద్ధాభక్తి యుక్తులై ఉండేవారు. బ్రహ్మిష్ఠుని పుత్రుని పేరు 'పుత్రుడు'. పుత్రుని పత్ని పుష్యపౌర్ణమినాడొక పుత్రుని కన్నది. అతనికి 'పుష్యుడ'ని నామకరణం చేసేరు. అతని జననంతో ప్రజలంతా పుష్యమీ నక్షత్రంలో చేసే కార్యాలన్నీ సిద్ధించినట్లు సర్వ సమృద్ధి నొందేరు. (పుష్యమి సర్వార్థసాధకమైన నక్షత్రమని జ్యోతిశ్శాస్త్రవేత్త లంటారు). పుత్రుడు తన

కుమారుని పుష్యుని పట్టాభిషిక్తుని చేసి జైమిని మహర్షి శిష్యుడై యోగ విద్యాపారంగతుడై మోక్షప్రాప్తి నొందేడు.

పుష్యుని పుత్రుడు ధ్రువుని వంటివాడైన 'ధ్రువసంధి'. అతనితో శత్రురాజు లంతా వైరాన్ని వీడి సంధిచేసి కోవటం వల్ల అన్వర్థనామధేయుడైనాడు. అతని కొడుకు 'సుదర్శను'ని పసితనంలో ధ్రువసంధి వేటకు వెళ్ళి అడవిలో ఒక సింహం చేత నిహతుడయ్యాడు. ధ్రువసంధి మరణంతో దేశాన్ని అరాజకం చేయకూడదని సుదర్శనుని అయోధ్యాపతిగా పట్టాభిషేకం చేసి మంత్రులెంతో ఐకమత్యంతో రాజ్యపాలన కొనసాగించారు. ఆఱేండ్లప్రాయం వాడైనా ప్రజలు సుదర్శనుని అత్యంత గౌరవాదరాలతో మన్నింప సాగేరు. సామంతరాజులు సైతం సుదర్శనుని తండ్రిని తలచి వినయవిధేయతలా పసివానిపట్ల పాటిస్తూ "మహారాజా!"అనే సంబోధించేవారు. దిరిసెన పువ్వు కంటె సౌకుమార్యంతో ఉన్న సుదర్శనునికి రాజభూషణాలు కూడా బరువనిపించేవి. అయినా ధరిత్రీ భారాన్నలవోకగా భరించాడు. పలకపై అక్షర సమామ్నాయాన్ని వ్రాయటం నేర్వకముందే వృద్ధులవల్ల రాజనీతినంతా తెలిసికొన్నాడు. పూర్వజన్మలో అభ్యస్తమైన విద్యల నన్నిటినీ గురువులకేమాత్రం క్లేశం కలిగించేక నేర్చాడు. అతడు యౌవనవంతుడు కావటంతో మంత్రులు వివిధ దేశ రాకుమార్తెల చిత్రపటాలు తెప్పించి సౌందర్యవతులైన జాతకాలను పరిశీలించి సత్సంతాన యోగ్యలైన కన్యలతో అతనికి వివాహం జేరిపించారు. ఇక్కడితో పదునెనిమిదవ సర్గ సమాప్తమౌతుంది.

సుదర్శనుడు వార్ధక దశలో తన కుమారుడు 'అగ్నివర్ణు'ని తన స్థానంలో ఉంచి వాన ప్రస్థానికై నైమిశారణ్యానికి వెళ్ళటంతో రఘువంశ మహాకావ్యంలో చివరిదైన పందొమ్మిదవ సర్గ ప్రారంభమౌతుంది.



సుదర్శనుడు రాజ్యాన్ని అన్నివిధాలా పటిష్ఠం చేయటం వల్ల అగ్నివర్ణునికి లేశమాత్రపు క్లేశమైనా లేక సుఖంగా రాజ్యపాలన సాగింది. కొంత కాలం రాజ్యనిర్వహణ జేరిపి ఆ తరువాత అతడు పాలనను మంత్రులపై పెట్టి స్త్రీలోలుడై నిరంతర కామకలాపాలతో కాలక్షేపం చేసేవాడు. అగ్నివర్ణుని నివేశనంలో సదా వాద్యమృదంగ నాదాలు, కామినుల నాట్యాలు ప్రవర్తిల్లుతూ ఉంటే కాముకుడైన అగ్నివర్ణుడు వాటిలోనే మునిగి తేలుతూ ఉండేవాడు. సుందరాంగనా సాహచర్యం, చందనాదిచర్చలు సంగీతనాట్య ప్రదర్శనలు లేని క్షణం అతనికి శూన్యమైనదిగా భాసించేది. పగలనక, రాత్రనక ఎప్పుడూ భోగలాలసుడై వాటిలోనే నిమగ్నుడయిన ప్రభువు అగ్నివర్ణుని దర్శనంకోసం ప్రజలెంత కుతూహలంతో వచ్చినా వారిని కన్నెత్తైనాచూచేవాడు కాదు. మఱీ తప్పనిసరి అనుకొంటే దర్శనార్థం వచ్చిన ప్రజలకొక క్షణం కిటికీ లోంచి తన పాదాన్ని మాత్రం బయటకు కనబడేట్లు చేసేవాడు. ప్రజలా పాదానికే నమస్కరించి వెళ్ళిపోయేవారు. ప్రగాఢ మన్మథోద్రేకి అయిన అగ్నివర్ణుడు నిర్భర యౌవనవతుల వక్షోజాల రాపిడితో కదులుతున్న పద్మాలతో కూడిన దిగుడు బావుల్లోను, జలాంతర్గత సురత గృహాల్లోనూ నిర్విరామంగా క్రీడించేవాడు. జలక్రీడల్లో వనితలు పూతలు తొలగిన పెదవులతో ఆ అగ్నివర్ణుని మఱింత మోహపరవశుని చేసేవారు. జలక్రీడల అనంతరం మత్తెక్కించే మధుర పరిమళ యుక్తమైన మధుశాలను చేరేవాడు. అగ్నివర్ణుడా యువతుల నోటినుండి, ఆ మదవతులు అగ్నివర్ణుని నోటినుండి పరస్పరం మధువును గ్రహించి పానకేళి సలిపేవారు. నృత్యానంతరం కలిగినశ్రమతో నర్తకీ మణుల తిలకం చెదిరి పోయినా ముద్దులొలుకుతున్న వారి ముఖాలపై పొడమిన స్వేదబిందువులను ఊది చుంబించి అగ్నివర్ణుడు వారిని మఱింతగా సంతోషపఱచేవాడు. ఈ

విధంగా దేవేంద్రునకు అప్సరస స్త్రీలతో, కుబేరునకు యక్షకాంతలతో కలిగే భోగానుభవాన్ని మించిన శృంగారానుభవాన్ని అగ్నివర్ణుడనుభవించాడు. నూతన అంగనలతో స్వయంగానో దూతీముఖంగానో రహస్య సంగమానికి ఏర్పాటు చేసికొని వారితో భోగించే సందర్భాల్లో అతని రాణులు, అలవాటుపడిన విలాసినీ జనం ఆ ప్రదేశాలకు వెళ్ళి అతనికాటంకం కలిగించేవారు. నూతన స్త్రీల వద్దకు పోతూ తమను మోసగిస్తున్న అగ్నివర్ణుని ప్రియాంగనలు తమ చూపుడు వ్రేలితో బెదిరిస్తూ, భ్రుకుటి ముడివైచి వీక్షిస్తూ తమ మేఖలలతో బంధిస్తూ అతనిని తమయందే బద్ధానురాగుని చేసికోవటానికి యత్నించేవారు.

అగ్నివర్ణుడు తమపై బద్ధానురాగుడు కాడని తెలిసినా తమపైనే ప్రేమాతి శయం కలవాడని గర్వితలైన సవతులపై వైరంతో పతి చిరకాల వియోగాన్ని, మన్మథోద్రేకాన్ని సహించేలేని అతని రాణులు క్రోధాన్ని వీడి మదనోత్సవ నెపంతో అతణ్ణి తీసికొని వెళ్ళి తమ కోర్కెలు తీర్చుకొని తాము కృతార్థలై అతణ్ణి కృతార్థుని చేసేవారు. మఱునాటి ఉదయం గతరాత్రి సంభోగచిహ్నాలతో విలాసినుల వద్దకు వెళ్ళి వారికి మనస్సుకు కష్టం కలిగించేవాడు. వారిని ప్రసన్నులను చేసికోవటానికి ఎంతగా వేడుకొన్నా ఫలితం లేకపోవటంతో అతనికీ మనోవ్యథే మిగిలేది. యువతీజన పాదాలకు లాక్షరసం దిద్దటానికి అగ్నివర్ణుడు సిద్ధపడిన సందర్భాల్లో అతని హస్తస్పర్శతో పరవశలైన వారి చీరముడులు జారి నితంబాలతో జఘనాలుకూడ బయటపడి ఆ ఆకర్షణతో తాను చేయవలసిన పనికి ఆటంకం కలిగేది. చుంబించే బోయినపుడు వధువు ముఖం ప్రక్కకు త్రిప్పికోవటం, చీరముడిని విప్పబోయే చేతిని తొలగించేటం వంటి తన ప్రయత్నాన్ని భంగపఱచే విలాసునుల చేష్టలన్నీ మన్మథాగ్ని కింధనాలై వారిని బలిమిమై రమించేవాడు. రాత్రివేళలో రతిక్రీడ సలిపి పగటివేళ అద్దంలో తమ ముఖ వక్షోజాదులపై అగ్నివర్ణు డొనర్చిన దంతనఖ క్షతాల్ని చూచుకొంటున్న యువతుల వెనుక నిలిచి అద్దంలో తన ముఖం కనిపించేటంతో సిగ్గుపడుతున్న వారి ముఖాల్ని చేతులతో కప్పేవాడు. పాన్పునుండి లేచిన అగ్నివర్ణుని ప్రేయసి అతని హస్తాలను తన కంఠం చుట్టూ బంధించి ముద్దిచ్చి వెళ్ళుమని ఆదేశించేది. యౌవనోద్రేకంతో, శరీర బలంతో నిర్దయగా సలిపిన సంభోగంతో అలసి సొలసి తిరిగి రతి కార్యానికి సిద్ధం కాలేని అబలలు 'కంఠసూత్రాలింగనం' చేద్దామనే నెపంతో తమ కఠిన వక్షోజాల రాపిడితో అతని వక్షః స్థలంపై శయనించేవారు.



కృత్రిమమైన పర్వతాల్లో ఆయా ఋతువుల కనుకూలంగా యువతులతో యథేచ్ఛగా అగ్నివర్ణుడు విహరించాడు. అగురు ధూప వాసనలతో వదులైన వస్త్రాదులతో తమ అంగాంగ సౌందర్యాన్ని ప్రదర్శిస్తున్న విలాసినీ జనులాకర్షించి అతని ప్రతిక్రియకై ఎదురుచూసేవారు. దీర్ఘమైన శారద రాత్రులు నానావిధ శృంగారచేష్టా సురత బంధాలకనుకూలంగా ఉండి అగ్నివర్ణుని అలరించేవి. అతఃపూర్వం అగ్నివర్ణునితో ప్రణయకలహంవల్ల కలిగిన వియోగబాధ వసంతర్తువుతో ఎక్కువై భరించేలేని కామినులు కామోద్రేకంతో తామే స్వయంగా అగ్నివర్ణుని సురతకార్యాని కాహ్వానించే వారు. ఆ స్త్రీలతో అతడు తనివితీర ఆలింగనాది సౌఖ్యాలతోపాటు రతి పరకాష్ఠను పొందేవాడు.

ఈ విధమైన నవనవోన్మేషమైన శృంగార క్రీడలతో నిత్యనూతన విలాసినీ సముదాయంతో అలుపెఱుగని అంగనా రతితో భోగపరాయణుడై అగ్నివర్ణుడు కాలం గడిపేడు. స్త్రీ, మద్యపానాది వ్యసనుడై ఉన్నా శత్రురాజులెవరూ అతణ్ణి చూడలేకపోవటానికి కోశ, దండనీతి యుక్తమైన రఘువంశ ప్రభావమే కారణం. అయితే అవిచ్ఛిన్న సంభోగాసక్తి అతణ్ణి

దక్ష శప్తుడైన చంద్రుని వలె క్షీణింపచేసింది. వైద్యుల హెచ్చరికలనేమాత్రం లక్ష్యపెట్టక తన అలవాట్లను యథాపూర్వంగా కొనసాగిం చేసాగేడు. పాండువదనం, అల్పభూషణాలతో, హీనస్వరంతో అగ్నివర్ణుడు లోనైన రాజయక్ష్మవ్యాధి ఆలంబనం లేకుండా నడువలేని స్థితినతనికి కల్పించింది. క్షయవ్యాధితో కృశిం చేటంతో రఘువంశం, అతని ప్రాసాదం కూడ కేవలం ఒకే కళతో మిగిలిన చంద్రునితో ఉన్న ఆకాశంలా పంకావశేషమైన పడియలా, ఆరిపోబోయే మినుకు మినుకు మనే దీపంతో కూడిన ప్రమిదలా రూపొందింది.

దర్శన మీయని ప్రభువు గూర్చి ఏదో అనర్థం వాటిల్లిందనే సంశయంతో ప్రశ్నించిన ప్రజలకు అసలు విషయాన్ని దాచి "ప్రభువు పుత్రోత్పత్తికై జపహోమాదుల్లో నిమగ్నమైనందు వలన బయటకు రావటంలేద"ని మంత్రులు చెప్పసాగేరు. వ్యాధినెదుర్కొనలేని అగ్నివర్ణుడు మరణించాడు. రాజ మరణాన్ని ప్రకాశింపచేయరాదనే తలపులో అగ్నివర్ణునకు రాజభవనంలోని ఉద్యానవనంలోనే చితిపేర్చి దహన సంస్కారం జరిపించారు. మంత్రులు పుర ప్రముఖులతో సభ జేరిపి గర్భ లక్షణాలు కలిగిన అగ్నివర్ణుని పట్టపురాణిని రాజ్య వారసురాలిగా ప్రకటించారు. సింహాసనాసీనురాలైన రాణి ముందుగా భర్తృమరణ దుఃఖజనిత ఉష్ణోదకంతో తన గర్భసేచనం చేసికొంటే తదుపరి పట్టాభిషేకార్థం సువర్ణ కలశస్థమైన శీతలోదకంతో ఆ గర్భం సేచితమైంది. రాజ్యాధికార మంగళం రఘువంశ ప్రతిష్ఠను పొందింది. అప్రతిహతమైన శాసనంతో ఆప్తులు, వృద్ధామాత్యాదులతో కూడి అగ్నివర్ణుని రాణి విధ్యుక్తంగా పాలించింది.

# కుమార సంభవమ్

రఘువంశ, కుమారసంభవాల్లో ఏది కాళిదాసు మొదట వ్రాసిందనే విషయంలో పండితుల్లో భేదాభిప్రాయాలున్నాయి. ఏ కావ్యానికైనా అది మధ్యావసానాలు మంగళయుతమై ఉండాలని భారతీయుల నిష్కర్ష.

సాధారణంగా ఏ కవి అయినా రచనా వ్యాసంగం భగవత్ప్రార్థనతో చేస్తాడు కనుక, పార్వతీ పరమేశ్వరులను ప్రార్థించే శ్లోకంతో 'రఘువంశం' ఉంది కనుక, అది ఆయన ప్రథమ కృతి అనే వారివాదమైతే – కాళిదాసు మహాశైవుడు కనుక శివుని కళ్యాణేతివృత్తం కల కుమారసంభవమే ఆయన మొదటి రచన అని మఱికొందఱి అభిప్రాయం.

కుమారసంభవం ఎంతవఱకు కాళిదాస కృతమనే విషయంలో కూడ పండితలోకంలో భిన్నాభిప్రాయాలున్నాయి. న్యాయానికి ఏడు సర్గలే కాళిదాస కృతాలనాలి. ఎనిమిది సర్గలూ కాళిదాసు కృతాలనే వాదం ప్రచలితంగా ఉన్నా, ఎనిమిదవ సర్గలో జగత్పితరులైన శివపార్వతుల శృంగారవర్ణన అనౌచిత్యమనే కారణం వల్లా, 8వ సర్గ చివరి శ్లోకం పార్వతి రతి శివునకు తృప్తి కలుగచేయలేదని ముగియటంతో, మంగళాంతం కానందు వల్ల, అది కాళిదాస కృతం కాదన్నారు. లభ్యమౌతున్న 17 సర్గల్లోనూ చివర కాళిదాస కృత కుమారసంభవం అని పేర్కొన్నా వ్యాఖ్యాతృ శిరోమణి మల్లినాథసూరి 7 సర్గలకే వ్యాఖ్యానం వ్రాసేడు. ఆ తరువాతి సర్గల్లో కవిత్వం కాళిదాసుకు అనుకరణ ప్రాయంగానే ఉంది కాని కాళిదాస సహజ కృతం కాదని విమర్శకుల అభిప్రాయం. శివపార్వతుల వివాహంతో 7వ సర్గపూర్తి అవుతుంది కనుక మంగళాంతమనే చెప్పాలి. 'సంభవ' శబ్దానికి జన్మతోపాటు 'కలయిక' అనే అర్థం కూడ ఉంది. పార్వతీ పరమేశ్వరుల కలయిక (వివాహం) కుమార సంభవానికి ప్రాతిపదిక కనుక అక్కడితో కావ్యసమాప్తి అనటమే ఔచితీపూర్ణంగా ఉంటుంది. పైగా 8వ సర్గ నుండి వ్యాఖ్యానం "శ్రీ పర్వణీకర" ఇంటిపేరు కల శ్రీ సీతారామకవి వ్రాసినట్లు

స్పష్టంగా ఉంది. అందువలన కాళిదాస కృతమైన 7 సర్గల ఇతివృత్తాన్ని మాత్రమే స్వీకరించాను. మిగిలిన సర్గల్లో ప్రస్తావితమైన అంశాలు మాత్రం పేర్కొనటం జరిగింది.

**"అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయో నామ నగాధిరాజః।**
**పూర్వాపరౌ తోయనిధీ విగాహ్య స్థితః పృథివ్యా ఇవ మానదణ్డః॥" 1-1**

ఉత్తర దిక్కున హిమాలయ పర్వతం ఉంది. అది దేవతాత్మ, పర్వతాధిరాజు. ప్రాక్పశ్చిమ సముద్రాల్లో చొచ్చుకుపోతోంది. భూమిని కొలవటానికి కొలతబద్దలా ఉంది. ఇదీ కాళిదాసు హిమాలయాన్ని వర్ణించిన తీరు. భారతీయులకు ఈ దేశంలోని నదులు, పర్వతాలు, అరణ్యాలూ అన్నీ పవిత్రమైనవే. ప్రతి అణువునూ పూజ్యభావంతో ఆరాధించే అలవాటు ఇక్కడి వారికున్నది. అందుకే గుట్టలకు, పుట్టలకూ పూజలు సలుపుతారు. ఆ సంప్రదాయాన్ని గుర్తు చేయటానికే మహాకవి 'దేవతాత్మా' అనే ఒక్క పదంలో సూచించాడు. ఈ పర్వతం దూడ అట! ఎవరికి? గోరూపధారి అయిన పృథివికి. దూడగా చేసింది భువిపై నున్న అన్ని కొండలూ కలిసి. పిదికిందెవరు? మేరుపర్వతం అనే గొల్లవాడు. పిదికితే కలిగిన ఫలం ఏమిటి? ఆవును పిదికితే పాలు వస్తాయి. భూమిని పిదికితే? భూమిలో ఉన్న ప్రకాశించే మణులు, గొప్ప ఓషధులు ఓషధుల మొలకలు జీవరాసులకు ఆహారంగానే కాక వ్యాధిపీడితులైనపుడు ఔషధంగానూ ఉపకరిస్తాయి.

మహాకవుల రచనలను కేవలం వర్ణనలుగా భావించేకూడదు. ఆ వర్ణనల వెనుక, ఉపమాద్యలంకారాల వెనుక, సొగసైన ఊహ (ఉత్ప్రేక్ష)ల వెనక ఎంతో మహార్థం, గొప్ప సందేశం ఇమిడి ఉంటాయి. వాటిని మననం చేయటం వల్ల బుద్ధి వికసిస్తుంది. మనస్సుకి ప్రశాంతత ప్రాప్తిస్తుంది. జీవన సరళి ఏర్పడుతుంది. అవి మననం చేసికొనే ప్రక్రియలోని అంతర్భాగంగా



పూర్వం ఈ దేశ విద్యా విధానంలో 'సంత' చెప్పికోవటం, 'చింతన' జేరపటం, 'కంఠస్థం' చేయటమనే పద్ధతులుండేవి. విదేశీ విద్యావిధానం బలిసి ఇప్పుడా పద్ధతులన్నీ 'మోటు'గా మారటం మన దౌర్భాగ్యం.

హిమవత్పర్వతం అనంతమైన రత్నాలకు పుట్టినిల్లైనా 'మంచు' ఒక లోపంగా పరిగణితం కాలేదని చెబుతూ చంద్రుని వల్ల కలిగే చల్లదనం, ఆహ్లాదం వంటి అనేక ఉత్తమ గుణాల్లో ఆయనలోని 'మచ్చ'ను పరిగణించేం కదా! అంటాడు కాళిదాసు. ఆ హిమవత్పర్వతం ఎంతో ఉన్నతమైంది. అంటే మేఘ మండలి నతిక్రమించింది. మేఘాలు పర్వత మధ్యభాగంలోనే వస్తూ ఉంటాయి. ఇది అప్సరసలకు, సిద్ధులకూ నివాసస్థలం. ఆ పర్వత క్రింది చరియల్లో ఉన్న సిద్ధులు తటాలున వర్షం రావటంతో వానలేని పర్వత పైశిఖరాలకు వెడుతూ ఉండేవారట!

ఆ హిమవంతుని భార్య పేరు మేనక (ఈమె రంభాద్యప్సరసల్లోనిది కాదు). వారిరువురకూ కలిగిన కుమారుడు మైనాకుడు. పూర్వం పర్వతాలకున్న ఱెక్కల్ని దేవేంద్రుడు తన వజ్రాయుధంతో తెగ నఱికినప్పుడు మైనాకుడు సముద్రంలో దాగి సముద్రునితో బద్ధసఖ్యం కలిగి ఉన్నాడు. తరువాత శివునిభార్య అయిన సతీదేవి తన తండ్రి దక్షుడు తలపెట్టిన యజ్ఞంలో అవమానం పొంది యోగాగ్నిలో దగ్ధురాలై మళ్ళీ జన్మించేటానికి మేనకా గర్భంలో ప్రవేశించింది. ఆ సతీదేవే మేనకా హిమవంతులకు పార్వతిగా జన్మించింది. ఆమె జన్మించిన వేళ దిక్కులన్నీ ప్రశాంతతను భజించాయి. గాలి సుఖంగా వీచింది. దేవదుందుభులు మ్రోగి పుష్పవృష్టి కురిసింది. ప్రాణులన్నీ సుఖాన్ని పొందేయి. పార్వతి శుక్లపక్ష చంద్రుని వలె దినదినప్రవర్ధమాన కాజొచ్చి అపురూప లావణ్యాలను సంతరించుకొంది. పర్వతుని కుమార్తె కనుక 'పార్వతి'గా వ్యవహార నామాన్ని పొందిన ఆమె కాలాంతరంలో ఆమె తల్లి ఆమెను శివునికై తపస్సు చేయవద్దని

వారించేటం వల్ల 'ఉమ'గా ప్రసిద్ధినొందింది. వీటిల్లో 'ఉ' అనే అక్షరం సంభోదన వంటిది. అంటే బాలికలను పిలిచేటప్పుడు 'ఓసి', 'పిల్లా' ఇత్యాదిగా వ్యవహరిస్తాం కదా! అది. 'మా' అంటే 'వద్దు' అని అర్థం. తపశ్చర్య వద్దని తల్లిచేత నివారిత అయింది. కనుక 'ఉమా' అనే పేరు సిద్ధించింది. పార్వతి అంటే ఆ హిమవంతునికి వల్లమాలిన ప్రేమ. బాల్యంలో పార్వతి సఖీజనంతో కూడి కందుక క్రీడలతో, ఆకాశగంగా సైకతస్థలాల్లో ఇసుకతో వేదికలు నిర్మిస్తూ, బొమ్మపెళ్ళిళ్ళు కావిస్తూ కాలం గడుపుతూ వాండేది. పూర్వ జన్మ సంస్కారబలం వల్ల విద్యాభ్యాసకాలంలో విద్యలన్నీ వాటంతట అవి వచ్చి ఆమెను చేరేయి. ఇంతలో ఆమెకు యౌవనం ప్రాప్తించింది. చెక్కని అంగసౌష్ఠవంతో తీర్చిదిద్దిన అందాలబొమ్మ వలె ఆమె శోభించింది. ఒక్కమాటలో చెప్పాలంటే సృష్టిలో వివిధపదార్థాల్లో ఉండే అందాన్నంతా ఒకచోట చూడాలనే కోర్కెతో బ్రహ్మ పార్వతిని సృష్టించాడనాలి.

ఇలా ఉండగా ఒకనాడు నారదమహర్షి లోకాలన్నీ తిరుగుతూ హిమవంతునితో ఉన్న పార్వతిని చూచి, ఆమె శివుని శరీరార్థాన్ని హరిస్తుందని, సవతులు లేక ఏకభార్యయై ఉంటుందనీ చెబుతాడు. నారద వచనం హృదయానికి ప్రహ్లాదాన్ని కలిగించేటంతో ఈడొచ్చినా పార్వతిని పరులకిచ్చి పరిణయం చేయటానికి హిమవంతుడు ఇష్టపడక మిన్నకున్నాడు. పరమేశ్వరుడు వివాహప్రస్తావన తీసికొని రానందువల్ల పార్వతినాయన కిచ్చి వివాహం చేయలేకపోయాడు. పోనీ, హిమవంతుడే వెళ్ళి అడగవచ్చుకదా అంటే - సత్పురుషుడు తన అభ్యర్థన ఫలించేదేమో అనే భయంతో తనకిష్టమైన విషయంలో కూడ పరులనర్థించేక ఊరకొంటాడు. ఈ సందర్భంలో కాళిదాసు వ్రాసిన శ్లోకం ఎంతో స్పృహణీయమైంది.

**"అయాచితారాం నహి దేవ దేవ మద్రిస్సుతాం ప్రతిగ్రాహయితుం శశాక।**
**అభ్యర్థనాభఙ్గ భయేన సాధుర్మాధ్యస్థ్యమిష్టే உప్యవలమ్బతే உర్థే॥" (1-52)**

ఇది ఉదాత్తులైన వ్యక్తుల స్వభావం!



సతీదేవి దక్షయజ్ఞంలో దేహత్యాగం చేసికొన్న నాటినుండి పశుపతి విషయాభిలాషకు విముఖుడై తిరిగి వివాహం చేసికోకుండానే ఉన్నాడు. అచంచల మనోనిగ్రహంతో ఆ కృత్తివాసుడు ఆకాశగంగా జలసేచనంతో పెరుగుతున్న దేవదారు వృక్షాలతో కస్తూరి గంధపరిమళంతో కూడి కిన్నరుల గానంతో శోభిస్తున్న హిమాలయ పర్వతంపై అఖండ తపోదీక్షలో నిమగ్నుడై ఉన్నాడు. ప్రమథగణం శివునికల్లంత దూరంలో ఊతిబండలపై ఉపవిష్టితమైంది. తపస్వుల తపస్సులకు ఇంద్రత్వాది ఫలాలనిచ్చే ఆ మహేశ్వరుడు తన అష్టమూర్తులలో ఒక్కటైన అగ్నిని ప్రతిష్ఠించి ఏ కోర్కెతోనో తపస్సు చేస్తున్నాడు. హిమవంతుడు శివుని అర్ఘ్యపాద్యాదులతో పూజించి, నియమవర్తిని అయిన తన కుమార్తె పార్వతిని జయవిజయలనే ఇరువురు సఖులతో అతని శుశ్రూషకై నియోగించాడు. యోగసమాధికి స్త్రీలు ప్రతికూలురైనా పార్వతి సేవలనను మతించాడా పశుపతి. ప్రతికూల పరిస్థితుల్లో కూడా నిగ్రహం కలవారే కదా ధీరులు! పూజకై పూలు తీసికొని రావటం, వేదిక నలంకరించేటం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేటం, నీటినీ, దర్భలనూ సమకూర్చటం వంటిపనులతో పార్వతి పరమేశ్వరునికి వాపచారాలొనరిస్తూ ఉండేది! ఇది ప్రథమ సర్గాంతర కథ.

అప్పుడే తారకాసురుడు పెట్టే బాధలకోర్వలేక దేవతలు తమ్ము రక్షింపుమని బ్రహ్మను ప్రార్థించేటానికి దేవేంద్రునితో సహా బ్రహ్మలోకానికి వెళ్ళేరు. అచేట బ్రహ్మ ప్రసన్నవదనుడై ప్రత్యక్షం కావటంతో వారి ముఖాలు వికసించాయి. బ్రహ్మకు నమస్కరించి పలురీతుల్లో ఆయనను ప్రస్తుతించారు. బ్రహ్మ వారికి స్వాగతం పలికి అంతా ఒక్కుమ్మడిగా రావటానికి కారణమడిగేడు. దేవేంద్రుడతనికి సమాధానం చెప్పుమన్నట్లుగా బృహస్పతి ముఖం చూచాడు. బృహస్పతి బ్రహ్మకు ప్రాంజలియై "ప్రభూ! నీకు

తెలియనిదంటూ సృష్టిలో ఏముంటుంది? శత్రువులు మమ్మల్ని ఆక్రమించారు. నీ వల్ల వరగర్వితుడైన తారకాసురుడు సమస్త లోకాల్నీ క్షోభింపచేస్తున్నాడు. సూర్యచంద్రవాయువులు అతనికి సుఖం కలిగించే రీతిలోనే తమ వ్యాపారాలననుష్ఠిస్తూ ాన్నారు. చివరకు ఋతువులు సైతం ఒకదాని తరువాత మఱొకటి కాక, కావలసిన పుష్పాలన్నింటిని నిత్యం పూస్తూ, అతనికి దాస్యం నెఱపుతున్నాయి. సముద్రుడు సైతం ఆ రాక్షసునికి కానుకగా ఈయదగిన రత్నాలన్నింటినీ అవి సక్రమంగా రూపుదాల్చే వఱకు జాగ్రత్తగా పరిరక్షిస్తున్నాడు. వాసుకి మొదలైన ప్రముఖ సర్పరాజాలు రాత్రివేళల్లో తమ శిరస్సుపై ప్రకాశిస్తున్న శిరోమణులనే దివ్వెలుగా సమకూర్చి భయభక్తులతో ఆ నిశాచరాధముని కొలుస్తున్నారు. ఇంద్రుడూ వాని అనుగ్రహాన్నపేక్షించి కల్పవృక్షానుజాత ఆభరణాలతో నిత్యం అతణ్ణి ఆరాధిస్తున్నాడు. ఇందఱిన్ని విధాల అతని అడుగులకు మడుగులొత్తుతున్నా ఆ ఖలుడు ముల్లోకాల్నీ ముప్పుతిప్పులు పెట్టి మూడు చెఱువుల నీరు త్రావిస్తున్నాడు. దుర్జనుడు తలపెట్టే కీడుకు కీడు తలపెడితేనే కొంచెం శమిస్తుందేమో కాని మేలు చేస్తే మఱీ రెచ్చిపోతాడు. అమరస్త్రీలు ఎంతో సుకుమారంగా తమ గోళ్ళతో నందనవన పాదపమొగ్గల్ని త్రుంచుతూ ఉంటే వీడా వృక్షాల్నే నఱికివేస్తున్నాడు. వీడు చెఱపట్టిన దేవతాస్త్రీలు వాడు నిద్రించే సమయంలో కూడ చామరాలను వీస్తున్నారు. ఆ స్త్రీలు వారి దుర్దశకు బిగ్గరగా దుఃఖించేక, వాడు నిద్రపోతున్న సమయంలో నిశ్శబ్దంగా దుఃఖిస్తూ ఉంటే వారి కన్నీటిబొట్లు ఆ చామరాలకు తగిలి అతనికి చేల్లదనాన్ని చేకూరుస్తున్నాయట! సూర్యుని గుఱ్ఱాల గిట్టల తాకిడికి నలిగిన మేరుపర్వత శిఖరాలను పెకలించి తన ఇంట్లో ఉద్యానవనాల్లో క్రీడా పర్వతాలుగా అమర్చుకొని విహరిస్తున్నాడీ ఖలుడు. యజ్ఞాల్లో వ్రేల్చే హవిస్సులను తన మాయా ప్రభావంతో మా నుండి హరిస్తున్నాడు.



దేవేంద్రుని ఉచ్చై శ్శ్రవమనే హయరత్నాన్ని హరించాడు. ఆ దుర్మార్గునిపై వేము పన్నిన ఉపాయాలన్నీ సన్నిపాతజ్వరం పై ఔషధం వలె నిష్ఫలాలైనాయి. చివరకు హరి ప్రయోగించిన చక్రం కూడా అతని ఎడదపై అలంకారమై శోభించిందే తప్ప వాణ్ణేమీ చేయలేకపోయింది. ఆ రాక్షసాధముని ఏనుగులు ఇంద్రుని ఐరావతాన్ని నిర్జించి పుష్కలావర్త మేఘాల్ని ఢీకొంటూ క్రీడిస్తున్నాయి. కనుక మోక్షార్థులు సంసారబంధాన్ని ఛేదించే ఆత్మజ్ఞానహేతుభూతమైన ధర్మంలా ఆ తారకాసుర సంహారానికై ఒక సేనానిని సృష్టించి ప్రసాదించే వలసిందిగా ప్రార్థిస్తున్నాం".

బృహస్పతి మాటలను విన్న బ్రహ్మ దేవతల నుద్దేశించి, "మీ కోరిక తప్పక సిద్ధిస్తుంది. ఐతే కొంతకాలం ప్రతీక్షించాలి. ఎందుకంటే ఆ సేనానిని సృష్టించే పని నేను చేసేది కాదు. నేనెందుకు చేయకూడదంటే ఆ తారకాసురుడు నా వల్లనే అభ్యుదయం పొందేడు. తను పెంచిన విషవృక్షాన్నైనా సరే తాను నఱకటం సరికాదు" అన్నాడు. ఈ సందర్భంలో కాళిదాసు చెప్పిన

*"విషవృక్షోఽపి సంవర్ధ్య స్వయం ఛేత్తు మసాంప్రతమ్" (2-55)*

అనే శ్లోకపాదం ఎంతో స్పృహణీయమై విద్వల్లోకంలో ఒక సామెతగా రూపొందింది. యుద్ధ సన్నద్ధుడైన ఆ తారకాసురుని శివ వీర్యాంశ సంభూతుడు తప్ప వేఱెవరూ వధించలేరు. శివుడు తమోగుణాతీతుడైన పరంజ్యోతి అయిన పరమాత్ముడే సుమా! అందువల్ల ఆ మహాశివుని మహిమాతిశయాన్ని నేను కాని విష్ణువు కాని తెలిసికొనలేకపోయాం. కనుక ఈ కార్యం సిద్ధించాలంటే ఒకటే ాపాయం. సమాధినిష్ఠుడైన ఆ పరమశివుని మనస్సును ఇనుమును అయస్కాంతంతో ఆకర్షించినట్లు ఉమ సౌందర్యం ఆకర్షించేటట్లు చేయాలి. మా ఇద్దఱి వీర్యాన్ని భరించేటానికి ఇరువురే సమర్థులు. శంభుని వీర్యాన్ని భరించేటానికి

పార్వతి, నా వీర్యాన్ని భరించేటానికి శంభుని మూర్తిభేదమైన జలం. కనుక ఆ శితికంఠుని పుత్రుడు మీకు సేనాపతిగ ఉండి తారకాసురుని వధిస్తాడు. అనంతరం మీరు అతనిచే బంధితలైన సురాంగనలకు విముక్తి కలిగించి సుఖించేండి" అని చెప్పి బ్రహ్మ అంతర్ధానం చెందేడు. దేవతలూ కార్యాలోచనా తత్పరులై స్వర్గాన్ని చేరేరు. ఈ మహాకార్యానికి మన్మథుడొక్కడే సాధకుడని నిశ్చయించి ఇంద్రుడు తీవ్రంగా కందర్పుని స్మరించాడు. తక్షణం పుష్పధన్వుడు ప్రాంజలియై దేవేంద్రుని ఎదుట నిలిచాడు. ఇది ద్వితీయసర్గలోని ఇతివృత్తం.

"ఎదుట నిలిచిన కందర్పుని దేవేంద్రుడు మిగతా దేవతల నందఱనూ వదలి తన వేయికళ్ళతో చూచా"డంటూ తృతీయ సర్గారంభమౌతుంది. అదేం బాగుందంటే ప్రభువులు ప్రయోజనాపేక్షతో సేవకుల పట్ల ఆదరాతిశయాన్ని ప్రకటిస్తారనే అర్థాంతరన్యాసాలంకారంతో ఇంద్రుని చర్యను సమర్థిస్తూ కావ్యప్రయోజనాల్లో ఒకటైన 'వ్యవహారవిజ్ఞత' ను కాళిదాసు నిక్షేపించాడు. "ఇలా వచ్చికూర్చో" అని దేవేంద్రుడు తన ఆసనం ప్రక్కనే చోటు చూపించేటంతో మన్మథుడు తనకు కలిగిన గౌరవానికి ఉబ్బితబ్బిబ్బయినాడు. శిరశ్చాలనంతో తన గౌరవాన్ని అభివ్యక్తం చేసి ఏకాంతంలో దేవేంద్రునితో ఇలా అన్నాడు.

"ప్రభూ ఆజ్ఞాపించేండి. ఈ ఏడేడు లోకాల్లో నా వల్ల మీకు కావలసిన పనేమిటి? మీరు నన్ను తలచుకోవటంతోనే నాకు కల్పించిన గౌరవాన్ని ఏదోఒక పనిని ఆజ్ఞాపించి ప్రవర్ధిల్ల చేయండి. ఎవడైనా నీ పదవిని కోరి తపస్సు చేస్తూ నీ కీర్ష్య కలిగించాడా? చెప్పు. వాణ్ణి క్షణంలో నా బాణానికి గుఱిచేసి తపస్సు మూల త్రోచి తరుణీవశవర్తిని చేస్తాను. నీకు ఇష్టం లేకుండా పునర్జన్మ భయంతో మోక్షమార్గాన్ననుసరిస్తున్నాడా చెప్పు. కనుఱెప్పపాటులో వాణ్ణి కామినీ కటాక్షవీక్షణాలతో కట్టిపడేస్తాను.



ఒకవేళ ఎవడైనా అసురుడు నీకు శత్రువైతే ఆనతివ్వు. సాక్షాత్ శుక్రాచార్యుని ప్రత్యక్ష శిష్యుడైనా వాని మనస్సులో శృంగారాభిలాషనుద్దీపింపజేస్తాను. ఆ కాముకత వఱద ఒడ్డులను నిర్మూలించి నదిని రూపుమాపినట్లు వాని అర్థధర్మాల్ని సమూలంగా నాశం చేస్తుంది. అదీకాక ప్రాతివ్రత్య భంగానికి పరితపిస్తున్న దానిని వలచావా చెప్పు. క్షణకాలంలో ఆ సుందరి లజ్జను వీడి తనంతతానుగా వచ్చి నీకు కంఠాశ్లేష సౌభాగ్యాన్ని కూర్చేట్లు చేస్తాను. పరకాంత పొందు కోరేవని ఏకాంత అయినా నీవామె పాదాలపై బడి మన్నింపుమన్నా తిరస్కరించిందా? ఈ క్షణంలో ఆమె పశ్చాత్తప్తయై నీపై వారింపరాని విరహంతో చిగుళ్ళపాన్పుపై పొర్లేట్లు చేస్తాను. ఓ మహావీరా! నీ వజ్రాయుధం అవసరమేమీలేదు. దైత్య దానవాదుల్లో ఎవరినైనా సరే నీకు ద్వేష్యుడైన వాణ్ణి తన అఖండ పరాక్రమాన్నుంచి వైదొలగి అతివల కడకంటి చూపులకే దాసుణ్ణి చేస్తాను. ఇంతెందుకు? నీ దయ ఉంటే వసంతుని ఒకణ్ణి తోడు చేసికొని పూములుకులతోనే పినాకపాణి ధైర్యాన్ని సైతం సడలిస్తాను. ఇక ఇతరులొక లెక్కా?"

మదనుని మాటలతో ముదమందిన మహేంద్రుడు "సఖా! నువ్వు చెప్పిందంతా అక్షరసత్యం. నాకున్నవి రెండే అస్త్రాలు. వాటిలో మొదటిది వజ్రాయుధం, రెండవది నువ్వు. వీటిలో వజ్రాయుధం వీరులపై తప్ప వీతరాగులపై ప్రయోగానర్హమైంది. ఇక నువ్వా? వీరు, వారు అనే తారతమ్యం లేక ఎవరినైనా సాధించేగలవాడవు. నీ శక్తి నాకు బాగా తెలుసు. కనుకనే నాతో సమానుడవైన నీకొక పని అప్పగించేలనుకొంటున్నాను. ఎవరైనా అంతేకదా! శక్తిని తెలిసే పని అప్పగిస్తారు. విష్ణువు కూడా భూమిని మోస్తున్నాడనే అభిజ్ఞతోనే ఆదిశేషుని తన పడకగా పరికల్పించుకొన్నాడు. పరమశివునైనా నా బాణాలకు గుఱిచేస్తా" నన్న నీ మాట నీవప్పుడే కార్యాన్ని చేపట్టినట్లు చెబుతోంది. ఏమంటే ఇప్పుడు దేవతల హవిర్భాగాలను హరించే

బలిష్ఠులైన శత్రువులుత్పన్నమైనారు. వారి నాశం నువ్విప్పుడు హరునిపై బాణప్రయోగం చేయటంతోనే సిద్ధిస్తుంది. ఇది దేవకార్యం. దేవతానీకం నీనుండి కోరేదిదే. శత్రుజయానికి ఒక అపూర్వ తేజశ్శాలి దేవతలకు సేనానిగా ఉండాలి. అతడు శివుని తేజోవిర్భూతుడై ఉండాలి. ఆ మహాశివుడిపుడు సద్యోజాతాది మంత్రాంగన్యాసపూర్వకంగా ఆత్మధ్యాన నిష్ఠుడై ఉన్నాడు. నీ బాణం తప్ప మఱేదీ ఆయన ధ్యాననిష్ఠను మఱల్పలేదు. శివునికి నియతచిత్తురాలైన హిమవత్పుత్రికపై ప్రేమావిర్భావం కలిగేట్లు నువ్వు యత్నించాలి. శివుని తేజస్సును ధరించేటానికి స్త్రీలలో ఆమె తప్ప వేఱెవరూ సమర్థలు కారు. ఈ విషయాన్ని మాకు బ్రహ్మే తెలియజేసేడు. ఈ కార్యానికిప్పుడు కాలం కూడా కలిసి వచ్చింది. ఎందువల్లనంటే హిమవత్పర్వత శిఖరంపై తపోనిష్ఠుడైన శివునకు తండ్రి ఆనతిపై పార్వతి పరిచర్య కావిస్తోంది. ఈ విషయం అప్సరసలు నాకు చెప్పేరు. కనుక దేవకార్యనిర్వహణార్థం వెళ్ళు. అనన్యసాధ్యమైన ఈ మహాకార్య నిర్వహణ నీవలన జేరిగినప్పుడు అది నీకెంతో కీర్తిని ప్రసాదిస్తుంది. నువ్వు ధన్యుడవౌతావు. ఇదెంతటి గొప్ప విషయమో ఆలోచించు. ఎందుకంటే నిన్ను అర్థిస్తున్నవారా? దేవతలు. ఇక పనా? త్రైలోక్యరక్షణ. అహెూ! నీ విక్రమం ఎంత వింతైనది! మన్మథా! వసంతు డయాచితంగానే నీకు తోడై ఉంటాడు. అగ్నికి తోడుగా ఉండుమని వాయువుకెవరు చెప్పేరు? మీ సంబంధం కూడా అటువంటిదే." కందర్పుడట్లేనని దేవేంద్రాజ్ఞను పుష్పహారంలా శిరసావహించి బయలుదేరుతూ ఉంటే దేవేంద్రుడాతని దేహాన్ని గౌరవాదరపురస్సరంగా స్పృశించాడు.

ప్రియసఖుడు మాధవుడు, భార్య రతీదేవి "ఎంతకష్టం దాపురించింది" అని భయంతో అనుసరిస్తూ ఉంటే మన్మథుడు మాత్రం "నా ప్రాణాలు పోయినా సరే. ఈ దేవకార్యాన్ని సాధిస్తా" ననే పట్టుదలతో



హిమవత్పర్వతంపై ఉన్న స్థాణ్వాశ్రమానికి బయలుదేరేడు. ఆ తపోవనంలో అప్పుడు వసంతుడు తాపసుల ఏకాగ్రతకు భంగం కలిగిస్తూ తన ధర్మాన్ని ప్రవర్తింపచేసేడు. ఇంతలో ఉత్తరాయణం ప్రవేశించేటంతో మలయ మారుతం వీవదొడగింది. అశోకపుష్పాలు పుష్పించాయి. మావిమొగ్గలు లేచివురులతో విచ్చుకోగా, వాటిపై తుమ్మెదలు ఝుంకారంతో వ్రాలి ప్రకృతినంతా మదనోద్దీపకంగా చేస్తున్నాయి. మావిమొగ్గల నాస్వాదించేటంతో కందిన కంఠాలతో పుంస్కోకిలలు కూయసాగేయి. వాటి కంఠమాధుర్యం మనస్వినులకు రోషం విడిచి తమ భర్తల పరిష్వంగ సౌఖ్యాన్ని పొందండని చేసిన ఆజ్ఞగా భాసించింది. స్థాణ్వాశ్రమంలో నున్న తపస్వులకు ఈ ప్రకృతి శృంగార భావోద్దీపకమైనా వారు నిగ్రహంతో నిరోధించుకోగలిగేరు. రతీద్వితీయుడై మన్మథుడు తన విల్లెక్కుపెట్టి ఆ ప్రదేశానికి రావటంతోనే స్థావర జంగమ మిథునాలు అత్యంత మదనావేశాన్ని పొంది శృంగార చేష్టలతో రతి పారవశ్యాన్ని పొందేయి. ఇక్కడ కాళిదాసు లేళ్ళ యొక్క చేష్టల్ని బహుసొగసుగా వర్ణించాడు.

*"మధు ద్విరేఫః కుసుమైకపాత్రే పపౌ ప్రియాం స్వామనువర్తమానః।*
*శృఙ్గేణ సంస్పర్శ నిమీలితాక్షీం మృగీమకణ్డూయత కృష్ణసారః॥" (3-36)*

అంటే మగతుమ్మెద పూవు అనే ఒక పాత్రలోనే మధువును ఆడు తుమ్మెదను కొంత ఆస్వాదింపనిచ్చి మిగిలింది తాను త్రావింది. ఒక పాత్రలోని పానీయం స్త్రీపురుషులిరువురూ త్రావటం ప్రేమస్ఫోరకమైన చర్యకదా ! అలాగే ఒక నల్లని లేడి స్పర్శతో పారవశ్యం పొంది కళ్ళు మూసికొన్న ఆడులేడిని కొమ్ముతో గోకసాగింది. తామరపూవుల సువాసనతో ఉన్న నీటిని పుక్కిలించి ఒక ఆడ ఏనుగు తన మగ ఏనుగు నోట్లో ఉంచింది. ఒక చక్రవాకపక్షి తాను తిన్న తామరతూటి శేషాన్ని ఎంతో

ప్రేమగా తన బోటి నోటికిచ్చి సంతోషింప జేసింది. ఒక కిన్నరుడు క్రొంజెమట బిందువులతో కరగిపోతున్న మకరికా పత్రలేఖనలతో, పుష్పాసవంతో, ఘూర్ణితనేత్రాలతో, సొగసు మీఱిన ప్రియాముఖాన్ని చుంబించాడు. వృక్షాలు సైతం పుష్పస్తబకాలనే వక్షోజాలతో మెఱిసిపోతూ చిగుళ్ళనే పెదవులతో సొగసు మీఱిన లతా వధువులను వంగిన శాఖా భుజాలతో ఆలింగన సౌఖ్యానుభూతి నొందేయి. ఇంతగా వసంతుడు విజృంభించేటంతో స్థావర జంగమాత్మకమైన ప్రకృతి ఒక ప్రక్క పరవశమౌతున్నా మఱొకవైపున అప్సరల గానం వీనులకు విందుచేస్తున్నా మహేశ్వరుడు మాత్రం నిశ్చలుడై ఆత్మానుసంధాన పరుడైనాడు. విజితేంద్రియుల తపశ్చర్యకు విఘ్నాలు అడ్డురావు కదా!.

ఆ లతాగృహద్వారం వద్ద నిలిచిన నందీశ్వరుడు తన ఎడమచేతితో బంగారు బెత్తాన్ని పట్టుకొని కుడిచేతి తర్జనిని నోటిపై ఉంచిన సంజ్ఞతో ప్రమథుల ఇచ్ఛావిహారాన్ని ఆపేడు. ఆ నందీశ్వరుని ఆజ్ఞతో నిశ్చలమైపోయిన ఆ వనం చిత్రకారుని చిత్రంలా భాసించిందనే కాళిదాసు శ్లోకం ఎంతైనా రమణీయమైంది.

**'నిష్కమ్పవృక్షం నిభృతద్విరేఫం మూకాణ్డజం శాన్త మృగప్రచారమ్।**
**తచ్ఛాసనాత్ కాననమేవ సర్వం చిత్రార్పితారమ్భ మివావతస్థే" ॥ (3-42)**

ఈ ***"చిత్రార్పితారమ్భ ఇవావతస్థే"*** అనే ప్రయోగం కాళిదాసుకు చాలా ఇష్టమైందిగా అనిపిస్తుంది. రఘువంశంలో 2వ సర్గలో 31వ శ్లోకంలో కూడ ఇదే ప్రయోగాన్ని చూస్తాం.

ప్రయాణం తలపెట్టినవారు శుక్రుడెదురుగా ఉన్న స్థలాన్ని వీడిపోతున్నట్లు మన్మథుడు ఆ నందీశ్వరుని కంట పడకుండా శివుడు సమాధినిష్ఠుడై ఉన్న ప్రదేశాన్ని సమీపించాడు. చావు మూడిన మన్మథుడు దేవదారు వృక్షపుటరుగు మీద వ్యాఘ్రాజినాసీనుడై సమాధిలో ఉన్న



ముక్కంటిని చూచాడు. అప్పుడా మహేశ్వరుడు వీరాసన స్థితిలో ఉన్నాడు. శరీరంలో పూర్వార్థం నిశ్చలమైంది. రెండు భుజాల్నీ కుదించి ఉన్నాడు. రెండు చేతుల్నీ తెఱచి ఒడిలో ఉంచినందువల్ల విరిసిన తామరవలె శోభించాడు. జటాజూటాన్ని సర్పంతో బంధించాడు. అక్షమాల రెండు పేటలతో చెవిన వ్రేలాడుతోంది. అసలే నల్లగా ఉండే ఆ నీలకంఠుని కంఠం నలుపైన లేడిచర్మాన్ని ధరించేటంతో మఱింత నల్లనైంది. త్రినేత్రాల్నీ నాసాగ్రంపై నిలిపేడు. పంచప్రాణాల్నీ నిరోధించి అలలు లేని నీటిమడుగు వలె, గాలి లేని ప్రదేశంలో నిశ్చలమైన దీపం వలె ప్రకాశిస్తున్నాడు. మనస్సును నవరంధ్రాల వృత్తుల్లో సంచరించేనీయక హృదయంలో స్థిరంగా వాంచి ఆత్మానుసంధాన పరుడై ఉన్నాడు. అట్టి స్థితిలో ఉన్న ఆ ముక్కంటిని చూడటంతోనే భయంతో చేయి వణకి, మన్మథుని చేతనున్న బాణసహితమైన విల్లు జారిపడిపోవటం కూడ మన్మథునికి తెలియలేదు. ఆ సమయంలో అతని మనోధైర్యాన్ని పెంపొందింపచేయటానికి సౌందర్యవతులైన ఇద్దఱు సఖులతో కూడి పార్వతి అక్కడికి వచ్చింది. రతీదేవిని మించిన సౌందర్యనిధి అయిన పార్వతిని చూడటంతో మదనునికి తన కార్యసిద్ధి విషయంలో ఆశ తిరిగి చిగిర్చింది. అప్పుడే శివుడు తన చేతస్సులో పరంజ్యోతిని దర్శించుకొని వచ్చి ధ్యానాన్ని విడిచాడు. తన పర్యంక బంధాన్ని సడలించాడు. నందీశ్వరుడు పార్వతికి నమస్కరించి లోనికేగి శివునకామె రాకను తెలిపేడు. అతని కంటి సంజ్ఞను అనుమతిగా తెలిసికొని నందీశ్వరుడు పార్వతిని లోపలకు నడిపించాడు. పార్వతి సఖులిద్దఱూ ఆమె స్వయంగా కోసిన పూలను చిగుళ్ళతో శంకరుని పాదాలమ్రోల ప్రణామపూర్వకంగా సమర్పించారు.

పార్వతి భక్తి పూర్వకంగా అవనత శిరస్కయై శివునికి ప్రణమిల్లింది. శివుడు సవతులు లేని పతిని పొందుమని ఆమెనాశీర్వదించాడు. మహాత్ముల వాక్కులక్షరశః ఫలిస్తాయన్నట్లు అదే విధంగా జేరిగింది కదా! బాణప్రయోగ సమయానికై నిరీక్షిస్తున్న కామదేవుడు అగ్నిలో దుమికే శలభం వలె పార్వతి మ్రోల హరునిపై బాణాన్నెక్కుపెట్టి వింటినారిని పదేపదే తడవసాగేడు. గౌరి తపస్వి అయిన శివునికి సూర్యకిరణాలతో ఎండిన ఆకాశగంగలోని తామరగింజల అక్షమాలను కానుకగా సమర్పించింది. శివుడా తావళాన్ని స్వీకరించే క్షణంలోనే మన్మథుడు సమ్మోహనాస్త్రాన్ని తన వింట సంధించాడు. నెలపొడుపుకు సముద్రుని వలె శివుడు కించిత్పరిలుప్త ధైర్యుడై దొండపండు వంటి మోవితో ప్రకాశిస్తున్న ఆ గిరిజ వదనంపై తన చూపులను నిగిడించాడు. ఆ సమయంలో పార్వతి శరీరం పులకాంకురాలతో నిండిపోయింది. సిగ్గుమొగ్గలు వేస్తుంటే ముఖాన్ని కొంచెం ప్రక్కకు త్రిప్పి నిలిచింది. త్రినేత్రుడు జితేంద్రియుడైనందువల్ల నిగ్రహించుకొని తనలో కలిగిన మనోవికారానికి కారణమేమై ఉంటుందని నలుదెసలా తిలకించాడు. ఆలీఢపాదుడై బాణ ప్రయోగానికి సిద్ధపడిన మన్మథుడు దృగ్గోచరుడైనాడు. తన తపస్సును భగ్నం చేయటానికి పూనుకొన్న ఆ పూవిల్తునిపై నిటలాక్షుని మూడవకంటి నుండి ఉద్భవించిన మంటలు లేచాయి.

**"క్రోధం ప్రభో సంహర సంహరేతి యావద్గిర ః ఖే మరుతాం చరన్తి।**
**తావత్సవహ్నిర్భవనేత్ర జన్మా భస్మావశేషం మదనం చకార॥ " (3-72)**

"ప్రభూ కోపగించేకు, కోపగించేకు" మని ఆకాశంలో వేల్పుల వాక్కులు వెలువడేటంతలోనే భవుని నేత్రం నుంచి ఉద్భవించిన వహ్ని మదనుని భస్మావశేషుని చేసింది.



ఎంతో మనోజ్ఞమైన శ్లోకం. శివుడు మన్మథుని కోపంతో దహించేనున్నాడు. ఆకాశంలో దేవతలంతా కలసి క్రోధాన్ని వీడుమని ప్రార్థించేవలసిన అవసరమేముంది? మన్మథుడే లేకపోతే సృష్టి అంతరిస్తుంది. లోక కళ్యాణం దేవతల దృష్టి. పరమర్షుల ధ్యేయమూ అదే. అంతేకాని కేవలం భోగాల్లో మునిగి తేలటం దేవతలకు, ముక్కుమూసికొని స్వమోక్షార్థమే తపశ్చర్య నొనరించేటం మహర్షులకూ ఉద్దిష్టమైంది కాదు. ఈ మహార్థాన్ని మహాకవి వాచ్యం చేయక వ్యంగ్య వైభవంతో వ్యక్తం చేస్తాడు. కావ్యాధ్యయనంలో అవసరమైంది ఇదీ.

భర్తృమరణంతో రతీదేవి మూర్ఛిల్లింది. ఆ మూర్ఛలో ఉన్నంత కాలం దుఃఖం లేకపోవటం వల్ల అది ఆమెకు ఉపకారమే అయిందంటాడు కాళిదాసు. తపోవిఘ్నకరుడైన మన్మథుని క్షణకాలంలో పిడుగు చెట్టును దగ్ధం చేసినట్లు దహించిన శివుడు స్త్రీ సాన్నిహిత్యం త్యజించేలనే ఉద్దేశ్యంతో వెంటనే తన ప్రమథగణాలతో అంతర్ధానమయ్యాడు. తన తండ్రి కోర్కె విఫలం కావటం, తన సౌందర్యం నిష్ప్రయోజనం కావటం పైగా ఇంతటి పరాభవం తన సఖుల సమక్షంలోనే జేరగటంతో పార్వతి సిగ్గుతో ఇంటివైపు మఱలింది. రుద్రుని సంరంభంతో కళ్ళుమూసికొని భయభ్రాంతురాలై దయనీయమైన స్థితిని పొందిన దుహిత పార్వతిని హిమవంతుడు చూచి తన దేహాన్ని దీర్ఘీకరించి తామరతూడును ధరించిన ఐరావతం వలె తన హస్తద్వయంతో ఆమెనెత్తికొని గృహోన్ముఖుడైనాడు. ఇక్కడితో తృతీయసర్గ పూర్తౌతుంది.

మూర్ఛ నుంచి తేఱికొన్న రతీదేవి భర్తకై విలపించేటం, వసంతుని రాక, సహగమనానికి సిద్ధపడ్డ ఆమెను మన్మథుడు పునర్జీవుడౌతాడని ఆకాశవాణి ఓదార్పు చతుర్థసర్గలోని అంశాలు.

బూడిదగా మాఱిన భర్త దేహాన్ని చూచి పట్టరాని దుఃఖంతో మూర్ఛనొందిన రతీదేవిని తిరిగి దుస్సహమైన నవవైధవ్య దుఃఖాన్ననుభవింప చేయటానికి విధి ఆమెను మూర్ఛ నుండి తేర్చినట్లైంది. అనే అర్థంలో –

**"అథ మోహపరాయణా సతీ వివశా కామ వధూర్విబోధితా।**

**విధినా ప్రతిపాదయిష్యతా నవవైధవ్య మసహ్యవేదనమ్॥"**

అనే శ్లోకంతో చతుర్థసర్గారంభమౌతుంది. రతీదేవి ఎంతచూచినా తనివి తీఱని సౌందర్యరాశి భర్త కనపడకపోవటంతో అతనికై నలుదెసలా పరికించింది. కాని భర్తను ఇకచూడగల భాగ్యమే పోయిందనే విషయం ఆమెకు తట్టలేదు. "ప్రాణేశ్వరా! బ్రతికే ఉన్నావా?" అంటూ లేచిన ఆమె కెదురుగ శివుని కోపానలంతో భూమిపై పేరుకొని పురుషాకృతిలో ఉన్న బూడిద కనిపించింది. ఆ భస్మరాశి తన భర్తదే అని తెలిసికొన్న రతిదేవి భూమిపై పొరలి ధూళిధూసరితమైన దేహంతో దుఃఖిస్తూ ఉంటే ఆ దుఃఖాన్ని ఆ అరణ్యభూమి కూడా పొందిందనిపించింది. "లోకంలో సౌందర్యానికి ఉపమానభూతమైన నీ శరీరం ఇటువంటి దుఃస్థితి నొందినా నా గుండె పగిలిపోదేం? స్త్రీలు కఠిన హృదయులు. నా జీవితం నీ అధీనమని నమ్ముతున్న నా స్నేహాన్ని వీడి ఎక్కడికి వెళ్ళేవు? ఎప్పుడూ నాకు నీవు కాని, నీకు నేను కాని ఇష్టంలేని పనులు చేసి ఎఱుగమే. మఱి అటువంటి నువ్వు ఇంతగా విలపిస్తున్న నాకు కనిపించవేం? గోత్రస్ఖలన సందర్భాల్లో నా మేఖలతో నిన్ను తాడించిన సన్నివేశం గుర్తుకు తెచ్చుకొని కోపగించి వెళ్ళిపోయావా? "నువ్వు నా హృదయంలో ఎప్పుడూ ఉంటావు" అని నువ్వు నాతో చెప్పిన మాటలసత్యాలా? కాక అది నిజమే అయితే నువ్వీ విధంగా



నాశనమైనా ఇంకా నేనెలా జీవించేటం జేరుగుతుంది? పరలోకవాసివైన నిన్ను నేనిదే వచ్చి కలుసుకొంటాను. కాని నీ నిర్గమనంతో విధి లోకాన్ని వంచించింది. ఎందుకంటే జీవుల సుఖమంతా నీ అధీనమైంది కదా! చీకటి కమ్మిన రాత్రివేళల్లో మేఘగర్జనలకు భయపడిన అభిసారికలను వారికై ఉవ్విళ్ళూరుతున్న ప్రియుల ఇళ్ళకు చేర్చటానికి నువ్వు తప్ప సమర్థుడెవడు? నువ్వు లేకపోవటం వల్ల రతిక్రీడకుత్తేజాన్నిచ్చే సురాపానం ఇంతులకు నిష్ఫలమైపోతుంది. నువ్వు లేనందువల్ల నిన్నుద్దీపింపచేసే చంద్రుడు, మావిక్రొన్ననలు, తుమ్మెదలు ఎంతగా నిర్వ్యాపారులైపోతారో నీకు తెలియదూ? మదనా ! లే, లేచి మధురభాషిణి అయిన కోయిలను స్త్రీ పురుషులను రతిక్రీడకై సంధానపఱచే పనిలో నియమించు. మన్మథా! ఒకనాడు, నా పొందుకై నువ్వు శిరస్సుతో నా పాదాలకు మ్రొక్కటం, వణుకుతో చేసిన గాటపు కౌగిలింతలు, ఏకాంత సురతక్రీడలు స్మరణకు రావటంతో నా వ్యథ మఱింతగా వృద్ధి పొందుతోంది.

"ఓ సురతప్రవీణా! నువ్వు నాకు చేసిన పుష్పాలంకరణ ఇంకా వాడిపోలేదు. కాని ఆ అలంకారం చేసిన నువ్వు మాత్రం ఇంతలోనే అస్తమించావు. నువ్వు నా వామపాదానికి పారాణి నలంకరిస్తుంటే క్రూరులైన దేవతలు నిన్ను స్మరించి తీసికొని వెళ్ళేరు. త్వరగా వచ్చి దక్షిణపాదానికి సైతం పారాణి నలంకరించు. స్వర్గంలో నెఱజాణలైన అప్సరోగణం నిన్ను వలపించి తమ వలలో వేసికోక ముందే నేను అగ్నిప్రవేశం చేసి నీ అంకాన్ని చేరుతాను. మన్మథుని విడిచి రతీదేవి క్షణమైనా ఉండదు" అన్న లోకుల ప్రశంస నీవు వెళ్ళిపోయినా ఇంతసేపు నేను బ్రతికి ఉండటం వల్ల వారి దూషణ కిప్పు డాస్కారం కలుగుతోంది. మరణించిన వారికి తుది

అలంకారం చేయటానికి కూడా నీకు దేహం లేదే! అయ్యో! ఎంతటి దౌర్భాగ్యం నాది! నీ మిత్రుడు వసంతుడెక్కడ? ఉగ్రుడైన పినాకి నీతోపాటే అతణ్ణీ భస్మీకృతుని చేయలేదుకదా" ఈ విధమైన రతీవిలాప వచనాలు విషదిగ్ధశరాల వలె తగులగా ఆమె నోదార్చటానికి వసంతుడు కనిపించాడు.

దుఃఖాతీతులకు ఆప్తులెదురైనపుడు దుఃఖం మఱింతగా విజృంభిస్తుంది. అలాగే వసంతుని చూడటం తోటే దుఃఖం పెల్లుబికి రతీదేవి ఱొమ్ములు బాదుకొంటూ తిరిగి విలపించింది. అతణ్ణి చూచి రతి "చూడు వసంతా! నీ నేస్తం ఎలా బుగ్గిపాలైపోయాడో! పంచవన్నెల పావురం వలె వివిధ వర్ణసంయుక్తమైన ఈ బూదిని వాయువు వివిధ దశలకు చిమ్మి వేస్తోంది! మదనా! నాకు కనిపించేక పోయినా నీ మిత్రునికైనా కనిపించు. నిన్ను చూడాలని ఎంతో ఆతురుడై వచ్చాడు. పురుషులకు ప్రియురాలిపై కంటె స్నేహితుల మీద ఉన్న ప్రేమే బలీయమైంది కదా! నీ వింటి నారి తామరతూడు లోని దారం. బాణాలు అతిసుకుమారాలైన పుష్పాలే అయినా దేవదానవ యుక్తమైన లోకాన్ని మోహపఱచే కలగటం ఈ నీ మిత్రుడు వసంతుని ప్రభావం వల్లనేకదా! అటువంటి మిత్రుని కూడా నువ్వు చూడకపోవటం ఏం బాగుంటుంది చెప్పు" అని విలపించి వసంతునిచూచి "వసంతా! నీ మిత్రుడు గాలికి ఆరిపోయిన దీపంలా అయిపోయాడు. నేను మాత్రం దుఃఖమనే పొగబారిన వత్తిలా మిగిలేను. వసంతా! ఒక పని చేసిపెట్టగలవా? దుఃఖవివశనైన నేను స్వయంగా చితి పేర్చుకోలేను. నాకు త్వరగా చితిపేర్చి అగ్నిప్రవేశం చేయించి నీ మిత్రుని వద్దకు చేర్చి పుణ్యం కట్టుకో. వెన్నెల చంద్రునితోను, మెఱుపు మేఘంతోనూ మాయమై పోతున్నాయి. ఇలా ప్రమదలు పతుల మార్గాన్నే అనుసరించాలని అచేతనాలకు కూడా తెలిసిన విషయం.



*"శశినా సహయాతి కౌముదీ సహమేఘేన తటిత్ప్రలీయతే।*
*ప్రమదాః పతివర్త్మగా ఇతి ప్రతిపన్నం హి విచేతనైరపి"॥ (4-33)*

ఎంత అందమైన శ్లోకం! కరుణ రసప్లావితమైన సందర్భమైనా పదసంయోజనంలో పరమరమణీయత చోటు చేసికోవటం వల్లనే కావ్యనాటకాల్లో ఏ రసమైనా ఆనందంలోనే పర్యవసిస్తుందనే అలంకారికుల తీర్పుకిదొక ఉదాహరణగా తీసికోవచ్చు.

"ఈ నా ప్రియుని భస్మాన్నే అంగరాగంగా శరీరమంతా అలుముకొని నవపల్లవ పాన్పుపై ఎంత ఆనందంగా పవ్వళిస్తానో అంతే ఆనందంగా చితిలో ప్రవేశిస్తాను. వసంతా! నువ్వు మా ఇద్దఱికి ఎన్నోసార్లు పూలపాన్పు అమరించావు. ఇప్పుడు నీకు చేతులు మోడ్చి ప్రార్థిస్తున్నాను. నాకు వెంటనే చితి పేర్చు. పేర్చిన తక్షణం అగ్నిని జ్వలింపజేసి సహాయపడు. ఎందుకంటే నేను లేకుండా నీ మిత్రుడు నిముసమైనా సుఖంగా ఉండలేడని నీకు తెలుసుకదా! ఆ తరువాత మాకు ఒకే తిలాంజలి ఇవ్వు. ఆయనకు నాతో కలిసి జలాంజలి స్వీకరించేటవే ఇష్టం. పిండ ప్రదానం మావిపూగుత్తులతో చెయ్యి. అవే ఆయనకు చాలా ఇష్టమైనవి".

ఈ విధంగా సహగమనానికి కృతనిశ్చయురాలైన రతీదేవికి ఆకాశవాణి పలుకులు అమృతోపమానాలై వినిపించాయి. " ఓ కుసుమాయుధపత్నీ! త్వరలోనే నీ భర్త నీకు లభిస్తాడు. ఏ పురాకృత కర్మ వలన అతడు శివనేత్రజ్వాలకు భస్మీభూతుడైనాడో విను. "పూర్వం బ్రహ్మను తన కూతురు సరస్వతిపైనే నీ పతి మరులు గొలిపేడు. బ్రహ్మ తన మనోవికారాన్ని నిగ్రహించుకొని ఇతణ్ణి శపించాడు. ఆ శాపఫలమే ఇది. అపుడు ధర్ముడనే ప్రజాపతి మదనుని మరణంతో సృష్టికార్యం స్తంభించిపోతుంది కనుక శాపావధిని ప్రసాదింపుమని ప్రార్థిస్తే, తపస్సు చేత ఎప్పుడు శివుడు పార్వతి పట్ల బద్ధానురాగుడై వివాహమాడతాడో

అప్పుడీ శాపం తొలగి అతడు పునరుజ్జీవితుడౌతాడ" ని అనుగ్రహించాడు. పిడుగుపాటుకు, జీవనాధారమైన జలానికీ మేఘుడెలా సమర్థుడో అట్లే జితేంద్రియులు నిగ్రహానుగ్రహ సమర్థులు కదా! కనుక " ఓ కళ్యాణీ! ప్రియా సంగమానికి నోచుకోబోయే నీ శరీరాన్నంత వఱకు రక్షించుకో. ఎండాకాలంలో ఎండిపోయిన జలాశయాలు తిరిగి వర్షాకాలంలో జలభరితాలు కాకుండా ఉండవు కదా" ఈ మాటలతో ఆకాశవాణి రతీదేవి మరణోద్యోగాన్ని నివారించింది. వసంతుడు సైతం అశీరరవాణి పలుకులసత్యం కాజాలవని త్వరలోనే భర్తృ సమాగమం సిద్ధిస్తుందనీ ఆమె నాశ్వాసించాడు. రతీదేవి ఆ శుభగడియలకై నిరీక్షిస్తూ కాలం గడిపింది. ఈ విధంగా చతుర్థసర్గ ముగుస్తుంది.

పార్వతి తపస్సుకు పూనుకోవటం, తల్లివద్దని మందలించేటం, తండ్రి అనుజ్ఞతో ఆమె తపశ్చర్య కావించేటం, శివుడు బ్రహ్మచారివేషంలో వచ్చి శివుని నిందించేటం, పార్వతి బ్రహ్మచారిని గెంటించేబోతే శివుడు ప్రత్యక్షం కావటం పంచమసర్గలో ప్రస్తావితాంశాలు.

పినాకిచే ఆ విధంగా తన కళ్ళఎదుటే మన్మథుడు భస్మీకృతుడు కావటంతో భగ్నమనోరథ అయిన పార్వతి తన అందాన్ని నిందించుకొంది. స్త్రీల అందానికి ప్రియుల వాల్లభ్యమే ప్రయోజనం కదా! పిమ్మట తన సౌందర్యం వ్యర్థం కాకుండా ఉండటానికి తపస్సుచేత శివుని చిత్తాన్ని ఆకర్షించుకోవటం ఒక్కటే ఉపాయంగా భావించింది. పార్వతి నిశ్చయాన్ని తెలిసికొన్న ఆమె తల్లి మేనకాదేవి ఆమె ప్రయత్నాన్ని నివారించేలని భావించి గాఢంగా కౌగిలించుకొని "అమ్మా! మన ఇంట కోర్కెలు తీర్చగల దేవతలెందఱు లేరు? తపస్సెక్కడ? సుకుమారమైన నీ శరీరం ఎక్కడ? శిరీషపుష్పం తనపై భ్రమరం వ్రాలితే సహించేగలదు కాని పక్షి వ్రాలితే సహించేగలదా? "అని ఎంతగా చెప్పినా పల్లానికి పాఱే నీటిని మెఱక



ప్రదేశానికి పాఱించేలేనట్లే కూతురు దృఢనిశ్చయాన్ని సడలించేలేక పోయింది. ఒకసారి మనస్విని అయిన పార్వతి తన నిశ్చయాన్ని ప్రియసఖితో తండ్రికెఱిగించి అనుజ్ఞకై అభ్యర్థించింది. ఆమె సంకల్పంలోని ఔచిత్యాన్ని గ్రహించిన హిమవంతుడు సంతోషించి అనుమతించాడు. అప్పుడామె క్రూరమృగాలు సంచరించేని ఒక అనువైన ప్రదేశాన్నెంచుకొని తపస్సుకుపక్రమించింది. ఆమె తపస్సు చేసిన ఆ శిఖరమే అనంతకాలంలో ఆమె పేర గౌరీశిఖరంగా ప్రసిద్ధినొందింది. ఆమె విలువైన ఆభరణాలనీ, వస్త్రాలనీ విసర్జించి వల్కలధారణ చేసింది. తాపసానుకూల వస్త్రధారణాలంకారాలతో కూడ ఆమె ఇదివఱకటి వలెనే నూత్నశోభతో పెంపొందింది. నిన్నటి వఱకు అనర్ఘశయ్యాసనాదుల కలవాటు పడిన ఆమె నేడు కటికనేలపై కూర్చునేది. తన చేతినే దిండుగా చేసికొని శయనించేది. అచటి వృక్షాలకు స్వయంగా నీరుపోసి పెంచేది. అచటి లేళ్ళు ఆమెతో ఎంతో మచ్చికను పెంచుకొన్నాయి. ఆమె చేసే స్నాన జపాదులు అగ్నిహోత్రాదులకు ముగ్ధులైన మునులు తఱచు ఆమెను చూడటానికి వచ్చేవారు. ధర్మవృద్ధుల విషయంలో వయస్సు పరిగణితం కాదని ***"న ధర్మవృద్ధేషు వయ స్సమీక్ష్యతే"*** అనే అర్థాంతరన్యాసంలో కాళిదాసు మునుల చర్యలను సమర్థిస్తాడు. ఈ సన్నివేశం ద్వారా వయస్సుతో నిమిత్తం లేకుండా ధర్మపరులను గౌరవించాలనే సందేశాన్ని కూడా లోకానికిచ్చినట్లైంది. కావ్యప్రయోజనాల్లో ఒకటైన 'ఉపదేశం' అంటే ఇదే. ఆ తపోవనంలో సహజ వైరం కల మృగాలు సైతం మైత్రిని పాటించేవి. వృక్షాలు కూడా అతిథుల కిష్టమైన ఫలాదుల నొసగి గౌరవించేవి. నూతనంగా కొందఱు పర్ణశాలలు నిర్మించుకొని హోమాదులు కావిస్తూ ఆ ఆశ్రమ పవిత్రతను మఱింత వృద్ధినొందించారు.

పార్వతి తాను చేసే తపస్సు తన మనోరథాన్నీడేర్చటానికి చాలదని గ్రహించి తన తపస్సును తీవ్రతరం చేయనారంభించింది. బంతి ఆటకే అలసట నొందే ఆమె మునీశ్వరులాచరించే తీవ్రతపస్సు చేయనారంభించేసాగింది. తన శరీర సౌకుమార్యాన్నే మాత్రం లక్ష్యపెట్టక తనకు నాలుగు వైపుల అగ్నిని జ్వలింపజేసి నడినెత్తిన సూర్యుడుండగా – ఈ విధంగా పంచాగ్ని మధ్యంలో తపస్సు సాగించింది. సూర్యకిరణాల వేడిమికి కమలాలెలా వాడిపోకుండా ఉంటాయో పార్వతి శరీరం కూడ అలాగే కందిపోక ప్రకాశించింది. కాకపోతే కనుకొలకుల్లో మెల్లమెల్లగా కొద్దిపాటి నలుపుదనం ఏర్పడింది. ఇక లభించిన జలాలను, చంద్ర కిరణాలనే ఆహారంగా గ్రహించి కఠోరమైన తపస్సులో నిమగ్నమైంది. ఇలా పంచాగ్ని మధ్యంలో నిరాహారంగా తపస్సు చేస్తుంటే వర్షారంభానికి భూమి నుంచి ఎలా ఆవిరులుద్భవిస్తాయో అదేవిధంగా ఆమె శరీరం నుంచి కూడ ఆవిర్లు పైకి లేచేయి. వర్షాకాలంలో సైతం ఆరుబయటే వానకు తడుస్తూ భూస్థలిపై శయనిస్తున్న ఆమెను రాత్రులు మెఱపు తీగలనే కళ్లతో చూస్తున్నాయా అన్నట్లుండేవి. చెట్ల నుండిరాలిన ఆకులనే ఆహారంగా స్వీకరించేటం తపశ్చర్యకు పరకాష్ఠ. అయితే పార్వతి ఆ పర్ణాలను సైతం ఆహారంగా స్వీకరించేక పోవటంతో మహర్షులామెను 'అపర్ణ' అని వ్యవహరించేవారు. ఈ విధంగా మహాతపోనిధులను మించిన తపస్సాచరిస్తూ ఉంటే ఒకనాడు ఒక వటువు ఆమె ఆశ్రమానికి వచ్చాడు.

నల్లని లేడి చర్మాన్ని వస్త్రంగా అమర్చుకొని చేత మోదుగకఱ్ఱను ధరించి, ప్రౌఢతర వాక్కుల ప్రాగల్భ్యంతో నొట్టిపడుతున్న బ్రహ్మ తేజస్సుతో, రూపొందిన బ్రహ్మచర్యాశ్రమమో అనిపించేట్లున్నాడా జేడదారి. పార్వతి ఆ వటువుకు తగిన అతిథి సత్కారాలు జేరిపించింది. విధ్యుక్తంగా సలిపిన సత్కారాలను స్వీకరించి కొంతసేపు మార్గాయాసాన్ని తీర్చుకున్నట్లు నటించి



"ఇక్కడ నీకు సమిధలు, దర్భలు, జలం సులభంగా లభిస్తున్నాయికదా! స్నానవిధికి అంతరాయం ఏర్పడటం లేదు కదా! శక్తికి తగ్గట్లే తపశ్చర్య సలుపుతున్నావు కదా! ధర్మసాధనలో శరీరం ముఖ్యం కదా!" అంటూ సంభాషణ ప్రారంభించాడా కపటవటువు. చెంత చేరిన లేళ్లు నీ చేతిలో దర్భల్ని లాగికొన్నపుడు నీకు కోపం రావటం లేదుకదా! ఎందుకంటున్నానంటే తపస్సు చేసేవారు ఆగ్రహాన్ని అదుపులో ఉంచుకోవాలికదా! నీ నుండి స్ఫూర్తి గైకొని ఇచ్చటి మునులు నడచుకోవటమే నీ ఆదర్శవర్తనాన్ని తెలుపుతోంది. నువ్వు నీ తండ్రి వంశాన్ని పవిత్రీకరించిన పుణ్యమూర్తిగా నాకు కన్పిస్తున్నావు. అర్థకామాల్ని విడిచి ధర్మాన్నే స్వీకరించి నువ్వు తపస్సుకు పూనుకున్నందువల్ల ధర్మార్థకామ త్రిపుటిలో ధర్మమే ఉత్కృష్టమైందిగా నాకు తోస్తోంది. నువ్వు నన్ను విశేషించి సత్కరించినందువల్ల నన్ను వేఱొకనిగా భావించేకు. మనీషులు ***"సఖ్యం సాప్తపదీన ముచ్యతే"*** అంటారు. ఇప్పుడెలాగూ మనం ఏడు మాటల కంటె ఎక్కువే మాట్లాడుకున్నాం కనుక మన మధ్య చెలిమి స్థిరమైంది. అందువల్ల ఓ తపస్వినీ! బ్రాహ్మణ సహజమైన కుతూహలంతో నిన్నొకటి అడగాలనుకొంటున్నాను. రహస్యం కాకపోతే చెప్పు. నువ్వా ఉత్తమ కుల సంజాతవు. నీ సౌందర్యమా త్రిలోకాతీతమైంది. ఐశ్వర్యం తులలేనిది, నవయౌవనవతివి, ఇన్నీ నీకు సిద్ధమై ఉంటే ఇంతకంటె కోర తగిందే ముందని ఈ తపస్సుకు పూనుకొన్నావో చెప్పు. ఒకప్పుడు భర్తృ తిరస్కృతలైన స్త్రీలిట్టి తపస్సుకు పూను కొంటారు. నీ విషయంలో అటువంటి ప్రసక్తే తోచేటం లేదు. పుట్టింట్లోనూ నీకు అవమానం

కలగటాని కాస్కారం లేదు. ఇతరులవల్లా నీకు పరాభవం జేలిగే వీలే లేదు. ఎందుకంటావా? నీకపకారం తలపెట్టినవాడు పాము పడగ మీద చేయి వేసేవాడే అవుతాడు. స్వర్గాన్నాశించి నువ్వీపనికి పూనుకొన్నా వనుకొం దామా అంటే అది వృథాశ్రమ. ఎందుకంటే, నీ తండ్రి నెలవులు దేవతల నివాస భూములు. అది స్వర్గమే. వరుని ఆశించి తపస్సు చేస్తుంటే మాత్రం అదీ న్యాయం కాదు. ఎందుకంటావా? జనులు రత్నాన్ని వెదకుతారు, కాని రత్నం జనాన్ని వెదకుతూ వెళ్లదు కదా ! నీవు కన్యారత్నానివి, కనుక నిన్ను వెదకుతూ వరుడు రావాలి కాని నువ్వు వరుని కోసం తపస్సు చేయటమేమిటి? నీ వేడి నిట్టూర్పుల వలన నీ తపశ్చర్య వరుని కోసమని అనుమీయమానమవు తోంది. నువ్వు కోరదగినవాడంటూ ఎవడూ ఉండడు. అట్టిస్థితిలో నీవు కోరినా దుర్లభుడంటూ ఎవడుంటాడు? ఇంతకాలం ఇంత కఠిన తపస్సు చేస్తున్నా నువ్వు కోరినవాడు రాక, నిన్నుపేక్షించాడంటే వానికంటె వజ్రకఠోరమైన మనసు కలవాడు మఱొకడుండడు. నీ వంటి పరమ మనోహరమైన సౌందర్యాన్ని స్వీకరించేటానికి ఇంకా ఆలస్యం చేస్తున్నాడాంటే అతడెంతటి నిర్భాగ్యుడో కదా! గౌరీ! ఇంకెంతకాలం తపఃక్లేశాన్ననుభవిస్తావు? నేను ఆర్జించిన తపస్సులో సగభాగం నీకర్పిస్తాను. దాంతో నువ్వు కోరిన వరుడు నిన్ను తప్పక స్వీకరిస్తాడు. అతడెవరో చెప్పు. తెలిసికోవాలని కుతూహలంగా ఉంది" ఈ విధంగా శ్రేయోభిలాషి వలె అడుగుతున్న ఆ బ్రాహ్మణ వటువుకు తన మనోగతాన్ని చెప్పటానికి లజ్జనొంది తన సఖిని చెప్పుమని కాటుకలేని కంటితో సూచించింది పార్వతి.

పార్శ్వవర్తిని అయిన పార్వతి సఖి ఆ కపట బ్రహ్మచారితో "అయ్యా! మా సఖి ఎందుకీ తపశ్చర్య నవలంబించిందో తెలిసికోవాలని ఉంటే



వినండి. అభిమానవంతురాలయిన మా పార్వతి అధికైశ్వర్యయుక్తులైన ఇంద్రవరుణయమ కుబేరులైన చతుర్దిగధిపతులను కాదని మన్మథుని భస్మీకృతుని చేసిన పినాకపాణిని వరించింది. ఆ మహానుభావుడు కాముని జయించినందువల్ల సౌందర్యసంపదకు లభ్యుడు కాడని తపస్సు నాశ్రయించింది. ఇతఃపూర్వం కందర్పుడు ఈశ్వరునిపై ప్రయోగించిన బాణం ఆయన హుంకారంతో ఆయన దరి చేరలేకపోయినా మా సఖి హృదయంలో మాత్రం గాటంగా నాటుకొంది. అప్పటి నుండి శివునిపై అలవికాని వలపుతో కేశ సంస్కారాన్ని త్యజించి సుఖాపాదకమైన పితృగృహంలో సైతం సుఖానికి దూరమైంది. ఈమె బాష్పరుద్ధకంఠంతో శివుని స్తుతిస్తూ గానం చేస్తుంటే కిన్నర రాజకుమార్తెలు సైతం విలపించేవారు. విరహవేదనతో రాత్రులందు మూడు జాములు దాటే వఱకు నిద్రలేక చివరి జాములో కొంచెం నిద్రపడుతూ ఉంటే స్వప్నంలో శివుని చూచి "నీలకంఠా ఎక్కడికెడుతున్నావం"టూ కలవరిస్తూ నిద్రమేల్కొనేది. తానుస్వయంగా చిత్రించిన శివుని చిత్రాన్ని చూచి "నువ్వు సర్వాంతర్యామివని పండితులు చెబుతూ ఉంటారు. మఱి నిన్నే వలచిన నన్ను తెలిసికోవేం?" అంటూ నిందించేది. జగత్పతి పొందుకు వేఱు ఉపాయం లేక పితృపాదుని అనుజ్ఞతో ఈ తపోవనాన్ని చేరి తపశ్చర్యకు పూనుకొంది. ఈమె ఇక్కడ నాటి పెంచిన చెట్లు ఫలవంతాలైనాయి, కాని ఈమె తపోవృత్తికి ఆలంబమైన చంద్రశేఖరునిలో మొలకెత్తినట్లుగా కూడ కనిపించేటంలేదు. "సఖి మాటలు విన్న ఆ కపట బ్రహ్మచారి లోలోన ఎంతో సంతోషించి పైకి మాత్రం దాన్ని వ్యక్తం చేయక "పార్వతీ! నీ సఖిమాటలు నిజేమా? లేక పరిహాస విజల్పితాలా?" అని అడిగేడు. స్ఫటికమాలను పూనిన పార్వతి మితంగా "ఓ వేదవరేణ్యా! నీవు విన్నది నిజేమే"నంది

..."మహేశ్వరుడు నాకు తెలుసు. నిన్నాయన తిరస్కరించినా అమంగళాచార ప్రియుడైన ఆయన్నే కోరుకోవటం నాకేమీ బాగుండలేదు. అయినా వివాహవేళ పాణిగ్రహణ సందర్భంలో అతి సుకుమారమైన నీ చేతిని పామును కంకణంగా ధరించిన అతడు గ్రహించేటం ఎంత భయంకరంగా ఉంటుంది? రాజహంసల ముద్రలతో నీ చీరకొంగుకు రక్తం ప్రవిస్తున్న అతని గజచర్మంతో ముడివేయటం చూచేవారికెంత ఏవగింపు కలిగిస్తుందో నువ్వే ఆలోచించు. ఈనాడు లత్తుక పాదాలతో పూలమీద నడచే నువ్వు పెళ్ళైన తరువాత ఆ లత్తుక పాదాలతో శ్మశానంలో నడవటం చూచిన శత్రువు గుండైనా ద్రవించిపోదూ? ఆలింగన సమయంలో హరిచందన చర్చతో శోభించేవలసిన నీ వక్షద్వయం శివుని మైబూదిని వహించేటం కంటె ఘోరం ఇంకేముంటుంది? వివాహవేళ గజేంద్రునిపై ఊరేగవలసిన వేళ ముసలి ఎద్దు నెక్కి ఊరేగటం చూచి నలుగురూ నవ్వుకోరూ? ఇప్పుడు నువ్వతనిని పెళ్ళాడగోరితే ఇద్దఱు దయనీయులౌతారు. అతని శిరస్థమైన చంద్రరేఖ ఇప్పటికే శోచనీయమ్మైౕంది. నీతో ఇద్దఱు. సాధారణంగా వరునకుండవలసిన గుణాల్లో ఒకటైనా శివునికి ఉందేమో ఆలోచించు. మొదటిది అందం. మూడు కళ్లతో దాని ప్రస్తావనే లేదు. రెండవది వంశగౌరవం. తల్లిదండ్రులెవరో తెలియకపోవటంతో అదీలేదు. మూడవది ధనం. దిగంబరుడు కావటంతో శివునికి అన్నీ పూజ్యాలే. కనుక ఈ దుష్టకామన నుండి నివర్తిల్లు. భాగ్యశీలవైన నీకు అమంగళశీలుడైన శివునితో సంబంధం ఏ మాత్రం యుక్తంకాదు. యజ్ఞవేళ యూపస్తంభానికి చేయవలసిన సంస్కారాన్ని శ్మశానంలో పాతిన కఱ్ఱకెవరైనా చేస్తారా?"

ఈ విధంగా మాయావటుడు శివుని తెగనాడటంతో పార్వతి ముఖం కోపంతో జేగురించి పెదవులు కంపించాయి. కనుబొమలు ముడిచి



ముఖాన్ని త్రిప్పికొంది. "నీకు శివుని తత్త్వం తెలియదు. అందుకే యథేచ్ఛగా వదరుతున్నావు. లోకసాధారణం కాని, హేతువు నెఱుగలేని మహాత్ముల నడవడిని మూఢులు ద్వేషిస్తారు అని చెప్పిన శ్లోకం ఎంతైనా స్పృహణీయమైంది.

**"ఉవాచ చైనం పరమార్థతో హరం నవేత్య నూనం యత ఏవ మాత్థమామ్**
**అలోక సామాన్య మచిన్త్య హేతుకం ద్విషన్తి మన్దాశ్చరితం మహత్మనామ్॥**
**(5-75)**

విపన్నివారణకు, ఐశ్వర్యసంపాదనకు లోకులు మంగళకరమైన వస్తువుల నాశ్రయిస్తారు. లోకరక్షకుడై, నిష్కాముడైన శివునికి తృష్ణను రేకెత్తించే ఈ మంగళకర భోగపదార్థాలతో పనేముంది? మహాదేవుడు దరిద్రుడైనా సంపత్ప్రదాత. శ్మశానవాసి అయినా త్రిలోకనాథుడు. బాహ్యస్వరూపం భయంకరంగా కనిపించినా పరమసౌమ్యుడు. నిజానికి పినాకి యథార్థతత్త్వం తెలిసినవారెవరూ లేరు. విశ్వమే ఆకృతినొందిన ఆ అష్టమూర్తికి అనర్ఘభూషణాలతోపాటు నాగవిభూషణాలూ అలంకారాలే. విలువైన వలిపాల్నీ ధరిస్తాడు, గజాజినాచ్ఛాదితుడై కూడ ఉంటాడు. చంద్రుణ్ణీ శిరోభూషణం చేసికొంటాడు, కపాలాన్నీ ధరిస్తాడు. ఆయన శరీర సంసర్గాన్నొందిన ధూళి ఎంతటివారినైనా పవిత్రుల్ని చేస్తుంది. కనుకనే ఆయన తాండవమాడినప్పుడు ఆ చరణధూళిని దేవతలు భక్తితో శిరసా వహిస్తారు. ఆయన వృషభవాహనుడైనంత మాత్రాన వచ్చిన లోటేముంది? ఐరావతాన్నధిరోహించిన సాక్షాద్దేవేంద్రుడే ఆయన పాదాలకు మ్రొక్కులిడతాడు. అయితే శివుని గూర్చి దుష్టుడవైన నువ్వు ఎన్ని దుర్భాషలాడినా ఒక్కసత్యం మాత్రం చెప్పేవు. అదేమంటే అతడు తల్లిదండ్రులు లేనివాడని. ఆత్మభవుడైన బ్రహ్మకు ఎవరు కారణభూతుడని

అంటారో అట్టి శివునకు జన్మ కారకులెవరుంటారు? నీతో వాదనలెందుకు కాని, ఆయన ఒకవేళ నీవన్నట్లు నిందా భాజనుడైనా నామనస్సాయన యందే లగ్నమై ఉంది. నువ్వు నన్నెన్నన్నా ఉపయోగంలేదు. ఎందుకంటె నీ మాటలు నేనేమీ లక్ష్యపెట్టను" అని ఆ వటువు ఇంకేదో మాట్లాడబోతుంటే పార్వతి తన చెలికత్తె వైపు చూచి "వీడింకా ఏదో ప్రేలబోతున్నట్లుంది. నోరుమూయించు. ఎందువల్లనంటే పూజ్యులను దూషించే వారితో పాటు ఆ దూషణ విన్నవారికి కూడా పాపం చుట్టుకొంటుంది. పోనీ ఇక్కణ్ణుంచి నేనే వెళ్ళిపోతానంటూ వక్షస్థలం నుంచి జారులువారిన పైటను సర్దుకొంటూ అటు తిరుగబోతుంటే శివుడు తన నిజస్వరూపంతో ఆమెను చేపట్టేడు.

శివుని స్పర్శతో పార్వతి దేహం కంపించింది. స్వేదం అంకురించి ముందడుగు వేయబోయిన ఆమె పాదం పర్వతం అడ్డగించేటం వల్ల ఆకులమైన నదివలె రూపొందిన ఆ శైలాధిరాజ తనయ పోలేని, నిలువలేని స్థితిని పొందింది. చంద్రమౌళి "నేటి నుండి నేను నీ దాసుణ్ణి. నీ తపస్సనే వెలతో నన్ను కొనుక్కొని నీ వాణ్ణి చేసికొన్నావు సుందరీ" అంటూ ఉంటే పార్వతి తపః క్లేశమంతా క్షణంలో తీఱి అమందానందానుభూతి నొందింది. ఇక్కడితో పంచమసర్గ సమాప్త మౌతుంది.

పార్వతి సఖీమూలంగా తన తండ్రి వలన తన్ను ఉద్వాహమొనర్చుకొమ్మని రహస్యంగా శివునికి వర్తమానం పంపటం, శివుడు స్మరణమాత్రంతో సప్తర్షులను తనపెండ్లి పెద్దలుగా వ్యవహరింపండని కోరటం, వారు వచ్చి అంగీకరించేటం, పెద్దముత్తైదువగ అరుంధతి పాల్గొనటం, సప్తర్షులు శివుని స్తుతించేటం, హిమవంతుడు వారిని గౌరవించి వచ్చిన పని గ్రహించి భార్య మేనకతో చర్చించి పార్వతీ పరమేశ్వరుల వివాహానికి శుభముహూర్తాన్ని నిర్ణయించేటం, ఆ



వృత్తాంతాన్ని మునులు కపర్దికి తెలిపి తమతమ నెలవులకు వెళ్ళిపోవటం, ఆఱవసర్గలో వర్ణితమైన అంశాలు. ఈ సర్గలో కాళిదాసు భారతీయ వివాహవ్యవస్థను అత్యంత సుందరంగా ఔచితీపూర్ణంగా చిత్రించాడు.

పార్వతి విశ్వాత్ముడైన పరమశివునికి తన సఖీముఖంగా "నాథా! మా తండ్రి వలన కన్యాదాన విధిగ నన్ను స్వీకరించేటం యుక్తం" అని చెప్పింది. శివుడు అట్లేనని తన అంగీకారాన్ని ఆమె ద్వారా పార్వతికి తెలిపి, ఆకాశంలో నక్షత్ర స్వరూపాల్లో ఉన్న సప్తర్షులను స్మరించాడు. వెంటనే అరుంధతీయుతమైన ఆ సప్తర్షిగణం ఈశ్వరుని ఎదుట ప్రత్యక్షమైంది.

పరమేశ్వరుడు అరుంధతీ దేవిని సప్తర్షులతో సమానంగా గౌరవించాడు. ఆమెను దర్శించేటంతో యజ్ఞాది క్రియాకల్పానికి భార్య అనివార్య కనుక శివునికి తాను త్వరగా భార్యావంతుడను కావాలనిపించింది. శివునికా కోర్కె కలగటంతో మన్మథుడు తాను శీఘ్రమే శివుని అనుగ్రహానికి పాత్రుడనౌతానని ఊఱడిల్లేడు. సప్తర్షులు మహేశ్వరునికి నమస్కరించి ఆయన దర్శనంతో తమ తపస్సు సిద్ధించిందని పలికేరు. శివుని స్తుతించినవాడే కృతకృత్యుడైనపుడు శివుడు స్మరించిన వాని భాగ్యమింకెంతటి గొప్పదో అని భావించారు. వారనేక విధాల శివుని కొనియాడి తమ వలన కాగల కార్యమేదో ఆనతివ్వమని ప్రార్థించారు. అపుడా మహాదేవుడు వారితో దేవతలు శత్రుబాధా నివారణకై తననొక పుత్రుని పొందవలసిందిగా ప్రార్థించారనీ కనుక యజ్ఞవిధికై యజమాని అగ్ని సంధానానికై అరణినాశ్రయించే విధంగా తాను పార్వతిని స్వీకరించేలని భావిస్తున్నాననీ వారితో చెప్పేడు.

*"అత ఆహర్తుమిచ్ఛామి పార్వతీమాత్మ జన్మనే।*

*ఉత్పత్తయే హవిర్భోక్తుర్యజమాన ఇవారణిమ్ "॥ (6-28)*

భారతీయ వివాహవ్యవస్థను దాంపత్యధర్మంలోని పవిత్రతను అత్యద్భుతంగా విశదీకరించే ఇటువంటి శ్లోకాన్ని కాళిదాసు మాత్రమే వ్రాయగలడు. రఘువంశంలో కాళిదాసు రఘువంశపు రాజుల వృత్తాంతాన్ని చెబుతూ ***"శైశవేభ్యస్త విద్యానాం.........."*** ఇత్యాది శ్లోకంలో ***"ప్రజాయై గృహమేథినామ్"*** అంటాడు. 'ప్రజ' అంటే సంతానం అని అర్థం. గృహస్థాశ్రమ స్వీకారం సంతానార్థమే. ఈ సంతానం దేనికి? ధర్మరక్షణకు, స్త్రీ పురుషుల మైథున క్రియ కేవల కామోపశమనానికి కాక ధర్మాన్ని నిత్యం నిర్వర్తింపజేయటానికే ఉద్దిష్టమైంది. ***"బహుస్యాం ప్రజాయై యా"*** అనేది భగవంతుని ప్రథమోహ. ఈ శ్లోకం శారీరకోద్రేకాలను అణచుకోవటానికి కాక, తదతీతమైన ఒక మహోన్నత ధ్యేయ సిద్ధిని ధ్వనింపజేస్తోంది. వివాహక్రియ యజ్ఞం వంటిది. యజ్ఞం సువృష్టి కోసం, సువృష్టి వల్ల ప్రాప్తించేది సుభిక్షం. ఈ విషయాన్నే...

**"అన్నాద్భవన్తి భూతాని పర్జన్యాదన్న సమ్భవః।**
**యజ్ఞాద్భవతి పర్జన్యః యజ్ఞఃకర్మ సముద్భవః॥ "**

అని భగవద్గీత (3-12) కూడా చెబుతోంది.

కాళిదాసు శ్లోకంలో "ఆత్మజన్మనే" అనే శబ్దానికి పుత్రుని కొఱకు అని అర్థం. **'ఆత్మావై పుత్ర నామాసి"** అని వేదం. పురుషుడు తానే స్త్రీ యందు పుత్రునిగా జన్మిస్తున్నాడు. ఇక్కడ తాను పార్వతిని స్వీకరించే గోరుతున్నా ననటానికి చెప్పిన ఉపమానం యజ్ఞకర్త, అరణి. యజ్ఞంలో అగ్నిని ఉత్పాదించేటానికి ఉపయోగించేది అరణి. ఆ అరణిని కొయ్యలతో మథించేటం వల్ల అగ్ని ఉత్పన్నమౌతుంది. ఈ నాటికీ ఈ ప్రక్రియను ఎక్కడైనా యజ్ఞం చేసేటప్పుడు చూడవచ్చు. అరణి స్త్రీ జననేంద్రియమైతే దాని మథనానికి కొయ్యవంటిది పురుషుని జననేంద్రియం. ఈ రెంటి మథనం వలన కలిగేది సంతానం. స్త్రీ పురుష సంగమాన్ని



భౌతికోద్రేకోపశమనానికి కాక యజ్ఞభావనతో సలిపే పవిత్ర కర్మగా భారతీయులు విశ్వసిస్తారు. ఇంతటి మహా విషయాన్ని ఈ శ్లోకం వ్యక్తం చేస్తోంది.

తరువాత మహాశివుడు సప్తర్షులతో "మీరు మాకోసం హిమవంతుని ఆర్థించేండి. సత్పురుషులు కూర్చిన సంబంధం ఎప్పుడూ వికటించేదు. హిమవంతుడు ఉన్నతుడు, స్థిరుడు, భూభారవాహకుడు. కనుక ఆయనతో బాంధవ్యం నాకూ వాంఛింప తగిందే. కన్యకై ఆయనను ఆర్థించేవలసిన విధానం నేను మీకు చెప్పనక్కఱలేదు. ఎందుకంటే విజ్ఞులు స్మృతిరూపంగా మీరు చెప్పిందే అనుసరిస్తారు కనుక. పూజ్యురాలైన అరుంధతి కూడ ఇందులో సహకరించాలి. ఇటువంటి విషయాల్లో స్త్రీలకే నేర్పు ఎక్కువ. కనుక హిమవంతుని నగరం ఓషధి ప్రస్థానానికి వెళ్ళి కార్యాన్ని సఫలీకృత మొనర్చికొనిరండి. యోగీశ్వరుడైన ఈశ్వరుడే వివాహానికి సుముఖుడైనందువల్ల ఈ సప్తర్షులు తాము వివాహమాడినందుకు లోనైన సిగ్గును విడనాడేరు. తరువాత సప్తర్షులు శివుని అనుజ్ఞతో హిమవంతుని వద్దకు ఆకాశమార్గంలో బయలుదేరి నీటిలో సూర్యబింబంవలె వృద్ధానుక్రమంగా హిమవంతునింట దిగేరు. హిమవంతుడు వారిని అర్ఘ్యపాద్యాలతో సత్కరించి అంతఃపురానికి స్వయంగా త్రోవ చూపుతూ తీసికొని వెళ్ళేడు.

సప్తర్షులను వేత్రాసనాసీనులను చేసిన హిమవంతుడు వారికి ప్రాంజలియై వారితో "అనుకోకుండా మీ దర్శనభాగ్యం కలగటం మేఘం లేకుండా వర్షించినట్లు, పూవు పూయ కుండానే ఫలోదయమైనట్లు భావిస్తున్నాను. హఠాత్తుగా మూఢుడు జ్ఞానియైనట్లు, ఇనుము బంగారంగా మాఱినట్లు, భువి నుండి దివికి చేరినట్లుగా నన్ను నేను

సంభావించుకొంటున్నాను. నా శిరస్సుపై తమ పాదం మోపటం వల్ల, నా వల్ల కాగల పనిమీద మీరు వచ్చినందువల్ల రెండు విధాలా నేను పవిత్రుణ్ణైనాను. అయితే మీరు నిరీహులు కనుక నాతో పని ఉంటుందని అనుకోను. కనుక నన్ను ధన్యుని చేయటానికే మీ రాకగా భావిస్తున్నాను. అయినా నాకొక పనిని అనుగ్రహించేటంతో తమ కింకరుణ్ణనే తృప్తి కలిగించేవలసిందిగా ప్రార్థిస్తున్నాను. నేను, నాభార్య, మాకు ప్రాణసమానమైన ఈ నా పుత్రి ఈ ముగ్గురిలో ఎవరి వలన ఏ కార్యం జేరగాలన్నా ఆదేశించేండి. నెరవేర్చటానికి మేం ముగ్గురం సంసిద్ధులమే! ఇక మిగిలిన వస్తువుల మాట చెప్పటం ఎందుకు?" అని నివేదించిన హిమవంతుని పలుకులు గుహ అంతటా ప్రతిధ్వనించేటంతో అతని నిశ్చయాన్ని పునరుక్తం చేసినట్లైంది.

హిమవంతుని మాటలు విన్న మునులు వారిలో అగ్రగణ్యుడైన అంగిరసుని వంక చూడటంతో అంగిరసుడు "నువ్వు చెప్పినదెంతో యుక్తంగా ఉంది. నువ్వు చెప్పినదానికన్న ఎక్కువ చేయగల సమర్థుడవని మాకు తెలుసు. నీ శిఖరాల వలె నీ మనస్సు కూడ ఎంతో ఉన్నతమైంది. స్థావర రూపుడవైన నిన్ను విష్ణుమూర్తిగా పెద్దలు స్తుతిస్తారు. దానికనుగుణంగానే విష్ణుమూర్తిలో వలె నీలోనూ స్థావర జంగమ రూపాలైన పంచభూతాలు నెలకొని ఉన్నాయి. నువ్వు పాతాళం వరకు వ్యాపించి భూభారాన్ని మోస్తున్నందువల్ల ఆదిశేషుడు తన కోమలమైన పడగలతో భూమిని మోయగలుగుతున్నాడు. విష్ణుపాదోద్భవ అయిన గంగ ఎంత పవిత్రమైందో ఉన్నత శిఖరాలు కలిగిన నీవు అంతే పవిత్రుడవని విబుధులు కీర్తిస్తారు. మూడంగలతో విశ్వమంతా వ్యాపించేటం శ్రీహరికి ప్రయత్న సిద్ధమైతే నీకు స్వభావసిద్ధంగానే అది సాధ్యమైంది. యజ్ఞాల్లో హవిర్భాగార్హత హేమాద్రికి లేక హిమాద్రికే కలగటం ఎంత ఘనమైన



విషయం. ఇక మేము వచ్చిన పని నీపనే కాని మా పని కాదు. దాని ఫలం కూడా నీవంతే. మా వంతు కేవలం ఉపదేశం మాత్రమే. అదేమిటంటే ఏ భగవంతుడు అణిమాద్యష్ట సిద్ధులతో కూడి ఇతరుల నెవరినీ వరించని 'ఈశ్వర' శబ్దవాచ్యుడై నెలవంకను ధరించి ఉన్నాడో, ఏ భగవానుడు తన అష్టమూర్తులతో ఈ విశ్వాన్ని వహిస్తున్నాడో ఎవనిని యోగులు తమ సమాధిస్థితిలో అన్వేషిస్తూ ఉంటారో, ఎవనిని పొందినవారు తిరిగి సంసారంలో పడరని విద్వాంసులు వచిస్తారో, అభయాభీష్ట ప్రదాత అయిన ఆ శంకరుడు మా ముఖంగా నీ కన్యను యాచిస్తున్నాడు. వాక్కుతో అర్థాన్ని కూర్చినట్లు నీ దుహితను ఆ శంకరునితో కూర్చటం మంచిది. ఎందుకంటే మంచి వరునికి కన్యాదానం చేసిన తరువాత ఇక చింతించేవలసిన అవసరం ఉండదు. ఆ సర్వేశ్వరునికి నీ కుమార్తె నివ్వటం వల్ల, ఆయన జగత్పిత కనుక నీ కుమార్తె జగన్మాతయై శోభిస్తుంది. ఉమ వధువు. వరుడు శంభుడు. మేము యాచించేవారం, నీవు కన్యాదాతవు. ఇంతకు మించి నీ వంశోత్కర్ష కింకేవాలి?" దేవర్షి ఇలా చెబుతూ ఉంటే పార్వతి సిగ్గుతో తలవంచికొని తన చేతిలోని క్రీడాకమల పత్రాలను లెక్కపెడుతూ ఉండిపోయి తన సంతోషాన్ని ముఖంలో దాచుకొంది. హిమవంతుడు శివునికి కూతునివ్వటానికి కృతనిశ్చయుడైనా భార్య మేనకాదేవి ముఖంలోకి చూచాడు. "వీరికేం సమాధానం చెబుదాం?" అన్నట్లు. ఆమె కూడా అంగీకారాన్ని సూచించింది. హిమవంతుడు మంగళాలంకృత అయిన పార్వతి చేతులు పట్టుకొని "అమ్మా! నిన్ను ఆదిభిక్షువుకు భిక్షగా సమర్పించేలని నిశ్చయించాను. ఋషులు నన్నర్థించారు నాకు గృహస్థుని ఫలం లభించింది." అంటూ ఋషులకు పార్వతిచే నమస్కరింప చేసేడు. వారికి నమస్కరించేటంలో పొందిన సంతోషాతిరేకంతో పార్వతి సువర్ణ కర్ణావతంసాలు జారిపోవటంతో ఆమె మరింత సిగ్గుపడుతూ ఉంటే

అరుంధతి పార్వతిని వాత్సల్యంతో ఎత్తి తన ఒడిలో కూర్చోబెట్టుకొంది. కూతురు దూరమౌతోందనే దిగులుతో కళ్లలో నీరు తిరుగుతున్న మేనకాదేవి ముఖంలోకి చూస్తూ అరుంధతి "నీకు కాబోయే అల్లుడు దేవదేవుడు, మృత్యుంజయుడు, సవతులులేని కాపురం నీ కూతురిది" అని ఓదార్చింది. ముహూర్తమెప్పుడని అడిగిన హిమవంతునితో "నేటికి నాల్గవనాడే వివాహ శుభ ముహూర్తం" అని చెప్పి ఋషులు నిష్క్రమించారు. హిమవంతుని వీడ్కొని శివుని చేరి కార్యసాఫల్యాన్ని తెలిపి మునులు ఆకాశమార్గంలో తమ తమ స్థానాలకు చేరేరు. అద్రిసుతా సమాగమానికై ఉత్కంఠ భరితంగా ఎదురు చూస్తున్న పరమశివునికా మూడు దినాలే ఎంతో భారంగా గడిచాయి. జితేంద్రియుడై కందర్పుని భస్మీభూతం కావించిన పశుపతికే ప్రియాసంగ మోత్కంఠ ఇంత బలీయమైనపుడు ఇక సామాన్యుల సంగతి చెప్పవలసిం దేముంది?

సప్తర్షులు నిర్ణయించిన విధంగా జామిత్ర (సప్తమ) శుద్ధి కలిగిన సుముహూర్తంలో బంధుసమేతుడై హిమవంతుడు వివాహదీక్షా విధిని ఆచరించాడు. ఓషధపురంలోని పుణ్యస్త్రీలింటింటా మంగళద్రవ్య సేకరణా సంరంభంలో ఉన్నారు. నగరంలోని రాజవీధుల్ని కల్పవృక్ష పుష్పాలతో చేక్కగా అలంకరించారు. చీనాంశుకధ్వజాలతో స్వర్ణతోరణాలతో నగరం ఆలంకృతమై స్వర్గం దిగివచ్చినట్లనిపిస్తోంది. ఒక ప్రక్కసంతోషభరితంగా ఉన్నా వేఱొక వంక తమ ప్రాణాధికమైన ఉమతో కలుగబోయే వియోగం హిమవద్దంపతులను వేధించేసాగింది. బంధువర్గమంతా పార్వతిని సర్వాంగసుందరంగా అలంక రించేటంలో నిమగ్నమై ాంది. ఉత్తరఫల్గుణీ నక్షత్రయుక్త మైత్ర ముహూర్తంలో పుణ్యాంగనలు పార్వతిని పెళ్ళికూతును చేసేరు. బాణాన్ని చేతపట్టి పార్వతి అభ్యంగన స్నానానికి సిద్ధపడింది. ముత్తైదువలు బంగారు కలశాలతో ఆమెకు స్నానవిధిని నిర్వర్తించారు.



స్నానానంతరం శుద్ధవస్త్రధారిణి అయిన పార్వతి వినూత్న శోభతో విరాజిల్లింది. అనంతరం నూత్న వధూఅలంకరణ ప్రవర్తిల్లింది. అగరు ధూపాలతో ఆమె కేశపాశాన్ని ఆరబెట్టి చిత్ర విచిత్రాలంకారాలు సమకూర్చారు. ఆగామి శుభసూచకంగా ఆమె క్రింది పెదవి స్ఫురించింది. సఖీజనం ఆగామి శుభశృంగారస్ఫోరకమైన మాటలతో ఆమెతో పరిహాసాలాడేరు. అలంకరణ అయిన పిమ్మట ఆమె తన ముఖాన్ని అద్దంలో చూచుకొని శివునికది తృప్తినిస్తుందా అని తనలో తర్కించుకొంది. స్త్రీల అలంకారాలు భర్త సంతోషానికే కదా! తల్లి మేనకాదేవి ఆమెకు కళ్యాణతిలకాన్ని దిద్దింది. ఆనందబాష్పాకులితయైన మేనాదేవి పార్వతి దీక్షా కంకణాన్ని ధరింపజేయటంలో తడబాటు పడగా చెలులు దాన్ని సవరించారు. తల్లి ఆమెచే గృహదేవతాపూజనొనరింపచేసి పుణ్యస్త్రీలకు పాదాభివందనం చేయిస్తే వారంతా "అఖండమైన భర్తృ ప్రేమ భాజనవుకమ్మ" ని ఆశీర్వదించారు. అయితే అనంతర కాలంలో భర్త శరీరార్ధాన్నే పొందిన పార్వతికీ ఆశీర్వచనం కొద్దిపాటిదే అయింది. హిమవంతుడు శివుని ఆగమనానికై ఉత్కంఠతో నిరీక్షిస్తున్నాడు. శివునికై వరునికి తగిన వివాహాలం కరణలను సప్తమాతృకలు సమకూర్చారు. పెండ్లి కుమారునిగ అలంకరించేటానికి మాతృకలు తీసికొని వచ్చిన సామగ్రిని శివుడు వారిపై గౌరవసూచకంగా కేవలం స్పృశించాడు. ఈ సందర్భంలో కాళిదాసు వ్రాసిన శ్లోకంః

*"తద్గౌరవాన్మఙ్గల మణ్డనశ్రీః సా పస్పృశే కేవలమీశ్వరేణ ।*
*న ఏవ వేషః పరిణేతురిష్టం భావాన్తరం తస్య విభోః ప్రపేదే"॥ (7-31)*

ఇందులో శిష్టాచారం వ్యక్తమౌతోంది. మనం ఎవరికైనా ఏదైనా ఆహారపదార్థాన్ని కాని లేదా వస్తువును కాని ఇచ్చినప్పుడు దానిని ఆరోగ్యకారణాల వల్ల కాని లేదా అపరిగ్రహ (ఇతరుల నుంచి దేనినీ

స్వీకరించరాదనే నియమం) నిష్ఠతో కాని వారు స్వీకరించకపోతే దానిని చేతితో కేవలం స్పృశించి "మమ" (నాదే) అంటూ వదులుతారు. శిష్టులు అనుసరించే మార్గం ఇది. అల్లసాని పెద్దన మనుచరిత్రలో ప్రవరాఖ్యుని ప్రవర్తన గూర్చి చెబుతూ "సాలగ్రామము మున్నుగా గొనడు" (మను-1-55) అంటాడు. అర్హులైన బ్రాహ్మణులకు దానాలు చేసే సంప్రదాయం భారతదేశంలో ఉంది. అయితే పాత్రదానం ఎంతటి సత్ఫలితాన్ని స్తుందో అపాత్రదానం అంతటి పాపాన్నీ ప్రాప్తింప చేస్తుంది. సాధారణంగా ఒకడు మఱియొకని నుంచి దానాన్ని స్వీకరిస్తున్నాడంటే ఇచ్చినవాని పాపాల్ని స్వీకరిస్తున్నాడని అర్థం. అందుకే విధిలేక గడవక ఎవరైనా బ్రాహ్మణుడు దానాన్ని స్వీకరించినా ఆ పాపపరిహారార్థం కొన్నివేల జపాన్ని చేయాలి. ఇప్పుడు ఇస్తున్నవారు గొప్పవారే కనుక తీసికోక నిరాకరిస్తే వారు నొచ్చుకుంటారని దాన్ని స్పృశించి విడువటం. ఇక్కడ శివుడు చేసినదిదే. ఇలా మహాకవుల మాటల్లో అర్థాల్ని పాఠకులు వెతుక్కోవాలి.

ఈశ్వరుడు మంగళాలంకారాల్ని స్వీకరించక తన సహజ స్థితిలోనే ఉన్నా ఆయన ఆలంకృతుడైన నూతన వరుని రూపంగానే భాసించాడట! అదెలాగో చెబుతున్నాడు. ఈశ్వరుని దేహం మీద ఉన్న పరిమళభరితమైన బూది తెల్లని అంగరాగమైతే, కపాలం శిరోభూషణమైంది. ఆయన ధరించిన గజచర్మం పట్టువస్త్రంగా భాసించింది. మూడవకన్ను కళ్యాణ తిలకంగా రూపొందింది. వివిధ ప్రదేశాల్లో ఉండే సర్పరాజాలు కంకణా ద్యాభరణాలైపోయాయి. శిరస్థచంద్రలేఖ చూడామణైంది. ఈ విధమైన తన రూప ప్రతిబింబాన్ని పినాకపాణి ప్రమథులు తీసికొనివచ్చిన ఖడ్గంలో చూచుకొన్నాడట! ఇట్టి ప్రసన్నరూపంతో నందీశ్వరు నధిరోహించి ఈశ్వరుడు కళ్యాణవేదికకు పయనమయ్యాడు. ఆయనను సప్తమాతృ కలనుసరించారు. వారి వెనుక కాళికాదేవి ముందుమార్గాన్నంతా సౌదామనీ



ప్రభలను కూరుస్తూ పయనించింది. శివునకు ముందుగా నడుస్తున్న ప్రమథగణం మంగళతూర్య ఘోషలను ప్రవర్తింప చేయటంతో దేవతలా మహాశివుని దర్శింపవచ్చారు. సూర్యభగవానుడు విశ్వకర్మ నిర్మితమైన ఆతపత్రాన్ని శివునకు సమర్పించాడు. గంగాయమునా నదులు స్త్రీ రూపధారిణులై ఆయనకు చామరగ్రాహిణులైనారు. బ్రహ్మ, విష్ణుమూర్తి జయ శబ్దాలతో ఆ మహాదేవుని సంభావించారు.

ఇక్కడ కాళిదాసు సామాన్యుల మనస్సుల్లో మెదిలే సందేహాల్ని నివారిస్తూ చేక్కని శ్లోకాన్ని రచించాడు.

**'ఏకైవ మూర్తిర్బిభిదే త్రిధా సా సామాన్యమేషాం ప్రథమావరత్వమ్।**
**విష్ణోర్హరస్తస్య హరిః కదాచి ద్వేధాస్తయోస్తావపి ధాతురాద్యౌ॥" (7-44)**

అంటే ఒకే మూర్తి బ్రహ్మ విష్ణుమహేశ్వరులనే మూడుగా విభజితమై ప్రవర్తిస్తోంది. కనుక వీరి ముగ్గురిలో ఎవరు శ్రేష్ఠులనే భావం తగనిది. ఆ ఆ సందర్భాలనను సరించి వారి ప్రవర్తనల వల్ల ఎక్కువ తక్కువలు తోచినా అది సరికాదు. ఎవరు ముందు, ఎవరు వెనుక అనే చర్చ కూడ సమంజసం కాదు. సాధారణంగా మనం ఏ వ్రతం చేస్తుంటే ఆ వ్రతమే వ్రతాలన్నిటిలో శ్రేష్ఠమని (వ్రతానాముత్తమం వ్రతమ్) సంకల్పం చెప్పుకుంటూ ఉంటాం. ఇదీ అటువంటిదే.

దేవేంద్రాదులు, లోకపాలురు వారివారి వైభవాన్ని విసర్జించి వినీతవేషులై నందీశ్వరుని శివదర్శనానికై అభ్యర్థించి ఆయనను దర్శించి ప్రణామాలర్పించారు.

ఇక్కడ కూడ లోకంలో ఉండే ఆచారాన్ని కాళిదాసు చేక్కగా చిత్రిస్తాడు. లోకంలో మనల్ని చూడవచ్చిన వ్యక్తుల్ని వారి వారి స్థాయిననుసరించి కొందఱిని నమస్కారపూర్వకంగానూ, మఱికొందఱు నమస్కరిస్తే కొంచెంగా తల ఊపి, వేఱొక కొందఱిని ప్రియభాషణా

పూర్వకంగానూ ఆహ్వానిస్తాం. శివుడూ అలాగే చేసేడు. అంటే మానవమాత్రులైన మనని శివుడనుసరించాడని కాక, శిష్టాచారాన్ని భగవంతుడు మనకు నేర్పేడని భావించాలి. వేఱే విధంగా చెప్పాలంటే మహాకవి కాళిదాసు కావ్యప్రయోజనాల్లో ఒకటైన ***"వ్యవహారవిదే"*** అంటే లోకంలో వ్యవహరించవలసిన తీరును చెబుతున్నాడన్న మాట.

**"కమ్పేన మూర్ధ్నశ్శతపత్ర యోనిం వాచాహరిం, వృత్రహణం స్మితేన।**
**ఆలోకమాత్రేణ సురానశేషాన్ సమ్భావయామాస యథా ప్రధానమ్"॥ (7-46)**

బ్రహ్మను శిరఃకంపంతోను, హరిని వాక్కులతోను, దేవేంద్రుని చిఱునవ్వుతోను, దేవతానీకాన్ని తన దృక్కులతో గౌరవించాడట ఆ మహేశ్వరుడు! సప్తర్షులూ మహేంద్రుని ముందట జయ శబ్దాన్ని పలుకుతూ ఉంటే శివుడు మందహాసంతో "మిమ్మల్ని ఈ వివాహయజ్ఞానికి ఆధ్వర్యవం వహించవలసిందని నేనే కోరేను కదా!" అన్నాడు. విశ్వావసు ప్రభృతులపుడు త్రిపురదాహ వృత్తాంతాన్ని గానం చేస్తూ ఉంటే చంద్రమౌళి పరిణయానికై పయనించాడు. ఈ విధంగా ఆకాశ గమనంలో శివుడొక ముహూర్త కాలంలో ఓషధిప్రస్థం చేరి భువిపై దిగేడు. పర్వతరాజైన హిమవంతుడు మహాదేవునికెదురేగి స్వాగతం పలికేడు. త్రిలోక వంద్యుడైన శివుడు తనకు ప్రణమిల్లటంతో హిమవంతుడు సిగ్గుపడ్డాడు. ప్రేమాతిశయంతో వికసన్ముఖుడైన హిమవానుడు తన జామాతకు ముందు నడుస్తూ పుష్పాకీర్ణమైన రాజవీధుల ద్వారా అతనిచే నగరప్రవేశం చేయించాడు.

ఈశ్వరుని సందర్శించాలనే కుతూహలంతో సంభ్రమాన్వితలైన పురస్త్రీలు తమ పనులను విడిచి ఉత్కంఠతో సౌధోపరిభాగాల్లో నిలిచి శ్రోత్రఘ్రాణస్పర్శరస నేంద్రియాల వృత్తులన్నీ ఒక్క నేత్రాల్నే ఆశ్రయించినట్లు తమ చక్షురింద్రియంతోనే ఆ మహాదేవుని సౌందర్యాన్ని త్రాగుతూ పరవశులైపోయారు. చిత్రవిచిత్రమైన సంభాషణలతో ఆ నారీజనం శివుని చూచి



ముచ్చట చెంది, "ఆ పరమేశ్వరునికి దాసిగా ఉండే స్త్రీ కూడ ధన్యురాలే అయినపుడు భర్తగా పొందగోరి దుష్కర తపం ఆచరించి ఆ మహనీయుని అంకాన్నే శయ్యగా చేసికోబోయే ఈ పార్వతి ఎంత కృతార్థురాల"ని ఒకామె, మఱొకతె "స్పృహణీయ శోభాన్వితులైన ఈ పార్వతీపరమేశ్వరుల్ని జంటగా కూర్చకపోతే బ్రహ్మ సౌందర్య నిక్షేపణ వృత్తి వ్యర్థమై ఉండేద"న్నది. వేఱొక స్త్రీ "శివుడు మన్మథుని దహించాడని నేననుకోను. శివుని సౌందర్యాన్ని చూచి తానంత సుందరుణ్ణి కాననే దుగ్ధతో మన్మథుడే తనంత తానుగా తనువును త్యజించాడనుకొంటా"నన్నది. "అసలే ఉన్నతుడైన హిమవంతుడు ఈ మహాశివునితో సంబంధం ఏర్పఱచుకొని మహోన్నతుడైనాడ"న్నది మఱొక స్త్రీ అభిభాషణ. ఈ విధంగా ఓషధీప్రస్థ విలాసినులాడుకొనే మాటల్ని వింటూ వారు గుప్పిళ్ళతో చల్లే పేలాలను స్వీకరిస్తూ త్రినేత్రుడు హిమవంతుని ప్రాసాదం చేరేడు. ఆ రాజభవనంలో విష్ణుమూర్తి చేయినందిస్తూ బ్రహ్మ ముందు నడుస్తూ మార్గనిర్దేశం చేస్తుంటే మహాదేవుడు నందీశ్వరుని నుండి దిగి కక్ష్యాంతరాలు దాటి అంతఃపుర ప్రవేశం చేసేడు. అచట సుఖాసీనుడైన ఈశ్వరుడు తనకు యథావిధిగా సమర్పించిన అర్ఘ్యపాద్యాల్నీ, మధుపర్కాన్నీ, నూతన వస్త్రాలను మంత్రపూర్వకంగా స్వీకరించాడు. పిమ్మట సంప్రదాయజ్ఞులైన పెద్దలాయనను నూత్న వధువు పార్వతి సమీపానికి చేర్చారు.

నూతన వధూవరుల దృక్కులు అసంకల్పితంగా కలవటం వల్ల కొంచెం చంచలమైనా అనతికాలంలోనే స్థిరత్వాన్ని పొందేయి. తరువాత సంకుచితమైన ఆ చూపులు సిగ్గుతో నిశ్చలతను పొందలేకపోయాయి. పిమ్మట తామ్రవర్ణయుక్త మైన వ్రేళ్లతో కూడిన పార్వతి పాణిని శైలాధిరాజు అందించగా అష్టమూర్తి గ్రహించాడు. ఆ సమయంలో ఉమకు రోమాంచితమై మహేశ్వరునికి వ్రేళ్లకు స్వేదోద్గమమైంది. సాధారణులైన

వారిలో కూడా వివాహకాలంలో వధూవరుల్లో గౌరీశంకరులు ప్రవేశించి వారిముఖాలకు నూతనశోభను కలిగిస్తారంటే సాక్షాత్తూ గౌరీశంకరుల వివాహవేళలో వారి ముఖశోభ ఇక చెప్పేదేముంది? ఉభయులూ ముమ్మారు అగ్నికి ప్రదక్షిణం చేసేరు. అన్యోన్య స్పర్శ చేత వారి నేత్రాలు నిమీలితా లైనాయి. ప్రదీప్తమైన అగ్నిలో పార్వతిచే పురోహితుడు లాజహోమాన్ని ఆచరింపచేసేడు. తరువాత బ్రహ్మ వధువుతో "అమ్మా మీ వివాహానికి అగ్నిహోత్రుడే సాక్షి. ఇక ఏ చింతలూ లేక నీ భర్తకు సహధర్మచారిణివై వర్ధిల్లు" మని ఆదేశాత్మకమైన ఆశీర్వచనాన్ని పలికేడు. ఆ మాటలను పార్వతి ఎంతో శ్రద్ధతో విన్నది. మహాశివుడామెతో "అదిగో ధ్రువ నక్షత్రాన్ని దర్శించు" మని చెప్పటంతో పార్వతి తలెత్తి సిగ్గుతో "చూసే" నంది. పురోహితుడీ విధంగా పాణిగ్రహణోత్సవాన్ని విధ్యుక్తంగా నిర్వహించిన తరువాత పద్మాసనాసీనుడైన బ్రహ్మకా నవ వధూవరులు ప్రణామం సలిపేరు. నమస్కరించిన వధువును బ్రహ్మ "కళ్యాణీ! వీరమాతవు కమ్మ"ని ఆశీర్వదించాడు. వాచస్పతి శివుని ఆశీర్వదిం చే టానికి సాహసిం చేలేదు. ఆ పిమ్మట తలంబ్రాల వేడుక కొనసాగింది. శ్రీమహాలక్ష్మి ఆ వధూవరులకు కమలాతపత్రాన్ని పట్టింది. తరువాత సరస్వతి సంస్కారపూరి తమైన సంస్కృత శబ్దజాలంతో శంకరుని, సులభగ్రాహ్యమైన ప్రాకృత శబ్దజాలంతో ఉమను స్తుతించింది. అప్సరసలు ప్రయోగించిన రసనిర్భరమైన రూపకాన్నా దంపతులు ముహూర్తకాలం తిలకించారు. అనంతరం పత్నీయుతు డైన హరుని దేవేంద్రాదులు మన్మథునికి శాపవిముక్తిని ప్రసాదించి అతని సేవలను స్వీకరిం చేవలసిందిగా ప్రార్థించారు. ప్రసన్నుడైన భగవానుడందు కంగీకరించి స్మరుని తనపై బాణాలు ప్రయోగిం చేటానికనుమతించాడు. పిదప పినాకి విబుధగణాన్ని వీడ్కొని తన చేతితో నగాధిరాజకన్యను చేకొని కనకకలశయుక్తమై పుష్పశయ్యతో కూడిన శోభన గృహాన్ని



ప్రవేశించాడు. శివుడామెనాకర్షించినా ప్రథమ సమాగమ జనిత లజ్జతోను, భయంతోనూ ముగ్ధ కనుక ప్రతిస్పందనలో పార్వతి వెనుకాడింది. ప్రియసఖీజనంతో కూడ సరిగా సంభాషిం చేలేదు. ఆమె బెరుకును పోగొట్టి ఆమెను నవ్విం చేటానికి ప్రమథగణం, హాసదేవతలు వివిధచర్యల నా చేరించటంతో ఆమె గూఢంగానే నవ్వింది.

ఇక్కడితో సప్తమసర్గ, కాళిదాసకృత కుమారసంభవ కావ్యం పూర్తైంది. అయితే 17 సర్గలు కల కావ్యం ప్రకటితమైంది. మిగత పది సర్గలూ కాళిదాసకృతం కాక ఇతరులెవరో వ్రాసినవి. దానికి సంబంధించిన వాదప్రతివాదనలు ముందే సూచిం చేటం జరిగింది.

8వ సర్గ ఉమాసురత వర్ణనతో చంద్రోదయాది వర్ణనలతో, పార్వతితో రతి శివునకు సంతృప్తినీయలేదని సంపూర్ణమౌతుంది. 9వ సర్గలో శివపార్వతుల కైలాసగమనం, కైలాస వర్ణన,అ చేటివారి రతిక్రీడ, 10వ సర్గలో కుమారస్వామి జననం, 11వ సర్గలో కుమారస్వామి బాల్యలీలలు, 12వ సర్గలో దేవతాకుమార సేనాపతి వర్ణన. 13వ సర్గలో కుమార సేనాపత్యాభిషేకం, 14వ సర్గలో దేవసేనా ప్రయాణంతో కూడి ఉంటాయి. 15వ సర్గ నామధేయం సురాసురసైన్యఘట్టం, 16వ సర్గ సురాసుర సేనా సంగ్రామ వర్ణన, 17వ సర్గ తారకాసుర వధతో కావ్యం పరిసమాప్తి చెందుతుంది.

# మేఘదూతమ్



సంస్కృత పంచ కావ్యాల్లో మొదటి మూడూ కాళిదాసు రచనలే. రఘువంశ కుమార సంభవాల అనంతరం మేఘదూతాన్ని పఠించటం ఆచారం. అయితే మొదటి రెండూ మహాకావ్యాలయితే ఇది ఖండకావ్యం. సాంకేతికంగా చెప్పాలంటే **"ఖణ్డకావ్యం భవేత్కావ్యం ఏకదేశాను సారి చ"** అని ఖండ కావ్యలక్షణం. అంటే సాధారణంగా కావ్యాల్లో ఉండే ఆది మధ్యావసాన కథాభాగాలతో ప్రమేయంలేకుండా ఒక వ్యక్తి జీవితంలో ఒక ఘట్టాన్నో లేదా ఒక సన్నివేశాన్నో చెప్పేది ఖండకావ్యం. అంటే ఆధునిక కథానిక వంటిదన్నమాట. అయితే నాయికా నాయకుల పేర్లు కూడా లేకపోవటం ఇందులోని విశేషం. ఈ మేఘదూత కావ్యంలో నాయకుడొకానొక యక్షుడు.ఆయన కుబేరుని కొలువులో ఒక పరిచారకుడు. తన విధి నిర్వహణలో ప్రమత్తుడైన కారణంగా కుబేరుని ఆగ్రహానికి పాత్రుడై "ఒక సంవత్సరం పాటు భార్యా వియోగాన్ని పొందు"మని శప్తుడౌతాడు. ఎవరికైనా ప్రణయినీ విరహం దుస్సహం కదా! అందునా దేవయోనులు కేవల ప్రణయైక జీవులు కనుక వారికది మఱింత దుర్భరం. శాపకారణంగా తనకున్న మహిమలన్నీ కోల్పోయి చిత్రకూటాశ్రమాన్ని వసతిగా చేసికొని కాలక్షేపం చేస్తూ ఉంటాడు. ఇంతలో ఆషాఢమాసం వస్తుంది. ఆషాఢారంభదినాన ఆకాశంలో మేఘదర్శనం కావటంతో ఆ మేఘాన్నాశ్రయించి తన భార్యకు సందేశం పంపుతాడు. కథేమిటంటే ఇంతే. అయితే రెండు భాగాలతో మొత్తం 115 శ్లోకాలతోనే ఉన్నా అడుగడుగునా కాళిదాస మహాకవి ఊహావైభవం, సున్నితమైన భావాలు, ఆదర్శప్రణయచిత్రణ, అలంకార శోభ, ధర్మప్రతిపాదన, ధ్వని వైభవం పఠితల మనస్సులను పండించి రస పరకాష్ఠను చూపి ఆనందతన్మయులను

చేస్తుంది. ఏవో కొద్ది శ్లోకాల్ని ఎంపిక చేయాలంటే సాధ్యంకాని పరిస్థితి ఏర్పడి ఏ శ్లోకానికా శ్లోకం, ఏ పాదానికా పాదం, ఏ పదానికా పదం మహోత్కృష్టమై అలరారుతాయి❀. ఒక్కమాటలో ఇది కాళిదాస కవితాశక్తి నవనీతమని చెప్పవచ్చు.

**"కశ్చిత్కాన్తా విరహ గురుణా స్వాధికారాత్ప్రమత్తః**
**శాపేనాస్తఙ్గమిత మహిమా వర్షభోగ్యేణ భర్తుః।**
**యక్షశ్చక్రే జనకతనయా స్నాన పుణ్యోదకేషు**
**స్నిగ్ధచ్ఛాయా తరుషు వసతిం రామగిర్యాశ్రమేషు॥"**

అనే ప్రథమ శ్లోకమే బహ్వార్థ ప్రతిపాదకమై శోభిస్తోంది.

ఆ చిత్రకూట పర్వతంలో కాంతా విరహంతో శుష్కించిన యక్షుని ముంజేతి కంకణం జారిపోయింది. అలా ఎనిమిది నెలలు జరిగిన తర్వాత ఆషాఢ మాసం ఆసన్నమై ఆ మాస ప్రథమ దివసాన వప్రకీడ జేరిపే ఏనుగులా చూడముచ్చేటగా ఉన్న మేఘాన్ని చూచాడు. నిజానికి 'ఎనిమిదినెల'లని శ్లోకంలో లేదు. మఱెలా నిర్ణయిస్తావంటే ఉత్తరమేఘం (ద్వితీయార్థం)లో 47శ్లోకంలో తన భార్యకు పంపిన సందేశంలో **"శేషాన్మాసాన్గమయ చతురో లోచనే మీలయిత్వా"** అంటాడు. అంటే "ఈ మిగిలిన నాలుగు నెలలూ కళ్లు మూసికొని గడిపెయ్య్"మని అర్థం. ఆ శ్లోకం మొదటిపాదంలో **"శాపాన్తోమే భుజగ శయనాదుత్థితే శార్ఙ్గ పాణౌ"** అంటే శ్రీ మహావిష్ణువు ఆదిశేషుని పాన్పునుండి లేచిననాడు శాపాంతమౌతుం దంటాడు. శ్రీ మహావిష్ణువు ఆషాఢ శుద్ధైకాదశినాడు శేషశయ్యపై నిద్రించి కార్తిక శుద్ధైకాదశినాడు మేల్కొంటాడని భారతీయుల విశ్వాసం. కనుక శాపారంభం కార్తిక శుద్ధపాడ్యమినా డనుకోవాలి. బుద్ధిని పదునెక్కించే ఇటువంటి శబ్దజాలంతో మహాకవుల రచనలుంటాయి. సన్యాసదీక్ష నొందిన వారు ఈ నాల్గునెలల కాలాన్నే 'చాతుర్మాస్యదీక్ష'గా పాటిస్తారు. కావ్య ప్రయోజనాల్లో ఒకటైన "వ్యవహారవిదే" (లోకవ్యవహారాన్ని తెలియచెప్పటం) అంటే ఇది. శాపకాలం సంవత్సరం కనుక మిగిలిన "నాలుగు నెల"లని వాచ్యం చేసేడు కనుక అప్పటికి ఎనిమిది నెలలై పోయాయని అర్థం చేసికోవాలి.

సాధారణంగా మనం ఎలా అనుకుంటే మేఘం ఆ రూపంలో కనబడటం సహజం. ఇది అందఱికీ అనుభవంలో ఉన్న విషయమే. మేఘం 'వప్రక్రీడ' నాచరిస్తున్నట్లుందట. 'వప్రక్రీడ' అంటే 'ఉత్ఖాతకేళి' – మదగజం భూమిపై ఉన్న ధూళిని ఫాలంతో పైకెత్తి వెదజల్లే క్రియే ఈ 'ఉత్ఖాతకేళి' లేక 'వప్రక్రీడ'. ఇది స్త్రీ పురుషుల రతిక్రీడలో పురుషుడు సలిపే ఒకానొక భంగిమ వలె ఉంటుంది. యక్షుడు కాముకుడు, పైగా విరహి కనుక, తాను భార్యతో కలిసి ఉన్నప్పుడు సలిపిన సన్నివేశాల్నే గుర్తుకు తెచ్చుకొంటున్నాడు. కనుక మేఘుడతనికలాగే కనిపించాడు.

విరహంతో చిక్కిపోయాడనటంలో స్త్రీ పురుషుల మధ్య ప్రేమ ఎంతటి స్నిగ్ధతను, సాంద్రతనూ పొందాలో కాళిదాసు కాంతా సమ్మితంగా ఉపదేశిస్తున్నాడు. ఏదో వర్ణనకోసం వ్రాయటం కాదు, 'అతిశయోక్తి' అంతకంటె కాదు. స్త్రీపురుషానురాగం అంత సాంద్రమైనపుడే తృతీయ

---

❀ అందుకే దీనికి పదచ్ఛేద, అన్వయ, ప్రతిపదార్థ, తాత్పర్యాలతోపాటు 'శ్రీకళా' వ్యాఖ్యను డా॥ శొంఠి శారదాపూర్ణతో కలిసి 'వాచ్యలిఖిత రూపాలను సంతరించి' ఆనందలహరి ప్రచురణగా 1998లో ప్రకటించేటం జేరిగింది.

పురుషార్థ మధురిమ మహోత్కృష్టమై తదనంతరవర్తి తురీయ పురుషార్థానికి సోపానమౌతుంది. పూర్వకవులు రాజాశ్రయంతో భోగభాగ్యాలకి లోటులేక ఇచ్ఛేవచ్చినట్లు శృంగారాన్ని వర్ణించారని పాశ్చాత్యభావనావిష్టులైన ఆధునికుల అధిక్షేపణ. ఇది సత్యదూరం. ఏమంటే - మన పూర్వకవులు అందునా - సంస్కృతంలో కాళిదాస భవభూతుల వంటివారు, తెలుగులో కవిత్రయ, పోతన ప్రభృతులూ ఋషికల్పులు. భారతీయ జీవనంలోని చతుర్విధపురుషార్థాల్లో మోక్షానికి ప్రాధాన్యమిచ్చి మిగతా మూడూ ఆ చరమ పురుషార్థ సాధనకి సోపానాలుగా తీర్చిదిద్దే రచనలే వేలార్చారు. కనుక ఆదర్శ ప్రణయోపదేశాన్ని మనోహర ప్రణయకేళితో కలిపి చెప్పటమే కాంతా సమ్మితోపదేశం

ఆ యక్షుడు ప్రణయోద్దీప్తిని కలిగించే మేఘునెదుట ఎలాగో కొంతసేపుండి దీర్ఘంగా ఆలోచించాడు. మేఘ సందర్శనం ప్రియజన సన్నిధిలో కూడ మనోవికారం కలుగజేస్తుంటే ఇక విరహిణుల విషయంలో చెప్పేదేముంది? శ్రావణాసన్నవేళ తన క్షేమాన్ని ప్రియురాలికి తెలుప గోరిన ఆ యక్షుడు అప్పుడే వికసించిన కొండ మల్లెలతో ఆ మేఘుని సత్కరించి స్వాగతం పలికేడు. మనకి ఒకరితో ఒకపని కావలసిఉన్నప్పుడు వారికి స్వాగతం పలికి ప్రీతిపూర్వకమైన మాటలతో సంభావించాలి. ఇది వ్యవహార జ్ఞానం. ఆషాఢ పాడ్యమినాడు యక్షుడు రామగిరిలో మేఘుని చూచాడు. అతని భార్య ఎక్కడో అలకానగరంలో ఉంది. ఇక్కణ్ణుంచి అక్కడికి వెళ్ళేసరికి మేఘునికి కొంత సమయం పడుతుంది. ఆషాఢం తర్వాత వచ్చే శ్రావణ మాసంలో వర్షాలుద్ధృతంగా పడతాయి. ఆ సమయంలో



నెఱవేఱని సంభోగాభిలాష మనస్వినుల ప్రాణత్యాగానికైనా దారితీయవచ్చు. యక్షపత్ని మనస్విని కనుక ఆ సమయంలో తన క్షేమవార్త ఆమెకి తెలిస్తే ప్రాణాలుగ్గబట్టుకొంటుంది. అందుకే “**ప్రీతఃప్రీతి ప్రముఖ వచనం స్వాగతం వ్యాజహార**” (పూ.మే.4) అన్నాడు. “**శోభనమాగతం స్వాగతమ్**” అని స్వాగత శబ్దవ్యుత్పత్తి. ఇవాళ చాలామంది “సుస్వాగతం” అంటూ ఉంటారు. ఈ శబ్దం సాధువు కాదు.

సరే యక్షుడు తన భార్యకు సందేశం పంపాలనుకొన్నాడు, బాగుంది. ఈ సందేశం ఎవరి ద్వారా పంపాలి ? సందేశాలనేవి ప్రాణులచేత పంపదగినవి. రామాయణంలో రాముడు సీతకు తన సందేశాన్ని హనుమంతునితో పంపేడు. భారతంలో నలోపాఖ్యానంలో సందేశహారిణి హంస. పాండవుల సందేశాన్ని తీసికొని వెళ్ళింది శ్రీకృష్ణుడు. నేటి సాంకేతిక పనిముట్లు రాకముందు పక్షులద్వారా సందేశాలు పంపేవారని విన్నాం. పటిష్ఠమైన కరచరణాద్యవయవాలు కల ప్రాణులే సందేశాన్ని తీసుకొని వెళ్ళటానికి అర్హులు. మఱి మేఘుడో! ప్రాణి కాడు. పొగ, వెలుతురు, నీరు, గాలి - వీటి సమాహారం. ఆ మాత్రం ఆలోచించకుండా తన సందేశాన్ని పంపటానికి మేఘుణ్ణి ఎలా ఎన్నుకొన్నాడనే ప్రశ్న వేసికొని కాళిదాసు యక్షుని చర్యను “కామార్తులకు యుక్తాయుక్త విచక్షణ ఉండదుకదా” ! అనే అర్థాంతర న్యాసాలంకారంతో సమర్థిస్తాడు.

ఇదొక అందమైన శ్లోకం :

**“ధూమజ్యోతిః సలిలమరుతాం సన్నిపాతః క్వ మేఘః**
**సందేశార్థాః క్వపటు కరణైః ప్రాణిభిః ప్రాపణీయాః।**
**ఇత్యౌత్సుక్యా దపరిగణయన్గుహ్యకస్తం యయాచే**
**కామార్తాహి ప్రకృతి కృపణాశ్చేత నా చేతనేషు ॥ ”** (పూ. మే. 5)

భాగవతంలో గోపికలు కూడా "శ్రీకృష్ణుని చూచారా" అని "**నల్లని వాడు పద్మనయనంబుల వాడు .....**" ఇత్యాది పద్యంలో మల్లెపొదల్ని అడిగినట్లు "తెనుగులపుణ్యపేటి" పోతనగారు వ్రాసేరు.

యక్షుడు మేఘుని వంశాదికంతో స్తుతించి విధివశాత్తు భార్యా వియు క్తుణ్ణైన నేను యాచిస్తున్నాను. ఎందుకంటే నీవు గుణాఢ్యుడవు. యాచించవలసి వస్తే గుణాఢ్యులనే యాచించాలి. వారివల్ల యాచన విఫలమైనా మేలే. అధముని యాచించినప్పుడది సఫలమైనా శ్రేయస్కరం కాదంటాడు కాళిదాసు –

"**యాఞ్చామోఘావరమధిగుణేనాధమేలబ్ధకామా**" (పూ.మే. 6)

"ఉత్తముని ఆశ్రయించు. అధముని వద్దకు వెళ్ళకు" మని వాచ్యంగా చెప్పక పై పాదంలో ధ్వనింపచేసేడు. కాంతా సమ్మితమైన ఉపదేశం అంటే ఇది.

మమ్మటుడు 'కావ్యప్రకాశ'మనే తన అలంకార శాస్త్రంలో కావ్య ప్రయోజనాన్ని చెబుతూ –

"**కావ్యం యశసే ఉ ర్థకృతే వ్యవహార విదే శివేతర క్షతయే।**
**సద్యఃపర నిర్వృతయే కాంతసమ్మితతయోపదేశయుజే ॥**"

అని పేర్కొన్నాడు. అంటే – కీర్తి, ధనం, వ్యవహారజ్ఞానం, అమంగళాన్ని పోగొట్టటం, అప్పటికప్పుడు ఆనందం కలిగించేటం కాంతా సమ్మితంగా ఉపదేశించేటం – ఈ ఆఖూ కావ్యం వల్ల చేకూరే ప్రయోజనాలు కవికీ, సహృదయుని (పఠిత)కీ కూడ. కాంతా సమ్మితంగా ఉపదేశించేటమంటే మనం ఏదో బోధిస్తున్నామని చెప్పకుండా – అంటే సూటిగా – వాచ్యంగా కాక, మనోజ్ఞంగా ఆ బోధను పఠితకు కల్గించేటం – దీన్నే ధ్వని మర్యాద లేక వ్యంగ్యవైభవం అంటారు. తెలుగులో అందఱికీ



తెలిసిన అల్లసాని పెద్దన విరచిత మనుచరిత్ర ఉంది. అది చేసే ఉపదేశం ఏమిటి ? "పరాంగనల జోలికి పోవద్ద"ని. ఆ విషయాన్ని వేదం "**న పరదారాం గచ్ఛేత్**" అని శాసిస్తే కావ్యం వరూథినీ ప్రవరాఖ్యుల కథలో ఎంతో మనోజ్ఞంగా చెబుతుంది ! ఆ మనోజ్ఞతే కాంతా సమ్మితత్వం.

ఆఱవ శ్లోకంలో "**జానామి త్వాం ప్రకృతిపురుషం కామరూపం మఘోనః**" ఎవరినైనా పొగిడేటప్పుడు "నువ్వింద్రుడివి, చంద్రుడి" వంటారని మనందఱికీ తెలుసు. "ఇంద్రుడంతటివాడు నీకు ప్రధానపురుషుడయ్యా" (మఘోనః ప్రకృతి పురుషం) అంటున్నాడు. ఇందులో చమత్కారం ఏమంటే మేఘాలకు ఇంద్రుడధిపతి. నీవు కామరూపుడవు. మనం ఊహించినట్లే – అంటే ఏ రూపంలో అనుకుంటే మేఘం ఆ రూపంలో కన్పిస్తుంది కదా! ఇది కామరూపత్వం. పుష్కరావర్తకమనే శ్రేష్ఠవంశంలో జన్మించావని కూడా అన్నాడు. కనుక మేఘుడిక తప్పుకోవటానికి వీల్లేనట్లుగా ప్రశంసించాడు. మేఘుడు తిరిగి సమాధానం చెప్పడు కదా ! అందువల్ల ఒప్పుకొన్నట్లే. భార్యావిరహినైన నా సందేశాన్ని నాభార్యకందించుమని గుర్తులు అంటే చిరునామా చెప్పేడు.

"ఆకాశాన్నధిరోహించిన నిన్ను చూచి ప్రోషిత భర్తృకలు తమపతి త్వరగా వస్తాడని సంబరపడతారు. నాలాంటి అస్వతంత్రుడు తప్ప ఎవడు మాత్రం ప్రియురాలిని ఉపేక్షిస్తాడ"ంటాడు. ఆ చూసే స్త్రీలు ఎంతో ఆశతో తమ ఫాలభాగం పై చెదురుతున్న ముంగురుల్ని పైకెత్తికొని మఱీ చూస్తారట! వర్షోన్ముఖమైన మేఘం వచ్చేటప్పుడు ముందు గాలికూడా ఉంటుంది కదా! ఆ గాలికి వారి ముంగుర్లు ముఖంపై పడుతుంటే మేఘుడు సరిగా కనిపించేడు కనుక ముంగురుల్ని పైకి త్రోసికొంటారు. కాళిదాసు ఈ శ్లోకంలో చిత్రకారునికి చేక్కని దృశ్యాన్ని ఇస్తున్నాడు.

ముఖ్యంగా మేఘసందేశంలోని ప్రతి శ్లోకం చిత్రకారులకు మంచి వస్తువు. భావుకుడైతే చేక్కని చిత్రాన్ని తన మనః పటలంపైనే చిత్రించుకోవచ్చు. దాన్ని చూసేది తానొక్కడే కనుక గొప్ప చిత్రకారుడు చిత్రించే చిత్రం కంటె కూడ అందమైన చిత్రాన్నే సాక్షాత్కరించుకోగలడు. శ్లోకభావాన్ని భావించుకోగల భావనాబలంపై ఆ మనోచిత్రపు భవ్యత ఆధారపడి ఉంటుంది.

మేఘసందేశమొక చేక్కని నైరూప్యచిత్రం. భావనకు మాత్రమే అందేది. జీవికి భావుకత మౌలికమైన ధర్మం. ప్రేమైకజీవుల ప్రవృత్తిని చెబుతూ ..... **"ఆశాబన్ధః కుసుమ సదృశం ప్రాయశోహ్యఙ్గనానాం"** అంటాడు. (పూ.మే. 10) 'ఆశ' అనే బంధమే స్త్రీల జీవితానికి పుష్పంతో సమానమైన సౌకుమార్యాన్ని కలిగి ఉంటుంది. స్త్రీల జీవితాన్ని సుకుమారంగా బంధించేది ఈ ఆశే. విరహంలో అతి శీఘ్రంగా భ్రంశమౌతుంది.

మేఘుని గర్జన క్రొత్తమొలకలతో ఉన్న భూమిని సస్యశ్యామలం చేస్తుంది. దాన్ని వినటంతో ఉత్సుకత నొందిన రాజహంసలు తామర చిగుళ్లముక్కల్నే దారి బత్తెంగా చేసికొని మేఘునికి సహప్రయాణీకులౌతారట! అంటే మేఘం ఆకాశంలోను, హంసలు భూమిపై ఉన్న నీటిలోనూ కలిసి ప్రయాణిస్తారనేది మఱొక చేక్కని భావన కదా !

భారతీయులకు ఈ దేశంలోని మట్టి, నీరు, పర్వతాలు కూడా పవిత్రమైనవే. మేఘుడు బయలుదేరవలసిందీ చిత్రకూట పర్వతం నుంచే. అది మేఘునికి మిత్రమట ! ఊరకే పర్వతం అని చెప్పకుండా అది శ్రీరాముని పద ముద్రలతో పవిత్రమైందని చెప్పటం పఠితలకు భక్తిభావాన్ని కలిగించేటం ! ఈనాడు గొప్ప వ్యక్తులు వాడిన వస్తువులు, అంటే చెప్పులు,



వస్త్రాలు, సులోచనాలు, కలాల వంటి వాటిని కూడా భద్రపఱచేటం మనం చూస్తోందే. ప్రథమశ్లోకంలో అచేటి జలాలు సీతాసాధ్వి స్నానం చేయటంతో పవిత్రమైనవని చెప్పి ఈ పన్నెండవ శ్లోకంలో మహాపురుషులకు సైతం పూజ్యుడైన శ్రీరామచంద్రుని పాదముద్రలతో ఆ పర్వతం శోభిస్తోందని చెప్పటం పఠితలకు మాతృభూమి అణువణువుపై భక్తి నుద్దీపితం చేయటమైంది. కావటానికి శృంగార కావ్యమే అయినా ఆ తృతీయ పురుషార్థ అంగిరసానికి స్వచ్ఛతా పవిత్రతలను జోడించి చెప్పటం మహాకవి మనీష. మఱి పర్వతం మేఘానికి మిత్రుడనటం ఏమిటంటే –

**"మేఘ పర్వతయోరబ్జ సూర్యయోరబ్ధిచన్ద్రయోః।**
**శిఖి జీమూతయోర్మైత్రీ వాతాగ్న్యయోశ్చ స్వభావతః ॥"** అన్నారు.

అంటే మేఘ పర్వతాలకు, సూర్య పద్మాలకు, చంద్ర సముద్రాలకు, నెమిలికీ మేఘానికీ, అగ్నికీ, గాలికీ స్నేహం నిసర్గమైందని భావం. ఆ చిత్రకూట శిఖరాన్ని కౌగలించు కోవటంతో శ్రీరాముని పద పద్మాలను హృదయానికి హత్తుకొన్న భావన కలుగుతుంది.

ఒక విషయాన్ని చెబుతూ అర్థాంతర స్ఫురణ కలిగించేటం మహాకవికే సాధ్యమౌతుంది. అలాంటిదే పదునేనవ శ్లోకం.

***"రత్న చ్ఛాయా వ్యతికర ఇవ ప్రేక్ష్యమేతత్పురస్తా –***
***ద్వల్మీకాగ్రాత్ప్రభవతి ధనుఃఖణ్డమాఖణ్డలస్య।***
***యేనశ్యామం వపురతితరాం కాన్తి మాపత్స్యతే తే***
***బర్హేణేవ స్ఫురితరుచినా గోపవేషస్య విష్ణోః॥"***(1-15)

అంటే రత్నకాంతులీనే ఇంద్రధనుస్సు పుట్టలోంచి ఉద్భవించి నీ శరీరంమీద ప్రసరించేటం వల్ల నీ నల్లని శరీరం నెమిలి పింఛధారియై

గోప వేషుడైన విష్ణుమూర్తి శరీరకాంతి వలె శోభిస్తోందని అర్థం. "ఆఁ...! ఏముందిందులో, పొగుడుతున్నాడ"నిపిస్తుంది. ఊరకే ప్రతిపదార్థ తాత్పర్యాలు కాక పఠిత తన భావనా శక్తి నుద్దీపింపచేసినపుడు క్రొత్త అర్థాలు స్ఫురించి మనస్సు ఆనంద సీమల్లో నర్తిస్తుంది. ఇంద్రధనుస్సు పుట్టలో పుడుతుందట! వల్మీకం అంటే పుట్ట. అందులోంచి ఉద్భవించాడు కనుకనే వాల్మీకి అనేపేరు ఆ మహర్షికి వచ్చింది. ఆయన నుండి ప్రభవించింది శ్రీమద్రామాయణం. ఆ రామాయణం ఆది కావ్యం. తరువాతి కవులందఱికీ ఆదర్శమైంది. అందులోనూ కాళిదాసుకు వాల్మీకి అంటే ఎనలేని గౌరవం. రఘువంశ కావ్యాదిలో కాళిదాసు "నేనెక్కడ ? సూర్యుడే ఆదిపురుషుడుగా కలిగిన రఘువంశ మెక్కడ ? నా వంటి అల్పజ్ఞుడీ కావ్యరచనకు పూనుకోవటం అజ్ఞానంతో మహాసముద్రాన్ని తెప్పకొయ్యతో దాటాలని పూనుకోవటం వంటిది, అయినా పూర్వ కవులు చూపిన మార్గాన్ననుసరించి ప్రయత్నిస్తాననటంలో "**అథవా కృత వాగ్ద్వారే వంశేఽస్మి న్పూర్వ సూరిభిః**" అన్నాడు. ఆ పూర్వసూరిభిః ప్రయోగం వాల్మీకి నుద్దేశించిందే. వాల్మీకికృత రామాయణ శోభ ఇంద్రధనుస్సు వంటిదని స్ఫురింపచేసేడు. ఇక ఇంద్రధనుస్సు ప్రతిఫలించేటంతో నీశరీరకాంతి గోపవేషధారి (శ్రీకృష్ణుడు) అయిన విష్ణుమూర్తివలె ఉందంటాడు. తన విషయం తాను చెప్పుకొంటూ వింటున్న మేఘునికి విసువు జనించేకుండా సందర్భాను సారంగా అతణ్ణి కీర్తిస్తున్నాడు. దాంతో మేఘునికి ఉత్సాహం (తనను కీర్తిస్తున్నందుకు) తో పాటు యక్షుని పట్ల జాలి, మైత్రి పెంపొంది యక్షకార్యానికి పూనుకొనే అవకాశం ఉంటుంది. సీతారాముల ఉనికి వల్ల పవిత్రమైంది చిత్రకూటమైతే, శ్రీకృష్ణుని మేని చాయవంటి చాయ



కలవాడు మేఘుడు. వర్షోన్ముఖమైన మేఘం నల్లగా ఉంటుంది శ్రీకృష్ణుడు కూడా "నల్లని వాడు ....." కదా ! ఆ మేఘమే శరత్కాలంలో నీరులేకపోవటం వల్ల తెల్లగా ఉంటుంది. ఇది ఆషాఢ మేఘం కాని శరన్మేఘం కాదు.

ఇక మార్గాన్ని చెప్పుకుపోతున్నాడు. "వ్యవసాయ ఫలం నీ అధీనమైందని ప్రీతితో, అమాయకత్వంతో, కనుబొమల విలాసం తెలియని పామర స్త్రీల నేత్రాలు నిన్ను స్నిగ్ధంగా చూస్తుంటే అప్పుడే దున్నటం వల్ల సుగంధాలీనుతున్న 'మాల' అనే పీఠభూమి నధిరోహించి కొంచెం వెనక్కి వెళ్ళి తీవ్ర గమనంతో మళ్ళీ ఉత్తర దిశగానే సాగిపొమ్మంటాడు. ఇంతటి సామాన్య శ్లోకంలో కూడ శృంగారాన్ని ధ్వనింపచేయటం కాళిదాసుకు తప్ప మఱెవరికీ సాధ్యంకాదు. 'మాలా' క్షేత్రం ఉందంటాడు. అప్పుడే దున్నటం వల్ల నాగలిచౌళ్లలో వర్షం పడటంతో పృథివి సువాసనలీనుతూ ఉంటుంది. "గంధవతీ పృథ్వీ" అని. సువాసనలీనే 'మాలా' క్షేత్రాన్ని నాయికగా భావించి 'ఆరుహ్య' = ఎక్కి అనటంలో ఆ స్త్రీ సంభోగాన్ని పొందుమని ధ్వని.

"**ధ్వనిరాత్మా కావ్యస్య**" అని ఆనందవర్ధనాచార్యుల వారి తీర్పు. మళ్ళీ ఏమీ ఎఱుగని వానిలా త్వరత్వరగా సాగిపొమ్మనటంలో ఒకానొక బహువల్లభుడైన నాయకుడు నాయికతో రహస్యంగా విహరించి మళ్ళీ ఎవరూ చూడకుండా ఏమీతెలియని వానివలె 'పెద్దమనిషి'గా వ్యవహరిస్తాడు. స్త్రీ సల్లాపం రహస్యంగా ఉండటంలోనే కదా సొగసు !

అక్కణ్ణుంచి వెడుతుంటే ఆమ్రకూట పర్వతం తటస్థిస్తుంది. అలసిన నిన్నా పర్వతం నెత్తిన పెట్టుకొంటుంది. ఎందుకంటే పూర్వం ఆ పర్వతంలో చెలరేగిన దావాగ్నిని నీ ధారాపాతంతో శమింపజేసేవు కనుక ! ఆ పర్వతంపై ఒకింత విశ్రమించేటం వల్ల నీ మార్గాయాసమూ తీరుతుంది.

త్రోవలోని ప్రకృతినంతా ఎంతో మనోజ్ఞంగా వర్ణిస్తాడు కాళిదాసు. పండిన మామిడి పళ్లు ప్రక్కన అలుముకుంటూ ఉంటే అందమైన కేశపాశ ఛాయనొంది శ్యామవర్ణంతో మేఘుడు కొండ కొమ్ము నధిరోహించినపుడు మధ్యలో నలుపు వర్ణం చుట్టూ అధికమైన తెలుపు వ్యాపించి భూదేవి స్తనం వలె దేవతా మిథునాలకు చూడ ముచ్చటగొలుపుతుందట! ఈ వర్ణనలో రతి క్రీడతో అలసిన నాయకుడు నాయిక కుచకలశంపై నిద్రిస్తాడనే భావం ద్యోతకమౌతోంది. (పూ. మే.18)

ఆ తర్వాత వింధ్య పర్వత పాదంలో ఉన్న నర్మదాతీరానికి మేఘుని చేరుకొమ్మన్నాడు. వనచర స్త్రీలు క్రీడించిన లతాగృహాలపై క్షణకాలం నిలిచి తిరిగి ప్రయాణాన్ని సాగించుమంటున్నాడు. పాయలు పాయలుగా ఉన్న ఆ నది పర్వతప్రాంతంలో ఎలా ఉంటుందంటే నల్లని పర్వతం ఏనుగు ఆకారంలో ఉంటే నదీ ప్రవాహం ఆ ఏనుగుకు తీర్చి దిద్దిన విభూతిరేఖవలె ఉంటుందట ! ఎంతటి అందమైన ఉపమానం ! అందుకే అంటారు "ఉపమా కాళిదాసస్య" అని. పర్వతం నాయకునిగ నదిని నాయికగా పోల్చి పర్వతపాదంలో నది ఉందని చెప్పటంతో కాముకి అయిన నాయిక నాయకుని పాదాలపై వ్రాలినట్లు చెప్పటం కూడా మనోహరం కదా !

ఆ వింధ్యాద్రిపై వాంతిచేసికొమ్మంటున్నాడు. అంటే జేడివాన కురిపించుమని! 'వమనక్రియ' శరీరారోగ్యానికి ఆయుర్వేదంలో ప్రసిద్ధమైన ప్రక్రియ. ఆ తర్వాత నేరేడు తోపుల్లో వాటిని ఆస్వాదిస్తూంటే మేఘుని వేగం నియంత్రితమౌతుంది. రేవానదీ తోయాలని త్రాగుమంటాడు దాంతో శక్తిని పుంజుకొని పయనిస్తున్న మేఘుని గాలి ఏమీ చేయలేదు. దీనికి అందటి అనుభవంలో ఉన్న అర్థాంతర న్యాసంతో తాను చెప్పిన దాన్ని సమర్థించుకొంటున్నాడు కవి.



**"రిక్తఃసర్వో భవతి హి లఘుః పూర్ణతా గౌరవాయ"** (పూ. మే. 20)

రిక్తః = ఏమీలేని వాడంటే (అంగబలం, అర్థబలం ఇత్యాది) అందటికీ చులకనే ! అన్నీ ఉన్నవాడంటేనే గౌరవం.

"పొదల్లోని సుగంధ కుసుమాలు ఆలస్యం చేయిస్తాయి. కన్నీరునించిన (మేఘదర్శనం వల్ల ఆనందాతిరేకంతో) నెమిళ్ల గానం స్వాగతం పలికి నీకు అతిథి సత్క్రియ కావిస్తుంది. అంటే ఒక పట్టాన అవి నిన్ను కదలనివ్వవంటున్నాడు. అయినా తనకై వేగంగా బయలు దేరు" మంటున్నాడు. మేఘసాన్నిధ్యంలో తెల్లని రంగులో మొగలి పూలు వికసించి ఉపవనాలకు ముళ్లకంచెలా శోభిస్తాయంటాడు కాళిదాసు. మొగలి పూవుకు ముళ్లుంటాయికదా మటి! పక్షులు గూళ్లు నిర్మించుకోవటానికి వృక్షాల్ని ఆశ్రయించేటంతో అవి అస్తవ్యస్తమౌతాయి. ఆ సుందరవనంలో కొంచెం సేపు విహరించి పొమ్మని మేఘునితో చెబుతాడు యక్షుడు.

ఆ తర్వాత మార్గంలో ఆసన్నమయ్యేది దశార్ణదేశాలకు రాజధాని విదిశా నగరం ! అచటి నది వేత్రవతి. ఆ వేత్రవతీ నదీ జలాల్ని త్రావి కాముకుడు తన ప్రియురాలి అధరపానం చేసిన అనుభూతిని పొందుమంటున్నాడు. ఆ వేత్రవతీ నదీ తరంగాల చలనం ముడివడిన కనుబొమలతో ఉన్న స్త్రీ అధరపానంలా ఉంటుందట ! కనుబొమలు ముడిపడటమేమిటంటే పురుషుడు కొంచెం మోటుగా అధరాల్ని పీడిస్తే ఆ బాధకామె కనుబొమలు ప్రణయకోపంతో ముడివడుతాయి. ! ఓహో! ఏమి ఊహా శబలత ! నాయిక సంయోగకాలంలో రతి పారవశ్యంతో చేసే సన్నని ధ్వనికి 'మణిత'మని పేరు ఆ సమయంలోని అధరపానం రతిని మించిన అనుభూతి నిస్తుందని –

**"కామినీనామధరాస్వాదః సురతాదతిరిచ్యతే"** అంటారు!
ఇన్ని అర్థాలతో ఈ శ్లోకం ఎంతైనా స్పృహణీయమైంది.

**"తేషాం దిక్షు ప్రథిత విదిశా లక్షణాం రాజధానీం**
**గత్వాసద్యః ఫలమవికలం కాముకత్వస్య లబ్ధా ।**
**తీరోపాన్త స్తనిత సుభగం పాస్యసి స్వాదు యస్మా –**
**త్సభ్రూ భఙ్గం ముఖ మివ పయోవేత్ర వత్యాశ్చలోర్మి ॥**"(పూ.మే.24.)

విదిశా సమీపంలో విటులకు విహారయోగ్యమైన ఒక క్రీడాపర్వతం ఉంది. అది అంత ఎత్తులేకపోవటం వల్ల దానికి "నీచైః" అని పేరు వచ్చింది. కడిమి పూలు వాసనలు వెదజల్లే ఆ ప్రాంతంలో సహజసిద్ధాలో, కల్పితాలో అయిన శిలావితర్దికలు అచ్చేటి విటుల విలాసోత్కర్షకు సాక్షీభూతంగా ఉంటాయి. అవి వార వనితల సౌరభాల్ని వెదజల్లుతూ ఉంటాయి. అక్కడ ఒకింత విశ్రమించుమంటున్నాడు.

అక్కడనుంచి కొంచెం చుట్టు అయినా వింధ్యకు ఒకింత తూర్పుగా ఉన్న ఉజ్జయినికి వెళ్ళుమంటున్నాడు మేఘుణ్ణి. ఉజ్జయిని భారతీయుల పుణ్య క్షేత్రాల్లో ఒకటి. మోక్షప్రదాలైన సప్త క్షేత్రాల్లో ఒకటి.

**"అయోధ్యా మధురా మాయా కాశీ కాఞ్చీ అవన్తికా ।**
**పురీ ద్వారవతీ చైవ సప్తైతే మోక్షదాయికాః ॥**

అవన్తిక ఉజ్జయినికి మఱో పేరు. కాళిదాసు ఉజ్జయినీలో ఉండే వాడంటారు. శకకర్త విక్రమాదిత్యుని రాజధానిగా నాటినుంచి నేటి వఱకు హైందవులు సగర్వంగా చెప్పుకో దగ్గ ప్రదేశం. అచ్చేటి సౌధాగ్రాలను వీక్షిస్తూ ఉంటే విద్యుల్లతాస్ఫురణతో చంచలమైన దృక్కులు కల పుర స్త్రీల నేత్రానందానికి భాజనుడవు కావటం నీకు లభించే సత్కారం. మఱి అక్కడికి వెళ్ళక పోతే నీకా భాగ్యం ఉండదు. కదా!" అంటున్నాడు.



మఱొక అందమైన శ్లోకం

**"వీచీక్షోభ స్తనిత విహగ శ్రేణి కాఞ్చీగుణాయాః**
**సంసర్పన్త్యాః స్ఖలితసుభగం దర్శి తావర్త నాభేః ।**
**నిర్విన్ధ్యాయాః పథిభవ రసాభ్యన్తరః సన్నిపత్య.**
**స్త్రీణామాద్యం ప్రణయవచనం విభ్రమో హి ప్రియేషు"** ॥ (పూ.మే – 28)

త్రోవలో 'నిర్వింధ్య' అనే పేరుతో ఉన్న నది తగులుతుంది. నదిని స్త్రీగాను మేఘుని పురుషునిగా భావించి శ్లోకం కూర్చాడు కాళిదాసు. ఆ నదీ తరంగాలు ధ్వనిస్తూ ఉంటే అందులోని హంసలశ్రేణి మేఖలలా ఒప్పుతుంది. నదిలో కలిగే సుడులు నాభిగా కనబడుతూ ఉంటే శృంగారాంతరంగుడవు కమ్మంటున్నాడు. చిక్కని చూపులు, శరీరాలంకరణ, చెవిని మర్దించుకోవటం, నాభిని చూపటం, ఎదురుగా నడవటం, చిన్నపిల్లల్ని కౌగిలించుకోవటం, జేడను మాటిమాటికీ అల్లుకోవటం, సఖులతో ప్రణయసంబంధ ప్రసంగం మదనాతురలైన స్త్రీల వ్యాపారాలని శాస్త్రోక్తి. స్త్రీల విలాసమే వారి మొదటి ప్రణయ వచనం కదా ! తరంగధ్వని మొలనూలి మువ్వల శబ్దంగా, నదిలో సుడులను నాభిగా రూపారోపణచేసి ఒక శృంగారస్ఫోరక నైరూప్య చిత్రాన్ని సరస హృదయులకందించాడు కాళిదాసు. ఈ చిత్రానికి భావుకుని భావనే భిత్తి స్థానీయమైంది. ఈ భావనకు దీప్తి నిచ్చేది 'రస' శబ్దాంతర శ్లేష – ఇచ్చేట నాయిక నాయకుని ఆహ్వానిస్తోంది. ఈ ఆహ్వానం వాచ్యం కాక కాంతా జనోచితమైన వ్యంగ్యం. మామూలుగా – అంటే శబ్దార్థమే తీసికొంటే ఆ నదిలోని నీటిని స్వీకరించి వెళ్ళుమని ! అలా చెబితే చేప్పగా ఉండి సొగసేం ఉంటుంది ?

ఆ తరువాత శ్లోకంలో ఆ నది శుష్కించినందువల్ల జేడవలె సన్నని ఒడ్డున ఉండే వృక్షాలనుంచి జారిన పండుటాకులతో తెల్లగా (పాలిపోయి)

ఉంది. అలా ఉండటం నీ అదృష్టం. స్త్రీ పురుషునికై విరహావస్థ నొందటం స్త్రీ మనస్విత్వా ద్యోతకం, పురుషుని అదృష్టం. శృంగారంలోని పవిత్రత నీ శ్లోకం వ్యక్తం చేస్తోంది. మేఘుడేంచేయాలంటే – నదీ పరంగా వర్షించేటం, నాయికా పరంగా రమించేటం.

అవంతిని చేరి విశాలా నగరం వెళ్ళమంటాడు. అక్కడ గ్రామీణ వృద్ధులు 'ఉదయన' కథాకోవిదులట ! క్షీణించిన పుణ్యంతో స్వర్లోక వాసులు భువికి వస్తూ శేషించిన పుణ్యంతో తీసికొని వచ్చిన స్వర్గలోకపు ముక్క అట ఆ సంపత్సమృద్ధమైన విశాలా నగరం! ఉదయన వాసవ దత్తల వృత్తాంతాన్ని కాళిదాసుకు పూర్వుడైన భాసమహా కవి "స్వప్న వాసవ దత్త" అనే నాటకంగా వ్రాసేడు. ఆ విశాలా నగరం శిప్రానదీ తీరంలో ఉంది.

ఉజ్జయినీ నగరంలోని దర్శనీయ స్థలాన్ని యక్షుడు మేఘునికి చెబుతాడు. అది మహాకాలుని (శివుని) నివాసం. మేఘుడక్కడికి వెడితే అక్కడికి ప్రమథ గణాలు తమ స్వామి కంఠవర్ణంతో ఉన్నవాడని అతణ్ణి ఆదరిస్తారట. అక్కడ గంధవతీ నది ప్రవహిస్తోంది. మహాకాలుని సందర్శించేటం వల్ల ఆముష్మిక ప్రయోజనం కూడా కలిసి వస్తుంది. కనుక ఉజ్జయినీ భోగమోక్షప్రదమైందని తెలుపుతున్నాడు. ఆ మహాకాలుని మహిమ స్కాందపురాణంలో సర్వకామార్థ సిద్ధిదమని వర్ణితమైంది. పైగా యక్షుడు అంటాడు. "నువ్వే సమయంలో అక్కడకు చేరినా సాయం సమయంలో అక్కడే ఉండు. ఎందుకంటే మహాకాలునికి సాయం సమయాల్లో జేరిగే పూజలో నీ గర్జనలతో పటహ వాద్యం సమకూరిస్తే అఖండ పుణ్యాన్నార్జించు కొంటావు."



భారతదేశంలో ప్రసిద్ధినొందిన ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఉజ్జయినిలో శివలింగం ఒకటి. కాళిదాసు ఉజ్జయనిలో మేఘుడాచరించవలసిన పనులను విశదీకరిస్తాడు. భంగ్యంతరంగా పురుషుడు స్త్రీపట్ల చూపవలసిన సున్నితత్వాన్ని చెప్పటంతో పాటు ఆ నాటి ఉజ్జయినీ నగరవాసుల జీవన విధానాన్ని సూచిస్తాడు. గంభీరానదీ ప్రస్తావనలో నదీ వృత్తాంతం వాచ్యమైతే నాయికా నాయక వృత్తాంతం ధ్వని.

**"తస్యాః కించిత్కర ధృతమివ ప్రాప్తవానీరశాఖం**
**హృత్వానీలం సలిలవసనం ముక్తరోధో నితమ్బమ్।**
**ప్రస్థానంతే కథమపి సఖే లమ్బమానస్యభావి**
**జ్ఞాతా స్వాదో వివృత జఘనాం కో విహాతుం సమర్థః॥"** (పూ.మే.41)

వేసవిలో నదిలో నీరు జారి ఆ నదీ తటంలో ఉన్న 'వేతస' చెట్టు కొమ్మలతో కొద్దిగా పట్టుకొన్నట్లున్న విడిచిన ఒడ్డు అనే పిఱుదులు కల గంభీరానది నల్లని నీరనే చీరముడి జార్చినప్పటి సన్నివేశాన్ని స్ఫురింపజేస్తుందీశ్లోకం. స్త్రీ స్వయంగా మొల, పిఱుదులు కటి కనిపింపచేసినపుడు రసికుడెలా చూస్తూ చూస్తూ ఊరకొంటాడంటాడు. గంభీరానదిని దాటిన తర్వాత మేఘుడు "దేవగిరి" అనే పర్వతాభిముఖుడై పయనం సాగిస్తాడు. ఆ దేవగిరి కుమారస్వామికి నెలవైన స్థానమని బ్రహ్మాండపురాణ గాథను స్మరింపజేసేడు. మేఘునితో పుష్పాకారాన్ని ధరించి ఆ దైవంపై పూలవానను కురిపించి (అభిషేక క్రియ) అతని దయకు పాత్రుడవుకమ్మంటూ అన్యాపదేశంగా పాఠకులనుద్బోధిస్తున్నాడు కాళిదాసు.

**"ఆరాధ్యైనం శరవణభవం ....."** (45) ఇత్యాది శ్లోకం మత్స్యపురాణ గాథతో కూడిన ఐతిహ్యాన్ని చెప్పకనే చెప్పేడు. శరవణం

ఒక అరణ్యం. అత్యంత మనోహరమైన ఆ వనం పార్వతీపరమేశ్వరుల రహస్య క్రీడా స్థానం. ఒకసారి ఆ జగత్పితరులు రతిక్రీడలో ఉండగా కొందఱు మునులక్కడికి వచ్చారు. విగత వస్త్ర పార్వతి లజ్జతో తొలగి పోయి క్రీడాభంగానికి కోపించి ఆ వనానికి దశయోజనాలమేరలో వచ్చిన వారంతా స్త్రీలవుతారని శపించింది. రంతిదేవుడొనర్చిన గోమేధ ఫలితంగా గోవుల చర్మాన్నుండి స్రవించిన రుధిర ధారవల్ల 'చర్మణ్వతీ' అనే పేరుకల నదిగా రూపొందింది. ఇంతటి భారతీయ విజ్ఞాన సముపేతమైన శ్లోకాలతో కూడింది మేఘదూత కావ్యం.

ఆ చర్మణ్వతీ నదిని దాటి లతల వంటి కనుబొమల విలాసంతో కంటి ఱెప్పల్ని పైకెత్తటంవల్ల కొంచెం తెలుపుతో కలిసిన నల్లని కాంతితో మొల్లపూలననుసరిస్తూ కదులుతున్న తుమ్మెదల శోభను త్రోసి రాజనే రంతిదేవుని నగరం దశపుర స్త్రీల కుతూహలంతో కూడిన చూపులకు పాత్రుడవై ప్రయాణాన్ని సాగించుమంటాడు యక్షుడు. పురుషుని స్త్రీ కుతూహలంగా చూడటం వల్ల సంతోషం కల్గుతుంది. స్త్రీలనేకులు చూడటంతో జీవితానికి చారితార్థ్యం సిద్ధించిన భావన కలుగుతుంది. అంటే తాను బహుస్త్రీ ప్రశంసార్హుడైనట్లు. అయితే ఈ స్త్రీలు ప్రయాణంలో తటస్థపడేవారు మాత్రమే. ఆ తరువాతి ప్రయాణం ఉత్సాహంగా కొనసాగటానికి ఈ స్త్రీల చూపులు ఉత్తేజాన్నిచ్చేవన్నమాట ! మఱి, ఇక్కడ దశపుర స్త్రీలవి సాధారణమైన చూపులా ? కావు. వారి కనుబొమలు లతల వంటివి. అవి తానిదివఱకెఱిగినవే. అయినా వాటి అందం స్పృహణీయమైంది కనుక మళ్ళీ చూడాలనిపిస్తుంది. ఈ లతల వంటి కనుబొమలు మేఘుని చూడటానికి పైకెత్తటం వల్ల కంటిపై ఱెప్పమీదున్న



వెంట్రుకలు – వీటినే 'కనీనిక' లంటాం. చిన్న తెలుపుతో కూడిన నలుపును కలిగి ఉంటాయట ! శరీర చాయ తెలుపు, కనీనికలు నలుపు కనుక తెలుపుతో కూడిన నలుపు చేరి శోభిస్తుంది. ఆ శోభ ఎలాంటి దంటే – మొల్లపూలు తెల్లనివి, అవి గాలికి కదులు తున్నాయి. వాటిలోని మకరందాస్వాదనకు తుమ్మెదలు బయలుదేరేయి. మొల్లపూలు కదులుతూ ఉంటే (గాలికి) ఆ తుమ్మెదలూ వాటి గమనానుసారంగా కదులుతున్నాయి. అది సహృదయభావ్యమైన సుమనోహర భావన. ఇక్కడి సొగసు పూలదీ కాదు, తుమ్మెదలదీ కాదు. ఆ పూవుపై వ్రాలాలనే తుమ్మెద మనసులోని తొందరదే సౌందర్యమంతా. దానిని భావుకుడు భావించేగలిగితేనే – "తద్భావనా భావితాంతః కరణు"డైన భావుకునికే కాళిదాసు కవితా సౌందర్యం కొంతవఱకైనా అవగతమై ఆస్వాదయోగ్యమౌతుంది.

గుండెలో ఇంత త్రవ్వు కొంటేనే రసానుభూతి. ఇది లేని శబ్దార్థ జ్ఞానంతో తృప్తిపడే చేదువు చేదువు కాదు.

దశపురాన్ని వీడిన తర్వాత మేఘుడు చేరవలసిన ప్రదేశం బ్రహ్మావర్తం. ఇది సరస్వతీ దృషద్వతులనే దేవ నదుల మధ్య భాగంలో ఉన్న దేశం. ఆ దేశంలో ప్రవేశించాక చేరవలసిన క్షేత్రం కురుక్షేత్రం. అది ఎలాంటిదంటే నువ్వు ధారాపాతంగా వర్షించి కమలాల శోభను పొగొట్టినట్లే ఆనాడర్జునుడు రాజుల ముఖాలనే కమలాలను తన బాణ ధారాపాతంతో నాశనంచేసినటువంటిదని మేఘుని అర్జునునితో పోల్చటం ద్వారా సంతుష్టి నొందించాడు.

ఈ విధంగా కాళిదాసు భారతదేశంలోని పుణ్యక్షేత్రాల, తీర్థాల ప్రశంసతో అమేయమైన దేశభక్తిని, దేశాటన, తీర్థాటన రక్తిని పాఠకులకు కల్గిస్తున్నాడు.

కనక పర్వత సమీపంలో హిమవత్పర్వతాన్నుండి దిగి సగర చక్రవర్తి పుత్రులు స్వర్గారోహణకు సోపానమైన గంగానదిని సేవింపుమంటున్నాడు. ఆ గంగానది ఎటువంటిది ? శివుని 'నెత్తిమీద దేవత'! ఆమె చేసిన రెండు పనుల్ని కాళిదాసు పరమ రమణీయంగా చెప్పేడు. ఒకటి పుణ్యకార్యం, రెండవది శృంగారపరమైంది. మొదటిది సగరచక్రవర్తి పుత్రులకు పుణ్యలోకాల్ని ప్రసాదించేటం. ఇక రెండవది కుపితయైన పార్వతీదేవిని చూచి నవ్వటం ! మొదటిది చారిత్రక సత్యం. రెండవది కాళిదాస మహాకవి భావనా రామణీయకతకు దర్పణం. అదేమంటే ఆకాశం నుండి శంభుని శిరస్సు మీదికి వచ్చింది గంగ. తనభర్త నెత్తినెక్కి నాట్యంచేసే ఇదెవరని పార్వతి భ్రుకుటి ముడిచి చూచిందట! సవతియైన పార్వతి చూపును తన నురగలనే చేతులతో ఎగతాళి చేస్తోందట గంగ ! నదిలోని తరంగాలు ఆమె హస్తాలు. అవి కదుల్తూ ఉంటాయి. ఎగతాళిచేసినప్పుడు చేతుల్ని కదలిస్తూ నవ్వటం లోకసహజం! హసన శబ్దోద్భవం హాస్యం ! నవరసాల్లో శృంగారం తరువాత రెండవ స్థానాన్నాక్రమించేది హాస్యం ! ఈ నవరసాల్లో ప్రతి రసానికీ అధిదేవతల్నీ, రంగుల్నీ ఆలంకారికులు నిర్దేశించారు. హాస్యానికి తెలుపువర్ణంగా చెప్పేరు. నవ్వు తెల్లగా ఉంటుంది ! పళ్లు తెల్లగాఉంటాయి. ఇక్కడ తరంగాల్లో ఉండే నురుగు తెల్లనిది. అది శివుని ఫాలభాగంలోని చంద్రుని తెలుపుతోకూడి మఱింత తెల్లనైంది. శివుని జుట్టుపట్టుకొన్న గంగ "నాకు స్థానభ్రంశం కలిగించేటం నీతరం కాదు, నే నిక్కడే ఉంటాను పో" అని పార్వతితో అన్నట్లుగా ఉందట ఆ నవ్వు !



ఒక హిమాద్రి శిలపై శివుని పాదముద్రలు తరతరాలుగా యోగులచే అర్చనలనందుతున్నాయి. ప్రదక్షిణ పూర్వకంగా దాన్ని సేవించినపుడు పాపాలు పటాపంచలై చివరకు శివుని ప్రమథగణాల్లో చేరే అవకాశం మేఘునికి కలుగుతుందంటాడు. అక్కడ గాలి వెదురు రంధ్రాల్లో చేరి వేణునాదం వలె చేసే మధురమైన శబ్దాలు శ్రోత్రపేయంగా ఉంటాయి. కిన్నర స్త్రీలు శివుని కీర్తిని ఆ వేణునాదాల కనుగుణంగా గానం చేస్తుంటారు. నీ ఉఱుముల ధ్వని మృదంగాయమానమై ఈశ్వరుని సంగీతం సంపూర్ణత నొందుతుంది. అలా ఈశ్వరుని సంగీతానికి ప్రక్కవాద్యం సమకూర్చిన నీకూ చారితార్థ్యం సిద్ధిస్తుంది. శివుడూ నీ పట్ల ప్రసన్నుడౌతాడు. హిమవత్పర్వత ప్రాంతంలో దర్శనీయ దృశ్యాలనేకం ఉన్నా అక్కడ కాలయాపన చేయక పరశురాముని కీర్తి పతాకమైన ఏ క్రౌంచపర్వత రంధ్రం ఉందో, దానిచేత బలిబంధన కార్యోద్యుక్తుడైన విష్ణుమూర్తి నల్లని పాదం వలె అడ్డంగానూ,నిలువుగానూ శోభిస్తూ ఉత్తరదిక్కుగా వెళ్ళుమని మార్గనిర్దేశం చేసేడాయక్షుడు. కాళిదాసమహాకవి ప్రతిభను ప్రతి శ్లోకం ఇలా భారతీయ వైభవానికి దర్పణం పట్టేదిగా ఉంటుంది. దేశమంటే మట్టి కాదనక భారతదేశంలో అణువణువూ పవిత్రమైందని ధ్వనింపచేస్తాడు.

తరువాత కైలాస పర్వతం వస్తుంది. అది వెండి కొండ కదా ! కనుక దాన్ని దేవతాస్త్రీలు తమ అందాన్ని చూచుకొనే అద్దంగా ఉత్ప్రేక్షిస్తాడు. పైగా అది రావణాసురుని బాహువులతో కదిలిన సానువులు కలదట ! అంతేకాదు, కుప్పలు పోసిన శివుని అట్టహాసంతో అసలే తెల్లగా ఉన్న ఆ పర్వతం మఱింత తెలుపు వర్ణాన్ని సంతరించుకొందంటాడు. మేఘుడా

కొండచరియ వద్ద ఉన్నప్పుడు ఏనుగు దంతపు ముక్కవలె తెల్లనైన ఆ పర్వతానికి నువ్వు నల్లని వస్త్రమై బలరామునివలె శోభిస్తావని బలరామునితో ఉపమానంచెప్పి సంతోషింపచేస్తున్నాడా యక్షుడు. అక్కడ మానస సరోవరంలోని నీటిని స్వీకరిస్తూ, దేవేంద్రుని ఏనుగైన ఐరావతానికి క్షణకాలం ముఖ వస్త్రంగా శోభిస్తూ కల్పవృక్షం చిగురులనే వస్త్రాల్ని నీ గాలులతో ఎగురగొడుతూ మనోజ్ఞమైన విలాసాలతో ఆ పర్వతంపై యథేచ్ఛగా విహరింపుమంటున్నాడు. కైలాసపర్వతాన్ని నాయకునిగాను, యక్షుని భార్య నివసించే అలకాపట్టణాన్ని నాయికగానూ భావించి చెబుతున్నాడు. ఎత్తైన ప్రాసాదాలతో కూడిన అలకానగరంపై మబ్బులు ముత్యాల వంటి నీటి బొట్లను స్రవిస్తూ ఉంటే మేఘాలు స్త్రీల ముంగురుల్లా శోభిస్తూ ఉంటాయి. అటువంటి మేఘసముదాయాన్ని ఆ అలకా పట్టణం వర్షర్తువులో వహిస్తూ ఉంటుందని అలకా పట్టణాన్ని చేరవలసిన పద్ధతి చెప్పటంతో పూర్వమేఘం (పూర్వభాగం) పరి సమాప్తమౌతుంది.

ఇలా 63 శ్లోకాలతో మార్గవర్ణనతో పూర్వమేఘం పూర్తైన తరువాత ఉత్తర మేఘంలోని 52 శ్లోకాల్లో మొదటి పదునొకండు శ్లోకాలు అలకాపురీ వర్ణనతో కూడుకొని ఉంటాయి. సుకుమారలైన స్త్రీలు, చేక్కని చిత్రాలు, నృత్యాలకై మ్రోగుతున్న మృదంగధ్వనులు, మణిమయ ప్రదేశాలు, అకాశాన్నంటే శిఖరాలు కల భవనాలు ఇంద్రధనుస్సుతో కూడి శ్రావ్యమై గంభీరధ్వని గలిగిన మేఘునకు సాటి వస్తూ ఉంటాయని యక్షుడు అలకాపట్టణాన్ని పరిచయం చేస్తాడు. అ చేటిస్త్రీలు వివిధ పుష్పాల్ని ఎలా ధరిస్తూ ఉంటారో చెప్పి అ చేటి యక్షులు ఉత్తమ స్త్రీలతో చంద్రకాంత శిలలతోకూడిన సౌధాల్లో నేపథ్యంలో మృదంగ ధ్వనులు మనోహరంగా



వినిపిస్తూ ఉంటే 'రతిఫల'మనే మద్యాన్ని సేవిస్తూ ఉంటారట ! దేవతలకు సైతం వాంఛించే తగిన యక్షస్త్రీలు ఆకాశగంగా తీరంలో మందార వృక్ష ఛాయలో స్వర్ణ సైకతాన్ని గుప్పిళ్ళలో ఉంచుకొని దాంట్లో రత్నాల్ని కనిపించేకుండా పెట్టి వాటిని వెతికే ఆటలాడుతూ ఉంటారు ! ఆ యక్షుల శృంగార కేళిని వర్ణించే శ్లోకం స్పృహణీయమైంది.

**"నీవీబంధోచ్ఛ్వసిత శిథిలం యత్ర బిమ్బాధరాణాం**
**క్షౌమం రాగాదనిభృతకరేష్వాక్షిపత్సుప్రియేషు ।**
**అర్చిస్తు ఙ్గ నభిముఖమపి ప్రాప్యరత్న ప్రదీపా**
**స్త్రీమూఢానాం భవతి విఫల ప్రేరణా చూర్ణముష్టిః ॥"(ఉ. మే. 1-5)**

అంటే - ప్రియులు మోహోద్రేకంతో వణుకుతున్న చేతులతో తమప్రియురాండ్ర చీరముడి విప్పటానికి పూనుకొనేటంతలోనే మోహావేశంతో ఉన్న స్త్రీల వస్త్రాలు వదులైపోతున్నాయి. ముగ్ధలైన ఆ స్త్రీలు తమ నగ్న సౌదర్యం వారికెక్కడ కన్పిస్తుందోనని తమకు దగ్గఱలోనున్న గంధపు పొడిని గుప్పిళ్ళతోతీసి దీపాలపై చేల్లుతున్నారు. దీపాలారిపోతే తమ నగ్నత్వం ప్రియులకు కనిపించేదనే అమాయకపు ఊహతో ! దీపాలారిపోవటానికి అవి మామూలు దీపాలైతే కదా! రత్న దీపాలు కావటంతో వారి ప్రయత్నం విఫలమైంది. జాజ్వల్యమానమై ప్రకాశిస్తున్న రత్నదీపపు కాంతుల్లో కాంతల నగ్న సౌందర్యం ప్రియులకు మైమఱపు కలిగించేటమే కాక వారి అమాయకత్వం మనస్సులకు మఱింత ముచ్చట గొలుపుతోంది. పరమరమణీయమైన భావన !

అలకా నగరంలో అర్ధరాత్రివేళల్లో మేఘుని అవరోధం లేక పోవటంవల్ల చంద్రకిరణాలు ప్రతిఫలించేటం చేత చంద్రకాంత శిలలు

ద్రవించి వాటి నుండి స్రవిస్తున్న నీటి బిందువులు ప్రియుల కౌగిళ్ళనుంచి విముక్తినొందిన స్త్రీలకు రతి క్రీడవల్ల కలిగిన శరీర బడలికల కుపశమనం కలుగజేస్తున్నాయట ! ఎంతటి ఊహా వైభవం ! అక్కడ త్రోవలో దేవ పారిజాతాలు, చెవులకు ధరించిన స్వర్ణకమలాలు, ముత్యాలసరాలు దారాలతో కనిపిస్తూ ఉంటాయి. దీని వల్ల గత రాత్రి అభిసారికలు తమ ప్రియుల నివాసాలకో, సంకేత స్థలాలకో వెళ్ళి సుఖించి విరహోత్కంఠతో నడచిన వేగానికవి జారి మార్గంలో పడ్డాయి. ముత్యాల సరాలు వారి కఠిన వక్షోజ స్పర్శకు తెగి ఆ దారాలు, సరాలు మార్గంలో పడటం వల్ల ఆ మార్గం నుంచి అభిసారికలు వెళ్ళేరని అనుమియయమానమౌతుంది. అలకాపురి శివుని మిత్రుడైన కుబేరునిది కావటంవల్ల అక్కడ శివుడుంటాడనే భయంతో మన్మథుడు తుమ్మెదలు వింటినారిగా కల తన ధనుస్సును చేపట్టడట! శివుని ప్రతాపం పూర్వం ఒకసారి మన్మథునికి అనుభవైకవేద్యమే కదా ! మఱి, అంతటి శృంగార భూమిలో ఆయన లేకపోతే ఎలా?

ఆయన పని అచటి స్త్రీల కనుబొమలతోనే జేరుగుతుందట ! వారు తమకనుబొమల్ని ముడిస్తే మన్మథబాణం ఎక్కిడినట్లే ఉంటుంది. కనుబొమలు నలుపు, తుమ్మెదల బారు నలుపు. వారి చూపులే మన్మథుని తూపులు. ఇలా పట్టణాన్ని వర్ణించి యక్షుడిక మేఘునికి తన ఇంటి గుర్తులు చెబుతాడు. "కుబేరు నింటికి ఉత్తరంగా హరివిల్లు తోరణంతో మా ఇల్లు కనిపిస్తూనే ఉంటుంది. నా గృహిణి పెంపుడు కొడుకులా పెంచుతున్న చిన్న కల్పవృక్షం ఉంటుంది."

తన ఇంటి ముందుండే బాలమందార వృక్షాన్ని ఒక గుర్తుగా చెప్పి రెండవ గుర్తుగా దిగుడు బావిని చెబుతున్నాడు యక్షుడు. ఆ



దిగుడుబావిమెట్లు మరకత మణులతో కూడినవి. అందులోని స్వర్ణకమలాల తూళ్ళు వైడూర్యమణులతో ఉంటాయి. దాంట్లో హంసలు కూడా ఉన్నాయి. అవి మేఘుని చూచి వర్షాకాలం వస్తోంది నీరు బురదై పోతుంది మానస సరోవరం వెళదామనే ఊహనైనా రానీయక ఏ చీకూ చింతా లేకుండా అక్కడే ఉంటాయట ! తన ఇల్లు అంత ఆకర్షణీయమని చెప్పటంలో అంత అందమైన ఇంటిని చూడాలనే కాంక్షతో నైనా మేఘుడక్కడికి వెళ్ళాలనుకుంటాడని యక్షుని భావం ! ఇంకా కొన్ని అమేయమైన వర్ణనలతో ఆ గృహశోభను వర్ణించిన తరువాత తన భార్య గుర్తులు చెబుతాడు;

**"తన్వీశ్యామా శిఖరి దశనా పక్వబిమ్బాధరోష్ఠీ**
**మధ్యేక్షామా చకితహరిణీ ప్రేక్షణా నిమ్న నాభిః।**
**శ్రోణీ భారాదలస గమనాస్తోక నమ్రా స్తనాభ్యాం**
**యాతత్రస్యాద్యువతి విషయే సృష్టిరాద్యేవ ధాతుః॥"** (2-19)

మేఘదూతంలోని అతి మనోమనోహర శ్లోకాల్లో ఇదొకటి.

యక్షుని భార్య కృశాంగి నడియౌవనంలో ఉన్నది, కోణాలు తేలిన పలువరుస, దొండపండువంటి క్రింది పెదవి కలది, కృశోదరి, భీతహరిణేక్షణ, లోతైన బొడ్డు, మందగమన, వక్షోజద్వయం కొంచెంవంగినది- ఇవి పద్మినీ జాతి స్త్రీ లక్షణాలు. ఆమె స్త్రీల సృష్టిలో బ్రహ్మమొదటి శిల్పమో అన్నట్లుంటుందంటాడు. ఇందులో ఆమెకు వాడినవి తొమ్మిది విశేషణాలు. స్థూలంగా పరిశీలిస్తే అంగాంగ వర్ణనగా తోస్తోంది. సూక్ష్మంగా పరిశీలిస్తే ఉత్తమ స్త్రీ సాముద్రిక లక్షణాలివి. బొడ్డులోతుగా ఉండటం భీతహరిణేక్షణ పద్మినీజాతి స్త్రీ లక్షణమని 'రతి రహస్యం',

బొడ్డులోతుగా ఉండటం మదన రసాతిరేక సూచకమని “కామసూత్రాలు” విశదపఱుస్తాయి. కృత్రిమ నీతి సూత్రాలచేత ప్రభావితమైన ఆధునికులు ఇది స్త్రీకి ఉత్తమ లక్షణం కాదని దుర్వ్యాఖ్యానం చేయవచ్చు. కాని అది న్యాయం కాదు. మదన రసాతిరేకం కల స్త్రీ తాను సుఖపడటమే కాక తన భర్తను కూడా తృతీయ పురుషార్థంలో చరితార్థుణ్ణి చేస్తుంది.

తరువాత ఆమె తన రెండవ జీవితమంటాడు. యక్షుని జీవిత సర్వస్వం అతని కాంత. ‘రెండవ జీవితం’ అనేది వాచ్యార్థమైతే అదే సర్వస్వమనేది వ్యంగ్యం. వియోగభారంతో చెప్పినంత సౌందర్యాతిశయం లేక ఒకింత వాడిన పద్మంలా కనిపించినంత మాత్రాన ఆమెను వేఱొక వనితగా భ్రమించవద్దని చెబుతాడు. వియోగం తననెంత కృశింపచేసిందో ఆమెను అంతే కృశింపజేస్తోంది. కనుక తన ప్రణయం అస్థాన పతితం కాదనే విషయం కూడా ఇందులో ధ్వనిత మౌతోంది. ఇలా ఆమె వేష విశేషాన్ని, చేసే పనులను చెప్పి చెప్పి “**శేషాన్మాసాన్విరహదివస**” ఇత్యాది శ్లోకంలో (2-24) వియోగారంభం నుంచి వియోగాంతం వఱకు మిగిలిన నెలలను ద్వారం పై ఉంచిన పూలతో లెక్కించి వాటిని భూమిపై పెడుతూ కాని, లేదా మనసులో ఊహిస్తున్న తన ఆలింగన చుంబనాదులతో కూడిన రతిక్రీడానుభూతినొందుతూ కాని మేఘుని కంటబడవచ్చునంటాడు. ‘మనస్విని’ అయిన స్త్రీ లక్షణం ఇది.

ఈ కావ్యం విప్రలంభ శృంగార రసాత్మకం. కావ్యంలో - శ్రవ్యకావ్యమైతే పాఠకునికి కాని, దృశ్యకావ్యమైతే ప్రేక్షకునికి కాని లభించే అలౌకికానుభూతే రసం. ఎందువల్ల నంటే అవి ఎప్పుడో జరిగినవో, లేక కవి ఊహతో సృష్టించినవో కనుక! వాటిని చదివే వారికో లేక చూచే వారికో



అందులోని పాత్రలతో ఎటువంటి సంబంధం ఉండదు. అయినా నిజ జీవితంలో సంభవించే అనుభూతి కంటె ఒక్కొక్కప్పుడు ఇంకా ఎక్కువగానే వాటి పట్ల వ్యక్తి స్పందిస్తాడు. అలా స్పందించగల సంస్కారోపేతుడే నిజంగా శ్రేష్ఠుడైన ప్రేక్షకుడు, సహృదయ శిరోమణి. ఆ సంస్కారం జన్మతః కొందఱికి ఉన్నా అభ్యాసవశంచేత అలవఱచుకోగలిగింది కూడా! అదే రసం. ‘రస’ శబ్దాన్ని అనేకాలంకారికులు అనేక విధాలుగా సాంకేతికంగా విశ్లేషించి, విశదీకరించినా, మామూలు మాటల్లో చెప్పుకోవాలంటే ఇది. ఈ రసానుభూతికి వలసింది పాండిత్యం కాదు. సహృదయత. లోకంలో ఎదురయ్యే వివిధ సన్నివేశాలకు నిరక్షర కుక్షులు సైతం విపరీతంగా స్పందించటం మనం చూస్తున్నాం. చక్కగా తీసిన చలన చిత్రాలకు ప్రేక్షకుల నుండి వచ్చే ఆదరణే ఆ చిత్రాల విజయాలకు కారణమౌతోంది. ఇందులో విద్యావంతులది కాక సామాన్య జనాదరణే అధికమైంది. దీనివల్ల రసానుభూతి సర్వజన సామాన్యమని ఋజువౌతోంది. కాకపోతే విద్యావంతుడు దాన్ని విశ్లేషించే ప్రతిభ కలవాడైతే సామాన్యుడు దాన్ని ఆస్వాదించే నేర్పుకలవాడౌతున్నాడు. అంతే తేడా. అయితే కాళిదాసాది మహాకవులు వ్రాసిన కావ్యనాటకాలు ఈ రసానుభూతి నందించటంతో పాటు హృదయసంస్కారాన్ని, ప్రబోధాన్నీ కలిగించి సామాన్య మనుషుల్ని, మాన్య మనీషులను చేస్తున్నాయి. అందుకే వాటిని ఏదో విధంగా చదివించటం, చూపించటం, విద్యావంతుల, కళాకారుల బాధ్యత. పైకి శృంగార కావ్యంలా కనిపించినా స్త్రీ పురుషులకు పరస్పరం ఉండవలసిన హృదయ సాంద్రత నీ కావ్యం మనోహరంగా, మనోజ్ఞంగా. వ్యక్తపఱుస్తోంది.

యక్షుడు తన వద్ద ఉన్నప్పుడతని భార్య నిత్యం పరిమళద్రవ్య మిశ్రితమైన నీటితో ఆభ్యంగన స్నానం చేసేది. వివిధ పరిమళభరిత తైలాలను వాడటం వల్ల ఆమె శిరోజాలు సువాసనల నీనుతూ సున్నితంగా ఉండేవి. ఇప్పుడతని అనుప స్థితిలో సాధారణ స్నానాలచే తల వెంట్రుకలు బిరుసెక్కి ఉంటాయి. యక్షుడు ఏక పత్నీ వ్రతుడు, అతని భార్య పతివ్రత కనుక వియోగవ్యథ ఇద్దఱికీ సమానమే. యక్షుడు మేఘునితో అతడామెను చూసే సమయానికి, ఆమె నిద్రావస్థలో ఉంటే నిద్రాభంగం చేయక ఒక జాము కాలం నిరీక్షించుమంటాడు. జాము కాలం అంటే ఇప్పటి మన కాలప్రమాణంలో మూడు గంటలు. ఎందుకంత సేపు నిరీక్షణ అంటే ఆమెకు పట్టక పట్టక పట్టిన నిద్రలో రాక రాక వచ్చిన కలలో లేకలేక కలిగిన భర్తృ సమాగమ అవధి 'యామం' లేక జాము. ఆమెకు మేఘ గర్జన వల్ల నిద్రాభంగమైతే ఆ కాస్త స్వప్న సుఖానికి కూడా ఆమె దూరమైపోతుంది. మంచి శరీరదార్ఢ్యం యౌవనం కలవారి సురత క్రీడ జాముసేపుంటుందని 'రతిరహస్యం' చెబుతోంది.

**"ఏకవారావధిర్యామో రతస్య పరమోమతః।**
**చణ్డ శక్తిమతోర్యూ నోరుద్భటక్రమవర్తి నోః ॥"**

అయితే వాస్తవంలో ఉన్న కాలవ్యవధి స్వప్నంలో ఉండదు. కొన్ని సెకండ్లు లేదా మహా ఉంటే ఒకటి రెండు నిముషాలు, మఱెందుకిలా చెప్పేడంటే పూర్వ మేఘం ఐదవ శ్లోకం **"ధూమజ్యోతిస్సలిలమరుతాం"** ఇత్యాది శ్లోకంలో చెప్పనే చెప్పేడు. ఆమెవద్దకు సౌదామిని యుక్తుడై వెళ్ళమన్నాడు. ఎందుకంటే గవాక్షంలోనుంచి మేఘుని చూచి పరపురుషుడని ఆమె సందేశం వినటానికి విముఖ అవుతుందేమోనని. పరపురుషుడు స్త్రీ యుక్తుడై వచ్చినప్పుడు సందేహానికి ఆస్కారం ఉండదు ! మేఘుని తనను తాను యక్షుని ప్రియుమిత్రుడననీ, అతని నుండి సందేశం తీసుకొని



వచ్చానని పరిచయం చేసికొమ్మంటున్నాడు. అప్పుడు రామ సందేశ హరుడైన పావని వలె మేఘుని ఆమె గౌరవించేగలదంటాడు. ఇలా చెప్పటంలో తన భార్య సీతాదేవి వంటిదనీ, మేఘుడు హనుమంతుని వంటివాడనీ చెప్పకనే చెప్పినట్లైంది. అక్కడ శ్రీరాముడు, ఇక్కడ యక్షుడు ఇరువురు తమ తమ భార్యలకు సందేశం పంపేరు. కనుక పవిత్రత ద్యోతకమౌతోంది. అసలు కాళిదాసు "మేఘదూతం" వ్రాయటానికి వాల్మీకి రామాయణంలోని హనుమత్సందేశమే స్ఫూర్తి నిచ్చిందని విజ్ఞుల అభిప్రాయం.

యక్షుడు తన భార్యనెలా సంబోధించాలో సందేశవాక్యాలకెలా ఉపోద్ఘాతం ఇవ్వాలో చెబుతాడు. తరువాత ఆమెకీ మేఘుడు నిజేంగా తన భర్తనుండి వచ్చినవాడేనని విశ్వాసం కల్గించేట్లున్న శ్లోకం అందమైంది.

**"శబ్దాఖ్యేయం యదపి కిలతే యః సఖీనాం పురస్తాత్**
**కర్ణేలోలః కథయితు మభూదానన స్పర్శలోభాత్ ।**
**సోఽ తిక్రాన్తః శ్రవణవిషయం లోచనాభ్యామదృష్టః**
**తాముత్కణ్ఠా విరచిత పదం మన్ముఖే నేదమాహ ॥"** (2-40)

అంటే "ఏ నీ ప్రియుడు (పూర్వం) చెలికత్తెల ఎదుట చెప్పదగిన విషయమే అయినా నీ ముఖాన్ని స్పృశించాలనే లోభంతో – 'రహస్యం' అనే నెపంతో చెవిలో చెప్పేవాడో ఆ నీ ప్రియుడు (ఇప్పుడు) చెప్పినా వినబడనంత, కంటికి కనిపించేనంత దూరంలో ఉండి ఉత్కంఠంతో నీతో చెప్పవలసిన మాటలను నాముఖంగా పలుకు తున్నాడు (విను)" అని అర్థం.

ఇక సందేశ వాక్యాలు. యక్షుడు తన భార్యకు తన మాటలుగా చెప్పుమన్నవి "ప్రియంగులతల్లో నీ శరీర సౌకుమార్యం, భీతహరిణాల్లో

నీచూపుల్నీ, చంద్రునిలో నీ శరీరఛాయను, నెమిలిపింఛాల్లో నీ కేశాల్నీ, చిన్ని నదీ తరంగాల్లో నీ కనుబొమల ఒయ్యారాన్నీ చూస్తున్నాను. అయితే ఓ చండీ ! నీ సమగ్రమైన పోలిక నాకెక్కడా కనిపించేటం లేదం"టాడు. ఇలా ఒకొక్క అందానికి ఒకొక్క వస్తువును చెప్పటం వల్ల ఆమె కినుకతో "అయితే మీకిన్ని ఉన్నాయిగా ఇక నేనెందుకు ?" అని అన్నట్లు తనే భావించుకొని "చండీ!" అని సంబోధిస్తాడు. "ఓ కోపిష్ఠిదానా! అనేదిక్కడ వాచ్యార్థంలో కాక శృంగార ప్రవృత్తితో ముద్దుగా సంబోధించేటం! మేఘుడు తన దీనావస్థను చెప్పే ఈ శ్లోకం ఎంతైనా రమణీయమైంది:

**"త్వామాలిఖ్య ప్రణయకుపితాం ధాతురాగైశ్శిలాయా**
**మాత్మానం తే చరణ పతితం యావదిచ్ఛామి కర్తుమ్।**
**అస్రైస్తావన్ముహురుపచితైర్దృష్టిరాలుప్యతేమే**
**క్రూరస్త స్మిన్నపి న సహతే సఙ్గమం నౌ కృతాన్తః॥"** (2-42)

యక్షునికి అతని భార్యపై కల ప్రేమకు, అతడనుభవించిన విరహ వ్యథకు దర్పణం పడుతుందీ శ్లోకం. ప్రేయసీ ప్రియులు వియోగంలో ఒకరి చిత్రపటాన్ని మఱొకరు చూస్తూ కాని, చిత్రకారులైతే- ఒకరి చిత్రాన్ని మఱొకరు చిత్రించుకొంటూ కాని కాలక్షేపం చేయటం పరిపాటి. యక్షుడు అరణ్యంలో లభ్యమయ్యే గైరికాది ధాతువుల్తో వర్ణాల్ని తయారు చేసికొని శిలా ఫలకంపై చిత్రించే పూనుకొన్నాడు. ఏం చిత్రించేలనుకొన్నాడు ? ప్రణయకుపిత అయిన తన భార్య చిత్రాన్ని. 'ప్రణయకోపం'లో ఆమె భంగిమ అతనికత్యంత ఇష్టమైంది. అలా చిత్రించి ఆమె కోపోపశమనానికి తనను ఆమె పాదాలపై వ్రాలిన వాణ్ణిగా చిత్రించే సంకల్పించి తద్భావనా భావితాంతఃకరణుడయ్యేటంతలో గతస్మృతులు జ్ఞప్తికి వచ్చి భావావేశానికి



వశుడై అవిరళంగా కన్నీరు ముంచుకొని వచ్చి అతని దృష్టి నడ్డి అతని చేత చిత్రరచనను పూర్తిచేయించింది కాదు. ఇలా విఫల మనోరథుడై - "కఠినమైన దైవం మన సామీప్యాన్ని చిత్రంలో కూడా సహించేలేక పోతోంద"ని దైవాన్ని నిందిస్తున్నాడు. అహో! కాళిదాసు భావ శబలత !

తరువాత యక్షుడు తన దీనావస్థకు ప్రకృతి కూడా కరిగి పోతోందని చెబుతాడు. "కలలో ఏదో విధంగా లభించిన నీ బిగి కౌగిలింత కారణంగా శూన్యంలో చేతుల్ని చాపిన నన్ను చూస్తున్న వనదేవతల కన్నీటిబొట్లు చిగురుటాకులపై పడుతున్నాయం"టాడు.

దక్షిణానిలం వీచింది. గాలికి దేవదారు వృక్షాల చివురు మూలాలు చిట్లి వాటిలోంచి పాలు కారేయి. ఆ పాలకో సువాసన ఉంటుంది. ఆ సువాసనతో కూడిన గాలి హిమాద్రిపై వీస్తోంది. "ఆ గాలి నీ వద్ద నుండి ఇక్కడకు వస్తోంది కనుక మొదట నిన్ను స్పృశించి ఉంటుంది కనుక నాకు పరమ ప్రీతిని కలిగిస్తూ నా పరిష్వంగాన్ని పొందుతోంద"ని తన భార్యకు వర్తమానం పంపేడు. ప్రేయసి స్పర్శనొందిన ఏ వస్తువైనా అది చైతన్యవంతమైనా జడమైనా కూడా ప్రియునికి అపురూపమైందే ! తద్భావనా భావితాంతఃకరణ యోగ్యత ఎవరికుంటుందో వారే నిజమైన ప్రణయప్రవృత్తి కలవారు. తదితరులు మహా అయితే కాముకులౌతారు కాని ప్రేమికులు కారు. ప్రణయ శబ్ద బాహిరులు వారు. అంతటి గాఢ భావనాశక్తి కో విలక్షణ సంస్కారం అవసరం. అది ఏ కొద్దిమందికో కాని ఉండదు. లోకంలో ఇంతటి మనస్విత కల్గిన వారే 'నిసర్గ సంస్కారులు.' తక్కినవారు 'నిత్య సంసారులు'.

"కంటికి కునుకు రాక, రాత్రి ఒకొక్క జాము ఎంతో నిడివైందిగా తోస్తుంటే దాన్ని క్షణకల్పంగా ఎలా చేయగలం? పగలు భిన్న భిన్న అవస్థల్లో

ఉన్నా ప్రతి క్షణం ఏ పని చేస్తున్నా నీ తలపే మనస్సునంతా ఆవరించి దుఃఖాన్ని రేకెత్తిస్తుంటే, దీని నుంచి బయటపడి ఈ తాపాన్నేవిధంగా 'సహ్యం' చేసికో గలననే తపన! ఇవి తీరని కోర్కెలు. ఈ కోర్కెలతో విరహవేదన మఱింత తీవ్రమై ఆశ్వాసించే దిక్కు(నీవు) లేక అనాథైపోయింది. తప్పదు కనుక నన్ను నేనే సమాధాన పఱచుకొంటున్నాను. కళ్యాణీ! నువ్వు కూడా ఎక్కువగా భయపడకు ఎవరికీ ఎప్పుడూ సుఖమే కాని, ఎప్పుడూ దుఃఖమే కాని ఉండవు కదా ! ఈ సుఖ దుఃఖావస్థ చక్రధారవలె క్రిందికీ, మీదకీ వెడుతూ ఉంటుంది."

ఇక వారి శాపాంతాన్నీ పునస్సమాగమాన్నీ సూచించే శ్లోకం :

***"శాపాన్తోమే భుజగశయనాదుత్థితే శార్జ్గ పాణౌ***
***శేషాన్మాసాన్గమయ చతురో లోచనే మీలయిత్వా।***
***పాశ్చాదావాం విరహగణితం తంత మాత్మాభిలాషం***
***నిర్వే క్ష్యావః పరిణత శరచ్చన్ద్రికాసు క్షపాసు ॥"*** (2-47)

"శ్రీ మహావిష్ణువు శేషాశయ్యనుండిననాడు నాకు శాపాంత మౌతుంది. మిగిలిన ఈ నాల్గునెలలూ కళ్లు మూసికొని గడుపు. తర్వాత మనమిద్దఱం వియోగ వేళలో భావించిన స్వీయ మనోరథాల్ని పండిన శారద చంద్రికా రాత్రుల్లో అనుభవిద్దాం" ఇదీ దీని అర్థం. కార్తిక శు ద్ధైకాదశి శాపాంత దినం. మేఘునితో యక్షుడు సందేశాన్నంపింది ఆషాఢ శుద్ధ పాడ్యమి. సరిగ్గాచెప్పాలంటే ఆనాటికి నాలుగు నెలల పదునొకండు దినాలున్నట్లు, ఆ పదునొకండు దినాల మాట చెప్పకుండా నాలుగు నెలలే అంటాడేమిటని ప్రశ్నించేటం సహృదయ లక్షణమనిపించుకోదు. ఎందుకంటే కావ్యంలో గణనీయమైంది హృదయపు 'లోతు' కాని 'లెక్క'



కాదు. పోనీ అలా చూసుకున్నా అవి నెలలో సగం కంటే తక్కువ కనుక నాలుగు నెలలు గానే పరిగణించినట్లు పరిష్కరించేవచ్చు. లేదా ఆ పదిరోజులు మేఘుడిక్కడనుంచి అక్కడికి వెళ్ళటానికి పట్టవచ్చు. వియోగంలో సంయోగసిద్ధి కలిగినప్పుడు జేరుపబోయే వేడుకల గుఱించి కలలు కనటం, ఊహించుకోవటం విరహులకు పరిపాటే. నూతనంగా గృహస్థాశ్రమం స్వీకరించిన దినాలు జ్ఞప్తికి తెచ్చుకొంటే ఏ దంపతులకైనా ఇందులో నిజేం తెలుస్తుంది. యువదంపతులకు ఈ అనుభవం నిత్యం. ఉద్యోగధర్మాల్ని, నిర్వర్తిస్తూ వరుడు, గృహకృత్యాల్లో నిమగ్నయై వధువూ రాత్రికోసం నిరీక్షించేటం "రాత్రిసహచరుణ్ణి (సహచరి)ని ఈ విధంగా అలరిస్తా"నను కోవటం సాధారణమైన విషయం. వయసు మళ్ళిన దంపతులు సైతం 'ఆ' దినాలు స్మృతి పథంలో మెదిలినప్పుడు మధురోహలతో ముచ్చేట పడటమూ ఎవరికైనా అనుభవ విరుద్ధం కాదు. అందునా ఈ సన్నివేశంలో దీర్ఘకాల వియోగానంతరం కలుగబోయే సంయోగసన్నివేశాన్ని సంయోజించేటం సమంజసమే ! ఆ రాబోయే సంయోగకాలం యక్షదంపతులకెంతో సానుకూలమైంది కూడా! ఎందుకంటే ఈ దంపతుల సమాగమం జరుగనుంది శారద రాత్రుల్లో. శరత్కౌముది వారి నలరింపబోతోంది. ఆ రాత్రుల సొగసును "శారదరాత్రులుజ్జ్వల లసత్తర తారక హార పంక్తులన్ చారుతరుంబులయ్యె" నంటూ ఆంధ్రుల ఆది కవి నన్నయ్యగారు వర్ణించారు. ఆశ్వయుజ కార్తిక మాసాలు శరదృతువు. ఈ శరదృతువులో ఆకాశం నిర్మలమై చంద్రుడు శారద సుషమాదీధితులీనుతూ సర్వప్రాణులకూ పరమాహ్లాదాన్ని చేకూర్చుతాడు. ఇక వియోగానంతరం కలిసిన ప్రణయుల విషయంలో

ప్రత్యేకంగా చెప్పవలసినదేముంటుంది ? ఇంతటి భావాన్ని "పరిణత శరచ్చన్ద్రికాసు క్షపాసు" అని ముచ్చేటగా ముద్దులొలికే మూడు మాటల్లో చెప్పటం మహాకవికే చెల్లింది.

ఆ తరువాతి శ్లోకంలో యక్షుడు తనభార్యతో కలిసి ఉన్నప్పటి ఒక సన్నివేశాన్ని మేఘునితో చెప్పేడు. ఇది చెప్పటం వల్ల మేఘుడు నిజేంగా తన భర్త పంపిన వార్తాహరుడేనన్న నమ్మకం యక్షపత్నికి కలుగుతుంది. ఎందుకంటే ఇది వారిరువురికి మాత్రమే తెలిసిన రహస్యం కనుక ! అదేమంటే – "ఇదివఱకొకసారి నువ్వు నా కంఠాన్ని కౌగిలించుకొని నిద్రిస్తూ కూడా ఎందుకో హఠాత్తుగా ఎలుగెత్తి ఏడ్చావు. ఎందుకేడుస్తున్నావని చేలాసార్లడిగిన నాతో "మోసగాడా ! నువ్వెతితోనో రమిస్తూ నాకు కలలో కనిపించావ"ని మందహాసంతో పలికేవు ఈ సన్నివేశం వాల్మీకి రామాయణంలో రామునికి హనుమంతునితో ప్రతి సందేశం పంపిన ఘట్టంలో సీతారాములకు తప్ప ఇంకెవరికీ తెలియని కాకాసుర వృత్తాంతాన్ని స్ఫురింపచేస్తుంది.

ఇలా చెప్పిన తర్వాత యక్షుడు తన సందేశంలో లోకంలో వియోగం వల్ల స్నేహం నశిస్తుందనే ప్రవాదం ఉంది. ఎందుకో తనకా వాదం రుచించేటం లేదంటాడు. స్త్రీ పరుషుల విషయంలో వ్యక్తులు దూరం కావటం వల్ల నూతన పరిచయాలేర్పడి, పాతవారిని మఱచిపోవటం కాముకులపట్ల నిజేమైతే కావచ్చు కాని ప్రేమికుల పట్ల కాదు.

నిజేంగా ప్రేమఉన్నచోట అనుభవ రాహిత్యం రాగాన్ని మఱింతగా వృద్ధిచేసి అంతకు ముందున్న ప్రేమ ఒక పెద్దమోపెడంత అవుతుందని తన స్వీయానుభవాన్ని తెలిపి, తన పట్ల విశ్వాసాన్ని కోల్పోవద్దని అర్థిస్తాడు.



**అభోగాత్ – ఇష్టే వస్తున్యుపచిత రసాప్రేమరాశీ భవన్తి**. (ఉ.మే. 49) అనే అర్థాంతరన్యాసంతో తన వాదనను సమర్థించుకొన్నాడు యక్షుడు.

"తొలి వియోగంతో మిక్కుటమైన దుఃఖభారాన్ననుభవిస్తున్న నీ నెచ్చెలి నీ విధంగా ఊఱడించి నందీశ్వరుడు భేదించిన కైలాసపర్వతం నుంచి ఆమె ఇచ్చే అభిజ్ఞానంతో కూడిన క్షేమవార్తను తెచ్చి నా శిథిల జీవితాన్ని కూడా నిలుపు."మని యక్షునియాచన.

తన భార్యకు చెప్పవలసిన మాటలు పూర్తైన తరువాత ఆమెనుండి అభిజ్ఞానంతో తిరిగి రమ్మనటంలో కూడా సీతాదేవి హనుమంతుని కిచ్చిన చూడామణి కాళిదాసు మనసులో ఉండి ఉండాలి.

చెప్పవలసిన దంతా చెప్పిన తర్వాత మిత్రమా ! నా మాట మీద ఈ పని చేసి పెడతావు కదా ! నువ్వు అంగీకరించానని చెప్పటం నీ ఔన్నత్యానికి భంగం. చాతక పక్షులు నీ నుండి నీటినాశిస్తే వాటికెటువంటి సమాధానం చెప్పకుండానే నీటిని ప్రసాదించి వారి అభీష్టాన్ని తీరుస్తున్నావు. ఇష్టుల కిష్టమైన కార్యాచరణే సత్పురుషుల సమాధానం. యక్షుడు మేఘునితో భార్యకు సందేశాన్ని పంపుతూ అందులో ఎంతటి అసంగత్వం ఉందో "**ముందే ధూమజ్యోతి స్సలిల మరుతాం**" ఇత్యాది శ్లోకంలో చెప్పి యక్షకృత్యాన్ని "**కామార్తాహి ప్రకృతి కృపణాశ్చేతనా చేతనేషు**" అనే వాక్యంలో సమర్థించాడు కవి. ఇపుడు యక్షుడు చెప్పిన దానికి మేఘుడేం సమాధానం చెబుతాడు ? ప్రాణిఅయితే కదా సమాధానమివ్వటానికి ! దాన్ని – మహాకవి కనుకనే కాళిదాసు ఎంతో చాక చక్యంగా యక్షుని మాటల్లో "నేను చెప్పిన పని చెస్తానని నువ్వు నాకు మాట ఇవ్వనక్కఱ లేదు అలా చెప్పటం నీ ధీరత్వానికి భంగం. సమాధానం చెప్పకపోయినా మిత్రకార్యాన్ని నువ్వు

చేపడతావని నాకు తెలుసు. సత్పురుషుల ప్రవృత్తి చేతలే కాని మాటలు కావు" అనే అర్థంలో కూడా "**ప్రత్యుక్తం హి ప్రణయిషు సతామీప్సితార్థ క్రియైవ**". అనే అర్థాంతర న్యాసంతో బహుసొగసుగా చెప్పేడు కాళిదాసు.

చివరి ముక్తా యింపుగా యక్షుని నోటితో మఱొకసారి తన కార్యసిద్ధికై మేఘుని పొగుడుతూ కావ్యానికి మంగళం పలుకుతున్నాడు మహాకవి.

**"ఏతత్కృత్వా ప్రియమనుచిత ప్రార్థనావర్తినో మే**
**సౌహార్ద్రాద్వా విధుర ఇతి వా మయ్యనుక్రోశబుద్ధ్యా ।**
**ఇష్టాన్దేశాన్ విచర జలద ప్రావృషా సంభృత శ్రీ**
**ర్మాభూదేవం క్షణమపిచ తే విద్యుతా విప్ర.యోగః ॥"** (2-52)

స్నేహంతోకాని, వియోగినినే దయతో కానీ, నీ అంతటివాడు చేయవలసిన పనికాకపోయినా నాకీ ప్రీతిని కలుగజేసి వర్షర్తు శోభాయుక్తుడవై ఇచ్ఛేవచ్చిన ప్రదేశాల్లో సంచరించు. నీకు నీ సౌదామినితో నావలె క్షణకాలమైనా వియోగం కలుగకుండుగాక అని ఈ శ్లోకార్థం.

"**మఙ్గలాదీని మఙ్గల మధ్యాని మఙ్గలాన్తాని శాస్త్రాణి ప్రథన్తే**" అనే ఆ భాణకాని కనుగుణంగా కథావస్తునురూపమైన మంగళం చేయటంలో కవి ప్రతిభ ద్యోతకమౌతోంది. శృంగార సర్వస్వమనదగిన అమరుక శతకంలోని మంగళాది శ్లోకాల్లో –

"**తత్త్వాం పాతు చిరాయ కిం హరిహరబ్రహ్మాదిభిర్దేవతైః**" అంటాడు. అంటే – అట్టి నాయిక నిన్ను రక్షించుగాక ! త్రిమూర్తులతో పనేమి ? అని అర్థం. ఈ మేఘదూతం విప్రలంభ శృంగార ప్రతిపాద్య ఖండకావ్యం. కనుక ప్రియావిరహం పగవానికి కూడా వద్దనే సూక్తిని చెబుతూ, ఇందులో



తన విధిలో ఏమఱుపాటు చూపినందువల్ల (**స్వాధికార ప్రమత్తః**) కలిగిన అనర్థం కనుక, "**ప్రావృషా సంభృతశ్రీః**" అనే పదప్రయోగంలో నీ విధిని నీవు నిర్వర్తింపుమని ధ్వన్యాత్మకంగా ప్రబోధించాడు. కర్తవ్య నిర్వహణ దక్షతతో సాగిననాడు ఆనందం కరతలామలకమౌతుందనే ఉపదేశాన్ని కాంతాసమ్మితంగా రసనిర్భరతతో వెలార్చాడు.

# కిరాతార్జునీయమ్



కిరాతార్జునీయం భారవి అనే మహాకవి వ్రాసింది. భారవి కవిత్వం 'నారికేళపాక' మని ప్రసిద్ధి. 'ద్రాక్షాపాకం' లా వెంటనే ఆస్వాదయోగ్యం కాక కొంత పరిశ్రమ చేయాలి. పేరుకు తగ్గట్టే ద్రాక్షారసాన్ని నోట్లో వేసికొంటే చాలు. మఱి నారికేళం కొబ్బరికాయ కొట్టి ముక్కలు తీస్తేనే కాని – అంటే కాస్త శ్రమపడితే కాని ఆ రుచి అనుభూతం కాదు.

**ఉపమా కాళిదాసస్య భారవే రర్థగౌరవమ్।**

**దణ్డినః పదలాలిత్యం మాఘే సన్తి త్రయోగుణాః ॥**

అనే ఆభాణకాన్ననుసరించి భారవిలో అర్థగౌరవం, కావ్యంలో కొంచెం ప్రౌఢీ ఉంటాయి. కాళిదాసత్రయాన్ని పఠించిన తదుపరి విద్యార్థికి భాషపై ఒకింత స్వాతంత్ర్యం సమకూరుతుంది కనుక భారవిని చేదవటానికి అధికారం సిద్ధిస్తుంది. పైగా చరిత్రో, శృంగారేతివృత్తమో కాక రాజనీతి ఇందులో ప్రస్తావనాంశం కనుక మేధకు మెఱుగులు దిద్దుకొనే అవకాశం లభిస్తుంది. కావ్యంలో అంగిరసం వీరమై, శృంగారం అంగరసంగా ఒదిగి ఉంటుంది.

ఈ మహాకవి భారవి 6వ శతాబ్ది ఉత్తరార్ధంలో జీవించినట్లు విమర్శకుల అభిప్రాయం. ఏడవ శతాబ్ది ఆరంభంలో కొంతకాలం జీవించి ఉన్నట్లు తలుస్తున్నారు. ఈయన దాక్షిణాత్యునిగా పెద్దల నిర్ణయం. ఆంధ్రుడు కావటానికి కూడా అవకాశం లేకపోలేదు. ఈ కవిని గూర్చి ఒక ఆసక్తికరమైన కథ ప్రచారంలో ఉంది. భారవి బాల్యంలోనే కవిత్వం చెప్పటం ప్రారంభించి యౌవన ప్రాదుర్భావ సమయానికే మంచి కవిగా ప్రసిద్ధినొందేడు. వారి ఊళ్లోని వారంతా భారవి తండ్రి వద్దకు వచ్చి భారవిని ఎంతగానో ప్రశంసిస్తూ ఉంటే తండ్రి మాత్రం వారి ప్రశంసలను చాలా తేలిగ్గా తీసి పాఱవేస్తూ ఉండేవాడట! ఇది భారవి ప్రత్యక్షంలోనే

జేరిగేటప్పటికి అతడు నొచ్చుకొన్నాడు. ఆ నొచ్చుకోవటం క్రమేపీ క్రోధంగా మారింది. అప్పటికి తన కవిత్వాన్ని మెచ్చేనివాడు తన తండ్రి తప్ప ఇంకొకడెవడూ లేడు. కనుక తండ్రి పోతే అంతా తనకు బ్రహ్మరథం పట్టే వాళ్ళే ఉంటారు. తండ్రి మరీ అంత వృద్ధుడేమీ కాడు, త్వరగా దేహయాత్ర చాలించేటానికి. కనుక ఆయనను హతమారిస్తే ఇక తనకు ఎదురు లేదు. ***"క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః స్మృతి భ్రంశాత్ బుద్ధినాశః ...'*** అన్నట్లుగా బుద్ధినాశం కలిగి తండ్రినే హతమార్చటానికి పూనుకొన్నాడు. ఒక పెద్ద బండరాయిని అటకపై సిద్ధం చేసికొని రాత్రి ఆయన పడుకోవటానికి ఆ గదిలోనికి వచ్చినప్పుడు దాన్ని ఆయనపై వేసి అంతమొందిద్దామని పథకం వేసికొన్నాడు.

ఆ రాత్రి భోజనాలైన తరువాత తల్లి తండ్రులిద్దఱూ పడకగది లోకి వచ్చారు. భారవి ఎవరికీ తెలియకుండా రహస్యంగా అటకపై చేతిలో ఱాతి నుంచుకొని అదనుకోసం నిరీక్షిస్తున్నాడు. ఇంతలో అతని తల్లి భర్తతో "ఏమండీ! మన అబ్బాయి చక్కగా కవిత్వం చెబుతున్నాడు కదా! ఊరంతా ముక్త కంఠంతో వాణ్ణి ఎంతగానో ప్రశంసిస్తుంటే మీరు మాత్రం చులకనగా మాట్లాడటం ఏమంత బాగుంటుందండీ! చిన్నవాడి మనస్సు చివుక్కుమనదూ!" అంది. పై నుండి భారవి వారి సంభాషణ వింటున్నాడు. తండ్రి "పిచ్చిదానా! మనవాడెంత గొప్పకవో ఆ పొగిడే వాళ్ళందఱి కంటె నాకే ఎక్కువగా తెలుసు. అయితే తల్లిదండ్రులు తమ పిల్లల్ని పొగిడితే వారికి ఆయుఃక్షీణం. అందుకే వారితో తేలిగ్గా మాట్లాడుతాను. కాని మనవాడెంతటివాడో నాకు తెలియక కాదు". ఆ మాటలు చెవిన పడటంతో అటకపైనున్న భారవికి తానెంతటి ఘోరపాపానికి తలపడ్డాడో అర్థమై ముచ్చెమటలు పట్టేయి. అమాంతం పైనుండి దూకి తండ్రి పాదాలపై పడి తానెంత కిరాతకానికి పూనుకొన్నడో తండ్రికి చెప్పి తనకు తగిన శిక్ష



విధించవలసిందని ప్రాధేయపడ్డాడు. తండ్రి నిశ్చేష్టుడై క్షణకాలం అలాగే ఉండిపోయి "పోనీలే... నీకు పశ్చాత్తాపం కలిగిందిగా! పశ్చాత్తాపంతో సర్వపాపాలు నశిస్తాయి, క్షమించాను.. ఇక వెళ్ళు." భారవి తన పట్టు వీడలేదు. "ఏమైనా సరే మీరు నాకొక శిక్ష విధించాలి. నేను అనుభవించి తీరాలి. శిక్షననుభవించినప్పుడే నా పాపానికి నిష్కృతి" అన్నాడు. తండ్రి "అయితే నీ భార్యతో అత్తవారింట్లో ఆర్నెల్లుండిరా! ఇదే నేను నీకు విధించే శిక్ష"! అన్నాడు. అల్లుడు అత్తవారింట ఉంటే ఎంతో గౌరవంగా చూస్తారు కదా అది శిక్ష ఎలా అవుతుంది అని అనుకొన్నా, తండ్రి చెప్పినట్లు చేయాలని భార్యను తీసికొని అత్తవారింటికి పయనమై పోయాడు. అత్తవారింట్లో ఒక వారం దినాలు దేవేంద్ర భోగాలనుభవించాడు. పైగా క్రొత్తల్లుడాయె! క్రమంగా చిన్న చిన్న పనులు పురమాయించేటం ప్రారంభించి పొలం దున్నే దాకా అతని స్థితిని దిగజార్చారు, "మన పనులు మనం చేసికోవటంలో తప్పేముంద"ంటూ! నిశ్శబ్దంగా భరిస్తున్నాడు భారవి. ఇంతలో ఏ శ్రావణ మంగళవారం వంటి నోమో వచ్చి భారవి భార్య ఆమె తల్లితండ్రుల్ని డబ్బడిగింది. "ఇదిగో అమ్మాయ్! పెళ్ళి చేసేంతవఱకే నీకు కావలసినవి ఇవ్వటం మా వంతు. ఇప్పుడు నీ బాధ్యతంతా మీ ఆయనదే వెళ్ళి నీ మొగుణ్ణడుగు". మాసిన చీర కట్టి అవమానం ఉట్టిపడుతుంటే భర్తనడిగింది. ఆయన దగ్గఱ మాత్రం డబ్బెక్కడిది? ఆలోచించి ఒక తాటి ఆకుపై ఏదో వ్రాసి ఇచ్చి "సెట్టిగారికిది ఇచ్చి నీకు కావలసిన సామగ్రి తెచ్చుకో". ఆమె ఆ తాటాకు తీసికొని వెళ్ళి సెట్టిగారికిచ్చింది. కావలసిన నోము సామగ్రి ఆయన ఇవ్వటంతో ఆ పబ్బం తీరింది. సెట్టి ఆ తాటాకును పై చూరులో పెట్టేడు. గడువు తీరటంతో భారవి భార్యతో స్వగృహం చేరేడు. సెట్టి తన వ్యాపారం నిమిత్తం ఓడనెక్కి విదేశాలకు వెళ్ళేడు.

పాతికేళ్ళు గడచిపోయాయి. సెట్టి బయలుదేరిన ఓడ త్రోవలో బ్రద్దలయి, ఆయన నానా అవస్థలూ పడి ఒక నాటి అర్ధరాత్రి ఇల్లుచేరేడు. తలుపు కొడితే వెంటనే ఎవరూ వచ్చి తలుపు తీయలేదు, గాఢ నిద్రలో మునిగి ఉండటం వల్ల. సెట్టి కిటికీ లోంచి లోపలికి చూచాడు. తన భార్య పక్కన ఒక యువకుడు పడుకొని ఉన్నాడు. కోపం భగ్గుమంది. బొడ్డులోంచి కత్తితీసేడు విసరి చంపటానికి. చేయి ఎత్తటంలో ఆనాడు భారవి వ్రాసి ఇచ్చిన తాటాకు క్రిందపడింది. గ్రుడ్డిదీపంలో దాన్ని ఒకటికి రెండుసార్లు చేదివికొన్నాడు. **'సహసా విదధీత న క్రియామ్"** అని వ్రాసి ఉంది. అంటే – తొందర పడి ఏపనీ చేయకూడదని అర్థం. సెట్టి తనను తాను తమాయించుకొని భార్యను లేపి కోపంతో "ఎవడువీడు?" అని అడిగేడు. అదేమిటండీ! మన అబ్బాయేకదా! మీ రిల్లు వదలి వెళ్ళేనాటికి నేను గర్భవతిని కదా! ఆ తరువాత మీ ఉనికేమీ తెలియలేదు.. నా పసుపు కుంకుమ బలం వల్ల ఇన్నేళ్లకైనా తిరిగి వచ్చారు. నేను నోచిన నోములు ఫలించాయి. అని ఆనంద బాష్పాలు రాల్చింది. సెట్టిగారు కవీంద్రుని తాళపత్రం వల్ల తన కుటుంబం అంతా చల్లగా ఉందని వెంటనే భారవిని పిలిపించి అక్షర లక్షలిచ్చి సన్మానించాడు. ఈలోగా తన స్వగృహంలో కిరాతార్జునీయ కావ్యాన్ని రచించాడు భారవి.

అర్థగౌరవంతో కూడిన రచన భారవిది. 'అర్థగౌరవం' అంటే అల్పాక్షరాల్లో అనంతార్థాన్ని స్ఫురింప చేయటం. 'భారవి' అనే పదానికి 'సూర్యుని కాంతి' అని అర్థం. మహాకావ్యాలు వ్రాసి ప్రఖ్యాతి నొందిన కవులు కూడ తమకావ్యాల్లో వారి పేరైనా చెప్పికోలేదు. అంతటి మహోన్నతమైన సంస్కృతి మన భారతదేశానిది. అనంతరం వచ్చిన కవులు తమకు ప్రాచీనులైన వారిని స్మరించేటం చేత ఆ ఆగ్రంథాల కవులు వారని మనకీనాడు తెలుస్తోంది.



ఇక కావ్య విషయానికి వస్తే 18సర్గలతో 1050 శ్లోకాలతోఉన్న మహా కావ్యం కిరాతార్జునీయం. మాయాజూదంలో పాండవులు పరాజయం పాలై నియమానుసారం పండ్రెండేళ్లరణ్యవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసం చేసేరన్న విషయం అందరికీ తెలిసిందేకదా! వారు అరణ్యవాసం చేస్తున్న సమయంలో అక్కడ దుర్యోధనుని పాలన ఏ విధంగా ఉందో? ప్రజలతని పట్ల సుముఖులుగా ఉన్నారో లేక విముఖులై ఉన్నారో తెలిసికొని రమ్మని ధర్మరాజు ఒక వనేచరుని గూఢచారిగా పంపుతాడు. ఆ వనేచరుడు మారు వేషంలో బ్రహ్మచారిగా వెళ్ళి దుర్యోధనుని పరిపాలనా విషయాలను, అతని వైఖరినీ తెలిసికొని సమగ్రంగా ధర్మజునికి నివేదిస్తాడు. ప్రజలు దుర్యోధనుని పట్ల అనురక్తులై ఉన్నారని తెలిసికొన్న పాండవులు వారి భవిష్యత్కార్య ప్రణాళికను యోచిస్తారు. ద్రౌపది, భీముడు వనవాసాజ్ఞాత కాలం పూర్తి అయ్యే దాకా ఆగితే దుర్యోధనుడు మరింత బలవంతుడై అజేయుడయ్యే ప్రమాదం ఉందనీ, కనుక వెంటనే అతనిపై దండయాత్ర చేయటమే సరైన పద్ధతి అనీ సూచిస్తారు. ముక్కగా ఉన్నప్పుడు పీకి వేయటం తేలికని, మ్రానైన తరువాత వంచేలేమనీ ఉద్ఘోషిస్తారు. ధర్మజుడు అవేశంతో ప్రవర్తించే రాదని, తొందరపడి ఏ కార్యం చేయరాదని, అలాచేస్తే ఆపదల పాలై పోతామని హితువు పలుకుతాడు. ఆ సందర్భంలోనే

*"సహసా విదధీత నక్రియామవివేకః పరమాపదాం పదమ్।*
*వృణుతేహి విమృశ్య కారిణం గుణలుబ్ధా స్వయమేవ సంపదః ॥ " (2-30)*

తొందరపడి ఏ పనీ చేయకూడదు. వివేకంలేక, అంటే బాగా ఆలోచించేక చేసిన పని మహాపదలకు మూలమౌతుంది. వివేచన చేసి పనులు చేసే వాణ్ణి గుణాలపట్ల ప్రీతి కలిగిన సంపదలు తమంత తామే వచ్చి చేరుతాయని అర్థం. భారవి స్వానుభవంతో చెప్పిన ***"సహసావిదధీత నక్రియామ్"*** అన్నమాటే ఆనాటి సెట్టిగారి ఇంటిని నిలబెట్టటమేకాక ఈ కావ్యానికి మూలసూత్రమై భాసిస్తోంది.

ఇంతలో శుభపరంపర ప్రదాత అయిన పరాశరాత్మజుడక్కడికి వచ్చి పాండవుల ధర్మ నిశ్చిత బుద్ధిని ప్రశంసిస్తూ శక్తిని సముపార్జించుకోవాలని ప్రబోధిస్తాడు. శక్తి సముపార్జనకు ఒక మంత్రాన్ని పార్థునికి ఉపదేశించి అంతర్హితుడౌతాడు. ద్రౌపది పార్థుని తపస్సుకై ప్రబోధించి పంపుతుంది. పార్థుడు పాశుపతాస్త్ర సిద్ధికై ఘోరమైన తపస్సు చేసి ముక్కంటిని మెప్పించి ఇష్టార్థసిద్ధినొందుతాడు. సూక్ష్మంగా ఇదీ ఈ కావ్యేతి వృత్తం. దీనిని ఎక్కడా విసుగనేది కలిగించేక ఉత్కంఠను పెంపొందిస్తూ వ్రాయటంలో భారవి పనివానితనం ప్రత్యక్షమౌతుంది.

46 శ్లోకాలతో ఉన్న ప్రథమసర్గ ధర్మజుడు పంపిన వనేచరుని రాకతో ప్రారంభమౌతుంది.

*శ్రియః కురాణామధిపస్యపాలనీం*
*ప్రజాసు వృత్తిం యమ యుఙ్క్త వేదితుమ్ ।*
*స వర్ణిలిఙ్గీ విదితస్సమాయయౌ*
*యుధిష్ఠిరం ద్వైతవనే వనేచరః ॥*

ఇది కావ్యం ప్రథమశ్లోకం. ***"మఙ్గలాదీని మఙ్గలమధ్యాని మఙ్గలాన్తాని కావ్యాని ప్రథన్తే"*** అనే నానుడిననుసరించి మంగళార్థకమైన "శ్రియః" శబ్దంతో కావ్యానికి శ్రీకారం చుట్టేడు భారవి. ***"ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశోవాపి తన్ముఖమ్"*** అనే నియమానుకూలంగా వస్తునిర్దేశాత్మక మంగళాచరణ చేసేడు. పాండవులు ద్వైతవనంలో కాలక్షేపం చేస్తున్న సమయంలో దుర్యోధనుని రాజ్య సంపదను, ప్రజలపట్ల అతడనుసరించే విధానాన్నీ తెలిసికొని రమ్మని యుధిష్ఠిరుడు పంపిన వనేచరుడు బ్రహ్మచారి రూపంలో విషయసంగ్రహణం చేసి వచ్చి యుధిష్ఠిరుని కలిసికొన్నాడని అర్థం.

ఆ వనేచరుడు ధర్మరాజు అనుజ్ఞను పొంది, తాను చెప్పేది ప్రియమైనా కాకపోయినా తాను క్షంతవ్యుణ్ణనీ, ఎందుకంటే



భృత్యులెప్పుడూ చారచక్షువులైన ప్రభువును వంచించేరాదనీ, పైగా లోకంలో హితమూ, ప్రియమూ అయిన మాట దుర్లభమనీ చెబుతాడు.

*క్రియా సు యుక్తైర్నృపచార చక్షు షో*
*నవఞ్చనీయాః ప్రభువోఽను జీవిభిః ।*
*అతోఽర్హసి క్షన్తు మసాధు సాధువా*
*హితం మనోహారిచ దుర్లభం వచః ॥ (1-4)*

"దుర్యోధనుడు సింహాసనాన్నధిష్ఠించి ఉన్నా వనవాసులైన మీ నుండి పరాభవాన్ని శంకిస్తూనే ఉన్నాడు. కపట జూదంలో మీ నుండి పొందిన భూమిని నీతితో జయించాలని భావిస్తున్నాడు. మీకంటె ఉన్నతుడు కావాలనే కోర్కెతో మిమ్మల్ని ప్రజలు మఱచిపోయేట్లు ప్రవర్తిస్తున్నాడు. నీచులతో స్నేహం కంటె సత్పురుషులతో విరోధమే గొప్పది కదా! అలసత్వాన్ని దరి చేరనీయక రాత్రింబగళ్లను విభజించుకొని కర్తవ్యాన్ని అనుష్ఠిస్తున్నాడు. భృత్యుల్ని మిత్రులుగాను, మిత్రుల్ని బంధువులుగాను, బంధువుల్ని అధికారులుగాను మన్నిస్తున్నాడు. గుణపక్షపాతంతో యోగ్యులను అధికంగా సత్కరిస్తున్నాడు. స్వపర భేదభావం లేక దుష్టుల్ని తగిన విధంగానే దండిస్తున్నాడు. రాజనీతికి మూలమైన సామదాన భేదదండోపాయాలు ఎంతో విచక్షణతో ప్రయోగిస్తున్నాడు. అనేక రాజన్యులు తమ రథాశ్వాలతో నిత్యం ఆయనను దర్శించేటం వల్ల సభాస్థలి కోలాహలంగా ఉంటోంది. వారు కానుకలుగా తీసికొనివచ్చిన మదగజాల మద ధారలతో సభామంటప ప్రాంగణం బురదతో కూడికొని ఉంటోంది. ఆ మదధారల సప్తపర్ణి సుగంధం వ్యాపించి సభాసదులకు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. ప్రజల సంక్షేమానికి చాలా చెఱువులు, బావులు త్రవ్వించేటంతో నీటి వసతి సమృద్ధంగా ఉండటం వల్ల రైతులు ఎక్కువ శ్రమ తీసికోకుండానే సస్య సంపదలు చేకూఱుతున్నాయి. కుబేరునితో తుల్యమైన ధనరాశి

చేకూర్చుకొన్నాడు. సైనికులకు సమస్త సౌకర్యాలూ కలిగించేటం వల్ల వారు స్వామి భక్తి పరాయణులై సుయోధనునికై ప్రాణాలర్పించేటానికి కూడ సిద్ధమైఉన్నారు. గూఢచారి వ్యవస్థ ఎంతో కట్టుదిట్టంగా ఉంచి ఇతర రాజుల వ్యవహారాల్ని సంపూర్ణంగా తెలిసికొంటున్నాడు. అతడు ధనుస్సు నెక్కుపెట్టవలసిన అవసరమే కలగటంలేదు. క్రోధంతో కనుబొమలు ముడిపడే సందర్భమే రావటం లేదు. స్నేహబంధాన్ని దృఢతరం చేయటం వల్ల అతని ఆజ్ఞలను అంతా పూలమాలవలె శిరసావహిస్తున్నారు. దుశ్శాసనుని యువరాజును చేసి అతనికి బాధ్యతలప్పగించి తాను నిశ్చింతగా యజ్ఞాలొనరుస్తున్నాడు. శత్రురాజులు లేక ఆసముద్రక్షితీశుడైనా మీవలన భవిష్యత్తులో రానున్న ఆపదలగూర్చి సదా భయభ్రాంతుడౌతున్నాడు. బలవంతులతో విరోధం దుఃఖపర్యవసితమే కదా! ఎప్పుడైనా మాటల్లో అర్జున పరాక్రమం ప్రస్తావనకు వచ్చినపుడు మంత్రించిన సర్పంవలె నతాననుడౌతున్నాడు. కనుక అతని పట్ల చేయ తగిన ప్రతి క్రియను గూర్చి ఆలోచించేండి. మా వంటి వారి మాటలు మీకు కర్తవ్యాన్ని నివేదించేవే కదా!"

ఈ విధంగా చెప్పి వనేచరుడు వెళ్ళిపోవటం తోటే ధర్మజుడు ద్రౌపది సదనాన్ని ప్రవేశించి భీమునెదుట అతని మాటలను చెప్పేడు. ఆ మాటలను విన్న ద్రౌపది "సర్వజ్ఞులైన మీకు నావంటి స్త్రీల మాటలు ధిక్కారంగా తోచేవచ్చు. అయినా వారు చేసిన అకృత్యాలవల్ల కలిగిన మానసిక సంక్షోభం నన్ను మాట్లాడటానికి ప్రేరేపిస్తోంది. దేవేంద్ర తుల్యులైన మీ పూర్వులంతా ఈ అఖండ భారతాన్ని పాలించారు. మదగజం పుష్పహారాన్ని విసరివేసినట్లు మీరు దీన్ని చేజేతులా వదులుకొన్నారు. మాయావుల పట్ల మాయనే ఆచరించేని అమాయకులు మందబుద్ధికలవారై పరాభవం పాలౌతారు. కవచాదులు ధరించేని దేహాన్ని తీక్ష్ణమైన బాణాలవలె



శత్రువులు చేంపివేస్తారు. సహాయ సంపత్తి, ఆభిజాత్యాదులుండి కూడ చేజేతులా రాజ్యాన్ని వదులుకొన్న వాడు నీవు కాక ఇంకెవరున్నారు? మహారాజా! దావాగ్ని ఎండిన జేమ్మిచెట్టును దహించే విధంగా అవమానితుడవైన నీవు శత్రువు నెందుకు సంహరించేటం లేదు? రోషహీనుని వల్ల పగతునికి కూడా భయం కలుగదు. సదా చందన చర్చితుడై విహరించే భీమసేనుడు నేడెలా ధూళిధూసరితాంగుడై ఉన్నాడో చూడు! రథారూఢుడై సంచరించే ఈయన పాదచారియై పరిభ్రమిస్తుంటే నీకు బాధగా లేదూ? ఇంద్రోపముడైన ఈ ధనంజయుడు నాడు కురుభూముల్ని జయించి నీకు స్వర్ణరాశుల్ని సమర్పించి నేడు వల్కలధారియై ఉండటం నీలో క్రోధాన్ని రగిలించేటం లేదా? వన గజాల వంటి కవలలు కఠిన శయ్యలపై పరుండటంవల్ల మోటుబారిన శరీరాలతో కేశసంస్కారహీనులై కనిపిస్తూ ఉంటే శాంతంగా ఎలా ఉండ గలుగుతున్నావు?.

నీమనస్సేమిటో నాకసలర్థం కావటం లేదు. చిత్తవృత్తులు విచిత్రమైనవి కదా! మీ దుర్దశను తలచుకొంటూ ఉంటే నా గుండె బ్రద్దలౌతోంది. ఒకప్పుడు హంస తూలికాతల్పంపై శయనించి మంగళ గీతాలతో మేల్కొనే నువ్వు ఇపుడీ గ్రుచ్చుకొంటున్న దర్భలశయ్యపై నిదురించి అమంగళకరమైన నక్కల కూతలతో మేల్కొంటున్నావు. పూర్వం విప్రభుక్తశేషంతో శరీరాన్ని పోషించుకొనే నువ్వు ఇపుడు కందమూలాలతో పొట్ట నింపుకోవటం ఎంతటి దుర్దశ?! ఈ స్థితి శత్రుకృతం. అందుకే నా మనసు సమూలం క్షోభించి పోతోంది. అజేయులైన మానధనులకు పరాభవం సైతం ప్రమోదహేతువే. కనుక రాజా! శాంతిని వీడి శత్రువధకై పూనుకో! శాంతి నిరీహులైన మునులకు కాని, భూపతులకు కాదు సుమా! తేజస్వులలో అగ్రేసరులై యశోధనులైన మీవంటి వారే అసహ్యమైన అవమానాన్నొందీ ఉపేక్ష వహిస్తున్నారంటే ఇక మనస్వితకు తావెక్కడ?

పరాక్రమాన్ని వీడి ఓర్పే సుఖానికి సాధనంగా భావిస్తే ధనుస్సును వీడి జటాధారివై ఇక్కడ, ఈ అడవిలో వహ్నిని వ్రేల్చి హోమాలు చేస్తూ కాలక్షేపం చెయ్యి. అపకారులైన వైరుల విషయంలో సమయపాలన సముచితమైంది కాదు. విజయశీలురైన నృపులు శత్రువుల పట్ల ఏదో ఒక నెపంతో సంధిని ఉల్లంఘిస్తూనే ఉంటారు. రాజ్యలక్ష్మి దైవప్రాతికూల్యంతో కాంతివిహీనయై దుఃఖ సాగరంలో మునిగిఉన్న నిన్ను సూర్యుడంధకారాన్ని తొలగించి వెలుగునిస్తున్నట్లు తిరిగి పొందును గాక!" ఈ ద్రౌపది వాక్యాలతో ప్రథమసర్గ సమాప్తమౌతుంది.

ద్రౌపది వచనాలు వృకోదరుని కెంతగానో నచ్చాయి. ఆమెను సమర్థిస్తూ – **యదవోచదవీక్ష్యమానినీ పరితస్స్నేహమయేన చక్షుషా।**

**అపి వాగధిపస్య దుర్లభం వచనం తద్విదధీత విస్మయమ్ ॥** *(2-2)*

ఆభిజాత్యం కల ద్రౌపది బాగా ఆలోచించి స్నేహవీక్షణాలతో చెప్పింది బృహస్పతికే ఆశ్చర్యాన్ని కలిగించేదిగా ఉంది. నదిలో స్నానఘట్టాన్ని తెలిసికోవటం, రాజనీతిని తెలిసికోవటం కష్టం. స్నానఘట్టాలు ఏర్పఱచిన తరువాత నదిలో ఈదులాడటం, మార్గాన్ని చేక్కగా నిర్దేశించిన పిదప పరిపాలిం చేటం తేలిక. ఇప్పుడు ద్రౌపది రాజనీతి విధానాన్ని సూచించింది. మాత్ర స్వల్పమే అయినా వ్యాధిని నిర్మూలించినట్లుగా ద్రౌపది క్లుప్తంగా మాటాడినా అనుష్ఠానయోగ్యాలు, అర్థసౌందర్యం కల ఆమె మాటలు నీకు ఇష్టమైనవి కావాలి. గుణగ్రాహులు విషయానికే ప్రాధాన్యమిస్తారు కాని వక్తకు కాదు. ప్రభువులకు కావలసిన అన్వీక్షకీ, త్రయీ, వార్తా, దండనీతి అనే నాలుగు విద్యలలో నైపుణిని సంతరించుకొన్న నీ బుద్ధినేడు వ్యత్యస్తమై ఆడ ఏనుగు బురదలో పడ్డట్లు కనిపిస్తోంది. లేకపోతే దేవతలచే కీర్తితమైన నువ్వు నేడు ఈదృశమైన అవస్థను శత్రువులచే పొందేవంటే ఇంతకంటె దౌర్భాగ్యం ఇంకేముంటుంది? శత్రువు దినదినం క్షీణిస్తుంటే వేచి ఉండటం



భావ్యమే కాని, దినదినాభివృద్ధి నొందుతున్నప్పుడు పరాక్రమిం చేటమే తగినపని. శత్రువు ఉన్నతిని చూస్తూ ఉపేక్షిస్తే ఆపద తప్పదు. రాజనీతి అనేది పంచాంగ సమన్వితమై ఉంటుంది. సహాయ సంపత్తి, సాధన సంపత్తి, విఘ్న విదారణం, దేశకాల విభాగం, కార్యసాఫల్యం అనేవే ఆ ఐదంగాలు. వాటిని పాటించిన వానికి ప్రజాబలం, దైవసహాయం ఉంటుంది. అలాకాక ఉపేక్షిస్తే వినాశం తప్పదు. సమర్థుడైన వాడు స్వబలంతోనే కార్యాన్ని సాధించుకోవాలి. అలాకాక నియమానుసారం వనవాసాజ్ఞాతాలు పూర్తి అయిన తర్వాత చూద్దామనుకొంటే ఇంత కాలం రాజ్య సుఖాల నుభవించిన ధార్తరాష్ట్రులు రాజ్యాన్ని తేలిగ్గా ఎలా వదులు కొంటారు? పురుషకార విహీనునికి కార్యసిద్ధి కలగటం కల్ల. కేసరి మదేభకుంభస్థలాన్ని చీల్చి తన ఆకలి చేల్లార్చుకొంటుంది. కాని క్షుద్ర జంతువులపైకి పోదు. అభిమానధనుడు ప్రాణాలను విసర్జిం చేటానికైనా వెనుదీయడు కాని శౌర్యాన్ని వీడడు. సింహం ఏ ప్రయోజనాపేక్షతో మేఘగర్జనకు ప్రతిగా గర్జిస్తోంది? మానధనులెప్పుడూ శత్రువు అభ్యుదయాన్ని సహించేరు. అది వారి ప్రకృతి.

*"కిమపేక్ష్య ఫలం పయోధరాన్*
*ధ్వనతః ప్రార్థయతే మృగాధిపః ।*
*ప్రకృతిః ఖలు సామహీయస*
*స్సహతేనాన్య సమున్నతిం యయా॥" (2-21)*

నువ్వుపేక్షించినంతవఱకే శత్రువుల ప్రగతి. ప్రమాదవశాత్తు ఆవరించిన అజ్ఞానాన్ని వీడి కర్తవ్యోన్ముఖుడవుకా. విజయం సంధిగ్ధమని భావించేకు. నాలుగు సముద్రాలవంటి మాతో కూడి నువ్వు దేవేంద్రోపమ పరాక్రమంతో విజృంభించిన నాడు తట్టుకోగలిగే మగవాడెవడు? శత్రువులు చేసిన ద్రోహానికి నీ మనస్సులో మండుతున్న అగ్ని శత్రు స్త్రీల కన్నీటితోనే చేల్లారుతుంది" క్రోధాన్ని ఉద్దీపింపచేసే ఈ భీమసేనుని మాటలు విన్న

ధర్మజుడు మదించిన ఏనుగును మావటివాడు త్రోవలో పెట్టే విధంగా ఉపస్వాంతుని చేయటానికిలా ప్రారంభించాడు.

"భీమసేనా! అద్దంలో ప్రతిబింబంవలె నీ మాటల్లో నీభావం స్పష్టమైంది". భారవి కవిత్వం అర్థగౌరవంతో కూడినదంటున్నాంకదా! కవి దాన్నే సూచిస్తున్నాడు.

**స్ఫుటతా న పదైరపాకృ తా**
**న చ న స్వీకృతమర్థగౌరవమ్ ।**
**రచితా పృథగర్థతా గిరాం**
**న చ సామర్థ్య మపోహితం క్వచిత్ ॥ (2-27)**

నీ మాటలు స్ఫుటంగా ఉన్నాయి అల్పాక్షరాల్లో అనల్పార్థస్ఫురణ లేక పోలేదు. పునరుక్తి లేక సామర్థ్యోపబృంహితంగా ఉన్నాయి. నువ్వు దీర్ఘంగా ఆలోచించకుండా చెప్పినా ఎంతో యుక్తి యుక్తంగా చెప్పేవు. నువ్వు తప్ప ఇంకెవరూ ఇంత శాస్త్రబద్ధంగా మాటాడలేరు. అయితే శత్రువు ప్రబలుడైనందున యుద్ధం ఎంతవఱకు యుక్తమా అని సందేహిస్తున్నాను. సంధి విగ్రహాల విషయంలో బాగా ఆలోచించి నిర్ణయం చేయకపోతే అది అనర్థానికే దారితీస్తుంది.

భారవి ఆనాడు భార్యకు సెట్టిగారి కిచ్చి వలసిన పదార్థాలు తెచ్చుకోమని తాటాకు పై వ్రాసి యిచ్చినమాట, తండ్రిని వధించబోయిన సందర్భంలో స్వానుభవంతో తెలిసికొన్నమాట, ఆ సన్నివేశంలో సెట్టి కుటుంబాన్నే రక్షించినమాట ఈ సందర్భంలో గ్రంథస్థం చేసినట్లు కనిపిస్తుంది.

**"సహసా విదధీత న క్రియా**
**మవివేకః పరమాపదాం పదమ్ ।**
**వృణతే హి విమృశ్య కారిణం**
**గుణలుబ్ధాస్స్వయమేవ సమ్పదః॥ (2-30)**



తొందరపడి చేసినపని గొప్ప అనర్థాలకు దారితీస్తుంది. సమగ్రంగా ఆలోచించి పని చేసినవాణ్నే సంపదలు స్వయంగా వరిస్తాయి. ఈమాటలు కావ్యంలో యుధిష్ఠిరుడు భీమసేనునితో చెప్పినా ఇవి సార్వజనీన, సార్వకాలిక సత్యాలు.

ఎవడు కర్తవ్యమనే విత్తుల్ని వివేకమనే నీటితో తడుపుతూ రక్షిస్తూ ఉంటాడో వానికి రైతుకు శరత్తులో సమృద్ధమైన పంట చేతికందినట్లు విజయం చేకూరుతుంది. శాస్త్రజ్ఞానం శరీరానికలంకారం. శాంతం ఆ శాస్త్రానికలంకృతి. పరాక్రమం ఆ శాంతాన్నలంకరిస్తుంది. ఫలం నీతితో పొందినప్పుడే ప్రస్తూయమాన మౌతుంది. బుద్ధిని భ్రాంతి చెందించే అంధకారంలో దీపం ఏవిధంగా గహనమైనదాన్ని సుగమం చేస్తుందో అలాగే రాజనీతి ఫలప్రాప్తికి హేతుభూత మౌతుంది. స్పృహణీయ గుణోన్నతులైన మహాత్ములనుసరించిన పథాన్ని అనుసరించేవారికి ఒక వేళ దైవాద్వా అపజయమే కలిగినా అది అభ్యుదయ సదృశమే సుమా! విజిగీషులు జితేంద్రియులై ప్రగతి నిరోధకమైన క్రోధాన్ని నియంత్రించి నిర్దోషమై సుఖాపాదకమైన చక్కని ఉపాయంతో పౌరుషాన్ని ప్రకటిస్తారు. సూర్యుడెంత తేజశ్శాలి! అయినా అరుణోదయం కాకుండా చీకట్లో ఉదయించేడు కదా! ఎంతటి శక్తివంతుడైనా అంతశ్శత్రువైన క్రోధాన్ని జయించనిదే బాహ్యశత్రువును నిర్మూలించలేడు. ప్రభువుకు ఇది లేనినాడు కృష్ణపక్షంలో చంద్రుని కళలు క్రమశః క్షీణించినట్లే అతని ప్రభు, మంత్రోత్సాహ శక్తులు మూడూ నిష్ఫలాలైపోతాయి. ఆదిత్యుడు గ్రీష్మర్తువు లో మండి హేమంతంలో శాంతించినట్లే ఏ ప్రభువు సమయానుకూలంగా తీక్ష్ణతను, మార్దవాన్ని, ప్రదర్శిస్తాడో ఆ రాజు ప్రజలకు ప్రీతి పాత్రుడౌతాడు. ఓర్పును విడచి క్రోధం వివేకి అయిన నిన్నూ పామరునివలె వశంచేసికోవటం ఆశ్చర్యంగా ఉంది. మన మనోరథ సిద్ధికి, శత్రువినాశానికి శాంతంతో

సమానమైన ఉపకరణం వేఱొక్కటి లేదు. అహంకారంలో అగ్రేసరులైన యదువీరులు ప్రేమాస్పదులమైన మనల్ని విడిచి దుర్యోధనాదుల్ని సేవించేరు. అంటే వారు స్వప్రయోజనాపేక్షతో ధార్తరాష్ట్రుల్ని సేవిస్తున్నట్లు కనిపించినా సమయం వచ్చినప్పుడు మనకే బాసటై నిలుస్తారు. అరణ్యాజ్ఞాతవాస అవధి తీరకుండా మనం పరాక్రమిస్తే ప్రజలు మనల్ని నీతి విహీనులుగా భావించే ప్రమాదం ఉంది. మదోద్ధతుడైన దుర్యోధనుడు రాజులను తిరస్కరిస్తూ వారు ప్రతికూలురు కావటానికి దోహదం చేస్తున్నాడు. తిరస్కారం సామాన్యులకు సైతం భరింపరానిదైనప్పుడు ఇక రాజక విషయంలో చెప్పవలసినదేముంది? మౌఢ్యం, మదం వ్యక్తిని వివేకహీనుని చేస్తాయి. వివేకహీనుడు న్యాయపథం నుంచి జాఱిపోతాడు. న్యాయపథాన్ని వీడిన ప్రభువుపట్ల ప్రజలు విరక్తులౌతారు.

మహోద్ధృతమైన గాలితో వ్రేళ్లతో కదిలిపోతున్న వృక్షాన్ని ఎలా సుకరంగా నఱుకవచ్చో విరక్తులైన ప్రకృతి జనం కలిగిన రాజును అంతే సులభంగా ఉన్మూలించేవచ్చు. కొమ్మల రాపిడి వలన జనించిన నిప్పుకణం కూడ మహాపర్వతాన్నే ఎలా దహింపచేస్తుందో అలాగే అమాత్యాది ప్రకృతి వర్గంలో జనించిన కొద్ది పాటి వైమనస్యం సైతం రాజును మొదలంటా పెఱికి వేయటానికి సమర్థమౌతుంది. వినయశీలి కాని శత్రువు అభ్యుదయాన్ని బుద్ధి మంతుడుపేక్షించాలి. అటువంటి శత్రువు అర్థంతరంగానే తేలిగ్గా జయించేటానికి సాధ్యుడౌతాడు. ఎందుకంటే అన్యాయార్జిత విత్తం సమూలం వినాశమొందుతుంది. నెఱ్ఱెలు వారి ఉన్న తీర భూమిని నదీవేగం కూల్చినట్లే అమాత్యాది దగ్గఱ వారితో భేదాభిప్రాయం ఉన్న రాజును శత్రువు తేలికగానే నిర్మూలించేగలడు". ఈ విధంగా వనేచరుని నివేదికతో ఆకుల పాటుతో గ్రాన్న భీమసేనుని సాంత్వన పఱుస్తున్న ధర్మజుని వద్దకు పరాశరాత్మజుడైన వ్యాసమహర్షి విచ్చేసేడు.



అడవిలో మనిషి కనిపిస్తేనే వేటగాడన్న భయంతో పాఱిపోయే జంతువులు వ్యాసుని శాంత స్వరూపాన్ని చూసి నిర్భయంగా తిరుగజొచ్చాయి. సమస్త పాపాల్నీ భస్మీపటలం చేసే తేజఃపుంజం ఆయన. ఆపుంభావ పుణ్యరాశిని ఎంతో భక్తి విశ్వాసాలతో ధర్మజుడు దర్శించాడు. వెంటనే ఆ మహర్షికి ప్రత్యుత్థానం చేసి విధ్యుక్తంగా అర్ఘ్య పాద్యాదులను సమర్పించాడు. మహామునికి ఆసనం కల్పించి ఆయన ఉపవిష్టుడైన పిమ్మట అతని అనుమతిని పొంది ధర్మజుడు కూర్చున్నాడు. ఇక్కడితో ద్వితీయసర్గ ముగుస్తుంది.

అఱువది శ్లోక పరిమితమైన తృతీయసర్గలో వ్యాసోపదేశం, పాశు పతాస్త్ర సంపాదనకై అర్జునుని ప్రబోధించి తపస్సుకై పంపటం అభివర్ణితమైనాయి.

ఎత్తైన నల్లని దేహం, పచ్చని జేడలతో వ్యాసుడు మెఱుపుతో కూడిన మేఘంలా ఉన్నాడు. ఆయన ఆకృతి శరచ్చంద్రకిరణాలను వర్షిస్తున్నట్లుంది. శాంతస్వభావం ఆయనలో మూర్తీభవించి అపరిచితులకు కూడ భక్తి భావాన్ని రేకెత్తిస్తోంది. పరమార్ద్రమైన చూపులతోనే ఆ పరమర్షి కుశలమడిగినట్లుంది. హఠాత్తుగా వచ్చిన ఆ వ్యాసమునీంద్రుని ఆగమన కారణం తెలిసికో గోరేడు ధర్మజుడు. "మేఘాలులేని వర్షంవలె మీరాకతో మేము ధన్యులమయ్యాం. మీరాకే మాకొక సత్కారంగా భావిస్తున్నాం. లోక గురువైన మీ అమోఘమైన దర్శనం బ్రహ్మదర్శనంవలె సంపదల కాలవాలమైంది. పాపపరిహారాత్మకం, శ్రేయోదాయ కమైంది, కీర్తికరమైంది. నిరీహులైన మీకు మాతో కాగల కార్యాలేం ఉంటాయి? మాపై అనుగ్రహబుద్ధితోనే మీరు వచ్చి ఉంటారు. కనుక అది తెలిసికోనాలనే కుతూహలం నన్ను మాట్లాడిస్తోంది."

ధర్మజుని రమ్యోక్తులకు సంతోషించిన వ్యాసభగవానుడు వారికి విజయాన్ని చేకూర్చ గల విధానాన్ని చెప్పబూనేడు. "వీతరాగులకు సమదృష్టి అభిలషణీయమే. అయినా నీ సద్గుణ పుంజం నన్నాకర్షించింది. ధృతరాష్ట్రునికి మీరూ పుత్రకల్పులే. అయినా శక్తివంతులు, గుణోపేతులూ అయిన మిమ్మల్ని రాజ్యలోభంతో, పుత్రవ్యామోహంతో వృథాగా విడచిపెట్టేడు. కర్ణాది దుర్మార్గుల ఆలోచనలకు వశుడై ఉన్న ధృతరాష్ట్రునికి అర్థసిద్ధి ఎలా చేకూరుతుంది? విజయానికి వారు విఘ్నకారులు కదా! న్యాయపథం నుంచి చ్యుతినొందిన శత్రువుల సభలో సైతం నువ్వెంతో సంయమనాన్ని పాటించావు. శాంతస్వభావుడవైన నీకు నీ శత్రువు చేసిన అపకారం కూడా నీ శీల సంపదను ప్రకటించేటంలో ఉపకారంగానే పరిణమించి నీ కీర్తిని ఇనుమడింపచేసింది. రాజ్యం సదా పరాక్రమ లభ్యం. అయితే ఇపుడు నీ శత్రువు సైతం శస్త్రాస్త్ర బలోపేతుడై ఉన్నాడు. కనుక మీ పరాక్రమోత్కర్షకు ఉపాయాన్నాలోచించాలి. ఎందుకంటే యుద్ధంలో జయలక్ష్మి పరాక్రమ వంతుల్నే వరిస్తుంది కదా! ఇరువది యొక్క పర్యాయాలు రాజులను వధించిన పరశురాముడు తన శిష్యుడైన భీష్ముని చేతిలో ఓడి పరాక్రమం గుణనిష్ఠమై ఉంటుందని గ్రహించాడు. అటువంటి భీష్ముడు యుద్ధంలో ధనుస్సు నెక్కుపెడితే ఎదురు నిలువగలిగినవాడెవడు? కోపోద్రిక్తుడైన ద్రోణాచార్యుడు లోకాన్ని దహించే ప్రళయాగ్నిని పోలిన అస్త్రాలతో సిద్ధమైతే అడ్డుకొనేవాడు మీలో ఎవడున్నాడు ? పరశురాముని శిష్యుడైన కర్ణుడు మృత్యువుకే భయోత్పాతాన్ని కలుగజేయ సమర్థుడు. అతనికి మీలో ప్రతి వీరుడెవడు? కనుక వీరిని నిగ్రహించేటం నేనుపదేశించే మంత్రాలతో తీవ్ర తపస్సు చేసి దుర్లభమైన అస్త్రాలు సాధించేగల అర్జునునికే సాధ్యమౌతుంది. కనుక అట్టి మంత్రాన్నివ్వటానికే నేనిక్కడకు వచ్చాను." ఆ మాటలు విన్న అర్జునుడు అజాత శత్రుని ఆదేశాన్నిపాటిస్తూ అంతేవాసి



వలె వినయంతో వ్యాసభగవానుని సమీపించాడు. అపుడాయోగ విద్య సూర్యకాంతి కమలాన్ని చేరినట్లు వ్యాసమహర్షి ముఖాన్నుండి పార్థుని ముఖం చేరింది. విద్యను స్వీకరించేటంలో యోగ్యతముడైన అర్జునునికి వ్యాసమహర్షి తన తపఃప్రభావంతో ఆ యోగాన్ని సంక్రమింపచేసేడు. దాంతో అర్జునుని జ్ఞాననేత్రం తెఱచికొన్నట్లైంది. తానుతెలిపిన యోగాభ్యాసమార్గంలో శస్త్రద్వితీయుడవై ఫలసిద్ధిపర్యంతం మునివృత్తి నవలంబించుమని ఉపదేశించాడు. "తపస్సుకు యోగమైన ప్రదేశం ఇంద్ర కీలాద్రి. ఈ యక్షుడు నిన్న చేటికి చేరుస్తా"డన్నాడు. వెంటనే వ్యాసాదేశం రూపుదాల్చినట్లు యక్షుడక్కడ ప్రత్యక్షమైనాడు. వ్యాసమహర్షి అంతర్హితుడైనాడు. తనకు నమస్కరించిన యక్షుని ధనుంజయుడు ప్రియవచనాలతో సంభావించాడు. అర్జునుడు యక్షునితో వెళ్లనున్నాడన్న వియోగ దుఃఖం పాండుసుతుల్లో ప్రాదుర్భవించింది. అయితే వ్యాసాదేశానుసారం సవ్యసాచి అమోఘాస్త్రలాభాన్నిపొంది తిరిగిరాగలడనే విశ్వాసం ఆ దుఃఖాన్ని క్షణమాత్రమే మిగిల్చింది. పగటి నాలుగు జాములవలె వియోగ దుఃఖం నలుగురు సోదరుల్నీ అతిక్రమించి తదనంతరవర్తి చీకటివలె ద్రౌపది నావరించిందంటాడు భారవి! ఎంతటిదీ రమ్యమైన ఊహ!

**"తాన్ భూరి ధామ్నశ్చతు రోపి దూరం**
**విహాయ యామానివ వాసరస్య।**
**ఏకౌఘభూతం తదశర్మకృష్ణాం**
**విభావరీం ధ్వాంత మివ ప్రపేదే ॥ (3-35)**

***"కవి ప్రతిభలో నుండును కావ్యగత శతాంశములయందు తొంబదియైన పాళ్లు"*** అని కవి సమ్రాట్టుల తీర్పు. ఈ శ్లోకాన్ని పాదగటంలో భారవిప్రతిభ అనన్య సామాన్యం. సుఖమైనా, దుఃఖమైనా అనుభూతి గాఢత పురుషుని కంటె స్త్రీకే మిక్కుటంగా ఉంటుంది. అర్జున వియోగ దుః ఖం పగటి

నాల్గు జాములవలె సోదరులు నలుగురిలో పావువంతుగా మిగిలితే ద్రౌపదికి రాత్రి అంతా ఒకటే అయి దీర్ఘమైన అనుభూతిలో పర్యవసించింది. రాత్రి నల్లగా ఉంటుంది కనుక, ద్రౌపది, యాజ్ఞసేని, పాంచాలి, పత్నీ అనే పదాల్ని వదలి 'కృష్ణ' శబ్దాన్నుపయోగించేటంలో కవిప్రతిభ ద్యోతకమౌతోంది. కావ్యాన్ని ఆస్వాదించే తీరిది. పైగా పగటి నాల్గు జాముల్లో మొదటి జాములో సూర్యుని తీక్ష్ణత అంతగా ఉండదు కనుక అది ధర్మజునికీ, రెండు, మూడు జాముల్లో తీవ్రత అధికతరం, అధిక తమం అవుతుంది కనుక నకుల భీములకు, నాల్గవ జాము తిరిగి తీవ్రత తగ్గి ఉంటుంది కనుక సహదేవునికీ అన్వయించుకోవాలి. ద్రౌపది దుఃఖం గాఢతరమైనా బయలుదేరేముందు దుఃఖించేటం అమంగళకరమైనదని గ్రుడ్ల నీరు గ్రుడ్లలోనే క్రుక్కుకొంది. ***'మఙ్గలభంగభీరుః'*** అంటాడు భారవి. ఱెప్పవేస్తే కన్నీరొలుకుతుంది. ఱెప్పవేయలేదామె. ఈ దుఃఖంలో తనభర్త విజయుడై తిరిగి రాగలడనే అచంచల విశ్వాసం ఆమెది. కనుక ఆమె చూపులు ***"ప్రేమరసాభిరామం"*** గా ఉన్నాయి. వాటినే పార్థుడు పాథేయంగా గ్రహించాడట! ఆనందం, దుఃఖం – రెండింటి సమష్టితో కంఠం రుద్ధమైంది. కనుక గద్గద కంఠంతో చెబుతోంది. "కార్యసాధనలో ఏకాగ్రతనొందే నీకు మా వియోగ వైక్లబ్యం అవరోధం కాకూడదు సుమా! కీర్తి కాముకత్వం, సుఖానుభవం, గొప్పతనం మొదలైన వాటిపై దృష్టిపెట్టక కేవలం పనిలోనే లగ్నమైన వారిని ఉత్కంఠిత అయిన స్త్రీ ప్రియుని అంకాన్ని చేరినట్లు కార్యసిద్ధి చేకూరుతుంది. శత్రువుల వల్ల రాజ్యనష్ట పరాభవాల దుఃఖతీవ్రత కొద్దిగా మాసిపోతోంటే క్రొత్తగా వచ్చిన నీవియోగ దుఃఖం దాన్ని మళ్ళీ రేకెత్తిస్తోంది. మాయజూదంలో నాకు జేరిగిన అవమానానికి ప్రజలు చింతించినా కొంతమంది ప్రభువులుదాసీనులైనారు. క్రమంగా వారు సత్యం తెలిసికొని సిగ్గుతో తలవంచుకోవటంతో నా కీర్తి దిగంత విశ్రాంతమైంది. రాజసూయాత్పూర్వం



నువ్వు సంపాదించిన అఖండమైన ఖ్యాతి నా అవమానంతో మఱుగునపడి పోయిందనే దుఃఖం కాస్తవెనుక బడుతుంటే ఇప్పుడీ నీ వియోగం తిరిగి దుఃఖజనకమైంది. నిష్క్రియత్వం వల్ల సిగ్గుతో తలవంచుకొన్న ఆయుధాలతో నువ్వీనాడు శోభావిహీనుడవై ఉన్నావు. దుశ్శాసనుని దౌష్ట్యంతో కేవలం దైవం నామమాత్రంగా మిగిల్చిన ఈ వెంట్రుకలను చూస్తూ ఊరకొన్న నీవు నిజేంగా ధనంజయుడవేనా? ఇంకొకడవా? సాధురక్షకుడు క్షత్రియుడైతే రణభూమిలో శత్రుసంహారం కావించేది కార్ముకం. ఈ రెండూ నీవల్ల అన్వర్థాలు కావాలి. అలా జేరుగని నాడు ఆ రెండు శబ్దాలూ నిరర్థకాలే. అజాగ్రత్త వల్ల సింహం జూలును ఏనుగులు పెఱికి వేసినట్లు ప్రమాదవశాత్తూ శత్రువులు నీ ప్రతిభను కించపఱిచారు. పార్థా! మమ్మల్ని గూర్చిన ఆలోచనలతో నీ మనస్సును క్షోభనొందించుకోకు. అటువంటిది జేరుగకుండా దేవేంద్రుడు అడ్డుకోగలడు. సదా జాగరూకుడవై ఉండు. మాత్సర్యగ్రస్తులు సత్పురుషుల పట్ల కూడ వైరాన్ని పూనుతారు. అందువల్ల అతిశీఘ్రంగా వ్యాసమహర్షి ఆదేశాన్ననుసరించి మా మనోరథాల్ని సఫలం చెయ్యి. కృతార్థుడవై తిరిగి వచ్చిన నిన్ను నా వక్షోద్వయం ఒరసిపోయేట్లు గాఢపరిష్వంగంతో సంభావిస్తాను.

***"తదాశు కుర్వన్ వచనం మహర్షే ర్మనోరథాన్నస్సఫలీ కురుష్వ।***
***ప్రత్యాగతం త్వాస్మికృతార్థమేవ స్తనోపపీడం పరిరబ్ధుకామా॥" (3-54)***

ఈ విధంగా పలికిన యాజ్ఞసేని పలుకులు శత్రు కృతాపరాధాల్ని మళ్ళీ గుర్తుచేయటంతో నూతనోత్తేజంతో ఉత్తరాయణంలోని సూర్య భగవానునివలె అర్జునుడు ప్రకాశించాడు. ఉత్తేజితుడైన ఫల్గునుడు గాండీవాన్ని ధరించి శత్రువుల దృష్టికందని నిశితఖడ్గద్వయయుక్త అమ్ముల పొదిని ధరించి తపస్సాధనకై బయలుదేరేడు. అలకాధిపభృత్యుడు

త్రోవచూపుతూ ఉంటే ఇంద్రకీలాద్రికి పయనమైపోతున్న ఆ ఇంద్రసూనుని చూచిన తపస్వుల మనస్సులు ఆర్ద్రాలై క్షణకాలం బాష్పకణాలతో నిండేయి. ఆసమయంలో దిక్కుల్లో దుందుభినాదాలు మ్రోగేయి. ఆకాశం పారిజాతపుష్పాలును వర్షించింది. సముద్రుడుపొంగి ప్రియమైన మాటను, చెబుతున్నాడా అన్నట్లు భూమిని కౌగిలించుకొన్నాడు.

అష్టాదశ సర్గోపేతమైన కిరాతార్జునీయంలో మొదటిమూడు సర్గలూ అర్థగౌరవ సాంద్రమై నందువల్ల ప్రాచీనుల పంచకావ్య పఠనంలోను, అర్వాచీనకాలంలో భాషాప్రవీణాది పాఠ్యాంశాల్లోనూ ఇవే పఠన పాఠనాదుల్లో చోటు చేసికొన్నాయి.

చతుర్థసర్గ శరదృతువర్ణన అర్జునుడు హిమాలయాల్ని చేరటం అనే అంశాలతో ఉంటుంది. కనుక కథ ఏమీ సాగినట్లు అనిపించేకపోయినా ఋతువర్ణన కావ్యలక్షణాల్లో ఒకటి కనుక, ఆ దృష్టితోనే ఈ సర్గను పరిశీలించాలి. ప్రకృతి సౌందర్యం కళ్లకు కట్టినట్లు వర్ణిస్తాడీ కవి. అయితే కథ ఏమీ నడవదు కనుక అందఱికీ ఆట్టే నచ్చేకపోవచ్చు. యక్షునితో కలిసి ప్రయాణిస్తున్న అర్జునునికి అచేటి పంటచేలు కనువిందు చేసేయి. చిన్న చిన్న జలాశయాల్లోని చేపల గంతులు, చేష్టలు అర్జునునికి ప్రేయసి విలాస విభ్రమాల వలె తోచి ఆహ్లాదాన్ని కలిగించాయి. కర్షక స్త్రీల ముగ్ధత్వం అర్జునుని వైమఱపించింది. వృషభాలపోరు ఉత్తేజపఱచింది. ఆ శరత్కాలంలోని నదుల ఇసుక తిన్నెలు జారిన చీరెలతో కూడిన స్త్రీ జఘన ప్రదేశాలవలె తోచి మనస్సునాకర్షించాయి. పల్లెపడుచులు పెరుగు చిలుకుతున్నప్పుడు కవ్వం వల్ల కలిగిన ధ్వని మృదంగరావంలా తోచింది. ఆ చిలికే ప్రక్రియ వల్ల కలిగిన అలసత కళ్ళలో ప్రతిఫలించి నృత్యం చేస్తున్న వారకాంతల సొగసును సంతరించుకొంది. అర్జునునితో పాటు వస్తున్న యక్షుడు సైతం ఆ శరదృతు ప్రకృతి శోభకలరి అంత అందమైన ప్రకృతి అర్జునునకు కృతార్థత కలుగజేయాలని ఆకాంక్షించాడు.



యక్షుడు తన కంటికి గోచరమైన వివిధ సన్నివేశాల్ని అర్జునునికి వర్ణిస్తూ ఉంటే వారి ప్రయాణం కొనసాగింది. ఇందులో భారవి కవితా ప్రౌఢిమ కానవస్తుంది. గ్రాసం కోసం వనానికి వెళ్ళిన ఆవులు సూర్యాస్తమయ సమయానికి తమ దూడలకు పాలివ్వాలనే ఆత్రుతతో తిరిగి వస్తుంటే వాటి పొదుగుల నుంచి పాలు జాలువారుతున్నాయి. అర్థగౌరవాన్ని రూపించేశ్లోకం :

*"జగత్ప్రసూతిర్జగదేక పావనీ*
*వ్రజోపకంఠం తనయైరుపేయుషీ।*
*ద్యుతిం సదుగ్రాం సమితిర్గవామసా*
*వుపైతి మంత్రై రివ సంహితాహుతిః॥ (4-32)*

ఆవులు దూడలకి పాలిస్తున్నాయి. ఇంతే విషయం. అంతకంటె మఱేమీలేదు. జగత్తుకి కారణమైనవి, జగత్తును పవిత్రం చేసేవి అనేవి ఆ ఆవులకు వేసిన విశేషణాలు. జగత్తుకి కారణమైనవంటే - గోక్షీరంతో యజ్ఞాలు జరుగుతాయి. యజ్ఞంవల్ల వర్షాలు పడి భూమి సస్య శ్యామలం అయి పంటలు సమృద్ధిగా పండుతాయి వాటి వల్ల అన్నం, అన్నం వల్ల సంతానం కలుగుతుంది.

*"అన్నాద్భవన్తి భూతాని పర్జన్యాదన్న సమ్భవః।*
*యజ్ఞాద్భవతి పర్జన్యః యజ్ఞః కర్మ సముద్భవః॥*

సకల జీవరాశులూ అన్నం వల్లనే పుడుతున్నాయి. అన్నం పర్జన్యం అంటే మేఘం, అంటే వర్షం వల్ల కలుగుతోంది. వర్షం యజ్ఞం వల్ల కలుగుతోంది. యజ్ఞం విహితకర్మలవల్ల కలుగుతోంది." అని భగవద్గీత సాక్ష్యమిస్తోంది. (3-14) ఇదిలోకానుభవానికి వ్యతిరిక్తం కాదు. కనుక గోవు సృష్టికి మూలకారణం. దైనందిన వ్యవహారంలో సైతం శిశువుకి మాతృస్తన్యం లోపించినప్పుడు ఆవుపాలు వాడేవారు పూర్వం. ఆ

సంప్రదాయం సమూలంగా నశించి నేడు డబ్బాపాలపై ఆధారపడే పరిస్థితి కలగటం శోచనీయం. కనుక ప్రాణి ఆవిర్భావానికే కాక పోషణకు కూడ గోవు కారణమౌతోంది. ఆవు మూత్రం సైతం ఆయుర్వేద వైద్యంలో ప్రధాన పాత్ర వహిస్తుంది. నేలను గోమయం అంటే ఆవు పేడతో అలికినప్పుడు శుద్ధిగా భావించేవారు. విషకీటక ప్రవేశనిరోధానికి కూడ అది ఉపకరించేది. ఈ విధంగా ఆవు భారతీయులకు పరమపవిత్రమైందే కాక జాతికి మానబిందువు. దిలీపుడు గోసేవ చేసి ఆ నందినీ ధేనువును ప్రసన్నం చేసికొని దానివరంతోనే పుత్రవంతుడయ్యాడన్న ఉదంతం రఘువంశంలో దర్శించాం. ఇంతటి మహార్థాన్ని దృష్టిలో పెట్టుకొని *జగత్ప్రసూతిః జగదేకపావనీ*" అనే మాటల్ని కవి వాడేడు. అల్పాక్షరాల్లో అనంతార్థాన్ని చెప్పటం అంటే ఇది. అంటే "అర్థగౌరవం" అన్నమాట. దూడలు పాలు త్రావే దృశ్యం ఎలా ఉందంటే "మంత్రైరివ సంహితాహుతిః" అంటే మంత్రాలతో ఆహుతులను వ్రేల్చినట్లుందట! దూడలు పాలు త్రాగేటప్పుడు వెలువడే శబ్దాలే మంత్రాలవంటివి. వాటి కడుపులో పాలుపడటం ఆహుతి సదృశమైందనీ కవి తీర్మానం. ఒక గ్రంథాన్ని పఠిస్తున్నప్పుడిలా మనస్సును ఆలోచింపచేస్తే "అర్థగౌరవం" అవగతమై మనస్సు వికసిస్తుంది. యక్షుడిలా చెబుతూండగా ఎదురుగా హిమాలయ పర్వతం దృగ్గోచరం కావటంతో చతుర్థసర్గ సమాప్తమౌతుంది.

52 శ్లోకాలతో ఉన్న పంచమ సర్గ అంతా హిమవత్పర్వత వర్ణనే. హిమాలయ పర్వతం ఎత్తైనది కదా! అంత ఎత్తుగా ఉండటానికి కవి ఒక ఊహచేసేడు. మేరు పర్వతాన్ని మించాలనే స్పర్థకాని, దిగంతాలను చూడాలనే ఇచ్ఛకాని అయిుండవచ్చునని. ఆ పర్వతం ఆదిశేషువుతో తుల్యమైన శ్వేతవర్ణంతో శరత్కాల మేఘపటలిని అతిక్రమించిన శిఖరాలతో కూడి ఉంది. దేవతాస్త్రీలు క్రీడించేటానికి అనువైన లతాగృహాలతో ఒప్పుతూ ఉంది. సుందరమైన మదపుటేనుగులక్కడ సంచరిస్తూ ఉంటాయి.



అతివేలంగా, సూక్ష్మాతి సూక్ష్మంగా ఎంతో స్పృహణీయంగా వర్ణించిన హిమవత్పర్వత శోభను జీవితంలో కనీసం ఒక సారైనా చూడాలనింపిచేట్లు పాఠకులలో ఆశను రెక్కొల్పుతుందీ ఘట్టం. పైగా అది శంకరుని నివాస స్థానం.

గంగానది ఆకాశాన్నుంచి శివుని శిరస్సుపైకి, అచటి నుండి హిమవత్పర్వతానికీ చేరింది. అచట శిలలు అవరోధించేటం వల్ల మఱోమార్గాన్ని పొంది శ్వేత చామరం ధరించిన దానివలె ఉంది. దాని వైభవాన్ని చూచి అర్జునుడు యక్షునితో "ఈ పర్వతం చూచేవారి పాపాలను ప్రక్షాళనం చేస్తున్నట్లుంది. ఈ హిమతత్శోభను వర్ణించేటం బ్రహ్మకే సాధ్యం. ఈ హిమవత్పర్వతంతో త్రిభువనాలు కూడ సాటిరావని నేనను కొంటున్నాను. ఎందుకంటే జనులెఱుగని మహా మహిమాన్వితుడైన శంకరుడే ఇక్కడ నివసిస్తున్నాడు కదా! దివ్యస్త్రీల చరణలాక్షారాగపు చిహ్నాలు, రాలినపూలు, వారి శయ్యలు, ప్రేమోద్రేకంతో అక్కడ వారు పొరలినప్పుడేర్పడ్డ మడతలు అడుగడుగునా వివిధ సురతబంధాల్ని స్ఫురింపజేస్తున్నాయి. అనేక ఓషధులు, నూతనమైన గంధవృక్షాల పల్లవాలు రతిశ్రమను తొలగించే కమలాలపై వీచే గాలులు దేవతాస్త్రీలకు స్వర్గాన్ని మైమఱపిస్తున్నాయి. శంకరుడు పార్వతి పాణిగ్రహణం చేసిందీపవిత్ర పర్వతంపైనే. పూర్వం త్రిపురాసంహారం జేరిగినప్పుడు తన మిత్రుడైన శివునికై కుబేరుడలకా నగరాన్ని నిర్మించాడు. సూర్యుడాప్రదేశానికి రావటం తోటే ఎంతో ఎత్తైన భవనాల కారణంగా త్వరగా సూర్యాస్తమయం జేరిగినట్లనిపిస్తోంది."

ఇలా హిమవత్పర్వత శోభను వర్ణిస్తున్న అర్జునునితో యక్షుడు – "ఏ పర్వతంలోని వన ప్రాంతాన్ని విస్తరించిన హిరణ్యకాంతిని పొందిన అనేక గుహలను కలిగి ఉందో, అట్టి ఈ పర్వతం నీ తండ్రి దేవేంద్రుని కెంతో ప్రీతిపాత్రమైంది. అందుకే ఇంద్రకీలాద్రిగా ప్రసిద్ధినొందింది. ఈ

పర్వతాగ్రంలో సాంద్రంగా అల్లుకొన్న తీగలను వాయువు విడదీస్తూ ఉంటే సూర్యరశ్మి ప్రసరించేటంతో మెఱుపులనే భ్రాంతిని కలిగిస్తోంది. ఈ ఇంద్రకీలంపై అప్రమత్తంగా ఉండాలి కనుక శాంత స్వభావునికి సైతం శస్త్రం అవసరమౌతుంది. వ్యాసమునీంద్రుని ఆదేశాన్ననుసరించి తపమాచరించు సత్కార్యాలకు బహు విఘ్నాలుత్పన్నం కావటం సహజం. ఇంద్రియాలనే అశ్వాలు నీ ధ్యేయాన్ని వీడి పరుగిడకుండుగాక! శివుడు నీకు చేక్కని ఉత్సాహాన్ని ప్రసాదించుగాక! ఇంద్రాది లోకపాలురు నీశక్తిని ద్విగుణీకృతం చేస్తూ నీతపఃఫలితాన్ని అందింతురు గాక!" హితమూ, ప్రియమూ అయిన ఈ మాటలను చెప్పి యక్షుడు తన నివాసానికి వెళ్ళిపోయాడు. అర్జునుడుత్కంఠతో ఆలోచనలో మునిగేడు. పరిపూర్ణమైన రాత్సాహంతో త్వరగా తపస్సిద్ధిని ప్రసాదింపచేసే ఆ ఇంద్రకీలపర్వతం తన తపశ్చర్య కనువైనదనే విశ్వాసంతో అక్కడే తపశ్చర్యను సలపటానికి నిశ్చయించాడు. ఈ విధంగా పంచమసర్గ సమాప్తమౌతుంది.

ఇంద్రకీలాద్రిలో అర్జునుని తపో వైభవాన్ని వన రక్షకుడు దేవేంద్రునికి నివేదించేటం, ఆతని తపస్సును భగ్నమొనర్చరండని ఇంద్రుడు వారాంగనల నాదేశించేటమనే ఉత్కంఠ భరితమైన అంశాలతో షష్ఠ సర్గ కూడుకొని ఉంటుంది.

ఆ ఇంద్రకీలాద్రి వనమధ్యంలో ఒక ప్రదేశాన్నెంచుకొని, మనస్సును నియమించి తపశ్చర్యకు పూనుకొన్న అర్జునునకు శ్రమ తోచలేదు. అతని తపస్సు శుక్లపక్ష చంద్రకళలవలె దిన దినాభివృద్ధినొందసాగింది. తపస్సుకు విఘ్నకారులైన విషయవాంఛలను అధఃకరించి తపశ్చర్యలో శాంతిననుభవించేసాగేడు. ఇంద్రుని సాక్షాత్కరించుకొనే ధ్యేయంతో అహింసాదిగుణ నిష్ఠుడై వీరాన్నీ శాంతాన్నీ ఒకేసారి పొంది మహోన్నత తేజస్సుతో రూపొందేడు. మరకతమణి వంటి కాంతి గల అర్జునుడు



పెంపొందిన జటలతో అరుణ కాంతులతో తమాలవృక్ష సదృశుడైనాడు. ఆయుధధారి అయినా పవిత్రమైన నడవడితో సామాన్య మునులను అతిశయించిన వాడై, రజోగుణ రహితుడైనందువలన జంతు తతికిష్టుడైనాడు. మహాకార్యనిర్వహణలో మగ్నుడైన అతనిపై వాయువు సుగంధాన్ని ప్రసరింప సాగింది. సూర్యుడు గ్రీష్మర్తుధర్మాన్ని వీడి తన రశ్మిని స్పర్శానుకూలం కావించాడు. భూమిసైతం మెత్తని గడ్డిని పఱచేటంతో శయన యోగ్యం చేసింది. మేఘాలు తొలగిన ఆకసం నుంచి పడుతున్న తుంపురులు భువిపై ఉన్న దుమ్మును అణచివేసేయి. ఈ విధంగా పంచభూతాలూ దయాళువులై తపస్సుతో కృశించిన అర్జునుని సేవించాయి. కొద్ది దినాల్లోనే దుష్కర తపోమగ్నుడైన అర్జునుని చూచి ఇతడింద్రపదవిని కోరి తపశ్చర్యను కొనసాగించేటం లేదు కదా! అనే అనుమానానికి లోనై వనదేవతలు దేవేంద్రుని వద్దకు వెళ్ళేరు. దేవేంద్రునికి నమస్కరించి ఆయన అనుమతినొంది "హే మఘవన్! తమధైన ఇంద్రకీలాద్రిపై ఒక మహానుభావుడు వల్కలధారియై ఏదో గొప్ప ప్రయోజనాన్నాశించి తపశ్చర్య కావిస్తున్నాడు. ఆ తపస్సు జగత్తునే సంక్షోభితం చేస్తోంది. అచేటి మృగాలు గురువు కంతేవాసులవలె తమలో పరస్పరద్వేషాల్ని వీడి సేవిస్తున్నాయి. ఆ ఇంద్రకీలాద్రి నీవలె అతనిని సేవిస్తోంది. ఎంతో తపశ్చర్య చేస్తున్నా శ్రమనొందకపోవటం అతని దృఢసంకల్పాన్ని వ్యక్తపఱుస్తోంది. అతని శరీరశోభ అతడు జయాన్ని పొందుతాడని సూచిస్తోంది. మునీంద్రులను సైతం అతిక్రమించిన అతనిని చూసి జనులు భయభ్రాంతులౌతున్నారు. ఏదో మా బుద్ధికి తోచినట్లు అనుమేయమానమైన విషయాన్ని మీముందుంచాం. ఇది అనుచితమైనదని మీరు భావిస్తే మేము క్షంతవ్యులం. మహాతపస్వులైన ఋషులెక్కడ? వనేచరులమైన మేమెక్కడ?

దేవేంద్రుడు వనదేవతలు తీసికొనివచ్చిన వార్త విని తన కుమారుని తపశ్చర్యకు సంతోషించాడు. కాని రాజనీతి ననుసరించి తన సంతోషాన్ని వ్యక్తం చేయలేదు. ఇంద్రుడు ఒక్కక్షణం సమాధిగ్రస్తుడై, అర్జునుని తన భక్తునిగా ఎఱిగి అతని తపోద్రఢిమనెఱుంగ గోరి ఏమీ తెలియని వానివలె దేవతాస్త్రీలతో "యోగీశ్వరేశ్వరలను సైతం చిత్త భ్రమనొందించే సౌందర్యం మీది. బ్రహ్మ సృష్టిలో ఉండే అందాన్నంతా సంగ్రహించి మిమ్మల్ని సృష్టించాడు. అందుకే మీ పొందుకోసమే మానవులు స్వర్గాన్ని కోరి వివిధ ప్రయత్నాలు చేస్తున్నారు. కనుక మీకు అసాధ్యమైనదంటూ ఏమీ లేదు. కనుక కళలలో సిద్ధహస్తులైన గంధర్వాది సమేతులై ఆ అర్జునుని తపస్సుకవరోధం కలిగించేండి. ఎంతటి వీతరాగుల్నో ఆకర్షించిన మీకు ఈ సామాన్యుణ్ణి లోగొనటం అసాధ్యమేమీ కాదు. పైగా అతడేమీ మోక్షార్థికాడు. మోక్షార్థి అయితే ధనుస్సు నెందుకు తనతో ఉంచుకొంటాడు? దీనివల్ల అతడు శత్రువులను వధించి విషయసుఖాల్ని అభిలషిస్తున్నాడని తేట తెల్లం అవుతోంది. అతనివల్ల మీకు శాపభీతికూడా లేదు. ఎందుచేతంటే పరాక్రమవంతులు స్త్రీ హింసకొడిగట్టరు" అప్సరోగణం దేవతలెదుట దేవేంద్రుడు తమను ప్రశంసించినందుకెంతో ప్రీతినొందింది. తమను నియోగించిన కార్యంలో మగ్నలు కావటానికి అప్సరసలు కృత నిశ్చయలైనారు.

అటు పిమ్మట అప్సరోగణం దేవేంద్రునికి నమస్కరించి తమ తమ గృహాలకు బయలుదేరేరు. ప్రభుసన్మానంతో సంతోషంతో కమలాల కాంతిని పోలి నిశ్చలంగా ఉన్నవారి అందాన్ని వీక్షించేటానికి దేవేంద్రునికే తన సహస్రనేత్రాలూ చాలలేదట!.

ఇక్కడితో 47 శ్లోకాలతో ఉన్న షష్ఠసర్గపూర్తై కర్తవ్య పరాయణత్వంతో కార్యోన్ముఖులై బయలుదేరిన అప్సరోగణం ప్రయాణాన్ని వర్ణించే 40 శ్లోకాలతో ఉన్న సప్తమసర్గ ఆరంభమౌతుంది. ఈ అప్సరసలతో పాటు వారి రక్షణార్థం దేవేంద్ర సహచరులైన గంధర్వులు సైతం బయలుదేరేరు.



సప్తమాష్టమ నవమ సర్గలు మూడూ గంధర్వాప్సరసల ప్రయాణాన్ని వర్ణించేవే. అయితే ఈ మూడు సర్గల్లోనూ కథ ఏమీ నడవకపోయినా కవి భావనా పటిమకు అద్దం పట్టేవిగా ఉంటాయి. ఉదాహరణకు అప్సరోగణాలు సూర్యునికి పై భాగాన వెళ్ళటం వలన వారి ఆతపత్రాలు సార్థకం కాలేదంటాడొక శ్లోకంలో. మఱొకశ్లోకంలో, వారు వాయు మండలానికి చేరిన తరువాత గాలి ప్రతికూలంగా వీచేటంవల్ల వారు వారి కార్యంలో సఫలీకృతులు కారనే విషయాన్ని ధ్వనింపజేస్తాడు. చాలా శ్లోకాలు కవి పాండిత్య ప్రకర్షాద్యోతకాలుగా నిలుస్తాయి. గంగానది దిక్కులనే స్త్రీలు అల్లిన జేడ వలె ఉందనేటటువంటి ఉపమలు, రథాలపైనున్న ధ్వజాలు ముందుకుసాగుతుంటే ఆకాశంలోని రంగులను దీర్ఘతరం చేస్తోందా అన్నట్లుందనేటటువంటి ఉత్ప్రేక్షలు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే 'సత్పురుషుల బాధసైతం ఇతరులకుపకరించేటం లోనే ప్రతిఫలిస్తోంది" అనేటటువంటి అర్థాంతరన్యాసాలు హృద్యంగా ఉంటాయి. గాలి కాముకుని వలె దేవతా స్త్రీల జఘనంపై పదేపదే వస్త్రాల్ని తొలగిస్తూ ఉంటే వారు ధరించిన మణిమేఖలల కాంతిపుంజం లోపలి వస్త్రం వలె భాసించివారి ఊరువులను కనబడకుండా చేసిందనటం ఒక మనోజ్ఞమైన ఊహ. ఈ శ్లోకంలో "కాముకునివలె" అని వాచ్యం చేయకపోయినా దానిని భావించుకోవటంలోనే సొగసు. 'జఘున' శబ్దం వాడటం దీనికుపోద్బలకం.

*"సంవాతా ముహురని లేన నీయమానే*
*దివ్యస్త్రీ జఘున వరాంశుకే వివృత్తిమ్ ।*
*పర్యస్య త్పృథుమణి మేఖలాంశుజాలం*
*సంజజ్ఞే యుతకమివాంత రేయ మూర్వోః ॥ (7-14)*

అప్సరాంగనలు, గంధర్వులతో సలిపిన ప్రణయకేళి అష్టమ సర్గలో వర్ణితమైంది. దేవేంద్రుడాదేశించిన పనిని మాని వీరి ప్రణయకేళిని

వర్ణించేటంలో ఔచిత్యం చింత్యం. ప్రియుడు ప్రియురాలిని (లేదా భర్త భార్యను) వేఱొక స్త్రీ పేరుతో పిలువటం గోత్రస్ఖలనమంటారు. అలా జేరిగినప్పుడు భార్యలేక ప్రేయసి కోపగించేటం సహజం కదా! దేవేంద్రుడు పంపిన గంధర్వులూ అప్సరలూ ఒక ఉద్యానవనంలో విడిది చేసేరు. చేక్కని ఆ ఉద్యానవనంలో అందమైన పూలందుబాటులో ఉన్నా అప్సరలు తాము వాటిని కోయకుండా గంధర్వుల్నే కోసి తమ జేడలలో అలంకరించేండని కోరేరు. ఇది ఉభయులకూ ప్రమోదహేతువు. అపుడొక గంధర్వుడు పూలుకోసి అప్సరకు ఇస్తూ ఆమెను మఱొక పేరుతో పిలిచాడు. ఆమెకు కోపం మిన్నంటింది. దానికి దుఖంతోడ్డైంది. ఆమె దుఖంతో కూడిన కోపంతో కన్నీటితో నేలను తాడించింది. ఇదొక మనోహరమైన సన్నివేశకల్పన!

*“యచ్ఛతోచ్చైః కుసుమాని మానినీ*
*విపక్ష గోత్రం దయితేన లంభితా।*
*న కించిదూచే చరణేన కేవలం*
*విలేఖ బాష్పాకులలోచనా భువమ్ ॥ (8-14)*

ఈ గంధర్వాప్సరల ప్రణయకేళి వ్యాజంతో కవి నాయికా భేదాల్ని హృద్యంగా చిత్రించాడు. అనంగశాస్త్ర రహస్యాలు సంపూర్ణంగా తెలియనిది ‘ముగ్ధ’ అయితే వాటిని సంపూర్ణంగా అవలోడనం చేసికొని ప్రయణకేళిలో పటుత్వాన్ని ప్రదర్శించేది ప్రగల్భ. ఒకానొక అప్సర తన ప్రియునితో ప్రసంగిస్తూ అతణ్ణి తదేకదృష్టితో చూస్తూ తన చీర ముడి విడిపోయినా పట్టించుకోలేదు. తన చేతులతో వృథాగా పుష్పాల్ని స్పృశించేటం కూడా గమనించేలేదు. మఱొక అంగన ప్రియుడిచ్చిన పల్లవ కలిత పుష్పమాలికను విలాసంగా తలలో తురుముకొంటూ తన వక్షోజద్వయంతో అతని ఱొమ్మును గట్టిగా అదుముతూ తన ఘనమైన జఘనంతో అతణ్ణి పరితుష్టుణ్ణి చేసిందట!



*“సలీల మాసక్త లతాన్త భూషణం*
*సమాసజంత్యా కుసుమావతంసకమ్।*
*స్తనోపపీడం నునుదే నితమ్బినా*
*ఘనేన కశ్చిజ్జఘనేన కాంతయా ॥ (8-16)*

‘ప్రౌఢ’ల అంగాంగ ప్రదర్శన, నాయికానాయకుల జలక్రీడ, అందులో ప్రదర్శితమైన అప్సరాంగనల వివిధాంగాలవర్ణన వంటి సన్నివేశాలు కవి ఉపమా ఉత్ప్రేక్షాద్యలంకారాలతో సహృదయుల మనస్సులను దోచుకొంటాయి.

జలక్రీడ తరువాతమిగిలేది రతిక్రీడే కదా! నవమసర్గంతా అదే! మొదటి శ్లోకంలోనే సూర్యాస్తమయమైందనే విషయాన్ని, అప్సరలు, గంధర్వులు సంభోగోత్కంఠతో ఉన్నారనే విషయం గ్రహించి వారికంట పడకుండా ఉంటే మంచిదనీ, వారికి ప్రీతి కలిగించిన వాణ్ణౌతాననీ సూర్యుడస్తమించాడట! చంద్రోదయవర్ణనం, రాత్రి, నక్షత్రాల వర్ణన సాగుతుంది. రాత్రి అనే వనిత మన్మథుని పట్టాభిషిక్తునొనర్చటానికి ఎత్తిన రజిత కలశంవలె చంద్రుడు ఒప్పేడన్నకల్పన మనోజ్ఞమైంది. ఆ మన్మథుడు చంద్రకిరాణాలనే తూపులుగా తీసికొని ధనుర్ధారి అయ్యాడట! ఈ ఘట్టంలో భారవి అష్టవిధనాయికలను పాఠకుల మనఃఫలకంపై చిత్రిస్తాడు. నవమ సర్గ అంతా భారవి కవితా ప్రౌఢిమకు, శాస్త్ర పాండిత్యానికీ దర్పణప్రాయ మౌతుంది. అప్సరాంగనలు గంధర్వులతో యథేచ్ఛగా సలిపిన శృంగార క్రీడలు వర్ణితాలైనయి. మద్య సేవనాది కామోద్దీపక కార్యాల్లో గంధర్వుల కంటె అప్సరసలే ముందడుగు వేసినట్లు కవి వర్ణించాడు. అప్సరసలు గంధర్వులను రెచ్చగొట్టి వారితో సురత క్రీడలో సంతుష్టులైనట్లు కవి వర్ణించాడు. ఇది పఠిస్తుంటే

**"స్త్రీణాం ద్విగుణమాహారః బుద్ధిశ్చాపి చతుర్గుణా।**
**సాహసం షడ్గుణంచైవ కామమష్ట గుణం భవేత్ ॥ "**

అన్నశ్లోకం జ్ఞప్తికి వస్తుంది.

ఇక దశమ సర్గ దేవేంద్రుడు అప్సరలను అర్జునుని వద్దకు పంపిన కార్యారంభంతో ప్రారంభమౌతుంది. క్రూరమృగాలు, సాధుజంతువులు పరస్పరమైత్రితో ఉండటం వల్ల అదే అర్జునుని తపోభూమి అని గుర్తించారు. విస్మితమైన అప్సరోగణం భూమిపై అర్జునుని పాదముద్రలను చూచి మఱింత ఆశ్చర్యచకితలై అతడర్జునుడే అన్న దృఢనిర్ణయానికి వచ్చింది. ఆ పాదముద్రలతో సామాన్యమానవుల పాదముద్రలలో ఉండని చక్ర, ధ్వజ చిహ్నాలుండటమే కారణం. ఉగ్రత, ప్రశాంతత రెండూ అతని ముఖంలో ఆ కామినులకు ప్రస్ఫుటంగా కనిపించాయి. రూపం చేతనే ఇతడు త్రిలోకజేత అని గ్రహించిన అచ్చేరలకు అతడింకెందుకు తపమాచరిస్తున్నాడోననే విషయం అంతుపట్టలేదు. అర్జునుని ప్రలోభపెట్టి తమవశం చేసికోవాలనే పట్టుదలతో వచ్చిన అచ్చేరలు వింతగా తమ మనస్సునదుపులో ఉంచు కోలేక తామే అతనిపై మదనుని బారికి గుఱియైనారు. మన్మథుడు ఆ అప్సరలనావేశించేటం తోటే వివిధ ఋతువుల శోభ వనంలో వ్యాపించిందట ! ఒక్కొక్క ఋతువు తన ప్రత్యేకతతో స్త్రీ పురుషుల్ని పరస్పరం ఆకర్షితుల్ని చేసినా అర్జునుని ఏమాత్రం ప్రలోభపెట్టలేకపోయింది. ఆ తరువాత భారవిమహాకవి, అర్జునుని చూచి మన్మథపీడితలైన అప్సరసల మన్మథావస్థల్ని వర్ణిస్తాడు. తరువాత ఒక అప్సర చెలి అర్జునుని సమీపించి "నీవిరహంతో మరణదశకు చేరిన మా చెలిని అనుగ్రహించు. తపస్సుకు అంతరాయం ఏర్పడితే తిరిగి తపస్సు చేసికోవటం సులభమే కాని తనంతతా వలచివచ్చే వనితతో సుఖానుభవం దుర్లభం" అని చెప్పినా ఆ ధీరునకు వ్రతభంగం కాలేదు. అనేకాప్సరలు



తమ సౌందర్యం వ్యక్తపఱచే వివిధ హావభావాలు చూపినా అంగాంగ ప్రదర్శనలు చేసినా అర్జునుని ఏమాత్రం ప్రలోభ పఱచేలేక పోయాయి. విఫలురైన అప్సరలు గంధర్వులతో తమ నెలవులకు మరలేరు.

ఏకాదశ సర్గ అప్సరలు తమ వైఫల్యాన్నీ, అర్జునుని జితేంద్రియత్వాన్నీ దేవేంద్రునికి విన్నవించుకోవటంతో ఆరంభమౌతుంది. వారి మాటలకు ఇంద్రుడు తన కుమారుని నైశ్చల్యానికి సంతోషించి ఒక వృద్ధుని రూపంలో అర్జునుని సమీపించాడు. పలిత కేశరాజితో చంద్రకిరణాలతో కూడిన సంధ్యాకాలం వలె ఇంద్రుడు ప్రకాశించాడు. అతని చేతికఱ్ఱ భార్యవలె అతనికి చేయూత నిచ్చిందట! అసమాన ప్రకాశంతో కూడిన ఆ వృద్ధరూపంలో ఉన్న దేవేంద్రుని చూచిన అర్జునుని మనస్సులో స్నిగ్ధత చోటు చేసికొంది. తెలియకపోయినా బంధు సంసర్గం ఆనందహేతు వౌతుందంటాడు భారవి. ఇదిలోకానుభవానికి ఎంతో దగ్గఱగా ఉన్న అంశం!

**"అభితస్తం పృథాసూనుః స్నేహేన పరితస్తరే।**
**అవిజ్ఞాతేఽ పి బన్ధౌ హి బలాత్ప్రహ్లాదతే మనః ॥ (11-8)**

అర్జునునిచే ఆతిథేయ సత్కారాన్ని పొందిన ఇంద్రుడొకింత విశ్రాంతి నంది "నూత్న యౌవనంలో నువ్వు చేస్తున్న పని ప్రశంసార్హమే. అయితే మా వంటి వృద్ధులు సైతం ఇటువంటి సందర్భాల్లో విషయలోలురు కావటం సహజం. ఆకారసదృశమైన గుణసంపద లోకంలో దుర్లభం! యౌవనశ్రీ శరదృతుమేఘ సదృశమై చంచలమైంది. విషయసుఖాలు తత్కాల ప్రమోదహేతువులైనా కాలాంతరంలో పరితాప కారకాలే! ప్రాణులకు ఆపదలెప్పుడూ సన్నిహితమై ఉంటాయి. కనుక బుద్ధిమంతుడు సంసారాన్ని వీడి మోక్షాసక్తుడుకావటం ప్రశంసార్హమే కాని నీ వేషమే నాకు

సందేహాస్పదమౌతోంది. మోక్షార్థికి అమ్ములపొదులతో కూడిన భీషణమైన ధనువుతో ఏం పని? దానికి తోడు ఈ ప్రచండమైన ఖడ్గం ఒకటి! శాంత రూపులైన తపోధనులెక్కడ? క్రోధానికి చిహ్నమైన ఆయుధం ఎక్కడ? కనుక చూస్తుంటే నువ్వు శత్రుజయాభిలాషివిగా కనిపిస్తున్నావు. మోక్షానికనుగుణమైన ప్రక్రియను ఎవడు హింసకు వినియోగిస్తాడో వాడు మూర్ఖుడు. అర్థకామాలుకూడా సేవింపతగిన పురుషార్థాలే అంటావేమో?! అసత్యం, హింస, చౌర్యాది దుర్గుణాలకీ అర్థకామాలే మూలం. అవి తత్త్వజ్ఞాన నిరోధకాలు, వినాశహేతువులు. హింసతో చంచలమైన సంపదలనార్జిస్తే నదులకు సముద్రం వలె ఆపదలకు స్థానమౌతుందని ఎంత చేక్కగా చెప్పేడో చూడండి!

*"అభిద్రోహేణ భూతానామర్జయన్ గత్వరీః శ్రియః।*

*ఉదన్వానివ సింధూనామాపదామేతి పాత్రతామ్॥ (11-21)*

అనిష్టమైన వాటితో సంయోగం, ఇష్టులతో వియోగం, మనస్సుకు దుఃఖాపాదకమే అవుతుంది. బాహ్య శత్రువులను జయించేటం కంటె అంతశ్శత్రువుల జయమే యోగ్యమైంది.

జింత్రేదియులు కాని వారు స్వకార్యనిర్వహణలో పరాధీనులౌతారు. నీచవృత్తి, నిర్లజ్జకలిగి పశువువలె వేఱొకరి ఆజ్ఞానువర్తులౌతారు. ఈనాటి సుఖం రేపటికి స్మరణీయమే అవుతుంది. కనుక సుఖాలను స్వప్నతుల్యంగా భావించి కామ పరతంత్రతను పొందకపోవటమే నిశ్శ్రేయస సిద్ధిని కలుగజేస్తుంది. ఎంతో రమణీయమై ఉపనిషత్తును జ్ఞప్తికి తెచ్చే ఈ శ్లోకం హృద్యమైంది.

*"శ్వస్త్వయా సుఖసంవిత్తిః స్మరణీయాధునాతనీ।*

*ఇతి స్వప్నోపమాన్ మత్వా కామాన్ మా గాస్తదఙ్గతామ్॥ (11-34)*



ఈ మాటలు విన్న కవ్వడి అతనిమాటలు వేదతుల్యమైనవని ప్రశంసించాడు. ఇతరులు ఉల్లంఘించేటానికి వీలులేనివి, గాంభీర్యంలో సాగరతుల్యమైనవంటూ శ్లాఘించాడు. కాని తాను ఆయన మాటలననుసరించేటానికి పాత్రుణ్ణికాదని విన్నవించాడు. తాను కుంతీ పాండురాజుల పుత్రుడైన ధనంజయుణ్ణనీ, తన అగ్రజుడు యుధిష్ఠిరుని ఆజ్ఞ మేరకే తపం కావిస్తున్నట్లు విన్నవించాడు. "కృష్ణద్వైపాయనుని ఆజ్ఞతోనే దేవేంద్రుని ఆరాధనా తత్పరుణ్ణైనాను. మాయాజూదంలో ధర్మజుడు మా నలుగురు సోదరుల్ని, తనను ద్రౌపదిని కూడా ఒడ్డి ఓటమి పాలయ్యాడు. సభలో శత్రువులు మమ్మల్ని మర్మచ్ఛేదకమైన మాటలతో దూషించేటమే కాక ద్రౌపదిపైటని తొలగించి అవమానించారు. దుశ్శాసన హతకుడు ద్రౌపదిని పూజ్యులున్న సభాస్థలికి ఈడ్చుకొనివచ్చాడు. నిస్సహాయులైన పతుల స్థితికి ద్రౌపది కన్నీరు కార్చింది. ఇంతటి పరాభవాన్ని మా అన్న ధర్మజుడే సహించాడు. శత్రుజయమన్నది ఎప్పటికైనా నిశ్చయంగా జేరిగేదే! అయితే సత్పురుషుల సమక్షంలో నింద భరింపరానిది కదా! చెలియలికట్టను దాటని సముద్రం వలె మనస్వినుల మనస్సులు కూడ ప్రతిజ్ఞాభంగానికి పాల్పడవు. ధార్తరాష్ట్రులతో మా సౌహార్దమే శత్రుత్వానికి దారితీసింది. ధూర్తుల ప్రవర్తన ఊహాతీతమైంది. పరులచే పరాభూతమైన నా హృదయం బ్రద్దలైపోతుంటే ప్రతీకారం కోసం నా పౌరుషం తహతహలాడుతోంది. శత్రుకృతావమానంచే మృగసదృశులమై జీవిస్తూ ఉన్నాం. ఈ ప్రతీకారేచ్ఛకు మూలం క్రోధం కదా! అంతశ్శత్రువైన క్రోధాన్ని వీడవచ్చు కదా అంటే అది అభిమానధనులకు తగనిది. అభిమానహీనుడు గడ్డిపరకతో సమానుడౌ తాడంటాడు.

*"శక్తి వైకల్య నమ్రస్య నిః సారత్వాల్లఘీయసః।*

*జన్మినో మానహీనస్య తృణస్య చ సమాగతిః॥ (11-59)*

అభిమానవంతుని కీర్తి సంపదలు చిరస్థాయిగా ఉంటాయి. అది లేనివాడు హీనుడై అన్నీ కోల్పోతాడు. ఎవనివల్ల వంశం నిలబడి తమ వంశీయులకు కీర్తి ప్రతిష్ఠలు కలుగుతాయో వారివల్లనే ఈ భువికి 'వసుంధర' అనే పేరు సార్థక మౌతుంది. అకలంకమైన వారి కీర్తి చంద్రమండలాన్నే అధఃకరిస్తుంది.

*"గురూం కుర్వన్తి తే వంశ్యా నన్వర్థా తైర్వసున్ధరా।*
*యేషాం యశాంసి శుభ్రాణి హ్రేపయన్తీన్దుమణ్డలమ్॥ (11-64)*

సాగరతరంగాల్లా చంచలమైన సుఖాలు కాని, అర్థం కాని నాకక్కఱలేదు. వినాశాన్ని కలిగించే శస్త్రాలపై భయంతో మోక్షాన్ని కూడా నేను కోరటం లేదు. సత్పురుషులు నన్ను అపహసిస్తే అపహసింతురుగాక! లేదా నాబుద్ధి సక్రమ మార్గంలో ప్రవర్తిం చేకపోవచ్చు కాక! నాకు నీవుచేసిన సదుపదేశం అస్థానపతితమైందని ఏమీ అనుకోకు. శత్రువుల్ని సమూలం నాశనం చేసి వంశ కీర్తిప్రతిష్ఠల్ని ఉద్ధరిం చేనిదే మోక్షాన్ని కూడ విజయలక్ష్మికి అవరోధంగానే భావిస్తాను. శత్రువు లపహరించిన కీర్తిని పరాక్రమంతో పొందనంతవఱకూ మనిషి మృతకల్పుడే. అథవా తృణకల్పుడు. తపోధనా! పోనీ నువ్వేచెప్పు. శత్రువుల్ని జయిం చేకుండా ఎవని క్రోధం ఉపశమిస్తుందో వాడు పురుష శబ్ద వాచ్యుడౌతాడా? కేవలం జాతిమాత్రం చేత పురుషుడనుకోవటంలో ఒరిగేదేముంది? పశుపక్ష్యాదుల్లో సైతం స్త్రీ పురుషవిభాగం ఉంది. గుణపక్షపాతులైన సజ్జనులు ఎవరిని శ్లాఘిస్తారో వారే నిజమైన పురుషులు. ఎవడు శత్రువులకు సైతం కీర్తనీయుడౌతాడో వాడే నిజమైన పురుషుడు. ధర్మజుడాశలన్నీ నామీదే పెట్టుకున్నాడు. ఎందుకిన్ని మాటలు! వాతోద్ధూత మేఘంవలె నేనీ ఇంద్రకీలాద్రిలో విలీనమైనా కావాలి. లేదా దేవేంద్రుని తపస్సుచే మెప్పించి అపకీర్తి అనేశల్యాన్నైనా పెకలించాలి. ఇదే నా నిశ్చయం."



ఇంద్రుడు అర్జునుని దృఢనిశ్చయానికి సంతోషించి తన రూపాన్ని చూపి హస్తద్వయంతో కౌగిలించుకొన్నాడు. శ్రేయః ప్రాప్తికి దుఃఖ నివారకమైన శివుని ఆరాధించుమని ఆదేశించాడు. "పినాకి పరితుష్టుడైతే లోకపాలురతో సహా ముల్లోకాలాను జయించే పరాక్రమాన్నార్జిస్తావు. శత్రువుల రాజ్యలక్ష్మి నీయందనురాగవతి అవుతుంది." అనిచెప్పి అంతర్ధాన మయ్యాడు. దేవేంద్రాంతర్ధానంతో ఏకాదశ సర్గ సంపూర్ణమౌతుంది. అనంతరం దేవేంద్రోప దేశాన్ననుసరించి త్రిలోచనుని గూర్చి ప్రశాంతాంతః కరణంతో ధనంజయుడు విధ్యుక్తంగా శివారాధనాతత్పరుడు కావటంతో ద్వాదశసర్గ ఆరంభమౌతుంది.

నిరాహారియై సూర్యుని కభిముఖంగా ఒంటికాలిపై నిలిచి బాహ్యాభ్యంతర శుచియై అనేక దినాలు పార్థుడు పర్వతోపమధీరుడై తపశ్చర్య కొనసాగించాడు. అందుబాటులో ఉండి పక్వమై సుగంధా న్నీనుతున్న ఫలాలు, స్వచ్ఛమైన జలం కూడ అతణ్ణి ప్రలోభ పెట్టలేక పోయాయి. నిర్జలోపవాసాలతో శరీరాన్ని శుష్కింపచేసినా, అతని తపస్సే అమృతాయమానమై సత్త్వగుణం నిరుపమానమై పట్టుదలనేమాత్రం సడలిం చేలేదు. తపస్వులకు సైతం అర్జునుడర్ధరాత్రి సమయంలో జ్వలిస్తున్న అగ్నిహోత్రునివలె, సాగరగంభీరుడై శైలసమున్నతుడై గోచరించాడు. ఊర్ధ్వబాహుడైన అర్జునునితేజస్సు అమరులకు, ఋషిసత్తములకే ఆశ్చర్యాన్ని కలిగించింది. కృష్ణపక్షరాత్రుల్లో కూడా చంద్రుడు ప్రకాశిస్తున్నాడా అనే అనుమానాన్ని పగళ్లలో సూర్యకాంతి మందగించిందా అనే భ్రాంతిని కల్గిస్తున్నాడా అర్జునుడు. జడలనుండి ఉత్పన్నమౌతున్న అరుణకిరణాలు ఎక్కుపెట్టిన శరాసనం గల అర్జునుని జనులు త్రిపురాసురవధకుద్యుక్తుడైన మూడవ కన్ను తెఱువని ముక్కంటిని గానే చూచారు. అతడు చేసే ఘోరమైన తపస్సు మానవమాత్రుడెవడూ చేయలేనిది కనుక దేవేంద్రుడో, ఆదిత్యుడో, అగ్నిహోత్రుడో అయి ఉండాలనుకొన్నారు. అర్జునుని తపస్సు వల్ల

ఉద్బుద్ధమైన మహాతేజస్సు అగ్నివలె వృక్షాల్ని దహించేక పోయినా, సూర్యుని వలె నీటిని ఇంకించేకపోయినా మహోగ్రమై దుర్నిరీక్ష్యమై తోచేటంతో మహర్షి బృందం శివుని శరణువేడింది. అవధిమీఱిన కాంతిలో వస్తు సందర్శనం దుష్కరమైనట్లే మహర్షులకు కవ్వడి అమోఘ తపఃపుంజంతో శివదర్శనం కూడా కష్టసాధ్యమైంది. మహర్షిగణం స్తోత్రంతో శివుడు వారికి ప్రత్యక్షమయ్యాడు. ఋషిపుంగవులు ఒక నరుడు మహోగ్రమైన తపస్సాచరిస్తూ వృత్రాసురుని వలె భయంకరుడై ఉన్నాడనీ, అతని అడుగులతో భూమి కంపిస్తోందనీ, దిశలు, వాయువు, సూర్యాది నవగ్రహాలు, నక్షత్రాల గతులు స్తంభించిపోతున్నాయనీ కనుక వెంటనే రక్షించాలనీ వేడుకొన్నారు.

మునులపలుకులాలకించిన శంకరుడా తపస్వి పూర్వం బదరికాశ్రమంలో ఉన్న నారాయణుని అంశ అయిన నరుడేననీ, కనుక అతణ్ణి సామాన్య మానవునిగా భావించేవద్దనీ చెప్పేడు. భూమిపై అసుర సంహారార్థమే నరనారాయణులు కృష్ణార్జునులుగా అవతరించారని చెప్పి వారికి అభయమిచ్చాడు.

నరనారాయణుల్లో నరుడే అర్జునుడని తెలిసి కొన్న మూకాసురుడు అతణ్ణి సంహరించేటానికి తననెవరూ గుర్తించేకుండా వరాహ రూపంలో బయలు దేరుతన్నాడనీ, ఋషిపుంగవులను కూడ తనతో త్వరగా రమ్మనీ చెప్పేడు. క్షణంలో శివుడు కిరాతసేనాధిపతిగా మాఱేడు. ప్రమథగణం ఆయుధాలు ధరించి కిరాతసైన్యంగా రూపొందేరు. ఇంద్రకీలాద్రినానుకొన్న ఉన్న అటవీ ప్రదేశంలో వారంతా వ్యాపించి భయంకరమైన అఱుపులతో తిరుగాడసాగేరు. ఈ సందర్భంలో భారవి వర్ణనలు అతనికి గల అపూర్వ ప్రకృతి పరిజ్ఞానానికి ఆటపట్టై నిలుస్తాయి. వీటిలో కొన్ని పేర్లే మనకి తెలియవు. అథవా ఏ నిఘంటు సహాయంతోనో అర్థం తెలిసికోవాలను



కొన్నా అది ఏ "వృక్షవిశేషమ" నో, "పుష్పవిశేష"మనో, "ఒకానొకశిల" – ఇత్యాదిగా తెలియవస్తుందేకాని అంతకుమించి మఱేమీ ఉండదు. ఈయన వర్ణనలు ఆనాటి ప్రజలకు ప్రకృతితో ఉండే సన్నికర్ష సంబంధాన్ని వ్యక్తం చేస్తాయి. కవి చేక్కని సన్నివేశ చిత్రాన్ని మన ముందుంచుతాడు. ఉదాహరణకీ సర్గలోని 46-54 శ్లోకాల్లో ఉన్న వర్ణనలను తీసికోవచ్చు.

అనేక మృగ, పక్షిసంఘాల కోలాహలం మిన్నుముట్టింది. మృగసముదాయం సహజవైరాన్ని వీడి భయాకులతతో పరుగిడజొచ్చింది. భయం ప్రబలమైనప్పుడు సహజ శత్రుత్వం కూడ మఱుగున పడుతుంది కదా! గజ మద జల సువాసనా భరితమైన కేసరాలతో కూడిన సింహాలు ఆవులిస్తూ నిద్రమేల్కొని ధైర్యంగానే ప్రమథగణాల్ని చూచాయి. పరుగిడుతున్న ఏనుగులవల్ల చందనవృక్షాలు కూలేయి. అలా కూలటంలో వాటి రసికారి ఆ రసంతో చుట్టుపక్కల నదులలోని నీరు ఎఱుపువర్ణంగా మాఱింది. ఆ నీటిలోని చేపలు భయంతో ఎగిరిపడసాగేయి. ఆడవి దున్నల ఘర్షణకి అగురు, తమాల, తుంగదుంపల వాసనలు గాలితో కలిసి చుట్టుపక్కల వ్యాపించాయి. అంతేకాక రాళ్లలో మొలిచే శిలాజిత్తు నుండి ఉద్బుద్ధమైన వాయువు పథికుల పరిశ్రమను పరిహరిస్తోంది.

ప్రాణులకు పరితాపాన్ని కల్గించే వేసవిలోవలె సరస్సులు కలచిన నీటితో ఉన్నాయి. నీటి పారుదల వల్ల అరటి చెట్లు, నివ్వరిధాన్యం పతితమైంది. తామరకాడలు విశీర్ణమైనాయి. ఇదంతా శంకరుడు తన సంకల్పమాత్రంతో సృష్టించిన సంక్షోభమే కాని సహజసిద్ధం కాదు. ఈ విధంగా ఆ అడవి అంతా ఒక భయానకమైన వాతావరణాన్ని సృష్టిస్తూ ఉమాపతి ఆడలేళ్లు కొఱికిన లతాసమన్వితమైన ఇంద్రసూతి ఆశ్రమాన్ని చేరేడు. శివుడు అర్జునుని కెదురుగావచ్చిన మూకాసురుని చూచాడు. తరువాత కిరాత సేనారూపంలో ఉన్న ప్రమథగణాన్ని అక్కడే నిలిపి, కొంత

మంది కిరాతవీరుల్ని తనతో తీసికొని సూకరం అడుగుజాడల్ని అనుసరిస్తూ బయలుదేరేడు ఇక్కడితో ద్వాదశసర్గ సమాప్తినొందటంతో మూకాసురుని మట్టిగఱపిం చేటానికి త్రయోదశ సర్గలో శంకరార్జునుల బాణ ప్రయోగం వర్ణితమైంది.

రెండు కోఱలతో, భయంకరమైన శరీరంతో పర్వతాలనుసైతం చీల్చగల పటిమతో తనవైపే వస్తున్న సూకరాన్ని అర్జునుడు చూచాడు. నిక్కపొడుచుకొన్న వెంట్రుకలతో కోపంతో తనపైనే దృష్టిని లగ్నం చేసి వస్తోందా సూకరం. మహావృక్షాలను సైతం తన ముట్టెతో అవలీలగా పెఱికి వేయగలిగిందిగా కనిపిస్తోంది. బలిష్ఠమైన తన భుజాన్ని తాటిం చేటంతో పర్వత సానువుల్ని కూడా పడగొట్టగలిగిందిగా తోస్తోంది. ఒంటిగా తనను సమీపిస్తూ వస్తున్నందువల్ల తనను యుద్ధానికి పిలుస్తోందా అన్నట్లుగా ఉందని అర్జునుడనుమానించాడు. తపోవన ప్రభావం వల్ల మృగాలుసైతం హింసను వీడితే ఇదేమిటీ పంది తద్విపరీతంగా భాసిస్తోందని విజయుడు విచికిత్సకు లోనయ్యాడు. ఒకవేళ ఇదేమైనా మాయా? అనే అనుమానం కూడ కలుగక పోలేదు. తాను మునివృత్తి నవలంబించి ఉన్నాడు కనుక భయమెందుకనే భావం కూడా సరైంది కాదనిపించింది. ఎందుకంటే మాత్సర్యగ్రస్తులకు నీతితో పనేముంది? ఒకవేళ ఇదంతా దుర్యోధనుని పన్నాగమేమోననే ఆలోచన కూడా రాకపోలేదు. లేదా ఖాండవవన దహన వేళలో తక్షకుని కుమారుడైన అశ్వసేనుడు క్రోధంతో ప్రతీకారానికి సమకట్టేడా? లేదా భీమునిపై కోపించిన వాడెవడైనా పగతీర్చుకొనేందుకు పరుగెత్తుకువస్తున్నాడా? ఏమైనా ఆత్మరక్షణకు సూకరాన్ని వధిం చేటం తప్పదనే నిర్ణయానికి వచ్చి గాండీవంలో అమ్ముని సంధించి అల్లె త్రాటిని ఆకర్ణాంతం లాగటంతో ఒక మహాధ్వని ఉద్భవించి పర్వత గుహల్లో ప్రతిధ్వనించింది. అల్లంత దూరంలో శంకరుడు సైతం శరాన్నెక్కుపెట్టి



లాగేడు. ఈ విధంగా ఏకార్థసముపేతులైన శివార్జునులిరువురి మధ్యా సూకరం వినాశానికై నిలిచింది.

ఆ వరాహం అలా నిలవటం ప్రకృతి ప్రత్యయ సంబంధంవలె ఉన్నదని మహాకవి భారవి వ్యాకరణ శాస్త్ర సంబంధమైన ఉపమానం చెప్పేడు. ఏదైనా ఒక పదంలో ప్రకృతి, ప్రత్యయం అనే రెండు విభాగాలుంటాయి. ఈ రెండూ కలిస్తేనే 'పద' స్వరూపం ఏర్పడుతుంది.

*"న కేవలా ప్రకృతి ప్రయోగవ్యా నా ఽపి ప్రత్యయః"*

అని వ్యాకరణశాస్త్ర నియమం. మనం సులభంగా అర్థం చేసికోవటానికి తెలుగు పదమైన 'రాముడు' ని ఉదాహరణగా తీసికొందాం. 'రాముడు' అనే శబ్దంలో 'రామ' ప్రకృతి, 'డు' ప్రత్యయం. (సంస్కృతంలో అయితే రామ+సు) ప్రత్యయాన్ని తీసివేసి "రామ వస్తున్నాడ" ని కాని, ప్రకృతిని తీసివేసి "డు' వస్తున్నాడ" ని కాని అనం కదా! ఈ ప్రకృతి ప్రత్యయాలు కలిసినప్పుడే "రాముడు" అనే శబ్దం సిద్ధించింది. ఇక్కడ సిద్ధిం చేవలసిన కార్యం వరాహవధ. శివార్జునులు ప్రకృతి ప్రత్యాయాలు.

*"స భవస్య భవక్షయైక హేతోః సితసప్తేశ్చ విధాస్యతోః సహార్థమ్ ।*
*రిపురాప పరాభవాయ మధ్యం ప్రకృతి ప్రత్యయయోరివాను బన్ధః ॥" (13-19)*

వరాహం శివార్జునుల మధ్య చేరటంతోటే శివుని పినాకం నుంచి మదేభాలనుసైతం భయపెట్టే పిడుగువంటి బాణం ఆ వరాహాన్ని తాకింది. ఆ బాణం మహోరగాలకు గరుత్మంతుని ఱెక్కల ధ్వనివలె తోచి భయోత్పాతాన్ని కలిగించింది. సరిగా అదే సమయానికి కపి ధ్వజుని బాణం సైతం ఆకాశంలో గొప్పకాంతిని వ్యాపింపజేస్తూ పక్షి బృందం అఱపులవలె ధ్వనిస్తూ వరాహాన్ని భేదించింది. ఈ విధంగా వీరిద్దఱి బాణాలు వరాహానికి చెఱొకవైపూ నాటి ఆ సూకరం ప్రాణాల్ని హరించాయి. పంది మరణిం చేటంతో అర్జునుడు తన బాణాన్ని తీసికోవటానికి దాన్ని

సమీపించాడు. నీచునికి చేసిన ఉపకారంవలె తన బాణం ఆ పంది కళేబరంపై కనిపించేక పోవటంతో తన పరాక్రమం వ్యర్థమైందని తలచి అర్జునుడు సిగ్గుతో అధోముఖుడైనాడు.

తన బాణాన్ని వెతుక్కొంటున్న అర్జునునికి హఠాత్తుగా ధనుర్ధారి అయిన ఒక కిరాతుడు కనిపించాడు. ఆ కిరాతుడు తన పద్ధతిలో అర్జునునికి నమస్కరించి సౌమ్యంగా "నీ ఆకృతిదేవతలను పోలి ఉండటం వల్ల నువ్వొక గొప్ప వంశంలో పుట్టినవాణ్ణిగా భావిస్తున్నాను. తేజోమయమైన నీ తపస్సు స్వచ్ఛమైందనిపిస్తోంది. మునివైనా ఇంద్రునిచే త్రిలోకాధిపత్యాన్ని నెఱపించే వానివిగా కనిపిస్తున్నావు. రజస్తమోగుణాలను జయించిన నీకు మోక్షం కూడా దుర్లభమైనదనిపించేటంలేదు. అయితే మహా తపస్వి వయిన నీకు మా ప్రభువు బాణం తస్కరించేటం తగినపని కాదు. మన్వాదులు మానవులనుసరించేవలసిన మార్గాన్ని నిర్దేశించారు. నీవంటివాడే దాన్ని అతిక్రమిస్తే ఇకదాన్ని అనుసరించేవారెవరుంటారు చెప్పు. ఆయన వధించిన మృగాన్ని కొట్టటం ఒక అపరాధమైతే మా నాయకుని బాణాన్ని స్వీకరించేటం మఱొక దోషం. ఒక వేళ మా దొర ఈ మృగాన్ని వధించేకపోయి ఉంటే ఇది నిన్నేంచేసి ఉండేదో ఎందుకులే చెప్పటం? ఇంద్రుని వజ్రాయుధంకటె బలిష్ఠమైన ఈ మృగాన్ని మా ప్రభువు తప్ప చేంపగలిగిన వాడెవడు? కనుక మా రాజు నిన్ను ప్రాణాపాయం నుంచి కాపాడినవాడు. అందువల్ల ఆయనతో విరోధించి కృతఘ్నునివి కాక స్నేహంచేసి మఱింత ఉపకారాన్ని పొందు. అన్ని లాభాల్లోను మిత్రలాభమే శ్రేష్ఠమైంది. శత్రునిబర్హణార్థమే నువ్వు తపస్సుకి పూనుకొన్నావని తెలుస్తోంది. కనుక మా రాజుతో స్నేహం చేస్తే నీ సమస్తమైన తపస్సుకూ ఫలం చేకూరుతుంది. ఇతరులు దుమ్ములేపినా సహించేని మా ప్రభువు ఆశ్రితుని ప్రాణాలిచ్చైనా రక్షిస్తాడు. కనుక అతని



బాణాన్ని అతనికిచ్చివేస్తే మీఇద్దఱికీ శ్రీరామసుగ్రీవులకు వలె మైత్రి చేకూరుతుంది. ఒకవేళ ఇటువంటి బాణాలే నీకు కావాలనుకొంటే మా రాజుతో స్నేహం చెయ్యి. దీన్నిమించిన బాణాలు ఆయనవద్ద బోలెడున్నాయి. నువ్వర్థిస్తే ఈ సమస్త భూమండలాన్నే జయించి నీ పరం చేయగలిగిన మహానుభావుడాయన. తపస్విల్లో ఒక్కపరశురాముడుతప్ప అస్త్ర విద్య నాపోశన పట్టిన వాడెవడు? అందువల్ల మా రాజును కాదనటం నీకు మంచిది కాదు. మునిసహజ చాపల్యంతో మారాజెన్నుకొన్న ఈ మృగాన్ని నీవు కొట్టినా ఆయన క్షమించాడు. ఎందుకంటే అజ్ఞాన కృత దోషం దోషంగా పరిగణించేం కదా పోనిలే! ఇప్పుడు చేసిన తప్పు మళ్ళీ ఎప్పుడూ చేయకు. నువ్వు చూడబోతే మంచివాడవుగా కనిపిస్తున్నావు. కనుక చాపల్యాన్ని వదిలి మా ప్రభువేదో కొండల్లో ఉండేవాడని అవమానించేకు సుమా! మహాస్త్రవిదుడైన మా నాయకుని దేవేంద్రుడంతటి వాడు స్వయంగా ఈ పర్వతాన్ని రక్షించుమని చెప్పటం వల్లనే ఇక్కడకు వచ్చాడు. ఓ తపోధనా! నీ అపరాధం మన్నించానని మా కిరాతపతి పలికేడు. కనుక ఆయన శరాన్ని ఆయనకిచ్చి సర్వ సంపదలనూ పొందు. ఆయనిక్కడే ఉన్నాడు చూడు" మంటూ వృక్షమధ్యంలో నిలిచిన కిరాతపతి రూపంలో ఉన్న ధూర్జటిని చూపి "బుద్ధిమంతుడవైతే శరణు వేడి ఆయన కనుకూలంగా వర్తించు. అప్పుడే నీ కోరికలన్నీ సఫలీకృతమౌతాయి" అని చెప్పి ముగించేటంతో త్రయోదశసర్గ సమాప్త మౌతుంది.

సాధువులు కోపాన్ని నిగ్రహించుకోగలవారు కనుక ఆ కిరాతుని ప్రగల్భాలు విన్నా సముద్ర జలం పర్వతాన్ని ఢీకొన్నా పర్వతం చలించేనట్లే ధనంజయుడు ధైర్యాన్ని వీడలేదు. అర్జునుడు కూడ వనేచరునితో ప్రసన్నంగా "అర్థగాంభీర్యం కల మాటతో శ్రుతి సుభగంగా ఉన్న నీమాటలు

శత్రువుకు సైతం వినదగినవి గా ఉన్నాయి. అందఱిమనస్సులను ఆకట్టుకొనే మాటలు మాత్రం దుర్లభమైనవి. వనేచరుడవైనా వక్తల్లో శ్రేష్ఠుడవు నీవు. ఏమైనా నువ్వు చేక్కని మాటకారివి. మీ రాజు బాణాన్ని నేనేమీ అపహరింపబోవటం లేదు. ఖాండవవన దహన సందర్భంలో అగ్నిహోత్రుడు నాకెన్నో అస్త్రాలిచ్చాడు. దేవతాస్త్రాల్లోనే ఏ ఇచ్ఛాలేని నాకు ఒక కిరాతుని బాణంపై ఎందుకు లోభం కలుగుతుంది? వన సంచారం చేసే మృగాలపై ఎవరికీ ప్రభుత ఉండదు. వేటాడిన వారికే ఆ మృగాలు చెందుతాయి. వ్యాసమహర్షి తాపసాశ్రమంలోనికి ఎవరినీ ప్రవేశింపనీయవద్దని నన్నాదేశించారు. తదనుగుణంగానే నన్ను చేంపటానికి వచ్చిన మృగాన్ని నేను చేంపేను. ఇందులో తప్పేం ఉంది? మేమిద్దఱం ఏక కాలంలో మృగాన్ని కొట్టేము. ఎవరుముందనే జిజ్ఞాసకిక్కడ తావే లేదు. అట్టి సందర్భంలో మీ దొరే ముందుకొట్టేడనటానికి మాత్రం ప్రమాణమేముంది? మీ రాజుని నేను బాణాన్ని యాచించేటం న్యాయం కాదు. మానధనుడు బలప్రయోగంతో తాను పొందగినది పొందుతాడే తప్ప యాచించి కాదు. నాపై నేరారోపణ చేసి బాణాన్ని పొందాలనుకోవటం అధర్మం. తెలిసికూడా చేయరానిది చేయటం అపాయకరం. అందుకే అంటారు "వినాశకాలే విపరీతబుద్ధిః" అని. ఖడ్గమో, బాణమో, కవచమో, విల్లో ఏది కావాలో అడుగుమని చెప్పు ఇస్తాను. లేదా పరాక్రమంతోనే నా నుండి తీసికోవాలనుకొన్నా మంచిదే. వర్ణాశ్రమ ధర్మ రక్షకులమైన మే మెక్కడ? హింసాజీవనులైన వేటగాళ్ళెక్కడ? ఏనుగులకు నక్కలతో మైత్రా? సత్పురుషులు నీచులతో వైరం పెట్టుకొంటే అది వారి కీర్తికే హానికరం కాదూ? మైత్రి నవలంబిస్తే వారి గుణాలు దూషితాలౌతాయి. కనుక ఉపేక్షించేటమే తగినపని. ఈ కారణంగానే మీ దొర మాటల్ని సహించానింత వఱకు. కాదు కూడదని బలప్రదర్శనతో దీన్ని గ్రహించే



తలిస్తే భయంకరమైన సర్పం పడగ పై మణిని తీసికోదలచే వానికి పట్టే దుర్గతే మీ దొరకూ పడుతుందని చెప్పు."

అర్జునుని మాటలను నివేదించేటానికి కిరాతుడు తమనాయకుడైన లీలాకిరాతుని వద్దకు వెళ్ళేడు. పిమ్మట కిరాతవేషధారి అయిన శివుని ఆదేశంతో యుగాంతంలోని ప్రచండ వాయువుతో ఎగసిన సముద్ర తరంగ ఘోషలా మహాసేన బయలుదేరింది. ఆ కిరాతసైనికుల కదలికలకు భూమి కంపించింది. వారి జయజయధ్వానాలకు దిక్కులు పిక్కటిల్లేయి. అర్జునుడు గాండీవాన్ని ధరించి నిశ్చలుడై ఉన్నాడు. అయినా అతని ముఖంలో గాంభీర్యం ఉట్టిపడుతోంది. నీటిలో ప్రతిఫలిస్తున్న సూర్యునివలె, పూర్వం బదరీవనంలో నారాయణునితో కలిసిన నరునివలె, సముద్రం నుంచి భూమి నుద్ధరింపబూనిన ఆదివరాహరూపి అయిన విష్ణువువలె, అధ్వరాహూతుడైన సాక్షాత్తురుద్రుని వలె అర్జునుడప్పుడు తోచాడు. ప్రమథులంతా ఎవరికివారే తామే జయిస్తామనే పట్టుదలతో వస్తే తీరా అతనిమూర్తిని చూసేసరికి వారికి పై ప్రాణాలు పైనే పోయాయి. మళ్ళీ అందఱూ కూడగట్టుకొని ఒక్కుమ్మడిగా అర్జునునిపై బాణాలు ప్రయోగించేసాగేరు. అప్పటికే ఆఱుమాసాలుగా కేవలం వాయు భక్షణతో శుష్కించి ఉన్నా కిరాతులు యుద్ధారంభం చేసేసరికి అర్జునునిలో పుష్టి పుంజుకొంది. వదులుగా ఉన్న కవచం గట్టిపడింది. ఒకసారి కిరాతసైన్యాన్ని చూచి గాండీవాన్ని ఎక్కుపెట్టి అప్పటికే కిరాతులు కురిపించిన బాణసమూహాన్ని మధ్యలోనే ఖండించాడు. అర్జునుని గాండీవం నుంచి వెలువడే బాణాలు దివి నుంచా భువి నుంచా దిక్కుల నుంచా సూర్యబింబం నుంచా ధనువు నుంచా లేక అతని శరీరం నుంచా - మఱెక్కడి నుంచైనా అనే విషయంలో ఇదమిత్థంగా ఎటూ తేల్చుకోలేకపోయారు కిరాతులు. అర్జునుని బాణాలు కిరాతుల మర్మఘాతుకాలైనా వారిని మాత్రం వధించేక

అథోముఖాలై హిమవంతునిలో ప్రవేశించాయి. శత్రువులపై నాటిన ప్రదేశంలో తిరిగి బాణాలను నాటక, నూత్న ప్రదేశాల్లో నాటేటట్లుగా అర్జునుడు బాణ ప్రయోగం కావిస్తున్నాడు. అర్జునుని బాణాలు శివసేనను గ్రీష్మర్తువులలోని సుడిగాలికి లేచిన ధూళివలె చెల్లాచెదఱు చేసేయి. ప్రమథగణంలోని వారు సుళ్ళుతిరిగి పోయారు. వారికి తపశ్శక్తితో ఇతడు సర్వదిశలనుంచీ ప్రయోగిస్తోందీ, లేక తమ బాణాలే తిరిగి తమపైకి వస్తోందీ తెలియలేదు. అర్జునుని బాణాలు కిరాతసైనికుల శరీరాల్లో భిన్నభిన్న ప్రదేశాల్లో నాటుకొని వారిని క్షతగాత్రులను చేసేయి. ప్రమథ సంఖ్యకనుగుణంగా అన్ని బాణాలను ఒకేసారి వదలటంతో ఏకకాలంలోనే కిరాతులందఱికీ గాయాలైనాయి. కిరాతసైన్యం అర్జునుని ప్రతిభకు అప్రతిభమై పోయింది. క్షణక్షణానికీ ద్విగుణీకృతంగా వచ్చి తమపై పడుతున్న శరాఘాతాలకు తట్టుకోలేక కిరాతరూపధారులైన ప్రమథులు "పోనీ ఇతడు విజయుడై యుద్ధాన్ని చాలించినా చరాచరజగత్తుకు స్వస్తి కలుగుతుందని భావించారు. కపికేతనుని శరాఘాతపీడిత శివసైనికులు సూర్యకిరణ జాలంతో ఇంకిన నీటివలె నిశ్చేష్టులై చక్రాకారంగా రూపొందేరు. ఆ పాండుసూనుని బాణాలు బ్రహ్మాండాన్నంతా కప్పివేయటంతో జయలక్ష్మి శివసేనా పక్షపాతాన్ని వదలుకోక తప్పలేదు. ఇక్కడితో చతుర్దశాశ్వాసం ముగుస్తుంది.

ఇక చిత్రయుద్ధవర్ణన కల పంచదశ సర్గ చిత్రకవిత్వంతో ఉండటం విశేషం. శబ్దప్రాధాన్యమున్న చిత్రకవితకు ఆలంకారికులంత ప్రాధాన్య మివ్వకపోయినా శబ్దార్థాలపై కవికి కల పట్టుకు, పాండిత్య ప్రతిభకూ ఇది నిదర్శనమై నిలుస్తుంది. 53 శ్లోకాలున్న ఈ సర్గలో దాదాపు పాతిక శ్లోకాల్లో ఈ చిత్ర కవిత్వం దర్శనమిస్తుంది. శ్లోకం శ్లోకమంతా ఒకే అక్షరంతో నడిపించేటం, రెండక్షరాలనే వాడి శ్లోకాన్ని నిర్వహించేటం,



ఒకే పాదాన్ని శ్లోకమంతా పాదివి అర్థభేదాన్ని మెఱపించేటం అలాగే పదవిభాగం మార్పుతో వేఱే అర్థాన్ని కల్పించేటం మొదలైన ఎన్నెన్నో చిత్రాలతో ఈ చిత్ర కవిత్వం మురిపిస్తుంది. ఆ ఆ సందర్భాల్లో వాటి వివరణ ఉంటుంది. ఒక్కొక్కప్పుడు అర్థం తెలియకపోయినా లయబద్ధంగా శ్లోకం నడచినప్పుడు శ్రోతనాకర్షించినట్లే ఇదీను.

అర్జునుని ఆ యుద్ధానికి మనుష్యులేకాక సర్వప్రాణికోటీ తీవ్ర భయానికి లోనైంది. కిరాత సేన ఎక్కడి ఆయుధాలనక్కడే విడిచి పలాయనమంత్రం పఠించింది. అలా పాఱిపోతున్న కిరాతసేనను చూసే సరికి అర్జునునకు జాలి కలిగింది. అప్పుడర్జునుని మూర్తిని పాఠకులకు ఇలా మూర్తికట్టిస్తున్నాడు భారవి.

**"ససాసిః సాసుసూః సాసో**
**యేయాయే యాయ యాయయః।**
**లలౌలీలాం లలో ఽలోలః**
**శశీశశిశుశీః శశన్॥ (15-5)**

ఇందులో ప్రతిపాదం ఒకే అక్షరంతో నడిచింది. సంస్కృతంలో ఏకాక్షర నిఘంటువని ఉన్నది. ఒక్కొక్క అక్షరాని కెన్నెన్ని అర్థాలున్నాయో తెలిపే నిఘంటువది. ఇటువంటి రచనకు వ్యాకరణ శాస్త్ర పాండిత్యం కూడా ఎంతో అవసరం. ఉదాహరణకు మాత్రమే దీని ప్రతిపదార్థం. స+అసిః = 'అసి' అంటేఖడ్గం, సాసిః అంటే ఖడ్గంతో ఉన్న : సాసుసూః = ప్రాణాంతకమైన బాణాలను ధరించిన వాడు; యేయాయే యాయయా యయః = వాహన సహితులను, వాహన రహితులను, జయించి వారి వాహనాలను పొందినవాడు; లలః = సౌందర్యవంతుడు, అలోలః = చాపల్యరహితుడు; శశీశశిశుశీః = శివుని కొడుకైన కుమారస్వామిని; శశన్ = పలాయతుని చేసే; సః (శ్లోకారంభపదం) = అతడు (ఆ అర్జునుడు);

లీలాం, లలౌ = ప్రకాశించాడు. అంటే, ఖడ్గం, ధనువులను ధరించి వాహన సహితులు, రహితులూ అయిన సైన్యవాహనాలను (రథ, గజ, తురగ పదాతులను) స్వాధీనంచేసి కొన్న సౌందర్యవంతుడు, శివుని కుమారుడైన షణ్ముఖునే (దేవసేనాని) పరుగిడేటట్లు చేయజాలిన ఆ అర్జునుడు ప్రకాశిస్తున్నాడని తాత్పర్యం.

భయభ్రాంతులై పరుగెత్తే కిరాతసేనను తఱుమకుండా మెల్లగానే అనుసరించాడర్జునుడు. కిరాతసేనలను చూచి వారిసేనాని (కుమారస్వామి) ఖిన్ను లైన వారితో ఇలా అన్నాడట! ఇందులో నిజానికి మహార్థం ఏదీ భాసించదు.

*"అథాగ్రే హసతా సాచిస్థితేన స్థిరకీర్తినా।*
*సేనాన్యా తే జగదిరే కించిదాయాస్త చేతసా॥ " (15-7)*

ఈ శ్లోకంలో పెదవి సహాయంతో పలికే ఒక్క అక్షరం కూడా లేదు. దీన్ని నిరోష్ఠ్యమంటారు. ఓష్ఠం అంటే పెదవి. అక్షర సముదాయంలో కొన్ని కొన్ని అక్షరాలు ముఖంలో కొన్ని కొన్ని అవయవాల సహాయంతో పలుకుతాం. అలాగే ఉ, ఊ, ఓ, ఔ, ప, ఫ, బ, భ, మ అనే అక్షరాలు ఉచ్చరిస్తున్నుడు పెదవులు దగ్గఱగా వచ్చికలవటం జేరుగుతుంది. ఓష్ఠం (పెదవి) సహాయంతో పలికేవి గనుక వీటిని ఓష్ఠ్యాలన్నారు.

చూడండి ! ఇందులో ఈపై తొమ్మిది అక్షరాల్లో ఒకటి కూడా లేదు. ఇదీ చిత్ర కవిత్వ విభాగంలోకే వస్తుంది. "సంగరం అంటే మీకు బొంగరాల ఆట వంటిది. పూర్వం అనేక దానవులను యుద్ధంలో మట్టికఱిపించి మహోన్నత కీర్తినొందేరు. మీలీనాడిలా పరుగెత్తితే మీకిర్తి కిది మాయని మచ్చే కాదూ? అర్కకిరణాలు సోకి ద్విగుణీకృత కాంతుల్తో ప్రకాశించే ఈ మీ ఖడ్గాలు పాఱిపోతున్న మిమ్మల్ని చూసి పకపకానవ్వుతున్నట్లు లేవూ?"



ఈ శ్లోకంలో ఒకొక్కపాదంలో అంతమయ్యే పదంతో తరువాతి పాదం మొదలుపెట్టి వ్రాసేడు. దీన్ని ఆలంకారిక పరిభాషలో 'పాదాంతాది యమకం' అంటారు!

**మా విహాసిష్ట సమరం**
**సమరంతవ్య సంయతః।**
**క్షతం క్షుణ్ణాసురగణై**
**రగణైరివ కిం యశః॥ (15-8)**

చిత్ర కవితలో ఇదొక విధం. మొదటిపాదం చివరిపదంతో రెండవపాదం ఆరంభం, మూడవ పాదాంతాక్షరంతో నాల్గవ పాదారంభం కావటం. కనుక దీన్ని "పాదాంతాది యమకం" అంటారు. "మృగాలు సంచరించే అడవిలో మీకు బాణాలవల్ల దుఃఖం ఎలా శమిస్తుందనే నాబాధ" అని అర్థం.

**"వనే ఉ వనే వనసదాం మార్గం మార్గముపేయుషామ్।**
**బాణైర్బాణైః సమాసక్తం శంకే ఉశంకేన శామ్యతి॥ (15-10)**

ప్రథమపాదాది పదంతో ద్వితీయపాదారంభం తృతీయ పాదాది పదంతో చతుర్థపాదారంభం ఇందులో చూడవచ్చు. ఇలా కదనస్థభూమి నుండి పాఱిపోతే మీకు ప్రాప్తించేది పాపం తప్ప ఫలితం మఱేమీ లేదు. తపస్విలా కనిపించే ఇతడు ఏదేవతో, రాక్షసుడో, పన్నగాధిపుడో కాదు. కేవలం మానవ మాత్రుడు. ఈ ముని పశులకాపరి పశువుల నదిలించినట్లు బాణాలతో మిమ్మల్ని అదిలిస్తున్నాడు. ఎంతటి దయనీయ మైన స్థితి!.

ఇంతవఱకు ఉదాహరించిన శ్లోకాలన్నీ ఒక ఎత్తైతే ఇప్పుడు చెప్పబోయే శ్లోకం మఱొక ఎత్తు. కేవలం ఒకే ఒక అక్షరంతో శ్లోకమంతా కూర్చటం!

"న నోన నున్నో నున్నోనో నానా నానా ననా నను ।
నన్నో ఒనున్నో ననున్నేనో నానేనా నున్ననున్న నుత్ ॥ (15-14)

అర్థం తెలియకపోతే ఏదో లయకు కూర్చిన అక్షరసమూహంలా అనిపిస్తుంది ఎవరికైనా! ఊరకే ఆసక్తికై అర్థపరిశీలన చేదాం! నానా + ఆననాః = ఇందులో ఉన్న రెండు పదాలూ తెలిసినవే. నానా అంటే అనేకమైన అని అర్థం (ఉదా నానార్థాలు) ఆననం అంటే ముఖం - నానాననాః అంటే అనేకవిధాలైన ముఖాలున్న ఓ కిరాతసైనికులారా! ఊన నున్నః - 'ఊన' అంటే తక్కువదని అర్థం (ఉదా ఏకోనవింశతి = 20కి ఒకటి తక్కువ, 19) నున్నః అంటే అల్పునితో ఓడినవాడు; నాన = మానవుడు కాడు. నున్నోనః నా, అనా = అల్పుని జయించినవాడూ మనుష్యుడు కాడు; న + నున్నః + ఇనః = ఎవరి రాజు ఓడిపోలేదో, నున్నః అనున్నః = ఓడిన వాడు, గెలిచినవాడు, నున్న, నున్న, నుత్ మిక్కిలి బాధ నొందినవానికి బాధకలిగించేవాడు; నా, అనే నాః, న = మనిషి నిర్దోషి కాడు. ఇందులో తాత్పర్యతః తేలేదేమంటే - ఓ అనేకులైన ప్రమథులారా! అల్పునిచేతిలో ఓడినవాడూ, అల్పుని గెలిచిన వాడూ కూడ మనుష్యులు కారు. కానీ మీరు అల్పుని చేతిలో ఓడిపోవటమే కాక పలాయితులౌతున్నారు. కాబట్టి మిమ్మల్నేమనాలి? ఎవరి రాజు ఓడినవాడు కాడో అతణ్ణి ఓడిన వానిగా భావించేరాదు. ఎక్కువగా బాధపడే వానికి బాధ కలిగించేవాడు నిర్దోషికాడు, నీచుడు కూడ. ఎక్కువ వ్యతిరేకార్థక పదాలతో ఉంది కనుక అర్థగ్రహణంలో కాస్త శ్రమపడాలి. అయితే ఈ ఒక్కశ్లోకం - మాదిరి కోసం వ్రాసింది కాని కావ్యమంతా ఇలా ఉండదు కదా! అందుకని మనం తొందరపడి "ఆ! అంతా గజిబిజిగా ఉంటుంద"ని తీసిపారవేయకూడదు. ఇది ప్రౌఢప్రబంధమని దానికి తగ్గ సాహిత్యవ్యవసాయం చేసిన తర్వాత



పఠించేటం ప్రారంభించాలి. అంతే!

గుణాలనుండి పతితుడైన వానికంటె గుణహీనుడే మిన్న అయినట్లు కదనరంగం నుండి పలాయితుడైన వాని కంటె కదనరంగం ప్రవేశించేని వాడే మేలు. మణి జారిపోయిన నగకంటె మణి తాపడం చేయని ఆభరణమే శ్రేష్ఠమైనట్లు. ఆ మునికి రథ గజ తురగ పదాతి సహాయ సంపత్తి ఏమీ లేదు. కనుక శత్రు విప్పుడు ఎండకెండిన మడుగువలె ఉన్నాడు. అయితే అందులోని పంకంలా మీకతిక్రమించేరాని అపకీర్తి ప్రాప్తించింది. స్వర్గంలో రాక్షస విజేతలైన మీరు శత్రువులు చొరరాని ఏ దిక్కుల్ని జయించేటానికి వెదుళ్లు, తుమ్మలు, పొదలుండే ఈ ప్రదేశాన్ని వదలి వెడతారనే అర్థంలో భారవి మహాకవి మఱో చిత్ర కవితను ప్రదర్శించాడు.

*"వేత్రశాకకుజే శైలే ఒలేశైజే ఒకుక శాత్రవే ।*
*యాత కిం విదిశో జేతుం తుంజేశో దివి కిం తయా ॥ (15-18)*

అయితే ఇందులో విశేషమేమంటే పూర్వార్థంలోనూ, ఉత్తరార్థంలో కూడ మొదటి సగంలో వచ్చిన అక్షరాలు తిరగబడి ఉన్నాయి. అయినా అర్థలోపం లేదు. దీన్ని వికట బంధం అంటారు. ఏదో 'వికట కవి' వంటి పదాలుండటం వేఱు. శ్లోకం ఆసాంతం ఇలానిర్వహించేటం వేఱు. ఇటువంటి సౌలభ్యం ప్రపంచ భాషల్లో ఒక్క సంస్కృతానికే ఉందని భారతీయులు సగర్వంగా చాటుకోవచ్చు. 20వ శ్లోకంలో కూడ ఈ విధమైన కూర్పే ఉంటుంది. ఇలా అనేక విధాలుగా కిరాత సైన్యాన్ని ప్రేరేపిస్తూ ప్రస్తుతిస్తున్నాడు సేనాపతి. "దేవతలన్నా, మనుజులన్నా మీకు తృణప్రాయులు కదా! మఱి ఇప్పుడింతటి పరాక్రమ హీనులైనారే అని రెచ్చేగొట్టేడు. అర్జునుని అంటే శత్రువును పొగడటం వల్ల కూడా సైనికుల్లో పౌరుషం రేకెత్తుతుందని, అతడు సుందరుడు, భయరహితుడు, ఇత్యాదిగా

ప్రశంసిస్తాడు. అర్జునుని బాణాలతో పడిపోయిన గుఱ్ఱాలతో రథ మార్గానికాటంకం కలిగింది. పర్వత సదృశాలైన మృత గజాలనుండి రక్తపుటేరులు పాఱుతున్నాయి. బీభత్సుడు ప్రమథగణ సైన్యాల్ని అనేకవిధాల బాధించి యుద్ధ రంగాన్నంతా బీభత్సం చేసి వదిలేడు. ఉత్సాహపూరితుల్ని, నిరుత్సాహవంతుల్నీ, బాధించాడు. 'సర్వతోభద్ర' బంధంలోని ఈ కవిత కూడా ఆసక్తిదాయకమైంది.

*"దేవా కానిని కావాదే వాహికా స్వస్వ కాహి వా।*
*కాకారే బభరే కాకా నిస్వ భవ్య వ్యభస్వని ॥ (15-25)*

ఇందులో కాకుల్ని పిలిచినట్లుగా కా, కా అని శత్రువుల్ని పిలిచాడనే అర్థం స్ఫురిస్తోంది. కనుక భారవి ఆంధ్రుడనే వాదనకవకాశం కలుగుతోంది. అరివీరుల శిరస్సులు తెగి ఎక్కడోపడి వారి మొండేలు తురగాలపై పడటంతో అవి తమ రౌతులను నేలపై పడవేసేయుట! కత్తులులేని ఒరల్లో వాయువు ప్రవేశించేటంతో ఏర్పడిన ధ్వనికి మఱి కొందఱు రౌతులు భయంతో నేలకూలి మృతులైనారట! ఇలా చెదఱిపోతున్న సేనలను కుమారస్వామి సమీకరిస్తుంటే అక్కడ చిఱునవ్వుతో శివుడు ప్రత్యక్షమైనాడు. ముని బాణాలనే అగ్నిహోత్రుని భయంతోనూ, సిగ్గుతోనూ పాఱిపోదలచిన ఆ ప్రమథగణాలకు శివుడు అభయవచనాలనే మంచునీటితో ప్రహ్లాదాన్ని ప్రసాదించాడు.

దుస్తరమైన అర్జునుని బాణ సముద్రంలో మునిగిన ప్రమథసేన శివుడనే తీరాన్ని చేరి ఊఱట చెందింది. అర్జున ప్రతాపాతప ఖిన్నులైన ప్రమథగణాలకు శంకరుడు మహావృక్షచ్ఛాయగా నిలిచాడు. శివుడర్జునునిపై బాణం సంధించేటంతోనే ఆ ధనుష్టంకారంతో ఇంద్రకీల పర్వతం, దశదిశలు మార్మ్రోగే మహాధ్వని వెడలింది. శివార్జునుల భీకరసంగ్రామాన్ని ప్రమథగణాలు బొమ్మకట్టుకుపోయి తిలకించాయి. శివుడర్జునుని



బాణాలను భగ్నం చేయటంతో అర్జునుడాశ్చర్య చకితుడయ్యాడు. అయినా అధీరుడు కాక ప్రాణాంతకమైన బాణాలతో శివుని బాణాల్ని ఖండిస్తూ అపూర్వమైన నైపుణిని ప్రదర్శించాడు. యుద్ధభూమిలో మనోహరమైన గతులతో చరిస్తూ అర్జునుడు శోభించాడనే అర్థంలో కేవలం రెండక్షరాలతో భారవి శ్లోకాన్ని నడిపేడు.

*"చార చుంచుశ్చిరారేచీ చంచచ్చీరుచా రుచః।*
*చచార రుచిరశ్చారు చారైరాచార చంచురః॥ (15-38)*

మధ్యలో కనిపించే 'శ'కారం సంధివశం చేత వచ్చింది కనుక ఇది 'చ', 'ర' అనే రెండక్షరాలతో ఉన్న శ్లోకమే అవుతుంది. ద్వ్యక్షరీ చిత్రం అన్నమాట! ముని అయిన అర్జునుడు పిశంగవర్ణంతో ప్రకాశించే అల్లె త్రాటితో ఉన్న గాండీవాన్ని ఆకర్ణాంతం లాగుతూ ఉల్కలవంటి అగ్నిని పుట్టిస్తూ సాక్షాత్తు ఆదిత్యుని వలెనే శోభించాడు. ఆ బాణ జాలం శివుని బాణాలను మేఘపంక్తి సూర్యకిరణాలనావరించినట్లు కప్పివేసింది. వెంటనే శివుడు తన బాణజాలంతో సూర్యునికి కలిగిన అవరోధాన్ని తొలగించాడు. దాంతో శివ బాణ ప్రభాపటలి విద్యుత్సమూహం వలె భాసించింది. అవి పార్థుని బాణాలను ఛేదించినా ఆ కపిధ్వజుడే మాత్రం విచలితుడుకాక ఒక హిమవంతుని వలె, ఒక ఐరావతంవలె, ఒక ఆదిశేషునివలె శోభించాడని మూడు పోలికలూ ఒకే శ్లోకంలో నిక్షేపించి భారవి అర్థత్రయవాచిగా వ్రాసేడు. (15-45) శివుడుతన బాణాలను నిర్వీర్యం చేయటంతో అతనిలో క్రోధం పెల్లుబికింది. ఇంతలో శివుడు ప్రాణాంతకం కాని బాణాన్ని కవ్వడిపై ప్రయోగించేటంతో అది సూర్యకిరణం వలె కన్పట్టగా అర్జునుడు దాన్ని నిరోధిస్తూ తన బాణాల నీడలో భూభాగాన్నే కప్పివేసేడు.వెంటనే అర్జునుని బాణసమూహాన్ని ఛేదిస్తూ శివధనువునుండి బాణం వెల్వడి అచేటి వృక్షాలను, లతలను ఛేదిస్తూ అర్జునుని బాణంలోకి

కూడా చేరింది. ధారాపాతంగా వర్షిస్తున్న బాణాలను వమ్ముచేస్తూ, చిత్రవిచిత్ర గతులతో సంచరిస్తున్న ఆ ధనంజయుని అచేటి మహర్షి సంఘం అనేకార్జునులుగా చూచింది. ఈ సందర్భంలో చివరి ముక్తాయింపుగా భారవి ఒకే పాదాన్ని నాలుగు పాదాల్లోనూ వాడి అర్థభేదాన్ని ప్రదర్శించాడు.

*వికాశమీయుర్జగతీశమార్గణా*
*వికాశమీయుర్జగతీశమార్గణాః।*
*వికాశమీయుర్జగతీశమార్గణా*
*వికాశమీయుర్జగతీశమార్గణాః॥ (15-52)*

అర్జునుని బాణాలు ప్రసారితమైనాయి; జగత్తులో శివుని బాణాలు విషమస్థితినొందేయి; ప్రమథులు ఆశ్చర్యాన్వితులైనారు; ఈశ్వరాన్వేషణలో ఋషులు, దేవతలూ నభస్థలిని చేరేరనే నాలుగర్థాలూ పై ఒక్క పాదానికే సమకూడుతన్నాయి. దీన్ని 'మహాయనుకం' అంటారు. శివుడు విస్తరింప చేస్తున్న బాణాలను జయలక్ష్మీయుతుడైన అర్జునపరాక్రమాన్ని వీక్షిస్తున్న తత్త్వవేత్తలైన మునులకు సైతం రోమాంచం కలిగింది.

పంచదశ సర్గ ఇక్కడతో పూర్తికావటంతో అర్జునుని అంతర్మథనంతో షోడశసర్గ ప్రారంభమౌతుంది. "ఎప్పుడూ మహాపరాక్రమోపేతులైన మహారథుల్నే మట్టి కఱిపించే నా శౌర్యం చంద్రతేజస్సులో సూర్యకాంతిలా నేడీ హీనుల ముందు వెనుకంజ వేయటానికి కారణం ఏమిటి? ఇది మాయా? లేక నా మతిభ్రమా? నేను గాండీవిని కానా? చూస్తుంటే వేషభూషలు కిరాతుడే అనిపిస్తున్నా ఇతడు నిజంగా కిరాతుడు కాడేమో? ఇతని చేష్టలు సైతం మనుష్యోచితంగానే ఉన్నాయి. అమ్ములపొదినుండి బాణం తీయటం, సంధించేటం, విడవటం తెలియ రావటం లేదు. పిడికిలి బిగించినట్లు కూడా తెలియటం లేదు. మెడలో కదలిక కాని, ఆయాసం కాని అసలే కనిపించేటంలేదు. వికార రహితమైన మోము చంద్రునివలె



ఆహ్లాదకారిగా ఉంది. శత్రువులోని బలహీనతలు తెలిసి తన లోపాన్ని కాపాడుకోవటం భీష్మద్రోణులలో కూడా లేనిది ఈ కిరాతమాత్రునిలో ఎలా స్పష్టంగా గోచరిస్తొంది? ఇంతటి అసాధారణ వీరుని వారించేటానికి ఇక దివ్యాస్త్రాలే శరణ్యం." అనుకొంటూ అపార పరాక్రమవంతుడైన అర్జునుడు శత్రుబలాన్నరికట్టే 'ప్రస్వాపనాస్త్రాన్ని' ప్రయోగించాడు. దాని ప్రభావంతో చిమ్మచీకట్లంతటావ్యాపించాయి. భయంకరమైన నిద్ర ప్రమథగణాల నావరించి వారి ప్రజ్ఞాశక్తిని కబళించి వేసింది. ఇంతలో శంభుని శిరస్సు నుంచి సుమేరు పర్వతశిఖరం నుండి సూర్యబింబంవలె పిశంగతేజం ఉద్భవించింది. చంద్రమౌళి కాంతి ప్రమథగణాలకు చూపును ప్రసాదించింది. నాలుగుదిక్కులనుంచీ మేఘపటలిని ఎఱుపు చేసి ప్రాతస్సంధ్యారాగాన్ని నింపుతూ ఉత్సాహాన్ని రేకెత్తించింది. ఫల్గునుని ప్రస్వాపనాస్త్ర ప్రభావం నుంచి తేఱుకొన్న ప్రమథులు దిగ్వితానం నక్షత్రకాంతితో శోభించినట్లు వివిధ శస్త్రాలను ధరించారు. తన ప్రస్వాపనాస్త్రం నిర్వీర్యం కావటంతో బీభత్సుడు కిరాతుల్ని కట్టిపడవేసే భుజంగ పాశాన్ని విడిచాడు. విషాగ్నిదిగ్ధమైన వందల కొద్దీ నాలుకల నాడిస్తున్న సర్ప సమూహం అంతటా వ్యాపించింది. ఆ సర్పరాజాల నేత్రాల నుంచి స్వచ్ఛమైన స్వర్ణకాంతితో తోకచుక్కల పగిది మంటలు వ్యాపించేసాగేయి. ఆ భీభత్సాన్ని పశుపతి వెంటనే గరుడ మంత్రంతో వారించాడు. గరుడ పక్షుల ఱెక్కల ప్రకాశం సర్వవ్యాపి అయింది. రాత్రింబగళ్లు కలిసిన సంధ్యాదీప్తులు భూమ్యాకాశాలను పసుపువర్ణంతో నింపేయి. సర్పసమూహం గరుడ పక్షుల బలంతో మహాయజ్ఞంలో కర్మలోపం వలన కలిగిన దోషానికి ప్రాయశ్చిత్తవిధివలె తిరస్కృతమైంది. అర్జునుడు వెంటనే ఆగ్నేయాస్త్రాన్ని చేబూనేడు. విస్ఫులింగాలు వినీలాకాశాన్నంతా విస్తరించాయి. సూర్యకిరాణాలనే ఛేదించే నిప్పురవ్వలతో గంభీర నాదంతో అగ్నిహోత్రం ప్రజ్జ్వరిల్లింది. శివుడు దీన్ని

అడ్డుకోవటానికి వారుణాస్త్రాన్ని ప్రయోగించాడు. మేఘబృందం ఆకాశగంగ గుభిల్లుమని భువిని పడుతోందా అన్నట్లు జలధారలను వర్షించింది. జలధారల తాకిడికి అగ్ని శాంతించేనారంభించింది. ఈ విధంగా కిరాత పతిని పరాజితుని చేయాలని కిరీటి ప్రయోగించిన అస్త్రాలన్నీ శంకరుని చేతిలో పరాస్తమైనాయి. శస్త్రాస్త్రాలతో ఇక కార్యం సిద్ధించేటట్లు లేదని గ్రహించిన అర్జునుడు తన భుజశక్తినే నమ్ముకోవలసివచ్చింది.

ఇక్కడికి పదునాఱవ సర్గపూర్తై శంకరార్జునుల యుద్ధవర్ణన సప్తదశసర్గ పరివ్యాప్తమౌతుంది. ఆపదోద్ధారకాలైన ప్రస్వాపనాద్యస్త్రాలు నిరుపయోగం కావటంతో తన గాండీవం తోనే అర్జునుడు శోభించాడు. ఒక మహానుభావునితో యుద్ధం తటస్థపడినందుకానందం కలిగినా ఆశత్రువుదే పైచేయి కావటం కవ్వడిని కలవర పఱచింది. పూర్వం మహోద్ధృతంగా పడుతున్న ఆకాశగంగను తేలికగా నిగ్రహించినట్లే అర్జునుని ఉద్ధతిని శంభుడు అరికట్టేడు. మొదటి ప్రయత్నం విఫలమై నందుకు అర్జునుని నేత్రాలనుండి బాష్పాలు కారేయి. సమరాయసంతో కేశపాశం విడివడి నేత్రాలు రాగివలె ఎఱ్ఱబడ్డాయి. రోషంతో అలుముకొన్న ఘర్మబిందువులు అతని వేడిని చెల్లపఱచాయి. చేత్తో ధనువును లాగి శివునిపై బాణవృష్టిని కురిపించాడు. ఆ వృష్టి శంకరుని ఏమీబాధించేక పోవటంతో చంద్రమౌళి దాన్ని తన దేహంలో లీనం కావించుకొన్నాడు. దిగ్గజ దంత ప్రహారాన్ని హిమవత్పర్వతం స్వీకరించినట్లే పార్థుని పరాక్రమాన్ని ఈశ్వరుడానందంతో సహించాడు. భూభార నిర్మూలన సామర్థ్యాన్ని సవ్యసాచికి ప్రసాదించేటానికి ఆ అవమానాన్ని మౌనంగా దీర్ఘకాలం సహించాడు. శంభుడు తనతలపై ఉన్న చంద్రరేఖవంటి కీర్తిని అర్జుననకు కలగజేయాలనే ఇచ్ఛతో జయాపజయాలోక క్రమంలో కలిగే యుద్ధ



కేళినారంభించాడు. భయవిహ్వలురైన ప్రమథులు కిరీటివిడచిన బాణాలనుండి ఏర్పడ్డ ధ్వనినిబట్టే అర్జున విముక్త బాణవర్షం అని తెలిసికొన్నారు. కాని దానిని చూడటం కాని ప్రతిక్రియానిర్వహణకాని చేయలేకపోయారు. నేత్రవ్యాధిగ్రస్తునికి చీకటి తొలగిన పిదప ఒక చంద్రుడు విభిన్న బింబాలుగా కనిపించినట్లు అనేకార్జునులను చూసేరు. తరువాత శివుడు తన రెండు భుజాలతో అల్లె త్రాటిని లాగగా అది రెండు రూపాలను పొందింది. ప్రమథగణం దానిని కృద్ధుడైన తక్షకుని నాలుకవలె చూచారట! అపుడర్జునుడు సవ్యాపసవ్యాలుగా ధ్వనింపజేసిన ధనువుతో ఉన్న శంకరుని దుష్టగజాన్ని అదుపులో పెట్టే మావటీవానివలె చూచాడు. శివుని బాణజాలం అర్జునుని బాణాలను ధ్వంసం చేసింది. రెట్టించిన కోపంతో అర్జునుడు విడచిన బాణాలు ప్రమథులకు భయోత్సాహ హేతువులైనాయి. ధనంజయుని బాణాలను నేలపాలు జేసిన శంకరుని బాణాలూ నేలకొరిగేయి. ఇలాక్రియకు ప్రతి క్రియగా సాగుతున్న వారి యుద్ధం ఎంతో ఆసక్తి దాయకంగా కొనసాగింది. ఒక్కొక్కసారి తన బాణాలతో సమానంగానూ, మఱికొన్ని సమయాల్లో తనకంటె ఆధిక్యాన్నీ పొందుతూన్న సవ్యసాచి సమరాన్ని తిలకిస్తూ శత్రు మర్దనుడైన ఆ ఇందుమౌళి తన మాహాత్మ్యాన్ని ఆశ్రయించేవలసివచ్చింది. దానితో అర్జునుని బాణాలన్నిటినీ సూర్యుడు జలాన్నింకించినట్లు మాయం చేసేడు.

అర్జునుడు బాణం తీయటానికి చేయి అమ్ములపొదివైపు చాచేగా అక్కడ శూన్యమే ఎదురైంది. రెండవ అమ్ములపొదివైపు చేయిచాస్తే అక్కడా అదే పరిస్థితి ఎదురైంది. అది అదనుగా తీసికొని వాదప్రతివాదుల్లో ప్రతివాది నిరుత్తరుడైన సమయం కనిపెట్టి వాది అతనిలోని దోషాలను బయటపెట్టినట్లుగా శివుడు ఉక్కువంటి తన బాణాలతో బీభత్సుని బాధించాడు. దానికి తోడు మణిస్థగితమై స్వర్ణరేఖలతో ప్రకాశించే అర్జునుని

కవచాన్ని ఛేదించాడు. విశుద్ధమైన ఆకాశంవలె సత్త్వగుణోపేతుడై తపః పరాక్రమార్జిత తేజస్సుతో ప్రకాశిస్తున్న అర్జునుని ధూర్జటి మఱింతగా శస్త్రాలతో బాధించాడు.

గోపుచ్ఛాకృతి కల్గి దీర్ఘమై వృత్తాకృతినొందిన బాహువులు కల అర్జునుని శరీరం నుండి ధారాపాతంగా రక్తం స్రవిస్తున్నా గాండీవి వజ్రాయుధ తుల్యమైన తన గాండీవంతో ఈశ్వరుని భయగ్రస్తుని కావించ దలచి మహాగజం తన దంతంతో స్తంభాన్నికొట్టినట్లు మోదేడు. పూర్వం మహోద్ధృతంగా వస్తున్న గంగానదిని జహ్నుమహర్షి వలె అర్జునుని వింటి బద్దను శివుడు తనలో లీనం చేసికొన్నాడు. ఇక చాపం నష్టమై పోగా అర్జునుడు సమరకేళికి అయోగ్యుడైనాడు. అదే సమయంలో శంకరుడు అతి తీవ్రమైన బాణాలతో అతణ్ణి తఱిమి కొట్టేడు. అయినా అర్జునుడు ఖడ్గాన్ని ధరించి శివుని బాణాలను ఖండించ సాగేడు. సూర్యుడాకాశంలోనే ఉన్నా భువిపై జలాల్లో ప్రతిఫలించినప్పుడు ఇద్దఱు సూర్యులవలె ఎలా దృగ్గోచరుడౌతాడో అలాగే ఆకాశంలో, నేలపైనా ఇద్దఱు అర్జునులవలె చూపరులకు కన్పట్టేడు. శివుడు తన బాణాఘాతంతో అర్జునుని ఖడ్గాన్ని ఖండించాడు. ఈ విధంగా ధనువు, కవచం, అక్షయతూణీరం, ఉత్తమ ఖడ్గం నష్టపోయిన అర్జునుడు మొక్కలన్నీ ధ్వంసమైన ఉద్యానవనంవలె శూన్యతను భజించాడు. శత్రువు చేతిలో భంగపడి ఆగ్రహం కట్టలు తెంచుకొంటూ ఉంటే ఏవిధంగా నైనా విజయాన్ని చేపట్టాలనే ఆకాంక్ష కలిగిన విజయుడు రాళ్లను, చెట్లను, పెఱికి వాటిని శివునిపై జడివానగా కురిపించాడు. శివుడు బాణాలతో వాటిని ధ్వంసం చేయటంతో చుట్టూ ఉన్న చెట్లను పెఱికి విసరనారంభించాడు. శివుడు వాటినీ ముక్కలు ముక్కలు చేసి పుష్పాలతో చిగుళ్లతో యుద్ధరంగానికి బలిగా సమర్పించాడు. ఆ యుద్ధ ప్రదేశం అప్పుడు రంగవల్లి తీర్చినట్లు



శోభించింది. కవ్వడి ఇక చేసేదిలేక కనకశిలానిభమైన ముక్కంటి ఎదుఱు ఱొమ్ముపై గట్టిగా చేతితో చఱిచాడు. శిశువు తండ్రి అంకం చేరి మారాం చేస్తూ కొడుతుంటే కుమారుని అవినయాన్ని ముద్దుగా భరించి ఆనందించే తండ్రివలె ఆ పాండుసూనుని చర్యను స్మరారి సహించాడు.

ఈ విధంగా సప్తదశసర్గ అంతమై అంతిమసర్గ అయిన అష్టాదశసర్గ ఆరంభమౌతుంది. ఈ సర్గలో శివార్జునుల బాహుయుద్ధం, కిరీటి అద్భుతపరాక్రమాన్ని మెచ్చి త్రినేత్రుడు ప్రత్యక్షం కావటం, పార్థుడు శంకరుని స్తుతించేటం, పార్వతీపతి పాశుపతాస్త్రాన్ని అతనికి ప్రసాదించేటంతో పాటు ధనుర్వేదాన్ని సైతం ఉపదేశించేటం, దేవతలు తమ తమ అస్త్రాల్ని అర్జునునికివ్వటం, కవ్వడి విజయుడై ధర్మరాజును చేరటం అనే అంశాలతో కావ్యం పరిసమాప్తి నొందుతుంది.

ఆ తరువాత మదగజంవలె భయంకరమైన బాహువులనే ఆయుధాలుగా చేసికొని ముని ముష్టియుద్ధానికి సిద్ధపడగా శంకరుడు తూణీరంతో వింటిని వదలి పిడికిటితో కొట్టేడు. వారిద్దఱి ముష్టాముష్టి యుద్ధం పెద్ద బండరాళ్ళు పగిలిన శబ్దంతో ప్రవర్తిల్లింది. ఆ శబ్దం పర్వత గుహల్లో భీతావహమై ప్రతిధ్వనించింది. శివుని పటిష్ఠమైన గ్రుద్దుల్ని పార్థుడు సుఖంగానే అనుభవించాడు. రక్తం స్రవిస్తున్న విశాలమైన శివుని వక్షఃస్థలం సాయంసంధ్యలో ఎఱుపు వర్ణాన్ని పులుముకొన్న మేఘంలా భాసించింది. అర్జునుని ముష్టిఘాతాలు సహ్యపర్వతాన్ని ఢీకొనే సముద్రపు అలల వలె తోచాయి. శివుడు ప్రయోగించిన బలిష్ఠమైన దెబ్బలకు అర్జునుడు కళ్లు తిరిగి పడిపోయాడు. ఒక ప్రక్క అవమానం, వేఱొక వంక కోపం – ఈ రెండు భావాలతో పెనవేసికొన పోయిన కపిధ్వజుడు పట్టరాని ఆవేశంతో చంద్రమౌళి భుజద్వయాన్ని తనచేతులతో వేఱుచేసి పట్టేడు. మల్లయుద్ధ ప్రవీణులైన వారిరువురూ కాలుసేతులను సంకెళ్లుగా అమర్చిపోరాడి

ఇద్దఱూ నేలపై పడ్డారు. పైనున్నది ఎవరు, క్రిందనున్నది ఎవరనే విషయం ప్రమథులు తెలిసికోలేక కలవరపడ్డారు. మహాబలశాలురైన వారిద్దఱి బరువును మోయలేని పర్వతం వారి కదలికల కనుగుణంగా కదల సాగింది. కాలు సేతుల బంధనాన్ని వదలి జబ్బలు చేఱచుకోవటంతో ఉద్భవించిన శబ్దంతో బహుసొగసుగా పైకి ఎగురుతూ పాదాలను భూమిపై దట్టించేటం వల్ల నదులు కట్టలు తెగి ప్రవహించే సాగేయి. అంతరిక్షానికి ఎగిరిన త్రిపురాంతకుని పాదద్వంద్వాన్ని పార్థుడు ఒడిసి పట్టేడు. పట్టినకాళ్లను నేలకేసి కొట్టదలిచిన అర్జునుని పరాక్రమానికి శివుడెంతో విస్మితుడై అతనిని గాఢంగా కౌగిలించుకొని నలిపివేసేడు. భగవానుడైన శంకరుడు పార్థుని పరాక్రమానికి సంతసించినట్లుగా అతని తపస్సుకు కూడా ముద మందలేదు. అంతలోనే భస్మాలంకారితదేహతేజుడు, శుంభశ్చంద్ర శీర్షుడూ అయిన శంకరుని చూచి నరుడు నమస్కరించాడు. తక్షణం విజయుడు అక్షయతూణీర, గాండీవ, కవచాలతో శోభిల్లే తన యథాపూర్వ స్థితిని చూచుకొని విస్మయచకితుడైనాడు. ఆ సమయంలో మేఘాలు భువిని ప్రశాంతంగా తడిపేయి. మందార ప్రసూనాలు దివిని అలంకరించాయి. స్వచ్ఛమైన కాంతి ఆకాశాన్నావరించింది. మ్రోగించేకుండానే దుందుభి ధ్వానం ప్రవర్తిల్లింది. ఇంద్రునితో కూడిన దిక్పాలక సమూహం తమ తమ రత్నస్థగిత విమానాల్లో వచ్చి అచేట చేరింది. ప్రమథగణం పులకిత గాత్రమై అర్జునుని తపస్సమోఘమైందని బహుధా ప్రశంసించింది. "భవనాశకారకా! భవా! నీవు భక్త సులభుడవు. నిన్ను శరణునొంది సురాసురజగత్తు ధన్యమౌతోంది. నిన్ను భజించి జనులు మృత్యుంజయులౌతున్నారు. ఈశా! నిన్ను స్తుతించని వారికి వినాశోన్ముఖమైన విపత్తులు సంభవిస్తున్నాయి. దూరప్రయాణం చేయకుండానే లభించేదీ, సర్వకామితాలనూ ఫలింప చేసేది పరలోక ప్రాప్తినందకుండానే కోర్కెలను తీర్చేదీ అయిన తీర్థం నీవే.



హే! వరదా! నిన్ను ప్రేమించే వానికి కైవల్యం తథ్యం. నిన్ను ద్వేషించేవాడు ఘోర నరకం పాలవుతాడు. శివా! శివంకరమైన నీ రూపం తత్త్వం తెలియకపోయినా కేవలం భక్తితో చేసే నీ స్మరణ సంసారసాగరాన్ని తరింపజేస్తుంది. పరమర్షులు ప్రజలపై కారుణ్యంతో విధి నిషేధాల నుపదేశించారు. ఊహాతీతమైన నీ మహిమ భక్తజనాళికి కర్మ విచ్ఛేదం కావిస్తుంది. నీ శరీరార్ధం స్త్రీ స్వరూపమైనా నీ అంతటి విరాగి మఱొకడు లేకపోవటం విచిత్రం. గజచర్మ, సర్ప, కపాల, చితాభస్మం వంటి మనో హరాలు కానివి నీ శరీరాన్నంటిపెట్టుకొన్నా, నీ శిరస్థ హిమాంశు కళతో అవి పరమ రమణీయాలై స్పృహణీయా లౌతున్నాయి. కనుక ఉ పమానోపమేయాలు లేని నీ మహిమ అచింత్యమైంది. దైత్యదానవరాక్షస, మనుజులు ఏఏ సంపూర్ణాధికారాన్ని హస్తగతం చేసికొన్నారో అది వారు నీకు చేసిన నమస్కార ఫలితమే. ఎవడీ చతుర్దశ భువనాలనూ ప్రాణరూపంగా భరిస్తున్నాడో, ఎవనివల్ల పరబ్రహ్మ నాదరూపమై ధ్వనిస్తోందో ఎవడు పాపాలను పవిత్రీకరిస్తున్నాడో ఆ అష్టమూర్తుల్లో ఒకటైన నీ వాయు రూపానికి నమస్కారం. యోగులు యోగాసనావిష్టులై నిన్ను స్మరించినంత మాత్రంతో సంసార కారణమైన కర్మపుంజాన్ని దహించే అగ్నిమూర్తివైన నీకు నమస్కారం. సంసారబీజాలకు కారణమై ఆధ్యాత్మికాధిభౌతికాధిదేవతాత్మక తాపత్రయాభీల దావాగ్నులను చల్లార్చి వారికి నిర్వాణాన్ని ప్రసాదించే జలరూపుడవైన నీకు నమస్కారం. సర్వసృష్టికోటినీ ఆవరించి ఏదీ నిన్నావరించే సాధ్యం కాని వాడవై ఆద్యంతాలు లేక తెలియరాని ఆకాశమూర్తి వైన భవా! నీకు నమస్కారం. అణువంతవాడవై ఉండీ విశ్వధరుడవైన నీకు నమస్కారం. అంతర్యామిగ అంతికస్థుడవైన నీకు నమస్కారం. అవాఙ్మనసగోచరుడవై వాటి కధిపతి అయిన నీకు పునః పునః ప్రణామాలు. ప్రభూ! అజ్ఞానినై నీపై శస్త్రాస్త్ర

ప్రయోగం చేసినందుకు క్షంతవ్యుణ్ణి. ఓధర్మాత్మా! నా అన్న ధర్మజునికి ద్రోహం చేసినవారి సమూల నిర్మూలనకు సమర్థమైన శస్త్ర సమృద్ధిని ప్రసాదించు" ఇలా ప్రార్థించి శిరసు వంచిన అర్జునుని సాదర సాంత్వన వచనాలతో ఓదార్చి రుద్రదేవతాత్మకమైన పాశుపతాస్త్రాన్నతనికి ప్రసాదించి ధనుర్వేదాన్ని ఉపదేశించాడు. త్రిశూలమే ఆయుధంగా కల ధనుర్వేదం వచ్చి అర్జునుని ఎదుట నిలిచింది.

ఈశ్వరుని అనుమతి నొందిన ఇంద్రాదిదేవతలు ఆ పిమ్మట అర్జునునికి స్వస్తి పలికేరు. అమోఘమైన అస్త్రప్రదానం చేసేరు. పాశుపతాస్త్రంతో పార్థుడు ఇతోధిక తేజస్సుతో వెలుగొందేడు. పిమ్మట దేవతలంతా అర్జునుని ఉచ్చైస్వనంతో కీర్తించారు. వెళ్ళి శత్రుసమూహాన్ని జయించుమని శివాజ్ఞనందిన కిరీటి అతని పాదపద్మాలకు ప్రణతులర్పించి నిజగృహానికి చేరి అగ్రజుడైన ధర్మజునికి ప్రముదిత వదనంతో ప్రణమిల్లేడు.

# శిశుపాలవధమ్

**'శ్రియః పతిశ్శ్రీమతి శాసితుం జగ**
**జ్జగన్నివాసో వసుదేవ సద్మని।**
**వసన్ దదర్శావతరం తమమ్బరా**
**ద్ధిరణ్యగర్భాంగ భువం మునిం హరిః "**

అనే శ్లోకంతో మాఘమహాకవి వ్రాసిన శిశుపాలవధ మహాకావ్యం ఆరంభమౌతుంది. నారదుడు శ్రీ కృష్ణుని దర్శించేటానికి వచ్చాడని శ్లోకార్థం. శ్రీకారంతో కావ్యారంభం చేయటం సకల శుభాల్నీ చేకూరుస్తుంది. ఆ కృష్ణుడు శ్రియఃపతి అంటే లక్ష్మీదేవి భర్త. జగత్తునంతా తన కుక్షిలో భరిస్తున్నవాడు. ఆయన వసుదేవుని భవనంలో ఉన్నాడు. అది సంపద్యుక్తమైంది. ఇక వచ్చిన నారదుడు బ్రహ్మాపుత్రుడు. వచ్చింది ఆకాశంనుంచి. ఈ విధంగా వస్తు నిర్దేశాత్మకమైన మంగళాచరణం చేసి మాఘకవి తన కావ్యాన్ని కొనసాగించాడు.

మాఘమహాకవిని గూర్చి ఎన్నో ఆభాణకాలు కనిపిస్తాయి.

**"ఉపమా కాళిదాసస్య**
**భారవే రర్థగౌరవమ్।**
**దణ్డినః పదలాలిత్యం**
**మాఘేసన్తిత్రయోగుణా॥ "**

అంటే ఉపమాలంకార ప్రయోగం కాళిదాసు సొత్తైతే భారవిలో అర్థగౌరవం, దండి (దశకుమార చరిత్ర కర్త)లో లలిత పదాల పోహళింపు ప్రసిద్ధమైతే మాఘకవిలో మూడూ ఉన్నాయని అర్థం. అలాగే **'నవ సర్గగతే మాఘే నవ శబ్దో న విద్యతే"** అంటే తొమ్మిదిసర్గలు మాఘకవి వ్రాసిన శిశుపాలవధలో చేదివితే క్రొత్త శబ్దం అంటూ వేటే కనిపించేదని. ఇది ఆయన అపూర్వ కవితాపాటవాన్ని ప్రస్ఫుటీకరిస్తుంది. అలాగే మఱొకటి

**“తావద్భారవేర్భాతి యావన్మాఘస్యనోదయః ఉదితే నైషధేకావ్యే క్వమాఘః క్వచ భారవిః ॥”** అనేది మఱొకటి. అంటే మాఘకావ్యం వచ్చేంతవఱకు భారవి ప్రకాశిస్తాడు. నైషధం వచ్చిన తర్వాత మాఘుడెక్కడ! భారవి ఎక్కడ?”ని అర్థం. ఇది భారవి. మాఘుడు, శ్రీహర్షులు ఉత్తరోత్తరం కవితాశక్తి కలవారని తెలియజేస్తుంది.

పంచకావ్యాలకీ వ్యాఖ్యానం వ్రాసిన మల్లినాథసూరి మన తెలుగువాడు. ఔత్తరాహులు, ఎంతోమంది ఈ కావ్యాలకి వ్యాఖ్యానం వ్రాసినా ఈయన వ్యాఖ్యానమే సర్వోత్కృష్టమైందని విమర్శకుల తీర్పు. అందువల్లే ఆయనకు ‘వ్యాఖ్యాతృ చక్రవర్తి’ అనే బిరుదం కూడా ఉంది. ఆ మల్లినాథ సూరి **“మాఘే మేఘే గతం వయః”** అన్నాడట! అంటే మేఘ సందేశానికి, మాఘ కావ్యానికీ (ఈశిశుపాలవధ) వ్యాఖ్యానం వ్రాయటం తో వయస్సంతా అయిపోయిందని అర్థం. ఈ వాక్యం ఈ రెండు కావ్యాల వైశిష్ట్యాన్ని తెలుపుతుంది. అయితే ఈ రెంటి మధ్యా ఒక భేదం ఉంది. ‘మేఘదూతం’ రసానుభూతికి పరకాష్ఠ అయితే శిశుపాలవధ ధీశక్తికి నికషోపలం. ఆంగ్లంలో చెప్పుకోవాలంటే ఒకటి Emotional Poetry అయితే మఱొకటి Intellectual sport అనుకోవచ్చు. అర్థకృత్తనే కావ్యప్రయోజనాన్ని తీసికొంటే దానికి దర్పణం ఈ మహాకావ్యం. శబ్దార్థాలే కాకుండా భారతీయ సంస్కృతీ విలువల్ని ఆవిష్కరిస్తుందీ గ్రంథం. గ్రంథం పేరే ‘శివేతర క్షతి’ ని ధ్వనింపజేస్తోంది.

ఇక ఈ మహా కావ్యం ఇరువది సర్గల్లో 1679 శ్లోకాలతో ఉంది. భారవి వ్యాకరణ శాస్త్ర గరిమ అడుగడుగునా మురారి అనర్ఘరాఘవంలో వలె గోచరిస్తుంది. ఈ విషయాన్ని తెలిపే శ్లోకం ప్రసిద్ధమైంది.



**“మురారిపదచిన్తా చేత్ తథా మాఘే రతిం కురు।**
**మురారి పదచిన్తాచేత్ తథా మాఽ ఘేరతిం కురు॥’**

ఏమిటీ! శ్లోకంలో రెండు పాదాలూ కనీసం ఒక్క అక్షరమైనా భేదంలేకుండా ఉన్నాయనిపిస్తోంది కదూ! మొదటి పాదానికి మురారి కవి పద ప్రయోగకౌశలం తెలిస్తే మాఘం (అంటే శిశుపాలవధ) చేదివి ప్రీతి పొందుమని అర్థం. రెండవపాదం శ్రీమహా విష్ణువు (మురారి) పాదాలపై ఆసక్తి ఉంటే మాఘాన్ని (మా+అఘ) పాపకార్యాసక్తిని వీడుమనే అర్థాల్నిస్తోంది. ఇక కథా భాగానికి వద్దాం.

ఒక మహాతేజః పుంజం ఆకాశం నుండి క్రిందికి దిగుచున్నట్లు చూచి జనులంతా విభ్రాంతులైనారు. శ్రీకృష్ణుడు కూడ దాన్ని తదేక దీక్షతో చూడసాగేడు. మొదట మహాతేజః పుంజంగా భాసించి భూమిని సమీపిస్తుంటే కరచరణాదులతో కూడిన ఒక వ్యక్తిగా, తరువాత పురుషాకృతిగ, ఆ పిమ్మట నారద మహర్షిగా రూపొందింది. శారద చంద్రచంద్రికా ప్రభలతో ఆముని వర్యుడు జేడలతో దిగుతుంటే వాయువు తాకిడికి తనంతట తనే ‘మహతీ వీణ’ శ్రవణ సుభగంగా మ్రోగసాగింది. తన వెంట వస్తున్న దేవతాగణాన్ని వెనుదిరగవలసిందిగా ఆదేశించి నారదముని దైత్యారి గృహాన్ని ప్రవేశించాడు. యజ్ఞోపవీతంతో అక్షమాలతో ప్రకాశించే నారదమునిని చూచి శ్రీకృష్ణుడు వేగంగా తన ఆసనం నుంచి లేచి అర్ఘ్యపాద్యాదులతో పూజించి సువర్ణాసనాన్ని స్వయంగా తెచ్చి దానిపై మునిని ఉపవిష్టుని కావించాడు. శ్రీకృష్ణుడొనర్చిన అతిథిపూజతో నారదుడు సంతుష్టుడయ్యాడు. ఎన్నోపుణ్యతీర్థాలనుంచి తెచ్చిన జలాన్ని తన కమండలువు నుంచి తీసి హరిపై చేల్లగా అవి సర్వపాపహారాలని శిరస్సువంచి ముకుందుడు భక్తితో స్వీకరించాడు. మునివరుని ఆనతితో

కృష్ణుడూ ఆసనంపై ఆసీనుడయ్యాడు. శ్రీకృష్ణుడు వినయంతో నారదునితో "మునీశ్వరా! మీ రాకే నాకొక గొప్ప సత్కారం. మీరు నిష్కాములే అయినా "ఊరకరారు మహాత్ములు" ని ఆర్యవచనం కదా! కనుక నావలన కాగల కార్యవేమిటో తెలిసికోవాలనుకొంటున్నా" నన్నాడు. నారదుడు "పురుషోత్తమా! యోగీశ్వరేశ్వరులకు కూడ మీరు దర్శనీయులు. కనుక భవద్దర్శనాన్ని మించిన పనేముంటుంది" అని అనేక విధాల స్తుతించాడు. "ఏవరూ కోరక పోయినా నీకై నీవే లోక ద్రోహులను శిక్షిస్తూ ఉంటావు. సర్వజ్ఞుడవైన నీకు తెలియందంటూ ఏమీ లేకపోయినా ఒక రహస్యాన్ని నీ చెవిన వేద్దామని నా వాచాలత నన్ను ప్రోత్సహిస్తోంది. ఇంద్రుడు నీకొక రహస్యాన్ని చెప్పిరమ్మని నన్ను పంపించాడు. సావధానుడవై విను. పూర్వం ఇంద్రుని పదవీ భ్రష్టునిచేసిన హిరణ్యకశిపుడనే రాక్షసుడుండేవాడు కదా! అమిత కోపనుడు, నిర్దయుడైన అతనిపట్ల 'అసుర'శబ్దం అన్వర్థమైంది. వానివల్లనే దేవతలకు 'భయం' అనే శబ్దానికి అర్థం తెలిసింది. సంపదలు దిశాధిపతులైన ఇంద్రయమవరుణ కుబేరులను వీడి ఆ హిరణ్యకశిపుని ఆశ్రయించేటంవల్ల వాటికి అప్పటినుంచే "చంచలాలు" అనే పేరువచ్చింది. హిరణ్యకశిపుడెక్కడ సంచరిస్తూ ఉంటే దేవతలంతా అటువైపే తిరిగి భయంతో వణుకుతూ అతనికి నమస్కరిస్తూ ఉండేవారు. అటువంటి లోక కంటకుని నృసింహావతారం దాల్చి నీవే వధించావు కదా! ఆ దుష్టుడే తిరిగి రావణాసురునిగా జన్మించి తన అపార బాహుబలంతో స్వర్గాన్ని కైవశం చేసికొని దేవతలను పీడిస్తూ త్రిజగద్భయ కారకుడైనాడు. వాడు చేసిన ఆకృత్యాలకు లెక్కలేదు. అమరావతిపై దండెత్తి నందనవనాన్ని పాడుచేసి దేవతా స్త్రీలను చెఱపట్టటం, కుబేరుని పై దాడి వెడలి శంఖనిధిని బ్రద్దలుకొట్టటం, మానస సరోవరాన్ని పాడుబెట్టడం అందఱెఱిగిందే. ఆ రావణునితో యుద్ధంలో వరుణుడతనిపై నాగాస్త్రాన్ని ప్రయోగిస్తే వాడుచేసిన



హుంకారంతో అది తిరిగి ప్రయోగించిన వరుణునే బంధించింది. యమధర్మరాజు వాహనమైన దున్నపోతు కొమ్ముల్ని ఊడ్చి తాను విల్లుచేసికొన్నాడు. శివుని గూర్చి ఘోరమైన తపస్సు చేసి తన పదితలలను ఆహుతి కావించిన ఆ మహాసాహసుడు శ్రీరామునిగ అవతరించిన నిన్ను తనపాలిటి మృత్యువుగా తెలిసికొన్నా సీతను వీడలేదు. ఆ మానవాధముణ్ణి నీవు సముద్రునిపై సేతువును నిర్మించి దానిపై లంకకు చేరి వధించిన విషయం గుర్తుందా? వాడే నేడు శిశుపాలుని పేరుతో తిరిగి జన్మించాడు. వీడు పుట్టటంతోనే నాలుగు చేతులు, మూడు కళ్లతో శివకేశవరూపాలతో సామ్యాన్ని పొందేడు. కాలక్రమంలో అవి పోయినా తన పరాక్రమంతో ధరణీపతుల నుండి కప్పాలు గ్రహిస్తూ పరాక్రమంలో రెండవ సూర్యుడా అన్నట్లు ప్రకాశిస్తున్నాడు. రావణాసురాదులది తపస్సు చేసి సాధించుకొన్న పరాక్రమమైతే తనది స్వార్జితమైనదని వారెవరినీ లెక్కించేడు. తన పూర్వజన్మల్లో వలె ఇప్పటికీ ఈ రూపంలో లోకాన్ని బాధిస్తున్నాడు. కనుక దుష్టశిక్షణకై అవతరించిన నువ్వు ఈ శిశుపాలుని సంహరించేటం వల్ల సాధువులు సైతం రక్షితులౌతారు. ఇది జేరిగిన నాడు తాను స్వస్థుడై ఉండగలనని దేవేంద్రుడంపిన సందేశం" నారదుని మాటలను విన్న శ్రీకృష్ణుడు దానికి తన సమ్మతిని తెలిపేడు. నారదుడూ తనపని పూర్తికావటంతో వియన్మార్గ గామియైనాడు దీంతో 75 శ్లోకాలతో ఉన్న ప్రథమ సర్గ ముగుస్తుంది.

'శ్రీకృష్ణుడు దేవేంద్రుని సందేశాన్నందుకొన్నప్పటికే ధర్మరాజు సంకల్పించిన రాజసూయ యాగానికి ఆహ్వానం కూడా రావటం వలన శిశుపాలునిపై దండెత్తి వెళ్ళటమా లేక రాజసూయయాగంలో ఉపస్థితుడై ఉండటమా అనే ద్వైధీభావాన్ని పొందటంతో 118 శ్లోకాలతో ఉన్న ద్వితీయసర్గ ఆరంభమౌతుంది. కనుక కార్యనిర్ణయానికై ఉద్ధవ

బలరాములతో సభామంటపాన్ని చేరేడు. జగద్ధితార్థవ్యగ్రులైన ఆ ముగ్గురూ సభాస్థలిలో యజ్ఞశాలలోని త్రేతాగ్నుల వలె తేజరిల్లేరు. సభాస్థలిలో ఉన్నది ముగ్గురే అయినా, ఆ చేటి రత్న స్తంభాల్లో ప్రతిబింబితమైన వారి మూర్తులతో అనేకులున్నట్లుగా శోభించిందట! తన మనసులోని ద్వైధీభావాన్ని పినతండ్రి అయిన ఉద్ధవునితోను, అన్న బలరామునితోనూ చెప్పేడు. శ్రీకృష్ణుడు వారి ఎదుట వినయమూర్తియై తన అభిప్రాయం ప్రమాణం కాదనీ, నాటకానికి పూర్వరంగం వంటిదనీ అన్నాడు. "సర్వదిగ్విజయం కావించి లబ్ధప్రతిష్ఠులైన అనుజులున్నారు. కనుక మనం వెళ్ళక పోయినా ధర్మజుడు నిర్విఘ్నంగా క్రతువు నాచరించుకోగలడు. యజ్ఞపరిసమాప్తి పిదపే జైత్ర యాత్రకు వెడదామా అంటే పెరిగే రోగం, ఎదిగే శత్రువూ ఒకటే నంటారు. కనుక శత్రువునుపేక్షించే కూడదు. శిశుపాలుడు నన్ను నిందిస్తున్నంతమాత్రాన నాకేమీ చింతలేదు కాని అతడు చేసే జగద్ద్రోహమే నన్ను బాధిస్తోంది. ఈ విషయంలో మీ అభిప్రాయాన్ని కూడా విన గోరుతున్నాను. ఎందుకంటే ఎంతటి జ్ఞానికైనా తగిన పని నిర్వహించే వలసినప్పుడు సంధిగ్ధావస్థ తప్పదు" అంటూ విరమించాడు.

తరువాత శిశుపాలుని ద్రోహం స్మృతిపథానికి రావటంతో బలరాముడుద్రేకంతో ఊగిపోయి పెదవులదిరి చెమటలు పడుతుంటే ఇలా అన్నాడు. "వాసుదేవుడు చెప్పిన మాటలు వాస్తవాలు. కనుక అలాచేయటం సముచితం. ఎవరెన్ని విధాల చెప్పినా దీనిని మించిన సారమంటూ ఉండదు. ఎన్నో అడవులను సమూలంగా దగ్ధంచేసే అగ్ని, కాంతిలో సూర్యునికంటె అధికమైంది కాదు కదా! అయినా కృష్ణుని అభిప్రాయాన్ని బలపరుస్తున్న నా మాటలు వాటికి వ్యాఖ్యాప్రాయాలౌతాయి. ప్రజ్ఞాశాలుర మాటలతో విభేదించిన వారు బృహస్పతి కల్పులైనా పరాజయం పొందక తప్పదు. ఎంతటి శాస్త్రాధ్యాయన తత్పరులైనా కర్తవ్యాకర్తవ్య వివేచనలేని



వాచాలుర మాటలు గురి తప్పిన బాణాలవలె నిరర్థకాలు. ప్రగతి శీలుడెప్పుడూ అప్రమత్తుడై శత్రు నిర్మూలనం చేయాలి.

'తృప్తి' క్షత్రియునకు పనికిరాదు. పురుషకారవిహీనునకు దైవానుగ్రహం కల్ల. కొలనిలో నీరు ధూళిని బురదగా క్రిందికి అణగద్రొక్కిన తరువాతనే స్వచ్ఛతను పొందినట్లు శత్రువులను సమూలంగా నాశనం చేసినపిదపే రాజు ప్రకాశిస్తాడు. రుక్మిణిని శిశుపాలునికిచ్చి వివాహం నిశ్చయించిన తరువాత నువ్వామెను రాక్షస వివాహం చేసికోవటం అతనికి నీపై పగ కలగటానికి ప్రముఖ కారణమైంది. వైరానికి స్త్రీలు మూలకారణం కదా! ఆ పగతోనే నువ్వు నరకాసురుని వధించేటానికి ఊరు విడిచి పోయినప్పుడు ద్వారకను ముట్టడించాడు. పైగా ఆ ఖలుడు మన బభ్రువు భార్య నపహరించి తనకు భార్యగా చేసికోవటం మనకెంత తలవంపులు? కనుక ఇట్టి ప్రబల శత్రువులను ఎట్టి పరిస్థితుల్లోనూ మనం ఉపేక్షించే కూడదు. పర్వతాలకు ఔన్నత్యం తప్ప గాంభీర్యం, సముద్రానికి అగాధత్వం తప్ప ఔన్నత్యం ఉండవు కాని ధీరులకు ఈ రెండూ ఉంటాయి. పౌరుషం ప్రకటించేకపోతే సామాన్య శత్రువు కూడ జయిస్తాడు. శత్రువు తలపై కాలుమోపనంత వఱకు కీర్తి ఎలా లభిస్తుంది? భీముడు జరాసంధుని వధించేటం వల్ల బలీయుడైన మిత్రవియోగాన్ని పొంది శిశుపాలుడు దుర్బలుడైనాడు. కనుక అతనిపై దండెత్తటానికిది అనువైన సమయం. కనుక మనం ఇప్పుడు ధర్మజుని రాజసూయానికి ఇంద్రప్రస్థానికి వెళ్ళటం అంతమేలనిపించేదు. కనుక మాహిష్మతీపురంపై దాడి వెడలటమే శ్రేయస్కరంగా తోస్తోంది." భవనం ప్రతిధ్వనించేట్లుగా ఉత్తేజంతో ఉచ్చైస్వరంతో మాట్లాడిన బలరాముని మాటలు విని కృష్ణుడు ఉద్ధవుని అతని అభిప్రాయం తెలుపుమని కనుసైగ చేసేడు.

ఉద్ధవుడు "బలరాముని మాటలు విన్న తరువాత ఎవరు మాత్రం చెప్పగలిగిందేముంది? సప్తస్వరాల మాత్రంతో సంగీతం అపారమైనట్లు, కేవలం ఏబది అక్షరాలే అనంతమైన కావ్య శాస్త్రాది వాఙ్మయానికి మూలమైనట్లు ఇంకేం చెప్పినా, ఎవరు చెప్పినా బలరాముని ఉద్దేశ్యానికి మెఱుగులు తీర్చినట్లే అవుతుంది కాని స్వతంత్రం కాదు. నేతపనివారు చేక్కని రంగులతో మెత్తనై ఆకర్షణీయంగా వస్త్రాలని నేసినట్లు నేను నేర్చిన విషయాలను నీముందు ప్రదర్శించేటం నాకు తెలిసిన విషయాన్ని మఱొకసారి వల్లెవేసికోవటానికే తప్ప నా పాండిత్య ప్రకర్ష కోసం కాదు. ప్రభువుకు అవసరమైనవి ప్రభుశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తి ఈ మూడే అతని విజయానికి కారణాలౌతాయి కాని కేవలం ఒకదాని వల్లనే ప్రయోజనం ఉండదు. ఉత్సాహశక్తికి మంత్రశక్తి తోడైనప్పుడు ప్రభుశక్తి ప్రకాశిస్తుంది. ఔషధం ఎలా వ్యాధిని నశింపచేసి శక్తిని సమకూరుస్తుందో ప్రభుమంత్రోత్సాహశక్తులు మూటినీ పొంది సంధి విగ్రహాదులను నెఱపే ప్రభువుకు విజయం తథ్యం. పరుపు, దిండు ఉన్న మంచం విశ్రాంతి కాకరమైనట్లు సదసద్వివేక చక్షుడైన ప్రజ్ఞాశాలికి అపాయాలు కలుగవు. చురుకైన బాణం తగలటంతోటే శరీరంలోకి చొచ్చుకుపోయినట్లు ప్రజ్ఞాశాలి స్వల్ప ప్రయత్నంతోనే కార్యసిద్ధి నొందుతాడు. బండరాయికి బాణం తగిలినా లోపలికి పోలేనట్లు మందబుద్ధి ఎంత ప్రయాసపడినా కార్య సాఫల్యం పొందలేడు. దేశకాలాలను సమీక్షించుకొని ఆయాసందర్భాల ననుసరించి రాజు ప్రతాపాన్నీ, ఓర్పునూ ప్రదర్శిస్తే రసానుగుణమైన రచన సహృదయులనాకర్షించినట్లు ప్రజానురంజకత్వాన్ని పొందుతాడు. శరీరం బలహీనమైనప్పుడు వ్యాధివృద్ధి పొంది వ్యక్తిని నాశనం చేసే విధంగా శత్రువు బలహీనుడైన తరుణంలో రాజు విజృంభించేటం నీతి. ఆ విధంగా తగిన కాలానికై ఎదురు చూస్తూ ఓర్మిని వహించి అదనెఱిగి విజృంభించే వారికి



విజయం చేకూరుతుంది. శిశుపాలుడు ఒంటరివాడని సులభంగా జయించేవచ్చుననుకోవటం పొరపాటు. సమస్తరోగాల సమాహారమైన క్షయరోగం వలె ఇతడు రాజుల సమగ్ర శక్తీ అండగా కలవాడు. బాణాసురుని సహాయం అతనికి ఉంది. యవన, సాల్వ, రుక్మిద్రుమ ప్రముఖులెందఱో అతనికి బాసటైఉన్నారు. నిప్పు స్వల్పంగానే ఉన్నా చిన్న చిన్న చిదుకులు గాలితో రాజుకోవటంతో మహాగ్నిగా ప్రజ్జ్వలించినట్లు ఈ రాజుల అంతఃక్రోధాన్ని శిశుపాలుడు రెచ్చగొట్టి నీపై పగ తీర్చుకోవటానికి సాధనగా చేసికొంటాడు. సెలయేళ్లు చిన్నవైనా మహానదులతో కలిసి సాగరంలో సంగమించినట్లు గొప్ప వారి సహాయాన్ని పొందిన అల్పుడు సైతం కార్యసిద్ధిని కైవశం చేసికొంటాడు. నువ్విప్పుడు శిశుపాలునిపై దాడి చేస్తే నీ శత్రువులు శిశుపాలునిపక్షం, వాని శత్రువులు నీ పక్షం వహిస్తారు. దాంతో రాజుల్లో సంక్షోభం కలిగి అజాత శత్రువు చేయబోయే రాజసూయ యాగానికే విఘ్నం వాటిల్లుతుంది. ఆ విఘ్నానికి నువ్వు కారణభూతుడవై అతనికి నువ్వే ప్రథమ శత్రువౌతావు. పరాక్రమవంతుడొకప్పుడు కాకపోతే మఱొకప్పుడైనా శత్రువును సాధించేవచ్చు కాని విరిగిన మనసునతకటం సాధ్యమయ్యేపనికాదు. పైగా ఇప్పుడే నువ్వు శిశుపాల వధకై పూను కోవటానికి మఱొక ప్రతిబంధకం ఉంది. పూర్వం నీ మేనత్తకు శిశుపాలుడు చేసే నూఱు తప్పుల్ని క్షమిస్తానని మాటిచ్చావు. ఆ మాట నిలుపు కోవటానికిది అదును కాదు. కనుక ప్రతిజ్ఞాభంగం పాడికాదు. చారులతో మిత్రరాజులకు ధర్మజుని యజ్ఞానికి యుద్ధ సన్నద్ధులై రండని వార్త పంపు. ఎందుకంటే ధర్మజుడెలాగూ యజ్ఞంలో అగ్రపూజ నీకే చేస్తాడు. అది సహించేలేని వారంతా నిన్నెదుర్కోవటానికి సంసిద్ధులౌతారు. అటువంటి సన్నివేశంలో శిశుపాల పక్షంలో ఉన్న కొందఱు నీతిమంతులు అతణ్ణి విడిచి నీ పక్షం అవలంబిస్తారు. దుర్బలులైన రాజులంతా నీ శౌర్యాగ్నిలో

శలభాయమానులౌతారు. బలరాముని మాటలను పూర్వపక్షం చేసి ఈ విధంగా రాజనీతిని ఉపన్యసించిన ఉద్ధవుని మాటలు విన్న శ్రీకృష్ణుడు సంతోషంతో తన ఆసనం నుంచి లేవటంతో ద్వితీయాశ్వాసం పరి సమాప్తమౌతుంది.

ఉద్ధవుని మాటలు విన్న శ్రీకృష్ణుడు యుద్ధ సన్నద్ధతను అప్పటికి విడచి ఇంద్రప్రస్థానికి బయలుదేరటంతో 82 శ్లోకాల తృతీయసర్గారంభం అవుతుంది. ఛత్రచామరాలతో మణిమయకిరీటంతో, స్వర్ణకుండలాలతో, నెమిలిపింఛంతో, మాణిక్యహారాలతో, చేతిమురుగులతో, కౌస్తుభాన్ని ధరించిన వక్షఃస్థలంతో శ్రీకృష్ణుడు సర్వాభరణ భూషితుడై విరాజిల్లేడు. ఇంద్రనీలమణి వలె ప్రకాశించే దేహకాంతులతో పీతాంబరధారియైన ఆ కృష్ణుని తరుణులనుసరించారు. ఆ జవరాండ్రలో ఎవరిపై శ్రీకృష్ణుని చూపు ప్రసరించిందో వారు తమ జీవితం ధన్యమైందని భావిస్తే ఆయన దృక్కులకు నోచుకోని యువతులీర్ష్యాగ్రస్తులైనారు. ఆయన ధరించిన చక్రాయుధంతో ఉన్న చేయి సుళ్ళుతిరుగుతున్న యమునానదిలా ప్రకాశించిందట! సదా సన్నిహితంగా ఉండే కౌమోదకి అనే గద మఱొక హస్తాన్నలంకరించింది. నందకమనే ఖడ్గం, శార్ఙమనే ధనుస్సు పాంచజన్యమనే శంఖం సైతం కృష్ణుని వీడలేదు. పుష్యనామక రథాన్నధిరోహించిన హరి పుష్యమీనక్షత్రంతో కూడిన చంద్రుని వలె శోభించాడు. గరుత్మంతుడు ఆయన రథకేతనంపై సన్నిధి చేసేడు. పర్వతాల్ని సైతం ఛేదించే పటహధ్వని ప్రవర్తిల్లింది. సైన్యం కూడ ద్వార తోరణాలను స్పృశించకుండా హరిననుసరించింది. సైనికుల పదవిన్యాసంతో భూమి ధూళి ధూసరితమైంది. అయినా గజమదధారలతో ఆ ధూళిపైకి లేవలేదు. ఆ తరువాత రౌతులెంత నియంత్రించినా అశ్వాలు తమ పాదాగ్రాలను ఎగురవేస్తూ మత్తేభాల నతిక్రమించి నడువసాగేయి. త్రోవలో ఆడుకొనే పిల్లలకు హాని కలుగకుండా ఆశ్వికులు కళ్ళేలను పట్టి



ఆపుతుంటే తల్లులు ఆదుర్దాగా తమపిల్లలు మార్గావరోధులు కాకుండా గృహాల్లోకి తీసికొని పోయారు. ఇలా బయలుదేరిన శ్రీకృష్ణుని చూడాలనే కుతూహలంతో ప్రజలంతా రాజవీధిని చేరేరు. పట్టణశోభను తిలకిస్తూ తనను చూడవచ్చిన ప్రజ కాశాభంగం కావించేకుండా కృష్ణుడు రథవేగాన్ని మందగింపచేసి వారికానందప్రదుడయ్యాడు. విశ్వకర్మ తన నైపుణికి పరకాష్ఠగా నిర్మించిన ద్వారకానగరం సముద్రజలాల్లో ప్రతిఫలించిన స్వర్గమా అన్నట్లు భాసించింది. ఆ ద్వారకా నగరం అంగడి వీధుల్లోని రత్నరాసుల్ని సముద్రుడు తస్కరించి రత్నాకరుడై ఉంటాడని అనుమీయమానమౌతోంది. అప్సరస్త్రీలకు, ద్వారకానగరవాసినులైన స్త్రీలకూ సౌందర్యంలో భేదం ఒక ఱెప్పపాటు మాత్రంతోనే తెలిసికోదగిందిగా ఉంటుందట! ద్వారకానగర సౌధాలు స్ఫటిక ఱాలతో నిర్మితమైనాయి. రాత్రివేళలో రతికేళిలో సిగ్గుతో స్త్రీలు దీపాలార్పివేసినా గవాక్షాల నుంచి వచ్చిన చంద్ర కిరణాలు తమ సౌందర్యాన్ని వెల్లడి చేయటం వల్ల భయభ్రాంతలౌతారట! అచేటి భవన కుడ్యాలు స్వర్ణనిర్మితాలు. అచటి స్త్రీలంతా సౌందర్య సౌశీల్య సమాహారలు. ఆ ద్వారకానగరం సముద్ర మధ్యంలో ఉండటం వల్ల శీతల పవనాలతో శ్రీకృష్ణునికి ఆహ్లాదాన్ని చేకూర్చేదట. అటువంటి ఆ ద్వారకానగర శోభను చూస్తూ మహాపరాక్రమశాలి అయిన శ్రీకృష్ణుడు ప్రయాణాన్ని కొనసాగించాడు. కృష్ణుని సేనలు శ్రీమహావిష్ణువు అంగాలనుండి ప్రజలవలె, మహాశివుని జటాజూటం నుంచి ఆవిర్భవించిన స్వర్గంగా ప్రవాహంవలె బ్రహ్మముఖాన్నుంచి ఉద్భవించిన వేదాల్లా ఆయన ననుసరించాయి. ఈ విధంగా రథ గజతురగపదాతి వర్గంతో శ్రీకృష్ణుడు ద్వారకానగరిని వీడటంతో ఆ పట్టణ శోభే నశించినట్లనిపించింది. శ్రీకృష్ణుడు సముద్రుని కావలితీరంలో ఉన్న వనశోభని వీక్షించాడు. సముద్రపు అలల రాపిడితో నాచువలె ఆ వనాలొక వింత అందాన్ని చేకూర్చుకొన్నాయి. చెలియలి కట్టపై

స్త్రీలను పోలిన లతలు వధూజన సమేతుడైన శ్రీకృష్ణుని వలె అలరారేయి. సముద్రతీరంలో ముత్యాల రాశులు చంద్ర కిరణోపమానాలైనాయి. వేదార్థాన్ని గ్రహించి వేదాలకు భాష్యప్రాయంగా మహర్షులు వ్రాసిన స్మృతుల విధంగా సముద్ర జలాన్ని గ్రహించి మేఘాలు కురిపించిన వర్షం ద్వారా ఏర్పడిన నదులు తిరిగి సముద్రాన్నే పొందినట్లు శ్రీకృష్ణుడు భావించాడు. దశదిశల్లో ఆవిర్భవించిన వస్తుజాలాన్ని విక్రయించి పొందిన ధనరాసుల్ని, వస్తుజాలాన్నీ ఓడలలో నింపుకొన్న సముద్రతీర వర్తకుల్ని శ్రీకృష్ణుడు ప్రశంసించాడు. అంబుజగర్భుని సేవించేటానికై అంబుధి నుంచి వెలుపలికి వచ్చేసర్పాలు గరుత్మంతుని శిరసును చూచి తిరిగి లోనికి వెళ్ళిపోయాయట! అచటి ఏలావనాల నతిక్రమించిన హరిసేనలకు జలధి తెమ్మెరలు స్వేదాన్నింకించి అతిథిపూజ సలిపేయి. ఎంతో ఎత్తుగా ఉన్న తాళ వృక్షచ్ఛాయల్లో సైనిక వరులుపవిష్టులై మార్గాయాసాన్ని బాపికొన్నారు.

శ్రీకృష్ణుడు ప్రయాణాన్ని కొనసాగిస్తూ 'రైవతకం' అనే పర్వతాన్ని చూచాడు. చతుర్థ సర్గ అంతా రైవతకాద్రివర్ణనే. మహాశిలలతోడి చరియలతో వాటిపై మేఘపటలి క్రమ్మిన సూర్యగతినడిగిస్తున్న దృశ్యం చూస్తే పూర్వం వింధ్యపర్వతమే ఇప్పుడు రైవతకగిరిగా పునర్జన్మ ఎత్తిందా అన్నట్లుందట! సహస్రశీర్షాలతో మింటిని, సహస్రపాదాలతో, భూమిని ఆచ్ఛాదించి సూర్య చంద్రులే నేత్రాలైన హిరణ్యగర్భునిలా ఆ నగం భాసించింది.

అనేక సర్గల్లో కథాభాగం లేక కేవల వర్ణనలుండటం వల్ల ఆధునికులకు ఇంత సుదీర్ఘమైన వర్ణనలెందుకనిపిస్తుంది కాని, మహాకవి మాఘుడు సర్వశాస్త్ర జ్ఞానాన్నీ ఈ వర్ణనల్లో మనోజ్ఞంగా పొందుపఱచాడు. భారతీయ విజ్ఞానఖని అయిన మాఘుడు తన శాస్త్రపాండిత్య ప్రకర్షాద్యో తకంగా కాక, శాస్త్ర విషయాన్ని సామాన్యుని కందించాలనే దృష్టితో



కాంతాసమ్మితంగా ఉపదేశించాలనుకొన్నట్లు తోస్తుంది. శాస్త్రాన్ని ప్రక్కన పెడితే చేక్కని ఉపమా ఉత్ప్రేక్షాద్యలంకారాలతో ఈ శ్లోకాలు మనసు నలరిస్తాయి. రాజనీతి వైభవం బలరామ ఉద్ధవుల మాటల్లో ద్వితీయ సర్గలో కనిపిస్తుంది. అలాగే దేవయోనులైన గంధర్వ, కిన్నరాదుల ఆకారవిశేషాన్ని ఈ చతుర్థ సర్గలో ఉపన్యసిస్తాడు.

అశ్వముఖం, మానవ శరీరం కలవారు గంధర్వులనీ, మానవ ముఖం అశ్వ శరీరం కలవారు కిన్నరులనీ మనకీ కవి తెలుపుతాడు. అయితే దీనికి విరుద్ధంగా అశ్వముఖులే కిన్నర కింపురుషులనీ, తద్వ్యతిరిక్తులు గంధర్వులనే మతం కూడా ఉందనుకోండి! పదమూడవసర్గలో జ్యోతిశ్శాస్త్ర ప్రమేయం కనిపిస్తుంది. భీమార్జునులమధ్య నున్న శ్రీకృష్ణుడు దుర ధరాయోగాన్ని పొందిన చంద్రునితో పోల్చి చెబుతాడు. కుజ, బుధ, గురు, శుక్ర శని గ్రహాల్లో ఏవైనా ఏ జాతకంలో నైనా చంద్రునికి రెండు పన్నెండిండ్లలో అంటే కుడి ఎడమల్లో ఉంటే దురధరాయోగమని జ్యోతిశ్శాస్త్ర వక్కణ. ఈ యోగం పట్టిన జాతకుడు ధన వాహనయుక్తుడై భోగి, సుఖి, త్యాగి, మాటనేర్పరి, ప్రతిభా పరాక్రమాలతో కీర్తికలిగి బహుకుటుంబికుడు, సుశీలుడౌతాడని దీని ఫలితాన్ని చెబుతారు.

**"ఉత్పన్న భోగ సుఖభుగ్ధనవాహనాఢ్య**
**స్త్యాగాన్వితో దురధరాప్రభవః సుభృత్యః॥" (వరాహ. బృహ. 13.9)**
**"వాగ్బుద్ధి విక్రమగుణైః ప్రథితః పృథివ్యాం స్వాతన్త్ర్యసౌఖ్యధనవాహన భోగ భోగీ౹**
**దాతా కుటుమ్బజనపోషణలబ్ధఖేదః సద్వృత్తవాన్ ధురధరాప్రభవో ధురిస్థః॥"**
**(కళ్యాణవర్మ)**

అంతేకాక, సాముద్రిక శకున శాస్త్రాల విశేషాలు, సంగీత నాట్య శాస్త్రాల పరిచయం, వ్యాకరణాలంకార కామశాస్త్ర వైద్య, మంత్రశాస్త్ర రహస్యాలు, గజ, అశ్వ శాస్త్రసంబంధి విషయాలే కాక, ఒంటెల ప్రసక్తి

పాఠకుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తాయి. శ్రుతిస్మృతుల్లో ఉన్న విషయాలు, సాంఖ్య, వైశేషిక, న్యాయ, యోగ, మీమాంస, వేదాంత, బౌద్ధ దర్శన విశేషాలు, సందర్భానుసారంగా కావ్యమంతటా దర్శనమిస్తాయి. కనుకనే దీనినొక విజ్ఞాన సర్వస్వమన వచ్చు. నిజానికి మహాభారతంలోని ఈ కథను తెలియనివారు ఎవరూ ఉండరు. మఱి ఈయన ప్రత్యేకంగా కావ్యంగా వ్రాయటమెందుకంటే పాఠకులకు సర్వశాస్త్రాలకూ సంబంధించిన సామాన్య జ్ఞానాన్ని కలిగించేటానికే. ఈ కావ్యాన్ని ఈ దృష్టితో చదవాలి. ఆ నగ తటంలో మున్నెన్నడూ చూడని బహువింతలైన అందాల్ని చూచి హరి ముచ్చట పడ్డాడు. శ్రీకృష్ణుని రథ సారథి దారుకుడు ఆ రైవతకాద్రి అంద చేందాల్ని తనవి తీరా వర్ణించి చెప్పేడు. ఒకడు తన పాపపరిహారార్థం భయాన్ని వీడి భృగుపతనం చేసినట్లు అచేటి సెలయేళ్లు ఆ పర్వత సానువులపై దూకటంతో నీరు చిందర వందరై ఆ తుంపురు లాకాశాని కెగిరి దేవతా స్త్రీల మన్మథతాపాన్ని తీరుస్తున్నాయట! ఆ పర్వతంపై జాలువారే సెలయేళ్ళు స్ఫటికశిలలపై ప్రవహించేటప్పుడు గంగా సాదృశ్యాన్నీ, ఇంద్ర నీలమణులపై పాఱేటప్పుడు యమునతో పోలికనూ పొందుతూ ఉంటాయి. కనకాద్రి సానువులతో తులతూగే ఈ రైవతకాద్రి సానువుల అందాల్నే తలదన్నే జవరాండ్రు తమ ప్రియులపై అనురాగపు దృక్కులతో జేరిపే శృంగార క్రీడ లక్కడక్కడ పొడకడుతూ ఉంటాయి. ఒక కిన్నరుడు తన ప్రేయసి ముఖాన్ని చుంబించేటం చూచి పరవశుడైన గంధర్వుని అతని ప్రియ కౌగిలించుకొనే దృశ్యాలు అక్కడక్కడ గోచరిస్తూ ఉంటాయి.

ఈ పర్వతంపై ఉన్న వెదురు రంధ్రాల్ని చమరీమృగాలు తమ తోకల్ని ఆడిస్తూ తాడిస్తూ ఉంటే వెలువడుతున్న మధురమైన వేణునాదాలు మనస్సును సంతోషంతో తేలుస్తూఉంటాయి. చేల్లగాలిని కోరి పర్వత



శిఖరాలనెక్కిన సుఖాభిలాషులైన వారిని సంతోష పెట్టటానికి తమ నీటితో వారిని తనిపి తెల్లనైన శరన్మేఘాలు తెరలై సేవించే సన్నివేశం ఎంతో హృద్యంగా ఉంటుంది. ఆ కొండ గంధర్వకిన్నర కింపురుషుల భోగస్థానమే కాక మోక్షార్థులైన వారికి సాధనస్థానం కూడా.

అచేట విహరించాలనే శ్రీకృష్ణుని సంకల్పంతో ఐదవసర్గ ఆరంభ మౌతుంది. ఆ కొండనండగా చేసికొని పద్మనాభుని పరివారం, స్కంధావారం అక్కడ ఇచ్ఛావిహారం సలిపింది. ఆతని అశ్వసేనలు సముద్రంలా అక్కడ వ్యాపించాయి. మావటి వారి అంకుశాల కలవికాని గజసేన గీపెడుతూ ఉంటే ఆ సన్నివేశం చూడముచ్చటగా ఉంది. యాదవసేనలా గిరిపై విహరించే వేళల్లో వారి పదతాకిడికి లేచినధూళి ఆకాశంలో వ్యాపించి అచేటి స్త్రీల కన్నుల జేంటకు మఱింత శోభను చేకూర్చింది. మార్గాయాసాన్ని బాపి నూతనోత్సాహాన్ని కల్పించేటానికి పడతులు పడకటిండ్లనూ, తమనూ చేక్కగా అలంకరించుకొని పురుషులను తమకు వశవర్తనులుగా చేసికొంటున్నారు. అచటి ప్రకృతితో ఉద్దీప్తాలైన గజాశ్వవృషభ, ఉష్ట్రాలు సలిపిన లీలలు వర్ణితాలైనాయి.

శిష్టరక్షకుడైన శ్రీకృష్ణుని సేవించేలని ఆఱు ఋతువులూ ఒక్కసారిగా ప్రవర్తిల్లటంతో ఆ రైవతాకాద్రిపై వృక్షసముదాయం తమ తమ పుష్ప ఫలాలతో అలరారేయంటూ 79 శ్లోకాలతో ఉన్న ఆఱవసర్గ ఆరంభ మౌతుంది.

షష్ఠాశ్వాసం ఆ షడృతువర్ణనలతో నిండి ఉంటుంది. ఈ సర్గ సర్గంతా 'యమక' శబ్దాలంకారంతో కనిపిస్తుంది. సాధారణంగా శబ్దాలంకార యుతమైన రచన పాఠకుణ్ణి ఇట్టే ఆకర్షించి కవ్విస్తూ చేదివిస్తుంది. వసంతర్తుశోభను వర్ణిస్తూ–

**'నవపలాశ పలాశవనం పురస్ఫుట**
**పరాగ పరాగత పఙ్కజమ్।**

*మృదులతాంత లతాంత మలోకయ*
*త్సురభింసురభిం సుమనోభరైః ॥" (6-2)    ఇది -*
*"పృథుకదమ్బ కదమ్బక రాజితం గ్రథితమాల తమాల వనాకులమ్ ।*
*లఘుతుషార తుషార జలశ్చ్యుతం ధృత సదానన దన్తికమ్ ॥"*

అనే భారవి శ్లోకానికి (5-9) ప్రతిమా అనిపిస్తుంది. శ్రీకృష్ణునికి కన్పట్టిన దృశ్యాన్ని వర్ణించే ఈ పద్యంలో పదాలు ద్విరుక్తాలైనాయి. ఋతువుల్లో మొదటిదైన వసంతర్తు వర్ణన 20 శ్లోకాలతో ఉంటుంది. నవపల్లవాలతో (పలాశ) కూడి మోదుగు (పలాశ) పుప్పొడితో (పరాగ) కూడిన ఆ పర్వతం (పరాగ) మృదువైన తీగలతో (లతాంత), పూలతో (లతాంత) సువాసన (సురభి)లలీనుతున్న వసంతర్తు (సురభి) శోభను శ్రీకృష్ణభగవానుడు చూచాడు. అచటి సరస్సులపై వీస్తున్న చిఱుగాలి వనితల ముంగురులను కదలిస్తూ వారి ముఖాలపైనున్న స్వేదబిందువుల్ని తుడుస్తూ ఆనందాన్ని కలిగిస్తోంది. పసిడికాంతులీనే సంపంగి అశోక పుష్పాలు ప్రజ్వరిల్లుతూ విరహిజన హృదయాలను మన్మథాగ్నితో పచనం చేస్తోంది. ఆ పర్వతంపై ఉన్న పొగడపూవుల్లో ఉన్న మకరందాన్నాస్వాదించి గానంచేసే తుమ్మెదలు ప్రియులపై అలిగిన ప్రేయసులను బతిమాలటానికి మన్మథుడు పంపిన చెలుల వలె కన్పట్టసాగేయట !.

సాధారణంగా కావ్యాల్లో కాని, నాటకాలలో కాని కవులు రమ్యమైన వర్ణనలు చేస్తూఉంటారు. "ఇది సాధ్యమా? ఇది నిజేమా?" అనే కుతర్కం చేయక ఆ అందాన్ని ఆస్వాదించేటమే సహృదయుల భావుకతకు నిదర్శనం.

**వదన సౌరభలోభపరిభ్రమ**
**ద్భ్రమర సంభ్రమ సంభృతోతశోభయా।**
**చలితయా విదధే కలమేఖలా**
**కలకలో ఉలకలోల దృశాన్యయా ॥ (6-14)**



ఒక వనిత ముఖం వెదజల్లే పరిమళాన్నాస్వాదిద్దామనే ఆశతో ఒక తుమ్మెద ఆమెముఖంపై (పద్మం అనుకొని) వ్రాలబోతుంటే ఆమె భయపడింది. ప్రక్కనున్న సఖి దాన్ని త్రోలటానికి తన గాజుల్ని గలగలమని చేప్పుడు చేస్తూ ఆమె అలకల్ని చూస్తూ ఉండిపోయింది. తుమ్మెదలు, తేనెటీగలు, మీద వాలటం, ఒక్కొక్కప్పుడు కుట్టటం కూడా జేరుగుతూనే ఉంటుంది. అయితే స్త్రీ ముఖాన్ని పద్మంతో పోల్చటం ఆ సౌరభాల్ని త్రాగటానికే తుమ్మెద వ్రాలిందని ఉత్ప్రేక్షించేటం ఆమె సౌందర్యాతిశయాన్ని వ్యక్తం చేయటానికే. ఈ శ్లోకం కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలో దుష్యంతుడు శకుంతల కెదురుపడే సన్నివేశాన్ని జ్ఞప్తికి తెస్తుంది. దండి పదలాలిత్యానికి దీటైందీ శ్లోకం. లలితపదగుంఫనలో మాఘుడు దండికి సమానమైన వాడని ప్రసిద్ధి.

**"మధురయా మధుబోధిత మాధవీ**
**మధుసమృద్ధి సమేధిత మేధయా।**
**మధుకరాఙ్గనయా ముహురున్మద**
**ధ్వనిభృతా నిభృతాక్షర ముజ్జగే ॥" (6-20)**

మాధవీలతాపరాగంతో తుమ్మెదలా మధువును కడుపార త్రావి క్రొవ్వి అవ్యక్త మధురాలాపాలు చేయుదొడగాయని, అందఱనూ మత్తెక్కేట్లు చేసేయనీ దీని భావం. ఒక పరమ సుకుమారమైన భావాన్ని ఈ విధంగా వ్యక్తం చేసినపుడు ఆ సన్నివేశాన్ని పాఠకుడు తన మనఃఫలకంపై చిత్రించుకొన్నప్పుడు గుండెల్లో లోతుగా త్రవ్వుకొంటే కలిగేదే రసానుభూతి! కావ్యాలు ఊఱకే చేదివి కంఠస్థం చేసికోవటం కాక మనసులో ఆ సన్నివేశాన్ని ముద్రించుకొన్నప్పుడది చైతన్య స్థాయికెదుగుతుంది. ఆ చైతన్యానికి వికాసం కలిగించేదే రసం. అందుకే -

**'భగ్నావరణ చిదేవ రసః"**    అన్నారు.

ప్రకృతిలోని ఋతువులన్నీ జీవులకు సుఖాపాదకాలే. మఱి గ్రీష్మంలో ఎండ తపింప చేసినా వర్షర్తువులోకి చాటు పొందింపచేసినా, హేమంతంలో చేలిబాధ మిక్కుటమైనా ఆ ఆ ఋతుధర్మాలు సుఖాభిలాషులైన వారికి తాత్కాలికోపశమన ప్రక్రియలతో ఆనందాన్నే ఇస్తాయి. వేసవిలో చేన్నీటి స్నానాలతో పొందే ఆనందం అమేయమై ఉంటుందని, ఆ తడి ఆఱిన తరువాత మంచి గంధపు మైపూతలతో ఆనందించారని గ్రీష్మర్తువుని వర్ణిస్తాడు మాఘుడు. మృదంగ శబ్దాల ననుకరిస్తున్న మేఘగర్జనలకు నెమిళ్ల గుంపు నృత్యం చేయసాగింది. నవకదంబపుష్పరజంతో కూడిన వాయు ప్రసారం స్త్రీ పురుషుల మానసాలను ఉత్కంఠ భరితం కావించాయి. తొలకరిమబ్బు చినుకులతో విరిసిన మొగలి, జాజి పుష్పాల సౌరభం ఘ్రాణతర్పణం చేస్తున్న వాటి అందం నేత్రపర్వమై తోచింది.

కాలం ఒకటే అయినా ఉపాధి భేదం వల్ల ప్రకృతిలో ఎంత మార్పు వస్తోంది కదా అని శ్రీకృష్ణుడు శరదృతుశోభను ఎంతో ముచ్చేటపడి చూచాడు. వర్షాకాలంలో సూర్యభగవానుడు దిగంతాల్లో తన కిరణాలను వెదజేల్లక నిద్రా ముద్రను పొందేడట! శరదాగమనంతో పక్షులు యథేచ్ఛగా ఆకాశంలో విహరించేకుండా తమ గూళ్లలోనే ఉండిపోసాగేయి.

ఈ విధంగా ఒక్కసారిగా హరిని సేవించిన సర్వఋతువులూ ఆయనకు అమేయమోదాన్నందించాయని వర్ణించేటంతో షష్ఠ సర్గ సమాప్తమౌతుంది.

ఆరైవతకాద్రిపై ఋతువులన్నీ వచ్చి నవీనమైన పుష్పాలతో మొగ్గలతో సేవించేటంతో చక్రి ప్రీతుడై విహరించే సాగేడు. యాదవవీరులూ తమ భార్యలతో అక్కడి వన శోభకలరినట్లు చేసిన విహారవర్ణనతో సప్తమ సర్గ మొదలవుతుంది. ఈ సర్గకూడ వనవిహారంతో పాటు ఉపవన వర్ణన, పుష్పాపచయవర్ణనకే సీమితమౌతుంది. వనంలోని వివిధ పుష్పాలు కన్నులకు పండుగ చేస్తుంటే యాదవాంగనల కర కంకణ నిస్వనాలు విహాయస సంచారులైన వివిధ విహంగమ కలకల ధ్వనులు వీనులకు విందు చేస్తున్నాయి.



జలక్రీడా వర్ణనతో అష్టమసర్గ ఆరంభమౌతుంది. ఈ సర్గంతా జలప్రవేశ జలక్రీడా వర్ణనలకే నిర్దిష్టమై సహృదయ హృదయ రంజకమై భాసిస్తుంది. స్నానం చేసి సరసిలోని ఒక పద్మాన్ని చేతబూని పైకి వచ్చే ఒక సుందరిని చూచి శ్రీకృష్ణుడు సముద్ర మథన సన్నివేశాన్ని స్మరించాడు. ఈ విధంగా శుద్ధస్నాతలై నూత్న శోభతో అలరారే అంగనలతో పైకివస్తున్న యాదవులను చూసిన సూర్య భగవానునికి కూడ స్నానం చేయాలనిపించి పశ్చిమాంభోనిధిలో తానూ స్నానమాడకోరేడని చెప్పటంతో అష్టమసర్గ సమాప్తమౌతుంది.

తన తాపాన్ని తానే సహించేలేక పశ్చిమ సముద్రజలాల్లో దూకటానికి సూర్యభగవానుడు అస్తాద్రినధిరోహించాడని చెప్పటంతో నవమ సర్గారంభమౌతుంది. ఈ సర్గలో సూర్యాస్తమయ, సంధ్యా, చంద్రోదయాది వర్ణనలు చోటుచేసికొంటాయి. ఈతగాండ్రీతగొట్టటానికి ఒక ఎత్తైన ప్రదేశం నుంచి జలాల్లోకి దూకినట్లే సూర్యుడు పశ్చిమాంభోధిలో దూకటానికి చరమశైలానెక్కేడు. చండకిరణుని సహస్ర కిరణాలు సైతం అతనితోపాటు అగ్ని ప్రవేశం చేసేయి. ఇక్కడ సూర్య కిరణాలను కాంతలనుగా, సూర్యుని కాంతునిగా ఉపమించి చెబుతూ మాఘమహాకవి భర్తతో సహగమనం చేసే స్త్రీ తరువాతి జన్మలో ఆ భర్తనే పొంది ఆనందిస్తుందనే భారతీయుల విశ్వాసాన్ని స్ఫురింపచేసేడు. ఈశ్లోకం వల్ల మాఘుని కాలం నాటికి సతీసహగమనం సర్వసాధారణమై ఉండి ఉండాలని అనుమీయమాన మౌతోంది.

సూర్యాస్తమయంతో పాటు పగలు కూడ మృతినొందింది. అబలనైన నావల్ల కాగల కార్యమేముందని సూర్యుని విరహ వ్యథతో సంధ్య కూడ కానరాకుండా పోయింది. తన ప్రతిబింబాన్ని చూచి కోపంతో నూతిలో పడ్డ సింహం వలె సూర్యుడు సంద్రంలో క్రుంగగా వెంటనే ఏనుగుల గుంపుల వంటి నలుపు వర్ణం విస్తరించి ప్రపంచమంతా చీకట్లు క్రమ్మేయి. మన్ను, మిన్నూ తెలియకుండా చీకట్లు వ్యాప్తి చెందటంతో జనులకు అంధత్వం చేకూరింది. అయినా అంజనంలో విషయాల్ని గ్రహించే వాని వలె అభిసారికలకు తమ ప్రియులున్న భవనాలకు దారి దృగ్గోచరమౌతూనే ఉంది. పగలు సూర్యకాంతిచే చూడరాని గ్రహాలు రాత్రివేళ చీకట్లు వ్యాపించేటంతో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

భూమి పుట్టలలోంచి లేచిన శేషువు సహస్రఫణి కాంతుల మొత్తంవలె శీతాంశు కిరణాలు దశదిక్కుల్నీ అలముకొన్నాయి. చంద్రోదయంతో అంతకుముందు అంధకారరూపజట లలముకొన్న ఆకాశాన్ని శివుని రూపంగా వియచ్చరులు క్షణకాలం భావించారు. తూర్పు దిక్కాంత చీకటి అనే కొప్పులో ప్రకాశించే పూవులా చంద్రుడు ప్రకాశించాడట! మొదట పదునాఱవ వంతు ఆ తరువాత సగం, ఆపైన పూర్తిగాను చంద్రుడు ప్రకాశించేటం వల్ల అభివృద్ధి అనేది ఎంతటి తేజశ్శాలికైనా క్రమంగా చేకూరవలసిందేకాని హఠాత్తుగా ప్రాప్తించేది కాదంటాడు కవి. కావ్యం కాంతా సమ్మితమైన ఉపదేశం అందజేయటమంటే ఇదే. భల్లూకాది సమూహమంతా తనను సేవిస్తూ ఉంటే లక్ష్మణ ద్వితీయుడైన రామచంద్రుడు ప్రచండమైన పరాక్రమంతో అంధకాసుర గణాన్ని హతమార్చినట్లు చంద్రుడు చీకట్లను హతమార్చాడు. చంద్రుని పొంది రాత్రి, రాత్రిని పొంది చంద్రుడూ పరస్పరం శోభించారు. పగటి సమయంలో సూర్యరశ్మిచే బాధకులోనై తుమ్మెదల రొదతో రోదించిన కలువ కన్నెకు



ప్రియుడైన చంద్రుడు తన చేల్లని కిరణాలను ప్రసరింపచేసి ఆబాధ నుండి ఆమెకు ఊఱట చేకూర్చాడట! చీకటిలో తన బాణాలకు లక్ష్యాన్ని చూడలేని మన్మథుడిపుడు చంద్రోదయంతో లక్ష్యాన్ని చూడగలగటం వల్ల విజయా కాంక్షతో వింటిని చేబూనేడు. అన్నిదిక్కుల్లోనూ తన ప్రకాశాన్ని నింపిన ఆ త్రినేత్రజుడై అపరాగ్ని అయిన చంద్రుడు అంగజుని విజృంభింపచేసేడు.

స్త్రీలు ఊర్వశీ మేనకలను తిరస్కరించారనే అతిశయోక్తి అలంకారాలతో కూడిన కవివర్ణనల్లో సత్యాసత్య ప్రసక్తి లేకుండ భావుకుడు సౌందర్య పరకాష్ఠను భావించి ఆనందించాలంతే! ఎందుకంటే పాఠకులు కాని కవికాని ఆ స్త్రీలను కాని ఊర్వశీ, మేనకలను కాని చూసి ఎఱుగరు కదా ! భావనాశక్తిని విజృంభింపచేసి తరించేటమే సహృదయుని ధర్మం.

పదవసర్గ అంతా మధుపాన, శృంగారక్రీడా వర్ణనలతో నిండి ఉంటుంది. అచేటి స్త్రీ పురుషుల ప్రణయ కేళిని చూసి నిశాకాంత సిగ్గుతో చంద్రునితో తానూ వెడలిపోయిందంటాడు కవి!

ప్రభాతవర్ణనతో ఏకాదశ సర్గ ఆరంభమౌతుంది.

*శ్రుతి సమధికముచ్చైః పఞ్చమం పీడయన్తః*
*సతతమృషభ హీనం భిన్నకీకృత్య షడ్జమ్।*
*ప్రణిజగదురకాకుశ్రావకస్నిగ్ధ కణ్ఠాః*
*పరిణతి మితి రాత్రేర్మాగధా మాధవాస్యయ॥*

ఈ శ్లోకం పదునొకండవ సర్గలో మొదటిది. సంగీతశాస్త్రంలో కూడ మాఘ మహాకవికున్న పట్టుకీ శ్లోకం దర్పణం పడుతుంది. శ్రీకృష్ణభగవానుని మేల్కొలపటానికి మధుర గాత్రాలు కల వైతాళికులు పంచమ (ప) ఋషభ (రి) షడ్జ (స) స్వరాలను వదలి గొంతెత్తి ప్రభాతగీతాల్ని పాడేరని ఈ శ్లోకభావం. సంగీత శాస్త్ర పరిచయం కవులకుండటం అఱుదు. మాఘకవి

సర్వశాస్త్ర నిధి. "సరిగమపదని" అనే సప్తస్వరాల్లోనే అపారమైన సంగీత శాస్త్రం ఇమిడి ఉంది. వీటినుండే అనంతమైన రాగాలుద్భవించాయి. అయితే ఒక్కొక్కరాగం ఒక్కొక్క వేళలోనే పాడాలనే నియమాన్ని శాస్త్రం విధించింది. ప్రతిరాగంలోను ఈ ఏడు స్వరాలూ ఉండాలనే నియమం లేదు. ప్రభాత, మధ్యాహ్న, సాయం, రాత్రి వేళల్లో పాడే రాగాలను శాస్త్రం నిర్దేశించింది. ప్రాతః కాలంలో 'రి' స్వరం పాడితే యుద్ధం సంభవిస్తుందనీ, 'ప' ఎక్కువపగా వచ్చే రాగాలను పాడితే మరణమనీ, శాస్త్రకారుల నిష్కర్ష. కనుక ప్రభాత వేళల్లో మహారాజులను నిద్ర లేపేందుకు గాయకులా స్వరాలు లేని రాగాల్ని ఎన్నుకొని గానం చేయటం భారతీయ సంప్రదాయం.

రాత్రంతా ప్రియులతో సుఖాన్ననుభవించిన కామినీ జనం అలసి నిద్రకై ఆరాటపడుతూ కన్నుమూయబోతుంటే మృదంగస్వనాలు మిన్ను ముట్టటంతో ఆకాస్త ఆశా నశించింది. "హఠాత్తుగా కుముదాలు ముకుళించుకు పోయాయి అయ్యో! రాత్రి, తారకలు ఒక్కసారిగా అదృశ్య మైపోయా" యని కళత్ర ప్రియుడైన చంద్రుడు దుఃఖంతో శుష్కించి పోయాడు. సూర్యోదయం కాకముందే అరుణుడు వచ్చి చీకటిని అణచివేసేడు.

ఆ తరువాత ప్రతి గృహంలో జరిగే వైదిక క్రియల వర్ణన చోటు చేసికొంది. శాస్త్రోక్తంగా అగ్నిని వ్రేల్చి సమంత్రక ఆహుతులర్పించినట్లు చెప్పటం వల్ల కర్మకాండ పట్ల మాఘునికి కల ప్రత్యయం స్పష్టమౌతోంది.

శ్రీ కృష్ణ భగవానుని కరిపుర ప్రస్థాన వర్ణనమే పండ్రెండవ సర్గ అంతా. తెల్లవారటంతోనే రాకుమారులంతా గజతురగరథాల నెక్కివచ్చి శ్రీకృష్ణుని రాకకై బారులు తీర్చి నిరీక్షిస్తున్నారు. అప్రతిహత వేగంతో ఆకాశంలో తిరిగే గరుత్మంతుని వలె భూమిపై నడిచే రథాన్నధిరోహించి సువర్ణాంబరాలు ధరించి కృష్ణుడు బయలు దేరేడు. వక్షఃస్థలవాసి లక్ష్మితో చేతిలో చక్రంతో



సర్వలక్షణ లక్షితుడైన ఆ శ్రీహరి వెంటనే నృపాలురూ నడిచారు. ఆ ప్రభాతవేళ లతాంగులకు వియోగ ఖేదం కలుగజేస్తూ మంగళవాద్యాల ధ్వనితో కృష్ణుని సేన ప్రయాణమైంది. గజశ్రేణి ఆకాశానికెగిరే కొండలవలె శరీరపు ముందు భాగాన్ని పైకెత్తి కాళ్లను వంచి మావటివాళ్లను తనపైకెక్కించుకొంది. ఆశ్వికు లశ్వాల నధిరోహించారు. ఆ వెనుక ఒంటెల పిండూ సాగింది. శ్రీకృష్ణుని ప్రయాణవేళలో చెలరేగిన శంఖపటహ ధ్వానాలు రాజులకే కాక వన్య మృగాలకు కూడ భీతిని కలిగించాయి. రైవత కాద్రి క్రిందనున్న నేలపై పరుగిడుతున్న గుఱ్ఱాల గిట్టల త్రొక్కిడితో రేగిన ధూళి సూర్యకిరణ కాంతుల్ని పరిహసిస్తూ దిగంగనా వ్రాతానికి కుంకుమచర్చలా శోభించింది. గంభీరమైన రథాలస్వనంతో గజబృంహితాలు ఏకం కాగా అశ్వహేషలు తద్భిన్నమై స్పష్టంగా వినిపిం చేసాగేయి. ఔన్నత్యంలో మహాపర్వతాలకు, వైశాల్యంలో యమునాది మహా నదులకూ తీసిపోక త్రిమార్గగా ప్రసిద్ధినొందిన గంగానది నతిక్రమించినవై సేనలు నడిచాయి. ఒక బండి బండకు తగలటంతో చక్రం ముక్కలై అందులోని మద్య భాండం భళ్ళుమని బ్రద్దలు కావటంతో సుర అంతా కాలువలు కట్టి మార్గమంతా రొంపిగా రూపొంది త్రోవ కనుపట్టక పోవటంతో ఆ కల్లు వ్యాపారి విలపించాడు.

శ్రీ కృష్ణ సేనా నివహం భేరీ రావాలతో ఆ రైవతకాద్రి గుహలన్నీ మార్మ్రోగిపోయాయి. ఎత్తైన అరటిఆకులు ధ్వజాంశుకాలతో తర్జితమైనాయి. ఏనుగుల కాలిత్రొక్కిడికి కఠినమైన పర్వతశిలలు చూర్ణమై ఆసేనా నివహానికి తీసికట్టైంది. వందిజనం శ్రీకృష్ణభగవానుని సద్గుణ పుంజాన్ని చేక్కని సమాస భూయిష్ఠమైన పదాలతో వసంతతిలకాది వృత్తాలతో కీర్తిం చేసాగింది. కల్పాంతవేళ సముద్రం కూడ చెలియలికట్టను దాటి సర్వభూతలి నాక్రమించి ముంచుతుంది కాని, అపార సేనాయుతుడైన అచ్యుతుడు మాత్రం తన

సేనానివహంతో పల్లెల మీద పడి మర్యాదను వీడడు. కుసుమ శరార్తలైన గ్రామీణ స్త్రీలు తమ కుసుమ గుచ్ఛాల వంటి మోములెత్తి ఇతరులు తనను తిలకించే కుండా వెన్నుని చూడసాగేరు. ఆలమందలను బయళ్ళలో నిలిపి మండలాకారంలో కూర్చొని మధ్యాన్ని సేవించి చిందులు త్రొక్కుతూ తనను కీర్తించే గోపాలురను కృష్ణుడెంతో ప్రేమతో చూచాడు. అమాయికలైన గోపస్త్రీల నేత్రాలు కృష్ణ సందర్శనంతో సఫలమై ఆశ్చర్యాన్నొందినా తృప్తిని పొందలేదు. గోవత్సాల్నీ ఎగాదిగా నాకుతున్న ఆవుల్నీ, దూడలు పాలు త్రాగిన తర్వాత శబ్దం చేస్తూ పాలు పితికే గోపజనాన్నీ కృష్ణుడెంతో ఆసక్తిగా చాలసేపు చూచాడు. పొలాల్లో చిలుకలను త్రోలబోతే మఱొక వంక లేళ్లు ఆ పంటచేలను తింటూ ఉంటే వాటిని వారిస్తూ పొలాన్ని రక్షించే ముగ్ధజన వధూసమూహాన్ని ముకుందుడు మందహాసంతో తిలకించాడు.

పర్వతపరిసరాలనుంచి ప్రతికూల వాయువులతో చలించేకుండా కొండలపై చరించే అసంఖ్యాక మత్తగజాళిని మురహరి చూచాడు. పర్వతారోహణతో ఉప్పొంగిన కుచద్వయంతో ఉసిరితోటల్లో విహరించే కిరాత కాంతలు తమ విస్ఫారిత నేత్రాలతో శ్రీకృష్ణుని చూచారు. ఆ పర్వత పరిసరాల్లో చరిస్తున్న మురారి సేనానివహాన్ని ఒక్కక్షణం కళ్లు విప్పి అనాదరంతో చూచికూడా ఒక సింహం ఏమాత్రం భయపడలేదు. భయపడితే అది మృగరాజెలా అవుతుంది? మహోన్నత వృక్షాలను ధ్వజాలతో త్రోసిరాజని, జన సముద్రంతో నదీ ప్రవాహాలను తిరస్కరించి, ఏనుగులతో పర్వతాలనే పిండి కావించి శ్రీకృష్ణుని సైన్యం పర్వతాలపై సంచరించే సాగింది. గజ సమూహం వాటి తీట తీఱేట్లు గండస్థలాల్ని చెట్లకు తాటించి బరుకగా చెట్లకు మీసాలవలె వ్రేలాడుతున్న తేనెటీగలు కుట్టటంతో జనం పరువులు పెట్టసాగేరు. గుఱ్ఱాల ఘట్టనతో పైకి లేచిన ధూళి గాలికెగిరి సరస్సులో పడి ఏనుగులందులో స్నానం చేయటంతో స్వచ్ఛమైన నీరు బురదగా మారింది. శ్రీకృష్ణుని త్రోవలో సేనా నివహాలు



నిలిచే తావుల్లో ఏర్పఱచిన గుడారాలు సౌధాల్లా ప్రకాశిస్తూ, తనను వీడిపోతున్న శ్రీ కృష్ణ పతి వియోగం భరించేలేని పురీలలామ వచ్చి ముందు నిలిచిందో అన్నట్లుందట! శ్రీకృష్ణుని సేనల నడకలతో పైకెగసిన ధూళి సూర్యుని క్రమ్మివేసి ఆ కిరణాల వేడికి క్రాగి వాయు ప్రసారంతో రక్త కమలాలతో కూడిన యమునానదిలో పడింది.

ఆ యమునానది ఉష్ణాంశువు సూర్యుని పుత్రి అయినా శీతలంగానే ఉంటుంది. యమధర్మరాజు సోదరి అయినా జనానికి జీవదాత్రి. నల్లగా ఉన్నా తన జలాలతో ప్రాణి సంతతికి పాపహారిణిగా పేరొందింది. హిమసదృశమైన తెల్లని మేఘాలు ఈ కాళిందీ (యమున) నదీ తోయాలు గ్రహించేటం వల్లనే నల్లనివై ఉంటాయని కవి ఉత్ప్రేక్ష. శ్రీకృష్ణుని యాదవ బలగం అంతా నావల నెక్కి యమునా నది ఈవలి తీరాన్నుంచి ఆవలి తీరానికి చేరుకోవటంతో ద్వాదశ సర్గ సమాప్తమౌతుంది.

శ్రీకృష్ణుడు హస్తినాపురం ప్రవేశించిన వైనాన్ని తెలిపేదే త్రయోదశ సర్గంతా. కృష్ణుడు యమునా నదిని దాటేడన్న వార్త ధర్మరాజు విన్నాడు. దాటిన తర్వాత వార్తే కాదు, కృష్ణుడే క్షణంలో ద్వారక వదిలేడో అప్పటి నుంచే ఎప్పటి కప్పుడాయన ఎక్కడ ఉందీ ఆహర్నిశలూ వార్తలు ధర్మజునకు చేరుతూనే ఉన్నాయి. సోదరసమేతుడైన ధర్మజుడు ఆయన వస్తున్నాడనే వార్తను వినటంతో సంతోషంతో శరీరం ఉప్పొంగిపోయి ఆయన కాహ్వానం పలుకటానికి పట్టణం వీడి బయలుదేరేడు. ఎదురు వెడుతున్న ధర్మరాజు సైన్యదుందుభిధ్వానం చెవులకు చెవుడు పుట్టిస్తుంటే హస్త సంజ్ఞలతో వార్తలు తెలిసికొనే స్థితి ఏర్పడుతోంది. గుఱ్ఱాల అడుగుల చప్పుడు ప్రణవవాద్య ధ్వనులననుకరిస్తుంటే ఏనుగుల బృంహితాలను విని అవి పర్జన్య ఘోషలుగా భావించి , నెమిళ్లు నృత్యం చేయసాగేయి. దూరం నుంచి దామోదరుడు దృష్టిగోచరం కావటంతోనే సంతోషంతో ధర్మజుడు రథం నుంచి దిగాలనుకునేటంతలోనే మాధవుడు తానే వినయంతోనూ, సంభ్రమంతోనూ

రథావతరణం చేసేడు. సమస్త భువనాలు ప్రణుతించే వాడు, సనాతనుడు, ఆదిపురుషుడూ అయిన అచ్యుతుడు భూమిపై వ్రాలి తన మేనత్తకొడుకని యుధిష్ఠిరునకు నమస్కరించాడు. ఆ పురాణ పురుషుని శిరస్సు భూమికి తాకక ముందే యుధిష్ఠిరుడతణ్ణి లేపి తన బిగి కౌగిటిలో బంధించి మూర్ధాఘ్రాణం చేసేడు. యుధిష్ఠిరుని కౌగిలినుంచి విడివడిన కేశవుడు తక్కిన నలువురు భ్రాతల్నీ సముచితంగా గౌరవించాడు. యాదవాంగనలు, పాండవకాంతలు సంతోషంతో పరస్పరం ఆలింగనం చేసికొన్నారు. రథగజతురగ పదాతియుతమైన యాదవ పాండవసేనలు పరస్పరం కలిసిపోయాయి. రథాన్ని అధిష్ఠించుమని ధర్మజుడు కోరగా అర్జునుని చేయూతతో శ్రీ కృష్ణుడు రథమెక్కేడు. యుధిష్ఠిరుడు ప్రమోదంతో ఆనాడు శివునికి బ్రహ్మవలె రథసారథ్యం వహించాడు. భీమసేనుడు చామరంతో వీవసాగేడు. అర్జునుడాహ్లాదంతో ఛత్రం పట్టేడు. భీమార్జునులమధ్యనున్న కృష్ణుడు రెండు గ్రహాల మధ్య ఉన్న 'దురధర' యోగాన్ని పొందిన చంద్రునిలా ప్రకాశించాడని చెప్పటంలో మాఘమహాకవి జ్యోతిశ్శాస్త్ర ప్రావీణ్యం తెలుస్తోంది. ఒక వ్యక్తి జాతకంలో కుజ, బుధ, గురు, శుక్ర, శని గ్రహాల్లో ఏ గ్రహమైనా చంద్రునికి రెండవ ఇంట్లో ఉంటే 'సునఫా' యోగమనీ, పండ్రెండవ ఇంట్లో ఉంటే 'అనఫా'యోగమనీ, ఈ రెండు స్థానాల్లోనూ – అంటే ద్వితీయ, వ్యయాల్లో ఉంటే 'దురధరా' యోగమని 'సారావళి' గ్రంథకర్త కళ్యాణవర్మ వక్కణ. ఈ యోగం పట్టిన జాతకుడు. ధనవాహనాలు కలిగి సుఖి, భోగి, త్యాగి కూడ అయి ఉండి సుశీలుడు, బహుకుంటుంబీకుడు, వాగ్బుద్ధి పరాక్రమాలతో కీర్తిశాలి అవుతాడని శాస్త్ర నిర్దేశం. యతిక పరిహార్యాలైన యమ, నియమాలవలె కవలలు నకులసహదేవులు కృష్ణుని వెనుక భాగంలో నిలిచారు. ఈ విధంగా పంచపాండవులూ కృష్ణుని అనుసరించి సేవించారు. గంగాయమునల సమాగమం వలె ఐక్యమైన



యదుపాండవ సేనల దుందుభి ధ్వానాలు ఆ దృశ్యాన్ని చూడటానికి వచ్చిన దేవతావిమానాల్లో ప్రతిధ్వనించాయి. దుష్టశిక్షణ శిష్టరక్షణకై మత్స్య, కూర్మాది పలు రూపాల నొందిన ఆ పురాణ పురుషుడు కృష్ణుడు తొమ్మిది గోపురాలతో ఉన్న పట్టణాన్ని నవరంధ్రాన్విత దేహంతో పంచేంద్రియాలవంటి పంచపాండవులతో ప్రవేశించాడు. దుందుభిధ్వానాలతో శ్రీకృష్ణుని రాక నెఱిగిన పురపురంధ్రులు తమ ఇంటి పనుల నెక్కడివక్కడ వదలి ఆ పురుషోత్తమ దిదృక్షతో రాజమార్గాన్ని చేరేరు. ఇంటి గోడల మధ్య చీరలు జారిపోతుంటే పోకముడిని పట్టుకొని సగం సగం అలంకరించుకొని సంభ్రమంతో బయలుదేరుతున్న పడతులను చూచి నవ్వినట్లున్నాయట! మఱికొందఱు మగువలు వ్యత్యస్తమైన అలంకారాలతో సౌధాగ్రాలనెక్కి శ్రీకృష్ణుని పై సేసలు చేల్లేరు. ఇంతులు ఇంటిపై ధ్యాసలేక భువనైక మోహనోద్ధతుడైన హరిని చూస్తూ చిత్రించిన ప్రతిమల వలె అలా చూస్తూ ఉండిపోయారు. గొజ్జెంగి నీటిని చేల్లి ధూళిరహితమైన వీధుల్లో సుగంధయుక్త ధూమాలతో హాయిని చేకూర్చే వీధులలో నుండి శ్రీకృష్ణుడు నగరంలో ప్రవేశించాడు. పూర్వం వృషపర్వుడనే రాక్షస ప్రభువుకోసం మయుడనే శిల్పి బిందు సరసినుంచి తెచ్చి కూర్చిన మణిమయదూలాలతో మెఱుస్తూ దేవతాధామాల నతిశయించి ప్రకాశించే సభామంటపాన్ని శౌరి సంతోషంతో చేరేడు. ఆ సభ వెండివలె తెల్లనైన స్ఫటిక గృహాలకాంతులు ఆకాశాన్ని క్రమ్మివేసేయి. ఆ సభలోని భవన పంక్తి రాత్రివేళలో చంద్రుని ప్రకాశాన్నతిశయించి రూపొందింది. ఆ సభలోని ఇంద్రనీల మణుల కాంతులు చూపరులకు విస్మయాన్ని ప్రాప్తింప చేస్తున్నాయి. నవోఢలు ప్రథమ సంగమానంతరం లజ్జాభారంతో ప్రియపరాఙ్ముఖులైనా వారి రూపాలు రత్నభిత్తుల్లో ప్రతిఫలించి ప్రియుల కానంద దాయకాలే అయినాయి. అచ్చేటి మరకతమణిమయ భవనాలను

చూచి తృణవాంఛతో హరిణులు మాటిమాటికి వాటి దరిజేరుతున్నాయి. ఆ సభ సమీపంలోని ఎత్తైన వృక్షాలు జలరూపదర్పణాల్లో ప్రతిబింబితమైనాయి. అక్కడ నీరున్న స్థలాన్ని నిర్జల స్థలంగా భ్రమించి దుర్యోధనుడు నడచి నీటిలో పడిపోగా భీమసేనుడు ఎందఱో రాజుల మరణానికి హేతుభూతమైన అట్టహాసం కావించాడు. ఇతరులు చెప్పినా లక్ష్యపెట్టక ఖడ్గకాంతులీనే ఇంద్రనీల మణిస్థగిత ప్రదేశాన్ని జలాశయమని భావించిన సుయోధనుడు కట్టుపుట్టాల్ని పైకెత్తుకొని నడిచి నలుగురిలో నగుబాట్లపాలైనాడు. అటువంటి అద్భుతమైన మయసభా ప్రాంగణంలో శ్రీకృష్ణ ధర్మజులు అందఱకూ కనులపండువు కావిస్తూ శుక్రచంద్రులవలె ప్రకాశించారు. ధర్మజుడు "ఇటు, ఇటు" అని త్రోవ చూపుతూ ఉంటే రతనాల గోడల అందాన్ని, కంటికి కనిపించేని ద్వారాల సొగసుకు అద్భుతావహుడై ముకుందుడు ముచ్చేటపడి భవన ప్రవేశం చేసేడు. ఉదయపర్వత శిఖరంపై ఒక్కసారిగా వెలిగే అవకాశం సూర్యచంద్రులకు లేకపోయినా కృష్ణధర్మరాజులొకే పీఠంపై కూర్చొనటం వల్ల కలిగింది. సభలో వాద్యాలతో కూడిన మధురగీతాలు చెలరేగేయి శ్రీకృష్ణుడు సవనాహూతులై వచ్చినవారి నందఱినీ పేరుపేరునా కుశలమడిగి మన్నించేటంతో త్రయోదశ సర్గ సుసంపన్నమౌతుంది.

ధర్మజుడు పూనిన రాజసూయ యాగంతో పదునాల్గవ సర్గ ప్రారంభమౌతుంది. యుధిష్ఠిరుడు తాను తలపెట్టిన యజ్ఞాచరణకు అనుమతి నిమ్మని శ్రీకృష్ణుని అర్థిస్తాడు. అతని అండదండలుంటే నిర్విఘ్నంగా నిర్దోషంగా యాగం పూర్తికాగలదని వేడుకొంటాడు. ఆ మహనీయుని దయవల్లనే తామార్జించిన సంపదల సద్వినియోగం చేయటానికి శాసించేవలసిందిగా కోరుతాడు. అలావేడుకొన్న ధర్మజుని చూచి కృష్ణభగవానుడు రాజులను జయించేటం అతని స్వీయ ప్రతిభ వల్లనే



జేరిగిందని ప్రశంసించి, తనకు, అర్జుననుకు భేదం లేదుకనుక తనను వలసిన కార్యంలో ఆజ్ఞాపించుమని పలుకుతాడు. ధర్మజు పూనికకకు అడ్డువచ్చిన ఎవరినైనా తన సుదర్శన చక్రం ఖండించేగలదని చెబుతాడు. శుభ్రస్నాతుడై చంద్రముఖుడైన ఆ ధర్మరాజు యజ్ఞ దీక్షను స్వీకరించి శివుని అష్టమూర్తుల్లో అష్టమమూర్తి వలె ప్రకాశించాడు. శాస్త్రవిదులైన యాజ్ఞికులు ఉచ్చైస్స్వరంతో మంత్రాలనుచ్చరిస్తూ హవనస్వీకారానికై దేవతలనాహ్వానించే దొడగేరు. ఆ రాజసూయాధ్వరంలో ఉద్గాత కరవిన్యాస పూర్వకంగా సప్త స్వరయుక్తంగా బృహద్రథన్తరాది సామవేదాన్ని గానం చేస్తే, హోత, అధ్వర్యుడు శ్రేయోదాయకాలైన ఋగ్యజుర్వేదాల్ని పఠించారని చెప్పటంతో మాఘమహాకవికి వేద పరిచయమేకాక యజ్ఞాచరణ విధిపై కల అధికారం సైతం తెలియవస్తుంది. దర్భలతో కూర్చిన బంగారు మేఖలను ధరించి సోమిదమ్మ అయిన ద్రౌపది చూస్తూండగా హోమద్రవ్యాలన్నిటిని యాజ్ఞికులు అగ్నిహోత్రంలో వ్రేల్చారు. యజ్ఞ నిర్వహణ శాస్త్రోక్తరీతిలో జేరిగిందనటానికీ, యాజ్ఞిక మంత్ర పఠనం లక్షణోపేతమైనదనటానికి పదునాల్గవ సర్గలోని 20-26 మధ్యనున్న శ్లోకాలన్నీ ఉదాహరణగా నిలుస్తాయి. వ్యాకరణ, శిక్షా శాస్త్రాలతో పాటు వేదోచ్చారణ రీతిపై కూడ మాఘకవి కున్న అధికారానికీ సన్నివేశం దర్పణ ప్రాయమౌతుంది.

యజ్ఞాదికర్మలు కర్తనేకాక ఆ పరిసరాల్లో ఉన్న వారినీ పునీతుల్ని చేస్తాయనే మహార్థాన్ని తెలుపుతుందీ శ్లోకం :

*"స్పర్శముష్ణముచితం దధచ్ఛిఖీ*
*యద్దదాహ హవిరద్భుతం నతత్ ।*
*గన్ధతో ఒపి హుతహవ్య సమ్భవాద్*
*దేహినామ దహదోఘ మంహసామ్ ॥ (14-27)*

అగ్నిహోత్రుడు క్షీరఘృతాదిహోమ ద్రవ్యాల్ని దహించ చేటంలో వింతేమీ లేదు. ఆ హోమగంధాన్ని ఆఘ్రాణించిన ప్రాణుల పాపాల్ని కూడ భస్మంచేయటమే మహాశ్చర్యకరం. హోమకుండంలోని అగ్నికి వాయువు తోడు కాగా పైకెగసి అన్నిదిక్కుల్నీ వ్యాపించి మేఘమండలిని దాటి ఆ ధూమం దేవతానీకానికి ప్రీతిని కలుగజేస్తూ దివికెగిసింది. పూర్వం సముద్రమథన వేళ సర్వౌషధుల సారంగా వెలువడిన అమృత బిందువుల నాస్వాదించి ఆవురావురుమంటున్న దేవతలిప్పుడీ భువిలో ధర్మజుని యాగంలో సుధను గ్రోలి పరితృప్తులయ్యారు. సాధన సంపత్తిలోకాని, విధివిధానంలో కాని లేశమైనాలోపం లేకుండా లక్షణంగా యుధిష్ఠిరుని క్రతువు సమాప్తమైంది. పూజ్యులైన బ్రాహ్మణులకు భూరిదక్షిణలందేయి. దానాలు చేసిన యుధిష్ఠిరుడే కాక, అటువంటి పుణ్యాత్ముని నుండి దానాలు గ్రహించినవారు కూడ పునీతులైనారు. మహిలో మహేంద్రునిగా ప్రకాశిస్తున్న మహీపతి ఆచంద్రతారార్కం చెల్లే దానపత్రాల్ని రాజముద్రతో విప్రవరులకు అర్పించాడు. ఎంతో ప్రయత్నంతో కాని పొందలేని అనర్ఘరత్నాల్ని రాకుమారులు ధర్మజునికి కానుకగా సమర్పించ చేటానికి ఆయన దర్శనానికై వేచి ఉన్నారు. ఒక్కొక్క భూపతి కానుకగా సమర్పించే ధనమే యజ్ఞ నిర్వహణకు సరిపడినా వదాన్యుడైన ధర్మజుడాధనాన్నంతటినీ దానానికే వినియోగించాడు. ధర్మరాజు ఆర్తుల్ని ఎప్పుడూ చులకనగా చూసి ఎఱుగడు, తరువాత రమ్మనడు. ఏనుగు పాడిగా యాచకులకిచ్చినా ఎప్పుడూ తనను శ్లాఘించుకోడు. ఆ అజాతశత్రువుని సమీపించిన ధనార్థి ధనలబ్ధినొందక తిరిగిపోడు. రోగి స్వస్థత చేకూరికాని తిరిగివెళ్ళడు. ఆకలికొన్నవాడు మృష్టాన్నాన్నారగించ చేకుండా వెళ్ళటమనేది లేనేలేదు. నవరసభరితమైన నాటకాన్ని చూచి సామాజికు లానందించినట్లే షడ్రసోపేతమైన విందునారగించి అతిథులు పరితృప్తులయ్యారు.



*"స్వాదయన్ రసమనేక సంస్కృత*
*ప్రాకృతై రకృత పాత్ర సఙ్కరైః ।*
*భావశుద్ధి సమితైర్ముదం జనో*
*నాటకైరివ బభార భోజనైః ॥ (14-50)*

ఇదొక చేక్కని శ్లోకం కాళిదాసు **"నాట్యం భిన్నరుచేర్జనస్యబహుధా ప్యేకం సమారాధనమ్"** అని నాటకాన్ని భోజనంతో పోలిస్తే మాఘకవి ఈ శ్లోకంలో భోజనాన్ని నాటకంతో పోల్చి చెప్పి తన నాట్యశాస్త్ర వైదుష్యాన్ని చేటేడు.

సంస్కృతనాటకాల్లో 'పాత్ర'లను బట్టి కొందఱు సంస్కృతంలోను, మఱి కొందఱు ప్రాకృతంలోనూ సంభాషిస్తారు. ప్రాకృతం మాటాడే వారు సంస్కృతాన్ని కాని, సంస్కృతంలో భాషించే వారు ప్రాకృతంలోనూ భాషించ చేక పోవటం వల్ల 'పాత్ర' సంకరం ఉండదు. ఇక్కడ ఈ యజ్ఞంలోని విందు 'సంస్కృత' మైన – అంటే ఇంగువ, జీలకఱ్ఱ వంటి పోపు సామగ్రితో చేక్కగా రూపొందిన వంటకాలు, 'ప్రాకృతం' అంటే ప్రకృతి సిద్ధమైన మామిడి, అరటి, ద్రాక్ష వంటి ఫలాలతోనూ కూడి ఉంది. (భుజించే పాత్రల సంశుద్ధితో) 'భావశుద్ధి' అంటే నాటకంలో శృంగారాది నవ రసాలవలె భోజనం కూడ షడ్రసోపేతంగా ఉండి అందఱికీ ఆనందదాయకమైందని తాత్పర్యం.

దుష్టశిక్షకుడైన శ్రీహరిని యాగరక్షకునిగా నుంచి ధర్మజుడు ఎటువంటి అంతరాయంలేకుండా సంతోషంతో యజ్ఞాన్ని పరిపూర్ణం కావించాడు. తరువాత ప్రప్రథమంగా అర్ఘ్యం ఇవ్వటానికి అర్హత కలవారెవరని పృథాసుతుడు శంతన పుత్రుణ్ణి అడిగేడు.

భీష్ముడు "స్నాతకుడు, గురువు, ఋత్విక్కు, సఖుడు, బంధువు, ప్రజ్ఞాపాలనా దక్షుడైన తోటిరాజు – ఈ ఆఱుగురూ అర్ఘ్యంతో అగ్రపూజ

నొందటానికి అర్హులు, వారంతా నీ ఈ సభలో ఉన్నారు. వీరంతా పూజార్హులే అయినా గుణవంతుడొక్కడే అర్హుల్లో శ్రేష్ఠుడని పెద్దలంటారు. అంతా ఈ సభలో ఉన్నా, సర్వవిధాలా శ్రేష్ఠుడు, అసుర సంహారకుడూ అయిన శ్రీకృష్ణుడొక్కడే నామదిలో మెదులుతున్నాడు. ఇతణ్ణి సామాన్య మానవునిగా భావించేకు. ధ్యానింపతగినవాడే అయినా మందమతుల దృష్టికందడు. స్తుతింపతగిన వాడే కాని ఆతని నుతించేటానికి మాటలు చాలవు. అందరికీ దూరంగా ఉండేవాడే అయినా యోగుల చిత్తానికి అత్యంత సన్నిహితుడై ఉంటాడు. ఇతనిలోని రజోగుణంతో బ్రహ్మ సృష్టిస్తే తనలో సత్త్వగుణంతో తాను దాన్ని పోషిస్తాడు. శివుడీయన లోని తమోగుణంతో ఆ సృష్టిని లయింపజేస్తాడు. ఇలా ఈ త్రిగుణాలతో ముప్పిధాలుగా వెలిగే ఒక్క వెలుగైన వాడీకృష్ణుడు. భక్తవత్సలుడైన ఇతణ్ణి భక్తులు ధ్యానిస్తూ సర్వ పాప విముక్తులై జననం, మరణం, తిరిగి జననం, మృత్యువుతో కూడిన ఈ నాటక నిర్వహణ కావిసస్తా ఙంటారు. ముముక్షువులు పామరత్వాన్ని విడిచి మనస్సును యోగంలో కీలించి తిరిగిరాకుండా ఇతణ్ణి చేరుతారు. అతడనాది అయిన సర్వప్రాణులకూ ఆది అయినవాడు. అనంతుడైన సర్వ భూతాంతకుడు సమస్తలోకాలకూ మూలమైనా సత్యలోకానికి పైనుండే ఈ భగవంతునికి నేను నమస్కరిస్తాను పాలసముద్ర పాన్పుపై పవళించిన ఈయన సుఖ నిద్రకు నల్లులవలె మధుకైటభులనే రాక్షసులుద్భవించారు. ఋతమైన నడవడికలవాడైన ఇతణ్ణి మాయికుడనీ సర్వలోక వృద్ధుడైన ఇతన్ని బాలుడని, జన్మనెత్తినా పుట్టుకలేని వాడనీ ఈ పురాణ పురుషుని జగాలు స్తుతిస్తాయి. ఆదివరాహంగా అవతరించిన ఈ మహాత్ముని భూదేవి వరించింది. బలిష్ఠమైన శస్త్రా లకు కూడ విచలుడు కాని నిశాచరుని రొమ్మును తన గోళ్లతో చీల్చి వధించిన నరసింహుడితడే! భువన శ్రేయస్సిద్ధికై బలిచక్రవర్తిని



మూడడుగుల భువిని యాచించి సర్వభువనాలనూ అతిక్రమించిన త్రిదశేశు ని అనుజుడైన ఈ మాన్యుడు సామాన్యుడా? వ్రేలెడంతలేని ఈ వామనుడెంత భూమిని ఆక్రమించుకొంటాడని దైత్యులు పరిహసించేక ముందే క్షణాల్లో సూర్యచంద్ర మండలాల్ని దాటిన పాదంతో దివిపై తన పాదాన్ని మోపేడు. పర్వతం వలె దుర్భరమై ఆకాశంలో ప్రకాశిస్తున్న ఆ పాదమహిమవల్లనే ఇంద్రుడు బలిని నిర్జించేగలిగేడు. నింగినంతా నిండి పైకి వ్యాపిస్తున్న ఇతని రూపును దూరం నుంచి చూచిన అసురులు గంగపై కోపించి భువినుండి దివికెగసివస్తున్న యమునగా భావించారు. ఆనాడు రేణుకాగర్భంలో పరశురామునిగా అవతరించి సహస్ర శాఖాన్వితమైన కార్తవీర్యార్జునాటవిని సమూలంగా దగ్ధమొనరించిన మహానీయుడితడే. రాక్షస రక్షితమైన రాక్షస పురి లంకను జయించి భీషణుడైన రావణుని సంహరించి విభీషణునికి పట్టంకట్టి ప్రజాపాలన మొనర్చిన శ్రీరాముడీ మహనీయుడే.

బ్రహ్మదేవుని అభ్యర్థనపై దేవేంద్రుని శత్రువులైన రాక్షససంహారానికై వసుదేవుని రూపంలో ఈ వసుధపై వెలసిన కశ్యపబ్రహ్మ కడుపున కృష్ణుడై ఉద్భవించాడు. ఆనాడు  అమరులు, ఈనాడు గోపాలురూ స్తుతించిందీ కృష్ణుణ్ణే. అమోఘ పరిమళ భరితమైన దేవతల పారిజాతవృక్షాన్ని దేవేంద్రుని ఉద్యానవనం నుండి పెకలించి భువికి తెచ్చిన ఘనుడీ శ్రీకృష్ణుడు. నోటితో ఊదితే దీపం ఆరిపోయినట్లు ఇతని దృష్టి విక్షేపంతో చేదినృపతి శిశు పాలుని నొసటి కన్ను మాయమైంది. ఆనాడు సముద్రంలో మునిగిన భువిని తన దంష్ట్రాబలంతోను, ఈనాడు గోపాలుడై గోమండలాన్ని  తన భుజ బలంతోను ఉద్ధరించిన మహాత్ముడీకృష్ణుడు. యజ్ఞాల్లో దూరంనుంచి పూజలందుకొనే శ్రీకృష్ణుడు ఇప్పుడు నీ సమక్షంలో ఉండటం వల్ల ధన్యుడనైనావు. కనుక అర్ఘ్యరూప అగ్రపూజనతనికి సమర్పించి కల్పాంత

పర్యంతం సాధువాదాలనొందుమ"న్న భీష్ముని ఆనతిని తలదాల్చిన యుధిష్ఠిరుడు శ్రీకృష్ణున కర్ఘ్యం సమర్పించేటంతో పదునాల్గవ సర్గ పరిపూర్ణమౌతుంది.

ధర్మనందనుడు శ్రీకృష్ణునికి సమర్పించిన అగ్రపూజను సహించలేని శిశుపాలుడు ఈర్ష్యాగ్రస్తుడు కావటంతో పదునైదువ సర్గ ప్రారంభ మౌతుంది. ఎప్పటినుంచో కృష్ణునిపై రగులుతున్న పగ ఈ ధర్మసూనుని పనితో ఒక్కసారిగా భగ్గుమంది. కోపావేశంతో కళ్ళలో నీరు క్రమ్ముకొని చెక్కిళ్లు, చేతులలో స్వేదం ఉద్భవించింది. క్రోధం మిన్ను ముట్టుతుంటే కనుబొమలు ముడిచిన ఆ శిశుపాలునికి పూర్వం పోయిన మూడవకన్ను తిరిగివచ్చిందా? అనేట్లు సభాసదులకు కన్పట్టేడు. సమీపంలో ఉన్నకత్తిని ప్రియురాలివలె అవలంబనంగా చేసికొన్నాడు. కోపంతో తొడను చేఱచిన శబ్దం భయంకరమై సదస్యులనందఱినీ త్రుళ్ళిపాటుకు గుఱిచేసింది. కోపం అనేది ప్రశాంతుడైన వాణ్ణి కూడా క్షోభింపచేస్తుందంటే ఇక శిశుపాలుని విషయంలో చెప్పేదేముంది? సభ అంతా కలతచెందేట్లు మేఘ గంభీర నిర్ఘోష వలె విస్పష్టంగా ధర్మజునితో "సత్పురుషులు గౌరవించేని ఈ కృష్ణునకు నీకు ప్రియతముడనే ఒకే ఒక కారణంతో పూజ సలిపేవు. అగ్నిహెూత్ర సదృశులైన భూసురులెందఱో ఉండగా, దేవేంద్ర కల్పులైన ధరాధిపులు పలువురుండగా రాజయోగ్యమైన అర్ఘ్యాన్ని రాజుకాని వీనికివ్వటం పురోడాశాన్ని కుక్కకివ్వటం వంటిది ధర్మజా! నువ్వు సత్యవాక్పాలుడవని ప్రసిద్ధి నొందేవు. కాని ఇప్పుడు ఈ కృష్ణుని పూజించేటం వల్ల నీ అసత్యసంధత వ్యక్తమౌతోంది. "అమంగళే మంగళవాసరే" అన్నట్లు నింద్యుడైన ఈ హరి పూజతో ధర్మరాజని కీర్తినొందిన నువ్వు అధర్మరాజైనావు. గుణాలతో మాకేంపని? ఈ గొల్లడే మాకు పూజ్యుడంటే ఇంతమంది నృపతులనిక్కడకు పిలవటం వారిని



అవమానించేటా నికి కాకపోతే దేనికి? వీరికిక్కడిక పనేముంది? ఆవంతైనా జ్ఞానం లేక ఆచార హీనులైన మీకు ధర్మం ఏం తెలుస్తుంది? వృద్ధుడు కావటంతో మతి క్షీణించిన ఈ భీష్ముడు మీకు ధర్మోపదేశం చేసేవాడా? గంగాసుతా! అర్ఘ్య స్వీకారానికి అర్హులెవరో కొందఱిని చెప్పేవు. ఆ కొందఱిలో ఈ మురారి ఏ ఒక్కడైనా కాగ లడా? అనర్హులను అర్హులుగా పొగిడే విద్య ఎక్కడ నేర్చావు? ఇంతటి కుత్సి తానికెలా పాల్పడ్డావు? ఉత్కృష్టులైన ఈ రాజకాన్ని విడిచి ఒక నీచుణ్ణి ఉన్నతుడన టానికి నీకు నోరెలా వచ్చింది? నీరు పల్లానికి పాఱినట్లు నీచుని కీర్తించే నువ్వు గాంగేయునిగా సార్థక నామధేయుడవే అయినావు" ఇక కృష్ణుని వైపు తిరిగి –

"ఓ కృష్ణా! కేవలం రాజులకే తగిన ఈ పూజను "తగుదునమ్మా" అని నువ్వు స్వీకరించేటానికెలా సిద్ధపడ్డావు? నువ్వెప్పుడో "మధువ"నే రాక్షసుణ్ణి చంపేవనటం కల్ల. మధువునిచ్చే తేనెటీగల్ని కొట్టి తేనె అపహరించావు కనుకనే నీకు మధుసూదనడనే పేరు వచ్చింది. మగధ భూపతి జరాసంధునికి భయపడి ముచికుందుని తల్పాన్ని శరణు పొందేవు. నువ్వు బలహీనుడవు. బలరాముని ప్రాపుతో బలవంతుణ్ణని గర్విస్తున్నావు. ఎప్పుడూ సత్యం పట్ల ఇష్టుడవని నీకు "ఇష్ట సత్య' అనే ప్రసిద్ధి రాలేదు. సత్రాజిత్తు కూతురు 'సత్య' (సత్యభామ) పట్ల నీ కిష్టం కనుకనే నిన్ను 'ఇష్టసత్యుడ'వన్నారు. లేకపోతే గారడివానివలె కపట నాటకాలాడే నువ్వు 'ఇష్టసత్య' అనే పేరుకెలా తగినవాడవౌతావు? శత్రు భయంకరమైన చక్రాన్ని ధరించేటం వల్ల నిన్ను 'చక్రధారి' అనలేదు. మఱేమంటే – యుద్ధంలో ఒక రథచక్రాన్ని పట్టుకోవటం వల్లనే నీకా పేరు వచ్చింది. దారుణమైన నరకాన్ని జయించేలేక భూమిసుతుడు నరకుడనే వాణ్ణి జయించి 'నరకజిత్త'నే పేరు పొందేవురా పాపాత్ముడా! గుణలేశమైనాలేని నిన్ను

పూజిస్తే బోడిగుండును దువ్వెనతో దువ్వెనట్లై నగుబాటవుతుంది”. తిరిగి రాజ సమూహాన్నుద్దేశించి “ఓ నృపాలవరులారా! సింహపరాక్రములైన మీఅంతా చూస్తూ ఉండగానే ‘అడవికుక్క’ వంటి ఈ కృష్ణుని కుంతీసుతులు పూజించేటం మీకు తలవంపులు కాదూ? గో (వృషభం) వధ చేసిన ఈ పాపాత్మునికి – అస్పృశ్యునికి రాజయోగ్యమైన పూజ సలపటం ఏం న్యాయమో మీరే చెప్పండి. పూతనపట్ల “స్త్రీ” అనే గౌరవమైనా లేక పోవటమే కాదు, తనకు పాలిచ్చిన ‘తల్లి’ అనే ఆలోచనైనా లేకుండగనే ఆమెను హతమార్చిన నికృష్టుడీ కృష్ణుడు. బండిని పడద్రోయటం, చిన్నగుట్ట నెత్తటం వంటివి కూడా ఘనకార్యాలే? కంసుని పశులకాపరియై తన స్వామినే వధించిన ద్రోహి వీడు. అటువంటి నర పశువుని పూజించేటమనే వింత ఎక్కడైనా ఉందా?” ఈ విధంగా శిశుపాలుడు హరిని తిట్టిన తిట్లన్నీ స్తుతులుగానే పరిణమించాయి. బలగర్వంతో, హద్దుమీఱిన అహంకారంతో అవధిలేని అసూయతో శిశుపాలుడిలా వదరి వదరి కృష్ణుని చేతిని తన చేత్తో చేఱుస్తూ అట్టహాసం చేసేడు. చేది నృపతి ఇంత చేస్తున్నా శ్రీకృష్ణుడు రవంతైనా కలత చెందలేదు. శిశుపాలుడెన్ని కాఱుకూతలు కూస్తున్నా అతని అపరాధాల్ని లెక్కిస్తున్నాడు. కృష్ణుని ప్రతిజ్ఞపై గౌరవంతో యాదవ వీరులంతా ఉలుకూ పలుకూ లేక ఊరకున్నారు. ప్రజలు ప్రభువుల చిత్తాన్ననుసరించే వర్తిస్తారుకదా! శిశుపాలుని మాటలకు క్రోధోద్ధతుడైన గాంగేయుడు “ఈ సభలో నేను చెప్పిన ఈ కృష్ణుని పూజను సహించేలేని వాడెవడైనా ఉంటే వాడికి వీసమంతైనా రోషం ఉంటే ధనుస్సు నెక్కుపెట్టి నన్నెదుర్కోండి. భీష్ముని మాటలు విన్న శిశుపాలుని పక్షపు రాజసమూహమంతా ఒక్కపెట్టున ఱెప్పపాటులో రెచ్చిపోయి యుద్ధానికి సిద్ధమయ్యారు. కళ్ళలో నిప్పులు చెఱుగుతూ కొందఱు, కోపానలంతో ఎఱ్ఱవారిన మొగాలతో మఱికొందఱు, తీక్ష్ణమైన చూపులతో వేఱొక



కొందఱు – ఇలా వివిధాకృతులతో సభంతా మూర్తీభవించిన రౌద్రరసానికి ఆటపట్టై భాసించింది. ఉత్తమౌజుడనే రాజు కసిరేగిన ముఖంతో పళ్ళు పటపట కొఱుకుతూ ఏదో మాటాడబోతుంటే అతని తెల్లని దంతకాంతులు చంద్రుని పట్టబోయే రాహువు రూపుదాల్చి చూపరులకు భీతావహమై భాసించాయి. క్రోధమే నైజమైన దంతవక్త్రుడు వజ్రాయుధంతో పర్వతాలను ఛేదించినప్పుడు పుట్టిన ధ్వనిననుకరిస్తూ అట్టహాసం కావించాడు. శిశుపాలుని పక్షాన్ని వహించిన నృపమండలికి కృష్ణునిపై కినుక ఆ సమయంలో పుట్టిందేమోకాని, పూర్వమెప్పుడో తన చెల్లెలు రుక్మిణిని తీసికొని పోయిన నాటినుండి లోపల రగుల్కొంటున్న కోపం భీష్ముని మాటలతో రుక్మికి ఒక్కసారిగా పెల్లుబికింది. ఈ విధంగా యుద్ధ ప్రియులైన చైద్యపక్ష నృపతులంతా ఔద్ధత్యంతో ఒక్కసారిగా తమ ఆసనాల నుండి లేచారు. శిశుపాలుడ చేటి రాజులనుద్దేశించి “ఓ! రాజన్యులారా! మగవాని రూపంతో ఉన్న ముసలిమగువ వంటి ఈ మందాకినీ పుత్రునితోను, ఉపపతుల వల్ల జన్మించిన పంచ పాండవులతోనూ కూడిన ఈ సభలో వధ్యుడైన కృష్ణుని వధించేకుండా ఇంకా ఊరకొంటారేం? మీరు చూస్తూ ఉండండి. నేనిప్పుడే వీణ్ణి హతమారుస్తా”నంటు వాగ్విషాన్ని క్రక్కుతూ లేచాడు. పినతల్లి కొడుకని, పిలిస్తే వచ్చాడనీ పంచపాండవులేకమై “వెళ్ళవద్దని” బ్రతిమాలుతున్నా వినిపించుకోకుండా శిశుపాలుడు అహంకారంతో సభను విడిచి వెళ్ళిపోయాడు. శిశుపాలుడు పోతూ పోతూ నా తీవ్రబాణాలకు గుఱియై నేలపడబోతున్న ఈ కృష్ణుని రక్తాన్ని కాకులు, గ్రద్దలు, త్రాగుతుంటే మీరు చూస్తారని సదస్యులకు తెలిపేడు. అతిథిని ఎదుర్కోవటం తగదని కౌంతేయులు దయాళులై వానినెదుర్కోలేదు. శిశుపాలుని సమర్థించే రాజులు సైతం అశ్వమేధీయాశ్వాన్ని సేనల ననుసరించినట్లనుసరించారు. “ఇప్పుడేం మూడబోతోందో”నని జనులంతా

గుసగుసలాడుకొంటూ ఉంటే జేంకూ, కొంకూ లేకుండా చేదిపతి శిబిరానికి వెళ్ళి సేనలను సమాయత్తం చేసేడు. ఒక్కక్షణకాలంలో చేదిపతి సేనల యుద్ధఘోషలు మిన్ను ముట్టేయి. శిశుపాలుని సేనానివహంలో దుర్నిమిత్తాలు పొడసూపేయి. ఆ దుర్నిమిత్తాలను కూడ మాఘకవి అత్యంత సహజంగా చిత్రిస్తాడు.

**"ప్రజతః కృతావజసీతి**
**పరిచయగతార్థ మస్ఫుటమ్।**
**ధైర్యమభినదుదితం శిశునా**
**జననీ నిర్భర్త్సనవివృద్ధమన్యునా॥" (15-87)**

యుద్ధానికి బయలుదేరిన ఒక యోధుని చిన్న కొడుకు వచ్చీరాని మాటలతో నాన్నా ఎక్కడి కెడుతున్నావంటే తల్లి వాణ్ణి అదిలించినా ఆ మాటల్నే మళ్ళీ పలకటంతో యోధుని ధైర్యం నీఱై పోయిందట! 'ప్రజసి' అనే మాటకు బదులుగా బాలుని అస్పష్ట వచనాలు కనుక 'వజసి' అని వాడటం కవిసహజ చిత్రణకు దర్పణమ్మై నిలుస్తుంది. ఇటువంటిదే విశ్వనాథవారి శ్రీమద్రామాయణ కల్పవృక్షంలో బాలకాండలో "తానో లాములు...." (బాల. అవ. 334) ఇత్యాది పద్యంలో (రాముడుకు బదులుగా లాములు) చూడవచ్చు. పనిమీద వెడుతున్నప్పుడు ఎక్కడికి వెడుతున్నావని అడగటం అపశకునం కదా! యుద్ధవీరులకు వీరతిలకం దిద్ది సంతోషంగా సాగనంపే వారి పడుతులకా సమయంలో పట్టరాని దుఃఖం పెల్లుబికి అమంగళ సూచకమైనదంటూ పదునైదవ సర్గ ముగుస్తుంది.

శిశుపాలుడు శ్రీధరుని వద్దకు దూతను పంపటంతో షోడశసర్గ ప్రారంభమౌతుంది. ఈ సర్గలో దూత శ్రీకృష్ణునితో పలికిన పలుకులు, వానికి సాత్యకి చెప్పిన సమాధానం వర్ణితమౌతాయి. శిశుపాలుడు పంపినదూత శ్రీకృష్ణుని వద్దకు వచ్చి సభాంగణంలో స్ఫుటంగా ప్రీతి, బెదిరింపూ - రెండు అర్థాలు వచ్చేమాటలను ఇలా పలికేడు. "కృష్ణా! నీకు



అప్రియమైన మాటలాడిన చేదిపతి నొచ్చుకొని నీకు ప్రీతిని కలుగజేసి నిన్ను సంతోషింప చేయాలనుకొంటున్నాడు. సకల రాజన్యులతో అతడరుదెంచి శిరసా నమస్కరించి గాఢంగా అలింగన మొనర్చుకొని నీ శాసనాన్ని ఔదల తాల్చ నున్నాడు". ఇది పైకెంతో నమ్రతను వ్యక్తంచేసే వాక్యంగా కనిపించినా సంస్కృతంలో 'శ్లేష'ను కలిగిన ఈ పదాలు (వ్యాజస్తుతి కాదు) శిశుపాలుడు తనకు నమస్కరించిన రాజులతో వచ్చి నిన్ను శాసిస్తాడు. అంటే రక్షిస్తాడని అర్థం (వధిస్తాడు) కూడా అన్వయిస్తుంది. దూతపలికిన పలుకులన్నీ ఇలాగే ప్రియాన్ని అప్రియాన్నీ కలిగి ఉంటాయి. అగ్నితోను, సూర్యునితోను (ఇక్కడ ప్రయోగించిన 'పతంగ' శబ్దానికి సూర్యుడు, మిడత అనే రెండర్థాలున్నాయి) సమానమైన తేజస్సు కల నీకు విధేయులు కానివారెవరు? (ఆరాజుల ప్రతాపాగ్నిలో నువ్వు శలభాయమానుడవౌతావని హెచ్చరిక) నిర్భయుడవై మానవాతీతుడవై (హీనుడవై) గణింపరాని (కొంచెం కూడా ఆదరింపతగని) గుణాలతో విరాజిల్లుతున్నావు. గోపాలుడవు (నీచకర్మావలంబివి) నీవంటి గుణవంతుడెవడున్నాడు (మూర్ఖుడు) వినయ శీలివి (అభిమాన హీనుడవు) గోపీజన వల్లభుడవు (జారుడవు) వృషభాన్ని వధించిన నీచరిత్ర (పాపకర్మ) ప్రజల కీర్తనకు (నిందకు) పాత్రమైంది. అనుచర సహితుడైన శివుపాలుని పూజలంది మహారాజులలో పర్వతోపముడవై వర్ధిల్లుదువుగాక! (ఆరాజులు నిన్ను జయిస్తే కొండలు, గుట్టలు పట్టి తిరుగ వలసివస్తుంది) వారి సేన (శిశుపాలాది రాజులతో) మేఘావళితో కూడిన మదగజాలతో నిండిన ఉద్యానవనం వంటిదై ప్రవేశించేరానిదై ఉంటుంది (నీనగరం సర్ప, సింహాది మృగాలకాలవాలమై భీకరారణ్యమౌతుంది) (ఆ శిశుపాలుని ప్రాపుతో) నీ సర్వశత్రువులు పురుషార్థ విహీనులై ఆపదల పాలై పోవటంతో నీ ప్రతాపం ప్రకాశిస్తుంది. శిశుపాలునితో నీకు దృఢమైత్రి చేకూరితే నారికేళాది రుచికరమైన సురలను గ్రోలుతూ దేవేంద్రునితో తుల్యమైన భోగా

లనుభవిస్తావు. శిశుపాలుడు యుద్ధభూమిలో నిన్నెదరించినపుడా దేవేంద్రుడు కూడా నిన్ను రక్షించ లేడు. సంతోషంతో వచ్చే శిశుపాలుని పితాభ్రాతృసుత సమేతుడవై సత్కరించు (యద్దభేరీ నినాదాలతో వస్తున్న శిశుపాలుని శంఖ కౌమోదకీ యుక్తుడవై కలిసికో) శత్రు భయంకరుడైన శిశుపాలునితో సంధి చేసికొని నిర్భయుడవై యాదవులందఱినీ రక్షించుకో" అని చెప్పి ఊరకున్నాడు శిశుపాలుని దూత.

శ్రీకృష్ణునకు అతని భావం అర్థమై సభలో తన ప్రక్కనున్న సాత్యకి వంక చూడటంతో సాత్యకి ఆ దూతకీ విధంగా చెప్పసాగేడు. "పైకి ఎంతో ప్రియంగానూ, లోపల అప్రియంగానూ తోచే మాటల్ని నువ్వెంతో నేర్పుగా పలికేవు కాని మాకు లోపలి అర్థమే ప్రియంగానూ బయటకు కనిపించే అర్థం అప్రియంగానూ ఉంది. అల్పుడప్రియాన్ని మనసులో అణుచుకోలేక పైకి క్రక్కుతాడు. సత్పురుషుడు దాన్ని తనలోనే జీర్ణింప చేసికొని తలచుకోడు. ఇతరుల కెల్లప్పుడూ శుభాల్ని చేకూర్చటమే సత్పురుషుని నైజం. దాన్ని సహించ లేక దుర్మార్గుడెప్పుడూ మనసులో గగ్గోలు పడుతూ ఉంటాడు. ఉత్తముడు ఇతరుల అభ్యుదయానికి సంతోషిస్తే మధ్యముడు దాన్ని మనసులోనే అణుచుకొంటాడు. అధముడు దానికి క్షోభించి క్రోధాన్ని వెలికి గ్రక్కుతాడు. ఆనాడా సభలో శిశుపాలుని కాఱుకూతలకు శ్రీకృష్ణుడొక్కమాటైనా మాఱుపలికేడా? సింహం మేఘ గర్జనలకు ప్రతిధ్వనిస్తుంది కాని నక్కల అఱుపులకు కాదు కదా! నిందలు రేపినంత మాత్రాన గొప్పవాని గొప్పతనానికి లోటేమీ ఉండదు. ధూళి క్రమ్ముకొన్నంత మాత్రాన అనర్ఘరత్నం విలువ తఱిగిపోదు కదా! ప్రపంచం సత్పురుషుని కొనియాడుతుంది. ఆత్మస్తుతి కెప్పుడూ అతడు పాల్పడడు. దుర్జనుని కీర్తించే వారెవరూ ఉండరు కనుక వాడే తనను తాను పొగుడుకొంటూ ఉం టాడు. శిశుపాలుడు శ్రీకృష్ణునితో ని జేంగా సంధిని కోరేవాడైతే సేనల్ని ఎందుకు సన్నద్ధం చేస్తాడో నువ్వే చెప్పు. ధూర్తుడైన శిశుపాలుడు ఇంతకు ముందే శ్రీకృష్ణుని ఎంతగానో నిందించి నేటితో నీ మాటలతో వంద తప్పుల్ని



పూర్తిచేసి లెక్క చెప్పేడు. తలుపులు, ద్వార బంధాలూ లేని కోట గుమ్మం వంటి నీ నోటిని విప్పి చెప్పరాని మాటలెన్నో చెప్పేవు. ఇంకా ఎక్కువ మాట్లాడితే ఎంతగానో ఆపుకొన్న మా కోపానికి పాత్ర మౌతావు" సాత్యకి చెప్పిన మాటల్ని విన్న దూత ఏమాత్రం భయంలేకుండా ఇలా అన్నాడు.

"మూర్ఖులితరులెంత చెప్పినా తమకు హితమైనదేదో తెలిసికోలేరు. ఈ భూమిపై ఇంత కంటె విచిత్రం ఇంకేమైనా ఉందా? బుద్ధిశాలి రాబోయే ఉపద్రవాలు తనకుతానుగా కాని ఇతరులు చెబితే కాని తెలిసికొంటాడు. మూఢుడు ఆపదలు నెత్తిపైకి వచ్చినప్పుడు కాని తెలిసికోలేడు – కృష్ణా! నేచెప్పేదంతా నీ హితాన్ని కోరే. పండితులు ఆపదలనొందబోయే శత్రువులకైనా హితాన్నే ఉపదేశిస్తారు కదా! మంచి చెడ్డలు తెలియని మత్తుడు యథేచ్ఛగా సంచరించినట్లు ధర్మజుడు ప్రభువులను విడిచి గొల్లవాడవైన నిన్ను పూజించాడు. మూర్ఖుల పనుల గూర్చి చెప్పేదేముంది? అంతమాత్రాన మా ప్రభువు శిశుపాలునికి కలిగిన అనర్థమేమీలేదు. ఏనుగు కుంభస్థలాన్ని చీల్చి దాని మాంసం భుజించిన సింహం మణిని విడిచి నంత మాత్రాన ఆ మణి విలువేమీ తగ్గిపోదు కదా! నువ్వు మా ప్రభువు చేసిన నూఱు తప్పుల్ని సహించావని సాత్యకి చెబుతున్నాడు. తనకిచ్చి వివాహం చేయటానికి నిర్ణయించిన రుక్మిణిని నీవపహరించినప్పుడు మా ప్రభువు క్షమించిన సంగతి గుర్తులేదా? నీకు ముద్దుల మఱది, పైగా క్షితీశు డైన వానికి భార్యగా ఆ ముదిత నివ్వటానికి పెద్దలు నిశ్చయిస్తే ఆమెను దొంగిలించి తెచ్చిన నీ పనికి సుద్దీ, బద్దం ఉందా? నీపట్ల ధర్మార్థాలు నశించి కాముని తండ్రిగా అన్వర్థనామధేయుడవైనావు. ఈ చర్యతో నువ్వు బంధుద్రోహివీ, రాజద్రోహివీ అయినావు. నీ పట్ల పట్టరాని కోపంతో ఉన్న శిశుపాలుని కోపాన్ని నే నెలా ఉపశమింప చేయగలను? ప్రళయ కాలంలో ఉప్పొంగుతున్న సముద్రాన్ని ఆపటం ఎవరి తరం? అయితే నువ్వెందుకు వచ్చావంటావేమో? నిజేం చెప్పనా? యాదవుల నందఱినీ యుద్ధ సన్నద్ధులై రమ్మని చెప్పిరమ్మని శిశుపాలుడు నన్ను పంపేడు. పౌరుషశాలులు

శత్రువునైనా దొంగ దెబ్బ తీయరుకదా! ఆ బలశాలి మహోన్నత నగంనుండి ఉఱికి పడుతున్న భయంకర జలపాతంలా నీ మీద పడనున్నాడు కనుక నీవతనికి నమ్రుడవు కావటం శ్రేయస్కరం. శిశుపాలుడంటే శిశువుల్ని రక్షించేవాడే కదా అని భావించేకు. శరణాగతులైన పడుచువారైన శత్రువుల్ని సైతం అతడు దయతో క్షమిస్తాడు. నేను చెప్పేది నీ చెవులకు రుచింపక పోయినా నీకు హితాన్ని చేకూర్చేది కనుక సంధిచేసికో. లేకపోతే నీకు వినాశం తప్పదు సుమా! ఎంతోమంది రాక్షసులను చేంపిన నన్ను శిశుపాలుడేం చేయగలడనుకోకు. చీకట్లను పాఱద్రోలే చంద్రునికూడ రాహువు మ్రింగుతున్నాడు కదా! యుద్ధంలో శిశుపాలుని ముఖం చూడటంతోనే శత్రురాజులు దద్దరిల్లిపోయి భయోత్పాతంతో మేకలవలె పాఱిపోతారు". ఈ విధంగా ఆ దూత అనేక ఉపమానాలతో శిశుపాలుని కీర్తిని విస్తారంగా వర్ణించాడు. "మహనీయుడైన మా శిశుపాల మహీపతి మహాబలుడై నీపై దండెత్తి యుద్ధ భూమిలో నిన్నొకక్షణంలో వధిస్తాడు. నీ చావుతో నీ రాణులు దుఃఖితులు కాగా, నీ పుత్ర సమూహాన్ని ఓదార్చి శిశుపాలుడు సార్థక నామధేయుడౌతాడ"నే దూతమాటలతో పదునాఱవ సర్గ పరిపూర్తి నొందుతుంది.

ఆ శిశుపాలుని దూత ప్రళయకాల ఝంఝానిలం వంటి ధాటితో వాక్చాతుర్యం ఉట్టిపడేట్లు పలికిన ఆ పలుకులకు శ్రీ కృష్ణుని సభాంగణం విలయకాలం నాడుద్భవించే సముద్రపుటలల ఘుంఘుంమోజ్జ్వలమై దిశావలయం కంపించినట్లు సంక్షోభం చెందింది. రూపు దాల్చిన క్రోధాధి దేవతవలె ఉన్న ఆ సభలో గదుడనే గోవిందుని సోదరుడు మితిమీఱిన కోపంతో చేత్తో జెబ్బ చేఱచటంతో బాహుపురులు కదలి దానిలో ఉన్న ఎఱ్ఱని రత్నాలు జాఱి రోషాగ్ని చ్ఛటలవలె చిందరవందరై నేలపై పడ్డాయట! గుండెల్లో అగ్ని జ్వాలలా రగుల్తూ ఉంటే బలరాముడు "ఔరా!" అని నవ్విన నవ్వుకాతని దంతాల తెలుపు వర్ణం అతని శరీరపు ఎఱ్ఱని కాంతిని మఱుగుపఱచి అంతటా వ్యాపించిందట! క్రోధావేశపూరితుడైన



యుధాజిత్తుకు పట్టిన చెమట ఉత్తరీయంతో ఎంత విసరుకొన్నా తగ్గటం మాని ఎక్కువైనదట! శత్రు సంహార సిద్ధమైన నిషధేశ్వరుని రోషం దక్షాధ్వర ధ్వంసం నాడు జనించిన రుద్రజ్వరంగా సభాసదులు భావించారు. సుధన్వుడు క్రోధావేశంతో తన కరద్వయాన్ని నలిపితే అతని వ్రేళ్లకున్న ఉంగరాలు, మణులు పొడిపొడి కావటంతో ఏర్పడిన దుమ్మును తన స్వేదోదకంతో ప్రక్షాళన చేసికొన్నాడట! పదునైన బాణాల్ని చేపట్టిన ప్రద్యుమ్నుని రూపు పూర్వం మన్మథుని దగ్ధం కావించినప్పటి త్రినేత్రుని తృతీయ నేత్రంలా భాసించింది. యుద్ధం ఎప్పుడు వస్తుందని ఉవ్విళ్ళూరే పృథుభూపతి ఎదలో గగుఱుపాటు రేకొంది. చేదిపతి దూత పలికిన నీచమైన మాటలు విని శాంతమూర్తిగా పేరెన్నికగన్న అక్రూరుడు కూడ క్రోధావిష్టుడైనాడు. ప్రసేనజిత్తు గైరికారుణ గజంవలె శోభించాడు. గవేషణుడనే ప్రభువుకు కూడ స్వేదాంబువులు ముఖం నిండా ఉద్భవించాయి. శిని కోపంతో భూమిని అఱికాలుతో తన్నగా భూమి బీటలు వారి లోపలనుండే ప్రాణులు పూర్వమెప్పుడూ కనీవిని ఎఱుగని బాధకులోనైనాయి. శారణనరేంద్రుడు రోషంతో తల పలుమార్లు త్రిప్పగా తన్మకుటస్థకిరీట రత్నదీధితులు యుద్ధానికి బయలుదేరే నృపులకు నీరాజనంలా భాసించాయి. వర్ష ధారలు నదులను కలచినట్లు సాగరాన్ని కలుషితం చేయని విధంగా దూత పలికిన దుష్టవచనాలు సభలోని రాజుల్ని క్షుభిత మొనర్చినా శ్రీహరి నిశ్చలంగానే ఉండిపోయాడు. ఆత్మస్తుతి, పరనిందా పరాయణత్వం ఖలుని నైజమని హరి ఆశ్చర్యపడక స్థిరంగా ఉండటంతో ఉద్ధవుని ముఖంలో మందహాసం వెల్లివిరిసింది. క్రోధావిష్టులైన యాదవుల ధిక్కారాన్ని చూసి పగతుని దూత నిష్క్రమించేటంతో పద్మనాభుడు పరభయంకరమైన పటహాన్ని మ్రోయించి, యుద్ధ సన్నాహ తత్పరుడైనాడు. రాజపుంగవులు రథగజతురగాలను ఆయత్తం చేయండని అధికారులనాదేశించారు. శ్రీధరుడు రథాన్నధిరోహించేటంతో అపార సేనావాహిని కదిలింది. భూమ్యాకాశాలను ముంచివేసినట్లున్న ఆ సేనను

చూసిన వారికి ప్రళయకాలంలో చెలియలికట్టల్ని త్రెంచుకొని ఉప్పొంగే ఉదధి ఎలా ఉంటుందో చూడనవసరం లేదనిపించింది. గజరాజు ఫీంకరించాడు. ఉత్తమాశ్వం హేష కావించింది. రథోత్తంసం తన మంద్రగమనంతో మనోహరమైన మృదంగ నాదం ప్రవర్తింపచేసింది. ఆ ధ్వని పర్వతగుహల్లో ప్రతిధ్వనించింది. శ్రీకృష్ణుని జైత్రయాత్ర తూర్యారావాలు విన్న అచ్చేరలు మేలైన వస్త్రాలు ధరించి వీరుల రాకకై నిరీక్షిస్తున్నారట! ఈ అపూర్వవీరులు ప్రదర్శించబోయే పరాక్రమాన్ని దర్శించాలనే కుతూహలంతో ఎలాగూ ఱెప్పపాటులేనివారే కనుక దేవతలాకాశంలో బారులుతీరి చూడసాగేరు! అతిశయించిన అతిశయోక్త్యలంకారాలతో శ్రీకృష్ణ సేనాప్రస్థానాన్ని పదునేడవ సర్గ ప్రస్తుతిస్తుంది.

అష్టాదశసర్గలో ఇరుసైన్యాల కూడలి, తుముల యుద్ధం తీరు, కరిపోరు, తత్ఫలితంగా ఉత్పన్నమైన బీభత్స సన్నివేశం వర్ణితాలైనాయి. అలనాడు దేవేంద్రుడు వజ్రాయుధంతో పర్వతాల ఱెక్కల్ని తెగ నఱికినపుడు అతని బారిన పడక నిలిచి ఉన్న వింధ్య సహ్యాద్రుల వలె రాబోయే అపాయాన్ని సరుకుచేయక నిలిచి ఉన్న శ్రీకృష్ణ శిశుపాల సేనా సముద్రాల యుద్ధ ఘోష చెలరేగింది. పదాతులు పదాతులతో, ఏనుగు లేనుగులతోనూ, గుఱ్ఱాలు గుఱ్ఱాలతోను, రథాలు రథాలతోనూ తల పడ్డాయి. రథనిస్వనం, కరుల ఫీంకారం, అశ్వహేషలకు దుందుభి నాదం శ్రుతి కలుపగా ఆకాశమంతటా అలముకొంది. మాత్సర్యంతో ఒక పదాతి మఱొక పదాతిపై తన దీర్ఘబాహువు నెత్తి ఖడ్గంతో వేయగా ఆ ఖడ్గకాంతులు వైజయంతీ శోభను తలపించాయి. అశ్వదళం వేగంగా చిత్ర విచిత్ర గతులతో చేసే నడకలెంతో మనోహరంగా భాసించాయి. నలుబదేండ్ల ప్రాయంకల మదగజాలు వాటి వయసుకు తగిన తేజస్సుతో ప్రళయకాలోద్భూతమైన వాయువుకు ఎగిరిపడే మహాపర్వత శిలలుగా చెన్ను మీఱేయి. వేగంగా పరువెత్తే రథాలు చేసే శబ్దాలు రౌతుల హెచ్చరికలతో మఱింత హృద్యంగా సాగేయి.



రథ గజతురగాధిరూఢులైన వీరుల హెచ్చరికలతో యుద్ధభూమి నిండిపోయింది. పదాతులు తాము పూర్వం నేర్చిన విద్యా పాటవాన్ని యుద్ధభూమిపై వెలయించారు. కొంతసేపటికి చేత ధరించిన ఖడ్గాలు మొద్దుబారిపోతే వాటిని విడిచి ముష్టి యుద్ధానికి కొందఱు పాల్పడ్డారు. ఆహవంలో వెన్ను చూపమని ప్రతిజ్ఞ పట్టిన వీరులంతా వివిధాయుధాలతో శత్రువులను చికాకు పఱుస్తూ వీరవిహారం కావించారు. క్రోధోద్రేకంతో కన్నుకానక తనవాడెవడో పరుడెవడో తెలియక మహావేశంతో ఇరుపక్షాలూ పోరదొడగేయి. తత్ఫలితంగా శత్రువునైనా విడిచి పెట్టి స్వీయపక్షంవాణ్ణి కూడా వధకు గుఱిచేసిన సన్నివేశాలూ లేకపోలేదు. ఒక ఆశ్వికుడు కుంతంతో ఏనుగును పొడువబోగా అతడెక్కిన అశ్వం గజానికి భయపడక స్థిరంగా ఉండి తన స్వామిని పడత్రోయక నిలిచింది. ఉత్తములు మహా కార్యనిర్వహణాదక్షులైన యజమానులను సిగ్గుపడేట్లు చేయరు కదా! యోధవరు లేనుగులెక్కి వింటిని ధరించి శరజాలాన్ని కురిపిస్తూ పర్వతాలపై ఉన్న దుర్గాల్ని ఆక్రమిస్తూ శత్రువులేమాత్రం జయించేని రీతిలో వారి పౌరుషాగ్నికి మేఘీకృతులైనారు. ఒక కరి మావటివాడెంత నిలిపినా నిలువక శత్రుపక్షంలో ఉన్న ఇరువదేండ్ల ఏనుగు గున్నను తన కుమారుడన్నైనా ఎంచేక ఢీకొంది. ఆ గున్న ఏనుగు ఆర్తారావం దిక్కుల్ని వ్యాపించింది. ఆ ఏనుగుల పోరును దేవతలే ఆశ్చర్య చకితులై చూచారట! ఒక యోధుడు తన మత్తేభం నేలకొఱిగినా వెనుకాడక ముజ్జగాలు మెచ్చుకొనేట్లు బాణ ప్రతతితో శాత్రవ మదేభాన్నఱికట్టేడు. కత్తి వ్రేటులకు మదగజాల కుంభస్థలాల నుంచి జాఱిన ముత్యాలు వెన్నెల ముద్దలవలె భాసించాయి. ఒక సామజం ఒక వీరుని తన తొండంతో ఎత్తి పైకెగురవేస్తే అప్సరసలు తమకు తగిన వాడు వచ్చాడని ఆనందించారట! యుద్ధభూమిలో మరణించిన యోధుని దివిలో అప్సరసలు నూత్న యౌవనంతో గౌరవిస్తూ ఉంటే భువిలో సైతం 'కీర్తి' అనే కామిని కూడ నిత్యం సేవిస్తూ ఉందట! మహోగ్ర సమరంలో మూర్ఛనొందిన మహావీరుడు తెప్పఱిల్లిన తరువాత

మిత్రుడు వారించినా వినక తిరిగి యుద్ధభూమికి వెళ్లి ప్రాణాలు పోగొట్టు కొంటున్నాడంటే స్వర్గంలో అప్సరసల పొందులో కలుగబోయే మహాసుఖాన్ని పొందాలనే ఆశ కాక మతేముంటుంది? విరోధి దూరం నుంచి విడిచిన బాణాఘాతంతో ప్రక్కప్రక్కనే ఉన్న ఇద్దఱు వీరులు ఒక్కసారే ప్రాణాలు విడిచి మృత్యువులో కూడ స్నేహబంధాన్ని వీడని వారైనారు.

రణరంగంలో విఱిగిపడి పూర్ణచంద్రశోభతో ఒప్పారే రాజుల శ్వేతచ్ఛత్రాలు యమధర్మరాజు వారి భోజనాలకై పఱచిన వెండిపళ్లేలో అన్నట్లున్నాయట! ఆ నాడెప్పుడో పరశురాముడు ఎంతోకాలం శ్రమించి ఇరువది యొక్క మాఱులు రాజులందఱినీ వధించి శమంతపంచకమనే ఐదు రక్తపుమడుగుల నేర్పఱిస్తే నేడిక్కడ క్షణకాలంలోనే రక్తపువాగులెన్నో జనించాయి. సైనికుల శరీరంలోని అంగాలు చెల్లా చెదరై యుద్ధభూమిపై గుట్టలు గుట్టలుగా పడిపోవటంతో బ్రహ్మ పునస్సృష్టికై ఏర్పఱచుకొన్న జీవుల వివిధ అవయవాలు పేర్చిన ఇంటిలా ఉందట! తలపడిన రెండుసేనల్లో జయాపజయాలెవరివో నిశ్చయించలేని రీతిలో యుద్ధభూమి బీభత్సంగా ఉందని చెప్పటంతో పదునెనిమిదవ సర్గ సమాప్తి నొందుతుంది.

ఏకోనవింశతి సర్గలో ఇరుసేనల యుద్ధవర్ణన, చిత్రయుద్ధ వైఖరి, యాదవసేవల విజృంభణ, శ్రీకృష్ణుడు శత్రుసేనలను తునుమాడిన విధం వర్ణితమైంది. ఇందులో మాఘ మహాకవి చిత్ర కవితా ప్రతిభ అబ్బుర పఱుస్తుంది. "యుద్ధమనే అడవిలో శత్రువులనే వెదురుకొమ్మల పాలిటి దావాగ్నిలా బాణునికుమారుడు వేణుదారి ప్రవేశించాడు. ఏనుగుపైకి లంఘించే సింహంలా వానిని బలభద్రుడెదిరించాడు". ఈ భావాన్ని చెప్పటంలో మాఘకవి కూర్చిన ఏకాక్షర పాదశ్లోకం ఆకర్షణీయమైంది.

**జజౌజోజాజిజిజ్జాజీ**
**తంతతోఽతి తతాతితుత్।**
**భాభోఽభీభాభిభూభాభూ**
**రారారిరరీ రరః ॥**



ఇటువంటి శ్లోకాలు 'చిత్రకవిత' లుగా ప్రసిద్ధం. అర్థగాంభీర్యం అట్టే లేకున్నా పదవిభాగంలో అర్థవంతాలై కుతూహలాన్ని రేకెత్తిస్తాయి. యుద్ధాన్ని పండువుగా తలచి అనేక యుద్ధాల్లో విజయాన్ని చేకొన్న ఆ వేణుదారి బలరాముని తీవ్ర శరాలతో బాధించాడు. బలరాముడు తన అమోఘ బాణాలతో దారకుని మూర్ఛితుని కావించి సింహనాదం చేసేడు. దారకుని సారథి అతణ్ణి మఱొక ప్రదేశానికి కొనిపోయాడు. మహాపరాక్రమశాలి, సాత్యకి పితామహుడైన 'శిని' సేన శిశుపాలపక్ష సాల్వభూపతి సేనను సమూలంగా ఉన్మూలించింది.

శ్రీకృష్ణ పక్షంలోని ఉల్ముఖుడనే రాజు భయంకరంగా చెలరేగి శిశు పాలపక్షంలోని మహావృక్షాలవంటి వీరులను దహించి బుగ్గి కావించాడు. రుక్మిణి సోదరుడైన రుక్మి పృథు మహారాజునాక్షేపిస్తూ అతనిపై విజృంభించి, అతని ధాటికాగలేక తాను యుద్ధ భూమి నుంచి తొలగిపోతున్నాని, క్షమింపుమనీ వేడుకొన్నాడు. నదులెన్నో ఒక్కసారిగా వేగంతో సముద్రుని పైకి వచ్చినా వాటినన్నిటినీ భరించినట్లు ఎందఱో రాజులు ఒక్కపెట్టున తనమీదికెత్తివచ్చినా శ్రీకృష్ణ సూనుడు ప్రద్యుమ్నుడు వారి నందఱినీ సామర్థ్యంతో నిలువరించాడు. రాజులంతా ఆ ప్రద్యుమ్నుని అసహాయ శూరతకు భీతులై శత్రువులపట్ల కాలాంతకుడైన బాణాసురుని నాయకుణ్ణిగా చేసికొని ప్రద్యుమ్నునిపై చెలరేగేరు. ప్రద్యుమ్నుడు బాణాలతో పాటు బాణాసురుని కూడ సంహరించి నిలిచాడు. ఆ తరువాత ప్రద్యుమ్నుడు ఉత్తమౌజసుని ఎదిర్చి నిలిచి వానిని నిరర్థక నామధేయునిగా చేసేడు. గర్వించిన శూరులెందఱో ఆ పిన్నవాని శరధాటికాగలేక పలాయన మంత్రం పఠించారు. ఆనాటి యుద్ధంలో చిన్న వాడైన ప్రద్యుమ్నుని పరాక్రమాతిశయాన్ని దేవతలు సైతం మెచ్చి పుష్పవర్షాన్ని కురిపించారు. అతని ప్రతాపం మునుపెన్నడూ కనీ వినీ ఎఱుగనిదని వీరులంతా నిశ్చేష్టితులైనారు. అది చూచి శిశుపాలుడు క్రుద్ధుడై చతుర్విధ బలాలతో ప్రద్యుమ్నునిపై చెలరేగేడు. ధనుష్టంకారాలే తూర్యరావాలుగా శోభిల్లిన ఆ

యుద్ధభూమి ప్రళయకాల ఘూర్ణితంతో పోల్చదగిందై భయానకమైంది. ధనువును విడువటం కంటే తనువును వీడటమే మేలనే పట్టుదలతో కొందఱు, కొండల్ని పిండి కొడతామనే ఉద్రేకంతో మఱికొందఱు, కృతనిశ్చయులై పోరాడసాగేరు. ఈ సందర్భంలో వీరరసానికనువైన సర్వతోభద్ర, మురజబంధ విశేషాలతో మహాకవి మాఘుని రచన సాగుతుంది. పర్వతాలవంటి మదేభాలు వేగంగా సాగుతూ చేస్తున్న ధ్వని, పదాతుల సింహనాదాలతో మూర్తీభవించిన రౌద్రరసమో అన్నట్లు ఆ సమరభూమి సముజ్జ్వలమై ఒప్పింది.

యుద్ధం ఎప్పుడెప్పుడా, తమ ప్రతాపాన్ని ఎప్పుడు చూపగలుగుతామా అని ఆవురావురంటున్న యాదవ వీరులు అత్యున్నతోత్సాహులై అరిబలంపై విజృంభించి పోరాడసాగేరు. పర్వతోపమమైన గజబలంతో "నువ్వుండు, వీనిపని నేను పడతా"నంటూ సైనికులు కలకలం చేస్తూ శిశుపాలుని సేనను కలవర పఱచేసాగేరు. ఆ సన్నివేశవర్ణనను చేసే కవిశ్లోకం స్పృహణీయమైంది. ఇందులో విశేష మేమంటే శ్లోకం మొదటి పాదంలోని అక్షరాలను కుడినుండి ఎడమకు వ్రాయగా రెండవపాదం, అదే విధంగా మూడవ పాదం వ్యత్యస్తమై నాల్గవ పాదం రూపొందేయి. ఇలా తలక్రిందుగా చేసినా అర్థం సమకూరే సొగసు ప్రపంచభాషల్లో ఒక్క సంస్కృతానికే ఉంది.

**"వారణాగ గభీరాసా**
**సారాఽభీగ గణారవా।**
**కారితారి వధాసేనా**
**నా సేధా వరితారికా॥ " (19-44)**

మండల ప్రచారాలతో అరిమండలాన్ని ఖండిస్తూ భండనంలో ఉద్దండంగా పోరే భటుని కీర్తి భూమండలంలో ప్రచండంగా భాసించింది. శస్త్రాస్త్ర ప్రతతిచే క్షతగాత్రుడైన ఒక వీరుడు సర్వాలంకార భూషితుడై



యుద్ధానికై వెడలిన ఆనాటి రావణాసురుని స్మరింప చేసేడట! శత్రు వధకుద్యమించిన మఱొక జోదు తొడలు పోయి రక్తం ఓడుతూ ఉంటే "అనూరుడు", "అరుణుడ" అనే రెండునామాలకూ అర్హుడైనాడట! అనేకానేకపాలను వధిస్తున్న వాడి కరవాలాలు అన్ని వైపులా మెఱుస్తూ కదనం సాగుతూ ఉంటే ఏ ఒక్కడూ భీతి నొంది యుద్ధావని వీడలేదు. యుద్ధాత్పూర్వం నృపతి సత్కృతులైన యోధులు "ప్రభువు ఋణం తీర్చకుండా చేస్తామా?" అనే దీక్షతో మరణ పర్యంతం పోరు సలుపుతూ ఉంటే అసత్కృతులైన వారు తమను ప్రభువెందుకవజ్ఞ సల్పాలని క్రోధంతో యుద్ధంలో తమ ప్రాణాల్ని తృణప్రాయంగా వదలటానికి కృతనిశ్చయులైనారు. ఏనుగుల పోరును వర్ణించే సందర్భంలో కేవలం రెండక్షరాలతోనే శ్లోకాన్ని కూర్చిన ఈ శ్లోకం మాఘుని పాండితీగరిమకు అద్దంపడుతోంది.

***భూరి భిర్భారిభిర్భీరై***
***ర్భూభారైరభిరేభిరే।***
***భేరీరేభిభిరభ్రాభై***
***రభీరుభిరిభైరిభాః॥ (19-66)***

ఈ శ్లోకం చేదువటం, లేదా వినటం తోటే అయోమయంగా తోస్తుంది. కానీ పదచ్ఛేదం చేసికొంటే ప్రసన్నత గోచరిస్తుంది.

ఇభాః =ఏనుగులు, భూరిభిః = అధికమైన, భారిభిః = పై పఱచిన వస్త్రములతోను, ధ్వజాది బరువులతో కూడినవై; భీరైః=భయంకరమైనవై; భూ భారైః=భువికి (మోయటానికి) (మహాకాయంతో మోయటానికి) బరువైనవై; భేరీరేభిభిః = భేరీ నాదంవలె ఘీంకరిస్తూ; అభ్రాభైః =మేఘాలవలె ప్రకాశిస్తూ (వర్షాకాలపుమేఘంవలె నల్లనైనవై) అభీరుభిః = ఏమాత్రం భయపడక; ఇభైః (ప్రతిపక్షంలో ఉన్న) =గజాలతో, అభిరేభిరే= తలపడ్డాయి. ఇరుపక్షాల్లో ఉన్న ఏనుగులొక దానితో ఒకటి తలపడ్డాయని ఈ శ్లోక

వాక్యార్థం. ఏనుగులు సహజంగానే మహాకాయం కలవి కనుక భూమికి భారమైనవి. దానికి తోడు ఏనుగులపై ఉండే అంబారి, ధ్వజాలతో మఱింత బరువు. వాటి ఘీంకారాలు భేరీనాదాలవలె ఎక్కువ శబ్దంతో కూడు కొన్నాయి. అవి వర్షోన్ముఖమేఘాల కాంతిని కలిగిఉన్నాయి. వర్షోన్ముఖ మేఘం నల్లగా ఉంటుంది. ఏనుగూ నలుపు వర్ణమే కదా! ఏనుగులకు రెండు ఉపమానాలు వేసేడు. (భేరి, మేఘం) భయంలేకుండా పైన చెప్పిన విశేషణాలు కల ప్రతిపక్ష గజాలతో పోరాడుతున్నాయి. మఱి అక్కడే ఉంటుంది కవి ప్రతిభ.

విజయమో వీరస్వర్గమో పొందాలంటూ ఉవ్విళ్ళూరే సైనికులకు నేలకొఱిగిన వెంటనే ద్వైవత్వం సిద్ధించింది. నిపతితులైన ప్రభువులు, మిత్రులు, మేనమామలు, సోదరులు, పినతండ్రులు కల ఆ రణరంగం నిపాత సూత్రాలతో ఉన్న పాణినీయం వలె ఉందని పోల్చటంతో కవి వ్యాకరణ ప్రీతివ్యక్తమౌతోంది. (19-75) పైగా శ్లోకంలో కవిప్రయోగించిన సుహృత్, స్వామి, పితృవ్య, భ్రాతృమాతుల శబ్దాలు పాణిని నిపతించినవి కానటం మాఘుని వ్యాకరణశాస్త్ర పటిమకు ప్రతిబింబమై భాసిస్తోంది. అలాగే శ్లోకపూర్వార్థాన్ని కుడి నుండి ఎడమకు చదివితే ద్వితీయార్థ మౌతుంది.

*"తం శ్రియా ఘన యాఽనస్తరుచా సారతయా తయా*
*యాతయాతరసా చారుస్తనయాఽనఘయా శ్రితమ్॥ (19-88)*

పై శ్లోకంలోని మొదటి పాదానికిలా అన్వయం చెప్పికోవాలి : ఘనయా = హర్షపూర్ణమైన, అనస్తరుచా = క్షీణించని, కాంతితో, సారతయా = సాటిలేని గుణగణంతో, తయా = వ్యాప్తినొంది, అనీ, రెండవ పాదానికి అన్వయం - చారుస్తనయా - సుందరమైన వక్షోజాలతో, అనఘయా = పాపరహితురాలైన, తయా = ప్రసిద్ధినొందిన, శ్రియా = లక్ష్మీదేవిచే, తరసా = కుతూహలంతో, శ్రితమ్ = కౌగిలించుకొనబడిన,



(హరిని చూచెనని పై పద్యంతో అన్వయం) ఇలా పదచ్ఛేద భేదంతో ఒకే పంక్తిని వ్యత్యస్తం చేసి అర్థాన్ని ప్రసన్నం చేయటం మహాకవికే చెల్లుతుంది. శ్రీహరి దర్శనం శత్రువులకు అనిష్టదాయకమే అయినా రోగికి ఔషధం వలె (స్వర్గాన్ని చేకూర్చి) హితకారే అయింది.

పూర్వం మత్స్యాది అవతారాలనెత్తి దుష్టరాక్షసుల సంహరించి వేదమార్గానుయాయులైన వారిపాలిట కల్పవృక్షమై ఈప్సితార్థాల్ని ప్రసాదించి ప్రసిద్ధుడు, అనఘుడూ అయిన ఆ లక్ష్మీపతిని శత్రువులు బాణాలతో కప్పివేసేరు. దిగంతవ్యాప్తమై మర్మచ్ఛేదకాలై భయంకర ధ్వనితో కూడిన అతి తీక్ష్ణబాణాల్ని ప్రయోగించి శ్రీహరి క్షణకాలంలో శత్రువుల్ని నిలువరించాడు. నీలమేఘశ్యాముడైన కృష్ణుడు వర్షధారాపాతాన్ని శత్రువులపై కురిపించాడు. కృష్ణధనుర్విముక్తాలైన బాణాలు శత్రుజాలాన్ని మథించే సాగేయి. ఔద్ధత్యంతో శత్రురక్తాన్ని త్రాగి భువనాలను రక్షిస్తూ 'పా' ధాతువుకున్న రెండర్థాల్నీ ఆ బాణాలు సార్థకం చేసేయట! ("పా పానే, "పారక్షణే" అని 'పా'ధాతువుకు రెండర్థాలు) దుష్ట శిక్షణకు, శిష్టరక్షణకు అవతరించిన హరి భూభారాన్ని తొలగించేటానికి శత్రుసమూహాలను వధించి ప్రకాశించాడు. పూర్వం రామావతారంలో ఒక బాణంతో సప్తతాళద్రుమాల్ని భంజించాడు కాని నేడీ కృష్ణావతారంలో ఒక్కబాణంతోనే శత్రు సహస్రాన్నే ఖండించేసాగేడు. రక్తసిక్తం కావటం వల్ల బాణాలపై చెక్కిన శ్రీకృష్ణ నామాక్షరాల కెక్కడ పాపం వస్తుందోనని ఆ బాణాలు శత్రువుల రక్తం చిందకుండా ప్రాణాల్ని మాత్రమే హరించాయట!

ఇదిలా ఉండగా భారవి కిరాతార్జునీయంలో ఏకాక్షరంతోనే శ్లోకాన్ని అల్లినట్లు మాఘుడు సైతం ఒకే అక్షరంతో శ్లోకాన్ని కూర్చాడు.

**"దాదదో దుద్దదుద్దాదీ**
**దాదాదో దూదదీ దదోః।**

**దుద్దాదం దదదే దుద్దే**

**దదాదద దదో దదః ॥" (19-114)**

అర్థులకు, దానాలిచ్చేవాడు, దుష్టులకు పరితాపాన్ని కలిగించి పరిశుద్ధుల్ని చేసేవాడు శ్రీహరి. దానం ఇవ్వటం, ఇవ్వకపోవటం రెండూ చేసేవాడు అయిన శ్రీకృష్ణభగవానుడు (శత్రువులకు) దుఃఖదాయి అయిన బాణాల్ని ఇచ్చాడని దీనికి అర్థం. శత్రువులకు శ్రీకృష్ణుడొక్కడుగానే తోచి, క్రమంగా ఇద్దఱిగా, ముగ్గుఱిగా భాసించి తరువాత నలుగురిగా కన్పట్టి చివరకు వారికి పంచత్వాన్ని ప్రాప్తింపచేసేడు. ఈ విధంగా శ్రీకృష్ణ భగవానుడు శత్రుజాలాన్ని శిథిలీకృతం చేస్తూ కావించిన సింహనాదం వైరుల కసహ్యమై ఆకాశాన్నంతా బాణప్రతతితో నింపివేయటంతో పందొమ్మిదవ సర్గ పరిసమాప్తి నొందుతుంది. మహాకవి మాఘుడు పలు చిత్రకవితలతో ఈ సర్గను నింపేడు. మచ్చుకు కొన్నిటిని మాత్రమే ఉదాహరించేటం జేరిగింది.

ఇక చివరి ఇరువదవ సర్గలో శిశుపాలుడు శ్రీకృష్ణుని యుద్ధానికై పిలువటం, కృష్ణశిశుపాలుర యుద్ధం, శిశుపాలుడు కృష్ణునిపై ప్రయోగించిన మహాస్త్రాల నాయన వమ్ము చేయటం, సుదర్శన చక్రంతో శిశుపాలుడు హతుడు కాగా అతని తేజం శ్రీ కృష్ణునిలో లీనం కావటం వర్ణితాలు.

పాలభాగం పై మూడు రేఖలు ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంటే క్రోధంతో భ్రుకుటిని ముడిచి నిర్భయుడై చేదిపతి శ్రీకృష్ణుని యుద్ధానికై ఆహ్వానించాడు. మృత్యువు నెత్తినెక్కి తాండవిస్తూ ఉంటే సుదర్శన చక్ర హతిని నిరీక్షిస్తున్నవానిలా రథాధిరూఢుడై శ్రీకృష్ణుని సమీపించాడు. క్రోధోద్దీపుడైన అ చైద్యుడు ప్రళయకాలఝంఝామారుతం వంటి శబ్దంతో మహాగ్నికీలలను కురిపిస్తున్న బాణాన్ని శ్రీకృష్ణునిపై పఱగించాడు. అమ్ములపొదిలో నుండి బాణాన్ని తీయటం, ధనుస్సులో సంధించేటం, విడువటం తెలియరానంత వేగంతో కృష్ణుని సేనాసమేతంగా నిశిత



బాణవర్షంతో ముంచెత్తేడు. తనపైకి వస్తున్న యాదవ ప్రకరమనే పక్షి వితతిని బాణపంజరంలో బంధించాడు. శ్రీహరి క్షణంలో శిశుపాలు నాటోపాన్ని తన బాణపు జేల్లులతో అరికట్టేడు. శ్రీకృష్ణుడనే మేఘం కురిపించిన వింతైన బాణవర్షం శాత్రవకోటిని ముంచివేసింది. ఉభయుల బాణాలు పరస్పరం తాకి విస్ఫులింగాలను రేపేయి. శిశుపాలుడు విడిచిన శరాలు అంతకు ముందతడు యుధిష్ఠిరుని సభలో పలికిన నిష్ఠురోక్తులవలెనే శ్రీహరి నేమీ చేయలేక పోయాయి. కృష్ణవిజిగీషువైన శిశుపాలుడప్పుడు సాహసించి స్వాపనాస్త్రాన్ని అభిమంత్రించి విడువటంతో చీకట్లు ముమ్మరమై ముజ్జగాల్నీ వ్యాపించాయి. యాదవేంద్రులు కొందఱు ధనుస్సులను చేత ధరించే నిద్రాముద్రితులైనారు. మఱికొందఱి చేతుల నుండి ధనుస్సులు జాఱిపోయాయి. ఇలా చీకట్లు బీభత్సంగా వ్యాపించేటంతో శ్రీకృష్ణుని దృష్టి తన ఉరస్థకౌస్తుభంపై ప్రసరించింది. శ్రీకృష్ణ భగవానునికి సూర్యచంద్రులు నేత్రాలు కావటంవలన అద్దం మీద సూర్యరశ్మి ప్రతిఫలిస్తే కలిగే వెలుగులా త్రివిక్రముడు తేజరిల్లేడు. ఆ తేజః ప్రసారానికి సమస్తసేన నిద్రను వీడి ఉజ్జీవితమైంది. మేఘపటలి వీడిన తరువాత సూర్యుని ప్రకాశం వలె యాదవయోధులు గాఢాంధకారవిముక్తులై శిశుపాలుని సేనలపై విఱుచుకు పడ్డారు. న్యాయవిచారణలో మిథ్యాభియోగం వీగిపోయినట్లే కౌస్తుభమణికాంతుల్తో తిమిరం నిరస్తం కాగా శిశుపాలు డాగ్రహోదగ్రుడై భయంకరమైన నాగాస్త్రాన్ని ప్రయోగించాడు. విషాన్ని రెండు నాల్కలతో చిందిస్తూ ఫణాగ్రాలతో ఫణి సమూహం ఉద్భవించి పూర్వం నాగులతోక లలుముకొన్న ఉచ్చైశ్శ్రవంలా ఆ అస్త్రం ప్రతిభాసించింది. పాముల సమూహం యాదవవీరులను ఆపాదమస్తకం చుట్టుకొని బాధించేసాగింది. మదేభాలను సైతం పెనవేసికొని అవి కదలకుండ వాటికి శృంఖాలాలైపోయాయి. మాధవుడు మందస్మితంతో ఒక కనుబొమ్మ నెత్తి ధ్వజంపై ఉన్న గరుడుని చూడటంతో క్షణకాలంలో వేలకొలది గరుడపక్షు లుద్భవించాయి. చెలియలికట్టను దాటే సముద్రపు హెూరును తలపింప

చేసే ఆ గరుడుల ఱెక్కల నుండి పుట్టిన వాయువులంతటా వ్యాపించాయి. సర్పాలన్నీ భయోత్పాతంతో పాతాళానికి పాఱిపోయాయి. క్షీణించేదనుకొన్న పాపం పుణ్యకార్య వితతిచే నశించినట్లు ఆ పాముల్ని గరుడపక్షులు పాఱద్రోలటంతో శిశుపాలుడవధిమీఱిన కోపంతో ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. అది ప్రజలకు భయోత్పాతాన్ని జనింపచేస్తూ పెనుబేతాళుడో అన్నట్లు నింగికెగసే జ్వాలలు ఘోరాట్టహాసాలతో అన్ని దిక్కులా ప్రజ్వరిల్లేయి. వీతిహోత్రుని విజృంభణాన్ని వీక్షించిన విరూపాక్షుడు తన్నివారకమైన వారుణాస్త్రాన్ని స్మరించాడు. వెంటనే ఆ కేశవుని కేశాలనే మేఘాలనుంచి సూర్యకాంతులను తిరస్కరించే జలం ఉద్భవించింది. దాంతో ఆ మహాగ్నులన్నీ ఉపశమించాయి. తీవ్రరోగంతో బాధపడేవాని సంధి ప్రేలాపనవలె శిశుపాలుడు తన బాణాలతోపాటు కృష్ణునిపై ఏంతో మండిపడితూ వాగ్బాణాలను సైతం వదలసాగేడు. రోగం కుదిర్చే వైద్యుని వలె కృష్ణుడు వాటిని ఎదుర్కొన్నాడు. శిశుపాలుని కర్మపరిపాక మొందటం ఎఱిగి శ్రీకృష్ణభగవానుడు తన సుదర్శన చక్రంతో అతని శిరస్సు ఖండించాడు.

శ్రీహరి మేనత్తకొడుకు శిశుపాలుని భౌతిక శరీరంలో నుంచి ఒక మహాతేజస్సు వెడలి అందఱూ మహాశ్చర్యంతో చూస్తూ ఉండగానే శ్రీకృష్ణునిలో లీనమైంది. ఋషుల సాధువాదాలు చెలరేగేయి. దేవదుందుభులు మ్రోగుతూ ఉంటే పుష్పవర్షం కురిసింది.